# ఆంజనేయుని ఆనతి

## (రెండవ భాగము)



# ఆంజనేయుని ఆనతి

(రెండవ భాగము)

# [Aanjaneyuni Aanathi (Part -II)]


ప్రధమ ముద్రణ: **నవంబర్, 2023**

కాపీ రైట్స్ : **రచయితవి.**

రచయిత అడ్రస్సు: *మాతా విశ్వాత్మానందగిరి*
*స్వామి సుజ్ఞానానందగిరి*
**శ్రీసత్యసాయి కుటీర్, కోవెలగుట్టపల్లి రోడ్డు**
**పుట్టపర్తి – 515134**


ఫోన్ : **80080 05854**

ప్రింటింగ్ : **విజయవాడ**



ఓం పవనపుత్రాయ విద్మహే పావన పుత్రాయ ధీమహి ।
తన్నో హనుమాన్ ప్రచోదయాత్ ॥

ఓం అంజనీ సుతాయ విద్మహే అఖండ చైతన్య స్వరూపాయ ధీమహి ।
తన్నో ఆంజనేయ ప్రచోదయాత్ ॥



తెలిపినవి తెలిపినట్లు, తెలిసినది తెలిసినటుల,

యోగ్యమైనది, భవ్యమైనది, భాగ్యమైనది,

భజరంగభళి అందించు అఖండమైన జ్ఞానప్రవాహంలో

అద్భుతమైన, అత్యద్భుతమైన, అసమాన ఆజ్ఞాపాలన

కర్తవ్యంగా భావించి భాసిల్లాలని అందిస్తున్న వైనాన్ని అందుకుని,

అడుగు అడుగు ఊర్ధ్వముఖంగా ఉన్నతులై,

ఉభయ జీవనయానాన్ని కొనసాగిస్తూ,

కొసరి కొసరి వడ్డిస్తున్న వీరాంజనేయుని వీరోపదేశాల్ని

వీనుల విందుగా విని తరించటానికి

తత్క్షణమే సమాయత్తమై ఉరకండి

నా చిన్నారిబిడ్డలారా!

# ఆంజనేయుని ఆనతి
## (రెండవ భాగము)

ఓం

**01-08-2018** 10:35 AM

**1) కర్మను ఆచరించునప్పుడు అహంకారమును ఏ విధంగా అణచివేయాలి స్వామీ?**

*మీ జీవితంలో ఏదైనా ఘనకార్యం జరిగినా, ఎప్పుడైనా పదిమంది చేతా ప్రశంసించబడే గొప్పపని ఏదైనా చేసినా ఇదంతా మీ గొప్పతనమేనని, మీరు గొప్ప శక్తియుక్తులు కలవారని గర్వించరాదు. ఇదంతా దైవలీలగా భావించాలి. ఎందుకంటే, లోకహితం కోసం ఏవైనా కార్యక్రమాలు చెయ్యాలని నిర్ణయించుకుని ప్రారంభించినప్పుడు, దైవకార్యక్రమాలను నిర్వహించేటప్పుడు మీరు చిత్తశుద్ధితో, నిస్వార్థంగా వాటికి దగ్గరవుతున్నకొద్దీ మీ నుండి ప్రసారం అవుతున్న శక్తి వృద్ధి అవుతుంది. మీరు ఎంతగా ఆ కార్యక్రమాలకు అంకితమైపోతారో, అంతగా శక్తి మీ నుండి వ్యక్తమవుతుంది. ఇక వాటి అవసరంగాని, వాటితో మీ అవసరంగాని పూర్తయిపోయిందా, అంతే. ఆ శక్తిప్రసారం కాకుండా ఆగిపోతుంది. మీరు రాత్రిపూట కిచెన్‌లో పని అయిపోగానే అక్కడి లైటు ఆర్పేస్తారు. హాల్ పని పూర్తికాగానే అక్కడి లైటు ఆర్పేస్తారు. బెడ్‌రూమ్‌లోకి వచ్చి అక్కడ లైట్ వేస్తారు. ఇక నిద్రపోదాం అనుకున్నపుడు, అదీ ఆర్పేస్తారు. అలాగే, ఎక్కడ పని పూర్తవుతుందో, అక్కడ ఆ శక్తి ఆగిపోతుంది. ఐతే, మీరు ఇంతగా శక్తిహీనులయ్యామే, అసమర్థులమయ్యామే, ఇంతకు ముందు ఇంత గొప్పగా గొప్పపనులు చేసిన మా పరిస్థితి ఇలా అయిపోయిందేమిటి? అని న్యూనత (ఇన్‌సల్ట్) చెందాల్సిన పనిలేదు. అలా న్యూనత చెందారంటే, అది అహంకారమే అవుతుంది. ఇంతకాలం నుండి గొప్ప శక్తిగలవాడినని న్యూనత చెందారంటే, అనుకున్నారంటే అహంకారభావం వున్నట్లే. కనుక, సమస్త శక్తియుక్తులు భగవంతుడివే, దైవానివే. మీరు కేవలం నిమిత్తమాత్రుడను, భగవంతుడి చేతిలో పనిముట్టును అని నిర్లిప్తంగా, కేవలంగా, అహంకారరహితంగా వుండిపోవాలి. విధి ఆడే వింత నాటకం ఎలా వుంటుందో, విధి ఎంత బలవత్తరమైనదో, ఈ సంఘటన ద్వారా మీరు గ్రహించవచ్చు. సాధారణంగా ప్రతి మానవుడు, సందర్భం వచ్చినప్పుడు ఇలా మాట్లాడుతూ వుంటాడు. ఎవరైనా తనకు పని చెప్పి, "ఎలా చేస్తావో , జాగ్రత్తగా చెయ్యి" అనటంతో "అలాగేలేవయ్యా! నీవు ఇంతగా చెప్పాలా? నా సర్వశక్తులూ ధారపోసి చేస్తాను. సరేనా?" అంటాడు. అంటే తనకేవో గొప్ప శక్తులున్నాయని, ఆ శక్తులన్నింటినీ ధారపోసి ఆ పని నెరవేరుస్తానని. కానీ నిజంగా మీలో శక్తులున్నాయా? లేవు. కానీ ఒక్కొక్క పని చేసేటప్పుడు చాలా గొప్పగా చేస్తారు కదా. నిజమే, మీరు చేస్తున్న పనిని బట్టి ఆ శక్తులు మీ నుండి వ్యక్తమవుతూంటాయి. ఏదైనా కార్యక్రమాన్ని తలపెట్టినపుడో,*

*పదిమందికీ ప్రయోజనం కలగాలని నిస్వార్థంగా కోరుకుని పనిని ప్రారంభించినపుడో ఆ పనులను నెరవేర్చటానికి కావలసిన శక్తియుక్తులు మీ నుండి వ్యక్తమవుతూంటాయి. ఆ పనులకు ఏ మేర శక్తి అవసరమో, ఆ మేరకు వ్యక్తమవుతూనే వుంటుంది. అంటే, మీలో శక్తి మిమ్మల్నిబట్టి గాక, మీరు చేసే పనినిబట్టి వ్యక్తమవుతుందన్నమాట. ఇది తెలియనప్పుడు, మీకే అలాంటి శక్తి వున్నదని భ్రమపడతారు. అందుకే, అప్పుడప్పుడూ అహంకరిస్తూ వుంటారు. కానీ నిజమేమిటంటే, దైవప్రీతి కొరకు, లోకకళ్యాణం కొరకు కార్యక్రమాలు చేపట్టినప్పుడు, దైవమే మీ ద్వారా అవసరమైన శక్తియుక్తులను వ్యక్తం చేస్తూంటాడు. ఆ కార్యక్రమం ముగిసిపోతే, ఆ శక్తియుక్తులన్నీ ఆయనే ఉపసంహరిస్తాడు. అంటే, దైవం చేతిలో మీరు పనిముట్లవంటివారని, నిమిత్తమాత్రులని గ్రహించాలి, గ్రహించి అలా నడుచుకోవాలి. ఇలా మీ ద్వారా శక్తియుక్తులు ప్రసారమైనపుడు, వాటిని మీరు ఆరాధించాలి. అలా ఆరాధించటం చేతనైతే, లోకకళ్యాణ కార్యక్రమాలకు, దైవవిహిత కార్యక్రమాలకు మీరు ఎంత అవసరమో అంత వరకు భగవంతుడు మిమ్మల్ని వినియోగిస్తాడు. మీ కర్తవ్యం పూర్తయితే ఆ శక్తియుక్తులు మీ నుండి వ్యక్తం కావటం ఆగిపోతాయి. దానిని దైవాజ్ఞగా స్వీకరించాలి. ఈ కాలంలో ఇలాంటి స్థితిని అనుభవించిన మహానుభావుడు జాతిపిత మహాత్మా గాంధీ, బక్కచిక్కిన శరీరంతో, వైశ్య కులంలో జన్మించిన ఈ వ్యక్తి కొల్లాయి గట్టి, భారతదేశంలోని ప్రజలందరినీ ఆకర్షించి, తన వెనుక నడిపించగలిగాడంటే, అదంతా దైవశక్తే. దైవమే ఆ వ్యక్తిని ఎన్నుకుని, తన కార్యం జరిపించాడు. ఆ కార్యం పూర్తవగానే, అర్జునుడిలాగానే నిలబడిపోయాడు అని అనుకోవాలి. అపుడు దేవుడు చెప్పాడు, గాడ్సే రూపంలో ఇక నీ పని అయిపోయింది, వచ్చేయమని. (గాడ్ – సే God Say=దేవుడు చెప్పెను). చూడండి! పేరు కూడా ఖచ్చితంగా ఎలా సరిపోయిందో! దేవుడి భాష చిత్రమైనది. ఎప్పుడు, ఎలా, ఎవరి చేత, ఎవరికి చెప్పిస్తాడో!*

***పంచదార వుంటే, ప్రాణమున్న చీమలు వస్తాయి***
***అలాగే కాసులుంటేనే కడదాకా చుట్టాలు వస్తారు అన్నీ బాగుంటేనే స్నేహం***
***ఏడుస్తుంటే చూచి నవ్వించేవాళ్ళు కొందరే వుంటారు***
***నవ్వే వాడిని చూచి ఏడిపించేవాళ్ళు ఎందరో వుంటారు***
***అహంకారిగా వుంటే, అన్నం కూడా దొరకదు ఆఖరికి***
***అటువంటి జీవితాన్ని వదలి మీ జీవితాలే ఎందరికో ఆదర్శమయేటట్లుగా***
***మీ బాటే ఎందరికో గమ్యము చూపునట్లుగా మీ మాటే పదిమందికీ వేదముగా***
***సుఖశాంతులతో జీవనాన్ని సాగిస్తూ***
***పవనకుమారుని పలు విధాలైన బోధలను పొల్లు పోకుండా పాటిస్తూ***
***ప్రోత్సహాన్ని అందిస్తున్న వైనం తెలుసుకుని***
***ప్రప్రథమంగా శాంతి కాముకులై సన్నిధిని చేరి***
***సుఖించండి నిగర్వులై అహంకార రహితులై***
***ఆంజనేయుని అత్యంత ప్రీతిపాత్రులైన***
***నా చిన్నారి బిడ్డలారా!***

ॐ

**02-08-2018** 10:20 AM

**2) దేహభావన వీడి ఆత్మతత్త్వాన్ని అనుభవించుటకు మేము తెలుసుకోవలసినది ఏమిటి స్వామీ?**

*నీటితో వున్న టాంక్ లోనికి మీరు చూస్తుంటే దానిలో మీ ప్రతిబింబము కనబడుతుంది. నీవు ఏమంటున్నావు? అది నేనే అంటావు. కానీ, మీరు విచారణ చేసికొన్నప్పుడు, నేను అది కాదు, అది నేనే, నేను అది కాదు అని తెలుస్తుంది. నీ దేహాన్ని భ్రమించి అది నేనే అంటున్నావు. కర్ర తీసుకొని ఎంత మంది దానిని దండించినా, నీకేమీ దెబ్బ తగలదు. కానీ, ప్రతిబింబాన్ని ఎవరైనా దూషిస్తే కోపం వస్తుంది. కొడితే దెబ్బ తగలదు గానీ, తిడితే కోపం వస్తుంది. కొట్టినప్పుడు అది నేను కాదు, తిట్టినప్పుడు అది నేనే! ఇదే వేదాంతములోని రహస్యం. హృదయాన్ని , ఆత్మతత్త్వాన్ని ఏకత్వముగా ఉంచుకొన్నప్పుడు, ఎవరికి ఏ బాధ కలిగినా, అది నాదే. కానీ, దేహభ్రాంతిలో వుంటే, ఎవరేమైనా అది నేను కాదు. ఇటువంటి విశాలమైన భావాలను, ప్రబోధాలను కలిగించేది వేదాంతము. మీ మధ్యన నివసించేవారి తప్పులు వెదుకుతూ వుండటం ద్వారా మీలోని ఆధ్యాత్మిక దృఢత్వం, సంకల్పం బలహీనమవుతాయి. కావున, వారిలోని మంచి లక్షణాలే గుర్తించడం, ఇతర లక్షణాలను పట్టించుకోకపోవడం, మీరు అభ్యసించాలి. ఈ ప్రపంచమే దోషపూరితమైనది. ఇతరులు నీలోనూ దోషాలను చూడవచ్చు. కనుక, మీ తప్పులు, దోషాలు మీరే గుర్తించి, వాటిని సరిదిద్దుకోవడమే ఉత్తమం!*

**3) చెడు సంస్కారాలను ఎలా తగ్గించుకోవాలి స్వామీ?**

*గురువును ప్రేమించండి. ఆయన పనులను ఒక పూజగా భావించండి. ఆయన పాదపద్మాలకు శరణాగతుడవు కావాలి. ఆయన కృపాకటాక్షములకు పాత్రుడవు అవడానికి ప్రయత్నించాలి. గురువు అనే పదము పైన గురు పాదాలపైన నమ్మకం ఒక్కసారి కలిగిందా, దానిని ఎటువంటి సమయంలో, సందర్భంలో విడువరాదు. మనస్సును స్ఫూర్తివంతమైన ఆలోచనల వైపు మళ్ళించాలి. ఈ విధంగా చేసినట్లైతే, దుష్ట సంస్కారాల యొక్క అఘాతాల నుండి నిలద్రొక్కుకుని నిలబడవచ్చు. ఈ సాధనాక్రమంలో మెల్లమెల్లగా కుసంస్కారాలు బలహీనమవుతాయి. ఒక్క విషయం బాగా గుర్తుంచుకోండి. ఈ ఆధ్యాత్మిక జీవితాన్ని మీరే ఎంచుకున్నారు. ఎవరూ మిమ్మల్ని అందుకోసం బలవంతం పెట్టలేదు, బ్రతిమిలాడలేదు. కాబట్టి, ప్రారంభంలో కొన్ని చెడు సంస్కారాలు ఇబ్బంది పెట్టినప్పటికీ, పవిత్రమైన జీవితం గడపటం ద్వారా అవ్వన్నీ మెల్లమెల్లగా సమసిపోతాయి. మీ యొక్క ఆధ్యాత్మిక సాధనా జీవితాన్ని విజయవంతం చేసుకోవాలి. ఈ ఆధ్యాత్మిక జీవితంలో పయనించటానికి మీ మనస్సును ఇంకా దృఢతరం చేసుకోవాల్సి వుంటుంది. దృఢ సంకల్పంతో మీరు పవిత్రజీవితం గడిపితే, గురువు యొక్క ఆశీస్సులు మీపైన వుంటాయి. మీరు ఆధ్యాత్మిక జీవితంలో తప్పక విజయం సాధిస్తారు. మనస్సు దృఢంగా వున్నప్పుడు, బాహ్యంగా ఏ మాటలు, ఏ చర్యలు మిమ్మల్ని చలింపచేయలేవు. స్థిరమైన మనోవైఖరి నియంత్రణే దృఢమైన వ్యక్తిత్వానికి పునాది. నిజానికి ఎదుటివారి వల్ల మీకు కలిగే అశాంతి చాలా స్వల్పం. కానీ, మీ మనస్సు దానిని పదింతలు చేసుకొని మధనపడుతూ వుంటుంది. ప్రక్కవారి మాటలకు, చర్యలకు విపరీత అర్థాలను వెదుక్కుని, వేదన అనుభవించడం మానుకోగలిగితే, మీ ప్రశాంతతకు ఎట్టి భంగమూ వాటిల్లదు!*

***జన్మలన్నింటిలోన నరజన్మ శ్రేష్ఠమని గుర్తించండి***
***మరల మరలా దొరకబోదు  చాలా దుర్లభము***
***ఇంద్రియములు ఎంత చైతన్యముగా వుంటాయో***
***అంతటి మేధా సంపన్నుడని కొనియాడుతారు***
***కోపతాపములు అందరిలో కనిపిస్తాయి***
***మరి ఎందరో రజోగుణ లక్షణములను కలిగి వుంటారు***
***వీరి చేష్టలు సంస్కారము లేక, తోటి వారిని బాధపెట్టు***
***సత్త్వగుణమెపుడూ మిమ్మల్ని సంస్కరిస్తుంది***
***బంధము అనుబంధము మోహబంధము  మూడూ ఒకటే***
***ఇంత కన్నా మిగుల పెద్దది ఒకటి - బానిస బంధము***
***వస్తువులను వస్తు వసతులను వదలలేక భౌతిక మత్తున నరుడు జీవిస్తుంటే***
***వానరుడు మిమ్ముల మేల్కొల్పి, మంచిని చేయ వచ్చిన ఈ మారుతి మాటలు***
***ముద్దుగా బుద్ధి మాంద్యాన్ని వదిలించి***
***మహత్తరమైన ఆత్మతత్త్వాన్ని అనుభవించండి***
***ఆంజనేయుని అనుంగు పుత్రులారా!***

ॐ

**03-08-2018** 10:30 AM

**4)** సాధకుడు పాటించవలసిన నియమములు తెల్పండి స్వామీ?

*ఒక ఆశ్రమంలో సత్సంగం జరుగుతూ వుంది.  దానికి ఒక భక్తురాలు ఆలస్యంగా వచ్చింది. అది చూచి ఆ గురువుగారు భక్తురాలిని సత్సంగ అనంతరం ఆలస్యంగా రావటానికి కారణమేమిటని అడిగారు.  అందుకామె, "స్వామీజీ!  నేను సమయం చూచుకోలేదు.  అందువల్ల ఆలస్యమైంది" అని చెప్పారు.  స్వామీజీ ఆమె వైపు చూస్తూ, "ఇష్టమైన చోటికి వెళ్ళాలంటే, గడియారాన్ని పదేపదే చూచుకుంటారు. నీవు ఇక్కడికి ఆలస్యంగా వచ్చావంటే, దీని పట్ల నీకు ఆసక్తి లేదని అర్థమవుతుంది" అన్నారు.  గురువుగారు సమయపాలన గురించి ప్రసంగించడం మాత్రమే కాదు, ఎంతో నియమనిష్ఠలతో పాటించేవారు. ప్రసంగాలకు గానీ, సమావేశములకు గానీ ఆయన సమయం చూసుకుని, ఖచ్చితంగా వెళ్ళేవారు.  స్వామీజీ భక్తుల నుండి కూడా సమయపాలనను ఆశించేవారు.  ఒకరోజు ఉదయం కొంత మంది స్వామీజీని కలిసినప్పుడు వారితో ఇలా అన్నారు.  "నా దగ్గర 'ఇన్‌క్యుబేటర్' వుంది.  దానిలో నేను గ్రుడ్లను వుంచుతాను.  వాటికి అవసరమైన ఆహారాన్ని ఇతర పదార్థాలను సమకూరుస్తాను.  కానీ, వాటిలో కొన్ని కాకులుగా బయటకొస్తాయి, మరికొన్ని కోయిలలవుతాయి.  దానిలో నేను చేసేదేముంది!" అన్నారు. వెంటనే ఒక శిష్యురాలు, "స్వామీజీ!  మీరు కాకిని కోయిలగా మార్చగలరా?" అని ప్రశ్నించింది.  స్వామీజీ*

చిరునవ్వుతో "అది నాకు ఖచ్చితంగా సాధ్యం కాదు. ఎవరి సంస్కారము ఎలా వుంటే, వారి నడవడిక అలా వుంటుంది" అని అన్నారు. అందుకు ఆ శిష్యురాలు, "సంస్కారాలను మార్చుకోగలమా స్వామీజీ?" అని అడిగింది. దానికి స్వామీజీ, "ప్రయత్నిస్తే, క్రమక్రమంగా సంస్కారాలను మార్చుకోవచ్చు. సద్గుణాలతో కూడిన సత్కర్మల ద్వారా కుసంస్కారాలను జయించవచ్చు" అని చెప్పారు. మరలా స్వామీజీ నవ్వుతూ, "భగవదనుగ్రహము తోడై జన్మించివుండవలసింది. ఆయననే గురువుగా పొందిన అనేకమంది శిష్యులు వున్నారు. వారితోనైనా జన్మించివుండవలసింది" అన్నారు. వెంటనే అచట వున్నవారిలో ఒకరు, "కనీసం మీ కాలంలో జన్మించాము గదా!" అనగానే, అందరూ నవ్వారు. దానికి స్వామీజీ ఈ విషయాన్ని విశ్లేషిస్తూ ఇలా అన్నారు. "చూడండి! అనేకమంది గురువు వద్దకు వెళ్తారు. ఆధ్యాత్మిక ఉన్నతికై ప్రయత్నిస్తారు. కానీ, కొందరు మాత్రమే లాభము పొందుతారు. దీనికి కారణమేమిటో తెలుసా? మొదటిది వ్యక్తి యొక్క సంస్కారము, రెండవది శ్రద్ధ. నిజమైన జిజ్ఞాసువులు మాత్రమే సాధన ద్వారా పురోగతిని సాధించగలరు" అన్నారు!

**5) దేహములోని షట్చక్రముల గూర్చి తెలుసుకోవాలని యున్నది స్వామీ?**

సాధనా క్షేత్రములో ముందుకు సాగే కొద్దీ సాధకునికి తన దేహములో ఆరు చక్రములున్నట్లు తెలుస్తుంది. అన్నింటి కంటే, అడుగునున్న యోగచక్రము గుహ్యస్థానము లేక మూలాధారమునందు వుంటుంది. రెండవది జననేంద్రియము లేక స్వాధిష్ఠానము. మూడవది నాభి లేక మణిపూరము. సంసారిక జీవుల మనస్సు సాధారణంగా ఈ మూడింటిలో ఏదో ఒక చక్రమునందు నెలకొని వుండటం వలన, ఆహార, నిద్ర, మైథునము లనే మూడింటియందు ఆసక్తులై వుంటారు. నాల్గవ చక్రము హృదయస్థానమునందు వుంటుంది. సాధకుని మనస్సు ఎప్పుడైతే ఊర్ధ్వముఖమై ఉన్నత భావనలయందు లగ్నమవుతుందో, అప్పుడు అతని మనస్సు ఈ నాల్గవ చక్రాన్ని చేరుతుంది. ధ్యాన సమయంలో ఆ హృదయ స్థానమందు అధోముఖముగా ఒక కమలమున్నట్లు అనుభవమవుతుంది. కుండలినీ స్పర్శతో ఆ కమలదళములు ఊర్ధ్వముఖముగా వికసిస్తాయి. కానీ, ఈ స్థితి నుండి అతని మనస్సు మళ్ళీ అధోముఖమయ్యే ప్రమాదముంది. అందువలన, సాధకుడు రాత్రింబవళ్ళు హృదయకమల దళములను ఊర్ధ్వముఖంగానే వుండేటట్లు ప్రయత్నించాలి. మనోవృత్తులు ఊర్ధ్వముఖముగా చలిస్తున్నప్పుడు, ధ్యానము స్వాభావికమవుతుంది. చిత్తవృత్తి నిరోధము వలన ఉచ్ఛ్వాస నిశ్వాసములు నియమబద్ధమవుతాయి. ఐదవ చక్రము కంఠము నందు, ఆరవది భ్రూమధ్యమందు వుంటాయి. ఆరవ చక్రాన్ని చేరినప్పుడు ఇష్టదేవత యొక్క జ్యోతిర్మయమూర్తి దర్శనమవుతుంది. ఆ ఆరవ చక్రాన్ని ఛేదిస్తే సహస్రారము. అక్కడకు వెళ్ళిన వెంటనే మనస్సు లయమై, సమాధిస్థితి కలుగుతుంది. దీనికంతా గురువు అనుగ్రహము వలననే జరుగుతుంది. గురుస్పర్శ, గురుపదములు ఎనలేని దివ్యజ్ఞానాన్ని కల్గిస్తుంది. దీని అంతరార్థము గ్రహించుటకే, ఇంతటి విషయజ్ఞానము కల్గిన సందేశాన్ని ఈ రోజు విన్పించవలసి వచ్చింది!

***లేవండి లేవండి నిద్దుర లేవండి***

***విజ్ఞానంతో సారధులై***

***కాలకృత్యములు తీర్చుకుని కల్గిన దానిని పంచుకుని***

***తూరుపు తెలతెల వారే లోగా***
***జపమాల చేతబూని నోటి నిండా నామంతో***
***స్థిర చిత్తముతో సాధనామూర్తులై కదలండి***
***విద్యాతురానాం న సుఖం న నిద్ర అంటూ***
***జ్ఞాన స్వరూపుని ఆశీస్సులతో***
***ఆయన అండ మీకు వుండగా, సాధనాపరులుగా మారండి***
***శాంతిని బోధించు శాంతమూర్తులై, ప్రేమమూర్తులై***
***శాంతికి నిలయంగా పవనకుమారుని బోధల సారాంశంతో ప్రశాంతులై***
***మనోఫలకాలపై చెరగని ముద్ర వేసుకుని***
***జ్ఞాన సముద్రమై ఉప్పొంగి***
***అలుపెరుగని అవిశ్రాంత యోధులుగా***
***ఆంజనేయుని చేరి సుఖించండి అత్యుత్తమ సాధనాపరులై***
***నా చిన్నారి బిడ్డలారా!***

ॐ

**04-08-2018** 10:15 AM

**6) నవ్వు లేక హాస్యము యొక్క ఆవశ్యకత ఎట్టిది స్వామీ?**

*ఒకరు సాహితీవేత్త. ఆయన ఒక కార్యక్రమం కోసం ఉత్తర భారతదేశానికి వెళ్ళారు. అచట ఒక పండితుడు ఆయనకు తారసపడ్డాడు. మాటల్లో మాటగా, తను తులసీదాస్ రామచరిత మానస్‌పై వ్యాఖ్యానం వ్రాస్తున్నానని ఆయన ముందు ప్రస్తావించాడు. పైగా, తనకు తులసీదాసుకు ఓ పోలిక వున్నదని, ఆ కారణం వల్లనే ఈ రచనకు పూనుకున్నానని చెప్పుకొచ్చాడు. విన్నవారికి అదేంటో అర్థం కాక, ఆశ్చర్యంగా "మీ ఇద్దరిలో ఉన్న ఆ సారూప్యత ఏమిటి?" అని ప్రశ్నించారు. అపుడు ఆ పండితుడు కాస్త గర్వంగా తులసీదాసులా నేను కూడా ఎపుడూ గంభీరంగానే వుంటాను. హనుమంతుల వారిని చూచి తులసీదాసుగారు అది నేర్చుకున్నారట. అందువలన, మీరు ఎంత నవ్వించాలని ప్రయత్నించినా నవ్వను గాక నవ్వను" అన్నాడు. సాహితీవేత్త, ఎప్పుడూ హాస్యోక్తులతో సభికులను అలరించేవారు. కావున, ఆ మాట విని ఆయన అవాక్కైపోయారు. రెండు దశాబ్దాలుగా ఒక్కసారి కూడా ముఖంపై చిరునవ్వు చిగురించని ఈ మనిషి ఏం మనిషా! అని అనుకున్నాడు. దాదాపు ఇరవై సంవత్సరముల నుండి, ఆయన నవ్వనే నవ్వలేదట. మరి అలాంటి వ్యక్తి, తన రామాయణంపై వ్యాఖ్యానం వ్రాస్తున్నందుకు ఆ తులసీదాసు, ఉదాహరణంగా తీసుకున్న ఈ ఆంజనేయుని ఆత్మ ఎంతమ క్షోభిస్తుందో కదా! అని ఆయన బాధపడ్డారట. ఇదే విషయాన్ని ఓ సభలో గుర్తు చేసుకుంటూ, రామభక్తుడైన తులసీదాసు నిశ్చలత్వాన్ని ఆయన అలా అర్థం చేసుకున్నందుకు నవ్వాలో, ఏడవాలో తెలియలేదు. అందుకే ఆయన రచనను చదివి అభిప్రాయం చెప్పమన్నప్పుడు, ఆ నవ్వని రోగం తనకు ఎక్కడ అంటుకుంటుందోనన్న*

భయంతో ఆ పుస్తకాన్ని తిన్నగా తిరస్కరించాడు. నవరసాల్లో అత్యంత ఆరోగ్యకరమైన కళ హాస్యమే! ఈ సృష్టిలో స్వచ్ఛంగా, స్వేచ్ఛగా నవ్వగలిగిన ఒకే ఒక్క జీవి మనిషి. నిష్కల్మషంగా నవ్వటం మనస్సులోని నిర్మలత్వానికి నిదర్శనం. కేవలం చిరునవ్వులోనే మనిషి పరిపూర్ణంగా వుంటాడు. మనిషికి ఏ సిరిసంపదలు లేకపోయినా, హాయిగా నవ్వగలిగే లక్షణముంటే, అది అతనికి నవరత్నాలు అలంకరించుకున్నంత శోభనిస్తుంది. అలాగని, హాస్యాన్ని విపరీతంగా వాడకూడదు. ఎదుటి వ్యక్తిని బాధించేటట్లుగా మాట్లాడి, నీవు నవ్వగలవు. కానీ, విన్నవాడు బాధపడ్తాడు. మీరు మాట్లాడే మాట వల్ల, మీరూ, ఎదుటివారు ఇద్దరూ నవ్వుకోగలగాలి. ఒక గురువుగారు చాలా హాస్యంగా మాట్లాడేవారు. ఎలా అంటే, ఏ మాత్రం అవకాశం దొరికినా తనపై తనే ఛలోక్తులు విసురుకుంటూ తన చుట్టూ వున్న పరిసరాన్ని సరదాగా మార్చేవారు. ఒకసారి ఆయన తన దృఢకాయాన్ని ఉద్దేశించి, "నా స్థూలకాయం, నాకెంతో రక్షణ తెలుసా? నేను చిన్నప్పుడు ఎంత స్వేచ్ఛగా నదిలో ఈదినా, నా శరీరాన్ని తినటానికి భయపడి ఒక్క మొసలి కూడా దగ్గరకు రాకపోయేది తెలుసా?" అన్నారట. ఇది సున్నితమైన హాస్యం. ఇది అతని సరళత్వానికి సూచిక. హాస్యం ఎంత ఆరోగ్యకరమో, ఆహ్లాదకరమో అపహాస్యం, అతిహాస్యం అంత అనర్థదాయకం. అయితే, మీలో చాలా మంది వ్యంగ్యోక్తులు, వెటకారపు మాటల్నే చతురోక్తులు అనుకుంటూ విసుర్లతో, వివాదాల్లో చిక్కుకుంటారు. ఎకసెక్కాలతో, ఎదుటివారి మనోభావాలను దెబ్బతీస్తూంటారు. నిజానికి హాస్యం సభ్యతతో కూడినదై, ప్రత్యక్షంగా గానీ, పరోక్షంగా గానీ ఎవరినీ నొప్పించేటట్లుగా వుండకూడదు. హాస్యం ఆహ్లాదదాయకమని సమయం సందర్భం లేకుండా ఎప్పుడూ నవ్వుతూ విదూషకుల్లా మారి, నవ్వులపాలు కాకుండా చూచుకోవాలి. మీ హుందాతనాన్ని కాపాడుకుంటూ ఆరోగ్యకరమైన హాస్యాన్ని అందిస్తూ, అందుకుంటూ ఆనందోబ్రహ్మ అనుభవిస్తూ జీవితాన్ని గడపాలి!

***మంచి ఆలోచనలను చేసినపుడే మానవత్వపు సుమాలు మదిలో పూస్తాయి***
***మంచి మనిషిగా మసలినపుడే మమతానురాగాలు వెల్లివిరుస్తాయి***
***బ్రతికినంత కాలము బ్రతుకుసారం తెలియాలి***
***మీ చుట్టూ వున్న వారికి మమకారం పంచాలి***
***మీలోని జ్ఞానదీపాన్ని మీరే వెలిగించుకోవాలి***
***మీ చుట్టూ వున్న చీకటిని వెన్వెంటనే తరిమి కొట్టాలి***
***మీ హృదయం నిండా ప్రేమ నిండాలి మీ సదనమంతా అనురాగం పండాలి***
***మనిషిగా మీరు పుట్టినపుడు మహిషిగా మసలటం అనుచితం***
***కొంత సుకృతం కొంత స్వయంకృతం***
***అంతరాలకు మూలం అంతు చిక్కని రహస్యం***
***ఆంజనేయుని మాటలు మెల్లమెల్లగా తాకుతూ వుంటే***
***ఒక్కసారైనా తప్పక ఒప్పేసుకుని, ఉలిక్కిపడి లేచి***
***ఉన్నత భావాలతో పయనమయ్యే శుభవేళ శుభ సంకల్పంగా మారి***
***దైవానుగ్రహం పొంది, దివ్య ప్రేమ స్వరూపులుగా మారండి***
***మారుతి చేతిలోని చిన్న బిడ్డలారా!***

ఓం

**05-08-2018** 10:10 AM

**7) సహనం యొక్క విశిష్ఠత ఏమిటి స్వామీ?**

*దుర్యోధనుడి వలన దుష్టద్యూతంలో ఓడిపోయి, పదమూడేళ్ళు వనవాసం చేయటానికి అడవులకు వచ్చి, పాండవులు అష్టకష్టాలు పడుతున్న రోజులు! ఒకరోజు, నిరంతర తపస్సులో తన పాపరాశిని భస్మీపటలం చేసుకున్న మార్కండేయముని, వారి దగ్గరకు వస్తాడు. ధర్మరాజు గుణగణాలను కీర్తిస్తూ, "ధర్మనందనా! పూర్వపుణ్య విశేషము చేతనే నాకు నీవంటి శాంతమూర్తి సందర్శన భాగ్యం లభించింది. యయాతి, వైన్యుడు, నాభాగుడు లాంటి రాజులు నిత్య ధర్మ పరిపాలకులై పుణ్యలోకాల నందుకున్నారు. శకుని దుస్తంత్రాలాలకించి, అధర్మ పద్ధతి ననుసరించి, అపకీర్తి పాలైన ధృతరాష్ట్రుడి లాంటి రాజు ఇంకొకరు కానరారు. సత్యమార్గాన్ని అతిక్రమించని ధీరవరేణ్యులు మీరు. అచిర కాలంలోనే మీ కోరిక నెరవేరుతుంది" అని ఆశీర్వదించాడు. అది విన్న ద్రౌపది, "నాథా! పగవారి యెడల ద్వేషం వదలి దీనాతిదీనులై తాపసవృత్తి ననుసరించడం రాజకుల భూషణులకు ధర్మమేనా? ఓర్పు అనేది సమయానుకూలంగా ఆచరించవలసిన లక్షణమే కానీ, అన్ని వేళలా ఓర్పు సద్గుణమవ్వదు. పసిబాలకులు ఆటవస్తువులతో ఆడుకున్నట్లు, భగవంతుడు ఈ ప్రపంచ ప్రాణులతో వినోదిస్తున్నాడు. అంతేగానీ, తల్లిదండ్రి సోదరుడి వలె అనురాగంతో, వాత్సల్యంతో ఆదరించి రక్షించుట లేదు. సత్పురుషులెందరో కష్టాలపాలవుతున్నారు. దుర్జనులు భోగభాగ్యాలతో తులతూగుతున్నారు. అనంతుడికి అనార్యులే బంధువులైనారు!" అని పతిదేవుళ్ళ కష్టాలు చూడలేక, ఆవేదనతో భగవంతుని ఆక్షేపిస్తుంది. ధర్మరాజు ఆ ఆక్షేపణకు చలించకుండా, ప్రశాంత వదనంతో గంభీరంగా ఇలా అంటాడు. "ద్రౌపదీ! క్రోధం పతనహేతువు. వివేకాన్ని నశింపచేస్తుంది. వివేకి విజ్ఞాన జలధారలతో తనలో జనించిన కోపాగ్నిని చల్లార్చుకుంటాడు. నిరంతర ధర్మవర్తనులుగా ఖ్యాతిగాంచిన మా వంటివారికి కోపధోరణి న్యాయం కాదు. క్షమాశీలియే నిజమైన పరాక్రమవంతుడు. క్షమాశీలికి లోకంలో సాధ్యం కానిదంటూ ఏమీ లేదు." ఆ మాటలు విన్న ద్రౌపది తన తప్పును తెలుసుకుని "ధర్మమార్గాన్ని నిరసించే మూర్ఖురాలిని కాను. కానీ, కర్మ ద్వారానే మనిషి దేన్నైనా సాధిస్తాడు. క్షత్రియులు తమ పరాక్రమశక్తితో అన్యాయం చేసిన పగవారిని అణచివేయాలి అని అన్నాను" అని చెబుతుంది. భీముడు కూడా దీనిని సమర్థిస్తాడు. కానీ, ధర్మరాజు అరణ్యవాసం చేస్తానన్న సత్యవాక్కు కోసం పదమూడేళ్ళు ఓరిమి వహించమంటాడు. ఈ సంవాదం నుండి మీరు ఏమి గ్రహించారు? మనిషికి ఏది బల నిరూపణ? ఏది బలహీనుల లక్షణం? అన్న విషయం రకరకాల పరిస్థితులలో ఏది ధర్మం, ఏది అధర్మం, ఏది కర్తవ్యం, ఏది అకర్తవ్యం అవుతుందో తెలుసుకోవచ్చు. కుటుంబాలలో గాని, సమాజంలో గాని పోరాటాలే ప్రగతి సూచికలుగా పరిగణిస్తున్నారు. శాంతిరహిత వాతావరణాన్ని సృష్టించుకుంటున్నారు. అశాంతిలో సుఖముండదని గమనించలేకపోతున్నారు. అహంకారం లేకుండా వుండటం, సత్యవాక్పరిపాలన, సహనం, క్షమ, ఓర్పు, ప్రేమ, త్యాగం, సేవ,*

*దయ, శాంతం, పవిత్రత ఇవ్వన్నీ మనిషిని శక్తివంతునిగా తయారుచేస్తాయి. మనిషికీ మనిషికీ మధ్య తేడా కూడా ఈ లక్షణాల పాళ్ళల్లో వున్న తేడాయే. ధర్మరాజు రాజై వుండి కూడా దుర్భరమైన కష్టాలను అనుభవిస్తూ, సంయమనాన్ని కోల్పోలేదు. అలాగే, శ్రీరాముడు, నా రాముడు, అరణ్యాల పాలై, అష్టకష్టాలు పడ్డా, తల్లి కైకను గానీ, తండ్రి దశరథుని గాని ఒక్క మాట అనలేదు. ఈ సహనమే మనిషిని శక్తివంతుడిగా నిరూపిస్తాయి. ఈ రోజు మీకు కలిగే కష్టాలు కూడా కష్టాలేనా? వీటి కోసం సంసారంలో మీ చేత్తో మీరే అగ్గి రగుల్చుకుంటున్నారు. శాంతిని దూరం చేసుకుంటున్నారు. 'శరీరానికి' వచ్చే రోగాలు అంటురోగాలు కానే కాదు. మనిషి 'మనసుకు' అంటుకున్న రోగమే భయంకరమైన అంటురోగం. అనారోగ్యాన్ని కొద్దికాలం మందులతో, డాక్టర్ల సలహాలతో తగ్గించుకోవచ్చు. కానీ, రెండవ రోగం తగ్గకపోగా, మిమ్మల్ని తలక్రిందులుగా చేసి, తన తడాఖా చూపించి, మిమ్మల్ని త్రొక్కివేస్తుంది. దాని పాదాల క్రింద పడకండి. విచక్షణతో, వైరాగ్యభావంతో, క్షమాహృదయంతో క్షమించగలిగిన నాడు, మీరు ఆధ్యాత్మికంగా అడుగు వేస్తున్నట్లుగా గ్రహించండి. సహజ శాంతికి అవరోధంగా నిలిచే స్వకీయ దేహంతో మమేకమైన 'నేను' అన్న పరిమిత వ్యక్తిత్వాన్ని వదులుకుంటే, అనంతత్త్వం, అమృతత్త్వం మనిషి సొంతమవుతుంది, స్వభావమవుతుంది. సదా ఈ లక్ష్యంతో జీవిస్తే మనుషులు ఋషులవుతారు, మహాపురుషులవుతారు!*

***మనిషీ మనసూ వేరు కాదు మనసు మనిషిలోనే వుంటుంది***
***ఎందుకు ఈ ద్వైదీ భావనలు, ఎందుకీ భిన్న ప్రవర్తనలు, ప్రవృత్తులు?***
***మనిషి మనిషిగా వుండాలంటే మనిషి మనసు మాట వినాలి***
***కానీ, మనసు మకిలం కాకుండా వుండాలి మనిషి ఋజువర్తనలో సాగాలి***
***మనిషి వద్దంటాడు గానీ, మనసు కావాలంటుంది***
***మనిషి తప్పు అంటాడు మనసు ఫర్వాలేదులే అంటుంది***
***దానికి మనిషి కూడదు అంటాడు మనసు వుండాలి అంటుంది***
***ఇలాంటి ద్వైదీ భావనలను అంత మొందించుకుని, ఈ ఆంజనేయుడు అందించు అత్యంత***
***విలువైన మాటల మూటలు తీసుకుని ఇకనైనా***
***మీలోని చైతన్యానికి రెక్కలు తొడిగి అక్షరాలను అమృతతుల్యం చేసుకొని***
***చేరువలోనే యున్న చిత్ స్వరూపుని కనుగొని***
***కించిత్ ఆధ్యాత్మికపరులై అభయాన్ని అందుకుని***
***ఆంజనేయుని అండ చేరండి అతి త్వరలో***
***నా చిన్నారి బిడ్డలారా!***

ॐ

**06-08-2018** 10:20 AM

**8)** సంకుచిత్వం నుండి విశాలత్వాన్ని సాధించుట ఎలా స్వామీ?

*భగవంతుని కృపా వాయువు వీస్తూనే వున్నది. మీరు చేయవలసిన పని తెరచాపను ఎత్తడమే*

*అంటూ, అభయాన్నిస్తున్నాడు ఈ అభయాంజనేయుడు! భగవంతుని ఆర్తిని అణువణువునా అనుభవిస్తున్న మీరు దుఃఖాలు, కష్టాలు అనుభవించనిదే, సంపూర్ణ శరణాగతి రాదు. జీవ సేవే, శివ సేవ. ఈ విశ్వం బ్రహ్మమయం. సమస్త జీవులలో ఒకే బ్రహ్మం విరాజిల్లుతున్నది. జీవుల పట్ల దయ కాదు, శివునిగా భావించి సేవ చేయాలి. ఎవరు ఎటువంటి స్థితిలో వున్నా వారికి మంచిని బోధించి ఈశ్వరోన్ముఖులను చేయాలి. అది మీ కర్తవ్యము. ఒక గురువుగారు శిష్యులకు సర్వం బ్రహ్మమయం అని బోధిస్తూండేవారు. ఒక శిష్యుడు, గురువు మాటలను చాలా బాగా ఆలకిస్తూండేవాడు. ఆధ్యాత్మిక విషయాల గురించి చాలా గొప్పగా మాట్లాడుతూండేవాడు. గురువుగారు చేసే పనులను ప్రతిక్షణం వీక్షిస్తూండేవాడు. ఆయనలో గొప్పదనమేమీ కన్పించేది కాదు. గురువుగారు కావాలనే తన ప్రజ్ఞను దాచుకుని, బాహ్యంగా చెప్పే విషయాలను ఏమంత పాటించకుండా శిష్యుల మానసిక స్థితిని మాత్రం గుర్తిస్తూ వుండేవాడు. ఒకరోజు యజ్ఞం చేస్తున్న సమయంలో అది యజ్ఞం అని తెలియని అమాయకుడు ఒకడు వచ్చి, ఆ యజ్ఞంలో నుండి తాను వెంట తెచ్చుకున్న చుట్ట వెలిగించుకున్నాడు. అది చూచిన శిష్యుడు ఉగ్రుడై, వాడి వెంటపడి కొట్టాడు. గురువుగారు చూస్తున్నాడు, మాట్లాడలేదు. అది చూచి చాలా కోపంతో, "మీరేమి గురువులు? మాట్లాడరు, చేయకూడదని చెప్పరు?" అంటూ చిందులు త్రొక్కాడు. అపుడు గురువుగారు, "వాడు అమాయకుడు. తెలియని తనం కావున, మొట్టమొదట చూపించవలసినది విచక్షణతో కూడిన దయ. రెండవది వాడూ బ్రహ్మస్వరూపమే. బ్రహ్మ తప్ప వేరేమీ లేదని తెలుసుకుని కూడా కొట్టావే, అది అజ్ఞానం" అని చెప్పాడు. దాంతో శిష్యునికి కనువిప్పు కల్గినది. సర్వసాధారణంగా మనుష్యులు బ్రహ్మతత్త్వాన్ని గురించి ఎంత తెలిపినా బాహ్యంగానే, బాహ్యవస్తువుల పైననే వ్యగ్రులై వుంటారు. జపమాల, నుదుట నామాలు ధరియించినంతనే రోజుకు పలుసార్లు స్నానమాచరించి నంతనే, లేదా, సజ్జ నిండా పూలు నింపుకుని ఏ దైవ విగ్రహానికో సమర్పించినంతనే., ఆ వ్యక్తిని భక్తుడు అనబోరు. ఎవరి మనస్సు, ప్రాణము, చిత్తము, బుద్ధి, అహంకారము అన్నీ భగవంతునిలో లీనమైనాయో, ఎవరికి నేను ఫలానా వ్యక్తిని అనే భావం వుండదో, ఎవరు సర్వత్రా భగవంతుడినే చూస్తారో వారే వాస్తవానికి భక్తులు. బ్రహ్మజ్ఞానాన్ని పొందినవారు. అనగా, బాహ్య వస్తువులపై ప్రీతి గాని, ఏహ్యాభావం గానీ లేకుండా భగవంతుని స్మరణ మననాలు చేస్తూ, ఆయన లీలా విలాసాలను తలుస్తూ, తెలియచెబుతూ, అందులో మునిగి వుంటారో, వారు నిజమైన భక్తులు. మారేడు ఫలంలో గుజ్జు, గింజలు, తొక్క వుంటాయి. తొక్క, గింజలు పారవేస్తే, మిగిలేది గుజ్జు. కానీ, పండు బరువు తెలుసుకోవాలంటే, తొక్క, గింజలను కూడా పరిగణనలోనికి తీసుకోవాలి. ఆ విధంగానే, జీవజగత్తును కాదని (నేతి నేతి) సచ్చిదానందాన్ని చేరాలి. ఆ పైన, ఆ సచ్చిదానందమే జీవజగత్తై వున్నదనే భావం కలుగుతుంది. గుజ్జు ఎందు నుండి వచ్చిందో, తొక్క, గింజలు కూడా అందు నుండే వచ్చాయి. మజ్జిగ నుండి వెన్న, వెన్న మజ్జిగ లోనిదే. భగవంతుడ్ని సాక్షాత్కరించుకుంటే, ఆయనే స్వరాట్టు, ఆయనే విరాట్టు, ఆయనే అఖండ సచ్చిదానందము. ఆ పైన ఆయనే జీవజగత్తు అయివున్నాడని అర్థం అవుతుంది!*

***గతులు తప్పిన గతక మెతుకు దొరకదు***

***అడ్డు అదుపూ లేని అసుర కాంక్షలతో***

***దొరికిన సంపదనంతా సర్వనాశనము చేసుకున్నచో***
***సుధలు కురియుచున్న జీవితమనే ఈ సుందరవనంలో***
***చింతలు వదలి శాంతిగా జీవించుటకు తెలుసుకొనవలసిన దానిని తెలుసుకోండి***
***గూడు వదులునాడు మీతో గుప్పెడు కూడా రాదన్న సత్యాన్ని ఎరింగి***
***భక్షకుడివి గాక, రక్షకుడివిగా మారి, రామనామాన్ని రోమరోమమున నింపుకుని***
***నిజతత్త్వముతో, నిరంజనుడ్ని చేరి నిర్మలహృదయుడివై, నిత్య సంతుష్టులై***
***నిరంజనులై సుఖించండి నా చిన్నారి బిడ్డలారా!***

ॐ

**07-08-2018** 09:10 AM

**9) లక్ష్య సాధనలో పట్టుదల యొక్క ఆవశ్యకత ఎట్టిది స్వామీ?**

*ఈ తరంలో చాలామంది తుది దాకా పట్టు విడువకుండా ముందుకు సాగుటలేదు. ఎప్పుడూ ఏవో సాకులతో నీరుగారిపోతూ వుంటారు. ఆరంభశూరత్వంతో మధ్యలోనే విజయమార్గం నుంచి వెనుదిరుగుతూ వుంటారు. దీనికి ప్రధాన కారణం మీ లక్ష్యంపై మీకు ఏకాగ్రత కొరవడటం. అంతేకాదు, చేపట్టిన కార్యాన్ని అంతు చూసేదాకా, వదలకూడదనే పట్టుదల లేకపోవడం. కార్యాన్ని చేపట్టినవారు ఆ కార్యం పూర్తయ్యే వరకు కొనసాగించండి. స్నేహితులు చెప్పగానే అటువైపు, శ్రేయోభిలాషులమని చెప్పుకునేవారు కొందరుంటారు. వారు మీ శ్రేయస్సు కన్నా ప్రేయస్సును కోరుతుంటారు. అది అర్థము కాక, అర్థం చేసుకోలేక అపనమ్మకముతో ప్రక్కదారిన నడిచి సాధించుకున్నది జారవిడుచుకుంటారు. ఆధ్యాత్మికమనేది ఒంటరి ప్రయాణము. ఆ ప్రయాణములో తల్లి, తండ్రి, బంధువులు, స్నేహితులు ఎవరూ తోడు రారు. మీకు దిక్కు చూపేవాడు గురువు ఒక్కడే. గురువును మాత్రం వదలకూడదు. మీకేమి కావాలో, మీరేమి కావాలనుకుంటున్నారో మీకే తెలియకపోతే, ఎవరు మీకు దిక్కు? సదా మిమ్మల్ని మార్చాలని, ఏమార్చాలని ప్రయత్నించే వారి నుండి మీకు కావలసిన దానిని గుర్తించి దక్కించుకోవడమే నిజమైన విజయం. లక్ష్యమే తప్ప మరేమీ కన్పించనంత పట్టుదల వుండాలి. ఆలోచనలు నేలపై ఒలికిన ఆవగింజల్లా విస్తరిస్తాయి. అప్పుడు వానిని దగ్గరకు చేర్చటం కూడా కష్టమే. ఆలోచనలలో మార్పు తీసుకురావడానికి సాధనలో భాగంగా సాధనగా తీసుకుని, కృషి చేయవలసిన సమయం. పదేపదే ఇటువంటి విషయాలను వివరించడం వల్ల మీ దృష్టిని ఆకట్టుకోవడం తేలికవుతుంది. కష్టతరమైన విషయాలైనా, మీ వంతు లోపం లేకుండా ప్రయత్నించడానికి ప్రేరణ దొరుకుతుంది. బలమే జీవనము. బలమైన ఆలోచనలను కలిగి వుండవలెనన్న ఆశయం ప్రస్ఫుటంగా వుండాలి. ఆలోచనలను ఆచరణ యోగ్యమైన ప్రణాళికలుగా రూపొందించుకుని, దృఢ దీక్షతో ముందుకు సాగాలి!*

**10) స్వామీ! మీరు అందిస్తున్న జ్ఞానబోధ మాకు ఎంతగానో సహాయకారి. కృతజ్ఞతలు స్వామీ!**

*నేటి సాధకులు సాధనలో ఎదుర్కొంటున్న వాస్తవ పరిస్థితులను అర్థం చేసుకుని, ఈ ఆంజనేయుడు*

ఏఏ విషయాలు మీకు వివరించాలో, ఏ మోతాదులో వివరించాలో సమకాలీన విషయాలు, వాస్తవాలు గమనించి ఏ మేరకు ఏ విషయాలు బోధించాలో అంతా బోధిస్తున్నాడు. మీరు అడుగు వేస్తున్న ఈ అడుగు లోతుగా ఆలోచిస్తూ ముందుకు సాగవలసి వుంటుంది. తరుణం మించిపోక ముందే, మేల్కొనవలసిన సమయం ఇది. గురువు చెప్పిన విషయాలను ఒక్కసారి ఆలోచిస్తే, ఆ భావనను మీ మనసులో వుంచుకుని, మీ బాధ్యతను ఎలా నిర్వర్తించుకోవాలో తెలిసి వస్తుంది. దీని కోసం నిద్ర, ఆహారం దూరం చేసుకోవాల్సిన అవసరం లేదు!

**11) సరియైన నిద్ర యొక్క ఆవశ్యకత ఏమిటి స్వామీ?**

త్వరగా నిద్రించి, త్వరగా మేలుకొనే వారికి ఆరోగ్యం, వివేకం, సౌభాగ్యం సిద్ధిస్తాయి. అర్ధరాత్రి తర్వాత రెండు గంటలు, అర్ధరాత్రి ముందు గంట నిద్రతో సమానం కావున, సాయంత్రం కాగానే పనులన్నీ మానేసి ప్రార్థన చేయకపోయినా కనీసం రాత్రవగానే నిద్రించండి. లేకుంటే, జీవించటమే మరిచే ప్రమాదముంది. "జ్ఞానికి జాగ్రత్ స్వప్న సుషుప్తులు అనే అవస్థలు వుండవు. అంతా తురీయమే" అని ఒక గురువు శిష్యులకు బోధించేవాడు. అది విన్న శిష్యుడు అనుమానంతో గురువుగార్ని, "మీరు గుర్రు పెట్టినది నేను విన్నానే" అన్నాడు. అంత గురువు, "అవును. ఆ గురక నేనూ వింటూనే వున్నానే!" అన్నాడు. "ఎప్పుడూ కళ్ళు తెరిచే వుంటే, అవి అలసిపోతాయి కనుక, కాసేపు వాటిని మూయాలి. అందుకే మూస్తాను" అన్నాడు. ఏది ఏమైనా, కొంత ఆధ్యాత్మిక సాధన చేయకుండా మహాత్ముల స్థితులు మీకు అర్థం కావు. నిద్రలేమి గురించి దిగులుపడి లేని తలనొప్పి తెచ్చుకోకుండా, ధ్యానం చేయడం లాంటి ఆలోచనలకు పని చెప్పటం ఉత్తమం. ధ్యానం సాధారణంగా సామాన్యులకు అతి కష్టమైంది. కాబట్టి, ఇట్లే అలుపొచ్చి, చిటికెలో నిద్రపట్టడం జరుగుతుంది. నిర్లక్ష్యంతో నిద్రను ఎక్కడో పారవేసుకున్న కొంత మంది నిద్రమాత్రలు, మత్తుమందులను ఆశ్రయిస్తారు. నిద్రించడం ఆకాశానికి ఎగరడం లాంటిదైతే, మత్తులో మునగడం అగాధంలోకి దూకటం లాంటిది. గాలిలో వున్నంత సేపూ భలే గమ్మత్తుగా, యమ గమ్మత్తుగా వుంటుంది. కానీ, నేలను తాకినప్పుడు, అది ప్రత్యక్ష నరకమే. మరి మంచి నిద్ర అలవాట్లతో, మనసుకు శిక్షణనిచ్చి, జీవితాన్ని తేలిక పరచుకోండి!

***ఈ తనువు ఈ మనువు శాశ్వతమనే భ్రమల ముసుగు కప్పుకోకు***
***ఈ దేహపు నేహంలో నీవు అద్దెకు బద్ధుడవై సిద్ధపడ్డావు***
***ఇది నీ సొంత ఇల్లు కాదు యజమాని ఆ పరమాత్మే***
***ఏనాడు ఖాళీ చేయమని కబురు వస్తుందో, ఆనాడే ఇల్లు విడిచిపెట్టాలి***
***ఎంత చిత్రం !***
***నాలుగు రోజుల సంబడానికి నడమంతరపు సిరి భాగవతానికి***
***ఎందుకు నిక్కులు, ఎందుకు టెక్కులు***
***మనో జిజ్ఞాసం మహతీ మెట్లపై జ్ఞాన పరిమళాలు మీటి మాయ తొలగించి***
***మనసు తోటలో జన్మ చరితార్థపు సువాసనల తొడుగు శాశ్వతంగా ధరించేలా***

***భగవన్నామ సంకీర్తనా భాగ్యపు భవంతిని సొంతం చేసుకోండి అని***
***ఈ అంజనీసుతుడు అభయ ముద్రికతో అనుక్షణమూ***
***మిమ్మల్ని ప్రోత్సహిస్తూ, హెచ్చరిస్తూ ఆనందాన్ని అందుకొమ్మని ఆశీర్వదిస్తున్నాడు***
***ఈ చిన్నారి బిడ్డలను !***

ఓం

**08-08-2018** 10:20 AM

**12) గురువు యొక్క సహచర్యంలో శిష్యుడు పొందే ఆధ్యాత్మిక ఉన్నతి ఎట్టిది స్వామీ?**

*సాధకులు తమ గురువు సమక్షంలో వారి వారి ఆశయాలకు రూపకల్పన చేసుకుంటారు. అసాధ్యాలను సుసాధ్యాలు చేసుకుంటూ ముందుకు సాగుతారు. తొలిదశలో గురువు ఇచ్చే ఆలంబన వారికి అమితమైన స్ఫూర్తినిస్తుంది. వారు తమ కలల్ని సాకారం చేసుకునే అవకాశాన్ని కల్పిస్తాడు గురువు. గురువు యొక్క ఆలంబన, ఎంతటి సాధారణ విద్యార్థికైనా అసాధారణమైన ఫలితాలను సాధించే దీక్షను దీవింపచేస్తుంది. గురువు నేర్పించే క్రమశిక్షణలో ఎన్నో పరీక్షలు దాటుకుని ఒక స్థాయికి ఎదుగుతారు. దండనయే లేకపోతే, దండం పెట్టించుకునే అర్హత కలగదు. అంటే, నలుగురిలో నీ స్థానం గుర్తించి నీకు నమస్కారం చేస్తున్నారంటే, లోపల సంస్కారం పెరిగినట్లే గదా! అది పెరుగుటకు నీకు తెలియకుండగనే గురువు సహాయపడ్డాడు. ఆ నమస్కారం కూడా గురువుకే. నీకనుకున్నట్లైతే, ఇంకా అహంకారము అణగారనట్లే లెఖ్ఖ. మీరు చేపట్టిన కార్యాన్ని దార్శనికతతో, నిస్వార్థంతో, అంకితభావంతో, గురుతర బాధ్యతగా నిర్వర్తించేవారు భావితరాలకు ప్రతినిధుల్లా, దారి దీపాల్లా వెలుగుతారు. మహాత్ములకైననూ, గురువుల మార్గదర్శకత్వం అత్యంత ఆవశ్యకం. గురువులకు శిష్యులు బిడ్డలతో సమానం. కన్నపేగు కాకపోయినా, అంతకు మించిన కరుణార్ద్ర హృదయంతో ఆదరించి అక్కున చేర్చుకుంటున్న దయామయులు. గురుపాత్ర చాలా గొప్పది, శ్రేష్ఠమైనది. ఎందుకంటే, కన్నబిడ్డల బాధ్యత తల్లిదండ్రులది కొంత వరకే. కేవలం కూడు, గూడు, బట్ట, బౌతిక చదువు అంతవరకే తీర్చగలరు. భగవత్ స్థానంలో వున్న గురువు వీటన్నింటితో పాటు, ఆధ్యాత్మిక చింతనను కలుగచేసి, జీవన సారధ్యాన్ని వహించి గమ్యం చేరుస్తాడు. ఈ రోజు ఏ రక్తసంబంధం లేకపోయినా, మీ ఇద్దర్నీ పెనవేసుకున్న ప్రేమబంధంతో కలిపి కంటికి రెప్పలా కాపాడుతున్న స్వామి ప్రేమ కడు ముదావహం. వారి ప్రేమ వృధా కాకూడదు. వారి చేతుల్లో తీర్చిదిద్దుకుంటున్న మీరు ఎంతో ఉన్నత స్థాయికి ఎదిగి, వారి ఋణం తీర్చుకొని, మట్టిలోని మాణిక్యాలుగా మారి, జగత్తుకు సాక్ష్యంగా నిలవాలి! తల్లి, గురువు పాత్రలో నున్న ఈ మొక్క రెండు రకాల పాత్రల్లో అనగా చెట్టుకు కాసే కాయలు మధుర పదార్థము ఆహారంగా తినిపించి, ఆకలి తీర్చి, పూసే పూత అంతా పండ్లగా మారటానికి గురుపాత్రను పోషిస్తూ వుంటే, బిడ్డ ఆ చెట్టుకు సాధన అనే నీరు నందించటమే నీ విధి. ఈ హనుమ కూడా సాధనా దిశలో అడుగిడిన మరుక్షణం నుండే ఎన్నో ఎదుర్కొనవలసి వచ్చింది. మొట్టమొదటిది అంజనీదేవికి దూరమయ్యాను. సీతమ్మకు దగ్గరయ్యాను. దీనితో రాజప్రసాదంలో పెద్ద*

*కలవరం. నరుడ్ని కాదు, వానరుడ్ని. వీడికి ఇంత ప్రాధాన్యమేమిటి? రామచంద్రుని విడువక వుండుటతో రాజ్యాధికారులలో గుసగుసలు. ఇలా ఎన్నో ఎన్నెన్నో అనుభవించాను. నా రాముని విషయంలో కూడా రాక్షసత్వంతో బహు పన్నాగాలు పన్ని, దూరం చేయదలిచారు. కానీ, నా పట్టు వున్నదే, అది చాలా మహత్తరమైనది. నా పట్టుదల ముందు ఏదీ నిలువలేకపోయేడిది. గురుపదములు, సద్గురు పదములు పట్టిన వైనం, ఈ ఆంజనేయుడ్ని చిరంజీవిగా చేసి, చిరకాలం ఆధ్యాత్మిక గురువుగా నిలబెట్టింది. ఇది మీకు ఉపయోగపడుతుందని, ఆంజనేయుని జీవిత పుటలలో ఒక పుటను మీ ముందుంచాను!*

***చిక్కిన ఈ చిరంజీవి యొక్క విద్యాలయం***
***పరస్పర విరుద్ధాల మధ్య నీకు***
***నిత్యమూ నిరంతర యుద్ధమే***
***క్షణక్షణమూ ఉద్విగ్నమే అనుక్షణమూ అవరోధాలే***
***ఆదమరిచావా? అనామకుడిగా మిగిలిపోతావు***
***బ్రతుకు బాటకై బయలుదేరిన నీవు బుడి బుడి అడుగులతో***
***అద్భుత ప్రపంచంలోకి అడుగిడి***
***మనసును మలిన పరిచే మోహ ప్రపంచాన్ని వీడి***
***నీ బ్రతుకుకు నీవే దిక్సూచివై***
***గురువు నీడన సేద తీరి చేరుకో క్షణములో***
***చిత్తాన్ని ఛేదించి చేరువలోనే యున్న***
***చిరంజీవి సన్నిధికి సంతోషముతో ఆహ్వానిస్తున్న***
***నా చిన్నారి బిడ్డలారా!***

ॐ

**09-08-2018** 09:35 AM

**13) భగవంతుని పొందాలన్న తీవ్ర తపనను ఏ విధంగా పెంపొందించుకొనగలము స్వామీ?**

*ఒక గదిలో దొంగ వున్నాడు. అతనికి ఎలాగో అలా ప్రక్క గదిలోనే బంగారు రాశులున్నాయని తెలిసింది. ఈ రెండు గదులకు మధ్యన ఓ గోడ మాత్రమే వుంది. ఆ దొంగ పరిస్థితి ఏమిటి? అతని మానసిక స్థితి ఎలా వుంటుంది? అతడు నిద్రపోలేడు, ఏమీ తినలేడు, త్రాగలేడు. అతని మనస్సంతా ఆ బంగారాన్ని ఎలా దోచుకోవాలన్న ఆలోచనతోనే నిండిపోయి వుంటుంది. ఆనందపుఖని, అనుగ్రహపు రాశి, భగవత్ వైభవం అన్నీ ఇక్కడే ఈ భూమిపైననే ఉన్నాయని నిజంగా నమ్మినవారు ఆ భగవత్ ప్రాప్తికై ప్రయత్నించకుండా వుండగలరా? భగవంతున్నాడని నమ్మిన తక్షణం వ్యక్తి ఆయనను పొందాలనే కోరికతో పిచ్చివాడైపోతాడు. మీరు గడుపుతున్న జీవితం కన్నా మహత్తరమైన జీవితం మరొకటి వున్నదని తెలుసుకున్నవాడు, ఈ ఇంద్రియాలే సర్వస్వం కాదని గ్రహించినవాడు, ఈ క్షణికమైన భౌతికశరీరం*

*మరణంలేని శాశ్వితమైన ఆత్మానందం కన్నా అధికం కాదని తెలిసినవాడు, ఆ శాశ్విత ఆనందాన్ని తనంతట తానుగా పొందేందుకు పిచ్చివాడైపోతాడు. ఆ విధమైన పిచ్చి దాహం నిరంతర కృషినే మేలుకొలుపు అని నేను చెబుతాను. ఆ స్థితి కలిగిన నాడు, జ్ఞానం పొందినవాడవుతాడు. ఉప్పు బొమ్మ సముద్రపు లోతు కొలవడానికి సముద్రంలోకి వెళ్ళి, అందులో కరిగిపోయినట్లన్న మాట!*

**14) ఆత్మజ్ఞానం పొందుటపై గురి కుదరనప్పుడు, మేము వేరే ఏ విధమైన సాధన ద్వారా వైరాగ్యాన్ని పొందవచ్చు స్వామీ?**

*ఒకసారి ఒక జ్ఞానిని ఒక భక్తుడు "స్వామీ! నేను క్రొత్తగా కొన్న కారులో మీరు ఒక్కసారి వచ్చి కూర్చుని పావనం చేయండి" అని వేడుకున్నాడు. అప్పుడా జ్ఞాని వెంటనే "ఇప్పటికే ఒక వాహనంలో (శరీరంలో) కూర్చుని వున్నాను" అని చెప్పాడు. ఆత్మజ్ఞానం పొందిన మహాత్ములు అతి కొద్దిమందే వుంటారు. ఆ స్థితిని పొందటం అందరికీ అంత సులభం కాకపోవచ్చు. కానీ, ఈ దేహం శాశ్వితం కాదని గుర్తెరిగి వ్యవహరిస్తే, మీ సమస్యలన్నీ పరిష్కారమవుతాయి. నిజానికి మీలోని అసూయా ద్వేషాలకు, అహంకార మమకారాలకూ, లోభ మోహాలకు, కోపావేశాలకు, పంతాలూ పట్టింపులకు, భయాందోళనలకూ ముఖ్య కారణం ఈ భూమ్మీద మీ జీవితం మూన్నాళ్ళ ముచ్చటేనని మరచిపోవడమే. ఈ దేహం వేరు, ఆత్మ వేరు అన్న అనుభూతి మీకు కలగకపోయినా ఫర్వాలేదు. ఈ దేహం ఎప్పుడు రాలిపోతుందో, ఈ గూటిలోని చిలుక ఎక్కడికి ఎగిరిపోతుందో అన్న భావన మీ మదిలో మెదిలితే, మమకారం పటాపంచలవుతుంది. అప్పుడు ఈ ప్రపంచమనే నాటకరంగంలో మీ పాత్రలను సమర్ధవంతంగా నిర్వహించి, సంతోషంగా నిష్క్రమించే ధీరులుగా రూపొందగలుగుతారు!*

**15) అరిషడ్వర్గాల ప్రభావం ఎట్టిది స్వామీ?**

*జీవితకాల పయనంలో మీ మనస్సెప్పుడూ గతమెంతో ఘనమైనదని పొగుడుతుంది. భవిష్యత్తు కానరాక ఉక్కిరిబిక్కిరి అవుతూ, భయం గుప్పెట్లో నలిగిపోతుంది. వర్తమానంలో జీవించమంటూ ఎవరెన్ని విధాలుగా బోధించినా, ఆ మార్గాన నడవనంటూ మొండికేస్తోంది. ఇదేమి చిత్రం! ఉవ్వెత్తున ఎగిసిపడిన కెరటంలా అంతులేని కోరికలు ఎగిసిపడుతున్నాయి. ఇతరులెవరైనా బాగుపడితే ఈర్ష్యాద్వేషాలు పెల్లుబుకుతున్నాయి. మీ జీవితం ఇంకా మట్టిముద్దగానే వున్నదని వేదన చెందుతుంది. అప్పుడు మీ క్లిష్ట పరిస్థితిని చూచి, ఎవరైనా జాలిపడితే, అహంకారం బుసలు కొడుతూ, వారిని కసురుకుంటుంది. అసూయతో రగిలిపోతోంది. మంచిమాట వినడానికి చెవులొగ్గదు సరి కదా, వాళ్ళను నిందించటానికి ఏ స్థితిలోనూ వెనుకాడదు. అప్పుడు తొలి అడుగు. ఇక తనలో అనునిత్యం సంచరించేది క్రోధమే. అందరినీ శత్రువులుగా భావిస్తూ వ్యతిరేక భావాలతో క్రోధాన్ని పెంచుకుంటూ, ఎన్నో అనర్ధాలకు కారకురాలవుతుంది. లోభి యొక్క భావాలను పెంచుకుని, ఎంగిలి చేత్తో కాకిని గూడా తోలని చందంగా చెబుతోంది, మోహపుటాలోచనలు నేరాలు చేయడానికి పురిగొల్పుతాయి. ఇక ఏదైనా రంగంలో సాధించిన విజయం మదమాత్సర్యాలకు దగ్గర చేస్తుంది. ఇలా అంతరంగంలో నిండియున్న అరిషడ్వర్గాలు మంచి మార్గం వైపు నడవనీయకుండా మీ మనస్సును దిగ్బంధనం చేస్తున్నాయి. అందుకే సద్గ్రంథ పఠనమా*

లేదు. సత్సాంగత్యమూ కనబడదు. ఆధ్యాత్మిక బోధనలా చెవికెక్కవు. ఇక భక్తిభావమా, మచ్చుకైనా కానరాదు. ఇటువంటి పాడు మనసుని నిలువరించి శంఖక నినాదంతో పరమాత్మ వైపు దృష్టి మరల్చే ధీరుడెవ్వరని, పాపప్రక్షాళన ఎప్పుడని నిరీక్షిస్తూ, తీవ్రంగా ఘోషిస్తున్నాడు ఈ అంజనీసుతుడు!

***తాటి ముంజ తినినంతనే దాహము తీరుతుంది***
***పందిరేసినంత మాత్రాన సందడి తీరుతుంది***
***కానీ, ఆధ్యాత్మికము వినినంతనే సందడి తీరదు***
***మలయ మారుతములు సోకినట్లు***
***ఈ మారుతి మాటలు మిమ్ములను చేరి శుద్ధి చేయు***
***చిల్లగింజ చూడ చిన్నదైనను***
***నీరు శుద్ధి చేసి, ఆరోగ్యాన్ని అందించును, హాయి గొల్పును***
***చింతకాయ పులుపు  చెరకు యందు తీపి***
***వేపపూత చేదు  విప్పపూవు వగరు***
***సహజమైన మాధుర్యాన్ని అందించు***
***ఈ ఆంజనేయుని పలుకులు కావున***
***పాలకుడైన ఈ పవనపుత్రుడు మిమ్ము***
***పదిలముగా చేర్చు పరంధామమును ప్రక్కకు పోక***
***పసిడి మనసును పసిపిల్లను చేసి***
***పరుగున రండి ప్రణవ నాదముతో***
***ప్రణతులర్పించుచూ***
***నా చిన్నారి బిడ్డలారా !***

ॐ

**10-08-2018**

## 16) గురుకటాక్షం ఎట్టిది స్వామీ?

గురుకటాక్షంతో పామరులు, కఠినాత్ములు కూడా పరమ ఉన్నతులుగా మారగలరు. అందుకు వాల్మీకి, శబరి జీవితాలే నిదర్శనం. నారద మహర్షి అనుగ్రహం వల్ల రత్నాకరుడనే బోయవాడు వాల్మీకి మహర్షిగా మారాడు. మతంగముని అనుగ్రహంతో శబరి అనే బాలిక తాపసిగా మారింది. అడవిలో కొండలు, కోయలు, చెంచులు, కిరాతకులు, బోయలు, శబరులు అనే తెగలవారు వేట, వ్యవసాయం చేసుకొని జీవించేవారు. అందులో బోయలు, శబరులు పక్షులను కొట్టి చంపి తినటం, పక్షుల్ని విక్రయించడం ముఖ్యవృత్తిగా చేసుకుని జీవించేవారు. పధ్నాల్గు సంవత్సరాల శబరి అనే బాలిక, విల్లంబులతో పక్షులను కొట్టి పట్టుకుని, బుట్టలో వేసుకుని వెళుతూ వుండేది. ఆ అడవిలో నది ఒడ్డున వటవృక్షం దగ్గర మతంగ

*మహాముని ఆశ్రమం వుంది. ముని నిత్యం నదీస్నానం చేసి, సూర్యభగవానుడ్ని ఆరాధించేవాడు. ఆయన ఆశ్రమానికి వచ్చే దారిలో తరచూ వృక్షాల మీద వున్న పక్షుల్ని కొడుతూ మునికి కనిపించేది శబరి. ఆ బాలిక విడిచిన బాణం తగిలిన పక్షి గిలగిలా కొట్టుకుని క్రిందపడిపోతే, రెక్కలు రాని దాని పిల్లలు, ఇతర పక్షుల రోదన విని ముని మనస్సు కకావికలం చేసేది. ధ్యానం కుదిరేది కాదు. శబరి చేత ఈ హింసను మాన్పించడమెలాగా? అని ముని ఆలోచిస్తుండగా, ఒక రోజున దైవ సంకల్పం వల్ల ఒక దృశ్యం కనిపించింది. ఓ పెద్ద చెట్టు క్రింద ఓ సింహం బాధతో మూలుగుతూ నోరు తెరచుకుని పడుకొని వుంది. ఒక నెమలి తన ముక్కుతో సింహం నోటిలో గుచ్చుకుని వున్న ముల్లును తీస్తోంది. ఈ దృశ్యం చూచిన ముని ఆశ్చర్యచకితుడయ్యాడు. వెంటనే ఆయన మనస్సులో ఒక ఆలోచన కల్గింది. శబరికి ఈ దృశ్యం చూపించి, ఆమెలోని హింసా ప్రవృత్తిని తొలగించాలని నిశ్చయించుకున్నాడు. అప్పుడు మతంగముని బాణంతో పక్షిని కొడుతున్న శబరిని పిలిచి, నెమలి సింహానికి చేస్తున్న సహాయాన్ని చూపిస్తూ, ఆమెకు ఇలా హితబోధ చేశాడు. "అమ్మా శబరీ! సింహం క్రూరజంతువు అయినప్పటికీ, నెమలి తన బాధను నివారిస్తోందనే భావంతో దాని వైపు కృతజ్ఞతాపూర్వకంగా చూస్తోంది. సింహం వల్ల తనకు ప్రాణాపాయం వున్నప్పటికీ, నెమలి సింహం నోటిలో గుచ్చుకున్న ముల్లును ముక్కుతో తీసి, దాని బాధ నివారణ చేస్తోంది. దీని వల్ల నీవు తెలుసుకోవలసినదేమంటే, బాధలో వున్నవారి బాధను నివారణ చేయడం ధర్మం. బాధించడం అధర్మం. నెమలి తన మృత్యుభయం లెక్క చేయకుండా, ప్రాణం పోయినా ఫర్వాలేదు గాని, సింహం బాధను నివారణ చేస్తోంది. సింహం తనకు ఆహారమైన నెమలిని తన బాధను నివారణ చేస్తోందనే కృతజ్ఞతాపూర్వక వాత్సల్యంతో చూస్తోంది. ఎవరినీ ఏ విధంగానూ బాధించరాదు. ఆహారం కోసం నోరు లేని పక్షుల్ని కొట్టడం అమానుషం. మీకు చెట్ల ద్వార లభించే ఫలాలు, భూమి ద్వారా లభించే దుంపలు, ధాన్యాలు, గోక్షీరాలు, నదీజలాలు అహారంగా చాలవా? మృగాలు, పక్షుల్లో వుండే కరుణ మీలో ఉండొద్దా? ఆహారం కోసం జీవుల్ని బాధించడం ఘోరపాపం" అని బోధించారు. శబరికి గురుబోధ, గురు కటాక్షం, గురుశుశ్రూష లభించాయి. అప్పటి నుండి ఆమె మతంగముని శిష్యురాలై, తాపసిగా జీవనం కొనసాగించింది. కొంత కాలం గడిచాకా, మతంగముని శబరిని పిలిచి, "అమ్మా! నాకు అవసానదశ వచ్చింది. నేను మాత్రం రాముని దర్శించలేకపోయాను. కానీ, నీకు మాత్రం రాముని దర్శనభాగ్యం తప్పక కల్గుతుంది" అని ఆశీర్వదించి దేహత్యాగం చేశాడు. గురువాక్యం నిజం కాకుండా వుంటుందా! అరణ్యవాస సమయంలో రాముడు శబరి ఆశ్రమానికి వచ్చి తరింపచేశాడు. గురుకటాక్షం లభిస్తే మానవజన్మ ధన్యమైనట్లే కదా!*

**మనిషైనా మానైనా మరే జీవైనా**
**తడిలేని చోట తనువు వివర్ణమైన అసంబద్ధ చిత్రమే**
**నలుగురి నడుమ ఆర్ద్రత కరువైతే మానవత్వం చిగురించదు మాట పల్లవించదు**
**తడి లేని చోట అంకురం మనలేదు, పచ్చదన పరిమళమూ సోకదు**
**అంతరంగపు రణరంగంలో అసూయ కీలలు ఎగసి పడుతుంటే ఆర్ద్రత ఆవిరే కదా**
**తడి లేని పొడిబారిన మనిషి గుండెలో ఎంత త్రవ్వినా అనురాగపు ఊటలెలా పొంగుతాయి**

***ఆర్ద్రత మీకు - నాకు మధ్య కాదు, మనిషికి - ప్రకృతికి మధ్య వుంటేనే ఊట పొంగుతుంది***
***ఈ ఆంజనేయుని భావం అర్థం చేసుకుని***
***హిమం లాంటి ఆర్ద్రతను సొంతం చేసుకుని, అడుగు ముందుకు వేసి ప్రేమస్వరూపులై***
***పవనపుత్రుని అక్షరాల్ని లయబద్ధం చేసి, గమ్యం చేరి సుఖించండి***
***నా చిన్నారి బిడ్డలారా !***

ॐ

**11-08-2018** 10:20 AM

**17) ఆలోచనలను నియంత్రించే విషయంలో సాధకుడు ఎటువంటి జాగ్రత్తలు వహించాలి స్వామీ?**

*నైపుణ్యం గల శిల్పి పనిముట్టు తీసుకుని ఎంతో ఓపికతో శ్రమపడి, శిలల్ని చెక్కినప్పుడు, ఆ శిలలు అందమైన శిల్పాలుగా రూపుదాలుస్తాయి. అందుకే ఈ ఆంజనేయుడు చెబుతున్నాడు, మీరే శిలలు, మీరే శిల్పులు. మిమ్మల్ని మీరే చెక్కుకుని శిల్పంగా మలచుకునే బాధ్యత కూడా మీదే. మీ భవిష్యత్తును తీర్చిదిద్దుకోవటంతో పాటు, సాధకులై చెంత చేరినవారి భవిష్యత్తును తీర్చిదిద్దగలిగేటట్లుగా వుండాలి. మంచి ఆలోచనలతో, మంచి కార్యాచరణ ప్రణాళికలతో, ఆదర్శప్రాయమైన సాధనా దిశలో అడుగు ముందుకు వేయాలి. ప్రతీరోజూ మీలో సగటున 50 వేల నుండి 60 వేల పైచిలుకు ఆలోచనలు వస్తాయి. ఎంతో జాగ్రత్త వహిస్తే తప్ప, లేకపోతే అవి వరదలా వచ్చిపడుతూ వుంటాయి. ఆ ఆలోచనలు మీ మనస్సులో స్థిరనివాసమేర్పర్చుకుంటాయి. ఇలా నిరంతరం సాగే ప్రక్రియ గురించి జాగ్రత్త వహించకపోతే, ఆ ఆలోచనలు ప్రక్కదారి పట్టిస్తాయి. అనుభవం వల్ల కొంత, సంస్కారం వల్ల కొంత, సునిశిత పరిశీలన వల్ల కొంత, ఆధ్యాత్మిక చింతన వల్ల కొంత మీ ఆలోచనలు మిమ్ములను క్రింద పడవేయకుండా జాగ్రత్త పడేలా చేస్తాయి. కానీ, గురువు యొక్క అనుభవజ్ఞానం, సంస్కారం, సదాలోచనలు, బాధ్యతయుతమైన తమ పాత్ర నిర్వహణలో తప్పకుండా ఉపయోగపెడతారు.*

**18) లక్ష్య సాధనకు సాధకుడు ఎటువంటి లక్షణాలు కలిగి ఉండాలి స్వామీ?**

*తెలుసుకోవాలన్న తపన కలిగిన వారే విజయాన్ని సాధిస్తారు. ఆధ్యాత్మిక చింతన గలవారే విలువల పట్ల అవగాహన కలిగి వుంటారు. శాస్త్రీయంగా ఆలోచించగలవారే, విజయ సాధనకై కృషి చేసే స్వభావం కలిగి వుంటారు. అంటే, నేర్చుకోవాలనే తపన, నేర్చుకోవటానికి ఉపయోగపడే నైపుణ్యం, దీక్ష అవసరమని గ్రహించాలి. రోజుకొక ఆలోచన, నెలకొక మార్గం అంటే, మీరు ఎక్కడ వున్నవాళ్ళు అక్కడే వుండిపోతారు. ప్రతి పనిలో, ప్రతి లక్ష్యంలో సవాళ్ళు, సమస్యలు వుంటాయి. అవరోధాలు ఎదురవుతాయి. అంత మాత్రానికే భయపడిపోతే, ఎవరూ ఏదీ సాధించలేరు. నిర్దుష్టమైన లక్ష్యంతో, మొక్కవోని ఆత్మవిశ్వాసంతో సదా ముందుకు కదలాలి. వెన్ను చూపితే సమస్యలు తొలగిపోవు సరికదా, ఇంకా జటిలమవుతాయి. పిరికివాళ్ళుగా మారి, అడుగు వెనుకకు వేసినంత మాత్రాన ఏ కష్టం నుంచీ తప్పించుకోలేరు. అటువంటి వారు సదా ధైర్యాన్ని, దైవాన్ని తలచుకుంటూ జీవనపథంలో పయనించాలి,*

*అప్పుడు దైవం వారికి అందుకు కావలసిన ధైర్యాన్ని, దైవానుగ్రహాన్ని తప్పక అందిస్తాడు. నిన్ననే ఒక గురువుగారు శిష్యులతో చెబుతున్నాడు, అది మీకు చెబుతాను. మీలో విశ్వాసపు పాళ్ళు పెంచటానికి సహాయపడ్తుందని ఈ మారుతి ఆలోచన. ఆ గురువుగారు ఒక ఆంజనేయ భక్తుడైన ఓ మల్లయోధుడి గురించి చెప్పారు. కలకత్తాలో ఓ ఇద్దరు మల్లయోధుల మధ్య కుస్తీపోటీ ఏర్పాటు చేశారు. అందులో ఒకరు మారుతి పరమభక్తుడైన హనుమాన్ సింగ్. మరొకరు పంజాబు నుండి వచ్చిన మహాబలవంతుడైన మల్లయోధుడు. ఇతను పోటీలకు పదిహేను రోజుల ముందు నుంచే వెన్న, మాంసం తింటూ దేహాన్ని కుస్తీకి సిద్ధం చేసుకున్నాడు. హనుమాన్ సింగ్ మాత్రం ఆంజనేయుని నామాన్ని జపిస్తూ, మితాహారం తీసుకుంటూ పోటీలకు దిగారు. అందరూ పంజాబుకు చెందిన బలవంతుడే గెలుస్తాడంటూ అనుకున్నారు. కానీ, మారుతిని మననం చేసుకుంటూ మల్లయుద్ధానికి దిగిన హనుమాన్ ఆ పోటీలో విజేతగా నిలిచాడు. ఇలా దుర్బలులైనా, భగవంతుడికి శరణాగతులైతే మాత్రం సర్వేశ్వరుడు పరాజితులను చేసే ప్రసక్తే లేదు. అదే విషయాన్ని గురువు చెప్పాడు. తాను అభయమిచ్చిన ప్రకారం తప్పక అండ చేర్చుకుంటాడు భగవంతుడు!*

***ఒక శ్వాస అదే పనిగా ధ్యానిస్తూ వుంది***
***కళ్ళల్లో గూడు కట్టుకున్న చిత్రపటాలు మసకబారుతున్న వేళ***
***పరిభ్రమించే పాదాలు స్థాణువులై నిశ్చలంగా ఎదురు చూస్తున్నాయి***
***ఎందుకు?***
***మృత్యులోగిలికై చీకటి కమ్ముకున్నది***
***నిశ్శబ్దంగా ఒక ఆత్మదీపం అనంతాత్మునిలో లీనమైనది***
***చితుకులపై ఆహుతయ్యింది***
***ఒకే నాణానికి రెండు ముఖాలు***
***మరణము మరో జీవితాన్ని వెదుక్కుంటుంది***
***మారుతి మాటలు మంచి మాటలు***
***విని, మనసున సున్న మస్తిష్కపు వలయాలను ఛేదించుకుని***
***చిన్నారి బిడ్డలై ఈ చిరంజీవిని చేరి సుఖించండి***
***నా ముద్దు బిడ్డలారా !***

ॐ

**12-08-2018** 07:10 PM

**19)** నామస్మరణ యొక్క విశిష్ఠత ఎట్టిది స్వామీ?

*అరిషడ్వర్గాలుగా పిలువబడే కామ క్రోధ లోభ మోహ మద మాత్సర్యాలు నిరంతరం మనిషిని ఆవరించుకునే వుంటాయి. వాటి ప్రభావం వల్ల ఆలోచనలు కలుషితమవుతాయి. జీవన గమనమే*

అతలాకుతలం అవుతుంది. అటువంటి దుర్భర పరిస్థితి నుండి బయటపడి, ఆలోచనా ధోరణి మారాలంటే, జపధ్యానాలే చక్కని పరిష్కారమార్గం. కామాన్ని జయించడమెలాగా? అని అన్నట్లయితే, ఎక్కడ భగవన్నామం వుంటుందో, అక్కడ కామానికి స్థానం లేదు. ఒక్కసారి భగవన్నామానికి అలవాటు పడితే, అపుడు కామవాసనలు మనస్సులో తలెత్తే అవకాశమే వుండదు. మెలకువగా ఉన్నప్పుడు ఇది సాధ్యమే కావచ్చు. కానీ, నిద్రిస్తున్నపుడు కూడా కోరికలు కలల రూపంలో వెంబడిస్తే, ఇక రక్షణ ఎక్కడిది అని సందేహం రావచ్చు. అటువంటి ప్రమాదాల నుండి కూడా భగవన్నామం ఎలా జపించాలో తెలుసుకున్నవారు, పగలూ రాత్రీ దానిని విడువరు. అప్పుడు శ్వాస క్రియ, జీర్ణక్రియల వలె నిద్రిస్తున్నప్పుడు కూడా నామజపం కొనసాగుతూ వుంటుంది. ఆ నామ మహిమ కలల రాకను అరికడుతుంది. మనః శరీరాలను పరిశుభ్రంగా వుంచుతుంది. ఒకవేళ ఏవైనా కలలు తలెత్తినా, నామశక్తి సాధకుడ్ని వెంటనే మేల్కొల్పుతుంది. రేయింబవళ్ళూ రక్షిస్తుంది. చెడు భావనలు మనిషిని పతనావస్థకు చేర్చుతాయి. వాటి నుండి తప్పించుకుని, ఆ ఆలోచనలను శుద్ధి చేసుకోవాలంటే, ప్రేమతత్త్వం అలవర్చుకోవాలి. సాధుజనుల సాంగత్యం చేయాలి. అప్పుడే పరిశుద్ధులౌతారు. అలాంటి వారే పరమాత్మకు దగ్గరవుతారు. శుచి శుభ్రతలు అనేవి శరీరానికి, మనసుకు సంబంధించినవి. మనస్సు, శరీరం రెండూ నిర్మలంగా వుంటేనే, చేసే ఉపాసన ఏకాగ్రం అవుతుంది. శరీరం మలినంగా వుంటే, మనస్సు ఏకాగ్రం కాకపోవచ్చు. అలాగే మనస్సులో కల్మషాలు నిండి వుంటే కూడా శరీరం కుదురుగా ఉండకపోవచ్చు. అందుకే స్నానం ద్వారా శరీరాన్ని శుభ్రం చేసుకుంటే, శరీరం నూతనోత్తేజాన్ని, మనస్సు క్రొత్త ఉత్సాహాన్ని సమీకరించుకుంటాయి. శరీరం రాత్రింబవళ్ళూ మలినాన్ని కక్కుతుంది. అందువల్ల ప్రాతః స్నానంతో దాన్ని శుభ్రపర్చుకోవాలి. నిత్యం ఉదయం నిద్రలేవగానే కాలకృత్యాలు తీర్చుకుని స్నానం చేయటం, మీకు పెద్దలు నేర్పిన పద్ధతి. నదీస్నానం మరీ మంచిది. ఎందుకంటే, ప్రవహించే నీరు అనేక రకాల ఖనిజ లవణాలను తనతోపాటు మోసుకుపోతుంది. అది ఒక రకమైన విద్యుత్ ప్రవాహం. ప్రాతఃకాలంలో నదీస్నానం చేయడం వల్ల శరీరానికి, మనస్సుకు చైతన్యశక్తి సమకూరుతుంది. ప్రవహించే నీటిలో స్నానం చేయడం వల్ల శరీరమంతటికీ సమానమైన సుఖస్పర్శ కల్గుతుంది. నీటిలోని చల్లదనం ఇంద్రియాల తాపాన్ని ఉపశమింపచేస్తుంది. పైకి శరీరశుద్ధి కోసం అనిపించే స్నానవిధి, మనోవాక్కాయ కర్మలను శుద్ధి చేస్తుంది. ఇంద్రియ నిగ్రహశక్తిని పెంపొందింపచేస్తుంది. అయితే, చాలా మందిలో ఆచారం పేరుతో మితిమీరిన శుభ్రతపిచ్చి వుంటుంది. చాలా సార్లు, "వారు దీనిని తాకారు, వీరు దీనిని అశుద్ధం చేశారు" అంటూ గగ్గోలు పెడ్తారు. హఠాత్తుగా ఏదో అశుద్ధాన్ని తాకినట్లు, మైలపడినట్లు రాత్రీపగలూ వేళాపాళా లేకుండా వెళ్ళి స్నానం చేయడం చేస్తూంటారు. ఇలాంటి వెర్రితనానికి కారణం మనస్సు అపరిశుభ్రంగా వుండటమే. ఘోరమైన పాపం చేసిన కారణంగానే మనస్సు పవిత్రతను కోల్పోతుంది. ప్రతి దానికీ సంశయం కలగటం ఒక జాడ్యం. ఇందువల్ల, మనస్సు పావనం కాదు. అపరిశుద్ధమైన మనస్సును పరిశుద్ధం చేయడం సామాన్యమైన విషయం కాదు. ఇలాంటి పనికిరాని ఆచారపిచ్చి 'సాధనకు' ఒక అవరోధంగా పరిణమిస్తుంది. అందుకే సర్వవేళలా, సర్వదా భగవన్నామాన్ని జపిస్తూ వుండుట వల్ల మానసిక పరివర్తన తప్పకుండా సాధ్యమవుతుంది!

***మనసు మనిషికి ఒక దైవ వరం***
***అది మరొకందుకు శాపం కూడాను***
***మనసు భావనలను సృజిస్తుంది***
***భావనలు బుద్ధులుగా మారి ఆచరణ రూపం పొందుతాయి***
***సద్భావాలు సద్బుద్ధిని కల్గించి సదాచారణలకు పురికొల్పుతాయి***
***దురాచరణలు దుఃఖాన్నిస్తాయి    సదాచరణలు సుఖానిస్తాయి***
***తన దురాచరణలకు దుష్ఫలితాన్ని పొంది***
***తన తప్పిదాన్ని తెలుసుకొని కూడా***
***తన ఆచరణలను సరి చేసుకోలేకపోతే***
***ఆంజనేయుని పదములు వ్యర్థమవుతాయి***
***అందుకే, సద్బుద్ధి కలవారవ్వాలని,  అమరజీవులవ్వాలని ఆంజనేయుని ఆశ***
***ఆశయాన్ని అందుకుని, ఆశ్రితులై అందుకోండి ఆశీస్సులు***
***నా చిన్నారి బిడ్డలారా!***

ॐ

**13-08-2018** 10:20 AM

**20) జీవితంలో ఎదురయ్యే కష్టాలు లేక పరీక్షలను ఎదుర్కొనుటకు మేము పాటించవలసిన జాగ్రత్తలు ఏవి స్వామీ?**

*సత్యాన్వేషణలో సమస్త ప్రపంచాన్ని విస్మరించేవాడు ఒక యువకుడు. కానీ, గురువు చెప్పే విధానము, గురువు మాట చాలా తేలికగా తీసుకునేవాడు. గురువు భావాలు నచ్చేవి కావు. తాను చాలా తెలివిగలవాడినన్న ఆలోచన చాలా గొప్పగా వుండెడిది. అతని అపారప్రజ్ఞ ఆకలిబాధలను తీర్చలేకపోయింది. పైగా, అతనిలో వున్న ఆధ్యాత్మిక భావాలు కూడా దూరమయ్యాయి. గురువు యొక్క మాటలను లెఖ్ఖ చేయటానికి ఆత్మాభిమానం అడ్డు వచ్చేది. కొంత కాలం గురువుకు, భగవంతుడికి దూరమైన తర్వాత ఆ విలువ తెలిసి వచ్చింది. అప్పుడు వచ్చి గురువును మరల ఆశ్రయించాడు. గురువు ఆ శిష్యుని దోషాలు ఎంచక, దగ్గరకు చేర్చుకుని, గుడికి వెళ్ళి దైవదర్శనం చేసుకొనమని ఆజ్ఞాపించాడు. దైవదర్శనం పొందిన అతను, ప్రాపంచిక కోర్కెలు కోరలేకపోయాడు. అలా ముమ్మార్లు ప్రయత్నించాడు. రాజు (భగవంతుడు) వద్దకు వెళ్ళి రత్నాల (భక్తి, వివేక వైరాగ్యాలు) కొరకే ప్రార్థించాలే గాని, గుమ్మడికాయలు (ప్రాపంచిక అవసరాలు) కోసం ప్రార్థించకూడదనీ అతనికి బాగా తెలిసివచ్చింది. గురువుగారు అతని కుటుంబానికి కనీస అవసరాలైన అన్నవస్త్రాలకు లోటు వుండదని అనుగ్రహించాడు. స్థిమితపడిన ఆ యువకుడు భగవన్నామ గుణగానంతో సంతోషంగా తన సాధనను కొనసాగించాడు. పరమపద మార్గంలో ప్రతి ఒక్కరికీ ఇలాంటి పరీక్షలు సహజమే. మీరు ఎదుర్కొనే కష్టాలు, ఒత్తిడులు అన్నింటినీ ఆధ్యాత్మికంగా మార్చుకోవాలి. అంటే, ప్రాపంచిక బాధల బరువును పారమార్థిక బాధ్యతతో అనుసంధానం చేయాలి.*

అప్పుడు ప్రతి ప్రశ్నకూ సమాధానం లభిస్తుంది. ప్రతి సమస్య, పరిష్కరించబడుతుంది. కష్టాలు, ఒత్తిడులు సమసిపోతాయి. అప్పుడిక అనునిత్యమూ సంతోషమే. అన్నీ అధికమవుతున్న కొద్దీ అహంభావం అంధకారంగా అలుముకుంటుంది. అందరినీ అధిగమిస్తున్న కొద్దీ., అడ్డు వచ్చే వారిని అణిచివేయాలని అన్పిస్తుంటుంది. అలా ఎవరికీ అందనంత ఎత్తులో అందివచ్చిన స్వేచ్ఛ మనస్సును స్వైర విహారం చేయిస్తుంది. అణకువగా ఉండాల్సిన చోట కూడా అధికారాన్ని చెలాయిస్తుంది. అడుగులకు మడుగులు వత్తే వారినే మీకు అయినవారిగా మనస్సు భ్రమపడుతుంది. ఆత్మీయంగా అప్రమత్తం చేసే వారిని అనుమానాస్పదంగా చూస్తుంది. ఆఖరికి మీ మనుగడకు కారణమైన మూలవిరాట్టును కూడా మనస్సు మరుగుపరుస్తుంది. నేలపై నడిచినంత కాలమూ, సజావుగానే సాగుతుంది. కానీ, నేల విడిచి సాము చేసినప్పుడే, పరిస్థితి ఇలా పట్టుతప్పుతుంది. ఏది ఏ స్థాయిలో వుండాలో అది ఆ స్థాయిలోనే వుండాలి. పరిధిని మించితేనే ప్రమాదం. అందుకే అన్నీ పరిమితంగానే ఇవ్వమని, పరిస్థితులు పట్టు తప్పకుండా చూడమని ఆ విశ్వకర్తకు విన్నవించుకోండి. దేని మూలాన నిన్ను, నీ సర్వస్వమూ అనుకోగలరో, ఆ కొంచాన్ని మాత్రమే మిగిల్చి వుంచమని ప్రార్థించండి. మీ స్వేచ్ఛలో ఏ కొంచెం మూలాన మీకు నేను సమీపం కాగలనో, నన్ను మీ ప్రేమకు అర్పించుకోగలనో, అంతమాత్రం స్వేచ్ఛనే మిగల్చమని ప్రాధేయపడండి. ఏ కొద్దిమంది కారణజన్ములకో తప్ప, అత్యధికులకు భగవంతుడిచ్చే భారీ వరాలను నిభాయించుకునే శక్తి సామర్థ్యాలు సాధ్యపడవు. అందుకే పరిమిత పాత్రలున్న మీరు ఆయన అపేక్షతో అపాత్రదానం చేసినా, జీర్ణించుకోలేక అవస్థలు పడుతూ వుంటారు. పలు సంపదలు, పేరు ప్రఖ్యాతులే కాదు, పరిమితిని మించిన పరివారం కూడా మనిషిని కన్నూమిన్నూ కానకుండా చేస్తుంది. అలా అధిక బంధాలు కూడా అనర్థదాయకాలు. ఆ బహుబంధ లంపటమే, ఆ సర్వేశ్వరుడి సంకల్పానికి మిమ్మల్ని దూరం చేస్తుంది. ఆయన మీపై పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ము చేస్తుంది!

***క్షణికావేశంతో తీసుకున్న చిన్న తప్పుడు నిర్ణయం***
***జీవితం పొడవునా దహించివేస్తుంది***
***జీవితం విలువల్ని తెల్సుకోవాలి***
***ఆనందమయమైన జీవితపు బాటల్ని వేసుకోవాలి***
***జీవితం ఓ అద్దాల సౌధం***
***చిన్న పొరపాటు జరిగినా, ముక్కలైపోతుంది***
***అంతర్ శత్రువులలో ప్రధానమైనది అతి ప్రమాదమైన ఆగ్రహం***
***అందుకే కోపం మూర్ఖుల లక్షణం***
***ఆత్మీయతను దూరం చేస్తుంది***
***మనశ్శాంతిని సర్వనాశనం చేస్తుంది.***
***కావున శ్రేయోదాయకమైన శాంతి మార్గంలో పయనించి***
***వ్యక్తిత్వ వికాసంతో అడుగు ముందుకు వేసి***
***ఇక శాంతం ప్రేమామృతాన్ని కురిపిస్తున్న***

***ఈ ఆంజనేయుని ఆలింగనములో చేరి***
***అత్యుత్తమ విలువలతో మీ జన్మను ధన్యం చేసుకొని దరిచేరండి***
***నా చిన్నారి బిడ్డలారా !***

ఓం

**14-08-2018** 10:20 AM

**21) శాస్త్రం ద్వారా మేము తెలుసుకోవలసింది ఏమిటి స్వామీ?**

*మీది సహజంగానే భేదజ్ఞానం. వేరువేరుగా చూచే జ్ఞానం. ఎందుకంటే, మీరు అజ్ఞానంలో వుంటారు. కనుక నేను వేరు – నీవు వేరు, అతడు వేరు – మీ అందరికన్నా పరమాత్మ వేరు అని మీరు భావిస్తూంటారు. ఈ వేరు వేరు అనే భేదదృష్టి వల్లనే జీవభావంలో ఇరుక్కుపోతున్నారు. సంసారబంధంలో ఇరుక్కుంటున్నారు. జననమరణాల పాలవుతున్నారు. ఈ భేదదృష్టి తొలగాలంటే జ్ఞానం కావాలి. శాస్త్రం సత్యాన్ని చెబుతుంది. కేవలం చెబుతుందే గాని, అనుభూతి కల్గదు. దానికి మీ ప్రయత్నం కావాలి. సాధన చేయాలి. ఒక సభ జరుగుతుంది. ఆ పండితులవారు ఒకరిని లేపి, "మిమ్మల్ని గూర్చి వివరంగా తెలియచేయండి" అన్నారు. వారు లేచి వెంటనే, "నేను స్త్రీని, ఎర్రగా వున్నాను. ముఖాన బొట్టు పెట్టుకున్నాను. గ్రీన్ కలర్ చీర కట్టుకున్నాను. మాచింగ్ బ్లౌజు వేసుకున్నాను. కుడిచేతికి నాలుగు గాజులు వేసుకున్నాను. ఎడమచేతికి రిస్ట్‌వాచి, రెండు వేళ్ళకు రెండు వుంగరాలు, మెడలో రెండు గొలుసులు, చెవులకు జూకాలు ఉన్నాయి. నేను ఫలానావారి కుమార్తెను, ఫలానావారి కోడలును, ఫలానావారి భార్యను" అని తెలియచేస్తున్నారు. ఎందుకిదంతా? నీవు చెప్పినవన్నీ మాకు తెలిసినవే కదా, కంటితో చూస్తూనే వున్నాం కదా! చూపు సరిగా లేకపోతే చెప్పాలి గాని, సంకుచితమైన చూపు తమ కంటికి కనిపించే వరకూ చూస్తున్నారే గాని, ఉన్నదంతా చూడలేకపోతున్నారు. మీ కంటికి కనిపించినంత వరకే నిజమని అనుకుంటే ఇక శాస్త్రంతో పనేముంది? మీరు చూడలేని దాన్ని, తెలుసుకోలేని విషయాన్ని తెలియచేయటానికే శాస్త్రం వున్నది. మీకు తెలిసిన దాన్ని తెలిపితే, అది శాస్త్రం అన్పించుకోదు. తెలిసిన దాన్ని చెప్పటానికి శాస్త్రమూ అవసరం లేదు, గురువు అవసరం లేదు. ఒక గ్రామంలో ద్వైతసిద్ధాంతం బాగా తెలిసిన గురువు వున్నాడు. అతడు అందులో పండితుడే. "జీవుడు వేరు – దేవుడు వేరు. ఈ ఇద్దరూ ఒక్కరు కానే కారు, కాలేరు. భక్తుడు ఏ నాటికీ భగవంతుడు కావటం జరగదు. భక్తుడు భక్తుడే, భగవంతుడు భగవంతుడే" అంటూ ద్వైతాన్ని ప్రచారం చేస్తూ అనేక గ్రామాలు, పట్టణాలు తిరుగుతూ తన వాక్చాతుర్యంతో జనులను విపరీతంగా ఆకర్షిస్తున్నాడు. అనేక చోట్ల సన్మానాలు, బిరుదు ప్రదానాలు, బహుమానాలు పొందుతున్నాడు. అలా ఆయన సంచారం చేస్తూ చేస్తూ ఒక గ్రామం వచ్చాడు. అక్కడ అద్వైత సంఘం వున్నది. ఈ పండితుడు ఆనాడు పెద్ద సభను తీర్చి, అనర్గళంగా ఉపన్యసిస్తున్నాడు. "జీవుడు జీవుడే, దేవుడు దేవుడే. వారికెప్పుడూ భేదమే" అంటూ అద్వైత సంఘాన్ని ఛాలెంజ్ చేస్తున్నాడు. అంతలో ఆ దారిన ఒక చాకలి బట్టలమూట భుజాన వేసుకొని వస్తున్నాడు. రెండు నిముషాలు ఆ పండితుడ్ని దర్శించుకుని వెళ్దామనుకున్నాడు. ఇంతలో అద్వైత సంఘంలోని ఒక వ్యక్తి వేదిక పైకి వచ్చి*

ఆ చాకలిని పిలిచాడు. అతడు భయపడుతూ భయపడుతూ వేదిక నెక్కి, ఆ పండితునికి నమస్కారం చేసి నిలుచున్నాడు. అప్పుడా అద్వైత సంఘానికి చెందిన వ్యక్తి ఆ చాకలితో, "అయ్యా! నీవు పరబ్రహ్మానివి. పరమాత్మవు. నీవు దేవుడివి. భగవంతుడివి" అంటూ నమస్కారం చేశాడు. చాకలివాడు అదిరిపడ్డాడు. భయంతో వణికిపోతూ, "బాబయ్యా! ఎంతమాట! పాపాత్ముడనైన మానవుడ్ని నేనెక్కడ, ఆ భగవంతుడెక్కడ? అపచారం, మహాపచారం! అలా అనవద్దు" అని చెంపలు వేసుకుంటూ లబోదిబోమన్నాడు. అప్పుడా వ్యక్తి పండితుడ్ని చూస్తూ, "అయ్యా! పండితుల వారూ! తాము చెప్పేమాట మా చాకలికి కూడా తెలుసు. దేవుడు వేరు, జీవుడు వేరు అని చెప్పటానికి శాస్త్రాలతో పనేముంది, పాండిత్యంతో పనేముంది? మా చాకలి చాలును కదా. దాని కోసం తమరు ఇంత దూరం కష్టపడి రావటం ఎందుకు? కొండను త్రవ్వి ఎలుకను పట్టినట్లుగా మీరు శాస్త్రాలన్నింటినీ శోధించి తెలుసుకున్నది, మా చాకలికి తెలిసిన విషయాన్నే గదా!" అన్నాడు. పండితులవారు తమ దారిన తాము వెళ్ళాడు. సమస్త దుఃఖాల నుండి విముక్తులను చేసే మోక్షప్రాప్తిని కల్గించే అద్వైతజ్ఞానాన్ని, అఖండ జ్ఞానాన్ని తెలుసుకోవాలి. దాని కోసమే ఈ ఆంజనేయుని తాపత్రయం. గురువుగా మీ క్షేత్రాన్ని దున్నుటకై వచ్చాడు. సద్గుణాలు, సచ్ఛీలమనే గింజలను నాటుకోండి. మనిషికి ఎప్పుడూ నమ్మకం వుండాలి. అది చాలా ముఖ్యం. ఎవరి మీద, ఎవరికి, ఎందుకు, ఎప్పుడు నమ్మకం కుదురుతుందో ఎవ్వరూ చెప్పలేరు. దానిని గురించి తర్కించటం కూడా వృథా. కానీ, నమ్మకం మాత్రం అద్భుతాలను సృష్టిస్తుంది. అసాధ్యాలను సుసాధ్యంగా మారుస్తుంది. అది నిజం! మనిషికి ముందు, తన మీద తనకు నమ్మకం వుండాలి. తర్వాత దేవుడి మీద వుండాలి. మీకు ఆ నమ్మకం వున్నదా? వుంటే, ఆంజనేయుని బోధలను విని ఆచరణలో పెట్టండి!

***విజయ సోపానాలను అధిరోహిస్తూ మేరు పర్వతమై నిలచి***
***కొండంత గుండె నిబ్బరంతో వికారాల నడుమ విధ్వంసాలు సృష్టించడం కన్నా***
***ఒక ప్రోత్సాహపు పలుకు పలికి, ఒక ఆత్మీయ ఆలింగనం ద్వారా***
***అసాధ్యాన్ని సుసాధ్యం చేస్తూ ఆత్మ స్థైర్యంతో అడుగు ముందుకు వేస్తూ***
***కలల కౌముదిని సాకారం చేస్తూ కనువిప్పు కలిగించుకుని***
***వెలుగు జిలుగుల రారాజులై తనువు, మనసు భగవదర్పితం గావించి నమ్మక విశ్వాసాలతో***
***నరుడు కాని నరుడు, ఈ వానరుడు చెప్పే ఈ సుబోధలను స్మరిస్తూ***
***సన్నిధిని చేరి ఈ పవనకుమారునితో సుఖించండి***
***నా చిన్నారి బిడ్డలారా !***

ॐ

**15-08-2018** 10:28 AM

**22)** తపస్సు అంటే ఏమిటి స్వామీ? తపోమార్గములు ఏవేవి స్వామీ?

ప్రతి మనిషి తన వాళ్ళనుకున్న వాళ్ళంతా తనతో శాశ్వితంగా వుండాలి అనుకుంటాడు. అది

సాధ్యమవదని తెలిసినా, నిస్సంగబుద్ధిని అలవరచుకోడు. తనను తాను ఎడబాటుకు సిద్ధం చేసుకోడు. అందుకే తనవాళ్ళనుకున్నవారు వెళ్ళిపోయిన వెంటనే బాధలో కూరుకుపోతాడు. అనుబంధం వలన కలిగిన జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ, గతంలోకి వెళ్ళి దుఃఖించడమో, లేదా, తీపి జ్ఞాపకాలను నెమరు వేసుకుంటూ జీవితాన్ని వెళ్ళదీయడమో చేస్తాడు కానీ, మరణం జీవన నాటకం నుంచి తనను కూడా తొలగించబోతున్నదని, భగవంతుడిని ఆలంబనగా చేసుకుని జీవించడమే జీవిత ప్రయోజనమనీ అర్థం చేసుకోవడానికి ప్రయత్నించడం లేదు. ఇది మీ బలహీనత, మీ అశక్తత! ఈ అశక్తత నుండి బయటపడాలి. సంగరాహిత్యాన్ని అలవర్చుకోవాలి. దేనితోనూ పూర్తిగా మమేకం అవకుండా, కావలసినప్పుడు మనస్సును నిలిపి, అనుకున్న వెంటనే మనస్సును వ్యక్తి లేదా వస్తువు లేదా సంఘటన నుండి విడదీయగలగటమే తపస్సు. ఇది తపోభూమి. అంటే తపోధనులు వుండే దేశం. తపోధనులు అంటే తపస్సే ధనంగా కలవారని అర్థం. దానం, దయ, ధ్యానం, జపం, భగవన్నామ సంకీర్తన, పరోపకారం, సద్గ్రంథపఠనము, సత్యవాక్పాలన, ఆత్మనిగ్రహం ఇవ్వన్నీ తపోమార్గాలే, తపస్సులో భాగాలే. వీటన్నింటినీ ఎవరి శక్తి కొలది వారు అనుష్ఠించవచ్చును. ఐతే, నేడు వీటిని మీరు సంపదగా భావిస్తున్నారా? అన్నది ప్రశ్న! సంపదగా భావిస్తే, ఆచరించడం జరుగుతుంది, లేకపోతే, కేవలం ఇవ్వన్నీ పుస్తకాల్లోని పదాలుగా వుండిపోతాయి. వీటిని మీరు ఐశ్వర్యంగా పరిగణింపలేకపోవటం వలన, ఈ సాధనామయ జీవితానికి పూర్తి విరుద్ధాలైన భోగాసక్తి, ఏదో అనుభవించేయాలన్న తొందర, సమయం అయిపోతోందన్న బాధ, అనుకున్నవి సాధించలేదన్న వేదన, ఇంకొకరికి తమ కన్నా ఎక్కువ వుందన్న అక్కసు, లోభం ఇవ్వన్నీ మనిషి మనస్సులోకి చొచ్చుకుపోయాయి. అందుకే, జీవి ప్రయాణం బహు సంక్లిష్టం అయింది. జీవితానికి సంబంధించిన మీ అవగాహనే తారుమారైంది. సార్థక జీవనానికి రాచబాట వేశారు. ఆ రాచబాటను వదలి, సందుగొందుల్లో తిరగటం వలన, రాచబాట ఒకటుందని, దారి తప్పారని కూడా మరచిపోతున్నారు. బాటపైన వుంటే గమ్యం ఏదో ఒకరోజు చేరుకుంటామనుకోవడం జరుగుతుంది. మార్గాలన్నీ కోల్పోయినప్పుడు, ఇక ఆ మనిషికి సుఖమెక్కడిది? శాంతి ఎక్కడిది? భయం, సందిగ్ధం మనిషిని తినేస్తాయి. ఉత్తమోత్తమమైన ఆదర్శాన్ని తీసుకుని, ఆ ఆదర్శాన్ని ఆచరించుటకు సర్వశక్తులూ వినియోగించాలి!

## 23) అనుకరించుట మంచిది కాదని చెబుతారు కదా స్వామీ?

ఇతరులతో పోల్చుకుని విచారించడమే అసలు సమస్య. భగవంతుడు ప్రతి ఒక్కరికీ ఏదో ఒక విలక్షణతను, వైవిధ్యాన్ని ప్రసాదిస్తాడు. మీకు లేని దాన్ని గురించి విచారించడం కన్నా, మీకున్న దానితో సంతోషించడమే నేర్చుకోవలసింది. నిజానికి పరమపద మార్గంలో పోల్చుకోవలసినది, పోటీ పడవలసినది పరితాపం, వైరాగ్యంలోనూ. అంతేగాని, ప్రతిభా పాటవాలలోనో, పాండిత్యంలోనో కాదు. సాధనామార్గంలో స్వేచ్ఛను పొందే దిశగా ఎదగాలి. ఇతరులను అనుకరిస్తూ అనవసరంగా అవరోధాలను కల్పించుకోవద్దు. అప్పుడే నిత్య సంతోషంతో మనగలుగుతారు. దీనికి ఒక చిన్న కథ చెబుతాను. ఒకానొక అడవిలో ఒక కాకి తృప్తిగా జీవిస్తూ వుండేది. కానీ, అది ఒక రోజు ఒక హంసను చూచింది. "ఈ హంస ఎంత తెల్లగా, అందంగా వుంది. బహుశా ప్రపంచంలోని పక్షులన్నింటిలో ఇదే ఎక్కువ సంతోషంగా వుంటుంది

కాబోలు" అనుకుంది. తన అభిప్రాయాన్ని హంస ముందు వుంచింది. అప్పుడా హంస "నిజమే. రెండు రంగుల రామచిలుకను చూడక ముందు నేనూ అలానే అనుకున్నాను. పచ్చని ఈకలు, ఎర్రని ముక్కుతో ఉండే రామచిలుకే ఎక్కువ సంతోషంగా జీవిస్తుంది" అని పలికింది. అప్పుడా కాకి, రామచిలుక ముంగిట వాలింది. అప్పుడా చిలుక "నెమలిని చూడక ముందు నేనూ అలానే అనుకున్నాను. కానీ, రంగురంగుల నెమలిని చూచిన తర్వాత అదే ఎక్కువ సంతోషంగా జీవిస్తుందని అనుకున్నాను" అంది. కాకి వెంటనే నెమలిని కలుసుకోవటానికి జంతు ప్రదర్శనశాలకు వెళ్ళింది. వందలాది జనం దాన్ని చూడటానికి రావడం చూసి విస్తుబోయింది. వారు వెళ్ళిపోయాక, "ఓ ప్రియమైన నెమలీ! నువ్వు ఎంత అందంగా వున్నావు! నన్ను చూచినవారు ఎవరైనా వెంటనే అదలిస్తారు. కానీ, వేలాది జనం నిన్ను చూడటానికి వస్తారు. భూమిపై వున్న పక్షులన్నింటిలో ఎక్కువ సంతోషంగా వుండగలిగింది, వుండేది నీవే సుమా!" అంది. అప్పుడు నెమలి, "ఈ భూతలంలో వున్న వాటిల్లో నేనే అందంగా, ఆనందంగా వున్నానని అనుకున్నాను. కానీ, నా అందమే నన్ను బందీని చేసింది. నేను ఇక్కడంతా కలయచూశాను. కాకి ఒక్కటే జంతు ప్రదర్శనశాలలో బంధించబడని పక్షి అని తెలుసుకున్నాను. నేను కాకినైతే స్వేచ్ఛగా ఎక్కడికైనా ఎగిరి వెళ్ళగలను గదా అని కొద్ది రోజులుగా తలపోస్తున్నాను" అని పలికింది. తన అదృష్టాన్ని గుర్తించిన కాకి స్వేచ్ఛగా ఎగిరిపోయింది. మీ అదృష్టాన్ని ఎంచుకుని పరీక్షించుకోండి అని ఈ ఆంజనేయుడు చెబుతున్నాడు!

***మీ ఆలోచనల ఒరవడికి, కలల తాకిడికి మనసు ముస్తాబయ్యింది***
***తీర్చి దిద్దిన మీ మనసు మురిసింది జీవితం కావ్యనాయకైనది***
***సాగరాన అలల ఉధృతి తగ్గే వేళ, మీ ఆలోచనల వాడి తగ్గింది***
***అలసిన మీ మనసు హాయిగా నిదురోయింది***
***భానుడు తన లేలేత కిరణాలతో తడుతుంటే ఉలిక్కిపడి కళ్ళు తెరిచిన మీ ఎదురుగా***
***ఆంజనేయుని అక్షరమాలకు విరబూసిన ఆధ్యాత్మిక కుసుమాలు***
***మీ జ్ఞాపకాల కర్పించిన కుసుమాలై***
***ముక్తి సాధానికి భక్తి ద్వారాన్ని తెరచి***
***మోక్ష సౌభాగ్య జ్ఞానాన్ని అందించి***
***ఆంజనేయుని చేరు మార్గం చూపుతుంది***
***నా చిన్నారి బిడ్డలారా!***

ॐ

**16-08-2018** 10:30 AM

**24)** భగవదవతారం యొక్క ఉద్దేశ్యము ఏమిటి స్వామీ?

ఆధ్యాత్మిక సాధకులకు మార్గదర్శకత్వం చేసేటందులకే నిరాకార పరబ్రహ్మం రూపు దాల్చి,

*సాకారమవుతుంది. భక్తుల కొరకు భగవంతుడు స్వయంగా ప్రత్యక్షం అవుతాడు. అయితే, భక్తుడు భగవంతుడ్ని సాకార రూపంలో దర్శించాలని కోరుకుంటాడు. భగవంతుడు కూడా భక్తుని ప్రేమను అంతే ఆనందంగా స్వీకరిస్తాడు. ఈ రెండు కారణాల వల్ల, భగవంతుడు మానవాకృతిని దాలుస్తాడు. భగవంతునికి, భక్తుని పట్ల గల వాత్సల్యం, భక్తునికి భగవంతుని పట్ల ఉన్న ప్రేమ కలగలసి, ఒక లీలకు దోహదపడ్తుంది. భగవంతునిలో అనంతశక్తి విభూతులు, సకలైశ్వర్యాలు ఇమిడి వున్నాయి. అయితే, ఇవ్వన్నీ బాహాటంగా ప్రదర్శిస్తే భక్తులు భయభక్తులతో దూరంగా నిలచి వుంటారని, వారిలోని భయాన్ని దూరంగా నెట్టి, ఆప్యాయతానురాగాలతో దగ్గరకు చేర్చుకోవాలనే ఉద్దేశ్యంతోనే తనలోని అనంత ప్రాభవాన్నీ, ఐశ్వర్యాన్ని మరుగున పరిచి, సామాన్య మానవుని దేహం ధరించి, ఒక విధమైన లీల ప్రదర్శించేందుకే భగవంతుడు సామీప్యంగా ఒక రూపును తీసుకుని మీ ముందుకు దిగి వచ్చేది. భగవంతుడు ఒక రూపంతో ఈ లోకంలో అవతరించి తన అఖండ శక్తులను బహిర్గతం చేయకుండా, భక్తులకు ఒక సాధారణ రీతిలో, మృదువైన హృదయంతో, అపారమైన కృపతో, ఓరిమి గల్గి, చల్లని రూపంతో దర్శనమిస్తాడు!*

## 25) మనోదౌర్బల్యాన్ని ఏ విధంగా జయించాలి స్వామీ?

*మీరు ఆ శక్తిమయుని బిడ్డలు. మీరు ఈ అఖండ దివ్యాగ్నిలోని రవ్వలు. మీరు పనికిమాలిన వారు ఎలా అవుతారు? మీరు దేన్నైనా చేయగలరు. ఈ ఆత్మవిశ్వాసమే మీ హృదయాలలో ప్రకాశించాలి. అటువంటి వారిని ముందుకు తీసుకువచ్చే క్రియాశక్తి ఈ ఆత్మవిశ్వాసమే. మీకు భ్రష్టత్వం వాటిల్లితే, దోషం చేకూరితే, ఈ ఆంజనేయుని మాట గుర్తు పెట్టుకోండి! తనపై తాను విశ్వాసం పోగొట్టుకున్నట్లయితే, భగవంతుని పట్ల విశ్వాసం పోగొట్టుకోవడమే. ఈ అంతర్యామి ప్రతి పరమాణువులో వెలసి, నీ శరీరమంతటా, నీ మనస్సులో, నీ ఆత్మలో, ఓతప్రోతంగా (పడుగు పేకగా) వ్యాపించి వున్నట్లుగా నీవు విశ్వసిస్తే, ఇక అధైర్యపడటం ఎందుకు? నీవు ఒక చిన్న నీటి బుడగవు కావచ్చు, నీవు పర్వతోత్తుంగ తరంగానివీ కావచ్చు. విచారమెందులకు? ఆ అనంత సాగరం నీకు ఆధారక్షేత్రమై వుంది. మీ తత్త్వవేత్తలందరూ పవిత్రతే మీ స్వాభావమని, పూర్ణత్వమే మీ సహజ గుణమనీ అంటారు. అంతేకానీ, అపూర్ణత, మాలిన్యం మీ స్వభావం కాదు. ఒక మహర్షి ప్రాణావసాన కాలంలో, తన మహా కార్యాలన్నింటినీ, తన మహోత్తమ సంకల్పాలనన్నింటినీ జ్ఞప్తికి తెచ్చుకోమని తన మనస్సును హెచ్చరించాడట. తన దోషాలను, లోపాలను జ్ఞప్తికి తెచ్చుకోమని మనస్సుకు చెప్పలేదట. చూశారా! మనోహరమైన ఈ ఉదాహరణను ఎన్నడూ మరవకండి. లోపాలా... వుంటాయి. దుర్బలత్వమా... వుండి తీరుతుంది. అయినా, మీ యదార్థ స్వభావాన్ని నిరంతరం జ్ఞప్తిలో వుంచుకోండి. మీ దౌర్బల్యాన్ని పోగొట్టుకోవడానికి ఇది ఒక్కటే మార్గం. మీ దోషాలను నివారించుకోవటానికి ఇది ఒక్కటే త్రోవ!*

***సువిశాలమైన ఈ జీవన మార్గంలో***
***సుతిమెత్తని ఆధ్యాత్మికత అనే పాన్పుపై***
***సాయం సంధ్యలో సేదతీరిన వేళ***

***చల్లని పిల్లగాలులు అంటే***
***భగవంతుని స్పర్శ అనుభవిస్తూ వుంటే***
***మెలమెల్లగా నీలోని ఆత్మతత్త్వం ఎరుకలోకి వస్తూంటే***
***నీలోని అరిషడ్వర్గముల చప్పుళ్ళ మధ్య ఉలిక్కిపడి లేస్తూ***
***ఊపిరాడని ఉక్కపోతలతో అర్ధం కాక***
***కడుపు మండి తిట్టుకుంటూ***
***కలతనిద్ర పోవటం ఖచ్చితంగా నరకమే***
***అంతరాలకు మూలం అంతుచిక్కని రహస్యం***
***కొంత సుకృతం కొంత స్వయంకృతం అనుకుంటారు***
***ఇదీ ఊహాగానమే  వాస్తవం దైవానికెరుక***
***ఈ వానరుడు నామంతో తడచిన నరుడు***
***నావ ఎక్కమని చేయి అందిస్తున్నాడు***
***ఈ నావకు నావికుడ్ని నేనే***
***నాయకుని సన్నిధికి చేర్చుటకు చేరువలోనే యున్న***
***ఆత్మతత్త్వాన్ని ఎరిగించి,  ఈ ఆంజనేయుడు***
***అద్భుతంగా మిమ్ము ఆదుకొనుటకై***
***అంతరంగము శుద్ధి చేయు నెపమున***
***వచ్చి మిమ్ము ఆహ్వానిస్తున్నాడు***
***తన చిన్నారి బిడ్డలను !***

ఓం

**17-08-2018** 10:20 AM

**26)** భగవంతుని సాక్షాత్కారం ఎట్టిది స్వామీ?

*భగవంతుని సాక్షాత్కారం అయితే సంశయాలన్నీ పోతాయి. వినడం ఒకటి, చూడటం మరొకటి. విన్నంత మాత్రాన పదహారణాల సంపూర్ణ విశ్వాసం కలగదు. సాక్షాత్కారమైతే ఇక ఏ మాత్రమూ అపనమ్మకం వుండదు. భగవత్ సాక్షాత్కారం అన్నా భగవద్దర్శనం అన్నా, భగవంతుని పొందటం అన్నా అన్నీ ఒక్కటే. మనిషి మస్తిష్కంలో నానా సంశయాలు కలుగుతాయి. భగవంతుడున్నాడా? ఆయనను దర్శించగలమా? ఆయన సాక్షాత్కారం పిదప దుఃఖనివృత్తి అయి చిరశాంతి లభిస్తుందా? మహాపురుషులు, శాస్త్రాలు చెప్పేది నిజమేనా? అని చాలా సందేహాలు ఉద్భవిస్తాయి. మొదటి సంశయం భగవంతుడ్ని దర్శించగలమా అన్నది. ధ్యానం, అడపాదడపా ఏకాంతవాసం, అంటే నీకు నీవుగా వుండుటే గాని, శరీరాన్ని బంధించటం కాదు. ఆయన నామగుణగానం, నిత్యానిత్య విచారణ ఈ ఉపాయాలు చేపట్టాలి.*

*భగవంతుడున్నాడనే విషయం అర్థమవుతుంది. భక్తి ద్వారానే దర్శనం కలుగుతుంది. నీరు రెండు మూలకాల సమ్మేళనం అని మీ విద్యార్థి దశలో మీకు చెప్పి వుంటారు. మీరు దాన్ని అంగీకరించినా, ఎక్కడో చిన్న సందేహం కలుగుతుంది. రెండు వాయురూప పదార్థాలు కలిసి, ఎలా ద్రవంగా రూపొందుతాయి? గురువుగారు చెప్పింది నిజమేనా? అన్న సందేహానికి ఆక్సిజన్, హైడ్రోజన్ (ఆమ్లజని, ఉదజని) వాయువులు సరియైన పరిమాణంలో కలిపితే నిజంగానే నీరు ఉత్పన్నమవుతుందని తాను కనుగొన్నప్పుడు, సంశయం తీరుతుంది. మీ సంశయాలన్నింటికీ మూలకారణం అజ్ఞానం. సచ్చిదానందస్వరూప బ్రహ్మం సాక్షాత్కారమైనంతనే, అజ్ఞానం నాశనమవుతుంది. తత్ఫలితంగా సంశయాలు దూరమవుతాయి. భగవంతుని కృప కలిగితే, ఒక్క క్షణంలో అష్టపాశాలు వదులుతాయి. ఎలాగో తెలుసా? వెయ్యేళ్ళుగా చీకటిగా వున్న గదిలోకి దీపం తెస్తే ఒక్క క్షణంలో అంధకారం పటాపంచలవుతుంది. గారడీ చూచారా? ఒక తాడుకు ఎన్నో ముళ్ళు వేస్తాడు. తాడు కొస ఒకటి దేనికో కడతాడు. రెండోది పట్టుకుని ఒకటి రెండు సార్లు త్రాడును విదిలిస్తాడు. అంతే, ముడులన్నీ ఊడిపోతాయి. మరొకరు ఎంత ప్రయత్నించినా అలా చేయలేరు. భగవంతుని దయ కల్గితే, ఇక భయం లేదు. పిల్లవాడు తండ్రి చేయి పట్టుకుంటే ఇక భయం వుండదు. అలాగే ఆయన అనుగ్రహించి సందేహాలను పోగొట్టి సాక్షాత్కరిస్తే, ఇక బాధలుండవు, బంధాలుండవు. వెయ్యేళ్ళుగా చీకటిగా వున్న గదిలోకి దీపం తెచ్చే దృష్టాంతం అంటే, అనేకానేక జన్మలుగా పేరుకుపోయిన అజ్ఞానాన్ని, భగవంతుని కృప అనే జ్యోతి పటాపంచలు చేస్తుంది. కనుకనే, భగవంతుడ్ని అహేతుక కృపాసింధువు అంటారు!*

***మీ యొక్క రక్షణయే మీ తక్షణ కర్తవ్యమని తెలుసుకోండి***
***జీవకోటి మనుగడ ప్రశ్నార్థకమయ్యే లోపున***
***ముల్లోకాలను మైమరపించే రామనామంతో శుభాల నొసగి***
***మీకు జీవనాడిగా నిలిచే నామంతో***
***జీవాత్మకు పరమాత్మకు సమన్వయకర్త తరువుగా***
***రామాయణ కల్పవృక్షమై భారతానికది శమీ వృక్షమై***
***గోకులానికది వన్నె తెచ్చినదై సాహితీ వనానికి శోభకూర్చినదై***
***భూత భవిష్యత్ వర్తమాన కాలాలకు ప్రత్యక్షసాక్షిగా***
***శ్వాసకు శాశ్వత చిరునామాగా నిలచిన***
***రామనామం చేయకపోతే అనకండి... చేయక తప్పదు***
***అని ఈ ఆంజనేయుడు ఘంటాపథంగా నొక్కి నొక్కి చెబుతూ***
***సర్వ తృష్ణలూ వదిలి, వన్నె తరగని వీరాంజనేయుని చేరి***
***విధిగా ఆత్మ సామ్రాజ్యంలో కొలువై వుండండి***
***నా చిన్నారి బిడ్డలారా!***

ॐ

**18-08-2018** 10:15 AM

**27) భక్తిమార్గం యొక్క విశిష్ఠత ఏమిటి స్వామీ?**

*కొన్ని దినాలు ఏకాంత వాసం చేసి భక్తిని పొంది, ఆపైన ఎక్కడైనా వుండండి. కాళ్ళకు పాదరక్షలు వుంటే, ముళ్ళల్లో కూడా సునాయాసంగా నడవవచ్చును. ఏకాంతంలో నామజపం, భగవచ్చింతన చేయమని ఎందుకు చెబుతున్నారో తెలుసా? రేయింబవళ్ళు సంసారంలో వుంటే ఎంత అశాంతో, జానెడు భూమి కొరకు అన్నదమ్ములు ఒకరినొకరు హత్య చేసుకుంటారు. కానీ, మొక్క చుట్టూ కంచె కడతారు. లేకపోతే దానిని పశువులు, మేకలు మేస్తాయి. కానీ, ఆ మొక్క పెరిగి పెద్దదైన పిదప దానికి కంచె అక్కర్లేదు. దానికి ఏనుగును కట్టినా నష్టం వాటిల్లదు. ఏకాంతంలో సాధన చేసి, భగవంతుని పాదపద్మాల పట్ల భక్తి పెంపొందించుకున్న తర్వాత, సంసారంలో వున్నా ఫర్వాలేదు. ఏకాంతంలో భగవచ్చింతన చేయాలి. భక్తిని ప్రసాదించమని ఆవేదనతో భగవంతుడ్ని ప్రార్థించాలి. సంసారం నరకకూపమనీ, సంసారం కారడవి అని ఎందుకు భయపడటం? భగవంతుడ్ని పట్టుకొన్న వారికి ఈ సంసారం ఆనందకుటీరం. భయమెందుకు? ఆయనను పట్టుకోండి, ముళ్ళబాట అయితేనేమి? పాదరక్షలు తొడుక్కునిపొండి. దాగుడుమూతలాటలో అవ్వను ముట్టుకున్న వాడు ఇక దొంగ కానక్కరలేదు. చేతికి నూనె రాసుకుని పనసపండును ఒలిస్తే, చేతికి జిగురు అంటదు. అలాగే, భక్తి కలిగిన పిదప, సంసార బాధ్యతలు నిర్వర్తించడం వల్ల ఎలాంటి ప్రమాదమూ వుండదు. భగవల్లాభానికి అతి సులభ ఉపాయం భక్తి! భక్తి కలగటానికి ఏకాంతవాసం అత్యంత ప్రయోజనకరమైన ఉపాయం. ఏకాంతవాసం ఎందుకు? మానవుడి మనస్సు సర్వదా విషయాల పట్ల ఆకర్షితమవుతుంది. చంచలమైన మనస్సులో సాధన కుదరదు. కాబట్టి, భోగ విషయాలకు దూరంగా ఏకాంతంలో జపధ్యానాలను అభ్యసించడం ద్వారా మనోనిగ్రహం సులభమవుతుంది. అప్పుడు ఏకాగ్రచిత్తంతో భగవంతుడ్ని ప్రార్థించగలరు. ఏకాంతంలో కొన్ని క్షణాలు కూర్చుని ప్రార్థన చేసే ప్రయత్నం చేయగానే, సాధకుని అంతరాళంలో వున్న సంస్కారాలు, భావాలు పైకి వచ్చి, సాధనకు ఆటంకం కల్గిస్తాయి. అపుడు సాధకునికి తాను ఏ విధంగా సాధన చేయాలో తెలిసివస్తుంది. ఏ విషయాల పట్ల ఆసక్తి చూపాలి, వేటిని విసర్జించాలో తెలుసుకుంటాడు. అప్పుడు మనస్సే సాధకునికి గురువు అవుతుంది. భగవంతుడే కర్మఫల నాశకుడనే భావం మనస్సులో జనిస్తుంది. క్రమంగా విషయ వస్తువుల పట్ల ఆసక్తి, ఆకర్షణలు తగ్గుముఖం పడ్తాయి. అత్యంత రమణీయమైన వస్తువు సైతం భక్తుడ్ని ప్రలోభానికి గురి చేయజాలదు. కనుకనే, మొదట్లో ఏకాంతవాసం అత్యవసరం. సంసారం కంటకమయం అని అందరూ ఎరుగుదురు. పాదరక్షలు పాదాలను ముళ్ళ బాధ నుండి కాపాడినట్లు, భగవంతుని పట్ల భక్తి సంసారబాధల మూలంగా విచలితులను కాకుండా చేస్తుంది. ఈ ఆంజనేయుని మాటలు అర ఔన్సు సేవించినా సేదతీరుతారు. ఇది తథ్యము! తథ్యము! తథ్యము!*

***బ్రతుకుకు బంగారుబాట వేయుటకై***
***ఈ భజరంగభళి క్రమశిక్షణ సత్సీలములను మాతృభాషలో బోధించి***
***ప్రేమతో దరిచేర్చుకుని మీలో నిద్రాణమైయున్న, నిగూఢమైయున్న***
***మానసిక జీవ చైతన్యాన్ని జాగృతం చేస్తూ***
***జ్ఞానజ్యోతిని వెలిగించి లోక కళ్యాణాన్ని కాంక్షిస్తూ***
***కుటీరమనే ఈ ఉద్యానవనంలో***
***అనేక రకాల జీవులకు, ఆధ్యాత్మిక మనెడి నీరుపోసి***
***వికసింపచేస్తూ, విజ్ఞాన పరిమళాలు వెదజల్లుతూ***
***గురుస్థానం అమూల్యమైనది, మహోత్కృష్టమైనది, మహిమాన్వితమైనదిగా***
***మీకు గుర్తింపు కల్గించి, మీ గుండెల్లో యశోభూషణుడినై***
***కొలువు దీరిన ఈ ఆంజనేయుడు మిమ్ము దరి చేర్చుకొనుటకై***
***చేరువ అయినాడు ఈ చిన్నారి బిడ్డలకు !***

ॐ

**19-08-2018** 10:15 AM

**28)** మనస్సు ఎటువంటిది స్వామీ?

మనోవైఖరి, బాధల మధ్య ఒక దగ్గర సంబంధము వుంది. మంచి పనులకు అంకితమైన వ్యక్తులు, క్లిష్ట సమయాల్లో అద్భుతమైన తెగువను చూపిస్తారు. యుద్ధభూమి నుండి గాయాలతో మరలిన సైనికులు ఆ భయంకరమైన గాయాల తాలూకు బాధను కొంచెం కూడా లక్ష్యపెట్టరు. దేశం కోసం త్యాగం చెయ్యడం సైనికుడికి సంతృప్తిని కలిగించే అంశం. అందుచేత, గాయాలను లక్ష్యపెట్టడు. అదే ఒక సామాన్య వ్యక్తి ప్రతిస్పందన వేరే విధంగా వుంటుంది. అతనికి గాయం ఆందోళన కలిగించేదిగా వుంటుంది. ఒక సైనికుడు భయంకరమైన గాయమైనా, బాధ వున్నట్లు ఒప్పుకొడు. అదే వ్యక్తి యుద్ధబూమిలో కాక ఇంటి వద్ద వున్నప్పుడు గాయపడితే, అతను బాధను వ్యక్తం చేస్తాడు. కాబట్టి, మీ మనోవైఖరి బట్టే, బాధను అనుభవించడం, లేదా, అనుభవించకపోవడం అన్నది ఆధారపడి వుంటుంది. ఒక్కోసారి మీ భయాలే భౌతిక బాధలుగా రూపొందుతాయి. సాధారణమైన జలుబు నుండి పక్షవాతం, కళ్ళవాతం వంటి పెద్ద వ్యాధుల వరకు అన్నీ మీలో అంతర్గతంగా వున్న భయాలు, ఆత్మన్యూనత భావాల నుండే పుట్టుకువస్తాయని చెబుతాను. భగవంతుని బోధనలను మననం చేయడం ద్వారా గానీ, స్మరించడం ద్వారా గానీ, నిస్వార్థసేవ చేయడం వల్లగానీ మనసు పరిశుద్ధమవుతుంది. మీ బాధలు నివారణ అవుతాయి, మానసిక స్థైర్యం పెరుగుతుంది. మీరు మీ ఆర్థిక నష్టాలకు చాలా విచారపడుతూ వుంటారు. కానీ, మీరు ప్రతిరోజూ పనికిమాలిన ఆలోచనలతోనూ, పగటి కలలతోనూ సమయాన్ని ఎంతగా వృధా చేస్తున్నారో పట్టించుకోరు. మనస్సు యొక్క శక్తికి హద్దే లేదు. ఒక అంశంపై దానిని ఎంతగా ఏకాగ్రం చేస్తే, అది

అంతకన్నా ఎక్కువ శక్తివంతంగా అవుతుంది. అదే దాని రహస్యం. అందుచేత, శక్తివంతమైన మనసు కావాలని ఆశిస్తే, తప్పనిసరిగా ఆంతరిక ప్రక్షాళన అవసరం. ప్రతి మనిషి తన ఇచ్ఛానుసారం ప్రవర్తించడం సహజం. సుగుణాలు ఆనందానికి కారణభూతమవుతాయి. అలాగే, దుర్గుణాలు బాధకు కారణమవుతాయి. ఆత్మ, అనాత్మల ఎడల విచక్షణ కలిగి వుండటమే స్వాధిపత్యానికి సరియైన, సుగమమైన మార్గం. మీ ఆత్మతత్త్వం గురించి అవగాహన పెంపొందించుకుంటే, మనో నియంత్రణ సులభమవుతుంది. ఎవరి పాప ఫలితము వారే అనుభవిస్తారని భావిస్తే, ఇది మనిషిలో నైతిక వర్తనకు సహకరిస్తుంది. నిజానికి మీరు గ్రహించని విషయం ఒకటుంది. మనసు నిజానికి, దానంతట అది చైతన్యం కాదు, జడపదార్థమూ కాదు. నిరంతరం మనసుతో జడపదార్థాల గురించే ఆలోచింపచేస్తే, క్రమేణ మనసు కూడా బుద్ధికుశలతను కోల్పోయి మందకొడిగా, జడపదార్థంగా, తమోగుణ ప్రధానంగా తయారవుతుంది. కానీ, మీరందరూ రోజూ ఇదే చేస్తున్నారు. ఇందువలన, క్రమేపీ మనసు మొద్దుబారుతూ వుంటుంది. ఉన్నత విషయాలను ఆలోచించే శక్తి, అవగతం చేసుకునే శక్తి క్రమేణా తగ్గుపోతూ వుంటుంది. అందుకని, ఎక్కువగా ధ్యానం చేసే వారిలో, భగవన్నామాన్ని నిరంతరం ఉచ్ఛరించే వారిలో మనసు ఇలా మందకొడిగా తయారవదు. వాళ్ళు ఎప్పుడూ నిత్యనూతనంగా, చలాకీగా వుండటమే కాకుండా మనసును ఉల్లాసంగా, శక్తివంతంగా వుంచగలుగుతారు. వయోభారం వల్ల శరీరం వంగుతుందేమో గాని, మనసు మాత్రం ఉత్సాహంగా వుంటుంది. నిజానికి సత్వగుణ ప్రధానులకు ఎక్కువ ఏకాగ్రత వుంటుంది. వాళ్ళ మనసులు ఎప్పుడూ ప్రశాంతంగా వుంటాయి. వాళ్ళు కేవలం కనీస వసతులతో సంతృప్తి పడి, నిరంతరం జ్ఞానాన్వేషకులుగా వుంటారు. సంకల్పిస్తే, ఏ ప్రాపంచిక కోరికనైనా ఇట్టే పొందగలిగే శక్తియుక్తులను కలిగి వుంటారు. కానీ, వాటికై ప్రాకులాడరు. ఇక రజోగుణం ఎక్కువ గలవారు నిరంతరం తీరుబడి లేకుండా ప్రాపంచిక కోరికలను తీర్చుకోవటానికి ప్రయత్నిస్తూనే వుంటారు. ఆస్తిపాస్తులపైన, అధికారంపైన, తిండిపైన విపరిత వ్యామోహం వుంటుంది. పుణ్యకార్యాలపై, శీల సంపదను పెంచుకోవడంపై అంత ఆసక్తి వుండదు. ఇక తమోగుణం ప్రధానంగా గల వాళ్ళల్లో బద్ధకం, అలసత్వం, అశ్రద్ధ, స్పష్టత లేమి, అతి నిద్ర, నిర్దుష్ట లక్ష్యం లేకపోవుట లాంటి లక్షణాలు ప్రధానంగా కన్పిస్తాయి. నిజానికి ఈ ఏకాగ్రత తల్లిగర్భం లోనుండే ప్రారంభం అవ్వాలి. ప్రార్థనలో పుట్టినవారు సత్వగుణ సంపన్నులుగా వుంటారు. వారికి ఏకాగ్రత, సృజనాత్మకత, కార్యనిర్వహణ దక్షత వుంటాయి!

***గుండె గూటిని మీటుతూ తనువంతా తన్మయత్వంతో ప్రవహించే స్పర్శ జ్ఞానమై***
***విజయపథ సోపానమధిరోహిస్తూ కొండంత గుండె నిబ్బరంతో***
***చేతలతో అద్భుత ఆత్మను కనుగొని అసమాన ప్రతిభను ప్రదర్శిస్తూ***
***ఈ ఆంజనేయుని ఆత్మీయ ఆలింగనంలో ఆత్మస్థైర్యంతో అడుగులు వేస్తూ***
***అసాధ్యాన్ని సుసాధ్యం చేస్తూ, పరమ పవిత్రమైన పవనకుమారుని పలుకులు***
***మదిలో నిలుపుకుని, మనస్సును త్రుంచి, మాలో మమేకమై***
***ముంగిట నిల్చున్న మూర్తి మారుతిని చేరి సుఖించండి***
***నా చిన్నారి బిడ్డలారా !***

ॐ

**20-08-2018** 10:20 AM

**29) మేము ఎటువంటి దృష్టిని అలవర్చుకోవాలి స్వామీ?**

పరమాత్మ, శరీర మనో బుద్ధులలో కూర్చుని, వాటితో తాదాత్మ్యం చెంది, వాటితో వ్యవహరిస్తున్నప్పుడు, జీవుడవుతున్నాడు. వాటి నుండి తొలగి, తాను తానుగా వుంటే, పరమాత్మ అవుతున్నాడు. ఒక వ్యక్తి గుర్రమెక్కి ప్రయాణిస్తే రౌతు అవుతున్నాడు. రథాన్ని నడిపితే సారథి అవుతున్నాడు. కారు నడిపితె డ్రైవరు అవుతాడు. విమానం నడిపితే పైలట్ అవుతాడు. అన్నింటినీ వదిలి రోడ్డుపై నడుస్తుంటే, వ్యక్తిగానే మిగిలిపోతాడు. అలాగే, ఆత్మ దేహం, మనోబుద్ధులలో కూర్చుని వాటితో తాదాత్మ్యం చెందినప్పుడు జీవుడవుతున్నాడు. వాటి నుండి విడిపోయి కేవలంగా వుంటే ఆత్మయే అవుతాడు. కనుక, ముందు ఆత్మను, అనాత్మను విడగొట్టాలి. ఆ తర్వాత క్షేత్రాన్ని వదిలి తాను తానుగా, క్షేత్రజ్ఞుడిగా, ఆత్మగా వుండిపోవాలి. ఇలా ఈ రెండింటినీ విభాగించి చూచే నేర్పును కలిగి వుండాలి. నశించిపోయేది క్షేత్రం. ఆ క్షేత్రాన్ని తెలుసుకొనేవాడు క్షేత్రజ్ఞుడు. తెలుసుకోబడవలసినది ఏమేమి వున్నదో తెలుసుకుంటే గాని, తెలుసుకొనే వాని స్వరూపం, యదార్ధ స్వరూపం తెలియదు. అందుకే, తెలుసుకోబడవలసిన క్షేత్రాన్ని తరచి తరచి తెలుసుకుని క్షేత్రజ్ఞుడ్ని విడదీయాలి. అలా విడదీయాలంటే సాధకుని బుద్ధి సూక్ష్మంగా వుండాలి. అలా బుద్ధి సూక్ష్మంగా వుండాలంటే మనసు ప్రశాంతంగా వుండాలి. మనసు ఏవేవో సమస్యలతో, తీరని కోరికలతో, భయాలతో, దుఃఖాలతో సతమతమైపోతూ వుంటుంది. అందుకే పరమ లక్ష్యమైన మోక్షాన్ని పొందాలనే తీవ్ర తపన గల మోక్షార్ధి – ముముక్షువు ఈ ప్రాపంచిక విషయాలన్నీ అనిత్యమని, మిథ్యయని, అసలు యదార్ధంగా లేనివేనని దృఢ నిశ్చయం కలిగి వుండి, వాటికి ఏ మాత్రం చలించకుండా ప్రశాంతత అలవర్చుకోవాలి. అపురూపమైన మానవజన్మ మీకు లభించింది. మరల ఎటువంటి జన్మ వస్తుందో తెలియదు. మీరు రోజూ భగవద్గీతను పఠిస్తున్నాము కదా, ఉత్తమ జన్మ రాకపోతుందా అనే భరోసా పనికిరాదు. ఇక్కడ కూర్చున్నంత సేపు, రెండవ ఆలోచన లేకుండా సాత్త్విక భావనలో వుంటారు. గడప దాటగానే, ఈర్ష్య, ద్వేషం, రాగం మొదలైన లక్షణాలు బయటకు వస్తాయి. దాని వల్ల ఏం ప్రయోజనం? మీరు ఈ జన్మలో ఏమేమి ఆలోచనలు చేస్తున్నారో, ఏమేమి మాట్లాడుతున్నారో వీటిని బట్టే మీ భావి జన్మలు నిర్మితమవుతూంటాయి. కనుక, ఏ పూర్వపుణ్య విశేషం చేతనో లభించిన ఈ మానవజన్మను సార్ధకం చేసుకోవాలి. మరోజన్మ లేకుండా జన్మరాహిత్యాన్ని పొందాలి. జీవుడిగా వున్నంత కాలం జన్మలు తప్పవు. నిద్రపోతున్నంత సేపూ కలలు తప్పవు. మేలుకొంటేనే కలలు అంతమయ్యేది. అలాగే జీవభావంలో వున్నంత వరకూ కర్మఫలాలు నీతోనే వుండి, జన్మలు వస్తూనే వుంటాయి. జన్మలు లేకుండా పోవాలంటే, జీవభావం తొలగిపోవాలి. అలా జీవభావాన్ని, నేను జీవుడ్ని అనే భావాన్ని తొలగించుకుని నేను ఆత్మ అనే స్థిరనిశ్చయంతో వుండాలి. ఆత్మగా వుండిపోవాలి. జీవుడు అజ్ఞానాన్ని వదిలితే, ఉపాధులు విడిచిపెడితే దేవుడే, ఆత్మయే. ఇదే అద్వైతజ్ఞానం. ఉన్నదొక్కటే, అజ్ఞానంతో ఆ వున్నది మరొకటిగా అన్పిస్తుంది. అదే భ్రమ, అదే అజ్ఞానం. మానవుడికి అన్నీ తెలుసు కానీ, తానెవరో తెలియదు. అన్నింటినీ తెలుసుకునేందుకు ప్రయత్నిస్తాడు కానీ, తనను తాను

తెలుసుకోవటానికే తీరిక లేదు. ఇదే దౌర్భాగ్యం. తనను తాను తెలుసుకోకుండా తక్కిన అన్నింటినీ తెలుసుకోవాలని తపన పడటమే గొప్ప అజ్ఞానం. కనిపించిన ప్రతి వాడినీ నీవు ఎవరు? ఏం చేస్తున్నావు? ఎక్కడికి వెళ్తున్నావు? ఏం చదువుతున్నావు? అని విచారిస్తూంటారు. కానీ, నేను ఎవరిని? ఎక్కడ్నుంచి వచ్చాను? ఎక్కడకు వెళ్ళాలి? ఎలా వెళ్ళాలి? అని మాత్రం ఎప్పుడూ విచారణ చేయరు. విచారణ చేయవలసింది వీటి గురించే. "నేనెవరు" అనే 'నేను' ఎవరు? ప్రతిరోజూ, ప్రతిక్షణమూ ఈ నేనును వాడుకుంటూనే వుంటారు. కానీ, దాని స్వరూపం ఏమిటో తెలియదు. తెలుసుకోవాలని కూడా అనుకోరు, ప్రయత్నమూ చెయ్యరు. నేను చూస్తున్నాను, నేను వింటున్నాను, నేను చెబుతున్నాను, నేను ఆలోచిస్తున్నాను, నేను నడుస్తున్నాను, నేను కూర్చున్నాను, నేను వ్రాస్తున్నాను, నేను తింటున్నాను అంటూ ప్రతి విషయంలోనూ 'నేను' ను ఉపయోగిస్తూనే వుంటారు. ఈ 'నేను' తో కలిసినపుడే ప్రతి ఇంద్రియమూ పని చేస్తుంది. నేను అనే కరెంటు కంటితో కలిసినప్పుడే కన్ను చూడగల్గుతుంది. నేనును చెవితో చేరిస్తేనే చెవి వినగలుగుతుంది. ఇలా నేను చేరినప్పుడే ఏ అవయవమైనా పని చేస్తుంది. శరీరం కదులుతుంది. అది చేరకపోతే, ఎక్కడి దొంగలు అక్కడే గప్‌చుప్! బ్రహ్మముహూర్తంలో నిద్ర లేచి, నెమ్మదిగా కూర్చుని అన్ని ఆలోచనలు కట్టిపెట్టి, మనసు లోనికి ఎటువంటి సంకల్పాలను రానీయక, మీ హృదయం వైపు దృష్టి సారించండి. నేను,నేను అనే స్ఫురణ నీటిలో బుడగలాగా స్ఫురిస్తుంది. అది ఎక్కడి నుండి వస్తున్నదో, దాని స్వరూపమేమో విచారణ చెయ్యండి. ఈ శరీర మనోబుద్ధులకు చైతన్యాన్ని ప్రసాదించి, నడిపించిన అసలుశక్తిని గుర్తించుటలేదు. అదే ఆత్మ. అదే నిత్యం, సత్యం, శుద్ధం, బుద్ధం. దానిని గాలి కదిలించలేదు, అగ్ని మండించలేదు, నీరు తడపలేదు, కత్తి నరకలేదు. అదే నీవు! నీ యదార్ధస్వరూపము అదే!

***నేను, ఎవరు అయినా అన్నది చేశానా?***
***నేను, ఎవరు అయినా చెప్పింది చేశానా?***
***నేను, ఎవరు అయినా చేయించింది చేశానా?***
***నేను, ఎవరు అయినా అడిగింది చేశానా?***
***నేను, ఎవరు అయినా చూపించింది చేశానా?***
***నేను, ఎవరు అయినా చేయాలనుకున్నది చేశానా?***
***నేను, ఎవరు అయినా చేయకూడనిది చేశానా?***
***నేను, ఎవరు అయినా నేర్పింది చేశానా?***
***నేను, ఎవరు అయినా నేర్పనిది చేశానా?***
***నేను, ఎవరయినా సహాయం కావాలంటే చేశానా?***
***నాకోసం, ఎవరయినా సహాయం కావాలంటే చేశారా?***
***ఈ నేను ఎవరు? ఆలోచించండి!***
***మనస్ఫూర్తిగా పనిచేసిన వారు మాత్రమే జీవితంలో ఉన్నత శిఖరాలను చేరుకుంటారు***
***అన్నది ఈ చిరంజీవి మాట చిరుతప్రాయంలోనే***
***సరిదిద్దుకుని సత్ తో కలిసి సత్ చిత్ స్వరూపులుగా నిలవండి***
***నా చిన్నారి బిడ్డలారా !***

ఓం

**22-08-2018** 10:35 AM

**30) సత్యాన్ని గుర్తించేది ఎలా స్వామీ?**

*తమ బాధల్ని మరచిపోవడానికి మరొకరి మీద భారం వేసి, ఊపిరి పీల్చుకోవడానికి మనిషికి దొరికిన మహత్తర కానుక దైవం. మతం, వర్గం, కులం, ప్రాంతం ఏదైనా మనుషులు ఏదో ఒక సమయాన తమకు నచ్చిన దైవాన్ని కొలుస్తారు. మనసులోని మాటని చెప్పుకుంటారు. దైవం మీద భారం వేసి నిశ్చింతగా వుంటారు. అందువల్లనే ఒత్తిడిని అధిగమించటానికి ఉపకరించే దివ్య ఔషధంగా ప్రార్థనను తలపోస్తారు. జీవితం ఒక బంధం, ఒక పాశం. మృత్యువు ఒక్కటే ముక్తి మార్గం. ఈ మర్త్య జీవనం ఒక అశ్రుసరోవరం అని నిరుత్సాహంతో కొట్టుమిట్టాడుతారు. అదే తప్పు. మానవ ప్రయత్నం త్రికరణ శుద్ధిగా చేస్తే, ఆపై దైవానుగ్రహం కోసం ప్రార్థించాలి. భూలోక, భువర్లోక, సువర్లోక, జనలోక, తపోలోక, సత్యలోకాలు పై ఏడు లోకాలు కాగా, అతల, వితల, సుతల, తలాతల, రసాతల, మహాతల, పాతాళాలు క్రింది లోకాలుగా ఆ విరాట్ పురుషుడైన దైవాన్ని వేదాలు స్తుతిస్తూంటాయి. అందుకే, "ఇందు కలదు అందు లేదని సందేహము వలదు అని భాగవతోత్తములు పలికారు. వేదాల్ని వల్లించడము, మరణించిన పితృదేవతలకు తర్పణాన్ని అర్పించడము, దేవతలకు అగ్నిలో ఆహుతులు సమర్పించడము, మీతో కలిసి వుండే పశు, పక్ష్యాదులకు ఆహారాన్ని పెట్టడం, తోటి మానవులను సత్కరించడం అను పలు యజ్ఞాలలో, స్త్రీ పురుషులు పాల్గొనటం కూడా దైవప్రార్థన చేసిన ఫలితము సిద్ధిస్తుంది. నాదీ అనే భావంతో ఏదీ చేయకూడదు. దైవం కోసమే ధర్మం. ధర్మం కోసమే కృషి. ఈ నిస్సంగత్వం అలవాటు పడ్డాక, అద్భుతమైన ఈ రహస్యం బోధపడుతుంది. అదెలాగంటే, ఏక కాలంలోనే ప్రచండమైన కార్యరూపం ప్రశాంతమైన స్థైర్యం అవుతుందో, అనుక్షణం క్రియ, నిష్క్రియత్వం ఉన్నాయో, అవగాహన కాగలదు. ఇదే దైవప్రార్థనా మర్మం. కళ్ళతో చూడలేనిది, మనసుతో చూడవచ్చు. మనసుతో చూడలేనిది బుద్ధితో చూడవచ్చు. మీ ప్రయత్నాలు మీరు చేస్తూ వుంటే, దైవం భాగస్వామి అవుతాడు. అలా ఒకసారి మొదలుపెడితే, దైవ ప్రయత్నం యొక్క గొప్పదనం అర్థమవుతుంది. నేను అంటే దేహస్థితి కాదు, బాహ్యస్థితి కాదు. ఆది లేని, అంతం లేని ఆత్మధృతి దేహం. అంటే సప్తధాతువులు, పంచకోశాలు, వాయువులు, నాడులు, ఆత్మను కప్పి వుంచిన ఆధారాలు అధరువులు. నివురు గప్పిన నిప్పులా, లోలోన దైవశక్తి ప్రజ్వరిల్లుతుంది. అది మహా కాంతి దీపం. ఎప్పుడూ వాడని అనంత చైతన్యపుష్పం. ఉన్నతమైన ప్రదేశంలో కూర్చున్నంత మాత్రాన కాకి, గరుత్మంతునిగా గొప్పది కాలేదు. తల్లి దాస్యాన్ని అమృతాపహరణంతో పోగొట్టి, సాక్షాత్తు శ్రీహరికే వాహనంగా మారిన గరుత్మంతుడు ఎక్కడ, పురుగుల్ని, పిండాల్ని, కుళ్ళిన మాంసాన్ని తినే కాకి ఎక్కడ? అలాగే, దైవ చింతనతో శుచిగా శుభ్రంగా శరీరాన్ని మనసును వుంచుకొని పవిత్రభావనలతో ప్రార్థించాలి. జీవుడు కూడా పరమాత్మ వలె సంచారం చేసే ప్రయత్నమే చేయాలి. ప్రపంచం పరమాత్మ స్వరూపం కనుక, చీమ నుంచి బ్రహ్మం వరకూ జీవుడు ప్రేమించాలి. ఏమీ అంటని నిర్మల, విశుద్ధ ప్రేమతో దైవ ధ్యానంతో సంచరించాలి. దైవం ఒక అద్భుతం. దైవధ్యానం అంతకంటే అద్భుతం. సుఖసంతోషాలను జీవితంలో అనుభవించి ఆదర్శవ్యక్తిగా*

తనను తాను తీర్చిదిద్దుకోవాలంటే, మనిషి సదభ్యాసాలను, సత్సంబంధ బాంధవ్యాన్ని దైవలీలల సమాచారంతో ఆహ్వానించాలి. ఉదయాన్నే తాకే సూర్యరశ్మి వెచ్చదనంతో, పక్షుల కిలకిలా రావాలతో, పిల్లల కేరింతలతో, పూల సువాసనలతో, నీలాకాశంలో దూది పింజల్లాంటి మేఘాల కదలికలతో, రాత్రి వెన్నెలతో మిణుకు మిణుకు నక్షత్రాలతో, వినసొంపైన సంగీతంతో ఇలా చెప్పుకుంటూ పోతే, ఎన్నో ఆనందనందన క్షణాలు! దాహం, గాయం అందరికీ ఒక్కటే. సర్వమానవ సౌభ్రాతృత్వం అందరిలోనూ వెల్లివిరియాలి. రాగాలు పెంచుకుని, ద్వేషాలు విడనాడి, దైవచింతనతో జీవించాలి. దైవతత్త్వం పాలకడలి లాంటిది. భక్తితత్త్వమనే కవ్వంతో చిలికితే, మనోసాగరంలో చేరిన కాలుష్యాలు, వైకల్యాలు మటుమాయమైపోతాయి. భక్తుడికి దైవం తప్ప ఏదీ అవసరం లేదు. దైవం నుంచి ఏదీ ఆకాంక్షించడు. భక్తితత్త్వంలో కోరికలకు తావులేదు. భక్తుడు తన మానస సముద్రంలోని ప్రతి నీటిబొట్టులోనూ దైవాన్ని మాత్రమే చూస్తాడు. పరమాత్మకు పూర్తిగా సంపూర్ణంగా వశంకావడం వల్ల, అమృతుడవుతాడు. సత్యశోధనలో మీరు అంతరంగాన్ని శోధనకు గురిచేయవలసి వుంటుంది. సాధనతో మధించాల్సి వుంటుంది. పరమాత్మ వుండేది అక్కడే. ఆయన కోసం శోధించాల్సిందీ అక్కడే, సాధించాల్సింది కూడా అక్కడే! అంత ప్రాముఖ్యమైన అంతరాన్ని మీరు ఎంతో శ్రమల కోర్చి, సంస్కరించుకోవాలి!

***వంద కోట్లు వున్నను ఎందుకు?***
***కడుపు మించిన కూడును గతకలేవు***
***ఎందుకు, నీకున్నది ఏమి చేతువు***
***చిన్న సాయమేదైననూ చేయండి***
***చిరము తృప్తియు, కీర్తియు పెరుగును***
***మేఘం సుందరమైనను మిత్తికేమి***
***కంపుకొట్టు శవమేది ఇంపు గాదు***
***ఊపిరున్న నాడే ఉలుకు పలుకు***
***తెలియదా? నీకు జన్మమ్ము తీరు ఏమి?***
***భోగములకు పోవక, హెచ్చు రోగమ్ములు***
***రుచులు కోరిన మనిషికి రోగమొచ్చు***
***నాది నాదను మోహము నరకండి***
***తోలుతిత్తి గదా ఇది డొల్ల మేను***
***ఊపిరి వున్నంత వరకు ఊసులాడు***
***కళత్ర గడప వరకు, బిడ్డలు కాటి వరకు***
***వచ్చి పోదురు తోడుగా వచ్చునెవరు?***
***తెలుసుకోండి జీవితమంటే తెలివి తోడ***
***తెల్లవారి సూర్యోదయంతో***
***జ్ఞాన భాస్కరుడుదయించి ఇంతైన ఎంతైనా***

***ఎరుక లోనికి దెచ్చుకుని తప్పు ఒప్పులు తెలుసుకుని***
***ఈ ఆంజనేయుని పలుకులు శ్రద్ధతో ఆచరించి***
***అద్భుతమైన రీతిలో అఖండ సామ్రాజ్యాది నేతలుగా నిలవండి***
***నా చిన్నారి బిడ్డలారా!***

ఓం

**23-08-2018** 07:15 PM

**31) వర్తమానంలో ఉంటూ తృప్తిగా ఉండుటకు మేము ఏమి చేయాలి స్వామీ?**

*అడవిలో సింహం తనకు ఆకలైనప్పుడు మాత్రమే వేటకు బయలుదేరుతుంది. దొరికిన జంతువును తిని తన ఆకలి చల్లార్చుకున్న తర్వాత, మళ్ళీ ఆకలి అయ్యే దాకా ఇంకో జంతువు దానికి గుర్తు రాదు. గుహలో విరామాన్ని ఆస్వాదిస్తుంది. "నేను తీరుబడి లేకుండా వున్నాను" అని మాత్రం బోర్డు పెట్టదు. రేపటి ఆలోచన, అంటే రేపు తనకు మళ్ళీ ఆహారం దొరుకుతుందో లేదో అన్న సంశయంతో మరో జంతువును చంపి, మరుసటి రోజుకు దాచుకోదు. మరి మానవుని సంగతి ఏమిటి? ఇక రేపటి రోజు గురించే ఆలోచించని జీవికి వార్ధక్యంలో ఎలా జీవించాలి? ఏ బ్యాంకులో డిపాజిట్లు పెట్టుకోవాలి? పింఛను ఎలా వస్తుంది? ఇలాంటి ఆలోచనలే వుండవు. ఆ జీవి సదా వర్తమానంలో వుంటాడు. గంభీరంగా వుంటాడు. ప్రశాంతతను అనుభవిస్తాడు. భగవంతుని మీద పూర్తి విశ్వాసమున్న జీవిలాగా జీవిస్తాడు. నన్ను సృష్టించిన నా తండ్రికి నా ఆకలి తీర్చడం ప్రధమ కర్తవ్యం అన్న ధీమాను ఒలకబోస్తాడు. ఒక విధంగా చూస్తే, మనిషి కన్నా నిబ్బరంగా జీవితాన్ని గడుపుతుంది సింహం. సింహమే కాదు, మిగతా జీవులకు వేటికీ, రేపటి గురించి ఆలోచన, ఆదుర్దా వుండదు. వర్తమానాన్ని విస్మరించి నిరంతరం గతంలోనో, భవిష్యత్తులోనో జీవించే మనిషి మనసు లాంటి చిత్రమైన మనసు వాటికి లేదు. అందుకని, మనిషి కన్నా ఎక్కువ ప్రశాంతతను పొందుతున్నాయి. మీకన్నా వాటికే భగవంతుని మీద ఎక్కువ నమ్మకమున్నదనిపిస్తుంది. మనిషి జీవులన్నింటిలోకీ సర్వోత్కృష్ట జీవి అని పేర్కొంటారు. మరి జంతువుల కన్నా మీరు ఏ విధంగా ఉన్నతులవుతున్నారు? వాటి కన్నా మీకే భయాలు ఎక్కువ వున్నాయి కదా! సంసార సముద్రంలో మీరు ఎలా ఈ జీవననౌకను నడపాలి అని అన్నది ప్రశ్న కావచ్చు. సర్వం ఏదో భయంతో కూడుకున్న ఈ ప్రపంచాన్ని పట్టుకుని వుండటం అవివేకమని మీకు ఇప్పుడు అర్థమైందా? ఐతే, అందరికీ తీవ్రమైన వైరాగ్యం కలగటం అంత తేలిక కాదు కాబట్టి, రెండో మార్గంగా మీరు భగవంతుని ఆలంబనగా చేసుకొని జీవితాన్ని గడపటం నేర్చుకోవాలి. మీరు ఏ ప్రయత్నం చేసినా ఆయనను ఉపకరణంగా భావిస్తూ చేయాలి. మీరు సాధించిన ప్రతి విజయం వెనుక, దైవానుగ్రహం వుందని భావించాలి. అంతా స్వీయకృషితోనే సాధించామని విర్రవీగకూడదు. జయాపజయాలను సమంగా స్వీకరించాలి. ఏది కలిగినా, ఏది జరిగినా మీ మంచికే అని తెలుసుకోవాలి. భగవంతుడు మీకు ఇచ్చినది గొప్ప సంపదైనా, కొద్దిదిగానే భావించి మీరు ఇచ్చేవి స్వల్పమైనా, అల్పమైనదైనా మహాదక్షిణగా లెక్క వేస్తారు. భగవంతుడికి మానవుడిపై అంత ప్రేమ వుంటుంది. కానీ, విశ్వాసం లేనప్పుడు మీరు*

*దైవాలంబనగా జీవించడం నేర్చుకోరు. మీకు జీవనకళ అబ్బదు. జీవనకళ అంటే ప్రతి వ్యక్తి తనను తాను భగవంతుడి పనిముట్టుగా భావించుకుంటూ తన విద్యుక్త ధర్మములను చేసుకుంటూపోవడమే. ఒక సన్యాసిని ఒక భక్తుడు, "మనిషికీ, భగవంతుడికీ మధ్య సంబంధం ఏమిటి?" అని అడిగాడు. ఆయన, "మనిషి (నేను అన్న అహం) ఉన్నంత సేపు భగవంతుడు లేడు – భగవంతుడున్న చోట మనిషి లేడు" అంటాడు. అంటే అర్థం, ఈ ప్రపంచం మొత్తంలో నిరంతరం ఒకే సంకల్పం అభివ్యక్తమవుతుంది. అదే దైవ సంకల్పం. కానీ, మనిషి అహంభావం వలన, "నా వలన జరుగుతుంది" అనుకుంటాడు, ప్రమాదంలో పడతాడు. తన వ్యక్తిగత ఇష్టాయిష్టాలను ప్రక్కన పెట్టి, అంతా భగవదిచ్ఛకు సమర్పించాలి. నిరంతరం సులక్ష్యాలను కలిగి, తనను తాను సత్ప్రయత్నంతో నియోగించుకుంటూ ఫలితాలు అనుకూలంగా వున్నా అననుకూలంగా వున్నా ఒకే రకంగా స్పందించడం నేర్చుకోవాలి. అదే మనిషి జీవితంలో నేర్చుకోవాల్సిన అసలు పాఠం. అప్పుడే జీవితంలో నిజమైన శాంతి, ప్రశాంతత కలుగుతాయి!*

***వర్తమానంలోని విషాదాన్ని హృదయ కుహరంలో దాచుకుని***
***పెదాలపై చిరునవ్వుల్ని పులుముకుని***
***గతంలోని అనుభూతుల్ని మననం చేసుకుంటూ***
***బ్రతుకును భారంగా మోస్తూ***
***గుండెను గుప్పెట్లో పెట్టుకుని***
***అంతరంగంలోని నిర్లిప్తతను మనసు పొరలలో భద్రపరుచుకుని***
***నీవు తెలుసుకున్న వాస్తవాన్ని, జీవిత సత్యాన్ని పదిమందికీ ఎరుకపరచి***
***మీతోపాటే వున్న ఈ అంజనీసుతుని గుర్తించి***
***నిరంతరం మిమ్మల్ని వెన్నంటి వుంటాడన్న నమ్మకం వృద్ధి చేసుకుని***
***అడుగులు కలిపి ఆంజనేయునితో***
***అతి సన్నిహితంగా చేరండి***
***నా చిన్నారి బిడ్డలారా!***

ॐ

**24-08-2018** 10:20 AM

**32) మేము ఎటువంటి శౌచం కలిగియుండాలి స్వామీ?**

*శౌచమంటే బాహ్యాంతర పరిశుద్ధి. అంటే శారీరకంగా, మానసికంగా పరిశుద్ధంగా, పవిత్రంగా వుండటం. శారీరకంగా పరిశుద్ధంగా వుండటం కూడా అత్యంత ముఖ్యమైన విషయమే. సమాజానికి దూరంగా, ఏకాకిగా జీవిస్తే ఈ విషయానికి అంత ప్రాధాన్యత లేదేమో కానీ, మానవుడు సంఘజీవి. కాబట్టి, ఇతరుల దృక్కోణం నుండి పరిశీలించినపుడు, మీరు ఎలా జీవిస్తున్నారనేది అత్యంత ముఖ్యమైనది. పరిశుద్ధత అంటే ఖరీదైన వేషభూషణాలు కాదు. సాధారణమైన దుస్తులు, అలంకారాలు వున్నప్పటికీ,*

*అవి పరిశుభ్రంగా, పొందికగా వుండాలి. ఈ బాహ్య పరిశుభ్రత అనేది ఒక అలవాటుగా రూపుదిద్దుకోవాలి. నీవు ఏమి కలిగి వున్నావనేది ముఖ్యం కాదు. నీవద్ద ఏవో కొన్ని వస్తువులే వుండవచ్చు. కానీ, అవి పరిశుభ్రంగా వుంటే చాలు. ఎందుకంటే, అవే నీ మానసికస్థితిని ప్రతిబింబించేవి. ఒక మంచి ఆలోచనను అంకురంగా వేస్తే, ఒక చక్కని చర్య పుష్పిస్తుంది. ఈ చర్య అనే పుష్పాన్ని ఫలించనిస్తే, అంటే, మంచి పనులు పునరావృతమైతే, అలవాటు అనే ఫలం పక్వానికి వస్తుంది. ఈ అలవాటు అనే ఫలాన్ని ఆస్వాదించగలిగితే, అదే సత్శీలాన్ని పెంపొందిస్తుంది. జీవితపు మొదటి భాగంలో మీరు మీ అలవాట్లను తయారుచేసుకుంటారు. జీవితపు చివరి భాగంలో మీ అలవాట్ల చేత మీరు ఈ ప్రపంచానికి తెలియబడతారు. ఆధ్యాత్మికంగా పురోగమించిన వారిలో పరిసరాల స్పృహ కొరవడటం వల్ల వారు బాహ్యశౌచాన్ని విస్మరిస్తారు. కానీ, సాధన ప్రారంభదశలో వున్నవారు వారిని ఆదర్శంగా తీసుకుని అనుసరిస్తే, వారి ఆధ్యాత్మిక పురోభివృద్ధి కుంటుపడుతుంది!*

**33) ప్రశాంతత ఎలా లభిస్తుంది స్వామీ?**

*మీరు పాటించవలసిన నియమాలలో ఒకటి సంతోషం. ఉన్న వాటితో సంతుష్టినొందటం, సంతృప్తిగా జీవించడం. అప్పుడే అంతరంగంలో ప్రశాంతత నెలకొంటుంది. మనస్సు అనేక విషయాల చుట్టూ పరిభ్రమిస్తూంటే, లెక్కకు మించిన వ్యాపకాలతో తలమునకలై వుంటే, ప్రశాంతత ఎలా లభిస్తుంది? ఉన్నత ఆధ్యాత్మిక విలువలను సముపార్జించాలంటే, సంతృప్తి అనేది ఆవశ్యకం. సంతృప్తి చెందని మనస్సును ఉన్నత భూమికలకు కొనిపోయినప్పటికీ, అది తిరిగి అధఃపాతాళానికి పడిపోతుంది. స్థిమితపడని మనస్సు తృప్తి లేక, అటూ ఇటూ పరుగెడుతుంది. అందుకే, "కొంచెముండుటెల్ల కొదువకాదు". మీకున్న కొన్ని వస్తువులతోనే సర్దుకుపోతే, మనస్సుకు ప్రశాంతత, ఏకాగ్రత లభిస్తాయి. నేటి రోజుల్లో ఇంగ్లీషు నేర్చుకోవడానికి ఒక కోర్సు, భావవ్యక్తీకరణకు మరో కోర్సు మొదలై, చివరకు పిల్లల పెంపకంలో మెలకువలకు కూడా కోర్సులలో చేరడం అలవాటుగా మారిపోయింది. ప్రశాంతంగా జీవించడానికి కూడా కోర్సులు కావాలా? మీ పూర్వీకులు నిరాడంబరంగా జీవించినప్పటికీ, సంతృప్తితో జీవనం గడిపి, అర్థవంతంగా జీవితాలను ముగించేవారు. సంతోషంగా జీవించటానికి సవాలక్ష దారులు లేవని, సంతోషంగా జీవించడమే చక్కని రహదారి అని, సంతృప్తిని అలవర్చుకుంటేనే అవగతమవుతుంది. నేటి సూపర్‌మార్కెట్‌లలో నిత్యావసర వస్తువులు మొదలుకుని, అధునాతన సాంకేతిక పరికరాల వరకూ వివిధ బ్రాండ్‌లకు చెందిన ఎన్నో నూతన వస్తువులు చాలా వెరైటీలలో లభ్యమవుతున్నాయి. కంప్యూటర్‌లకు అదనపు మెమరీ చిప్‌లు, అదనపు హార్డ్‌డిస్క్‌లు కొనగలరేమో గాని, మీ తలలో మరో మెదడును ఇంకా సృష్టించలేదు, సృష్టించలేరు. మనస్సు యొక్క స్థితి, ప్రాపంచిక, ఆధ్యాత్మిక జీవితానికి ఆధారం. అందుకే, సంతోషమనే లక్షణాన్ని మానవాళికి మహోపకారం చేద్దామనే ఉద్దేశంతోనే ఈ ఆంజనేయుడు మీకు చెప్పుట జరిగింది!*

***వేళ కాని వేళలలో లేనిపోని వాంఛలతో***
***దారి కాని దారులలో కాసరాని కాంక్షలతో***
***దేని కొరకు ప్రాకులాడుతారు? బ్రతుకు వృధా***
***చదువు వృధా త్రికాలాలలో త్రిలోకాలలో***

***స్వస్తి వాక్యములు సంధానిస్తూ   నిత్యమంగళాన్ని కాంక్షిస్తూ***
***అనురాగపు టంచులు చూస్తూ***
***ఆనందపు లోతులు చూస్తూ   కాలానికి కళ్ళెం వేస్తూ***
***భక్తికి గొళ్ళెం తీస్తూ   అనితర సాధ్యమైన***
***ఆంజనేయుని రాజ్యంలోకి ప్రవేశించి***
***ఆంజనేయునికి అతిసన్నిహితులై***
***హితోక్తులను  ఆశీర్వచనములుగా  స్వీకరించి***
***విశ్వాసంతో మీ జన్మను ధన్యం చేసుకోండి***
***నా చిన్నారి బిడ్డలారా !***

ॐ

**25-08-2018** 10:15 AM

**34) మేము ఎదుర్కొనే పరీక్షలకు లేక సమస్యలకు పరిష్కారం ఏమిటి స్వామీ?**

మీరు మీ కర్తవ్యాన్ని మరచి ఎంతో కరుణ స్వరూపులుగా, విరాగిలా, జ్ఞానవంతునిలా ప్రవర్తిస్తున్నారు. మీ యొక్క బాల్య చేష్టల్ని ఎంతో సహనంతో భరించి, మీ తప్పులను గుర్తు చేశాను. మీరు మీ తప్పులను తెలుసుకుని, సరియైన మార్గాన్ని చూపించమని ప్రాధేయపడినా పడకపోయినా ఈ ఆంజనేయుడు మీ జీవిత సారధ్యాన్ని వహించుటకు సిద్ధపడినాడు. నేనేమి మిమ్మల్ని బాధాయుత జీవితం జీవించమని కోరుట లేదు. మీరు అన్నీ వదిలేసి సర్వసంగ పరిత్యాగులు కానక్కరలేదు. మీలో భయం, ఆందోళన, నిరాశ, చపలత్వం, మోహం వంటి బలహీనతలు పొడసూపకూడదని భావిస్తున్నాను. కేవలం మీ కర్తవ్య నిర్వహణకు ప్రేరణదాయకమైన బోధలు సల్ప వచ్చిన కారణం. ఇంతకీ మీ సమస్య ఏమిటి? భయం, నిరాశ, అలజడి, ఒత్తిడి, మోహం ఇవ్వన్నీ మీ అందరి సమస్యలు. మీ సమస్యలకు కారణం నేను, నాది అనే భావం. మీ జీవితాల్లో ప్రతి నిత్యం జరిగే సంఘటనల వల్ల మీరు ప్రతిస్పందించే తీరును ఒక్కసారి ఆలోచిస్తే, మీ పరిస్థితి ఏమిటో అర్థమవుతుంది. పక్కింట్లో ఎవరైనా చనిపోతే అయ్యో పాపం అనేసి మీరు హాయిగా భోజనం చేసి నిద్రపోతారు. అదే మీ ఇంట్లో ఎవరైనా చనిపోతే నిద్రాహారాలు మాని విలపిస్తారు. అలాగే పక్కింట్లో లక్షల ఖరీదు చేసే నగలు పోతే స్థితప్రజ్ఞునిలా నిశ్శబ్దంగా వుంటారు. అదే మీ ఇంట్లో ఒక గుండుసూది పోతే ప్రక్కింటి వారిని నిద్రపోనివ్వరు. మీలో ఈ పక్షపాత వైఖరికి కారణం మమకారమనే సంకెళ్ళలో బందీ కావడమే. నా సోదరులు, నా బంధువులు, నా స్నేహితులు, నా భర్త, నా బిడ్డలు వీరంతా ఏదో ఒక సమయంలో దూరమైపోయేవారే అన్న ఆలోచన మీలో వైరాగ్యాన్ని జనియింపచేస్తుంది. నిజమైన ప్రేమ, దయ, కరుణ అయినట్లయితే, అందరి మీద, అందరి కోసం విలపించాలి. మీ దుఃఖానికి, అసహనానికి కారణం నావాళ్ళు అనే మమకారమే. పరాయివారు ఎవరూ లేరు. బాల్యం, యవ్వనం, వార్ధక్యం ఈ మార్పులన్నీ మీకు తెలుస్తున్నాయి కాబట్టి, దుఃఖం లేదు. కానీ, మరణం తర్వాత ఏమి జరుగుతుందో తెలియదు కాబట్టి, మరణమంటే మీకు భయం కలుగుతుంది.

అందుకే చిరిగిన వస్త్రాన్ని వదిలి క్రొత్త వస్త్రాన్ని ధరించినట్లు, మరణం తర్వాత ఆత్మ మరో దేహాన్ని ధరిస్తుందని గ్రహించనవారే ధీరులు. కావున, మోహపాశాన్ని విడనాడండి. ఒక జ్ఞానిని కొంతమంది "మీరు చనిపోయిన తర్వాత మీకు అంతిమ సంస్కారాలు ఎలా చేయాలి?" అని ప్రశ్నించారు. అప్పుడు ఆయన, "అసలైన నేను (ఆత్మ) మీకు దొరకదు. మీరనుకున్న ఈ నేను (దేహం)కు అంతిమ సంస్కారాలు అందరికీ చేసినట్లే చేయండి" అని నవ్వుతూ బదులిచ్చాడు. ఈ దేహం శాశ్వతం కాదని గుర్తెరిగి వ్యవహరిస్తే, మీ సమస్యలన్నీ పరిష్కారమవుతాయి. నిజానికి మీలోని అసూయాద్వేషాలకు, అహంకార మమకారాలకు, లోభమోహాలకు, కోపావేశాలకు, పంతాలు పట్టింపులకూ, భయాందోళనలకు ముఖ్యకారణం ఈ భూమ్మీద మీ జీవితం మూన్నాళ్ళ ముచ్చటేనని మరచిపోవడమే!

***గంటలు గంటలు గంటలు గణ గణ గంటలు***
***మీ హృదయంలో నా హృదయంలో***
***దేవుని గుడిలో, బడిలో, మదిలో మ్రోగే గంటలు***
***నిజంగానే నిజంగానే ఉత్తేజపరుస్తూ***
***సతుల్ సుతుల్ హితుల్ రానీ రానీ వస్తే రానీ***
***అనే వైరాగ్య శిఖరాలను అధిరోహించి***
***స్వప్నాలను తొలగించుకుని ఆధ్యాత్మిక బాటలో నడచి***
***రసవత్తరంబగు రసరమ్య దృష్టితో***
***రక్షకుడై నిలచిన రామబంటు హనుమను చేరి***
***ఉల్లములు ఝల్లనగా అసమాన ప్రతిభను చూపి***
***అచంచల ఆత్మవిశ్వాసంతో అంజనీపుత్రుని చేరి***
***ధీటుగా ధరణిపై నిలవండి***
***నా చిన్నారి బిడ్డలారా !***

ॐ

**26-08-2018** 10:55 AM

**35)** సంకల్పశక్తి యొక్క విశిష్ఠత ఏమిటి స్వామీ?

అనేక రకాల సంకల్పాల్ని చేసుకుని "జనవరి ఒకటి నుండి మొదలుపెట్టాలి" అనుకుంటారు. మొదలుపెడతారు కూడా. ఆ సంకల్పాలు ఫిబ్రవరి నెల చూడకుండానే మాయమైనప్పుడు "మనసు గతి ఇంతే!" అనుకుంటూ సర్దుకుపోతారు. అసలు మీ సంకల్పాలకు బలం ఎక్కడ వుంది? ఎక్కడి నుండి వస్తుంది? ఒకసారి ఆలోచించండి. సంకల్పం అనేది కోరిక నుండి పుడ్తుంది. ఆ కోరిక యొక్క తీవ్రత ఇచ్ఛాశక్తి. దీనినే విల్ పవర్ అంటారు. ఈ ఇచ్ఛాశక్తి వల్లనే సంకల్పం సిద్ధిస్తుంది. మనిషి తన కోరిక తీరకపోతే, మానసిక ఆందోళనకు గురి అవుతాడు. ఇచ్ఛాశక్తి, మానసిక ఆందోళన ఈ రెండూ ఉత్తర-దక్షిణ ధ్రువాలు. పొగత్రాగటం అలవాటున్న వ్యక్తి, "నేను ఇక నుండి సిగరెట్టు త్రాగను" అని తీర్మానించుకుంటాడు.

కానీ, దాన్ని అమలు చెయ్యలేకపోతాడు. కారణం అతని సంకల్పంలో విల్ పవర్ లేదు. అందులో ఉన్నది కేవలం 'వోన్ట్ పవర్' (నకారాత్మక శక్తి). విల్ పవర్ మనసుకు సంబంధించింది. శరీరానికి కావలసిన విశ్రాంతి, పౌష్టికాహారం అందకపోతే, దాని వల్ల విల్ పవర్ దెబ్బతింటుంది. విల్ పవర్ పెరగాలంటే శరీరానికి వ్యాయామం, మనసుకు ధ్యానం అవసరం. అలాగే, రోజూ వ్యాయామం, ధ్యానం చేయాలి అనే సంకల్పం ఎలా సిద్ధిస్తుంది అని మీరు అడగవచ్చు. ఇది నా సమాధానం. మీరు దుర్బలురము అని ఎన్నడూ అనకండి. మీరు చేయలేనిది ఏమిటి? మీరు సమస్తం చేయగలరు. మీ అందరిలో ఆ దివ్యాత్మ కలదు. ఆ ఆత్మశక్తి యందు నమ్మకం కలిగి వుండండి. మీ ఆత్మశక్తి యందు విశ్వాసం వుంచి ప్రయత్నిస్తే, మీ సంకల్పం తప్పక సిద్ధిస్తుంది. ఏ దారిన శిఖరాన్ని చేరినా తర్వాత మిగిలిన మార్గాలన్నీ అర్ధమవుతాయి. ఏది చెప్పినా అంతా మాకు తెలుసు అనే అహంకారం తగ్గనంత వరకూ, మీరు సాధకులుగా మారలేరు. ఎవరికి వారే పరిపూర్ణులమనుకుంటారు. ఎదుటి వ్యక్తిని శక్తిమంతుడేనా, వీనికి ఆధ్యాత్మికంగా ఎదుగుదల ఎంత వరకు వున్నది, లేని దానిని వున్నదేమో అని నేను భ్రమిస్తున్నానా? అని పరీక్షించే కుతూహలం మీకున్నట్లయితే, మీరు అసలు సాధకులుగా మీకు అర్హత వున్నదా? అన్న విచక్షణ కరువైనప్పుడు, తాను పరిపూర్ణుడనని అనుకోవడం అవివేకము, అహంకారమునకు చిహ్నము. మీరు ఈ రోజుల్లో విలువలను పాటించుట లేదు. ఏదో ఒక నెపంతో విలువలకు తిలోదకాలిస్తూ, చేసే తప్పుడు పనులకు సమర్ధనలు వెతుక్కుంటూ, మంచికి కాలం లేదని అవకాశవాదులుగా మారిపోతూ, మరో వైపు దెబ్బకు దెబ్బ తీయాలని తహతహలాడుతూంటారు. కానీ, పరిస్థితులు ఎంత ప్రలోభపెట్టినా సత్యానికి, ధర్మానికి కట్టుబడే వుండాలి. మనసంతా స్వార్ధపూరితంగా మారిపోయి, సంపూర్ణంగా ధర్మాన్ని అనుష్టించకపోయినా, కొంతైనా అనుసరించగలిగితే, ఈ పుణ్యభూమిలో పుట్టినందులకు సార్ధకతను చేకూర్చిన వారవుతారు!

***అంతరంగ శుద్ధి లేనిదే ప్రకాశించదు బుద్ధి***
***వైరాగ్యమనేది జ్ఞానంలో ఒక భాగం***
***సర్వాంతర్యామి దేవుడు సత్యం తెలియని నరుడు***
***దేహమొక పరికరం ఆత్మ దానికి చైతన్యం అని***
***అనుభవించని వాడి బ్రతుకు తీరు ఆవేదన***
***ఆత్మావలోకం ముద్దు భౌతికవాదం వద్దు అంటూ***
***ముక్తి సాధానికి భక్తి మార్గమని మోక్షానికి జ్ఞానమే మార్గమని***
***తెలుసుకుని అంతరంగ శక్తితో అనుభవించేది ముక్తి అని ఎరిగి***
***ఆచరణకు ఆమోదం చుట్టి***
***ఆంజనేయుడు చెప్పిన ధ్యానం అనే ఆధ్యాత్మిక ప్రపంచంలో అడుగిడి***
***ప్రేమించుట యోగ్యతగా కల్గి సేవించుటలోని ధన్యత రుచి చూచి***
***సాధుజీవనంతో నా దరి చేరండి***
***నా చిన్నారి బిడ్డలారా!***

ఓం

**27-08-2018** 10:25 AM

**36) జన్మరాహిత్యాన్ని ఎలా సాధించాలి స్వామీ?**

*ఆత్మకు హితం కల్గించే కర్మలపై శ్రద్ధ లేకుండా, కేవలం కుటుంబ వ్యవహారాలు, వ్యక్తిగత వ్యసనాలపైనే ఆసక్తి పెంచుకుంటూ వుంటే, వార్ధక్యం అనేది సమీపించినప్పుడు ఏమీ చేయలేని నిస్సహాయతలో మునిగిపోతారు. అప్పుడు మీరు విజ్ఞతతో ఆలోచించగలిగినట్లయితే, ఈ దేహాలన్నీ ఆత్మ ధరించే వివిధ రకాల దుస్తులేనని తెలుసుకుంటారు. అందరూ ఆత్మస్వరూపంలో పరిశుద్ధులైన పరమహంసలేనని తెలుస్తుంది. మనస్సే మరుజన్మకు కారణం. కర్మవశాన అవిద్య కల్గుతుంది. అవిద్య చేత దేహానికి కర్మబంధం తగులుకుంటుంది. ఈ కర్మబంధం వల్ల బహుజన్మలను పొందక తప్పదు. ఇలా మీ మనసులోని పూర్వజన్మల వాసనల వల్లే మీకు ఈ జన్మ లభించింది. ఈ జన్మలో మీ మనోవాంఛల వల్లే, మరుజన్మ నిర్ధారణ అవుతుంది. ఆశలు, ఆలోచనలను బట్టే, ఆగామి జన్మలు. మనసులో ఏ వాసనలు వుంటే, వాటికి అనుగుణమైన శరీరం ఉత్పన్నమవుతుంది. ఈ ప్రపంచంపై మీరు పెంచుకుంటున్న మితిమీరిన మమకారాల వల్ల మీ జన్మపరంపరలు కూడా పునరావృతం చేస్తాయి. బాహ్యంగా ఎంతో నిస్సంగత్వంగా జీవిస్తున్నామనుకునేవారి మనసులో కూడా తెలియకుండగనే ఏ వ్యక్తిపైనో, ఏ వస్తువుపైనో అనురక్తిని కలిగి వుంటారు. విషయవాంఛల్లో తెలియాడుతూ వుంటారు. వ్యక్తుల పైన గాని, వస్తువుల పైన గాని, ఆస్తుల పైన గాని, బంధుత్వాల పైన గాని విపరీతమైన మోహాన్ని పెంచుకోవద్దు. ప్రకృతి ఎప్పుడో ఒకప్పుడు ఆ వ్యక్తుల్ని, ఆ వస్తువుల్ని నిర్దాక్షిణ్యంగా దూరం చేస్తుంది. ఫలితంగా ఆ హఠాత్ పరిణామానికి తీవ్రంగా కృంగిపోవాల్సి వస్తుంది. అందుకే మిమ్మల్ని ఏకాంతం పేరిట ఇచట ఒంటరిగా వుంచినది. మర్మము తెలియని మీరు బంధాల వైపు మొగ్గు చూపితే, సాధించుకున్నది చేజార్చుకున్నట్లే అని హెచ్చరిస్తున్నాను. అందుకే మీకు మీరే ఏకాంతం పేరిట ఆ లంపటాల నుండి ఎడబాటును కల్పించుకోవాలి. బంధాల్లో, బంధనాల్లో చిక్కుకోకుండా జాగ్రత్తపడాలి. అధ్యయనంతో, ఆధ్యాత్మికతతో, సాధనతో మీకు మీరు ఆత్మాన్వేషణలో నిమగ్నమవ్వాలి. ఆజన్మాంతమూ మానవ సంబంధాల్లోనే మునిగిపోతే, ఎంత ప్రమాదమో మీకు సూచించాను. ఆకలి బాధతో శునకం ఇంటింటికీ తిరిగి, దైవీకంగా కర్రదెబ్బలనో, దొంగ కూడునో తిన్నట్లు, జీవుడు దైవీకంగా ప్రాప్తించిన ప్రియాప్రియాలను మూడు లోకాల్లోనూ అనుభవిస్తాడు. స్వాత్త్విక కర్మల వల్ల ప్రకాశవంతమైన లోకాలలోనూ, రాజసిక కర్మల వల్ల బాధామయమైన లోకాలను, తామస కర్మల వల్ల శోకమోహాలతో కూడిన లోకాలను పొందుతాడు. ఒక స్వామీజీ ప్రసంగిస్తూ, ప్రసంగంలో భాగంగా సుఖం, దుఃఖమనే ముళ్ళ కిరీటాన్ని పెట్టుకుని వస్తుందని, అందుకే కష్టాలకు కారణమయ్యే భోగాలకు దూరంగా వుండాలని సూచించారు. వెంటనే ఓ యువకుడు వారి వద్దకు వచ్చి, "స్వామీజీ! మాకు అలా అనిపించడం లేదు. మేము సుఖాలను అనుభవిస్తున్నాం. మాకు ఎలాంటి దుఃఖము లేదు" అన్నాడు. అప్పుడు స్వామీజీ, అవును, మీరు భోగాలను అనుభవిస్తున్నామనే అనుకుంటున్నారు. కుక్క పొరుగింటిలో దూరి, ఆ ఇంటి యజమాని ఎక్కడ కొడతాడో అని భయం భయంగా, హడావిడిగా పాత్రల్లోని పదార్థాలను తింటుంది. మీరు కూడా ఈ లౌకికభోగాలను అలాగే అనుభవిస్తున్నారు. ఆ*

ఆరాటానికి అంతం వుండదు, అందుకు పడే భయానికీ అంతం లేదు అని నేను చెప్పదల్చుకున్నది!

***అడ్డూ అదుపూ లేని అసుర కాంక్షలకు***
***ఉన్న సంపదంతా సర్వనాశనమ్ము చేసుకునే***
***కలుషితమైన ఆలోచనలు మాని, కాపాడుకోండి జీవితమును***
***కొరత లేని గుండెకు కొరతనివ్వక***
***సుధలు కురియుచున్న సుందరమైన జీవితములో***
***సహజ సిద్ధమైన సమయము నందు***
***చింతలొదిలి, జీవి శాంతిగా జీవించుటకై***
***కానలేనిది, కనులారా వీక్షించలేనిది***
***గూడు వదులునాడు గుప్పెడైనా వచ్చునా***
***అనునది గుర్తించి గురుతు తెలిపిన***
***ఈ ఆంజనేయుని రక్షణలో మేలు పొంది***
***ప్రాణసంకటము పోగొట్టుకుని***
***పవనకుమారుని మార్గము పరమపదమని గుర్తించి***
***ఆత్మావలోకనంతో దరి చేరండి***
***నా చిన్నారి బిడ్డలారా !***

ॐ

**28-08-2018** 10:30 AM

**37) ఆనందానుభూతిని పొందేదెలా స్వామీ?**

*భగవంతుడు పరమానంద స్వరూపుడు. తనను అచంచల విశ్వాసంతో ఆరాధించే భక్తులకు ఆయన అనుగ్రహించేది ఆనందమే. నిరంతర భగవన్నామ స్మరణతో, మీకు లభించేది ఆనందమే. దైవం ప్రసాదించే ఆ దివ్యానందపు విలువ, అనుభూతి అర్థం చేసుకున్నవాళ్ళు, తమకు ఐహిక సుఖాలే కాదు, మోక్షం కూడా ప్రసాదించే అవసరం లేదన్నారు. భగవంతుని దివ్యదర్శన సౌభాగ్యము, అతని మధురస్మరణ అనుగ్రహించే ఆనందానికి ఈ మోక్షం సాటి వస్తుందా? అని భగవంతుడ్నే ప్రశ్నించగలిగారు. మీరు ఆయన్ను దర్శించగలిగినప్పుడు, మీరే ఆనందసాగరమవుతారు. అందుకే సంతోషపు అలలు సాగిపోతుంటాయి. మరి ఆనందం, ఆనందాన్నే వ్యాప్తి చేస్తుంది కదా! ఆ ఆనందానికి అవధులుండవు. ఆ ఆనందాన్ని మీరు వర్ణించలేరు. దీని వల్ల మిగిలిన ప్రాపంచిక వ్యధలు మీకు కలగవు. తల్లి గర్భంలోని బిడ్డ కోరికలు ఆ బిడ్డ తల్లి తెలియచేయగలదు. ఎందుకంటే, భౌతికంగా వారు ఆత్మీయత అనే బంధంలో ముడిపడ్డారు. మీ మనస్సుపై చిత్రింపబడిన అనుభవాలు మీ వాక్కు ద్వారా వ్యక్తమవుతాయి. మీరు అనుభవించేదే వ్యక్తపరుస్తారు. ప్రతి వ్యక్తీ తనకు కావలసింది, అత్యంత ఆవశ్యకమైనది, తనకు ఆనందాన్ని ఇవ్వగలిగిందీ, తనకు స్వీకరించడానికి అర్హత ఉన్నదీ దైవం మీకు ప్రసాదించకుండా జాప్యం*

చేస్తున్నాడని, దాని వల్ల పొందవలసిన ఆనందమేదో తమకు దూరమైపోతుందనీ బాధపడుతూంటాడు. అనంత కరుణాస్వరూపుడైన భగవంతునికి కరుణ లేదనుకుంటాడు. ఇంత బాధపడుతున్నాడు నా భక్తుడు, ఒక్కసారి తన అనుగ్రహం కురిపిస్తే ఆనందిస్తాడు గదా అని జాలిపడి, అనుగ్రహం కురిపించకూడదా? అని పాపం వాపోతూ వుంటాడు. భగవంతుడు మానవుల్ని, ఈ చరాచర సృష్టినీ అపరిమితానందములోంచి సృష్టించాడు. తన రూపంలో తయారైన మానవులు మనస్సు, ఇంద్రియాలు ఏ ఆకర్షణకు లోను కాకుండా బ్రహ్మానందాన్ని అనుభవిస్తూ తనలో తిరిగి ఐక్యం కావాలనుకుంటాడు. చిత్తశుద్ధి గల భక్తుడికి ఆనందానుభూతి సహజంగానే తప్పనిసరిగా కలుగుతుంది. అప్పుడు మానవుడు చేసే ప్రార్థన అనంతశక్తితో దేవుడ్ని ఆకర్షిస్తుంది. అప్పుడు ప్రతి అణువులోనూ భగవంతుడు దర్శనమిస్తాడు. అప్పుడు భగవంతుని కంటే ఏదీ భిన్నంగా కన్పించదు. దైవం ఇచ్చిన దానికి సంతోషించడం నేర్చుకోండి. తృప్తి పడటం అలవాటు చేసుకోండి. ఆ సంతోషంలో, తృప్తిలో అంతులేని ఆనందాన్ని అనుభవించండి. అప్పుడు దైవం మీ చేయి పట్టి నడిపిస్తున్నాడని అర్థమవుతుంది. ప్రతి దృశ్యంలోనూ భగవంతుడ్ని దర్శించటానికి ప్రయత్నించండి. ఉరకలెత్తే సాగరతరంగాలు, గాలిలో తేలిపోయే నీలిమేఘమాలికలూ, స్వేచ్ఛగా నీలాలనింగిలో విహరించే పక్షులూ, తొలి తొలకరి చిరుజల్లులూ ఈ శరీరంపై కల్గించే పులకింతలూ అందించే ఆనందాన్ని అందుకుని, అనుభవించకుండా ఏదో మీకు తెలియని ఆనందాన్ని మీకివ్వలేదని వాపోవటం ఎంత వెర్రితనం! తన గుండెలకు హత్తుకునే అమృతప్రేమ కురిపించే తల్లిని, నడత ప్రేమతో నేర్పే తండ్రిని, తన బిడ్డలా భావించి విద్యా విజ్ఞానాలు అందించే గురువునీ మీరే సృష్టించుకుని వచ్చారా? ఇవ్వన్నీ మీ కోసమే దైవం ముందుగానే ఏర్పాటు చేసిన ప్రేమ సదుపాయాలు కావా? ఏ రోజైనా ఈ ఆంజనేయుడు మీ ఎదుట కూర్చుని దివ్యబోధ చేస్తాడని ఊహించారా? ఇది దైవసంకల్పమే కదా! ఇంతటి ఆనందానుభూతిని అందించగల వారెవరు?

***కోటి దీపాలలో కొలువున్న ఆ భగవంతుడు గుండె గూటిలోన నిల్చుని***
***శ్వాసయై కదలాడి విశ్వాసముతో నీవిచ్చు దండానికి, చిరు పూజకు మెచ్చి***
***కోటి ఐశ్వర్యాలు క్రుమ్మరించి, సత్కర్మలు, జపధ్యానాలు, యజ్ఞయాగాది క్రతువులతో***
***నిష్కామ సేవ చేత నీలోనే వున్న నన్ను గుర్తించి***
***ఆనందముతో మది అంబరమున కెగసి***
***ఆంజనేయుని చేరి ఆ పరబ్రహ్మముతో సుఖించండి***
***నా చిన్నారి బిడ్డలారా!***

ॐ

**29-08-2018** 10:20 AM

## 38) భక్తుడు ఎట్టివాడు స్వామీ?

భక్తుని అచంచల భక్తి విశ్వాసాలకు ముగ్ధుడై, భగవంతుడు సాక్షాత్కరిస్తే, తాను ఏ విధంగా స్పందించాలి, భగవంతుడ్ని ఏమి కోరుకోవాలి అనే సందిగ్ధంలో పడని భక్తుడే నిజమైన భక్తుడు. తాను

*మనస్ఫూర్తిగా నమ్మిన భగవంతుడు తనను ఒక్క క్షణం కూడా వదిలిపెట్టడని, తనను అనుక్షణం ఇంటా, వెంటా, జంటా వుండి కాపాడుతాడని, తన సమస్యల్ని కోరకుండానే పరిష్కరిస్తాడని, తనకు కష్టం వచ్చినా సుఖం వచ్చినా అది దైవ సంకల్పమనీ, అది తన మంచికేనని ఆనందంగా స్వీకరించగలిగిన వాడే నిజమైన భక్తుడు!*

**39) నామస్మరణ ద్వారా ఏమి అనుభవించవచ్చును స్వామీ?**

*భగవన్నామ స్మరణ తన జీవంగా భావించిన భక్తుడు భగవంతునితో ఎంతటి చనువు పెంచుకోగలడో, ఎంతటి సాన్నిహిత్యాన్ని అనుభవించగలడో, భగవదనుగ్రహాన్ని పొందటానికి ఎంతటి అర్హత సంపాదించుకోగలడో మీకు తెలియచెబుతాను. కమలానికి తన పరిమళం తెలియదు. కానీ, తుమ్మెద ఆ పరిమళాన్ని ఆస్వాదిస్తుంది, ఆనందిస్తుంది. ఆయన దివ్యనామంలో వున్న మాధుర్యం మీకు తెలియకపోవచ్చు, భగవంతునికి కూడా తెలియకపోవచ్చు. కానీ, ఆ నామాన్ని స్మరిస్తున్న వారికి తెలుసు, ఆ నామంలో నిక్షిప్తమై వున్న బ్రహ్మానందం. గోమాత తృణాల్ని తిని తీయని పాలనిస్తుంది. ఆ పాలతీపిని లేగదూడ ఆస్వాదిస్తుంది. ఆనందంతో ఉరకలు వేస్తుంది. ముత్యం ముత్యపుచిప్పలోనే తయారవుతుంది. కానీ ఆ ముత్యాన్ని వెలికి తీయగానే, ఆ ముత్యపుచిప్పను కాక ఇతరులు దాని అందాన్ని చూచి ఆనందిస్తారు. నిజానికి ఆ ముత్యపుచిప్పకు ముత్యాన్ని చూసి పొందే ఆనందమేమిటో తెలియదు. భగవన్నామాన్ని ఎంతో భక్తిశ్రద్ధలతో, అచంచల విశ్వాసంతో, తనువు, మనసు భగవంతునికి అర్పించి, పులకించి, పరవశించి చేసే దివ్యనామస్మరణలో వుండే మధురానుభవం* **రాం రాం రాం రాం రాం రాం రాం రాం రాం రాం రాం రాం రాం రాం రాం రాం రాం రాం రాం రాం రాం రాం రాం రాం రాం రాం రాం రాం రాం రాం రాం రాం** *అనుభవించే బ్రహ్మానందం ఆ భక్తునికే తెలియాలి తప్ప, ఇంకొకరికి అర్థం కాదు. ఎంతటి గొప్ప సంగీత పరికరమైనా సరిగ్గా ట్యూన్ చేయలేకపోతే, అది సుస్వరాలను పలికించలేదు. అలాగే, మీరు కూడా మీ హృదయాలను భగవంతుని వైపు ట్యూన్ చేసుకున్నట్లయితే, భగవంతుడ్ని మీ ముందు, వెనుక, పైన, క్రింద సర్వత్రా దర్శించగలుగుతారు. అప్పుడు భగవంతుడు మీ చేయి పట్టుకుని ముందుకు నడిపించి గమ్యాన్ని సులభంగా చేరుస్తాడు. ఈ సుదీర్ఘమైన ప్రయాణంలో ఇక ఎంత సమయం మిగిలివున్నదో మీకు తెలియదు. తెలిసినది జన్మను చరితార్థం చేసుకోవాలన్న ఆలోచన. ఆలోచన కార్యరూపం దాల్చాలి. ఎన్నో సంవత్సరములుగా మిమ్మల్ని అంటిపెట్టుకున్న దుర్గంధాన్ని దూరం చెయ్యాలి అంటే, మంచి సబ్బు, మంచి స్నానం అవసరం. శుద్ధమైన మనస్సుతో అంటే, క్రోధాన్ని, అసహనాన్ని వదిలి ప్రతిమాట ప్రేమ, ఆప్యాయతలను కురిపిస్తూ మాట్లాడుతున్నట్లయితే, అంతరంగం శాంతితో వుంటుంది. ఈ శుభసమయంలో మీ హృదయాలను భగవంతుని వైపు పయనింపచేయాలని ప్రార్థించండి. అడిగి పొందేవి వరాలు. అడగకుండా లభించేది కరుణ. అడగటానికి అంతు లేదు. అడగటం తెలియక పొందేవన్నీ బాధామయ అనుభవాలే అని అర్థం చేసుకోండి!*

**రామ నామామృతమే సర్వజన రక్ష**
**అమృత హృదయుని అమృత హస్తమే అభయ రక్ష**
**శ్రీరాముని నమ్మి కొలచిన వారి కొంగు బంగారు రక్ష**

***నా రాముని పలుకులే మీకు రక్ష రక్ష***
***రాముని చరణ కమలములే శ్రీరామరక్ష***
***ఆలించు లాలించు పాలించు ప్రభువు***
***కరుణాంతరంగుడు గంగా తరంగాలు పొంగారు***
***బంగారు రాముడు నా రాముడు***
***హరివిల్లు మోపెట్టి అనురాగ లహరిని చూపెట్టి***
***రాగద్వేషాదులను పోగొట్టి చేయిపట్టి నడిపించువాడు***
***జాలి గలవాడు మేలి వరాల నొసగు వాడు సద్గతుల నందించు వాడు***
***త్రైగుణ్య వలయాన తేజమై దైవత్వాన్ని అనుభవించేలా చేసేవాడు***
***అంతరంగములో ఆసీనుడై వున్న నా రాముడ్ని ఆత్మారాముడిగా ఎరింగి***
***ఆత్మ యజ్ఞమనునది వంట బట్టించుకుని***
***ఈ ఆంజనేయుని పదములు గుర్తించి***
***ఆత్మగా పూజలందుకుంటున్న రాముని చేరి రంజిల్లండి రామతత్త్వంలో***
***నా చిన్నారి బిడ్డలారా !***

ॐ

**30-08-2018** 10:15 AM

**40)** **ఆత్మన్యూనతా భావాన్ని ఎలా అధిగమించాలి స్వామీ?**

*జీవితం అన్నాక గెలుపు ఓటములు సహజం. మీరు ఓడినా గెలిచినా, పైకెదిగినా పతనమైనా అది మీ ఒక్కరికే సంబంధించిన విషయం అనుకుంటారు. మీరు ఏమైనా ఎవరికీ బాధ అనుకుంటారు, ఎవరికీ నష్టం లేదనుకుంటారు, కష్టం కాదనుకుంటారు. కానీ, నిజంగా మీతో, మీ మంచి చెడులతో, గెలుపు ఓటములతో, ఎవరికీ సంబంధం లేదా? పొరపాటు! మీరు ఒక్కరుగా, ఒకే ఒక్కరుగా పై నుంచి నీరవ నిశ్శబ్ద శూన్యం లోంచి ఊడిపడలేదు. పుట్టడం ఒంటరిగానైనా, పుట్టాక మీ చుట్టూ కన్న తల్లిదండ్రులున్నారు, మీ కుటుంబం వుంది, సమాజం వుంది, దేశం వుంది, ప్రపంచం వుంది. మీతో అన్ని విధాలా అందరికీ బంధం వుంది, సంబంధం వుంది. అలాగే మీకూ అందరితో బంధం వుంది. అరణ్యంలో ఓ చెట్టు వుంది. చూడటానికి అది ఒంటరిది. ఉన్నది అడవుల్లోనైనా, దానితో ఎవరికీ సంబంధం లేదని ఎలా చెప్పగలరు? అది ఆయుర్వేద మూలికలిచ్చే ఔషధ వృక్షం కావచ్చు, పరిమళానిచ్చే గంధపు చెట్టూ కావచ్చు, పళ్ళనిచ్చే పనస చెట్టూ కావచ్చు. కొండ కోనలో ప్రవహించే నది వుంది. దాని మానాన అది అవకాశం ఉన్న మార్గంలో ప్రవహిస్తూ వెళ్ళి సముద్రంలో కలుస్తుంది. దానితో మీకు సంబంధం లేదా? త్రాగునీళ్ళు, సాగునీళ్ళు, అభిషేక సంబారం, ఇక ఆకాశంలో చంద్రుడు, ఒడిలోని పసివాడు అన్నం తినాలన్నా, మనసుకు హాయిని గొల్పే వెన్నెల కావాలన్నా, ఇలా ఎన్నని? ఇక సూర్యుడో... చెప్పనక్కరలేదు. భగవంతుని సృష్టిలో వ్యర్థ సృజన ఏదీ లేదు. చిన్నా పెద్దా తారతమ్యం లేదు. ఎంత*

పెద్దబట్ట కుట్టాలన్నా, చిన్నసూది కావాలి. ఎంత భారీ వంట రుచిగా చెయ్యాలన్నా చిటికెడు ఉప్పు కావాలి. మరి మనిషి భగవంతుని సృజనలోనే అత్యంత శ్రేష్ఠమైన, ఉత్కృష్టమైన జీవి. ఆయన తనకు ప్రత్యామ్నాయంగా అత్యంత శ్రద్ధతో, ప్రత్యేకంగా సృష్టించుకున్న ఉన్నతోన్నత మానవరూప మాధవుడు! మరి అలాంటి మనిషి ఇతరులకు చెందకుండా ఎలా వుంటాడు? ఎంతో మంది మహానుభావులు వారు పండించిన ఆధ్యాత్మిక ఫలాలను ప్రపంచం మొత్తం ఆనందంగా ఆస్వాదిస్తూనే వుంది. స్వామి అందించిన సేవాయోగం స్ఫూర్తిగా నేడు, రేపు కూడా ఎందరో ఆ మార్గంలో నడుస్తున్నారు. మరెందరో నడిచేందుకు ముందుకు వస్తున్నారు. ఒక ఇంట్లో వెన్న కాస్తే, వీధి మొత్తం కమ్మని నేతి వాసన వస్తుంది. ఒక ఇంట్లో కూర మాడితే, ఆ ఘాటు చుట్టుప్రక్కల ఎందర్నో ఉక్కిరిబిక్కిరి చేస్తుంది. ప్రాణాలతో నడయాడే మనిషి పరమాత్మకు ప్రత్యామ్నాయమైన మనిషి, కనురెప్ప కదిల్చినా ప్రపంచం మీద ప్రభావం చూపుతుంది. ఆ స్పృహతో మీరు జీవించాలి. మనిషిగా మహోన్నత జీవిగా మీరు ప్రపంచానికి ఆదర్శం కావాలి. కనీసం హితకారం కాకపోయినా అపకారం కారాదు. కానీ, జీవించాలనుకున్నప్పుడు, ఆ జీవన విధానాన్ని ఎందుకునే స్వేచ్ఛ, అవకాశం వున్నప్పుడు ఉన్నతంగా జీవించండి, ఉత్తమంగా జీవించండి. నిజమే! పూలు పరచిన బాటలో నడవాలన్నా, ఆ అవకాశం మీకు లేకపోవచ్చు. కానీ, ముళ్ళబాటను, మురికి త్రోవను తప్పుకుని నడిచే అవకాశం మాత్రం ఖచ్చితంగా మీకుంది. విధి లేకపోతే శుభ్రం చేసుకునైనా. మీరు ఎవరికో ఏమో కానక్కరలేదు. మీ మానసిక జీవన విధానం ద్వారా అందరికీ బంధువవ్వండి. అందరివాళ్ళు కండి. ఇది ఆంజనేయుడు అభిలషిస్తున్న జీవన విధానం!

***భగవంతుని ఎప్పుడూ మరువకూడదు***
***ఈ ఆంజనేయుని ఎప్పుడూ విడువకండి***
***కలలు పండినప్పుడు కానీ, వెతలు నిండినప్పుడు కానీ***
***బలము కలిగినప్పుడు గానీ, ధనము తొలగినప్పుడు గానీ***
***మనసు కృంగినప్పుడు గానీ, మమత పొంగినప్పుడు గానీ***
***సుతులు తెగడినప్పుడు గానీ, జనులు పొగడినప్పుడు గానీ***
***అచ్చటైనా ఇచ్చటైనా ఎచ్చటైనా అప్పుడైనా ఇప్పుడైనా ఎప్పుడైనా***
***ఈ ఆంజనేయుని మాటలు అఖండ జ్ఞానసంపదయై, మనుగడ స్థిరమై***
***మనసు హాయినొంది మంచి తలంపుల నిచ్చి***
***సర్వపాప హరణ కావించి, కడు త్వరగా కాపాడి కడతేర్చు***
***ఈ నా చిన్నారి బిడ్డలను !***

ॐ

**31-08-2018** 10:25 AM

**41)** సాధన పరిపక్వమవ్వాలంటే మేము ఏవి అనుసరించాలి స్వామీ?

కర్మలను అసంగ బుద్ధితో చేయాలి. కర్మఫలితాల పట్ల ఆసక్తి లేకుండా వుండాలి. కర్మల వల్ల

కలిగే జయాపజయాలను సమబుద్ధితో స్వీకరించాలి. సంప్రాప్తించే దానితో సంతృప్తి చెందాలి. నిజానికి, బాధ్యతలకు భయపడో, బాధలకు భీతిల్లో కర్మలను త్యజించి కారడవులకు పరిగెడితే, అక్కడ స్వచ్ఛ వాయువును పీలుస్తున్నా, అస్వచ్ఛ భావాలు మనస్సును కుదురుగా వుండనివ్వవు. మధుర ఫలాలు ఆరగిస్తున్నా, చేదు జ్ఞాపకాల రుచి మరచిపోలేరు. చల్లని చెట్టు నీడలో నిద్రిస్తున్నా, మనోతాపం మాత్రం చల్లారదు. ఇక జపధ్యానాల సంగతి అవస్థ ఏమిటో వేరే చెప్పనక్కర లేదు. అంటే, ఈ చల్లని కుటీరాలను ఏర్పర్చి, ఆంజనేయుని ఆధ్యాత్మిక బోధ అనెడి మధురఫలాల నందిస్తున్నా, మీలోపల క్రోధం అసహనం అనే చేదు పదార్థము మిమ్మల్ని వీడకపోతే, మనస్సు శాంతిగా లేకపోతే, ఎలా అన్న సందేహము నన్ను వీడుటలేదు. నిజానికి కామక్రోధాలు, అసూయా ద్వేషాలు, రాగమోహాలు మోస్తున్నంత వరకూ కుటీరాలైనా రణరంగమే! మనస్సులో ఇవి లేని నాడు, గృహమైనా తపోవనమే. రాగానికి సమమైన అగ్ని లేదు. రాగాగ్ని మిమ్మల్ని దహిస్తున్నంత వరకూ, అడవులకు వెళ్ళినా, కుటీరాలలో వున్నా అశాంతే వెంటాడుతుంది. కర్మలను త్యజించి, ఏకాంతంలో సాధనలను అభ్యసించడానికి మానసిక పవిత్రత ప్రధాన అర్హత. ఈ అర్హత సాధించిన నాడు కుటుంబం గానీ, అరణ్యం గానీ, కొండ గానీ, కోన గానీ, పుట్టపర్తి గానీ, కుటీరం గానీ రమణీయంగానే వుంటుంది. అది లేని నాడు ఎక్కడున్నా ఒక్కటే! మనసు స్వచ్ఛంగా లేకుండా ఎక్కడకు వెళ్ళినా ప్రయోజనం శూన్యం. సాధువు చేతిలోని కమండలం, కాకరకాయ ఎన్ని తీర్థయాత్రలు చేసినా, ఎన్ని పవిత్రమైన నదులలో మునిగినా దాని చేదు పోదు. జ్ఞాన పరిపూర్ణులు, ఆత్మజ్ఞానులు మాత్రమే కర్మలు త్యాగం చేసినా, కర్మలు అనుష్టించినా నిశ్చలంగా, నిర్మలంగా, నిశ్చింతగా వుండగలరు. నేను, నాది అనే భావన వుంటే, కర్తృత్వ బుద్ధి వున్నవారు మాత్రమే కర్మలు చేయాలా? కర్మలు వదలాలా? అనే సందిగ్ధావస్థలో వుంటారు. మానవజన్మ పరమార్థమైన భగవత్ సాక్షాత్కారం, ఆత్మ సాక్షాత్కారం పొందాలనుకునే సాధకులు ఉన్న ఫళంగా కర్మలను త్యజించటం కన్నా, కర్మలను ఆచరించటమే శ్రేయస్కరము. చెట్టుకున్న ఫలం పరిపక్వమైతే, తనంతట తానే రాలిపోతుంది. అలాగే, జ్ఞాన పరిపాకమైన వ్యక్తి నుండి కర్మలు వాటంతట అవే తొలగిపోతాయి. గర్భవతి అయిన కోడలికి నెలలు నిండుతున్న కొద్దీ అత్త ఆమె పనులు తగ్గిస్తుంది. అలాగే సాధకుడి మనస్సు భగవన్ముఖం అవుతున్న కొద్దీ, కర్మలు వాటంతట అవే తగ్గుముఖం పడ్తాయి. ప్రాథమిక దశలో మానసిక పవిత్రత చేకూరకుండా, సాధన పేరుతో కామ క్రోధాలను, అసహనాన్ని ప్రదర్శిస్తూ వుంటే, ఇహానికి పరానికి చెందకుండా పరిణమించే ప్రమాదముంది. ఇలలో తిండికి బాధపడుతూ, పరలోకంలో అమృతం కోసం ఆలోచించడంలో ఏమైనా అర్థముందా?

***మల్లెల సౌరభం చందన సుగంధం***
***గులాబీల అందం వెన్నెల చల్లదనం***
***మకరందపు మాధుర్యం***
***మాటలోని చల్లదనం తీయదనం***
***ఈ అవనిపై నలు చెరగులా శాంతిని వ్యాప్తి చేస్తుంది***
***మనసున్న మారాజు అని మెచ్చుకుంటుంది***

***ప్రాంతీయ భాషా భేదాలు లేవు సుతిమెత్తని పలుకులకు***
***ఎందరో మాన్యులు, అసమాన్యులు లోకం దృష్టిలో***
***ఈ సుతిమెత్తని మాటల వల్లే కీర్తించబడ్డారు***
***అందరూ మురిసేవి కమ్మనైన పదజాలమునకే***
***అనంత విశ్వములో నీ పాత్ర ఎంత?***
***అది ఎరింగి ఎన్నుకున్న మార్గాన్ని అన్వేషిస్తూ***
***శాంతి సామరస్యములతో అగ్రపథాన నిల్వండి***
***మీ ఆశ, శ్వాస, ధ్యాస, ధ్యేయం అరిషడ్వర్గముల రూపు మాపి***
***రూపు తెలియని ఆత్మను అనుభవిస్తూ***
***ఈ ఆంజనేయుని పరిరక్షణలో పరిణతి పొంది***
***పావన తత్త్వముతో పవన కుమారుని చేరి సుఖించండి***
***నా చిన్నారి బిడ్డలారా !***

ॐ

**01-09-2018** 10:30 AM

**42) జన్మజన్మల నుంచి జీవుడి సాధన ఏ విధంగా సాగుతుంది స్వామీ?**

*పూర్వజన్మలలో యోగసాధన చేసి సిద్ధి పొందకుండానే మరణించినవారు ఈ జన్మలో ఆగిపోయిన సాధనను పునః ప్రారంభిస్తారు. పూర్వజన్మలో ఎంత వరకు సాధన చేసి ఏ స్థాయిని చేరుకున్నారో, ఈ జన్మలో అక్కడి నుండి ప్రారంభిస్తారు. ఎలా జరుగుతున్నది ఈ విచిత్రం? అని మీరడిగినట్లయితే, పూర్వదేహానికి సంబంధించిన బుద్ధిని పొందటం వల్లనే, అప్పుడు బుద్ధిలో ఏ జ్ఞానం వున్నదో, ఏ వాసనలు వున్నాయో, దానినే ఇప్పుడు పొందటం వల్ల అక్కడి నుండే మీ సాధన ప్రారంభమవుతున్నది. ఇల్లు కట్టాలని ప్రారంభించినవారు, గోడలు కట్టేటప్పటికి డబ్బు అయిపోయింది. నాలుగు సంవత్సరాల తర్వాత డబ్బు వచ్చింది. ఇప్పుడు ఎక్కడి నుండి ప్రారంభిస్తారు? గోడలపై కప్పు వేయటంతో ప్రారంభిస్తారు. అంతే గానీ, పునాదులు తవ్వించరు గదా. అలాగే ఇక్కడ కూడా మొదటి నుండి యోగసాధన ప్రారంభించడు. పూర్వజన్మలో ఏ స్థాయిలో ఆగిపోయాడో, అక్కడి నుండే ప్రారంభిస్తాడు. ఇక్కడ మారింది దేహం, పేరు మాత్రమే. బుద్ధి మాత్రం అదే. బుద్ధి అనేది ఒక్కొక్క దేహాన్ని తగిలించుకుంటూ, వదిలించుకుంటూ కొనసాగుతుంది. అంటే బుద్ధి మారిపోయి, క్రొత్తది రావటం లేదు కనుక, సాధన కొనసాగుతుంది. వెనుక జన్మలో చేసిన సాధన వృధా అయిపోతుందనే బాధ ఎవరికీ అక్కర్లేదు. ఆ జన్మలో చేసిన పాపం గానీ, పుణ్యం గానీ, సాధన గానీ, పొందిన జ్ఞానం గానీ ఏదీ ఊరికే పోదు. అన్నీ వచ్చేస్తాయి. సంపాదించిన డబ్బు, ఇళ్ళు, ఆస్తిపాస్తులు, వస్తువులు అవి మాత్రం దేహంతో సరి. పూచిక పుల్ల కూడా వెంట రాదు. చిన్న సూది కూడా జీవుడితో రాదు. అందుకే వదిలిపెట్టి వెళ్ళిపోయే వాటి కోసం గాక, వెంట తీసుకువెళ్ళే వాటి కోసం అంటే పుణ్యం, జ్ఞానం, సాధన వీటి కోసం జీవించి వున్నంత వరకూ ఆరాటపడాలి. ఒక*

*గర్భిణీ స్త్రీ హాస్పిటల్‌లో ప్రసవించింది. తల్లి తన పాలు ఇవ్వలేని పరిస్థితిలో వుంటే, అక్కడే హాస్పిటల్‌లోని నర్సు అప్పుడే ప్రసవించి వుండటం వలన, ఈ బిడ్డకు పాలు ఇస్తుంది. పాలు త్రాగిన తర్వాత ఆ బిడ్డ చేయి ముడుచుకున్నాడు. ఎంత విడదీసినా వాడు ఆ గుప్పిట విడువుట లేదు. బలవంతాన తెరవగా, ఆ గుప్పెటలో నర్సు ఉంగరం వుంది. అంటే, పాలు త్రాగేటప్పుడు ఆ నర్సు ఉంగరాన్ని లాగి గుప్పెట పట్టాడు. వాడు పూర్వజన్మలో దొంగ. ఆ బుద్ధి ఇప్పుడు కూడా పాత వాసన ప్రకారం పనిచేసింది. కనుక, వెనుక జన్మలో చేసిన సాధన ఈ జన్మలో కూడా కొనసాగుతుంది. ఇలా జరిగినప్పుడు, ఈ జన్మలో సాగే సాధన చాలా తేలికగా వుంటుంది. ఎందుకంటే, పూర్వానుభవం చక్కగా వుపయోగపడుతుంది కనుక. ఈ కారణంగానే ఎక్కడకూ పరుగులు తీయకుండానే సాధన కొనసాగించండి. మీకు కావలసిన దానిని ఈ గురువు తత్‌క్షణమే అందిస్తాడు. తప్పక జ్ఞానాన్ని పొందుతారు, సాధనను సాగిస్తారు. అయితే, ఈ ఆంజనేయుని మాట విన్నప్పుడే సుమా! ఎన్నో భోగాలననుభవించిన గౌతమ బుద్ధుడు, వర్ధమానుడు అకస్మాత్తుగా యోగంలోకి దిగి సిద్ధి పొందారు. అసలు భోగాలే అనుభవించకుండానే రామకృష్ణ పరమహంస, భగవాన్ రమణ మహర్షిలాంటివారు సూటిగా యోగంలోకి దిగిపోయారు. వీరంతా గతజన్మలో యోగసాధన చేసి సిద్ధి పొందకుండా మరణించినవారే, యోగభ్రష్టులే. అయితే వీరు ఎంతకాలం ఈ సాధన కొనసాగించాలి? అంటే, సిద్ధి పొందేంత వరకూ సాగించాలి, అలా సాగిస్తారు కూడా. ఎందుకంటే, యోగసాధనకు అన్నీ అనుకూల పరిస్థితులు వుంటాయి. బుద్ధిలో అలాంటి పట్టుదల వుంటుంది. ఒకవేళ ఈ జన్మలో కూడా ప్రయత్నం మందకొడిగా సాగినా, కనీసం మరుజన్మ తప్పకుండా సిద్ధి పొందే జన్మయే వస్తుంది. కనుక, సిద్ధి పొందేంత వరకూ ఈ సాధన సాగుతుంది. అందుకే, మీకు ఈ వాతావరణాన్ని స్వామి ప్రసాదించి, సాధనకనువుగా తీర్చిదిద్ది సమయాన్ని సద్వినియోగపర్చుటకై ఒసంగిన ఈ అవకాశాన్ని చేజార్చుకోవద్దు!*

***గుండెను గుప్పెటలో పెట్టుకుని***
***అంతరంగంలోని నిర్లిప్తతను మనసు పొరలలో భద్రపర్చుకుని***
***వర్తమానంలోని విషాదాన్ని హృదయ కుహరంలో దాచుకుని***
***పెదాలపై చిరునవ్వుల్ని పులుముకుని***
***గతంలోని అనుభూతుల్ని మననం చేసుకుంటూ***
***గూడు చెదిరిన పక్షిలా నీవు తెలుసుకున్న జీవన సత్యాన్ని, వాస్తవాన్ని గ్రహించి***
***భగవంతుడు సదా వెన్నంటి వుంటాడన్న విశ్వాసంతో వెనుతిరగక***
***సాధనా క్రమంలో స్థాయిని పెంచుకుని***
***సమాధానము తెలుసుకుని***
***శాశ్వతమైన యోగాన్ని అనుభవించి***
***యోగాగ్నిలో పవిత్రులై, యోగ్యులై***
***ఈ ఆంజనేయుని చేరండి***
***నా చిన్నారి ముద్దుబిడ్డలారా!***

ఓం

**02-09-2018** 09:45 AM

**43) అహంకారాన్ని మేము ఏ విధంగా విడనాడాలి స్వామీ?**

*నేను కర్తను, నేను భోక్తను అనే రెండు భావాలను త్యజిస్తే, అహంకారం నశిస్తుంది. లేకుంటే, నీకు తెలియకుండగానే నీలో అహంకారం వ్యక్తమవుతుంది. ఒక సాధువు అతను ప్రతీరోజూ భిక్షాటనకు వెళ్ళి, తద్వారా వచ్చిన ఆహారాన్ని ఒక బండ మీద కూర్చుని తినేవాడు. ఒకరోజు అతను భిక్షాటనకు వెళ్ళి వచ్చేసరికి, అపరాహ్నం దాటిపోయింది. గబగబా ఆహారాన్ని తీసుకుని రోజూ కూర్చుని తినే బండ వైపు వచ్చాడు. అప్పటికే అక్కడ మరొక సాధువు తాను రోజూ కూర్చునే బండ మీద కూర్చుని భోజనం చేయడం గమనించాడు. వెంటనే ఈ సాధువు గట్టిగా, "అది నా బండ. నీవు దాని మీద కూర్చోవద్దు" అని అరిచాడు. సర్వసంగ పరిత్యాగియైన ఒక సాధువు చివరకు ఒక బండ గురించి ప్రాకులాడటం గురించి చెప్పాను. అతను అది నా చోటు అని అంత గట్టిగా ఎందుకు అరిచాడు? అతను చాలా కాలం నుండి ఆ బండ మీద కూర్చుని ఆహారం భుజిస్తున్నాడు. ఆ చాలా కాలం అనే సీనియారిటీ ఆయనకి "ఆ బండ నాదే" అనే అహాన్ని కలుగచేసింది. సర్వసంగ పరిత్యాగియైన సాధువు అలా ప్రవర్తిస్తే, మరి మీలాంటి సామాన్యులు సీనియారిటీని ఆస్వాదించటంలో వింత ఏముంది? భక్తులనుకునే వారు కూడా ఒక్కొక్క సారి ఈ సీనియారిటీ అనే మాయలో పడిపోవటం జరుగుతుంది. తస్మాత్ జాగ్రత్త! అలాంటి అహంకారం మీలో జొరపడినప్పుడు, అణకువతో కూడిన ప్రార్థన ఒక్కసారి చేయండి. "నాలో అహంకారం పెరిగిందని నేను తెలుసుకున్నాను. నాయందు కరుణ చూపి నన్ను మన్నించండి" అన్న ప్రార్థన భగవంతుని కరిగిస్తుంది. ప్రాపంచిక వ్యవహారాలలో సీనియర్ అనే పదం చాలా మంది ప్రయోగిస్తారు. సీనియర్ స్టూడెంట్ అంటే జూనియర్స్‌ని ర్యాగింగ్ చేసే హక్కు గలవాడు, సీనియర్ ఆఫీసర్ ప్రమోషన్‌కి అర్హుడు, సీనియర్ రాజకీయ నాయకుడు ప్రత్యర్థులను చిత్తు చేసే వ్యూహరచనలో నేర్పరి, వేల కోట్లు గడించినవాడు వగైరా వగైరా. మరి సీనియర్ డివోటీ అంటే ఎవరు? అని అడిగినట్లయితే, స్వామి భాషలోనే విందాం. ఈ రోజే కాదు, ఏ రోజైనా, ఎవరికైనా, చివరకు నాకైనా ఎంత కష్టపడి ప్రయత్నించినా ఏ పద్ధతులలో ఏ కాలమందైనా నా అసలు స్వభావాన్ని అంచనా వేయడం అసాధ్యం. సంవత్సరాల తరబడి స్తోత్రాలు, దండకాలు చదివేవారా? అనుభవజ్ఞులైన భక్తులు? ఒకసారి స్వామిని ఒక భక్తురాలు, "స్వామీ! నేను మీ వద్దకు రావడం ఇది పదమూడవ సారి" అన్నది. వెంటనే స్వామి, "నీ యొక్క అహం పదమూడు రెట్లు పెరిగిందన్న మాట!" అన్నారు. ఇంకొకరు, "స్వామీ! మీ నామాన్ని 1008 సార్లు వ్రాశాను" అంటే, "నీ చేతివ్రాత తప్పక బాగుపడి వుండాలి" అన్నారు. ఆమెకు అర్థం కాలేదు. అప్పుడు స్వామి, "ఇంతకు ముందు 500 సార్లు, తర్వాత 800 సార్లు, ఇప్పుడు 1008 సార్లు వ్రాశావు. అంటే పవిత్ర నామజపం కాస్తా నంబర్ల జపం అయింది" అన్నారు. సామాన్యంగా చాలామంది తరచుగా "మాకు తెలుసు" అనే పదాన్ని వాడతారు. ఈ "మాకు తెలుసు" అనే మాటే చాలా ప్రమాదకరమైనది. ఇది మీ అహాన్ని సూచిస్తుంది. ఎదుటివారిని నోరెత్తనివ్వకూడదని మీరు ప్రయోగించే బ్రహ్మాస్త్రం!*

***రజసస్తు ఫలం దుఃఖం   అజ్ఞానం తమసః ఫలమ్***
***వార్ధక్యం ఆహ్వానిస్తున్నా, వాంఛలు వీడని దేహం***
***కాంతి విహీనమైనా, కలల రంగు పులుముకుని***
***జీవన చదరంగంలో వైవిధ్యమైన నాటకంలో  ముగింపు తెలియని మూఢత్వంతో***
***అంతా తనకే  అంతటా తానే  అనే అహంకారంతో***
***తనదైన ముద్ర కోసం  రాత్రి పగలు పోరాటం***
***అజ్ఞాన అంధకార జీవితపు నావలో***
***నిన్ను నిన్నుగా చూపించే సమయాన మనసులో***
***రొదపెడుతున్నాయి  ఈ ఆంజనేయుని మాటలు***
***పశ్చాత్తాప పరిహాసం  పారదర్శకంగా మారి***
***మనసు హిమాలయమై  ఓ క్రొత్త ఉషోదయంతో***
***బండరాతిని చీల్చి  చిగురించిన మొక్కలా***
***సహజ ధర్మంతో  సలలిత భావాలతో  దేహ భ్రాంతిని వీడి***
***ఆనందమయమైన  మానవత్వపు పందిరి క్రింద చేరి***
***పవనకుమారుని ఆశీర్వచనములతో జీవిత వేదికను సరి చేసుకుని  సదా సుఖించండి***
***నా  చిన్నారి  ముద్దుబిడ్డలారా !***

ఓం

**03-09-2018** 10:30 AM

### 44) సాధకునకు ఎటువంటి పట్టుదల అవసరం స్వామీ?

*జీవితంలో ఏదైనా సాధించాలంటే, నిరంతర ప్రయత్నం అనే అస్త్రం తప్పనిసరి.  అగ్నిహోత్రంలా అది రగులుతూనే వుండాలి.  కానీ, చాలామందిలో అది లోపిస్తుంది.  ఎంతసేపూ లక్ష్యం గురించి డంబాలు పలుకుతారే తప్ప దాన్ని సాధించేందుకు చేయవలసిన ప్రయత్నము, శ్రమలను గూర్చి ఆలోచించరు. వారి దృష్టిలో, ఒక పనిని ప్రారంభిస్తే చాలు, ఆశించినంత ఫలితం అదే వస్తుంది అనుకుంటారు. ప్రయాణారంభంలో వున్న శూరత్వం, మధ్యలోనే అణగారిపోతే, గమ్యం చేరడం గగనమైపోతుంది.  లాగిన కొద్దీ పట్టు బిగించే ఉడుంలా మరింత ఉత్తేజంతో అడుగడుగునా పొంచి వున్న సమస్యల వలయాన్ని ప్రయత్నమనే అస్త్రంతో ఛేదిస్తూ ముందుకు సాగితే నిస్సందేహంగా విజయలక్ష్మి మిమ్మల్ని వరిస్తుంది. పట్టుదల వదలకుండా చేసే ప్రయత్నం చివరకు విజయాన్ని చేకూరుస్తుంది.  ఒక్క రోజులో దేన్నీ సాధించలేరు. స్వీకరించిన ఆదర్శాన్ని ఆచరించే ప్రయత్నములో వేయిసార్లు విఫలమైనా, మరొకసారి ప్రయత్నించాలి. విజయం సాధించే వరకూ ప్రయత్నానికి స్వస్తి పలుకరాదు.  అయితే, ప్రతి ప్రయత్నం ఒక వ్యూహం ప్రకారం జరగాలి.  చేసిన ప్రయత్నం విఫలమైనప్పుడు తప్పొప్పులను బేరీజు వేసుకోవాలి, విశ్లేషించుకోవాలి.*

ఒక పరాజయం తర్వాత వేసే అడుగు మరింత పటిష్టంగా వుండాలి. విఫలమవ్వటం వలన తల దించుకోవాల్సిన అవసరం లేదు. అసలు ప్రయత్నమే చేయనందులకు సిగ్గుపడాలి. ప్రయత్నం చేయాలి, పొరపాట్లు జరిగితే వాటిని సరిదిద్దుకొని మరింత శక్తివంతులై, కొదమ సింహంలా విజయం కోసం ఉరకలు వేయాలి. ఈ ప్రక్రియ మీ జీవననేస్తం కావాలి. విజయశిఖరాలను చేరుకున్నవారు వాటిని యాదృచ్ఛికంగా అందుకోలేదు. వారంతా అంతర్మథనంతో అహరహం శ్రమించారన్న విషయాన్ని మరువకూడదు. సూర్యునిలాగా ప్రకాశించాలంటే, సూర్యునిలాగా మండాలి. జీవితంలో ఉన్నతిని సాధించాలంటే, తీవ్రంగా సాధించాలంటే, తీవ్రంగా శ్రమించాలి. దీని సారాన్ని గ్రహించి, మీ నిత్యజీవితంలో ఆచరించిగలిగితే, మీ చుట్టూ వున్న మనుషులను ద్వేషించకుండా, పరిస్థితులను చూసి ఆందోళన పడకుండా వుండండి. మీరు ఏదైనా చేయటానికి ప్రయత్నించినప్పుడు మీ శక్తిసామర్థ్యాలను, మీ పరిధులను, పరిమితులను పరిగణన లోనికి తీసుకోవాలి. ఏది ఏమైనా, మీలోని శాంతిని విడనాడకండి. ప్రయత్నంలో ప్రయత్నంగా ప్రతి క్షణమూ శాంతి కోసం భగవంతుని ప్రార్థించండి. ఆ దేవదేవుడు మీ అంతరంగంలోని శాంతి యొక్క ఉనికిని మీకు కలుగచేస్తాడు. మీరు ఏ స్తోత్రం చదివినా, చివరలో "ఓం శాంతిః శాంతిః శాంతిః" అంటారు గదా. అలా ఉచ్ఛరించేటప్పుడు మొదట ఉచ్ఛ స్థాయిలో, ఆపై మెల్లమెల్లగా అంటారు. దీని అర్థం మొదటిది విశ్వశాంతి కొరకు, ఆపై మీ పరిసరాలు, ప్రకృతి శాంతి కొరకు, చివరిది మీ మనశ్శాంతి కొరకు!

***నీకు నచ్చినప్పుడు నీతి యగును   నీకు నచ్చనప్పుడు శోకమగును***
***నాశనంబు చేయును   నాది యనిన మాట***
***మనసు హాయి పొందు   మనది యనిన మాట***
***నీరు వలన బురద చేరును   ఆ నీరు వలననే బురద తొలగును***
***పాపపుణ్యాలకు మనసు వారథి   దానిని గెలిచినోడు మహిలో గొప్పవాడు***
***గురువు ధరణిలో కొలువైన దేవుడు***
***ఈ గురువు మాట లాలకించి   లలాట లిఖితాన్ని మార్చుకోండి***
***శ్రీకరమగు మనిషి జీవితములో***
***తనది  నాది యను   తపన తోడ***
***అల్ప బుద్ధి మరగి   ఆత్మను మరచితివేని***
***మారుతి మాటలు   జ్ఞప్తి యందిడుకుని***
***అడుగు ముందుకు వేసి   ఆత్మ సామ్రాజ్యాన్ని ప్రయత్నపూర్వకంగా అందుకుని***
***అభయాంజనేయుని అభయములో   సేద తీరండి***
***నా  చిన్నారి  ముద్దుబిడ్డలారా !***

***మీ దరి చేరుటకు దారి తెలియక***
***దారి చూపమని మేము చేసిన చిన్న ప్రార్థనను మన్నించి***
***మేము ఊహించని విధముగా మా చేయి పట్టుకుని***
***ఆధ్యాత్మిక ఉన్నత శిఖరాలను గొనిపోవుటకు***
***సాక్షాత్తూ ఆ దేవదేవుడు సాయినాథుడు సంకల్పించి***
***మార్గమును సుగమము చేయుటకు***
***భక్తి సామ్రాజ్యాధినేత యైన ఆంజనేయస్వామి అండదండలు***
***మాకు ఒసంగి మమ్ములను (ఈ చిన్నారి ముద్దు బిడ్డలను) తీర్చిదిద్దుతున్నందుకు***
***మీకు కృతజ్ఞతలు స్వామీ !***

***అండ దండల నందిస్తున్న ఈ ఆంజనేయుని***
***లాలనలో పాలనలో బహువిధములైన ఆధ్యాత్మిక తరంగాలను***
***తపనతో ఈ బిడ్డలకు తినిపిస్తూ, భుక్తాయాసమును కలుగచేసి***
***భోక్తగా మీరు సంతృప్తిని చెంది సంతసమున***
***అక్కున చేర్చుకుంటున్న స్వామికి***
***మీకు మీ బిడ్డలమైన మేము***
***అనేక వందనాలతో***
***మమ్ములను వదల వద్దని వేయివిధాల కోరుకుంటూ***
***మీ పాదపద్మాల చెంత చేర్చుకొమ్మని***
***ఈ చిన్ని బిడ్డల విన్నపం స్వామీ!***

ॐ

**12-09-2018** 10:25 AM

**45) సాధనకు లక్ష్యసాధనలో అవరోధంగా నిలిచేవి ఏవి స్వామీ?**

*దైవచింతన, ఆధ్యాత్మిక దృక్పథం అలవర్చుకోమని ఈ ఆంజనేయుడు ఉద్బోధిస్తున్నాడు. అయినప్పటికీ, విషయలోలుడైన మనిషి పరిణామక్రమంలో ఉన్నతస్థాయికి చెందిన మానవజన్మను పొంది కూడా పశుపక్ష్యాదుల కంటే హీనంగా బ్రతుకుతున్నాడు. అహంకార, మమకారములతో ధృతరాష్ట్రులై కన్నూమిన్నూ కానక ప్రవర్తిస్తున్నారు. మనిషి ఆలోచనలు గల జీవి. కనుక, జీవితం వరప్రసాదమో, శాపఫలమో తెలుసుకోవాలి. తన జీవితాన్ని వరంగా, ఒక స్వర్గంగా మార్చుకొనగలడు. స్వార్థం మనిషిని బలహీనపరుస్తుంది, నిర్వీర్యుడ్ని చేస్తుంది, అభద్రత కల్పిస్తుంది. చివరకు మరణ సంకేతంగా మిగిలిపోతుంది. ఇది మనిషి జీవితంలో తారసపడే జీవనసత్యం. ఉత్కృష్టమైన మానవజన్మ వ్యర్థమౌతుంది. ప్రతి మనిషి జీవనగమ్యం 'పరిపూర్ణత'. కామ క్రోధ లోభ మోహ మద మాత్సర్యాలనే మాలిన్యాలు మీలో వున్న*

దివ్యత్వాన్ని ఆవహించి మనసును తమ ఆధీనంలో వుంచుకున్నంత కాలం పశువుల్లా ప్రవర్తిస్తూంటారు. మానవులు మనసులోని మాలిన్యాలను ప్రక్షాళన చేసి, దివ్యత్వాన్ని సాధించాలి. ఇదే మానవధర్మం. ఇలా కాక, మోహాలకు వశుడై వాసనాతృష్ణలచే ప్రేరేపితుడై, అకర్మ, దుష్కర్మలను చేస్తూ, ఎంతో విలువైన జీవితాన్ని వృధా చేసుకుంటున్నాడు. ఇదే అజ్ఞానం. ఇదే మాయ. ఇదే అవిద్య. సామాన్యంగా బాహ్యమును మాత్రమే చూస్తు, వింటూ జీవించే మనిషి జ్ఞాని కాజాలడు. కానీ, అతడే నిజమైన జ్ఞానిననే భావించడం జరుగుతుంది. అందుకు కారణం భ్రమ. నిజమైన జ్ఞానం కానిదానిని, జ్ఞానంగా తలుస్తూ, దాని ననుసరించి కార్యాలను ఆచరిస్తూ పోవడం వల్ల, మనిషి తన అసలైన లక్ష్యాన్ని మరుస్తున్నాడు. జ్ఞానం మనిషిని చీకటి నుండి వెలుగు లోనికి, మృత్యువు నుండి అమృత తత్త్వానికి, అసత్యం నుండి సత్యం లోనికి నడిపిస్తుంది. లక్ష్యాన్ని మరచిన మనిషి జీవచ్ఛవమే. మనిషి గొప్పదనం అతడి మానవత్వంలో, అతడి జ్ఞానంలో, అతడి ఆత్మబోధలో ఇమిడి వుంటుంది. ఇంద్రియాలకు వశమైతే అతడి శక్తి ఆ దారిలో నడుస్తుంది. అతని శక్తి మానవీయమైన లక్ష్యాల కోసం వినియోగించబడదు. మనిషిని మానవత్వపు స్థాయికి చేర్చేది అతని బుద్ధి. మనసు...... ఇంద్రియాలను ఉపయోగించవలసినదే. అయితే, సంయమనం ద్వారా వాటిని అదుపులో వుంచాలి. యోగులు విషయాల వైపుకు వెళ్ళకుండా ఇంద్రియాలను అదుపు చేసి, ప్రత్యాహారం చేసి, తరుగుతున్న జ్ఞానాన్ని రక్షిస్తారు. మనిషి ఇంద్రియాలను వశపరచుకుంటే, జీవనరసాన్ని కాపాడుకోగలడు. ఇంద్రియాలకు లోబడిన మనిషి ఆత్మజ్ఞానం వైపుకు దృష్టి సారించలేడు. మానవజన్మ వంటి వరాన్ని పొంది కూడా మనిషి సుఖదుఃఖితుడుగా, దీనుడిగా, అసంతుష్టుడిగా వుండిపోతున్నాడు. మనసు ఇంద్రియాలను అదుపులో వుండటాన్ని అభ్యాసం చేయాలి. బుద్ధి ద్వారా ఏది సముచితమో, ఏది అనుచితమో నిర్ణయించాలి. ఆ ప్రకారం మనసును నడపాలి. ప్రతి శ్రేష్ఠగుణం ఏదో ఒక వికారాన్ని తొలగిస్తుంది. పవిత్రతలన్నింటిలో హృదయపవిత్రత గొప్పది. వాస్తవానికి మనిషి శరీరం కాదు. అనాది, అనంతం, చైతన్యం, ఆనందస్వరూపమైన ఆత్మ అతడు. మానవ శరీరంలో శక్తి యొక్క స్వరూపములున్నవి. వ్యక్తి తాను శరీరమే అనే భావక్షుద్రతను అధిగమిస్తే, అతడు అపరిమితమైన తన సామర్థ్యాన్ని తెలుసుకోగలుగుతాడు. లేని పక్షాన శరీరపు సుఖపరిమితులలో బందీగా మారి నిస్సహాయుడిగా బ్రతుకు వెళ్ళదీస్తాడు. ఆత్మానుభూతి పొందుటకు క్షుద్రమైన ఇచ్ఛలను, కామనలనూ వదులుకోవాలి. శ్రేష్ఠత్వాన్ని ఆకాంక్షించాలి. ఆకాంక్షయే నరుడిని నారాయణుడి వద్దకు చేరుస్తుంది!

***ఈ లోకం మీదే ఈ రాజ్యం మీదే***
***ఈ రాజ్యాన్ని మీరే ఏలుకోండి***
***శరీర భ్రాంతిని వీడి ఆత్మతత్త్వంలో ఏకమైతే***
***ఈ స్వర్గం బుజువవుతుంది***
***జీవితపు రథచక్రపు ఇరుసులో పడి నలుగుతున్న మీరు***
***మిమ్మల్ని ఉద్ధరించ కదలి వచ్చిన***
***ఈ పవనకుమారుని బోధలతో***
***ఏమున్నది లోపల ఏమున్నది గర్వకారణం***

***విచారణ సల్పుతూ, నిత్యమంగళకారకమైన***
***ఆత్మతత్త్వాన్ని ఎరింగి, దారి కాని దారిలో వెళ్ళక***
***ఉత్తేజ పరుస్తూ ఉత్తమ మార్గంలో పయనించి***
***ఆనందపు లోతులు ఆంజనేయుని మాట***
***ఒక్క మాట పాటించి ఓటమిని వదలి***
***ద్విగుణీకృతమైన సాధనతో సాగే జీవితాన్ని సార్థకం చేసుకుని***
***సార్ధక జీవులై సార్ధక్యాన్ని సాధించండి సాధుజీవులైన***
***నా చిన్నారి ముద్దుబిడ్డలారా!***

ॐ

**13-09-2018** 11:32 AM

**46) భోగాల పట్ల ఆసక్తి ఎటువంటి కీడు కలిగిస్తుంది స్వామీ?**

*మీరు భోగాలను అనుభవించడం లేదు, అవే మిమ్మల్ని అనుభవిస్తున్నాయి. మీరు తపస్సును ఆచరించడం కాక, తపించిపోతున్నారు. కాలం గడిచిపోవటం లేదు, మీరే గతించిపోతున్నారు. కోరికలు తగ్గడం లేదు, మీకే శక్తి తరిగిపోతోంది. మీరు భోగాల్ని అనుభవిస్తున్నానని అనుకుంటారు. కానీ, అది కేవలం భ్రమ. నిజానికి అవే మిమ్మల్ని అనుభవిస్తున్నాయి. ఎలాగని మీకు సందేహం వచ్చినట్లయితే, వాటిని అనుభవించకుండా కొన్ని రోజులు వుండండి చాలు, అప్పుడు తెలుస్తుంది. మీరు అనుభవించడం లేదు, అనుభవించకుండా వుండలేమని అంటారు. మరి ఎవరు ప్రభువులు? ఎవరు దాసులు? మీరా? లేక మీరనుభవించే భోగాలా? మీరు ప్రకృతి కనుసన్నలలో ఆజ్ఞాబద్ధులై వున్నారు. బయట ఏదైనా శబ్దం వుంటే, నేను దాన్ని వినాలి, బయట ఏదైనా జరుగుతూ వుంటే నేను దాన్ని చూడాలి. అంటే కోతుల్లాగా మీరు ఒక్కొక్కరు ఒకేచోట చేరిన రెండువేల కోతులతో సమానం. ఆ కోతులు చాలా కుతూహలం గలవి. మీరు వాటిని అదుపు చేయలేరు. మిమ్మల్ని మీరు నిగ్రహించుకోలేరు. అయితే, మీరు దీన్ని అనుభవించడం అని పిలుస్తారు. ఎంత అద్భుతమైన భాష! మీరు ఈ ప్రపంచాన్ని అనుభవిస్తున్నాము అంటారు. నిజానికి అనుభవించకుండా వుండలేని అసహాయులు. మీరు అలా చేయాలన్నదే ప్రకృతి కోరిక. ప్రస్తుతం మీరు దాని బానిసలు. కాబట్టి, మీరు భోగాల అంతు చూడాలని అనుభవిస్తూంటారు. కానీ, ఆ ప్రయత్నంలోనే అంతమైపోతారు. జీవులకు ఇహపరాల్లో తృష్ణను తీర్చుకోవటానికి వున్న ఏకైక మార్గం తపస్సు. అంటే భోగాల బాట వదలి, నిగ్రహం బాట పట్టడం అన్నమాట. అయితే, యోగబుద్ధితో కాక, భోగబుద్ధితో ఈ నిగ్రహాన్ని అవలంభించడం బాధాకరం. మీరు తపస్సును ఆచరిస్తున్నాము అంటారు గానీ, నిజానికి మీరు తపిస్తున్నారు. తపించడం అంటే కాలిపోవటం. ఆ కోరిక వేడిలో దహించుకుపోతున్నారే గానీ, ఆ కోరికల చెర నుండి తప్పించుకునే ప్రయత్నం చేయకపోవటం విచిత్రమే కదా! మీరు కాలం గడిచిపోతున్నది అనుకుంటారు. కానీ, నిజానికి గతిస్తున్నది కాలం కాదు, మీరే.*

కాలహరణం చేయొద్దు. ఎందుకంటే, కాలం ఏమీ చేయనట్లే వుంటుంది గానీ, ప్రతీ క్షణం మీ ప్రాణహరణం చేస్తూనే వుంటుంది. నిజానికి మీ జీవితమంతా కాలక్షేపమే. యవ్వనంలో భోగాలతో కాలక్షేపం, వృద్ధాప్యంలో జరిగిపోయిన దాన్ని తలచుకునే కాలక్షేపం, ధనార్జన ఒక కాలక్షేపం. మహా అయితే పెద్ద మొత్తంలో డబ్బు మూటలు కన్పించవచ్చు. అదెందుకు పనికొస్తుందీ అంటే, వృద్ధాప్యంలో కాలక్షేపానికే. ఏమి సాధించారో తిరిగి చూసుకుంటే కనబడేది గుండు సున్నా! ఇలా కాలం గడుపుతున్నామనుకుంటూ, తానే గతించిపోతాడు. కోరికలూ అంతే. అనుభవించే కొద్దీ, అవి జీర్ణం కావు. మీరే జీర్ణం, చూర్ణం అయిపోతారు. భోగాల్ని అతిగా అనుభవిస్తే, వచ్చేది రోగం. భోగాల్ని నిగ్రహిస్తే వచ్చేది యోగం. నెయ్యి వేసి మంటను ఆర్పడం లాంటిదే, కోరికల్ని తీర్చుకోవడం ద్వారా వాటిని తగ్గించుకోవాలనుకోవడం కూడా. ఆ అగ్ని ప్రవర్ధనం కావడమే కాదు, మిమ్మల్నే మాడ్చేస్తుంది కూడా. తలలు బోడులైనా తలపులు బోడులవునా? మీ శక్తి సన్నగిల్లుతుందే గాని, కోరిక మాత్రం సన్నగిల్లదు. ఒక్కసారి అనుభవించగానే, కోరిక తీరిపోయేలా దేవుడు సృష్టి చేసి వుంటే, ఈ లోకం మరో స్వర్గంగా మారేదేమో! ఇలా మానవుడు కోరికలనే కొలిమిలో కాలిపోతూ, కాలపు కౌగిలిలో నలిగిపోతూ నశించిపోతున్నాడు. ఇవన్నీ విన్న తర్వాత వివేకం గల మానవుడిలో ఓ ప్రశ్న ఉదయించక మానదు... జీవితమంటే ఇంతేనా? అని!

***అపర నమ్మకంతో అడుగులు వేస్తూ***
***ఆంజనేయుని మాటలు ఆద్యంతం స్వీకరిస్తూ***
***అభివృద్ధికై అహరహం శ్రమిస్తూ***
***పాదాలు రెండైనా పయనాలెన్నెన్నో***
***ఆ పయనాల గమ్యం పరమాత్మను చేరుటకే***
***అన్న పవనకుమారుని పలుకులు వింటూ***
***వీనుల విందుగా విశ్వనాథుని వింతలు వింటూ***
***మిమ్మల్ని బాగుపరచే ఈ భజరంగి మాటలు విచక్షణతో కూడినవై***
***నిన్ను నష్టపరచే నిర్లక్ష్యమును వీడుటకు విచ్చుకోవాలి అంతః చక్షులు***
***నీకు నీవే దైవంగా ప్రత్యక్షమవుతుంది అంటూ***
***ఆంజనేయుని మర్మగర్భ మాటలు***
***మూటలు దించి మారుతి భుజాన వేసుకుని***
***మిమ్ముల తేలిక పరచి త్వరగా తన సన్నిధికి చేర్చుకొనును***
***నా ఈ ముద్దుబిడ్డలను !***

ॐ

**15-09-2018** 11:00 AM

**47)** జీవితం ఒక నాటకం అని అంటారు కదా స్వామీ?

మీ అభివృద్ధి – అధోగతులు, ఆరాటాలు – పోరాటాలు, ఈ బాధలు – బోధలు అన్నీ మాయే! దీనికి మీ కర్మసిద్ధాంతం ఎలాగూ వుండనే వుంది. కానీ, దీన్ని సరిక్రొత్తగా చెబుతాను వినండి. నేనిప్పటికే ఎన్నోసార్లు ఇక్కడకు వచ్చి మీతో ఇలాగే మాట్లాడాను. కానీ, మీకెవరికీ గుర్తు వుండుట లేదు. దానర్థం మీరు ఈ జీవితం ఇప్పటికే ఇలాగే, ఎన్నోసార్లు సృష్టిలో జరిగిపోయిందని ఆలోచిస్తే, మీకు మతి పోకమానదు కదూ! ఎందుకంటే, ఇప్పటి దాకా, ఒకసారి ముక్తి పొందితే ఇక జన్మ లేదని కదా, మీ నమ్మకం? అదీ నిజమే. నేను ఒక ప్రశ్న వేస్తాను, జవాబు మీది. ఈ సృష్టి ఒక రంగులరాట్నం లాంటిది. అందులో వుండే కుర్చీలు మీ శరీరాలు మీరు దానిలో తిరిగి వెళ్ళిపోయాక (ముక్తి పొందాక) వేరే జీవాత్మలు, ఆ కుర్చీలు ఎక్కుతాయి, తిరుగుతాయి. అంటే మళ్ళీ మీ జీవితం తరువాతి కల్పంలో ఇలాగే అచ్చం కొనసాగుతుంది. కానీ, ఆ అనుభూతి పొందేది మీరు కాదు, వేరొకరు. ఎప్పటి సంగతో వదిలేయండి. అసలిప్పుడు బాధలుపడుతున్నది మీరా, వేరెవరోనా? అదే సందేహం! సుడిగుండంలోకి ఒక్కక్షణం మిమ్మల్ని నెట్టేసే అద్భుత ప్రతిపాదన ఇది. ఇందులో ఏదీ మీ చేతిలో లేదనే నిరాశ ఎంత వుందో, అంతా నాటకమే. జననమరణాలు బూటకాలే అనే గొప్ప స్వేచ్ఛ కూడా వుంది. ఒకటి అజ్ఞానుల కోసం – మరొకటి విజ్ఞానుల కోసం. పాచికల ఆటలో వాటిని దొర్లిస్తున్నప్పుడు, అవి ఒకేలా పడటం కొన్నిసార్లయినా సంభవిస్తుంది. అలా చూసుకున్నా, సృష్టిలో ప్రస్తుత పరిస్థితులు ప్రతి కల్పంలో కాకపోయినా, అప్పుడప్పుడయినా అచ్చు గుద్దినట్లు ఇలాగే వుండటం సంభవించే వుండాలి. అలా లెక్కించినా ఇప్పటికే అలా అనంతమైనన్ని సార్లు జరిగి వుండాలి. ఇవే కన్నీళ్ళు, ఇవే కష్టాలు, ఇవే నవ్వులు, ఇవే నాటకాలు. నీవీ నాటకంలో కేవలం ఒక పాత్రధారివి మాత్రమే. నువ్వు బిచ్చగాడివి కావచ్చు లేక లక్షాధికారివీ కావచ్చు. అందగాడివి కావచ్చు, కురూపివి కావచ్చు. యజమానివి కావచ్చు, బానిసవే కావచ్చు. రారాజువి కావచ్చు, లేక రోజుకూలీవే కావచ్చు. ఏదైనా అంతా జగన్నాటకమే. అంతా మూడునాళ్ళ ముచ్చటయే. ఎందుకా కన్నీరు? ఎందుకా కంఠశోష? ఎందుకా నీరసం? ఎందుకా నిరాశ? నాయకుని వేషం దొరకనందుకా? నిజానికి నీవే జగన్నాథుడివి. ఈ నాటకానికి నీవే సూత్రధారివి. అదే నీ నిజస్వరూపం. నీవు మారువేషంలో వున్న దేవుడివి. ఏనాడైనా నేనేమైనా తప్పు చేశానంటే, పాపం చేశానంటే, అది మిమ్మల్ని 'మానవులు' అని పిలిచినప్పుడే. మీరేమీ గొర్రెపిల్లలు కాదు. ఆ మాయలో మునిగిన మహోగ్రసింహాలు. మీ అజ్ఞానాన్ని విదిల్చిపారేయండి. మీ నిరాశను తరిమివేయండి. మీ నిజస్వరూపాన్ని గుర్తించండి. "అమరమైన ఆత్మను మీరేనని, అమృతతుల్యులము, సర్వేశ్వరుడను, పరిపూర్ణుడను, జాగ్రత" అని మీకు మీరే చాటి చెప్పుకోండి. కొంతమందిలో ఏదైనా ఆలోచనను నాటితే, వారిక దాన్ని వదులుకోరు. కొంతమంది ఎంత గొప్ప ఆలోచనల్ని చెప్పినా, "ఆహా! అద్భుతం" అని చప్పట్లు కొట్టి ఇంటికెళ్ళి కడుపునిండా తిని, అది అరిగేదాకా గుర్రుపెట్టి నిద్రిస్తారు. నేను చెప్పిన దేన్నీ పాటించకపోయినా, మీకు క్రొత్తగా వచ్చే నష్టమేమీ లేదు. అవన్నీ మీకు అలవాటైనవే. కానీ, ఈ చివరి విషయాన్ని మాత్రం చేయకుండా వుంటే, అంతే చాలు అదే పదివేలు! ఏమంటారు? ఈ ఆంజనేయుడు మిమ్మల్ని ప్రశ్నిస్తున్నాడు. ప్రశ్నకు జవాబు ఇవ్వండి, ప్రశ్న ఇవ్వద్దు!

***మీ మాటలకు ఆధారం మీరే   మీ పట్టుదలకు ప్రోత్సాహం మీరే***

***మీ సంస్కారానికి విధాత మీరే   మీ పనులకు భరోసా మీరే***

***మీ ఒడిదుడుకులకు ఊతం మీరే    మీ జ్ఞానానికి రహస్యం మీరే***
***మీ వినయానికి ఆదర్శం మీరే    మీ గమనానికి దిశానిర్దేశం మీరే***
***మీ నిర్ణయాలకు అభయం మీరే    మీ అదృష్టానికి సాధన మీరే***
***మీ కీర్తికి మూలం మీరే***
***అయితే, నా ఆనందానికి అర్థం మీరే    నా గుర్తింపుకు చిరునామా మీరే***
***మీ ఈ అందమైన జీవితానికి కర్తను నేనే***
***మీకు కావలసినవన్నీ ఇచ్చానే,  మరి నా గురించి ఆలోచించరే?***
***ఏమిస్తారు నాకు?***
***మీవి కాని వాటిని నాకిచ్చి, మీరు సదా ఆనంద సామ్రాజ్యంలో ఓలలాడుతూ***
***ఆంజనేయుని చేరి సదా సుఖించండి  సదా***
***నా  చిన్నారి  ముద్దుబిడ్డలారా !***

ॐ

**16-09-2018** 10:25 AM

**48)** భగవంతుని ఏమని ప్రార్థించాలి స్వామీ?

*విరబూసిన వనంలో విరుల వినియోగమంతా వనమాలిపైనే ఆధారపడివుంటుంది. కోసి కోవెలకు పంపినా, కాదని కొమ్మనే వదలివేసినా అంతా ఆయన అభీష్టమే. వేళకు పూజకు పంపితే పూలజన్మ ధన్యమౌతుంది. అనర్హమని ఆవల పెడితే మాపటికి మట్టిపాలవుతుంది. అలాగే మీ బ్రతుకు, భవిష్యత్తు కూడా. అయితే, ఎవరిని ఎప్పుడు ఎలా ఎంపిక చేసుకోవాలో, ఎవరితో ఎప్పుడు ఏ పనిని పూర్తిచేయించుకోవాలో స్పష్టంగా తెలిసిన సర్వజ్ఞుడు ఆ సృష్టికర్త. ఆజ్ఞ శిరసావహించడమే తప్ప ఆయన ఎంచుకున్నా, ఏమార్చినా అలా ఎందుకని అడిగే హక్కు ఎవరికీ లేదు. సర్వసమర్పణ భావంతో తనను తాను పూలవలె సమర్పించుకోవాలి. సర్వాత్మకుడి సేవలోనే తరించాలని తహతహలాడండి. ఆ తపనకు, తన్మయానికి భావాన్ని అద్ది, వినమ్రంగా విధాతకు విన్నవించుకోండి. "ఆలస్యం చేయకుండా, ఈ చిన్ని కుసుమాన్ని కోసి తీసుకోవయ్యా! వాడిపోయి ధూళిలో పడిపోతుందేమోనని భయంగా వున్నది. నీ కంఠహారంలో స్థానం లేకపోవచ్చు, కనీసం నీ చేతి స్పర్శతోనైనా గౌరవించి తీసుకోండి స్వామీ!" అని అభ్యర్థించండి. ఆ సర్వేశ్వరుడి సువిశాల విశ్వవనంలో మీ ఉనికి గరికల మధ్య ఓ గడ్డిపూవుతో సమానమే కావచ్చు. కానీ, ఆ కృపామయుడి కరుణార్ద్రకరం సోకితే అదే ఆయన కంఠహారంలో కళాత్మకంగా ఒదిగిపోతుంది. అంతటి స్థానాన్ని అందుకోకపోయినా, కనీసం ఆయన స్పర్శతోనైనా పునీతమవుతుంది. ఇక వాడిపోయి, ధూళిలో కలిసిపోవడమంటే వ్యర్థమైన ప్రాపంచిక విషయాలలోనే జీవనకాలం గడిచిపోవడం. నిజంగా ఆ పరమాత్మ సంకల్పానికి సాయపడే పుట్టుకే సార్థకమైనది. అందుకే జీవితం సఫలం కావాలంటే, పరమాత్మ స్పృహతోనే మనుగడ సాగించాలి. ఏ పని చేసినా పరోక్షంగా ఆయనను సేవిస్తున్నట్లుగానే భావించాలి. అలా ఆయనకు పూర్తిగా అంకితమవ్వాలి. ఒక్క మాటలో చెప్పాలంటే, ఆయనకు మీ*

*ముక్త్యారునామా (పవర్ ఆఫ్ అటార్నీ) ఇచ్చేయాలి. అలాంటి శరణాగతి వల్ల సేవకుడి బాగోగుల్ని యజమానే చూసుకున్నట్లు, మీ బరువుబాధ్యతలన్నీ ఆ భగవంతుడే భరిస్తాడు. ఆడుకునేలోపే బాల్యం, ఆలోచించుకునే లోపే యవ్వనం, ఆశ–నిరాశలతో వార్ధక్యం... అలా వచ్చి ఇలా వెళ్ళిపోయినట్లే అనిపిస్తాయి. అన్నీ కళ్ళ ముందు ఓ కలలా కదిలిపోతాయి, కరిగిపోతాయి. ఏం పొందేందుకు ఏం పోగొట్టుకుంటున్నారో విరామంగా విచారించుకోనైనా విచారించుకోనివ్వవు. అసలు ఈ లోకంలోకి ఎందుకొచ్చారో తెలియకుండానే, తెలుసుకోకుండానే తుదిఘడియలు తరుముకొస్తాయి. జీవన నాటకరంగం నుంచి నిశ్శబ్దంగా మిమ్మల్ని నిష్క్రమింపచేస్తాయి. ఈలోపే మేల్కొనేవారు నూటికో, కోటికో ఒక్కరు! అయితే, ఆ ఒక్కరే పరమాత్మకి మక్కువైనవారు. వారిలో ఏ అర్హతల్నీ చూడడు. కేవలం ఆర్తినీ, శరణాగతినీ అర్థం చేసుకుంటాడు. అలాంటి ఆర్తహృదయంతోనే ప్రార్థించండి. మీకు తెలియకుండానే రోజు గడిచిపోతుందేమో, పూజా సమయం మించిపోతుందేమోనని భయపడకండి. గొప్ప రంగు లేకపోయినా, పరిమళం గాఢంగా లేకపోయినా ఈ కుసుమాన్ని సమయం ఉందనగానే కోసి, నీ సేవకే వినియోగించుకో స్వామీ అని అంతర్యామిని అర్థించండి. మీరు ఆశించగానే సరిపోదు, ఆ సేవకి ఆయన అనుమతి కూడా వుండాలి. ఆ అనుమతి దక్కాలంటే, మీకు ముందు ఈ ప్రపంచంపై ఆసక్తి తగ్గి, ఆయనపై అమితమైన అనురక్తి పెరగాలి. ఆయన సేవకు కాకుండా, ఈ నీరసమైన జీవితం ఎందుకు? ఇది ఆంజనేయుని హృదయ మథనం, హృదయ ప్రార్థన. ఈ ప్రార్థనయే రాముని చరణాల సన్నిధికి చేర్చి, రామదాసుడ్ని చేసింది. ఇలాంటి రహస్యాలన్నీ మీకు చెప్పి మిమ్ములను కూడా రామభక్తి పరాయణులుగా తీర్చిదిద్ది, రామసామ్రాజ్యంలో ఒకరై నిలవాలని ఈ ఆంజనేయుని మదిలోనున్న భావము!*

***పూర్ణమది, పూర్ణమిది***

***అట్టి పూర్ణము నందు పూర్ణమును తీసివేసినా, కూడినా ఒక్కటే యగును, పూర్ణమే మిగులును.***

***పరిపూర్ణమైన పూర్ణమే జనించినట్లైతే, అది సంపూర్ణమగును***

***ఈ జగత్తు ఈశునిదే ఇహము పరము ఆతని రూపమే***

***జ్ఞానికి సతతమూ ఒకటే శోకమైన నాకమయినా***

***సుందరమగు పరమ సత్యమై పరమాత్మ ప్రబలుచుండు***

***నామ రూప క్రియారహిత నాథుడతడు***

***సర్వమీశ్వర సంకల్పిత జగమిదియని, ఏదియును నాది కాదని ఎరుకతోడ***

***ఆత్మరక్షణ చేకొని, ఆచరించి, ఆంజనేయుని జ్ఞానబిడ్డలై***

***సమున్నత విలువల సత్పాలన చేస్తూ, మహోన్నత చరితులై***

***మహినేలు మహోన్నతుడు ఈ హనుమంతునితో***

***ప్రగతి రథసారథియై సత్యధర్మాల సహనపు రాజైన***

***సత్యసాయీ పరంధాముని పరంధామము చేరి***

***సదా సదా సదా సుఖించండి***

***నా చిన్నారి ముద్దుబిడ్డలారా!***

ఓం

**17-09-2018** 10:25 AM

**49) ఆధ్యాత్మిక జీవనానికి అంతరంగశుద్ధి యొక్క ఆవశ్యకత ఎట్టిది స్వామీ?**

మానవ జీవితం అన్ని విధాలా ఉన్నతమైనది. అరుదుగా లభించిన ఈ జీవితాన్ని సద్వినియోగపర్చుకోవడమే మీ కనీస ధర్మం. ఎందుకంటే, మానవుడు మాధవుడై అంతిమంగా విశ్వంలో సునాయాసంగా ఐక్యం చెందటమే జీవిత పరమార్థం. దీనినే మీరు ముక్తి లేక మోక్షం అంటారు. అది చనిపోయిన తర్వాత లభించేది కాదు. బ్రతికి వుండగానే అటువంటి స్థితిని ప్రయోగపూర్వకంగా అనుభవించి, అదే రీతిలో జీవితాన్ని ముగించగలగాలి. అందుకు నేను మీకు అందిస్తున్న చక్కటి మార్గమే ఆధ్యాత్మికత. ఎవరైతే ఆత్మస్థితికి చేరుతారో, వారు మాత్రమే అన్ని రకాల బంధాల నుండి సమూలంగా విడుదల కాబడతారు. నేను చెప్పే విధానాలు అన్ని విధాలా పరిపూర్ణమైనవే. దానిని అనుభవించేవారి జీవితం తప్పక ఆనందమయమౌతుంది. వాస్తవానికి ధ్యానమంటే మననం. ఒక నామాన్ని, రూపాన్ని, వ్యక్తిని, విగ్రహాన్ని, దేవుడ్ని, దేవతను లేక భగవంతుడిని పదేపదే మననం చేసుకోవడమే ధ్యానమవుతుంది. దాని వలన ఉత్తమ సంస్కారాలేర్పడి మనిషి దివ్యత్వానికి చేరువకాగలుగుతాడు అన్నది, కొంతమంది భావన. అది కొంతవరకూ వాస్తవమే. అందులో ఎటువంటి సందేహమూ లేదు. అయితే, ధ్యానాన్ని కొనసాగించటానికి అంతరంగం సమూలంగా శుద్ధి గావించబడాలి. అంతరంగ శుద్ధి జరుగకుండా కొనసాగించే ధ్యానాలన్నీ కఠోరంగా, కాఠిన్యంగా, ఒత్తిడిగా వుంటాయి. అంతరంగంలో చెడు సంస్కారాల మాలిన్యం ఎక్కువగా వుండి, ధ్యానం కొనసాగించడం అతి ప్రమాదకరం. ఎందుకంటే, నెగెటివ్ అనేది ఎంత తక్కువగా వున్నప్పటికీ, అది పాజిటివ్‌ను సమూలంగా హరించివేస్తుంది. ఎందుకంటే, నెగెటివ్ అనేది బరువుగా, భారంగా, లోతుగా వుంటుంది. పాజిటివ్ అనబడే సత్త్వగుణ సంబంధమైన సంస్కారాలు తేలికగా వుంటాయి. సాధారణంగా ధ్యానం చెయ్యాలని అనుకున్నప్పుడు, శరీరాన్ని ఎంతో కొంత మేరకు బంధించి, మనసును ఒకే అంశం మీద కేంద్రీకరించవలసి వుంటుంది. అట్టి స్థితిలో ప్రజ్ఞ కుంచించుకుంటుంది. ఆలోచనా విధానం పరిమితమవుతుంది. అందువలన, సాధన కొంతకాలము కొనసాగించిన తర్వాత శరీరం, మనస్సుపై ఒత్తిడి పెరుగుతుంది. శరీరాన్ని బలవంతంగా బంధించి కళ్ళు, నోరు మూసుకుంటే ఏమవుతుంది? అంతరంగమందు అడుగున వున్న చెడుసంస్కారాలు చైతన్యవంతమై, ఆలోచనలు ఉధృతంగా బయటకు విడుదలై, శరీరం, మనసు తీవ్రమైన అసౌకర్యానికి గురి అవుతాయి. సున్నితమైన, విలువైన, సూక్ష్మమైన మనసుపై ఎటువంటి బలవంతపు ప్రయోగాలు చేయకూడదు. మనసు ప్రశాంతంగా వున్నప్పుడు, సాధన సులభతరమవుతుంది తప్ప, అంతరంగంలో చెడు సంస్కారాల మాలిన్యం బలీయంగా వన్నప్పుడు, మనస్సుపై ఎటువంటి బలవంతపు ప్రయోగాలు చేయకూడదు. ముందు అంతరంగమందలి నెగెటివ్‌ను తొలగించే విధానాన్ని, ఆలోచనల్ని ప్రవేశపెట్టాలి. వాస్తవానికి, అంతరంగమందు నెగెటివ్ లేకపోతే, ఇక సాధన యొక్క అవసరమేముంది? జీవితమే సాధనగా మారుతుంది. చెడుసంస్కారాలను సమూలంగా తొలగించారనుకోండి, ఇక అంతరంగమందు అసంతృప్తి సమూలంగా కరిగిపోతుంది. అసంతృప్తి లేకపోతే, ఇక సాధన యొక్క అవసరమేముంటుంది?

*ఆలోచించండి! జీవితం సాఫీగా కొనసాగుతున్నట్లైతే, నిరంతర సాధన జరుగుతున్నట్లే కదా!*

***నేడు శాశ్వత నిద్రకుపక్రమించినా, పదులు దాటిన కాయం సహకరించకపోయినా***
***మృత్యు పరిష్వంగనలో ఒదిగిన మీరు అపర నమ్మకంతో అడుగులు వేస్తూ***
***ఆంజనేయుడు చూపుతున్న దారిలో విలువల వలువలు ధరించి***
***కపటమెరుగని కర్మయోగులుగా నిలచి***
***హృదయావేదన అనంతమై, స్వచ్ఛతే జీవిత సూత్రంగా ఎంచుకుని***
***సూత్రధారి చేతిలో పాత్రధారులై నిజతత్వములో ఓలలాడుచూ***
***ఒసంగిన విద్యను ఒద్దికతో దరిచేర్చుకుని***
***ఆచరించి ఆంజనేయుని అనుంగుబిడ్డలై అక్కున చేరండి అరక్షణములో***
***నా చిన్నారి బిడ్డలారా!***

ఓం

**18-09-2018** 09:45 AM

### 50) కోరికలను అదుపు చేయవలసిన ఆవశ్యకత ఎట్టిది స్వామీ?

*ఆధ్యాత్మికంగా ఎదగాలంటే, భగవంతుని నుండి మీ దృష్టిని మరల్చే విషయాలను త్యజించాలి. దానర్థం ఇంద్రియాలను పెకిలించివేయడం కాదు. ఇంద్రియాలు భోగాల పట్ల మొగ్గు చూపినంత కాలం, అవి మీకు శత్రువులు. కానీ, వాటి దిశను భగవంతుని వైపు మళ్ళిస్తే, అవి మంచి స్నేహితుల వలె పనిచేసి, భగవన్మార్గంలో ముందుకు నడిపిస్తాయి. దీనికి, మహాభారతంలో ఒక చక్కని కథ చెబుతారు. ఆ కథ కోరికలు ఎందుకు దుఃఖహేతువులో, వాటిని నిర్మూలించడం ద్వారా సంతోషంగా వుండి, పరమపదంలో ఎలా పురోగమించాలో ప్రబోధిస్తుంది. పూర్వం మంకీ అనే పేరుగల బ్రాహ్మణుడు ఏదో ఒక విధంగా ధనం సంపాదించాలనే ఆశతో జీవిస్తూ వుండేవాడు. ధనార్జనే ధ్యేయంగా రెండు కోడె దూడలను కొని, ఒకే త్రాటితో వాటిని కట్టేవాడు. ఒకసారి, ఆ దూడలకు చురుకు పుట్టి, వున్నట్లుండి గెంతడం ప్రారంభించాయి. వాటికి దగ్గరలోనే ఒక ఒంటె పడుకుని వుంది. ఈ కోడెదూడల హడావుడికి అది కూడా లేచి నిలబడి, గెంతడం ప్రారంభించింది. అయితే, ఒంటె ఎత్తుగా వున్నందువల్ల దూడలు రెండూ ఒంటెను దాటే ప్రయత్నంలో మెడకు కట్టిన త్రాడే ఉరితాడయి, అక్కడికక్కడే చచ్చిపోయినాయి. జనమంతా మంకీ వంక సానుభూతిగా చూచారు. అప్పుడు మంకీలో వైరాగ్యం చోటు చేసుకుని, మనసులో ఇలా అనుకున్నాడు. "ఎప్పుడైనా, ఎక్కడైనా మానవ ప్రయత్నం చేత పని సానుకూలపడినా, అది దైవానుగ్రహం చేతనే నెరవేరిందని తెలుసుకోవాలి. కనుక, మానవుడు, ఏ సంకల్పాలను తలపెట్టకుండా, భారం అంతా దైవం పైనే వుంచి, తాను సుఖంగా వుండటమే మేలు అనిపిస్తుంది కదా!" ఇదంతా బాగానే వుంది గానీ... అని అనవచ్చు మీరు. తీవ్రమైన కోరికలను మనస్సులో నుండి తీసిపారవేయటం ఎలా? అని ఆ బ్రాహ్మణుని ఆలోచన. తన మనస్సును ఉద్దేశించి ఇలా అనుకుంటున్నాడు. "ఓ కోరికా!*

నువ్వు సంకల్పం నుండి జన్మిస్తున్నావని కనిపెట్టాను. కనుక, ఇకపైన సంకల్పం ముద్ర మనస్సుపై పడకుండా కూకటి వ్రేళ్ళతో సహా పెకిలించివేస్తాను. నిన్ను నశింపచేస్తాను. అదే నా ముక్తికి మొదటిమెట్టని చాటి చెబుతాను. ఓ కోరికా! ఇంకా ఇంకా సంపాదించాలనే తపనకు నువ్వే కారణమని తెలుసుకున్నాను. నువ్వు ఆవహించిన వాడిని ఒక పట్టాన వదిలిపెట్టవు. కనుక, నిన్ను (కోరికను) వదిలిపెట్టడంలోనే సుఖం వుంది. నువ్వు ఆశ చూపడం వలన పడరాని కష్టాలన్నీ పడి, ధనం సంపాదించినా, ఆ తర్వాత దానిని వదిలిపెట్టినందు వల్ల ఎటువంటి దుఃఖమూ కలుగదు, ఎటువంటి దైన్యమూ ఆవహించదు. ఓ కోరికా! నువ్వు పట్టిన పట్టు నెగ్గాలని మారాం చేస్తావే గానీ, సాధ్యమా లేక అసాధ్యమా అని ఆలోచించవు గదా! పోనీ దొరికిన దానితో తృప్తి వుందా అంటే, అదీ లేదు. అగాధమైన పాతాళలోకం లాగా ఎన్ని కబళించినా, నీ వెలితి నిండేది కాదు. ఇంకా పూర్తి కావలసింది మిగిలే వుంటుంది. కాబట్టి, నువ్వు ఆకర్షించే దారిలో వెళ్ళకుండా వుండటమే మంచిది. అలాగే, దూరం నుండే నిన్ను నేను రూపుమాపుతాను. ఓ కోరికా! నీ వెంట పరుగులు తీశాను. అయితే, దైవం అనుకూలించకపోవటం వల్ల, విసిగి వేసారి నిన్ను వదిలించుకున్నాను. ఆ విధంగా కోరికను చంపుకోవడం వల్ల నాలో కోపం నశించింది. ఇంద్రియ నిగ్రహం కలవాడనయ్యాను. ఓర్పు కలిగింది. ప్రాణుల యెడల కరుణ కలిగింది. అయిందేదో అయింది. ఇకపైన నీ సోదరుడైన లోభం నన్ను అంటలేదు. అంటే, నువ్వొకడివి (కామం) తొలగిపోతే, మిగిలిన చెడుగుణాలన్నీ వాటంతట అవే మాయమవుతాయి. ఓ కోరికా! స్వర్గసుఖాలతో పోల్చినప్పుడు నీ వలన కలిగే సుఖం అల్పమని తెలుస్తుంది. కనుక, నిన్ను చంపి పరమపథంలో రాజునై వెలిగిపోతాను!" ఇలా విచారించిన ఆ మంకి, ఆత్మ సంతుష్టుడై, తన పారమార్థిక సాధనలు ప్రారంభించాడు. ఇప్పటి మానవుడు తన సాంకేతిక ప్రగతితో ఆకాశాన్ని సైతం చాపలా చుట్టేయగలనని భ్రమిస్తున్నాడు. కానీ, తనలో దేదీప్యమానంగా ప్రకాశిస్తున్న దివ్యత్వాన్ని కనుగొనకుండా, ఆ ప్రయత్నంలో శాంతిని పొందలేదు సరికదా, అతని దుఃఖాలకు ఇక అంతే వుండదు కదా! కాబట్టి, నిజమైన ఆనందాన్ని పొందాలంటే, విషయభోగాల నుండి భగవంతుని వైపు మళ్ళించటానికి ప్రయత్నించాలి. అదే కోరికలను తగ్గించుకోవడానికి మార్గం. అదే సాధనంటే. సాగే జీవితంలో సాధ్యమైనంత కోరికలను అదుపు చేసుకుంటూ, అప్పుడే అతి సమీపానికి వచ్చిన ఈ సన్మిత్రుడు, సదా సహాయకారి, రామబంటు అయిన ఈ బంటు మాటలు వినండి. బంటు ఒకసారి ప్రవేశం కల్పిస్తే, నేరుగా రాజునే దర్శించవచ్చు. ఆలోచించండి! అర్థవంతమైన జీవితాన్ని గడపండి!

**కపట మెరుగని కర్మయోగిలా జీవితాన్ని భగవంతునికి ధారపోసి**
**మెండుగా నిండిన భక్తితో రసఝరిలో ఓలలాడే భక్తి తన్మయత్వంతో**
**ఆత్మీయ చిరునగవే ఆభరణమై అందరూ మెచ్చుకునే విధంగా**
**సమున్నతమైన విలువల సత్వాలనకై స్వచ్ఛతే జీవిత సూత్రంగా**
**మిమ్ము మరువని మానవత నడుమన మహోన్నత చరితులై**
**కోరిక అనే దాని మహాభినిష్క్రమణ జరిపించి కర్మయోగిగా దరి చేరి**
**ఆంజనేయుని మది ఉప్పొంగేలా మీ ఉనికిని తెల్పి**
**భక్తి సాగరంలో భజరంగభళి తెప్ప అంటే నావలో కూర్చుని**

***నాతో పయనించి, పరంధామము చేరి చిరంజీవులు కండి***
***ఈ చిరంజీవి బిడ్డలైన నా చిన్నారి ముద్దుబిడ్డలారా !***

ॐ

**21-09-2018** 10:25 AM

## 51) ఆనందం ఎలా ప్రాప్తిస్తుంది స్వామీ?

*సర్వమానవాళికీ ఆనందాన్వేషణ అనేది ఒక ప్రబలమైన ప్రేరేపణగానే వుంటుంది. ఇదే వారి పరిమితులను, అసంపూర్ణతలను రూపుమాపేందుకు పురికొల్పుతుంది. ఒక్క మాటలో చెప్పాలంటే, అది స్వేచ్ఛ కోసం నిరంతర పోరాటం. తెలిసో తెలియకో ప్రతిఒక్క జీవి పరిపూర్ణత కొరకు పరితపిస్తుంది. ఈ రోజుల్లో ఎంతో అసంతృప్తికరంగా, దుఃఖమయంగా కనిపిస్తుంది. చాలామందికి సరియైన మార్గనిర్దేశం, విశ్వాసం కొరవడటమే ఇందుకు కారణం. ప్రతి ఒక్కరికీ ఆనందం కావాలి. కానీ, వారు దానిని అశాశ్వతమైన, అవాస్తవమైన వస్తు విషయాలలోనే పొందాలనుకుంటున్నారు. కానీ, ఇంద్రియసుఖాలనేవి ఎప్పుడూ ఆనందాన్ని ఇవ్వలేవు. ఆత్మానందమే నిజమైన ఆనందం. భగవద్దర్శనం లేదా ఆత్మదర్శన అనుభూతి మాత్రమే మీకు నిజమైన, శాశ్వతమైన ఆనందాన్ని అందిస్తుంది అని గట్టిగా చెబుతున్నాను. ఈ పోరాటాన్ని జీవుడు మూడు రకాలుగా చేస్తాడు. ఈ స్వేచ్ఛకై జరిపే పోరాటం మూడు దశలలో సంభవిస్తుంది. మొదటిది భౌతికస్థాయి. అది ఆకలి దప్పికలు మొదలైన అసౌకర్యాల నుండి విముక్తి. రెండవది భయం, పిరికితనం, విసుగు, మనోవేదన వంటి మానసిక ఇబ్బందుల నుండి స్వాంతన. దట్టమైన పొగమంచు వలె, కారుమేఘం వలె ఎంతో మందిని భయమనే భూతం ఆవరించి వుంటుంది. కొన్నిసార్లు వాస్తవ పరిస్థితుల వల్ల కలిగే భయం, మరికొన్ని సార్లు అభూత కల్పనల వల్ల కలిగే భయాలు వారిని తీవ్రమైన ఒత్తిడికి లోను చేసి, వారిని నిశ్చేష్టితులను చేస్తాయి, దుఃఖంలో ముంచివేస్తాయి. ఇంతకు ముందెన్నడూ మానవజాతి ఇంతగా విద్యావంతులవడం, అదే సమయంలో అజ్ఞానంగా వుండటం జరగలేదు. చుట్టూ ఎన్నో సౌకర్యాలు చక్కగా అమర్చుకుని వున్నారు. అయినా, అభద్రతాభావం వెన్నాడుతుంది. ఎన్నో వనరులు సమృద్ధిగా వున్నాయి. అయినా ఏదో దారిద్ర్యం. నాగరికత ఎంతో పెరిగింది. కానీ, నైతికత మటుమాయమైపోయింది. ఇక మూడవది, ఆధ్యాత్మిక జగత్తులో మానవులు జరిపే పోరాటం. అది వారికి తెలియకపోవచ్చు. అయినప్పటికీ, వారందరూ ఈ స్వేచ్ఛను కోరుకుంటారు. మనిషి నిజతత్త్వం దైవత్వం. మానవుడు దివ్యుడు అనే సత్యాన్ని అంగీకరించవలసిందే. మానవునిలోనే భగవంతుడు కొలువై వున్నాడు. భగవంతుని సామ్రాజ్యం అంతరంగంలోనే వున్నది. ఇంద్రియ సుఖాలనేవి మనసుకు, ఆత్మకు, జ్ఞానానికి, అజ్ఞానానికి మధ్య ఒక అడ్డుగోడలాగా నిలుస్తుంది. కాబట్టి, అవి నిందించదగినవి. అపవిత్రమైన కోరికలు, వాటి వినాశకర స్వభావం చేత ఆధ్యాత్మిక పురోగతిని అడ్డుకుంటాయి. ఆధ్యాత్మిక పురోభివృద్ధికై జరిపే పోరాటంలో పడే శ్రమలో పూర్తి భాగం మనసును పవిత్రంగా వుంచడంలోనే వినియోగమవుతుంది. మీలో చాలా మంది లోకంలోని విషయవస్తువుల*

*దాడికి గురయి వున్నారు. భగవంతునిలో ఆనందం వెతకకుండా, ఇంద్రియ సుఖాలలోనే మీరు ఆనందం వెతుక్కుంటున్నారు. జీవిత పరమార్ధాన్ని తెలుసుకోకుండానే, జీవితాన్ని గూర్చి లోతుగా అధ్యయనం చేయకుండానే మీరు రోజులు వెళ్ళబుచ్చుతున్నారు. మరియే ఇతర వ్యాపకములూ లేనట్లు, పలుమార్లు తిరిగి తిరిగి విషయభోగాలలోనే అంతిమ సుఖం వున్నదనే భ్రమను పొందుతున్నారు. అంటే భ్రమిస్తున్నారు. మీలో ప్రతి ఒక్కరూ ఆనందాన్ని అభిలషించేవారే. కానీ, అత్యధికులు, అశాశ్వతమైన, అస్థిరమైన వాటిని అపేక్షిస్తున్నారు. విషయసుఖాలలోనూ, సుఖానుభవాలలోనూ శాశ్వత ఆనందాన్ని పొందిన వ్యక్తి ఇంతవరకూ ఎవ్వరూ లేరు. ఆనందం అనేది ఆత్మదర్శనంలోనే వుంది. అతిశయోక్తి ఎరుగని పలుకులు ఈ ఆంజనేయుని మాటలలోనే వుంది. అంతుబట్టని రహస్యాలు బట్టబయలు చేస్తున్న ఈ భజరంగభళి మాటలు మిమ్ము బాగుపర్చి మీరు కోరుకునే బాబా సన్నిధికి అంటే బాబాతోనే సుస్థిరంగా కొలువై వుండే మార్గాలను, మర్మాలను తెలియచేస్తుంది!*

***పశుపక్ష్యాదులన్నీ వాటిలాగే ప్రవర్తిస్తున్నప్పుడు మనిషి కూడా మనిషిలాగే ప్రవర్తించాలి***
***భగవంతుని సృష్టి యొక్క లక్ష్యానికి వ్యతిరేకంగా మానవుడు ఎందుకు దానవుడౌతున్నాడు?***
***మనిషి తనను తాను ప్రశ్నించుకోవాలి తన ప్రవర్తనను విశ్లేషించుకోవాలి***
***అధికారం, హోదా, పదవి, ఆశ్రిత పక్షపాతం, వ్యామోహం, ధనం, కామం, గర్వం***
***ఎన్నెన్ని అగడ్తలో !***
***మనిషి కాస్తా మహిషిగా మారిపోవటానికి ఇన్ని అరిష్టాలను వదిలించుకుని***
***మనిషి మనిషిలా నిలబడాలి మానవత్వానికి చిరునామాగా నిలవాలి***
***ఈ చిరంజీవి మాటలు పాటించి, చిద్విలాసంగా సత్ చిత్ స్వరూపుని కనుగొని***
***ఆనందామృతులై అత్యున్నత ఆనంద సామ్రాజ్యానికి విచ్చేసి***
***వీరావేశంలో విన్నపాలను అందుకుంటున్న ఈ వీరాంజనేయుని సన్నిధికి చేరి***
***ఆధ్యాత్మిక పాఠాలలోని అంతులేని విశేషాలను గ్రహించి***
***అజ్ఞానం తొలగించుకుని ఈ సద్గురు బోధనలతో దరిచేరి***
***దర్శనానందాన్ని తనువును మరచే తన్మయత్వంతో సుఖించండి సదా***
***నా చిన్నారి ముద్దుబిడ్డలారా !***

ॐ

**22-09-2018** 10:15 AM

## 52) ఆశ మరియు ఆశయం ఎట్టివి స్వామీ?

*కోరికకు పర్యాయపదం ఆశ. పొందాలి అని భావిస్తే, దాన్ని ఆశ అంటారు. సకారాత్మక ఆలోచనలతో ఆశ అవసరం. కానీ, అత్యాశ, దురాశ అనవసరం. ఇవి దుఃఖానికి దారి తీస్తాయి. విజేత కావాలన్న ఆశ ఆశయమైతే, గమ్యం విజయీభవగా మారుతుంది. మానవుని మేధస్సుతో అసాధ్యాన్ని*

సుసాధ్యంగా చేయగలరన్నది సత్యం. గమనిస్తే, ఆదిమానవునికి, నేటి ఆధునిక మానవునికీ ఎంతో వ్యత్యాసం కన్పిస్తుంది. ఈ వ్యత్యాసం గోచరించటానికి మానవుడు తనలో దాగి వున్న మేధాసంపత్తిని వెలికి తీసి ఉపయోగించడమే కదా! నాడు మానవుడు మోటు – నేటి మానవుడు రిమోటు! నాడు వండటం తెలియదు – కానీ, నేడు వండినది సీల్ చేసి సంవత్సరాల తరబడి తింటున్నాడు. ఆశకు పర్యాయపదం కోరిక. పరిస్థితులను బట్టి కోరిక ఉద్భవిస్తుంది. ఆశ అనేది మానవునికున్న సహజమైన గుణం. శరీరంలో నిక్షిప్తమైన గుణాలలో ఆశ ప్రధమగుణం. ఆశకు అంతముండదు. ఒక కోరికను తీర్చుకున్న తర్వాత ఇంకొక కోరిక మొదలవుతుంది. ఇది మానవ నైజం. తృప్తి, సంతృప్తి మనిషికి చాలా తక్కువ. ప్రాపంచికంగా, భౌతికంగా మానవుని ఎదుగుదల ఆశ వుండటం వల్లనే జరుగుతుంది. అనంతమైన, దాగి వున్న శక్తిని ఆశ మాత్రమే వెలికి తీస్తుంది. ఆశలోనే ఆశయం చిగురిస్తుంది. పరిస్థితులను బట్టి మానవుడు తనకు అనువైన ఆలోచనలను ఆశల రూపంలో విడుదల చేసుకుంటూ తన భౌతిక శక్తిసామర్థ్యాలతో వాటిని పొందగలుగుతున్నాడు. ఆశ, ఆశయంగా మారినప్పుడు, పట్టుదల పెరిగి, అనూహ్యమైన శక్తి మానవుడ్ని ముందుకు తీసుకొనిపోయి, గమ్యాన్ని చేర్చుతుంది. అనంతమైన శక్తి తన లోపలే నిక్షిప్తమై వుందన్న విషయాన్ని గ్రహించటానికి మానవునికి ఎంతో కాలం పట్టింది. మానవ ప్రయత్నం అప్రయత్నంగా ముందుకు సాగడం సహజం. పరిణామం పరిస్థితులను బట్టి జరుగుతుందన్న విషయం మీకు విదితమే. ఆశ పరిణామాన్ని కోరుకుంటుంది – ఆశయం పరిణామంతో పరిపక్వస్థితిని సిద్ధించుకుని చరిత్రను సృష్టించుకుంటుంది. "న ఆశ న జీవితం – న ఆశయం న గమ్యం". ఆశ లేకపోతే జీవితం లేదు – ఆశయం లేకపోతే గమ్యం చేరలేరు. నావ ఒక్కటే ఏరును దాటలేదు. నావకు తెడ్డు అవసరం. నావ ఆశ్రయాన్నిస్తే, తెడ్డు దిశ-దశలను నిర్దేశిస్తుంది. అదే విధంగా, ఆశ నావ అయితే, ఆశయం తెడ్డుగా పనిచేసి, దిశ దశలను సూచిస్తుంది. జీవితం ముందుకు సాగటానికి ఆశ జీతంలాంటిది. భౌతికావసరాలు తీర్చుకోవడాన్ని సహజసిద్ధంగానే మనిషికి కోరిక ఆశ రూపంలో పుడుతుంది. ప్రతి మనిషి ఏదో ఒకనాడు అంతర్మధనంతో, తన్ను తాను తెలుసుకోగలడు. ఇదే ధర్మం, ఇదే వేదం. మనిషిలోని మనిషి అంతర్మధనం చెందినప్పుడు, వెలికి వస్తాడు. అప్పుడే ఆశయం ఉద్భవిస్తుంది. ఆశయ సాధనకు మానవుడు కార్యోన్ముఖుడు కాగలడు. తనలోని అనంత శక్తిని తెలుసుకుని, దాన్ని వినియోగించుకుంటాడు. ఆశయ సిద్ధికి మానవుడు అహర్నిశలూ శ్రమిస్తాడు. విశ్రాంతిని మరుస్తాడు. విధినైనా ఎదిరిస్తాడు. విశ్వానికి ఆదర్శమవుతాడు. ఆశయంలో చిన్న, గొప్ప తేడాలుండవన్నది గ్రహించాలి. ఆశయాన్ని ఆశ్రయించాడంటే, ఏ వ్యక్తి అయినా, తనలో దాగివున్న అనంత శక్తిని వెలికి తీయటానికి సిద్ధమై ముందుకు దూసుకుని వెళ్తాడు. ఎన్ని అడ్డంకులు వచ్చినా, ఎన్ని అవాంతరాలు ఎదురైనా ముందుకెళ్ళి గమ్యాన్ని ఛేదిస్తాడు. ఇది సత్యం! ఆశ ధర్మబద్ధంగా వున్నప్పుడు, ఆశయం మహోన్నతంగా వుండి, ఏ వ్యక్తినైనా ఆదర్శశక్తిగా మార్చుతుంది. భౌతికమైన అవసరాలను పొందటానికి ప్రతి మనిషి ఆశను కలిగి వుంటాడు. ఆశ సహజం – ఆశయం ప్రత్యేకం. ఆశయం అంకురార్పణలో గమ్యం చేరుకుంటారు. గమ్యం చేరుకోవాలంటే, ఆశయాన్ని సిద్ధించుకోవాలి. ఆశయాన్ని సిద్ధించుకోవాలంటే, అనూహ్యమైన ఒడిదుడుకులను, కష్టనష్టాలను భరించాలి. సహనంతో ముందుకెళ్ళాలి. గమనించినప్పుడు, ప్రతి రేణువు పరమాత్మ స్వరూపమే. నిన్ను నీవు గమనించుకుంటే వేదాంతం – నీలోనికి నీ ప్రయాణం వేదం!

అంతం నర్మగర్భమైన జ్ఞాననిధి, ప్రతిమనిషి మది. వజ్రాన్ని రాళ్ళ నుంచి వేరు చేసి, సానబెట్టినప్పుడే, వజ్రం విలువ తెలుస్తుంది. ప్రతి మానవుని మది, వజ్రం కన్నా విలువైనది. వజ్రమును సానబెట్టినట్లు, మానవుని ఆశను సానబెట్టితే, ఆశయం జనించి, అద్భుతమైన మార్పు చెందుతాడు మానవుడు. జాలి, దయ, కరుణ, ప్రేమ, సేవ, అహింస లాంటి దైవగుణాలు అందరిలో వున్నా, వాటిని వెలికి తీయటానికి ఆశయం ఆత్యంతావశ్యకము. ప్రతి జీవితానికి జీవితాశయం వుంటుంది. మానవజన్మ సార్ధకతకు ఆశయమే ముఖ్యం. "మందడుగు కాదు, ముందడుగు కావాలి." ఆశయసిద్ధికి, ఆశయస్ఫూర్తికి వెసులుబాటు కాదు, సిసలైన కట్టుబాటు కావాలి. ఆశయ సాధనకు అర్థాన్ని విశ్లేషించి పరమార్థాన్ని గ్రహించాలి. అప్పుడే, వస్తువు నుంచి వాస్తవానికి, పదార్థం నుంచి యదార్థానికి రాగలరు. సంకుచిత తత్త్వం నుండి విశాల తత్త్వానికి మారడానికి మనిషి మనుగడలోనూ, ఆశా దృక్పథంలోనూ, పరిణామం చోటుచేసుకుంటుంది. నకారాత్మకత నుంచి నిరాశ, నిస్పృహ భావాలు జన్మిస్తాయి. ఆశ సకారాత్మకతను ప్రోత్సహిస్తే, నిరాశ నకారాత్మకతను, నిట్టూర్పును ప్రోత్సహిస్తుంది!

***తన మనసున ప్రేమ లేదు***
***ఇతరులపై దయ లేదు***
***ఆదరణ చూపలేడు***
***కానీ, తనకై అందరూ శ్రమించి, తనకు సుఖాన్నివ్వాలి***
***మనిషికి వుండవలసిన లక్షణం మానవత్వం***
***అది లేని మానవుడు కలిగి వున్నది పశుత్వం***
***అది పశుతుల్యం అని భావించుకుని***
***ధర్మాత్ముడివై, అందరితో ప్రేమించబడి***
***ఆనంద జీవితాన్ని పొందగలవాడివై***
***జగత్తు ఆనందానికి నీవే మూలకారకుడివై***
***ఆంజనేయుని పదాలు పొల్లుపోక పాటించి***
***పవన కుమారుని పాదాలు ఆశ్రయించిన జీవి ఒక విశిష్టమైన జీవిగా గుర్తించబడి***
***ఈ రక్షకునిచే రక్షించబడిన వారై సుఖాన్ని పొంది***
***ఆశయసిద్ధిని ఆంజనేయుని ద్వారా పొంది సుఖించండి***
***ఆధ్యాత్మిక సందేశాలతో సగుణాత్ములైన***
***నా చిన్నారి ముద్దు గున్నలారా !***

ॐ

**24-09-2018** 09:35 AM

**53)** ముక్తిని పొందే మార్గాల గూర్చి వివరంగా తెలుసుకోవాలని ఉంది స్వామీ?

భిన్నత్వం అనేది ప్రకృతి సహజం. అందరూ ఒకే రకంగా వుండరు, ఒకే విధంగా ప్రవర్తించరు. వారి వారి అభిరుచులకనుగుణంగా జీవిస్తూంటారు. అదే విధంగా భగవంతుని వైపుకు మళ్ళి, జీవిత పరమార్థం నెరవేర్చుకోవాలనే వారు కూడా వారి వారి అభిరుచిని బట్టి మార్గాలను ఎన్నుకుంటారు. వానిలో ప్రధానంగా 5 మార్గాలున్నాయి. 1) కర్మయోగం 2) భక్తియోగం 3) జ్ఞానయోగం 4) హఠయోగం 5) రాజయోగం. ఎవరికి వారు వారి అవసరాన్ని బట్టి మార్గాలను అనుసరిస్తూంటారు. పూజలు, పునస్కారాలు, వ్రతాలు, దీక్షలు, ఉపవాసాలు, మాలాధారణ, సామాజిక సేవా కార్యక్రమాలు వంటివన్నీ కర్మయోగం క్రిందకు వస్తాయి. ఇది తమోగుణ సంబంధమైన అమాయకులు అనుసరించే విధానం. కానీ, తాము చేస్తున్న కర్మల నుండి ఎటువంటి ప్రతిఫలాన్ని ఆశించకూడదు. ఇది అతి సులభమైన మార్గం. అందరూ అనుసరించవచ్చు. అయితే, భగవంతుని పట్ల సంపూర్ణ విశ్వాసముండాలి. భజనలు, భక్తిగీతాలు, ఉపాసన, ఆరాధన వంటివన్నీ భక్తియోగం క్రిందకు వస్తాయి. ఒక విగ్రహాన్ని, పటాన్ని, స్వామిని ఎన్నుకుని ఆయనను భగవంతుని ప్రతిరూపంగా భావించి భక్తిప్రపత్తులతో కొలవటం జరుగుతుంది. ఇటువంటి వారికి ఆరాధించే వ్యక్తి లేక శక్తి పట్ల సంపూర్ణ శరణాగతి వుంటుంది. ఆయనకు తన సర్వస్వాన్ని సమర్పించుకుంటారు. ఇది కర్మయోగం కన్నా కష్టమైనది. కొద్ది మంది మాత్రమే అనుసరించ గలుగుతారు. ఎందుకంటే, పాటలు, భజనలు, కీర్తనల వంటివి అందరికీ సాధ్యం కాకపోవచ్చు. వీరిది రజోగుణ సంబంధమైన స్వభావం. ఈ మార్గం ద్వారా ఇంద్రియ నిగ్రహం కలుగుతుంది. ఇక మూడవది జ్ఞానమార్గం. ఇది ఇంకా కష్టమైనది. అతి కొద్ది మందికి మాత్రమే అవకాశముంటుంది. ఎవరికైతే, సత్త్వగుణం అధికంగా వుండి, వివేచన, విచక్షణలతో ముందుకు వెళ్ళగలుగుతారో, వారు మాత్రమే ఈ మార్గంలో పట్టు సాధించ గలుగుతారు. కర్మ నుండి భక్తికి, భక్తి నుండి జ్ఞానానికి మళ్ళవచ్చు. అయితే, అందుకు పరిపూర్ణ అద్వైత బ్రహ్మజ్ఞానం ఆవశ్యకం. దానిని గురించి సరియైన అవగాహన చేసుకోవాలి. అప్పుడే, అది అనుభవంలోకి వస్తుంది. అందుకే, గురువుగా ఈ ఆంజనేయుడు అందిస్తున్న అనేక బోధలు. ఈ అనుభవాలు, అనుభవంలోకి వచ్చిన తరువాతనే, ధ్యానాన్ని కొనసాగించాలి. ఆ ధ్యానం యొక్క అంతిమ స్థితే సమాధి అవుతుంది. ఆ విధంగా ధ్యానం, సమాధి వంటి విధానాలను అనుసరించడమే రాజయోగం అవుతుంది. ఇది మనిషిని సంపూర్ణ స్వేచ్ఛ వైపుకు మళ్ళిస్తుంది. జీవిత పరమార్థాన్ని నెరవేరుస్తుంది. అయితే, కర్మ, భక్తి, జ్ఞాన మార్గాలను అనుసరించవచ్చును గానీ, అవి విడిగా వుంటే, పరిపూర్ణం మాత్రం కాదు. అందువలన, ఆ మూడింటినీ కలిపి అనుసరించ గలిగితేనే పరిపూర్ణత్వం సిద్ధిస్తుంది. పూర్ణత్వం సిద్ధించిన తదుపరి సాధన అతి సులభతరమవుతుంది. కేవలం జ్ఞానమొక్కటే వున్నప్పటికి, కర్మ, భక్తి మార్గాలను అనుసరించకుండా పూర్ణత్వం సిద్ధించే అవకాశమే లేదు. ఎందుకంటే, జ్ఞానం అనుభవంలోకి రావాలంటే కర్మ, భక్తి, జ్ఞాన మార్గాలు మూడూ తప్పక అవసరం. ఇక హఠయోగం అనేది శరీరాన్ని స్వాధీన పర్చుకునే కఠినమైన ప్రక్రియ. దానిని అన్ని రకాలుగా అదుపు చేసి ఇంద్రియ నిగ్రహంతో మనసును జయించే విధానమవుతుంది. ఎందుకంటే, సాధనకు శరీరం సహకరించాలంటే, అది పూర్తిగా అదుపులో వుండాలి. అందుకు కఠినమైన నియమనిబంధనలు అవసరం. అన్ని యోగాలు మనిషిని ఉన్నత పథం వైపుకు మళ్ళించడం కోసం అనుసరించే వివిధ రకాల అంతస్థులు. ఏదీ తక్కువ

*కాదు, ఏ ఒక్కటీ పరిపూర్ణం కాదు. ఆధ్యాత్మిక మార్గం అన్ని విధాలా మహోన్నతమైనదే. అందులో ఎటువంటి సందేహమూ లేదు. నేడు చాలా మంది కొనసాగిస్తున్నాము అంటున్నారు. అయితే, అందులో అతి కొద్ది మంది మాత్రమే లబ్ధి పొందుతున్నారు. ఎందుకంటే శరీరం, మనస్సు సహకరించినట్లయితే, ధ్యానంలో అద్భుత ఫలితాలను పొందవచ్చు. అందుకు వాటిని సంసిద్ధం చేయాలి. శరీరం తమోగుణ సంబంధమైన స్థితిలో వుండి, మనసు రజోగుణంలో వున్నట్లయితే సాధన కష్టమవుతుంది!*

**54) శరీరాన్ని, మనసును సాధనకు సంసిద్ధం గావించడమెలా స్వామీ?**

*అందుకు వ్యక్తిగత జీవితం, జీవనవిధానం స్వచ్ఛంగా, నియమబద్ధంగా, క్రమశిక్షణగా వుండాలి. అతి సరళమైన, సామాన్యమైన జీవితం అత్యంతావశ్యకం. ధనార్జన ధర్మబద్ధంగా వుండాలి. మీరు ఖర్చు పెట్టే ప్రతి రూపాయిలో ఎంతో శ్రమశక్తి దాగి వుంటుంది. సమాజానికి నిస్వార్థ సేవలను అందించడం ద్వారా చెడు కర్మఫలాన్ని తగ్గించుకోవచ్చు. వ్యక్తిగత అవసరాల కోసం సమాజం మీద ఆధారపడి అవసరానికి మించి వనరులను ఉపయోగించుకుంటే, అది తప్పక కర్మబంధమవుతుంది. అట్టి స్థితిలో తమో రజో గుణాలు ఆధిక్యతను సంతరించుకుని సత్త్వగుణం మరుగున పడుతుంది. సాధనకు శరీరం, మనసు సహకరించే అవకాశమే వుండదు. నేడు అందరూ శారీరక సుఖమే జీవిత లక్ష్యంగా ముందుకు సాగుతున్నారు. పిన్న వయసు నుండే అవసరాన్ని మించి వనరులను వినియోగించడం సర్వసాధారణమైంది. శ్రమ శక్తిని దోచుకునే విధానం అతి ప్రమాదకరమైనది. ఇటువంటి కీలకమైన అంశాలను పరిగణనలోనికి తీసుకోకుండా బలవంతంగా సాధనలు చేయడం అతి ప్రమాదకరం. వాస్తవానికి ఎవరైనా ఆధ్యాత్మిక మార్గం వైపుకు మరలుతున్నారంటే, అందుకు మూలకారణం అంతరంగమందలి అసంతృప్తే. మరింకేమీ కాదు. అసంతృప్తి లేకుండా ఎవ్వరూ భగవంతుని గూర్చి ఆలోచించరు. అటువంటి అసంతృప్తి ఉత్పన్నం కావడానికి మూలకారణం అధర్మమైన జీవనవిధానం. ఆ అధర్మాన్ని అనుసరించడానికి మూలం అజ్ఞానమే. కాబట్టి అజ్ఞానాన్ని తొలగించుకోవాలంటే, ఆత్మజ్ఞానమే శరణ్యం. మరింకేమీ ప్రత్యామ్నాయం లేదు. జ్ఞానపరంగా పరిణతి చెందిన తర్వాత ఇక జీవితమే సాధనగా మారుతుంది. ప్రత్యేకంగా సాధన యొక్క అవసరమే వుండదు. వాస్తవానికి సాధన అంటే చేయడం కాదు. నేను సాధించవలసింది ఏమీ లేదు అనే అంశాన్ని అనుభవంలోకి పొందడమే. ఎవరికైనా, ఏదైనా సాధించాలనే భావన ఉన్నదంటే, అందుకు మూలకారణం భౌతిక ప్రపంచం పట్ల బలీయమైన ఆకర్షణ వుండటమే. భౌతిక ప్రపంచంతో విడరాని సంబంధముండి, ఎంత కఠోర సాధన చేసినా, ఎటువంటి ప్రయోజనమూ వుండదు. లౌకిక జీవితం నియమబద్ధంగా వుంటే, నిరంతర సాధన జరుగుతున్నట్లే!*

***ధర్మం ఒక విశిష్ట ప్రకృతి లక్షణం***
***అది సర్వత్రా అన్నిటా వుండే విశేషం***
***ఉప్పుకు ఉప్పదనం దాని లక్షణం పంచదారకు తీపిదనం దాని లక్షణం***
***మరి మనిషికి వుండవలసిన లక్షణమేది?***
***ధర్మాన్ని రక్షిస్తున్నది ఎక్కడ?***
***నేటి ద్విపాదియైన మానవుడు దాన్ని వదిలేసి నేడు బ్రతుకు సాగిస్తున్నాడు***

***తాను నీల్గుచూ, మూల్గుచూ ఇతరులపై అసహనాన్ని ప్రదర్శిస్తూ***
***ఆ ప్రదర్శనయే సాధనగా తలపోస్తూ***
***బ్రతుకు బండిని కష్టతరంగా ఈడుస్తూ***
***జీవితాన్ని జీర్ణించుకోలేక అవస్థలు పడుతున్న ఈ మానవాళికి***
***అద్భుత ఆనంద మూలికలు ఈ ఆంజనేయుని మాటలు***
***ఈ మూలికల వాసన, జ్ఞాన తృష్ణను రగిల్చి***
***వేసుకున్న రంగుల మాస్కును విడిచి***
***మారుతిని చేరి, మాయ ఛేదించుకుని***
***చిరంజీవులై సర్వదా సర్వదా సర్వదా సుఖించండి***
***నా చిన్నారి ముద్దుబిడ్డలారా!***

ॐ

**25-09-2018** 10:30 AM

## ఆంజనేయునితో ఆధ్యాత్మిక సంభాషణ

*ఈ రోజు కొన్ని ప్రశ్నలడుగుతాను, సమాధానమివ్వాలి. నీ సందేహాలకు నేను సమాధానమిస్తాను. సరేనా? అంటూ,* **ఆంజనేయస్వామికి (ఆ), మాతా విశ్వాత్మానందగిరికి (వి) మధ్య జరిగిన సంభాషణలు.**

*ఆ:- క్రమశిక్షణ, నిరంకుశత్వం ఈ రెండు పదాలలోని సున్నితమైన సరిహద్దురేఖని ప్రతి ఒక్కరూ గుర్తించవలసిందే. మనోనిగ్రహాన్ని అలవర్చుకుని క్రమశిక్షణను పాటించాలి. అలాగే, ప్రేమ, మానవత్వం మరచిపోకుండా ఇతరుల చేత క్రమశిక్షణ పాటింపచేయాలి. కానీ, ఈనాడు వున్నదానిని, ప్రదర్శిస్తున్న దానిని మీరు క్రమశిక్షణ, అంకితభావం అని అనగలరా?*

**వి:- భక్తిలో, సేవాకార్యాలలో గంభీరంగా వుంటూ, నా మాటే వేదం అనేవారు మా చుట్టూ చాలా మంది కానవస్తారు. దానిని ఇగో, అహం అంటామే గానీ, క్రమశిక్షణ అనం స్వామీ! స్వామి చెప్పినటుల, Help Ever అన్న స్వామి వెంటనే Hurt Never అన్నారు గదా. దానిని మేము మరచిపోతే ఎలా? క్రమశిక్షణలో చిరునవ్వుకి, మృదువచనాలకి, సౌమ్యతకి అసలు స్థానం లేనే లేదు అనే మాటను ఆలోచిస్తే, స్వామి ఎంతో హాయిగా నవ్వుతూ నవ్విస్తూ తన బిడ్డలను ఎంతో క్రమశిక్షణలో వుంచేవారు. దానిని ఆదర్శంగా తీసుకుని, అలాగే ప్రేమతో, చిరునవ్వుతో సేవ చేస్తూ క్రమశిక్షణ అనే కంచె దాటకుండా, జాగ్రత్త పడవచ్చు స్వామీ. దీనినే స్వామి తరచుగా Love All Serve All అని చెప్పారు. ఈ పదాన్ని మా క్రమశిక్షణలో ఒక భాగంగా చేర్చుకుంటే, అంతా సంతోషమే స్వామీ!**

*ఆ:- ఇంత చెప్పినది బాగానే వుంది కానీ, అసలు క్రమశిక్షణ అంటే ఏమిటి?*

**వి:- ఏ విషయానికి సంబంధించినవైనా, నియమాలను ఖచ్చితంగా పాటించడము స్వామి. ఇందులో**

**ఎవరికీ ఎటువంటి మినహాయింపులూ వుండవు. ఆ నియమాలను ఉల్లంఘించడం అనుచితమైనది స్వామి. క్రమశిక్షణ మనో నిగ్రహానికి పరీక్ష వంటిది. ఇందులో సత్ఫలితాలను సాధించడం అంత తేలిక కాదు స్వామి. మేము క్రమశిక్షణ పాటించడమే కష్టం కానీ, ఇతరులు కూడా పాటించాలని ఆశించడం, ప్రయత్నించడం ఇంకా కష్టమైన పని అనుకుంటాను. కానీ, ఆధ్యాత్మిక మార్గంలో పయనించే వారు క్రమశిక్షణ పాటించడం చాలా చాలా అవసరం స్వామి!**

*ఆ:- మీరు ఎంతోమంది మహానుభావులను స్ఫూర్తిగా తీసుకొని సాధన చేయాలి అన్న సంకల్పాన్ని తీసుకుంటున్నారు. సాధన అంటే కళ్ళు రెండూ మూసుకుని నిటారుగా కూర్చోవటం, గంటలకొద్దీ భజనలు పాడటం కాదు కదా? మానవజన్మ ఎందుకు వచ్చింది? మీరు దానిని ఎలా బాగు చేసుకోవాలి? దానిలోని పరమార్థాన్ని ఎలా గ్రహించాలి?*

**వి:- మానవుడు చైతన్యవంతుడు. నిత్యం నిర్విరామంగా, నిరంతరాయంగా, నిస్వార్థంగా సాగే ఒక సదాలోచన, సత్కర్మ, క్రియాశీలత. దానిని తాను ఆచరిస్తూ, పదిమందికీ అందించాలి. మానవుడు జడపదార్థం కాదు, చైతన్యానికి ఒక ప్రతీక. ఆలోచించే సామర్థ్యం వున్నది. ఆ ఆలోచనలతో ప్రతి పనిని, మాటను ఒకటికి పదిసార్లు ఆలోచించి ముందడుగు వెయ్యాలి. ప్రారంభం అయిన తర్వాత వెనకడుగు వేయకూడదు. అదే మానవుని లక్షణం, అదే ఆత్మవిశ్వాసం. ఏది పోయినా ఫర్వాలేదు, ఆత్మవిశ్వాసం, ఆత్మగౌరవం పోయిన నాడు, ఆ జీవి వున్నా పోయిన వానితో సమానం.**

*ఆ:- ఇది స్వామి ప్రశ్న. ఒక రైతు ఇంటి నుండి నాలుగు మూటల వడ్లు తీసుకుని వెళ్ళి బురదలో చల్లుతున్నాడు. అసలు తినటానికే తిండి లేనప్పుడు, ఈ నాలుగు మూటల వడ్లను బురదలో ఎందుకు పోస్తున్నాడు?*

**వి:- ఇది కూడా స్వామి సమాధానమే స్వామీ! ఇది వృథా చేయటం కాదు. ఇప్పుడు బురదలో పోసిన నాలుగు మూటల వడ్లు, కొద్ది నెలలలోనే నలభై మూట్ల వడ్లను పొందుతాడు ఆ రైతు. ఇది యజ్ఞము యొక్క స్వరూపము స్వామీ. అలాగే, ఈ రోజు మేము యజ్ఞములో ఒక్కొక్క నామం చెబుతూ ఒక్కొక్క నెయ్యి బొట్టు అర్పితం చేస్తూంటే, ఆ అర్పితం చేసినటువంటి దివ్యమైన మంత్రస్వరూపం గాలిలో చేరిపోతూ వుంటుంది. అది వ్యాపించి దుర్భావములతో కూడినటువంటి శబ్దాలను పవిత్రం కావిస్తూ వుంటుంది. మంత్ర స్వరూపం ఒకచోట నిలిచేటటువంటిది కాదు, సర్వత్రా ప్రయాణం చేస్తూ, శబ్దకాలుష్యాన్ని నివారించేటటువంటిది!**

*ఆ:- మీరు పూర్ణమదః పూర్ణమిదం అని సంబోధిస్తుంటారు. దీనిని ఎలా అనుభవించగల్గుతున్నారు?*

**వి:- అంతా పరిపూర్ణ స్వరూపమే. అదియూ పూర్ణమే, ఇదియూ పూర్ణమే. పూర్ణముచే ఉదయించేది పూర్ణమే. కాబట్టి, భగవంతుడు పూర్ణస్వరూపుడు. అంతటి పరిపూర్ణ స్వరూపుడ్ని పూర్ణముతోనే అంటే పరిపూర్ణమైన తృప్తితోనే పూజించాలి. ఆ పరిపూర్ణ స్వరూపుడ్ని, పరిపూర్ణమైన పరిపూర్ణంగా తృప్తిపర్చాలి. పరిపూర్ణ స్వరూపుడైన పరమాత్ముడ్ని పరిపూర్ణంగా తృప్తిపర్చకపోతే, మా పని, మా జీవితం సంపూర్ణంగా వ్యర్థమే స్వామీ!**

*ఆ:– జీవితం క్షణభంగురం కదా? రేపు మీరు చూడగలరో లేదో. రేపటి చింత నైరాశ్యానికి గురిచేస్తుంది కదా? మానసిక ఒత్తిడిని పెంచుతుంది. కావున, మీ కర్తవ్యం ఏమిటి? రేపు నిన్నగా మారక ముందే దానిని ఎలా సద్వినియోగం చేసుకుంటారు?*

**వి:– రేపు నిన్నగా మారక ముందే, దానిని సద్వినియోగం చేసుకుంటాము స్వామి. నేటి మా సత్కర్మలే గతంగా రూపు దిద్దుకున్నప్పుడు, మా స్మృతి పథంలో అవి మెదులుతున్నప్పుడు మాకు ఆనందం, తృప్తినిస్తాయి. నేటి మా కర్మలే మాకు అందమైన భవిష్యత్తును అందిస్తాయి. అంటే వర్తమానమే మా గతానికి ఆకారమిస్తుంది, రేపును నిర్ణయిస్తుంది. కాబట్టి, ఈ క్షణాలు మా చేతిలో నుండి జారిపోక ముందే, నామస్మరణ, సేవాకార్యాలు, దానధర్మాలు చేయటం మా తక్షణ కర్తవ్యం అని భావిస్తున్నాను స్వామీ!**

*ఆ:– నేను మీకు ఇంకొక విషయాన్ని ముందే చెప్పివున్నాను. అది ఏమంటే, గమనించవలసిన విషయము. మీరు చేసినదాన్ని సరిదిద్దుకునే అవకాశం కూడా వున్నదని చెప్పాను. దానిని ఎలా ఆలోచించారో చెప్పండి.*

**వి:– స్వామీ! గోడకు లోతుగా కొట్టిన మేకు తీయాలంటే గుంజితే రాకపోవచ్చు. ఎంత బలంగా కొట్టామో, అంతే బలంగా బయటకు లాగాలి. దానిని పట్కారుతో లాగాలి. అది అప్పుడు గోడలో నుండి బయటకు వస్తుంది. ప్రారబ్ధము నుండి బయటపడటానికి పురుష ప్రయత్నము కూడా అలాగే ఉపయోగపడ్తుంది. చేసిన పాపకర్మలకు పశ్చాత్తాపపడటం, అట్లాంటి పాపాన్ని మరలా చేయకుండుట, చేయననే సద్బుద్ధిని పొందటం, లోకహిత సేవలను చేయటం ద్వారా మేము చేసిన పాపాల నుండి విముక్తులవుతాము.**

*ఆ:– భోజనము ఎంత సేపు చేస్తావు?*

**వి:– అర్ధగంట స్వామీ.**

*ఆ:– అది కాదు సరియైన సమాధానము. ఆలోచించి చెప్పు!*

**వి:– తెలియుట లేదు స్వామీ.**

*ఆ:– కడుపు నిండేటంత వరకూ భోజనం చేస్తావు. ఎక్కువ టైము భోజనం చేస్తే ఎక్కువ భోజనము చేసినట్లు కాదు. కడుపు నిండేంత వరకూ భోజనం చేయాలి. అట్లే హృదయం పండేంత వరకూ దైవాన్ని ప్రార్థించాలి. హృదయం పండటమంటే ఏమిటి? ప్రేమ మీరైపోవాలి. ప్రేమమయంగా మారాలి. ఇట్టి ప్రేమతత్త్వాన్ని పెంచుకుంటే ఈ యుగములు, ఘడియలు, కర్మలు, బంధాలు మిమ్మల్ని ఏ మాత్రమూ చలింప చేయలేవు.*

*ఆ:– ఇంతకీ ప్రేమ అంటే ఏమిటి?*

**వి:– ఎట్టి ఫలమునూ ఆశించక ఉపకారం చేసే తత్త్వానికే ప్రేమ అని పేరు.**

***భక్త మార్కండేయుని వంటి పట్టుదలతో***
***భక్త ప్రహ్లాదుని వంటి భక్తి తన్మయత్వంతో***
***ధ్రువకుమారుని దీక్షను పొందుటకై ప్రయత్నిస్తూ***
***కర్ణుని దానగుణము కలుగు బుద్ధిని అర్థించి***
***హనుమ శక్తియు, సేవయూ, అణకువయూ కోరుకుని***
***రఘుకుల సోదరుల అన్యోన్య ప్రేమను బొంది***
***ఉడుత, జటాయువుల సేవను గుర్తించి***
***దేవదేవుండు దీనబాంధవుడు అయిన ఆ భగవంతుని చేరుటకు మ్రొక్కుచూ***
***ఆయన కృపను బొందుటకై ఈ ఆంజనేయుడు అడిగిన ప్రశ్నల వైనాన్ని గుర్తించి***
***గడువు తీరక మునుపే ఘడియలో ఈ ఘటమును (కుండ) రామ సన్నిధి చేర్చి***
***రయమున సుఖించండి సదా***
***నా చిన్నారి ముద్దుబిడ్డలారా!***

ఓం

**26-09-2018** 10:30 AM

*ఆ:– ఏకత్వము అంటే ఏమిటి?*

**వి:–** హృదయము, వాక్కు, చర్యలు ఈ మూడింటి ఏకత్వం వలననే పవిత్రత లభ్యమవుతుంది. అప్పుడే దివ్యత్వంలో ప్రవేశిస్తాము. దివ్యత్వంలో ప్రవేశించినప్పుడే ద్వేషము దూరమైపోతుంది. కోపం వచ్చినా, తాపం వచ్చినా, కష్టాలు కలిగినా సహించుకుని, నెట్టుకుని, తట్టుకుని ముందుకు సాగే ఓపికను సంపాదించుకోవాలి.

*ఆ:– సంకల్ప ప్రభావం సర్వాంగాలకు వ్యాపిస్తుందంటావా?*

**వి:–** ఔను స్వామీ. ఒక పెద్ద కొలనులో రాయిని విసిరినప్పుడు, దాని వలన ఏర్పడిన తరంగములు ఆ కొలనులో అంతటా వ్యాపిస్తాయి. అదే విధముగా మా మానససరోవరంలో ఒక తలంపు అనే రాయిని విసిరినప్పుడు, అది మంచితలంపే కావచ్చు లేక చెడుతలంపే కావచ్చు. ఆ మనోతరంగాలన్నీ మా చేతులకో, కాళ్ళకో, కన్నులలో, చెవులలో, శరీరంలో అంతటా ప్రాకిపోతాయి. చెడ్డతలంపు కలిగితే, నా కన్నులు చెడ్డనే చూస్తాయి, నా కాళ్ళు చెడ్డప్రదేశానికే పోతాయి, నా చెవులు చెడ్డవిషయాన్ని వింటాయి. కనుక, మా మానససరోవరంలో మంచితలంపులను వేసుకోవాలి. అప్పుడు ఏది చెప్పినా, ఏది చేసినా, ఏది చూసినా అంతా మంచే జరుగుతాయి. ఈ రోజులలో చెడ్డవి కన్పిస్తున్నాయి, చెడ్డవి వింటున్నాము, చెడ్డవి చెబుతున్నాము అంటే అవి బయటి నుండి వచ్చినవి కాదు. మా సంకల్ప తరంగములే. మా మంచికి గానీ, మా చెడ్డకు గానీ మా తలంపులే మూలకారణం. అట్లే బంధానికీ మోక్షానికీ మనస్సే కారణము. మా సంకల్పాలే కారణము. మొత్తానికి అంతా సంకల్పము పైననే ఆధారపడివున్నది. కనుక,

**దైవసంకల్పాలను అభివృద్ధిపరచుకుంటే, అప్పుడు ఏది చేసినా, చూసినా అంతా దివ్యంగానే వుంటుంది.**

*ఆ:– "నుదుటి వ్రాతను ఎవ్వరూ తప్పించలేరు. ఎలా వ్రాసివుంటే అలా జరుగుతుంది" అన్న మాటను మీరు ఎలా తీసుకుంటారు? మీ భావన చెప్పండి.*

**వి:– అది అక్షరాలా సత్యం స్వామీ! అన్నీ నమ్మినవారు ఎటువంటి ప్రయత్నాలు చేయకుండా, అన్నీ పైవాడే చూసుకుంటాడని కాలయాపన చేస్తూంటారు. కష్టాలకు, నష్టాలకు భగవంతుడే కారణం అని నమ్ముతారు. సోమరిపోతుగా మిగిలిపోతారు. ఒకరు సుఖవంతుడై జన్మిస్తాడు, మరొకడు అసుఖముతో జన్మిస్తాడు. ఒకడు భాగ్యవంతుడైతే, మరొకడు పరమ దరిద్రుడు. ఒక జీవి మరొక జీవిని భక్షిస్తుంది. బలవంతుడు బలహీనుడ్ని అణగద్రొక్కుతాడు. ఈ ఘోరాలు రేయీపగలూ జరుగుతూనే వుంటాయి. మరి ఇది నిర్మాణము చేసినది భగవంతుడే అయితే, భగవంతుడు మహా క్రూరుడై వుండాలని తలచినట్లైతే, అది నిజం కాదు స్వామి. ఉదాహరణకు అన్ని పొలాల మీద వర్షం సమంగా కురుస్తుంది. కానీ, చక్కగా దుక్కి చేయబడిన పొలం మాత్రమే వర్షము వలన ఉపకారం పొందుతుంది. ఇది మేఘాల తప్పా? లేక వర్షం తప్పా? ఈ భేదకల్పన చేయునది మేమే, భగవంతుడు కాదు. మా నుదుటివ్రాతను మేమే వ్రాసుకుంటాము. దానికి అవసరమైన శక్తిసామర్థ్యాలను సాధించటానికి మేమే కృషి చేయాలి. మా కర్మ, కర్మ అని బాధపడే కన్నా, సహనం అనే పనిముట్టుతో, క్రమశిక్షణతో ప్రవర్తించగల్గితే, భవిష్యత్తు ప్రశాంతంగా వుంటుంది స్వామి!**

*ఆ:– స్వామి ఎన్నో అనుభుతులను మీకు పంచిపెడ్తున్నారు. దానికి కృతజ్ఞతను ఎలా చూపిస్తారు?*

**వి:– స్వామి మా కోసం అనేకం చేస్తున్నారు. అమితంగా ప్రేమిస్తున్నారు. దీనికి మేము ఎలా కృతజ్ఞతలు సమర్పించుకోగలము? మీరు, స్వామి మా దగ్గర వున్నప్పుడు, అనేక విషయాలను చెబుతూ వుంటారు. ఎన్నో దివ్యానుభవాలు, దివ్యానుభూతులు పొందుతూ వుంటాము. వాటిని పదిమందితో పంచుకుని ఆనందిస్తాము స్వామీ! ఇదే స్వామికి మేము సమర్పించగల కృతజ్ఞత. "నరోత్తమునకే అందుతాయి నమస్సులు, దురాత్ములకు కాదు. కారుణ్యునికే వంగుతాయి శిరస్సులు, కాఠిన్యానికి కాదు" అని మీరు చెప్పిన సత్యాన్ని స్వీకరించి మా స్వీయానుభూతుల్ని పంచుకోవడమే మా జీవిత లక్ష్యం. అదే గమ్యాన్ని చేరుస్తుంది.**

*ఆ:– మీరు ఈ మధ్య పాడుకుంటున్న పాట ఏమిటి?*

**వి:– తక్కువేమి మనకూ సాయిరాముడుండు వరకు**

*ఆ:– 'రామ' అనే మంత్ర ప్రాశస్త్యాన్ని వివరించగలవా?*

**వి:– లేదు స్వామీ!**

*ఆ:– సర్వశక్తులూ బీజమందే వుంటాయి. 'రామ' లో 'ర' అగ్నిబీజం. ఇది పాపం వలన, కర్మల వలన పేరుకున్న అజ్ఞానాంధకారాన్ని దహిస్తుంది. దీనినే 'సత్' అని కూడా అనవచ్చు. ఎప్పుడైతే అజ్ఞానం నశిస్తుందో, మిగిలేది దైవమే. రెండవది 'అ' అనే శబ్దం. ఇది సూర్యబీజం. ఇది మనస్సును*

*చైతన్యపరుస్తుంది. ఇలా చైతన్యం పొందిన మనస్సే చిత్. ఇక మూడవది 'మ' అనేది చంద్రబీజం. ఇది నిర్లిప్తతను ప్రసాదిస్తుంది. అట్టి స్థితినే ఆనందమంటారు. ఎవరైతే సుఖదుఃఖాది ద్వంద్వాలకు అతీతంగా ఉంటారో, అట్టి వారు మంత్రసిద్ధిని పొందినట్లు!*

*ఆ:–* AM PM *అంటారు కదా, దాని అర్థము?*

**వి:– AM ప్రొద్దున PM అంటే రాత్రి స్వామీ.**

*ఆ:– అంతేనా?*

**వి:– నాకు తెలిసింది అంతే స్వామీ.**

*ఆ:– ఇంగ్లీషులో చెప్పనా?*

**వి:– చెప్పండి స్వామీ.**

*ఆ:– AM అంటే ANTE MERIDIAN. PM అంటే POST MERIDIAN. సంస్కృతములో ఏమంటారు?*

**వి:– తెలియదు స్వామి.**

*ఆ:– AM అంటే, ఆరోహణం మార్తాండస్య PM అంటే, పతనం మార్తాండస్య. మరి తెలుగులో (మన భాషలో) ?*

**వి:– తెలియదు స్వామి.**

*ఆ:– AM అంటే, అంతా మర్చిపోయాను స్వామీ. PM అంటే ప్రొద్దున్న కూడా మర్చిపోయాను. AM అంటే, ఆహారం మర్చిపోలేదు స్వామీ. PM అంటే, పోపు కూడా మర్చిపోలేదు. దండిగా తినడమే డ్యూటీ కదా!*

***మారితే అందుతుంది మోక్షము లేకుంటే ఎదుర్కొంటారు పరీక్షలు***
***ఏ దేవుడూ కాడు ప్రత్యక్షము నీకు నీవే దైవానివి, దానికి నీవే సాక్ష్యము***
***నిన్ను బాగుపరచేది విచక్షణ నష్ట పర్చేది నిర్లక్ష్యము***
***అవసరం లేదు లక్షల రూపాయలు విచ్చుకోవాలి అంతర్ చక్షువులు***
***ఆంజనేయుడు అతి లాలనతో అందిస్తున్న జ్ఞానం***
***మీ యొక్క జ్ఞానం విశ్వంలో రక్షణనిస్తూ***
***రక్షణ కవచంలో రక్షించబడ్డ మీరు***
***రామనామంతో ఛేదించుకుని***
***చిత్తము శాంతి పొందించుకుని***
***పవనపుత్రుని ప్రాంగణములో చేరి***
***పరమసుఖాన్ని పొందండి ప్రాప్తులైన***
***నా చిన్నారి ముద్దుబిడ్డలారా !***

ఓం

**27-09-2018** 10:50 AM

*ఆ:- స్వామి బోధించిన బోధలు ఎందరు, ఎంతవరకు తీసుకోగలిగారు? మీ యొక్క ఆధ్యాత్మిక పయనం ఎంత లోతుగా జరిగినదని అనుకుంటున్నారు? అసలు ఆధ్యాత్మికతకు అర్థం గ్రహించారా?*

**వి:- ఆధ్యాత్మికత అంటే మా గురించి మేము అన్ని కోణాల నుండి సమూలంగా తెలుసుకోవటమే. మా గురించి మేము తెలుసుకున్న మరుక్షణమే అందరి గురించి, అన్నింటి గురించి తెలిసిపోతుంది. అలా గాక, బాహ్యమైన అంశాలకు, వ్యక్తులకు, రూపాలకు, విగ్రహాలకు ప్రాధాన్యతనిచ్చినట్లైతే, అది పూర్తిగా అజ్ఞానమవుతుంది. దురదృష్టకరమైన విషయమేమిటంటే, అద్వైతాన్ని మరచి, ద్వైతభావానికి అతిగా ప్రాధాన్యత నివ్వడం వలన, బాహ్యముఖ ప్రయాణం బలంగా వుండి, అంతరంగశుద్ధికి అవరోధమయినది. అందుకే స్వామి కూడా ఆ విషయాన్ని పదేపదే చెబుతూ వచ్చారు. అయితే, స్వామి లీలలు, మహిమలు, చమత్కారాలు, సిద్ధులకు ఆకర్షించబడ్డవారు స్వామితో భౌతికసంబంధం కోసం ఆరాటపడ్డారు తప్ప అంతర్ముఖ ప్రయాణాన్ని గురించి ఆలోచించలేకపోయారు. వ్యక్తిని గురించి ఆలోచించినంత కాలం, తత్త్వం మరుగున పడ్తుంది. వ్యక్తిని మర్చిపోతేనే, జ్ఞానం మీదకు దృష్టి మళ్ళుతుంది. అంతరంగాన్ని గురించి తప్పక ఆలోచించాలి. అంటే, స్వామితో భౌతికసంబంధాన్ని పూర్తిగా వదులుకోవాలా అంటే, అవసరం లేదు స్వామి. అది ఒకరకం అజ్ఞానం కూడా. పూర్ణత్వం నుండి స్వామిని దర్శించుకోగలగాలి. సంబంధాన్ని ఏర్పర్చుకోవాలి. అది అంతరంగశుద్ధికి అవరోధం కానేకాదు. అలాగాక, రూపంతో సంబంధం ఏర్పర్చుకున్నట్లైతే, ఆధ్యాత్మిక పురోభివృద్ధికి ఆటంకమౌతుంది. సర్వత్రా భగవంతుని దర్శించగలిగితే, స్వామి కూడా భగవంతుడే కదా! ఆయనలోనే మనమున్నాము కదా! ఇంతకన్నా తృప్తి ఏమి వుంది, ఆనందమేముంది?**

*ఆ:- ఆత్మ మూడు దశలుగా అనుభవానికి గోచరమవుతుంది అని మీకు చెప్పాను. దాని గురించి అడుగుతాను చెబుతావా? మీకు గుర్తు లేనట్లయితే, వాటి పేర్లు చెబుతాను. కనీసం పేర్లను గుర్తించి అయినా, సమాధానమివ్వండి. 1. కలుషితంగా 2. సవికల్పంగా 3. నిర్వికల్పంగా*

**వి:- కలుషితంగా అంటే ఆత్మ ఉపాధులతో కూడి వుంటుంది. అయితే, అనేక కోరికలతో ఆలోచనలతో వున్న మనసులో ప్రతిబింబించినప్పుడు, అది కలుషితంగానే తెలియబడుతుంది. మురికి నీటిలో వేసిన రూపాయి నాణెంలాగా సరిగ్గా తెలియదు. ఇదే కలుషితం అంటే అనుకుంటాను స్వామి.**

**సవికల్పంగా అంటే కోరికలు, ఆలోచనలు శాంతించినప్పుడు అహం బ్రహ్మాస్మి అనే మహావాక్యాన్ని, వాక్యార్థాన్ని నిత్యం మననం చేస్తూ నిశ్చలంగా ఏకాగ్రంగా, ఏకోన్ముఖంగా బుద్ధి నిలచి వున్నట్లయితే, అప్పుడు వ్యక్తమయ్యే ఆత్మ ప్రకాశాన్ని సవికల్పం అంటారనుకుంటాను స్వామి. అందులో సత్యం పల్చటి ఆవరణ వెనుక వుంటుంది అని మీరు చెప్పారు. బుద్ధి శాంతించినా, జీవభావం వుంది. చూసేవాడు ఆత్మ కన్నా భిన్నంగా వున్నాడు.**

**నిర్వికల్పంగా అంటే, మనోబుద్ధులు పూర్తిగా అంతరించి, ధ్యానించే తాను, ధ్యేయంగా మారినప్పుడు ఒక్కటే అయినప్పుడు, ఆత్మ నిశ్చలంగా ఏకంగా తానుగానే వుంటుంది. అదే నిర్వికల్పం అనుకుంటాను స్వామి.**

*ఆ:– శుద్ధమైన ఆత్మచైతన్య ప్రకాశాన్ని రజోగుణ తమోగుణ ఆవరణల నుండి విముక్తి గావించి, నిత్యశుద్ధంగా, ఏకంగా, తనను తాను గుర్తించి, స్వానుభవంగా సాధించేవాడే గురువు, ఆయనే పరమాత్మ!*

*మీకు ఒక సందేహం రావచ్చు. అదేమిటంటే, వస్తువులను, ప్రపంచాన్ని ప్రకాశింపచేయడం ఆత్మచైతన్యం యొక్క పనేనా? ఆత్మచైతన్యం మీరు చూసి తెలుసుకోవడానికి తన ప్రకాశాన్ని ప్రసరింపచేస్తుందా?*

**వి:– సమాధానం కొంచెం కష్టంగా వుంది స్వామీ!**

*ఆ:– ఆత్మ నిష్క్రియం. ఏమీ చేసేది కాదు. పైగా, అది నిరవయవం. దానికి అవయవాలు లేవు. నిరాకారం. సూక్ష్మాతి సూక్ష్మం. అటువంటి ఆత్మ ఏమీ ఆలోచించదు, ఏ కార్యాన్నీ చేయదు. "సూర్యుడు అందరికీ వెలుగునిస్తున్నాడు" అంటే ఎంత తప్పో, అలాగే "ఆత్మ అన్నిటికీ చైతన్యాన్ని, ప్రకాశాన్ని ఇస్తుంది" అంటే అంతే తప్పు. సూర్యుని స్వభావం వెలగడం. అలాగే ఆత్మ స్వభావం చైతన్యం, ప్రకాశం. అంతే! కనుక, వస్తువు యొక్క స్వభావాన్ని వస్తువు యొక్క కార్యంగా చెప్పరాదు. స్వభావంలో ఏ శ్రమా వుండదు. హాయిగా జరిగిపోతుంది. కార్యం అలా కాదు. ఎంతో కష్టంగా జరుగుతుంది. కంటిరెప్పలు వేయటం మీ స్వభావమే కానీ, పని కాదు. దానిని పనిగా చేద్దామనుకుంటే, అది మీకు ఎంతో భారమవుతుంది. కంటికి నొప్పి కలుగుతుంది. కనుక, ఆత్మ యొక్క స్వభావం ప్రకాశం. అటువంటి ఆత్మ యొక్క సాన్నిధ్యం వల్ల ప్రపంచం, ఇందులోని వస్తువులు ప్రకాశిస్తున్నాయి, తెలియబడ్తున్నాయి.*

*మనసు ఎందుకు కలుషితమవుతుంది?*

**వి:– చెడు వినడం వలన, మనసు కలుషితమవుతుంది. అసలు మనసు అంటేనే కలుషితం. దానికి తోడు చెడు చేరితే ఇంకా కలుషితం. అందుకే వినకూడని మాటలు వినకూడదు. ఏదైనా ఒక మాట మా చెవికి సోకినప్పుడు, మేము స్పందించే తీరుపై మా వ్యక్తిత్వం ఆధారపడి వుంటుంది. సమాజానికి ఆధారమైన ప్రతి ఒక్కరి వ్యక్తిత్వం కల్మషమెరుగని స్వామి ప్రేమ లాంటిదైతే బావుంటుంది. దానిని మీరూ, స్వామి కూడా హర్షిస్తారు.**

*ఆ:– నీ ప్రక్కన గోల జరుగుతూ వుంది. నీవు ధ్యానం చేస్తున్నావు. నీకు ధ్యానం కుదరదు. అసహనం వస్తుందా? లేక దాన్ని ఎలా స్వీకరిస్తావు?*

**వి:– ఏ గోలైనా భగవల్లీలగా తీసుకుంటే, అసహనం దరిరాదు స్వామి. శబ్దంలో నుండి నిశ్శబ్దాన్ని వినగలిగే స్థితి సాధిస్తాము స్వామి!**

***ముల్లుకు అంటుకున్న మకరందాన్ని నాలుకతో చప్పరించటానికి చేసే ప్రయత్నమే జీవితం***

*నీ బ్రతుకు పండాలని, కాలం కలిసిరావాలని*
*రకరకాల యత్నాలు సాగించినా*
*కార్యసిద్ధి కరువైతే, కష్టాల ప్రవాహంలో*
*కొట్టుకుపోతూ, నీలో కొలువు తీరిన*
*పరమాత్మను ప్రక్కకు పెట్టి, జీవాత్మకు పట్టం కట్టి*
*పడరాని పాట్లు పడుతూ*
*అహంకార పూరితమైన శక్తికి లొంగనివాడు*
*పరమాత్ముడని తెలుసుకోలేకపోతూ*
*ఎన్ని పరుగులు పెట్టినా వున్నది ఒక్కటే*
*వాడిని శరణుగోరి, శరణాగతుడవై*
*సంరక్షించమంటూ సరసన చేరితే*
*సరిసరి రమ్మంటూ రమ్యమైన దారి చూపి*
*రణరంగము నుండి రామరాజ్యంలో*
*మిమ్ములను సుస్థిరముగా*
*చేర్చుకొనును ఈ చిరంజీవి*
*హనుమ మాటలు హాయిగా*
*స్వీకరించండి మురిపాలు పంచుకునే*
*నా చిన్నారి ముద్దుబిడ్డలారా!*

ॐ

**28-09-2018** 10:30 AM

*ఆ:- దేహమనే దేవాలయాన్ని మీరు ఏ విధంగా చూచుకోవాలి?*

వి:- దేహమనే దేవాలయాన్ని పవిత్ర కర్మల ద్వారా, విచారణ ద్వారా, పవిత్ర తలంపుల ద్వారా సార్థకం గావించుకోవాలి. అసత్యంచే అపవిత్రం గాని వాక్కు, హింసలచే అపవిత్రం గాని దేహం, రాగద్వేషాదులతో అపవిత్రం కాని మనసు అవసరం అనుకుంటాను స్వామి. ఈ విధంగా త్రికరణశుద్ధి ద్వారా అంటే మనస్సు, వాక్కు, క్రియ పవిత్రంగా వుండాలి. కానీ, మానవ మనస్సు చంచలమైనది. ఏది కూడదో అదే చేస్తానంటుంది. నీరు పల్లమెరుగునట్లు, మనసు బలహీనతల వైపు మొగ్గు చూపుతుంది. అంటే, చేయకూడనివి చేయాలని, చూడకూడనివి చూడాలని, తినకూడనివి తినాలని, వెళ్ళకూడని చోటుకు వెళ్ళాలని అనుకోకుండగానే మమ్మల్ని లాక్కెళ్తాయి. ఇప్పుడు నేను చెప్పిన ఈ అవగుణాలు మాలోకి రానివ్వకపోవటమే ధ్యానం. దీని ద్వారా చిత్తశుద్ధి, ఇవన్నీ ప్రయత్నపూర్వకంగా ఆచరిస్తే, మనసుకు తర్ఫీదు ఇచ్చినట్లవుతుంది. అప్పుడు ఏది మాట్లాడుతామో, అదే చేస్తాము, వింటాము, నడుస్తాము. ఈ త్రికరణశుద్ధి ద్వారా, దేహాన్ని దేవాలయంగా మార్చుకుంటాము స్వామీ!

*ఆ:- గురు పాత్ర ఎట్టిది? దాన్ని కొంచెం విశ్లేషించండి.*

**వి:- స్వామీ! ప్రాణం పోసిన తల్లిదండ్రుల తర్వాత రెండవవాడు గురువు. అజ్ఞానం అనే అంధకారంలో విద్య అనే వెలుగు నింపేవాడు గురువు. అంతేకాదు, జీవితంలో మంచి నడత నేర్పేవాడు గురువు. మాకు ఒక గుర్తింపును తెచ్చేవాడు గురువు. మేము ఋణం తీర్చుకోలేనివారు గురువు. జీవితంలో ఎలా ఎదగాలో, ఎక్కడ ఏం చేయాలో చెప్పేవారు గురువు. గురువు చెప్పే విద్య గుప్తనిధితో సమానం. భౌతిక గురువు తన జీవితాన్ని మా కోసం వెచ్చించి ఒక ఉన్నత మార్గంలో పయనింపచేస్తారు. ఆధ్యాత్మిక గురువు అంటే, ఈ గురువు మా తప్పుల్ని సరిదిద్ది, లోకజ్ఞానం నేర్పుతూ గురువు లేని జీవితం శూన్యం అనుకునేలా చేస్తున్నారు. ఇట్టి గురువు లేకుంటే సమాజం ఎదగదు, మాలాంటి వారికి జ్ఞానం దొరకదు. అందుకే "గురుబ్రహ్మ గురుర్విష్ణుః గురుర్దేవో మహేశ్వరః" అన్నారు కదా. మరి అటువంటి గురువు పట్ల ఎప్పుడూ భక్తి, గౌరవం చూపాలి స్వామీ.**

*ఆ:- ఇంత మహత్తరమైన ఈ ఆంజనేయుని భాష్యం అంతర్వాహినిగా వుండే ఆనంద పారవశ్యానికి అంకితం చేస్తున్నాయా? వాటిని ఏ రకంగా అలక్ష్యం చేస్తున్నారో అర్థమైతే, ఆ అనర్థ అర్థాన్ని వివరించండి.*

**వి:- మీరు చెప్పే దానిలో భావం అనంతం, భాష సరళం, భావం గంభీరంగా, శబ్దాలు నిరాడంబరంగా, మహిమ అనంతంగా వున్నాయి. అలాంటి జ్ఞానమణులను అజ్ఞానం చేత అలక్ష్యం చేయడం ఎంతటి దురదృష్టమో మాకు మేమే అంచనా వేసుకోవాలి. మా జీవితాలన్నీ భౌతికమైన వాటితోనే గడిచిపోతుంది. అవే సర్వస్వం అనే భ్రమ మమ్మల్ని వదలటం లేదు. ఏ జన్మ కాజన్మే పరీక్షా పత్రం. ఇందులో మాకు లభించే ఉత్తమ మార్కులే మా జన్మని నిర్ణయిస్తాయి అని తెలుసుకున్నాము స్వామి. మీరు చెప్పినట్లుగా భగవంతునితో అనుబంధానికి నవవిధ భక్తులున్నాయి. ఉత్తమ గతులనిచ్చే యజ్ఞయాగాది క్రతువులున్నాయి. పరస్పర ఆనంద కారణాలైన పూజలు, వ్రతాలు వున్నాయి. అంతర్యామిని దర్శించే ధ్యానం వుంది. నామజపం వుంది. ఏదో బుద్ధి కుదురుగా వున్న కాసేపు వీటిలో నిమగ్నమవుతాం. నిజానికి లోకవ్యవహారాలే ఒక మత్తులాంటి స్థితి స్వామి. వాటి నుండి బయటపడి శీఘ్రమే కృషి చేయాలి అని దీవించండి స్వామీ! అలా చేసినప్పుడే, మా మానవజన్మ సార్థకమవుతుంది. అది మీ ఆశీర్వచనము, మా క్రమశిక్షణ తోడైనప్పుడే నెరవేరుతుందని అనుకుంటూ, మా తప్పులను మన్నించి ప్రత్యక్షంగా కన్పించే ఈ ప్రపంచం ఈశ్వర వ్యాప్తమై వున్నదని, క్షణికమైన భౌతికమైన ఈ వస్తుసముదాయంతో కూడినదాన్ని త్యాగభావంతో అనుభవించే స్థితిని ప్రసాదించండి స్వామీ!**

*ఆ:- మీ ఆధ్యాత్మిక యాత్రను ఆలస్యంగా మొదలుపెట్టినా, చేరగలమనే నమ్మకం ఈ ఆంజనేయుని బోధలతో అర్థమయినదా?*

**వి:- అర్థమయింది స్వామీ. మా ఆధ్యాత్మిక యాత్రను ఆలస్యంగా మొదలుపెట్టినా, మాలోని నిష్కపటం చేతనూ, మీ పట్ల అంటే గురుదేవుల పట్ల అంటే గురువు, దేవుడు మీరే గనుక, గురుదేవుడు అన్నాను స్వామీ, మీ పట్ల అకుంఠితమైన భక్తి చేత, మిమ్మల్ని చేరుకోగలము. మీ చిన్నారి బిడ్డలము కదా స్వామీ! బిడ్డలు, తల్లిని తండ్రిని వదిలి వుండలేని పసిప్రాయము వారిమి కదా స్వామీ! తప్పక మాకు మీ ఒడి కావాలి స్వామీ!**

*ఆ:- ఒక చిన్న ప్రశ్న అడుగుతాను. ఎవరి కర్మల ఫలితంగా వారికి ఆ విధంగా జరుగుతుందా? లేక వారి కర్మల ఆధారంగానే వారు పరిస్థితులు అనుభవిస్తున్నారా? లేక భగవంతుని సృష్టిలోనా లేక మీ ఆలోచనా దృక్పథంలోనా? ఎక్కడ వుందీ వ్యత్యాసము అనుకుంటున్నారు?*

**వి:- భేదం అనేది భగవంతుని సృష్టిలోనూ లేదు, ఆయన ఉద్దేశ్యంలోనూ లేదు. కేవలం ఆ వ్యత్యాసం మా మనసు నుండి వచ్చిన ఆలోచనల్లోనే వుంది. ఎందుకంటే సుఖాలు, దుఃఖాలు మనిషి బ్రతుకు బండికి రెండు చక్రాల్లాంటివి. ఏ ఒక్కటి లేకపోయినా ఆ బ్రతుకు బండి సాఫీగా నడవదు. సుఖమైనా, దుఃఖమైనా శాశ్వితంగా వుండదు. అవి వస్తూ వుంటాయి, పోతూ వుంటాయి. కానీ, అలాంటి పరిస్థితుల్లో, మా బాధ్యత ఏదైనా వుందంటే, అది కేవలం మేము వాటిపై ఏ విధంగా స్పందిస్తామన్నదే మా యొక్క బాధ్యతగా గుర్తించాలి స్వామీ!**

*ఆ:- మరి ఆ భేదం ఎక్కడ వుంది? ఎందుకని మానవులు దుఃఖాన్ని, సంఘర్షణలను, బాధలను అనుభవిస్తున్నారు?*

**వి:- కొందరి జీవితాలలో సుఖాలను, దుఃఖాలను అనుభవిస్తారు. మరి కొందరు సుఖాలు, ఆనందాలనే ఆస్వాదిస్తారు. మరి కొందరి జీవితాలైతే, జీవిత పర్యంతం సంఘర్షణల నడుమనే బ్రతుకును కడవరకూ సాగిస్తారు. ఇందాక మనము చెప్పుకున్నట్లు, బాధ్యతాయుతంగా జీవితం సాగిస్తే, అంతగా స్పందించవలసిన అవసరం వుండదనుకుంటాను స్వామీ!**

*ఆ:- మరి చాలామంది తమ సాఫల్యాన్ని అదృష్టంతో, వైఫల్యాన్ని దురదృష్టంతో పోలుస్తూంటారు. అది ఎంతవరకూ నిజమనుకుంటున్నారు?*

**వి:- అది ఎంత మాత్రమూ నిజము కాదనుకుంటాను స్వామీ. ఎందుకంటే, స్వయంకృషిని నమ్మేవారు అదృష్టం గురించి అసలు ఆలోచించరు. ఎందుకంటే, ఎన్నో కలలు కంటాము. వాటిని నిజం చేసుకోవాలి. కానీ, మనస్ఫూర్తిగా దానిని సాధించే విషయంలో, ఆ పనిచేసే విషయంలో శ్రద్ధ, పట్టుదల కావాలి. దానిని పాటించనివారు జీవితంలో విజయాన్ని సాధించలేరనుకుంటున్నాను స్వామీ.**

*ఆ:- ప్రతి విజయానికి వెనుక వున్న రహస్యమేమిటో గుర్తించారా?*

**వి:- గుర్తించాము స్వామీ. పరమ రహస్యం స్వామీ – నిర్విరామ కృషి ఒక్కటే! కృషి లేని చోట విధి కూడా అనుకూలించదు. కృషి, సంకల్పబలం వున్న సాధకుడు తన మార్గంలో ఎదురయ్యే అడ్డంకులకు వెనుకడుగు వేయడు. ఇంకా ఉత్సాహంతో ముందుకు వెళ్తాడు.**

*ఆ:- మానవుడే మాధవుడు అన్న పదానికి నీకు తెలిసిన విధంగా అర్థం చెప్పు.*

**వి:- ఎట్లా అంటే, పరిణామ క్రమంలో మానవజాతిలో మనో బుద్ధి చైతన్యాలు రూపాంతరం చెంది, శుద్ధ చైతన్యపు స్థితిని అందుకునే అవకాశం కలిగింది. ఈ విశ్వం నుండి ఆవిర్భవించిన మానవుడు, విశ్వవ్యాప్త జీవనంలో జీవిస్తూ, తిరిగి మరలా విశ్వంలో కలిసిపోవడం చాలా హర్షించతగ్గ విషయం. అందుకే మానవుడే మాధవుడయ్యాడు. మానవత్వం నుండి దివ్యత్వానికి చేరువై, నేనే భగవంతుడనని**

నిరూపించుకున్నాడు. అందుకే మానవుడే మాధవుడయ్యాడని అంటారనుకుంటాను స్వామీ!

*ఆ:- భక్తుడు అనబడే వానికి ఏది అవసరమనుకుంటున్నారు?*

వి:- భక్తుడికి దైవం తప్ప ఏదీ అవసరం లేదు. దైవం నుండి ఏదీ ఆకాంక్షించడు. భక్తితత్త్వంలో కోరికలకు తావే లేదు. భక్తుడు తన మనస్సనే సముద్రంలోని ప్రతి నీటిబొట్టునూ పరమాత్మకు వశంచేయడం వల్ల అతను అమృతపుత్రుడవుతాడు. సత్యశోధనలో తన అంతరంగాన్ని శోధనకు గురిచేయాల్సి వుంటుంది, సాధనతో మథించాల్సివుంటుంది. ఎందుకంటే, పరమాత్ముడుండేది అక్కడే గనుక, సాధించాల్సిందీ అక్కడే, శోధించాల్సిందీ అక్కడే. అంత ప్రాముఖ్యమైన అంతరంగాన్ని ఎంతో శ్రమతోనైనా భక్తుడు సంస్కరించుకోవాలి స్వామీ!

***ఆతి ప్రమాదకరమైనది కోపం***
***మనిషిలో రేగిన కోపం చివరకు మనిషినే దహించి వేస్తుంది***
***ఇది అంతః శత్రువులలో ప్రధానమైనది, అతి ప్రమాదకరమైనది***
***క్రమశిక్షణను, మనశ్శాంతిని దూరం చేస్తుంది, సర్వనాశనం చేస్తుంది***
***శాంతిని పొందితే ప్రేమను పొందవచ్చు***
***విజయాలు దరి చేరుతాయి శ్రేయోదాయకమైన మార్గాన్ని చూపుతుంది***
***వ్యక్తిత్వ వికాసంతో విజయభేరి మ్రోగించి***
***ఆంజనేయుని మాటలపై విశ్వాసముంచి అడుగు ముందుకు వేయండి***
***ఆర్ద్రతతో కూడిన విన్నపాలతో వీరాంజనేయుని చేరి***
***విధేయులై జన్మ ధన్యము చేసుకుని సుఖించండి సదా***
***నా చిన్నారి బిడ్డలారా !***

ॐ

**29-09-2018** 10:20 AM

*ఆ:- ఆత్మజ్ఞాన ప్రాప్తికి సాధన ఎంతో అనివార్యమని మీరు అంగీకరించవలసిందే. ఎంతో చంచలమైన మనస్సు అంత తేలికగా కుదురుగా వుంటుందా? మాయ అనే వలలో పడిన మనసుకు ఏ విధంగా నచ్చ చెబుతారు?*

వి:- మీరు చెప్పింది నిజము స్వామీ. మాయాదేవి మాయ అనే వల తీసుకుని అల్లంత దూరాన కన్పించగానే నేనే వస్తున్నా వుండు అంటూ పరుగుల పందెంలో పాల్గొన్నట్లుగా పరుగు పరుగున వెళ్ళి స్వయంగా వలలో చిక్కుకునే అద్భుతమైన మనస్సు మాది. అందులో పడ్డ చేప బయటకు రావటానికి ప్రయత్నించదు. అలాగే మేము కూడా పరమానందంగా అందులోనే విహరించే అమాయకపు మనసుకి ఆత్మజ్ఞానంలోని బ్రహ్మానందాన్ని రుచి చూపించాలంటే శ్రద్ధతో కూడిన సాధన అవసరం స్వామీ.

*ఆ:- శ్రద్ధ అనే పదం లేక ఏకాగ్రత ఈ రెండూ భౌతికంగా వ్యావహారికంగా ఎలా ఆలోచిస్తారు? ఎలా చేస్తారు?*

**వి:- భౌతిక జగత్తుకి సంబంధించిన పనుల విషయంలో కూడా మేము శ్రద్ధ వుండాలని ఆశిస్తాము స్వామి. ఏ విధంగా అంటే, శ్రద్ధగా చదువుకోవాలి, ఉద్యోగ ధర్మంలో ఏ విధమైన అశ్రద్ధ పనికిరాదు, అశ్రద్ధగా వాహనాలు నడుపకూడదు. అలా నడిపినట్లైతే యాక్సిడెంట్లు అవుతాయి. వంట కూడా శ్రద్ధగా చేయాలి అని స్వామి చెప్పారు. రోగుల సేవ చేసేటప్పుడు శ్రద్ధగా చేయాలి. పెద్దల మాటలను శ్రద్ధగా ఆలకించాలి మొదలయినవి వ్యావహారిక భాషలో శ్రద్ధ, ఏకాగ్రతతో మనస్ఫూర్తిగా పని చేయాలి అనుకుంటాను స్వామి.**

*ఆ:- మరి ఆధ్యాత్మిక భాషలో ఎలా వుండాలి?*

**వి:- భగవంతుని యందు, వేదశాస్త్రముల యందు, మహాపురుషుల వచనముల యందు పరమ విశ్వాసము, పూజ్య భావము కలిగి యుండే స్థితిని శ్రద్ధ అంటాము స్వామి. ఎన్ని సమస్యలు ఎదురైనా, భక్తి చెక్కు చెదరకుండా, చలించకుండా వుండాలి. ఎంతటి శారీరక వ్యాధులు వచ్చినా లేదా ఆత్మీయులు శాశ్వితంగా దూరమైనా, ఆర్థిక స్థితి పునాదితో సహా కదిలిపోయినా ఇసుమంతైనా చలించకుండా వుండగలగాలి. ఆ స్థితిలో కూడా భగవంతుని గుర్తించి అతని కరుణను, ప్రేమను మనసారా విశ్వసించిన వారే పూజ్యభావము కలిగి శ్రద్ధ, ఏకాగ్రతను పాటించగలరు స్వామీ.**

*ఆ:- శ్రీసూక్తం, పురుషసూక్తం స్వామి ఎందుకు చదవమన్నారు? దానిలో వున్నది ఏమిటి? ఏమి చెప్పదలుచుకున్నారు?*

**వి:- కొంచెం తెలుసు స్వామీ. శ్రీసూక్తంలో అమ్మ విశ్వ విరాట్ స్వరూపాన్ని, పురుషసూక్తంలో కూడా విశ్వ విరాట్ స్వరూపాన్ని, సృష్టి కర్త తాను చేయదలుచుకున్న కార్యక్రమం, వర్ణ వ్యవస్థను కూడా వివరించడం జరిగింది. కేవలం భగవంతుడ్ని చూడాలనుకున్న తపనతో, ఆర్తితో తపస్సు ఆచరించిన మహానుభావులైన ఋషులు ఆ పరమపురుషుడ్ని మేము దర్శించాము. సాధన ద్వారా ప్రయత్నించి ఆ ఆనందాన్ని అందుకొని అనుభవించమని మానవలోకానికి బోధించారు. వేదాహమేతం పురుషం అనంతం అన్న శ్లోకాన్ని చెప్పినటుల విన్నాను స్వామీ. ఆదిత్య వర్ణం తమసః పరస్తాత్.**

*ఆ:- మీరు చదువుతున్న మంత్రపుష్పం ఎందుకో గుర్తించారా?*

**వి:- ఇది కూడా కొంచెము చెప్పగలను స్వామీ. వేద మహామంత్రపుష్పంలో మా శరీరంలో వున్న ప్రతి అణువును, షట్ చక్రములను, వాటి ప్రాధాన్యతను, ప్రాణవాయువు ఎక్కడ ఎలా వుంటుందో "నీలతోయద మధ్యస్థా విద్యుల్లేఖేవ భాస్కరా" అనే శబ్దం నిరూపిస్తుంది. వేదము చాలా పవిత్రమైంది. దానిని నాలుగు భాగాలుగా విభజించి, వాటిలో నుండి నమక చమకాలను అంటే శ్రీరుద్రాన్ని, మంత్రపుష్పాన్ని, శ్రీసూక్త పురుషసూక్తాలను వెలికి తీసి మానవాళికి అందించారు.**

*ఆ:- సరే, నమకం గురించి ఒక్క మాటలో చెప్పండి.*

**వి:- వేదములోని నమకం, అది శ్రీరుద్రప్రశ్న. సర్వత్రా వ్యాపించి వున్న ఈశ్వరతత్త్వాన్ని అంటే రుద్రతత్త్వాన్ని నిరూపిస్తుంది.**

*ఆ:- మరి చమకం అంటే అడగటము అన్న అపోహ చాలా మందిలో వుంది. మరి ఆ అడగటము దేనికోసమని భావిస్తున్నారు?*

**వి:- ఔను స్వామీ! చమకంలో మాకు అన్నీ అందించు అనే వుంటుంది. కానీ, అవి అడగటంలో ఒక అంతరార్థమున్నదని అనుకుంటున్నాను. ప్రపంచంలో అందరూ ధనవంతులు, బలవంతులు, ఆరోగ్యవంతులు వుండరు. వీరందరికీ సహాయం చేయటానికి, వీరికి సహాయం చేయటానికి, ఉద్దండ పండితులుంటారు. వారికి తగిన గౌరవాన్నివ్వటానికి, పోషించటానికి ఎంతోమంది కళాకారులుంటారు. వారికి ఉత్సాహ ప్రోత్సాహాలను, ఒక ఉపాధిని కల్పించటానికి నారాయణులను సేవ చేయటానికి పాలకులు సక్రమమైన పాలన సాగించటానికి చమకం లోనివి కోరుకోవాలి. నిజం చెప్పాలంటే, అసలు అందుకే వాటిని కోరుకోవాలి. మా భౌతిక సుఖాల కోసం కాదు. అందుకే, చివరలో నేను చేసే ప్రతి కర్మా యజ్ఞమే కావాలి అని కోరుకుంటాము. యజ్ఞయాగాదులు చేసి, దేవతలను సంతృప్తి పరిస్తే, ప్రకృతి వైపరీత్యాలు కలుగకుండా సర్వమానవాళి రక్షింపబడతారు. అందుకు తగిన ధన కనక వస్తు వాహనాదులు, శారీరక బలాన్ని, మానసిక శక్తిని ఇవ్వమని అడగటమే చమకంలోని అర్థంగా గ్రహించాను స్వామీ!**

***అహర్నిశలూ అప్రమత్తంగా అడుగు వేయాల్సిందే***
***మనసు నిండా సుగంధాల ఆర్ద్రత నింపుకుని మూర్తీభవించిన వ్యక్తిత్వంతో***
***పసిపాప లాంటి చిరునవ్వుతో***
***మీ చైతన్యం ఆరని అగ్ని శిఖగా***
***ఎందరికో మీరు స్ఫూర్తి ప్రదాతలై సుసంపన్న విలక్షణ వ్యక్తిత్వంతో***
***ఎవరికీ అంతుచిక్కని మీ ఆశయాలు, ఆలోచనలు***
***ఆంజనేయుని మదిలోనివి అన్నది గుర్తించి***
***ఆశయాల సోపానమధిరోహణంలో ఆచరణ నిచ్చెనలు వేసుకుని***
***అడుగు ముందుకు వేసి, అంతర్మధనముతో అక్కున చేరి***
***ఆంజనేయుని మదిలో కొలువు తీరండి***
***నా చిన్నారి బిడ్డలారా !***

ఓం

**30-09-2018** 10:30 AM

## ఆంజనేయుని ప్రశ్నాపత్రము

(ఆంజనేయస్వామి అడిగిన ప్రశ్నలకు మాతా విశ్వాత్మానందగిరిగారు ఇచ్చిన సమాధానములు)

*ఆ:- మనిషిని ఇంగ్లీషులో* **MAN** *అంటారు గదా. దాని అర్ధమేమిటి? కదా... మీ వాసన అంటుకున్నదిలే!*

**వి:- M అనగా మనస్సు లేక మాయ**
**A అంటే ఆత్మతత్త్వం**
**N అనగా నిర్వాణం చేకూరుతుంది.**

**ఈ నిర్వాణం కోసమే ఎంతో మంది సాధనలు సల్పారు. కట్టకడపటికి అంతా మాలోనే వున్నదే, ఇంత కాలము వ్యర్ధం చేసుకున్నామని విచారించారు.**

*ఆ:- అన్నింటికీ వెల పెరుగుతున్నది. వెల పెరగనిది ఏదో గ్రహించావా?*

**వి:- మేమే స్వామీ. కానీ, దానిని ఎలా చెప్పాలో తెలియదు. మీరు కోరుకునే సత్ప్రవర్తన మాలో లోపించటమే కారణమనుకుంటాను స్వామి.**

*ఆ:- బాగానే చెప్పావు కానీ, ఒక్క విషయం సర్వం మానవునియందే వున్నది. కానీ, మానవుడు తనను తాను మర్చిపోతున్నాడు. అందుకే లోకంలో ప్రతి పదార్ధమునకూ వెల పెరిగిపోతున్నది. కానీ, మానవునికే విలువ లేకుండా పోయింది. ఎందుచేతనంటే, మానవుడు తన మానవతా విలువలను పోగొట్టుకున్నాడు. మానవతా విలువలు తన పంచప్రాణాలుగా భావించాలి. సత్యమే మీలో లేకపోతే, ప్రాణము పోయినట్లే. ధర్మం లేకపోతే, రెండవ ప్రాణం కూడా పోయినట్లే. ఇటువంటి పంచప్రాణాలు మీలో లేకపోతే, మీరు శవంతో సమానం.*

*గతం గతం అంటూ వుంటారు. దాని గురించి ఎటువంటి ఆలోచనలు, నిర్ణయాలు మీలో వున్నాయి?*

**వి:- గతం అంటే మేము చేసిన తప్పులను లెక్కించుకోవటం కాదు. ఏ బలహీనతలకు లొంగిపోయి, ఆ తప్పు చేశామో, ఆ బలహీనతలను జయించాలి అన్న దృఢసంకల్పాన్ని చేసుకోవాలి. అంతే కాక, దానిని గట్టిగా అమలుపరిచే ఆత్మస్థైర్యం అలవరచుకోవాలి. చిలుక పలుకుల్లా అవే అవే డైలాగులు వల్లించడం మరలా యథాతథంగా దోషాలతో కూడిన జీవితాన్ని గడుపుతూ వుంటే, నిర్ణయాలకు విలువ లేనట్లే స్వామీ. వర్తమానంలో మేము ఆచరించే పనులు అభినందనీయంగా వున్నప్పుడే, గతంలోని వైభవానికి విలువ వుంటుందనుకుంటాను స్వామీ.**

*ఆ:- గతంలో మీరు చేసిన తప్పులను మరల చేయకూడదంటే కేవలం మీ తప్పులు, బాధలు చిట్టాయేనా?*

**వి:- చాలా మంది గతం గతః అని అంటూ వుంటారు స్వామి. అలా ఎప్పుడంటారంటే, వారు గతంలో చేసిన తప్పులకు వర్తమానంలో కృంగిపోతూ, గతంలో పడ్డ బాధలకి వర్తమానంలో దిగులుపడిపోతూ, వర్తమానాన్ని బలి చేసుకుంటూ, రేపటి భవిష్యత్తులోకి నిరాశానిస్పృహలను ఆహ్వానిస్తున్నప్పుడు గతం గతః అంటూ నిట్టూర్పు వదులుతారు. ఆత్మన్యూనతా భావానికి చేతులుచాచి స్వాగతం పలకటమే. చాలా మంది గతం గురించి గర్వంగా చెప్పుకునేవారూ వుంటారు. ఎప్పుడంటే,**

*గతంలో చేసిన కఠోర పరిశ్రమ, దీక్ష, ధృఢసంకల్పం, సాధన, తపస్సు, కృషి తద్వారా లభించిన ఘనవిజయాలు వారి ఖాతాలో వుంటే, అప్పుడు గొప్పగా చెప్పుకుంటారు స్వామీ.*

***బ్రతుకుకు మూలమైన దానిని తెలుసుకుని***
***మోహములను త్రుంచి శోకములను బాపుకుని***
***మనసులోని చింతలను తీర్చు మహత్వ జ్ఞానము నందుకొనుచూ***
***బ్రతుకులోని గతుకులనన్నింటినీ మాయం చేసే రామ మంత్రంతో***
***జీవుల నన్నింటినీ నడిపేటి దివ్యామృతంగా గుర్తించి***
***నిన్ను నన్ను కూడా తీరాన్ని దాటంచగల రామ నామంతో***
***రాగానురాగాల నగుమోముతో పరివర్తన తెచ్చుకుని***
***అన్నింటికీ అందరికీ ఒకటే మార్గంగా గుర్తించి***
***ఆంజనేయుని బోధల సారాంశము జీవన గమ్యంగా గుర్తించి***
***ఆత్మ యందు తలచిన వెంటనే***
***కస్తూరి పరిమళాలు వెదజల్లు***
***జీవన గమ్యాన్ని చేర్చు పరమ దివ్యౌషధ నావ***
***రామనామ నౌక నెక్కండి ఆశ్రిత జనులైన***
***ఆంజనేయుని చిన్నారి బిడ్డలారా !***

ॐ

## క్రింది ప్రశ్నోత్తరములు ఆంజనేయస్వామి అడిగిన ప్రశ్నలకు అమ్మ (మాతా విశ్వాత్మానందగిరి) ఇచ్చిన సమాధానములు

*ఆ: మనఃశుద్ధికి సాధన ఏదంటావు?*

**వి: భగవంతుని స్మరణ, భగవంతుని స్ఫురణ, భగవంతుని చింతనకు సహాయపడే ఏ కర్మ అయినా మనశ్శుద్ధికి ఒక సాధనగానే చెప్పవచ్చు స్వామీ!**

*ఆ: మరి, అడవులకు వెళ్ళి తపస్సు చేయలేనివారి సంగతి ఏమిటి?*

**వి: వారు కూడా మీరు చెప్పిన విధంగానే కర్మాచరణ చేసినట్లయితే, అది కూడా ఒక తపస్సే అవుతుంది స్వామి.**

*ఆ: కానీ, నేడు భగవంతునికి–జీవునికి మధ్య అడ్డుపడుతున్నవి, అవరోధంగా నిలుస్తున్నవి ఏవనుకుంటున్నావు?*

**వి: చాలా చాలానే అవరోధాలుగా అడ్డు తగుల్తున్నాయి స్వామి. నిద్దుర లేచిన వెంటనే కంటి ఎదుట వున్న మీ రూపాన్ని చూచే బదులు, ఆధునిక పరికరాలైన సెల్‌ఫోన్లను చూడటం, దానిలోని మెసేజ్‌లను చూస్తూ జీవితాన్ని మిస్ చేసుకుంటున్నామని నిన్న మీరు చెప్పినదాంట్లో గ్రహించాను స్వామి.**

ఆ: *మరి ఏమి చేయాలనుకుంటున్నారు?*

**వి: మేము ఏ పని చేస్తున్నా, ఫోన్‌ను ఎలా మర్చిపోకుండా వుంచుకుంటున్నామో, అలాగే మిమ్మల్ని మర్చిపోకుండా వుండగలిగితే, భగవంతుని దృష్టిలో నిజమైన కర్మయోగులమవుతాము స్వామి.**

ఆ: *మీకు వున్న విద్య ద్వారా, ఎందుకు తెలుసుకోలేకపోతున్నారు?*

**వి: ఇప్పటి విద్యలో వస్తుప్రపంచ విజ్ఞానం తప్ప, తనను తాను తెలుసుకోవడమన్న వాస్తవ విజ్ఞానాన్ని అందించకపోవడమే అనుకుంటున్నాను స్వామి.**

ఆ: *మరి తెలుసుకునేందుకు ప్రయత్నము చేస్తారా?*

**వి: చేయలేము స్వామి. ఎందుకంటే, మనిషి తన మనసుతోనే పోరాడలేక, పారిపోవటానికి ప్రయత్నిస్తున్నాడు స్వామి. ఈ సమస్యకు విరుగుడు ఆధ్యాత్మిక సంస్కారాన్ని చిన్నబిడ్డలుగా వున్నప్పుడే అందించగలిగితే, కొంతలో కొంత విజయం సాధించవచ్చు.**

ఆ: *తెలివైన మనిషి ఏమి చేస్తాడు?*

**వి: తెలివైన మనిషి తనతో తాను పోరాడతాడు స్వామి.**

ఆ: *ప్రతి మనిషిలో అంతర్గతంగా ఏముంటున్నది?*

**వి: ప్రతి మనిషిలో అంతర్గతంగా దివ్యానందమున్నది స్వామి.**

ఆ: *ఆ ఆనందాన్ని ఎలా వెలికి తీస్తావు?*

**వి: ఆ ఆనందాన్ని బయటకు తీయడానికి మీరందించిన జ్ఞానమే, ఆధ్యాత్మికతే స్వామి.**

ఆ: *మరి ఈ రోజు బాధలు పడటానికి కారణం ఊహించావా?*

**వి: ఊహించాను స్వామి. ఎన్నో రోజులుగా మీరందిస్తున్న జ్ఞానాన్ని, బోధలను విస్మరించి కేవలం దేహపోషణ, దేహసౌఖ్యమే జీవిత పరమావధిగా భావిస్తూ, పారమార్థిక జ్ఞానాన్ని అందుకోలేకపోవటమే స్వామి.**

ఆ: *మరి సంపూర్ణ జ్ఞానంతో ఏమని అడుగుతావు? ఏమని ప్రార్థిస్తావు?*

**వి: సంపూర్ణ విశ్వాసంతో మీ శాసనాన్ని అనుసరించాలని కోరుకుంటాను స్వామి. అంతేగాక, మాలో ఆశలు అనేకంగా వుంటాయి. కానీ, తెలుసుకోగలిగితే మీరు వాటిని నిరాకరించి కఠినంగా మమ్మల్ని నిరంతరం రక్షిస్తున్నారు. మేము కావాలనుకున్న వాటిని నిర్దాక్షిణ్యంగా దూరం చేసి, మమ్ములను ప్రేమతో, కరుణతో అక్కున చేర్చుకుంటున్నారు. మా నిత్యజీవితంలో ఎదురయ్యే అనేక ఒడిదుడుకులు, ఓటములు, ఎన్నో ఎన్నెన్నో ఎదురయ్యే వాటిని మనస్ఫూర్తిగా స్వీకరించి, మీ సంకల్పంగానే భావించేటట్లు చేస్తున్నారు స్వామి. మేము మీ నుండి ఏమీ ఆశించవలసిన అవసరం లేకుండానే, మీరు మాకు ఎన్నో అమర్చారు, అమరుస్తున్నారు. ఇక ఏదీ క్రొత్తగా కోరవలసిన అవసరం లేదు. మా అర్హతనుబట్టి, మా ప్రయత్నాన్నిబట్టి ఫలితాన్ని అందిస్తున్నారు. అలాంటి అనుభూతితోనే జ్ఞానవంతులమై, సదా మీ చరణాల చెంత సేద తీరుతున్నాము స్వామి.**

*ఆ:* *అందంగానే చెప్పావు. అలాంటి సంపూర్ణ విశ్వాసంతో సర్వేశ్వరుడి శాసనాన్ని అనుసరించాలి. ఏదీ దక్కని సమయాల్లో మీరు ఆయనకు మరింత దగ్గరవుతున్నారని తెలుసుకోవాలి. అలా, పరిణామాలు తెలిసి రచించిన ప్రణాళిక ఆ పరమాత్మది. అందుకే అది అలా ఎందుకు జరిగింది? ఇది ఇలా ఎందుకు జరిగింది? అని ఎక్కువ ఆలోచించకూడదు. సంభవించింది ఏదైనా శిరోధార్యం అనుకోవాలి.*

***భగవంతుడు ఉత్కృష్టమైన మానవజన్మను ఇచ్చాడు.***
***అందుకనే, సహనం, సజ్జన సాంగత్యం,***
***విద్యాధనం, సంస్కారం, సంస్కృతి పరిరక్షణ వంటి లక్షణాలు అలవర్చుకుని***
***సంస్కారవంతమైన జీవితపు అడుగులు వేసి,***
***అమృతతుల్యమైన మాటలతో సన్మార్గం వైపు నడిపిస్తున్న ఈ ఆంజనేయుని పలుకులు***
***శిరోధార్యమై, ఆధ్యాత్మిక విద్యావంతులుకండి***
***ఎందుకంటే, విద్వావంతునకు ధనంతో పనిలేదు, తన పాండిత్యమే ధనాగారము***
***సిగ్గు, సంస్కారం కలిగిన వనితకు నగలతో పనిలేదు,***
***తన అందమైన సౌందర్యంతో సృష్టినే మరిపించగలదు***
***కావున, ఆత్మసౌందర్యంతో అడుగులు ముందుకు వేసి, మంచి లక్షణాలను అలవర్చుకుని,***
***సంస్కారవంతులై, మానవత్వం కల్గిన మనుషులుగా మసలుకుంటూ***
***మీ జన్మ ధన్యం చేసుకోండి సాధకులైన***
***నా చిన్నారి ముద్దుబిడ్డలారా!***

ॐ

**08-10-2018** 11:40 AM

## ఆంజనేయుని ప్రశ్నోత్తరములు

*(ఇవి ఆంజనేయస్వామి యొక్క ప్రశ్నోత్తరములు)*

*1.* *కర్మవృక్షానికి జీవం పోసేది ఏది?*

**జ. మనస్సనే విత్తనం.**

*2.* *సత్పురుషుల సాంగత్యం నిన్ను దేని నుండి దూరం చేస్తుంది?*

**జ. దుఃఖాల నుండి, ఆవేదనల నుండి దూరం చేస్తుంది.**

*3.* *మీరు చదువుతున్న నిర్వాణషట్కము ఏమి బోధిస్తున్నది?*

**జ. అంతా శివస్వరూపము, చిదానందమే.**

*4.* *అసలు నీవెవరు?*

**జ. మనోబుద్ధ్యహంకార చిత్తానినాహం చిదానందరూప శ్శివోహం శివోహం.**

5. *సంతోషాన్ని, సంతాపాన్ని కలిగించేది మీరున్న ప్రదేశమా? పరిస్థితా? మరేదైనానా?*

జ. **మనస్సు.**

6. *ఏ స్వార్థమూ లేకుండా నిరంతరం లోకకళ్యాణం కోసం కృషి చేయాలనుకునే సజ్జనుడు సాధించవలసినది ఏమిటి?*

జ. **మనోనిగ్రహం.**

7. *"జీవితంలో ఇంతకన్నా ఇంకేమీ అక్కర లేదనుకోవడమే ఆనందం" అన్నది అర్థమైతే, ఇది దేనిని అందిస్తుంది మీకు?*

జ. **తృప్తిని కలుగచేస్తుంది.**

8. *మనిషిని ముక్తిమార్గం వైపు నడిపించేది ఏది?*

జ. **తృప్తి నుండి ఆనందం, ఆనందం నుండి స్థితప్రజ్ఞత్వం. ఇదే ముక్తి వైపు నడిపిస్తుంది.**

9. *భగవంతుడి కరుణను గుర్తించుట ఎట్లు?*

జ. **మీకు కనబడకుండా ఆయా తరుణాల్లో, ఆయా పనులు చేయించటమే కరుణ.**

10. *భావాన్ని బట్టి భాషను ఏ విధంగా ఉపయోగిస్తారు? రెండు లైన్లలో చెప్పండి.*

జ. **భావాన్ని బట్టి అంటే, ఒక వ్యక్తి పట్ల ప్రేమతో అయితే భాష చాలా సున్నితంగా ప్రేమగా, కోపం వస్తే గట్టిగా అరచినట్లు, ఈర్ష్య అసూయ అసహనం వచ్చినప్పుడు ఇష్టం లేదు కనుక అవతలి వారిని బాధపెడుతూ మాట్లాడుతాం.**

11. *మరి భగవంతునితో ఎలా మాట్లాడుతారు?*

జ. **స్వామీ! అప్పుడు కూడా మాయ కప్పేసి, ఉన్నది ఒకటైతే ఇంకొకటి చెబుతూ, మిమ్మల్ని మాయపుచ్చే ప్రయత్నమే జరుగుతుంది.**

12. *దీని వలన నష్టపోతున్నారా? అది ఎంత వరకు?*

జ. **చాలా నష్టపోతున్నాము. జీవితాన్నే నష్టపోతున్నాము.**

*అందరూ బ్రహ్మజ్ఞానాన్ని పొందాలి. దీనికి ఏకైక మార్గం తపస్సు. తపస్సంటే అనునిత్యం భగవంతునితో అనుసంధానమై, సర్వదా, సర్వకాలేషు నామస్మరణ గావించటమే! కాసేపు జపం, కాసేపు శ్రవణం, కాసేపు గ్రంథపఠనం. వేడి రావాలి, ఉక్కిరిబిక్కిరి అవ్వాలి. విద్యార్థి పరీక్ష వ్రాయుటకు 3 నెలల ముందు చదివే విధానం వేరు, వారం రోజుల ముందు చదివే విధానం వేరు, రేపు పరీక్ష అనగా చదివే విధానం వేరు. మీ పరీక్షలు ఎప్పుడో, ఎలా చదవాలో గుర్తించవలసినది విద్యార్థులే, గురువు కాదు.*

ఓం

**09-10-2018** 10:35 AM

*1. భగవంతుడు ఒక గొప్ప సిద్ధాంతాన్ని బోధించాడు. అదేమిటంటే, లోకంలో రెండే వస్తువులున్నాయి. కాకపోతే, మీరు ఆ రెండింటినీ ఒకటిగా చూస్తున్నారు. అవేమిటి?*

**జ. అవి క్షేత్రం – క్షేత్రజ్ఞుడు; శరీరం – ఆత్మ; జడం – చైతన్యం; నిత్యం – అనిత్యం. వీటిని మీరు ఒక్కటిగా చూస్తున్నారు.**

*2. భారత అంటే అర్థం ఏమిటి?*

**జ. భారత అంటే భరతవంశంలో పుట్టినవాడని ఒక అర్థం. ఇంకొక అర్థం, 'భా' అంటే వెలుగు, జ్ఞానం, బ్రహ్మవిద్య అని. 'రత' అంటే రమించేవాడు అని అర్థం. భారత అంటే వెలుగులో వుండేవాడు. జ్ఞానంలో మునక వేసేవాడు. బ్రహ్మవిద్యలో రమించేవాడు.**

*3. ఆత్మానాత్మ వివేకం వేదాంతానికి ఎటువంటిది?*

**జ. ఆత్మానాత్మ వివేకం వేదాంతానికి సింహద్వారం వంటిది.**

*4. ఈ దేహాన్ని రథంతో పోల్చవచ్చు. అదెలాగా?*

**జ. శరీరమే రథం, జీవుడే అందులో ప్రయాణించే రథికుడు, ఇంద్రియాలే గుర్రాలు, మనసే పగ్గం, బుద్ధియే సారథి. ఈ రథం సక్రమంగా, క్షేమంగా ప్రయాణించాలంటే పగ్గాలు సారథికి అప్పగించాలి. అంటే మనస్సును బుద్ధికి అప్పగించాలి.**

*5. ఇప్పటి వరకూ నేను చెబుతున్న విషయాలు అర్థమవుతున్నాయా?*

**జ. తెలిసింది అన్నారు. ఎవరికి తెలిసింది? తెలిసినట్లుగా అనుభూతి పొందినదెవరు? నీ శరీరమా? కాదు. అది తెలియబడేదేగాని, తెలుసుకునేది కాదు. తెలియబడే దానికన్నా తెలుసుకొనేది వేరుగా వుంటుంది. చూడబడే దానికి చూచేవాడు వేరుగా వుంటాడు. ఇక్కడ శరీరం కన్నా వేరుగా ఏదో వున్నది.**

*6. అహంకారం ఎప్పుడు తొలగుతుంది?*

**జ. జ్ఞానం పరాకాష్టకు చేరుకున్న కొద్దీ, తను పరమాత్మ ఎదుట పిపీలికం కంటే అల్పుడననే పరమసత్యం గ్రహించిన తక్షణం అహంకారం తొలగిపోతుంది.**

*7. అవాఙ్మానసగోచరమంటే ఏమిటి?*

**జ. సర్వచైతన్యానికీ మూలమైన తత్త్వమే బ్రహ్మ(జ్ఞానము) చైతన్యం. ఈ చైతన్యంలో ప్రేరణ పొంది, అస్థిత్వాన్ని పొందిన మనస్సు, వాక్కు, ప్రాణం, ఇంద్రియాలు బ్రహ్మచైతన్యాన్ని తెలుసుకోలేవు. ఆ కారణం చేతనే బ్రహ్మచైతన్యాన్ని అవాఙ్మానసగోచరమని అంటారు.**

*8. శత్రుత్వం కలగటానికి కారణమేమిటి?*

**జ. శత్రుత్వం కలగటానికి కారణం అసూయ, అహంకారం, ద్వేషం లాంటివి నిప్పు కణికల్లాంటివి. అవి ఎవరిలో వుంటే, వారి విచక్షణను, మంచి లక్షణాలను దహించివేస్తాయి. వారికి వారే శత్రువులౌతారు, సమాజానికీ శత్రువులౌతారు.**

*9. మీరు చదువుతున్న నిర్వాణషట్కము గురించి తెలుసుకున్నారా? శంకరాచార్యులవారిని గోవింద భగవత్‌పాదులవారు "నీవెవరు?" అని అడిగిన ప్రశ్నకు చిన్నపిల్లవానిగా వున్నప్పుడే ఇచ్చిన సమాధానం ఏమిటి?*

**జ. నీవెవరు? అన్న దానికి శంకరాచార్యులవారు చెప్పిన సమాధానం ఇది. "నేను ఎల్లప్పుడూ వుండేవాడిని. నాకు నామరూపాలు లేవు. ఈ ప్రపంచంతో నాకు ఎటువంటి సంబంధమూ లేదు. ముక్తితో సైతం నేను ముడిపడి లేను. నాకు కోరికలు లేవు. నేను అంతటా నిండి వున్నవాడిని. అన్నీ నేనే అయివున్నవాడిని. అన్ని చోట్లా, అన్ని వేళలా సంతులనంగా వ్యాపించి వున్నవాడిని. నేను శాశ్వితుడను. ఆనంద స్వరూపుడను. మంగళకారుడను. స్వచ్ఛమైన ఎరుక చైతన్యంతో కూడిన శివస్వరూపుడను నేను" అని సమాధానమిచ్చాడు. దేవుడు వేరు కాదు – మనిషి వేరు కాదు అన్న సత్యాన్ని అందించాడు!**

ఓం

**10-10-2018** 10:40 AM

*1. స్వామిని భర్తగా భావించమని చెబుతూంటారు. దాని భావమేమిటి?*

**జ. భర్త అంటే శరీరం కాదు. భావన అనే రీతిలో ఆత్మభావంతో మెలగుచూ, ఎంతో తృప్తిగా భగవంతుడు బోధించిన బోధల నిర్వచనాల సాక్షిగా జీవించగలగాలి.**

*2. భగవంతుని బిడ్డలుగా వుండవలసిన గుణమేమిటి?*

**జ. బిడ్డలుగా వుండాలనుకునే వారికి ప్రప్రథమంగా వుండవలసిన విశిష్ఠగుణం గర్వం లేకపోవుట.**

*3. భగవంతుడు దరిచేరి మీకు బోధిస్తున్న బోధలు, ఆయన సమీపాన మీరు పొందుతున్న అనుభూతి ఎలా వుంటున్నది? ఇంకా ఏమైనా చెప్పదలుచుకున్నారా?*

**జ. భగవంతుని స్పర్శ, ఆయన నుండి వెలువడే వాయువు, ఆయన దృష్టి, వాక్కు సమస్తమూ తండ్రి అన్న భావన ఎన్నో ఎన్నో జన్మలను అంతం చేస్తుందనే విశ్వాసం చాలా గట్టిగా వుండాలి స్వామీ. మీరు మమ్ములను తండ్రిగా ఒక దివ్యబంధానికి కట్టివేశారు. ఈ బంధం సుస్థిరంగా పటిష్ఠపర్చుకుంటూ, మీవైపు పయనిస్తాము స్వామీ. మీరు మమ్ములను వదిలిపెట్టరు. అందరికీ సుగతియేనని చెప్పారు. అంటే, నమ్మనివారి చేత కూడా నమ్మించగలరు. మీ పాదాలు**

**పట్టుకోవటం కాదు స్వామీ, పట్టుకునేటట్లు చేస్తారు. శరణాగతి భావం ఒక దివ్యతత్త్వంగా అర్థం చేసుకునేలా చేసినందుకు కృతజ్ఞతలు స్వామీ!**

4. *జీవితంలో ఇంకేమి కావాలి?*

జ. **జీవితంలో ఇంత కన్నా ఇంకేమీ అక్కరలేదనుకోవటమే ఆనందం స్వామీ!**

5. *భగవంతుడు మిమ్మల్ని హాయిగా వుండమని ఆశీర్వదిస్తాడు. దాని అర్థమేమిటి?*

జ. **అల్పులైన ఈ జీవుల్ని అనల్పమైన తన స్థాయికి తీసుకువెళ్ళాలన్న తపన, తాపత్రయం ఆయనది.**

6. *భగవంతుని శక్తి మిమ్మల్ని ఏ విధంగా స్పర్శిస్తుంది?*

జ. **భగవంతుని శక్తి ఒక అమృత సముద్రము వలె తాకుతుంది. ఆ స్పర్శకు ఈ అమృత సముద్రం స్పందించి, జడివాన వలె మాలోని నవనాడులనూ అమృతస్నానం చేయిస్తుంది స్వామీ.**

7. *మరి అప్పటి నుండి మీలో ఎటువంటి మార్పు సంభవిస్తుంది?*

జ. **అది ఒక పునర్జన్మ స్వామీ. అప్పటి నుండి, మాలో వచ్చే ఆలోచనలు గానీ, భావాలు గానీ, మాటలు గానీ భిన్నంగా వుంటాయి. భక్తి అనే తపస్సు వలన ఉత్పన్నమైన వేడి, మాలోని మలినాలను పీల్చివేస్తుంది.**

8. *భగవంతుని కరుణను ఎలా గుర్తించగలుగుతారు?*

జ. **కరుణ లేకపోతే మేమే లేము స్వామీ. ఎందుకంటే, మేము చేసే పనులన్నీ ఆయన కరుణ వల్లనే. మా దృష్టిలో కష్టసుఖాలు రెండూ కరుణ వల్లనే అని భావించాలి. ప్రతి చిన్నపని మా చేతులతో చేస్తున్నామనుకున్నా, మేము ఎట్లా చేసినా అది ఆయన కరుణ వల్లనే కదా. మాకు కనబడకుండా ఆయా పనులు చేయించటమే, ఆయన కరుణ కదా స్వామీ! కరుణ సముద్రం అల వంటిది. ఆ తరంగానికి తరుణం వచ్చినప్పుడు నీరే తరంగమవుతుంది. ఎక్కడో ఒకచోట పుట్టి కొండలాగా పెరిగి లయమవుతుంది. ఒక్కొక్క అల ఎక్కడి నుండో వస్తున్నట్లు వుంటుంది. ఒక్కొక్కటీ దగ్గరలోనే పుట్టినట్లుగా వుంటుంది. ఏది ఏమైనా, నీటికి గాలి ఒరిపిడేగా అల అంటే స్వామీ!**

9. *మానవుడు కొన్ని కొన్ని సాధించాలనుకుంటాడు. అవి ఏవి క్లుప్తంగా?*

జ. **నిశ్చలత్వం (స్థిరత్వం), ఏకాగ్రత, ఓర్పు, విశ్వాసం, శాంతి, వైరాగ్యం ఇవి సాధించాలన్న పట్టుదల ఆధ్యాత్మికపరుడైన ప్రతి జీవికీ ఒక ఆశ స్వామీ.**

10. *ఇంతకీ లక్ష్యమంటే ఏమిటి?*

జ. **లక్ష్యమంటే, తనను తాను తెలుసుకుంటూ, తన గురించి తాను ఆలోచించుకుంటూ, దైవంతో ఆత్మానుసంధానం చేసుకోవడానికి లక్ష్యం ఉపకరిస్తుంది స్వామి. ఇది కమనీయమైనదే కానీ, కష్టతరమైన అనుభూతి కూడా స్వామీ. మమ్మల్ని మేము తరచి తరచి అంతర్ పరీక్షకు ఉపకరించే సాధనమవుతుంది.**

*11. ఎదుటి మనిషి నీవాడు ఎప్పుడవుతాడు?*

**జ. క్షమించినప్పుడే ఎదుటిమనిషి నావాడవుతాడు, నేను ఎదుటివారి మనిషినవుతాను. మాలో భాగం అనుకున్నప్పుడు, ఎదుటి వ్యక్తిని క్షమించడం ఏమంత కష్టం కాదు. అయితే, క్షమ అనేది మరో తప్పు చేయడానికి లైసెన్స్ కాకూడదు స్వామీ.**

ఓం

**11-10-2018** 09:45 AM

*1. గురుశిష్యుల సంబంధం ఎలా వుండాలి?*

**జ. గురువు ద్వారా శిష్యుడు లబ్ధిపొందుతాడు. గురువు యొక్క అంతరంగముతో తన అంతరంగాన్ని అనుసంధానం గావించగలిగితే, శిష్యుడు ఉన్నతంగా ఎదగగలుగుతాడు. తన అంతరంగమందు ఉద్భవించే అనుమానాలకు గురువు నుండి శిష్యుడు పూర్తిగా గురువు ఆశీర్వచనములతోనే సమాధానము పొందగలడు. గురువుకు పూర్తి శరణాగతుడు కావాలి. అంతేకానీ, గురువును పరీక్షించుట కూడనే కూడదు. అది సబబు కాదు. ఆధ్యాత్మిక పురోభివృద్ధికి అది ఆటంకమవుతుంది. గురుశిష్యుల సంబంధమనేది ఆత్మానుబంధం. భౌతికపరమైనది కాదు. ఏ వ్యక్తి అయినా ఆధ్యాత్మికంగా పరిణతి చెందాలంటే, గురువు తప్పక అవసరము.**

*2. నీవు హాయిగా ఆనందానికి ప్రతిరూపంగా వుండి, ఈ క్షేత్రం యొక్క పుట్టుపూర్వోత్తరాలు, అనిత్యత్వం గురించి ఎలా తెలుసుకుని, ఎలా మసలుకుంటావు, కొంచెం విపులీకరించండి.*

**జ. ఇప్పటి వరకూ ఈ క్షేత్రమే నేను అనే తప్పుడు అభిప్రాయంలో వున్నారు. ఇప్పుడు క్షేత్రస్వభావం తెలిస్తే, నేను అది కాదు. దీనికన్నా వేరుగా వున్నాను అని తెలుసుకుంటారు. దీనికి విచారణ చేయాలి. స్థూల, సూక్ష్మ, కారణ శరీరాలతో కాని, వాటి వృత్తులతో కాని, క్షేత్రజ్ఞుడవైన నీకు ఎటువంటి సంబంధము లేదు. నీవు కేవలంగా వాటిని చూచే సాక్షివి మాత్రమే. నీ ప్రకాశం వల్లనే తమ పనులు తాము చేసుకుంటున్నాయంతే. జాగ్రదావస్థలో స్థూలశరీరం, సూక్ష్మశరీరం, కారణశరీరం అన్నీ పనిచేస్తూంటాయి. వాటిని పనిచేయించే జీవుడ్ని 'విశ్వుడు' అంటారు. వాడు నిద్రలేచింది మొదలు నిద్రపోయే వరకు ఏదేదో చేస్తుంటాడు. ఆ సంసారాన్ని వాడికి వదలండి. ఇక నిద్రకుపక్రమించిన తర్వాత స్థూలశరీరం ప్రక్కమీదకు చేరి అలసిపోతుంది. అప్పుడు సూక్ష్మశరీరం పనిచేస్తుంది. దాని పని స్వప్నాలను సృష్టించడం. ఆ స్వప్నావస్థలో పనిచేసే జీవుడ్ని 'తైజసుడు' అంటారు. వాడి చిత్ర విచిత్ర వ్యవహారాలను వాడి నెత్తినపెట్టండి. ఇక గాఢనిద్రలో ఏమీ చేయకుండా హాయిగా వుండే జీవుడ్ని 'ప్రాజ్ఞుడు' అంటారు. వాడి గొడవను వాడికే అప్పగించండి. మరి ఇంతకీ నీవెవరు? నీవు సాక్షివి. కేవలసాక్షివి. స్వయంప్రకాశానివి. నిత్యసత్యానివి. ఆత్మవు. సాక్షివైన నీవు సాక్షిగానే వుండు. వారి వ్యవహారాలలో జోక్యం చేసుకోకండి.**

జోక్యం చేసుకున్నారా? సుఖదుఃఖాలు, లాభనష్టాలు, జయాపజయాలు, మానావమానాలు, అలజడులు, ఆందోళనలు, అశాంతులు కనుక దూరంగా, కేవలంగా సాక్షిగా, నిర్లిప్తంగా ఉండిపోండి. జాగ్రదావస్థలో స్థూలశరీరంతో 'విశ్వుడు' వచ్చాడు, స్వాగతం చెప్పావు. స్థూలశరీరంతో వాడు ఏదేదో చేస్తుంటాడు, అనుభవిస్తుంటాడు. వాడి స్థితి, గతి అన్నీ చూచావు. వాడు పోతానన్నాడు, పొమ్మన్నారు. స్వప్నావస్థలో 'తైజసుడు' వచ్చాడు. స్వాగతం చెప్పావు. సూక్ష్మశరీరంతో ఎక్కడెక్కడో తిరిగి, ఏదేదో చేసి సుఖంగా అనుభవాలు పొందాడు. వాడి పరిస్థితి గమనించావు. వాడు కాసేపు నవ్వి, కాసేపు ఏడ్చి పోతానన్నాడు, పొమ్మన్నారు. గాఢనిద్రావస్థలో 'ప్రాజ్ఞుడు' వచ్చాడు. కారణశరీరంతో, అజ్ఞానంతో ఏమీ తెలియకుండా అలా పడివున్నాడు. వాడి బాగోగులూ చూచారు. అతడూ కొంతసేపటికి ఉడాయించాడు. సరేనన్నారు. ఆ ముగ్గురిలో ఒకరున్నప్పుడు మరొకడు లేడు. ఒకరి విషయం మరొకరికి తెలియదు. నీకు మాత్రం అందరి విషయం తెలుసు. వచ్చేవాడితో నీవు రాలేదు, పోయేవాడితో నీవు పోలేదు. వారు వచ్చినప్పుడూ, పోయినప్పుడూ, వారు వున్నప్పుడూ, లేనప్పుడూ నీవు మాత్రం సాక్షిగా, కేవలసాక్షిగా వున్నావు. ఏ క్షేత్రంలో జరిగిన విషయాలైనా, పొందిన అనుభవాలైనా వాటితో మీకు ఏమాత్రమూ సంబంధం లేదు. ఆయా శరీరాలతో జరిగిన అనుభవాలు మీకు చెందవు. అవన్నీ ఆయా క్షేత్రాలకు సంబంధించినవి మాత్రమే. నీకు నీవుగా, కేవలంగా వున్నావు. వాటితో తాదాత్మ్యం పెట్టుకుని కలసిపోయావా? ఆ అనుభవాలన్నీ నీవిగా భావించి నవ్వుతావు, ఏడుస్తావు. అలా కాక, వాటితో సంబంధాన్ని వదిలి, అబద్ధపు సంబంధాన్ని పెట్టుకోకుండా వున్నావా? నీవు హాయిగా, ఆనందంగా వుండిపోతావు. అలా ఆనందంగా వుండిపోవటానికే ఈ క్షేత్రం యొక్క పుట్టుపూర్వోత్తరాలు, అనిత్యత్వం గురించి తెలుసుకోవాలి. ఇలా స్థూల సూక్ష్మ కారణ శరీరాలు మూడూ క్షేత్రమేనని తెలుసుకుంటే, దానితో గల అబద్ధపు తాదాత్మ్యాన్ని విడిచిపెట్టవచ్చు. దానియందు గల అభిమానాన్ని విడిచిపెట్టవచ్చు.

*మహితాత్మ స్వరూపం జ్ఞానశక్తితో దారి చూపేవాడు గురువు*
*తేజస్సును అందించి, ఉషఃకాంతులను వెదజల్లి, అవిద్యలను పోగొట్టి,*
*తప్పు అడుగుల్ని చూపులతో, చేతలతో సరిదిద్ది రక్షించి,*
*జీవితాలకు విద్యావికాసాలను అందిస్తూ, విజయఢంకా మ్రోగిస్తూ,*
*ఈ వీరాంజనేయుడు విద్యకు ప్రతిరూపంగా తమస్సును తొలగించి*
*దివ్యచైతన్య స్ఫూర్తిని అందించి*
*అణకువతో కూడిన ఆంజనేయుడు అభిలషిస్తున్న అఖండ జ్ఞానవంతమైన*
*ఆధ్యాత్మికతను అనుభవిస్తూ, గురుసంరక్షణలో, గురు ఆశీస్సుల ఆధారముతో*
*అడుగు ముందుకు వేసి, అఖండ జ్ఞానవంతులై, జ్ఞానదీపికలై,*
*చిరుదివ్వెలై వెలుగొందండి*
*నా చిన్నారి ముద్దుబిడ్డలారా.*

ఓం

**12-10-2018** 10:00 AM

*1. విజయదశమి సంకేతమేమిటి?*

**జ. మీలో ఎప్పుడూ మంచి-చెడు కలిసే వుంటాయి. వాటి మధ్య జరిగే సంఘర్షణలలో మంచి గెలవటానికి ప్రతీకగా చేస్తున్నదే విజయదశమి. అలా మంచి గెలవటానికి ఏ శక్తి కావాలో, ఆ శక్తిగా అవతరించి సజ్జనులకు అమ్మ తోడ్పడుతుంది.**

*2. చెడు అంటే ఏమిటి? విజయదశమి ఎటువంటి చెడులను నిర్మూలనము చేస్తుంది?*

**జ. అది శరీరంలో అనారోగ్యం కావచ్చు, మనస్సులో వున్న దుర్గుణాలు, దురాలోచనలు, మూఢనమ్మకాలు కావచ్చు, సమాజంలో వున్న దురాచారాలు కావచ్చు, ప్రకృతిని కలుషితం చేసే మాలిన్యాలు కావచ్చు, సృష్టి నియమాలకు విరుద్ధంగా కలకాలం బ్రతికివుండాలనే స్వార్థం కావచ్చు. ఇటువంటి ఎన్నో చెడు లక్షణాల మీద విజయం సాధించే రోజు, విజయదశమి.**

*3. ఆధ్యాత్మిక సాధకుడు తెలుసుకోవలసిన ముఖ్య అంశం ఏమిటి?*

**జ. తెలుసుకోవలసిన ముఖ్య అంశం, మొట్టమొదటగా సంతోషనిష్ట ద్వారా లభించే సుఖం రాజసికమైనదా? కాదా? అని. మనస్సు నిరంతరం బ్రహ్మము నందు చరించడమే బ్రహ్మచర్యం. కానీ ఏ ఒక్కరూ, ఎల్లవేళలా ధ్యానస్థితిలోనో, సమాధి అవస్థలోనో వుండలేరు. ఏదో ఒక వ్యాపకం తప్పనిసరి. అయితే, సంతోషనిష్ట ఏర్పర్చుకునే ప్రయత్నంలో కల్పించుకునే వ్యాపకం రాజసిక ఆనందం కలిగించిందనుకోండి, అది మిమ్మల్ని ఒక సౌకర్యవంతమైన పరిధిలో బంధిస్తుంది. అప్పుడు మీరు మీ మనస్సులను భగవంతుని వైపు మరల్చటానికి బదులుగా, ఆయా పనులవైపు మళ్ళిస్తారు. కావున జాగ్రత్త సుమా!**

*4. విషయవస్తువులతో కూడిన మనస్సు ఇంద్రియాలకు రాజువలె వ్యవహరిస్తూ ఏమి సల్పుతున్నది?*

**జ. ఇది ఇంద్రియ విషయాలలో ఎప్పుడూ తగుల్కొనే వుంటుంది. ఈ మనస్సు వెనుకవున్న 'నేను' "నేను" వింటున్నాను, నేను చూస్తున్నాను" మొదలైన అనుభూతులను పొందుతుంది. ఈ 'నేను', మనస్సు-ఇంద్రియము-ఇంద్రియవిషయము అనే శృంఖలం ఎంత సూక్ష్మంగా, వాడిగా వుంటుందంటే, ఈ గొలుసులోని కొక్కెములను విడిగా చూడలేనంత, కనుగొనలేనంతగా వుంటుంది.**

*5. మానవుడు ఇంద్రియాల తేజస్సు క్షీణించడం నుండి ఏమి తెలుసుకోవచ్చు?*

**జ. తాను ఇంద్రియభోగాలను అనుభవించడం లేదని, ఇంద్రియభోగాలే తనను అనుభవిస్తున్నాయని తెలుసుకుంటాడు. ఇది అర్థమైతే, విషయసుఖాలు కలిగించే సంతోషం ఎంతటి విషతుల్యమో, ఎంతటి అనర్థాన్ని తెస్తుందో గ్రహించగలరు.**

*6. గురువుకు నమస్కారం చేయటంలోని అర్థమేమిటి?*

జ. గురువుకు నమస్కారం చేయటంవల్ల అహంకారం నిర్మూలనమవుతుంది. అంతకు మించిన సత్ఫలితము ఇంకొకటి లేదు. ఆత్మసాక్షాత్కారం ఒళ్ళు వంచటం వల్ల కలగదు. అహంకారాన్ని వంచాలి. నిజానికి ఎవరు ఏ అభ్యున్నతిని సాధించినా, ప్రత్యక్షంగానైనా పరోక్షంగానైనా ప్రేరకుడు గురువే. అటువంటి గురువును అవమానించినట్లయితే, భగవంతుడు కూడా క్షమించడు.

*7. ఏ గుణము మనిషిని శక్తివంతుడుగా నిరూపిస్తుంది?*

జ. సహనము, ఓర్చుకునే గుణమే మనిషిని శక్తివంతునిగా నిరూపిస్తుంది. ఇవే వ్యక్తి బలవంతుడా, బలహీనుడా అని నిర్ధారించటానికి కొలమానాలు. దేహబలం కాదు కావలసింది, బుద్ధిబలం. స్వకీయదేహంతో మమేకమైన నేను అన్న పరిమిత వ్యక్తిత్వాన్ని వదులుకుంటే, అనంతతత్త్వం, అమృతత్వం మనిషి సొంతమవుతుంది.

*8. జ్ఞాన-అజ్ఞానాలు ఏమి ప్రసాదిస్తాయి?*

జ. అవగాహన అజ్ఞానాన్ని తొలగిస్తే, జ్ఞానం అనుభవాన్ని మిగులుస్తుంది.

*9. క్షేత్రం అనేది ఎలా పుడుతుంది? అయితే, భగవంతునికి ఏమి అవసరం సృష్టించడానికి?*

జ. పరమాత్మ మాయ అనే శక్తితో కూడివుంటాడు. మాయ అంటే, ఉన్నట్లుగా కన్పించే లేని వస్తువు. అదే ప్రకృతి - స్త్రీ, పరమాత్మ-పురుషుడు. పరమాత్మ అనే పురుషుడు మాయ అనే స్త్రీకి గర్భదానం చేస్తాడు. అప్పుడే క్షేత్రం అనేది పుడుతుంది. ఆయనకు ఏమి అవసరం అంటే, పూర్వకల్పంలోని జీవుళ్ళు దేహాన్ని వదిలిన తర్వాత అవ్యక్తంలో అంటే పరమాత్మలో వుండిపోతారు. వారి అందరి వాసనలను సమిష్టివాసనలు అంటారు. అవి పక్వానికి వచ్చి, అనుభవాలు పొందాలని భగవంతుని తొందరపెడతాయి. కనుక, భగవంతుడు గర్భదానానికి సిద్ధమయ్యాడు. మీరు పండ్ల కోసం విత్తనం నాటినట్లు, ఆయన వివిధ క్షేత్రాల సృష్టి కోసం ఈ వాసనలనే విత్తనాలను మాయయొక్క గర్భంలో నాటుతాడు. ఈ విత్తనం సూక్ష్మాతిసూక్ష్మం. కంటికి కనిపించదు. దానిని అవ్యక్తం అంటారు. ఆ అవ్యక్తమే క్రమంగా మార్పు చెంది, మహత్తత్త్వమనే బుద్ధిగా మారుతుంది. అంటే, వాసనలే స్వభావంగా మారిపోతాయి. చెడ్డవాసనలతో చెడ్డ, మంచివాసనలతో మంచిగా వుంటారు. విత్తనం మొదట చిన్నదిగా వుంటుంది. తర్వాత ఉబ్బి పెద్దదిగా అవుతుంది. ఆ తర్వాత దాని నుండి చిన్న అంకురం పుడుతుంది. అలాగే, అవ్యక్తం బుద్ధిగా మార్పు చెంది, దాని నుండి నేను, నాది అనే అహంకారం బయలుదేరుతుంది. అంకురం మొక్కగా, వృక్షంగా వృద్ధి చెందినపుడు, దానికి శాఖలు ఏర్పడ్డట్లు, ఈ అహంకారం నుండి మహాభూతాలు అయిదు ఏర్పడ్డాయి. అవి అపంచీకృత సూక్ష్మభూతాలు. వీటికి సత్త్వరజస్తమోగుణాలనే త్రిగుణాలుంటాయి. ఎక్కడివి ఇవి? తల్లి నుండి వస్తాయి. తండ్రి పరమాత్మ, గుణరహితుడు. తల్లిమాయకే ఈ మూడు గుణాలున్నాయి. అవే ఈ మహాభూతాలనేవి పిల్లలకు వచ్చాయి. అంటే, తల్లి చాలన్నమాట!

***నేను నాదను దుష్కర్మ నిన్ను వదలనంత కాలము,***

***ఆత్మ తెలియని అజ్ఞాన అంధకారమున వున్నంత సేపు,***

*మనసు పోకడలు గమనించక, గుర్తు తెలుసుకోక, ఇదియే సంతృప్తియనుచు,*
*సంగమించవలసిన సద్గుణములను విడనాడి,*
*మానవాళి మనుగడకు అజేయంగా, విజయపతాకమెగురవేస్తూ,*
*ఆంజనేయుని మాటల మూటలు స్వహస్తాలతో నెత్తిన ఇడుకుని,*
*జన్మ చరితార్థమొనర్చుటకై, సాధికారముగా, సాకేతనగర పాలకులై,*
*స్వరాజ్యమే మీ రాజ్యమనుచూ, ఆత్మసామ్రాజ్యములో ఆంజనేయుని అండన చేరి*
*అంతకు అంత సుఖమునసుభవించుచూ, రామ చరణాంబుజులై*
*రాగద్వేషాలు లేక రంజిల్లండి సదా*
*నా చిన్నారి ముద్దుబిడ్డలారా.*

ఓం

**24-10-2018** 10:10 AM

*1. రాజసిక సుఖాలు అని వేటిని అనవచ్చు?*

**జ. బలము, వీర్యము, రూపము, ప్రజ్ఞ, మేథస్సు, ధనం, ఉత్సాహాలను నాశనం చేసే విషతుల్యమయినవి రాజసిక సుఖాలు. అందుకే సంతోషనిష్ట అనేది రాజసిక సుఖాలను అపేక్షించేదిగా వుండకూడదు. ఏదో ఒక రూపంలో గుహ్యేంద్రియాన్ని, జిహ్వేంద్రియాన్ని తృప్తిపరచే విషయాకర్షణ సంతోషాలపట్ల సాధకులు సదా అప్రమత్తులై వుండాలి. అయితే, మొదట్లో ఇష్టంగా వుండి, చివరకు కష్టంగా అనిపించే సుఖాలు విసుగు, నష్టం, విరక్తి కల్గిస్తాయి.**

*2. సంస్కారయుక్తమైన మనస్సును ఎలా తయారుచేసుకోవాలి? ఎప్పటికప్పుడు మీ మనస్సుపై చేరే మలినాలను ఎలా శుభ్రం చేసుకోవాలి?*

**జ. ముందుగా మనస్సుపై పేరుకునే మలినాలు ఏమిటన్నవి మీకు అవగతం కావాలి. మనస్సు యొక్క చంచలత్వాన్ని ప్రేరేపించేవన్నీ మలినాలే. అవి కామక్రోధాదులు కావచ్చు, అహంకార మమకారాలు కావచ్చు. భీతి భ్రాంతులు కావచ్చు, ఇంకా ఇష్టాయిష్టాలు, రాగద్వేషాలు, జయాపజయాలు, మానావమానాలు వంటి ద్వంద్వాలు కావచ్చు. ఇవి సంస్కారాల రూపంలో మనస్సుపై చెరగని ముద్రలను వేసుకుంటూపోతాయి. ఈ ముద్రలు మీ ప్రవర్తనలో భావావేశాలుగా అభివ్యక్తమవుతాయి. అవి మీ జీవనగతిని నియంత్రిస్తూ వుంటాయి. అందుకే వివేచనతో ఎప్పటికప్పుడు మనసు నుండి మలినాలను తొలగించుకోవటం నేర్చుకోవాలి సముద్రంలా.**

*3. వాస్తవానికి తల్లిదండ్రులు విచారించవలసినది బిడ్డల విషయంలో దేనికొరకు?*

**జ. వాస్తవానికి తల్లిదండ్రులు విచారించవలసినది పారమార్థిక పథంలో వున్న పుత్రుల కోసం కాదు. వ్యావహారిక జగత్తులోని వ్యామోహాలతో కొట్టుమిట్టాడే కుమారుల కోసం. మనుష్యత్వం, ముముక్షత్వం,**

మహాపురుష సంశ్రయం దుర్లభత్రయమని చెబుతాను. అయితే, ముముక్షత్వం లేకున్నా, మహాపురుషుల సంశ్రయానికి పిల్లలను ప్రోత్సహించాలి. సన్యాసుల వద్దకు వెడితే ఎక్కడ తమ పిల్లలు తమకు కాకుండాపోతారోనని అనుకుంటారు. కానీ, అది తప్పు. ప్రపంచంలో ప్రతిఒక్కరూ సాధువులు, సర్వసంగపరిత్యాగులూ కాలేరు. బాల్యం నుండి కౌమారదశకు చేరేవారికి తప్పక సద్గురువుల సాన్నిధ్యం చేరేలా చూడవలసిన బాధ్యత తల్లిదండ్రులదే.

*4. అనేకత్వం నుండి ఏకత్వాన్ని సాధించే ప్రయత్నంలో మీ ఆలోచనా పరిధి ఎలా వుండాలి?*

జ. అంటే ఆ ఏకం నుండే అనేకత్వం వచ్చింది. అంటే నిత్యం నుండే లీల ఒక స్థితిలో అనేకత్వం మటుమాయమైపోతుంది, ఏకమూ మాయమైపోతుంది. భగవంతుడు సామ్యం లేనివాడు. ఆయనను సాదృశ్యంతో వర్ణించలేరు. ఈ స్థితిని వెలుగు-చీకటుల మధ్యనున్న స్థితిగా చెబుతాను. భగవంతుడే కర్త. ఈ జీవజగత్తు యావత్తూ ఆయనకు చెందినదే. ఈ ఎరుకే జ్ఞానం. నేను కర్తను, నేను గురువును, నేను తండ్రని ఈ ఎరుక అజ్ఞానం. ధనం, సంపద, బంధువులు, ఇల్లూవాకిలి, భార్యాపిల్లలు అన్నీ నాకు చెందినవే అన్న ఎరుక అజ్ఞానం. "భగవంతుడా! నువ్వే కర్తవు" అన్న ఎరుక ఏర్పడనంత వరకూ తిరిగి తిరిగి రావలసిందే. నేను, నాది అన్న సత్యాన్ని తెలుసుకోనివ్వవు. అద్వైతజ్ఞానం ఏర్పడనంత వరకు, చైతన్యదర్శనం కలగదు. చైతన్యదర్శనం కల్గితే, తర్వాత నిత్యానందమే. పరమహంసస్థితిలో ఈ నిత్యానందం అనుభూతమవుతుంది.

***భగవంతుడు ఇచ్చినవన్నీ హాయిగా పొందావు***
***మరి నీవు తిరిగి ఏమిచ్చావు?***
***నీవు అంధకారంలో పడిపోతివా, భగవంతుని అనురాగ ఆప్యాయతలను పొందలేవు***
***నేను, నాదియను దుష్కర్మను వదిలి, లోకమందు చరించి, శోకాన్ని విడచి,***
***సంశయమును బాసి, సందియములనెల్లా విడనాడి***
***వీరులవలె విలువైన జీవనసత్యాన్ని గుర్తించి***
***గుర్తెరుగుటకై, గురుతు తెలుపు గురుతుల్యుడు***
***ఈ ఆంజనేయుని వాక్యములు గుప్తముగా మదిలో నిలుపుకుని,***
***మనస్సును హరియించి, ఈషన్మాత్రము కూడా అసురగుణములు లేక,***
***గుణ సంహారులై, ఆంజనేయుని చేరి సదా సుఖించండి***
***నా చిన్నారి ముద్దుబిడ్డలారా.***

ఓం

**25-10-2018** 06:25 PM

*1. సాక్షికదృష్టి అంటే ఏమిటి? తాత్త్విక చర్చలలో ద్వంద్వాలను అవును-కాదు అని ఎంతవరకూ తీసుకుంటారు?*

జ. క్షణభంగురమా – శాశ్వతమా? రసహీనమా – రసవత్తరమా? ఈ విధమయిన సరళిలో ఆలోచనలు సాగుతాయి. దీనికి ఉదాహరణగా ఒకరు బస్సులో వెళ్తుంటే, ఒక అగ్రజుడు, "ఆలస్యం–అమృతం–విషం" అన్నారు. మరొకరు, "నిదానమే ప్రధానం" అన్నారు. ఈ రెండూ పరస్పర విరుద్ధాలు. వీనిలో దేనిని తీసుకోవాలి? అని తన అనుమానాన్ని తెలియచేసాడు. తరువాత నేను ఇచ్చిన ఆలోచన ఎలా వుందంటే, అన్నం కుంపటి మీద పెట్టినప్పుడు "నిదానమే ప్రధానము" అని ఆగాలి. లేకపోతే, తడిసిన బియ్యం తినాలి. ఉడికిన తర్వాత "ఆలస్యం అమృతం విషం" అని దించాలి. లేకపోతే, మాడిపోతుంది. అందుకని, ద్వంద్వాలను సమయానుకూలంగా తీసుకోవాలి. ఇదే అనుకోకూడదు. శాశ్వితమైనది ఏది అని ఆలోచిస్తే, అశాశ్వితం లేదని చెప్పవచ్చు. ఎందుకంటే, మానవకోటి నుండి జీవకోటి ఎన్నో పుడుతున్నాయి, పోతున్నాయి కదా! శాశ్వితం ఏ విధంగా అవుతుంది? అనే సందేహం మీకు వచ్చినట్లయితే, ఆ వ్యక్తులే వుండకపోవచ్చు కానీ, మరొక వ్యక్తులతో మానవకోటి జీవకోటి అవుతుంది. ఈ విధంగా జగత్తు శాశ్వతం. మరొకరకంగా నేను లేక ఆత్మ సర్వత్రా ఎప్పుడూ వుంటుంది. అప్పుడు అంతా వర్తమానమే (ఆత్మానుభూతి వున్నవానికి) అవుతుంది. ఆత్మానుభూతి రీత్యా అంతా శాశ్వతమే. పావనగంగాజలం – మురుగుకాల్వలో నీరు, మధురమైన వేణుగానం – పిల్లల అల్లరిమూక గోలయందు సమదృష్టి ఎప్పుడు వస్తుందో, అప్పుడు బ్రహ్మజ్ఞానం కలిగినట్లు. పావనగంగ అదే, మురుగుకాలువ అదే కనుక రసహీనమా, రసవత్తరమా అనేది సాక్షికదృష్టి అవుతుంది అంటాను.

2. *జీవితంలో నాలుగుదశలు జీవుడు అనుభవించాలి. అవి ఏ విధంగా అనుభవించవచ్చు?*

జ. ఋషిప్రోక్తములైన బ్రహ్మచర్య, గృహస్థ, వానప్రస్థ, సన్యాస ఆశ్రమాలు నాలుగూ జీవులు పాటించవలసినవి. అంటే, విద్యాభ్యాసకాలంలో బ్రహ్మచర్యం, యవ్వనంలో వివాహం, వార్ధక్యంలో మునివృత్తి, యోగమార్గంలో శరీరత్యాగం.

3. *భగవంతుడు అవతారపరిసమాప్తి చేసినా, ఆయనలో విశేషమేమిటి?*

జ. పరమభక్తుల్ని – సామాన్యుల్ని, మ్రొక్కినవారిని – మ్రొక్కనివారిని, ఆపన్న సమయాల్లో గజేంద్రునివలే రక్షించమని అర్థించినవారిని – అర్థించనివారిని అందరినీ ఆదుకోవటమే. భగవంతుడు సశరీరంగా వున్నప్పుడు నేడు, ఆలయంలో అర్చామూర్తిగా వున్నప్పుడు, తన చెవులతోనే వింటున్నాడా? ఎవ్వరికైనా మీరు పెట్టగలగటం కానీ, పెట్టలేకపోవటం కానీ మీ చేతుల్లో లేదు. పెట్టగలిగిన శక్తి మీకు, స్వీకరించే ప్రాప్తం వారికీ ఆయన ప్రసాదిస్తేనే అది జరుగుతుంది.

***చిన్నారి ముద్దుబిడ్డలారా! అన్న సంబోధనతో***
***మీరు పసిప్రాయము వారా లేక మాయాధీనములోనున్న బిడ్డలా***
***అంతకంతకు, అమాయకత్వమును విడనాడి,***
***అంజనీతనయుడు సంబోధిస్తున్న ఈ పసిబిడ్డలు పరువమునెరుంగని పసిపాపలవలే,***
***పసిమి మనసుతో మురిపాలు పంచుతూ, పకపకా నవ్వుచూ,***
***పవనకుమారుని పట్టుకుని, పరుగు పరుగున దొరికిన తోకను అందిబుచ్చుకుని***

***అందమైన ఆనందసామ్రాజ్యాన్ని చేరండి***

***నా చిన్నారి బిడ్డలారా.***

ॐ

**28-10-2018** 10:00 AM

*1. వాస్తవంగా భౌతికకాలుష్యాన్ని ఎటువంటివారు సృష్టించగలరు?*

**జ. వాస్తవంగా భ్రమించేవారే భౌతికకాలుష్యాన్ని సృష్టిస్తారు. ముందు మనసుయొక్క మూలాలను తెలుసుకోగలగాలి. ఆ తదుపరి దానిని ఛేదించగలగాలి, అధిగమించగలగాలి, కరిగించగలగాలి. ఈ విశ్వంలో ప్రతిదానిలో ఒకటి బయటకు కన్పిస్తుంది, రెండవది దాని వెనుకనే దాగివుంటుంది. ఎవరైతే బయటకు కనిపించే దానిని వాస్తవమనుకుంటారో, వారికి మనోవ్యాధి సోకినట్లే. అలాగాక బయటకు కనిపించే దాని వెనుకవున్న మూలాన్ని గుర్తించగలిగితే, మనోవ్యాధి లేనట్లే. అదే విధంగా మనసు కేవలం అధేయం మాత్రమే. దాని వెనుకన ఆధారముంటుంది. అదే ఆత్మ. ఈ విశ్వంలో ఆత్మ ఒక్కటే సత్యం. అన్యం మిథ్య. మిథ్యను వాస్తవంగా భ్రమించేవారే భౌతికకాలుష్యాన్ని సృష్టిస్తారు. అటువంటి వారంతా మనోవ్యాధిగ్రస్థులే. అందుకు సమూల శాశ్విత పరిష్కారం ఆత్మజ్ఞానమే.**

*2. క్షేత్రజ్ఞుడవైన నాకన్నా క్షేత్రం వేరుగా వున్నదని గ్రహించినాక, నా విచారణ ఏ విధంగా కొనసాగాలి?*

**జ. ఈ క్షేత్రమే నేను అనే తప్పుడు అభిప్రాయంలో వున్నారు. ఇప్పుడా క్షేత్రస్వభావం తెలిసినాక, నేను ఇది కాదు, దీని కన్నా వేరుగా వున్నాను అని తెలుసుకుంటారు. అపుడు విచారణ ఇలా చేయాలి. స్థూల, సూక్ష్మ, కారణ శరీరాలతో కాని, వాటి వృత్తులతో గాని క్షేత్రజ్ఞుడవైన నీకు ఏ సంబంధమూ లేదని, నీవు వాటిని కేవలంగా చూచే సాక్షివి మాత్రమే. నీ ప్రకాశంవల్లనే అవి తమ పనులు తాము చేసుకుంటున్నాయి అంతే.**

*3. అహంకారమని దేనినంటారు?*

**జ. వ్యక్తిలోని శరీరమనోబుద్ధులతో తాదాత్మ్యం చెంది, తననుతాను మరచి, జీవుడుగా వ్యవహరించే ఆత్మయే అహంకారం. విషయప్రపంచంతో సంబంధం పెట్టుకుని నేను, నాది అని భావిస్తుంది ఈ అహంకారం. ప్రపంచంలోని అనుభవాలను అనుభవించేది కూడా ఇదే. ఆత్మకు ఏ అనుభూతి వుండదు. అది కేవలం సాక్షి మాత్రమే.**

*4. ఆత్మవిద్య గురించి క్లుప్తంగా ఏమి చెప్పవచ్చు?*

**జ. మనిషిని ప్రేయమనబడే అజ్ఞానం, శ్రేయమనే జ్ఞానం ఎల్లకాలం అంటిపెట్టుకుని వుంటాయి. జ్ఞానమునంటిపెట్టుకున్న వారికి శుభములు కలుగుతాయి, అజ్ఞానమును ఆశ్రయించినవారు కష్టాలపాలై పతితులవుతారు. అజ్ఞానంలో వున్న వ్యక్తి తనను తాను బుద్ధిమంతుడనని, వివేకవంతుడనని, పండితుడనని అనుకుంటూ గ్రుడ్డివాని చేత దారి చూపబడే స్థితికి చేరుకుంటాడు. అభిమాన అహంకారాలనే మత్తులో,**

ధనవ్యామోహంలో కొట్టుకుపోయేవానికి పరలోకం గురించిన జిజ్ఞాస వుండదు. ఈ లోకమే సమస్తం, పరలోకం లేదు అని విర్రవీగు వారందరూ చివరకు, యమలోకానికి వెళ్ళక తప్పదు. లోకంలో జ్ఞానవంతులు చాలా అరుదుగా వుంటారు. ఆత్మవిద్యను ఆశించేవారు, వినడానికి అర్హతగలవారు లేరు. ఆత్మవిద్య విన్ననూ, దానిని అర్థం చేసుకోగలిగినవారు లేరు. అభేదదర్శియైన ఆచార్యుని ద్వారానే ఆత్మవిద్య లభిస్తుంది. బ్రహ్మాత్మభూతుడైన ఆచార్యుడు, ఆత్మతత్త్వమును బోధించినపుడు శ్రోత ఆత్మజ్ఞాన విజ్ఞుడై, అతడే నేను, అనగా నేనే బ్రహ్మము అని గ్రహిస్తాడు.

***దశేంద్రియములు జరుపుకొను ఉత్సవము***
***ఇది దసరా అనవచ్చా?***
***మరి దశేంద్రియములకిది సరిక్రొత్త సరదా కదా!***
***చిత్తవృత్తులనెగదోసి, గుడిలో నెలవు దొరికెననుచూ, సరదా కుదిరించుకున్నట్లైతే,***
***హరికథ విని మురిసినట్లైతే, పులిహోర తిని బలిసినట్లైతే***
***పోలిగాని పులివేషం అంతులేని సంతోషం అన్నట్లుగా,***
***చేతిలోనున్న కోతిబొమ్మ ఎగురుచున్నట్లు, మనసు స్వాధీనం తప్పి జీవితము సాగించినచో,***
***శాశ్వితమైన దానిని విడచి విగతజీవులై పరితపించెదరు***
***వీనులవిందుగా చెప్ప, ఈ ఆంజనేయుని మాటలు ఆలకించి***
***ఆలస్యము చేయక అంతు తేల్చుకుని దరిచేరండి***
***నా చిన్నారి బిడ్డలారా.***

ॐ

**29-10-2018** 10:40 AM

1. *జ్ఞానం అంటే ఏమిటి? దానికి ఆది, అంతం అనేవి వున్నాయా? జ్ఞానం ద్వారా ఎంతోమంది ఉన్నతస్థితిని పొందారు. ఆ స్థితిని పొందటమెలా?*

జ. విశ్వమంతా శుద్ధచైతన్యమయం. అది ఆత్మ – అనాత్మలుగా విభజించబడి వుంటుంది. అనాత్మ కానిదంతా ఆత్మే అవుతుంది. అయితే, అనాత్మ అనేది ఆత్మ నుండి ఆవిర్భవించి, తిరిగి ఆత్మలోనికే లయం చెందుతుంది. కాబట్టి, అనాత్మ కూడా ఆత్మే అవుతుంది. వాస్తవానికి ఆత్మ అనేది ఏకత్వంలో వుంటుంది. కాబట్టి, దానికి ఎటువంటి జ్ఞానం వుండదు. దాని ఉనికిని కనుగొనుటకు సంబంధించిన సమాచారమంతా ఆత్మజ్ఞానమవుతుంది. అనాత్మ మాత్రం పంచభూతాత్మకమై, రూపనామాలతో, రంగులతో, భిన్నత్వంలో వుండి, సంక్లిష్టంగా కన్పిస్తుంది. అందువలన, దానినంతటినీ భౌతికజ్ఞానమంటారు. భౌతికజగత్తు ఎంతవరకు వ్యాపించి వుంటుందో, జ్ఞానం కూడా అంతవరకు విస్తరించి వుంటుంది. కాబట్టి దానికి ఆది అంతాలు వుండవు. అందుకే దానిని అనంతం అంటారు. వాస్తవ విషయమేమిటంటే, అదంతా ఆత్మ యొక్క రూపాంతరమే, మరింకేమీ కాదు. అయితే, అదంతా నిలకడగా వుండక, సృష్టి

స్థితి లయలకు అనుగుణంగా రూపాంతరం చెందుతూ వుంటుంది కాబట్టి, దానిని మిథ్యాజ్ఞానం అంటారు. మారేది ఏదీ శాశ్వితం కాదు కాబట్టి, దానిని ఆ విధంగా సంబోధిస్తారు. అందుకే మిథ్యాజ్ఞానానికి సంబంధించిన భౌతికజగత్తునంతటినీ మాయ అంటారు. ఆధ్యాత్మికంగా పరిణతి చెంది జీవితపరమార్ధం నెరవేర్చుకోవటమనేది కత్తిమీద సాములాంటిదే. ఎందుకంటే, కలుషితమైన మేధస్సులను శుద్ధిచేయడమనేది మామూలు విషయం కాదు. అందుకు సద్గురు మార్గదర్శకత, పరిపూర్ణ అద్వైతబ్రహ్మజ్ఞానం, క్రమం తప్పని సాధన అత్యంత అవసరం, ఆవశ్యకం. మీరు ఆ దిశగా మీ జీవితాన్ని క్రమబద్ధీకరించుకుని, సత్ఫలితాన్ని పొందవలసినదిగా విజ్ఞప్తి చేస్తున్నాను.

2. *అవ్యక్తం అనే పదం వాడుతుంటారు. దాని అర్ధమేమిటి?*

జ. బుద్ధియొక్క స్వభావానికి కారణం అవ్యక్తప్రకృతి. అంటే, వాసనలతో కూడిన కారణశరీరమే అవ్యక్తం. ఇది ఎలా ఏర్పడింది? బుద్ధిపూర్వకంగా చేసిన కర్మలు, ఆలోచనలవల్ల మనసులో వాసనలు ముద్రించబడుతాయి. ఆ వాసనలే అవ్యక్తం లేదా ప్రకృతి. ఈ వాసనలే మళ్ళీమళ్ళీ కర్మలకు ప్రేరణనిచ్చేది.

3. *రామాయణంలో సీతమ్మతల్లి హనుమకు ఇచ్చిన ఒక అమూల్య సందేశం ఏమిటో తెల్పండి.*

జ. హనుమా! నోరులేని క్రూరజంతువులు సహితం తమ దగ్గరకు వచ్చినవాడిని పైగా తప్పులు చేసినా, వాడిని కాపాడుతాయి. మనుష్యస్త్రీగా ప్రవర్తిస్తున్న దానిని, శ్రీరామచంద్రమూర్తి ఇల్లాలిని, ధర్మం తెలిసివున్న దానిని, నన్ను బాధపెట్టారన్న కారణంతో రాక్షసస్త్రీలను నీకప్పచెప్పనా? వాళ్ళు నా అతిథిలాంటివారు. నేను వారిని కాపాడుతానన్నది. అంటే, అతిథి ప్రాముఖ్యతను వెల్లడిస్తూ నాకు చేసిన ఉపదేశసారాంశమిది.

4. *నేను సీతమ్మతో ఏమన్నానో తెలుసా మీకు? దానికి అమ్మ సమాధానం తెలుసా?*

జ. అమ్మా! అనుజ్ఞ ఇవ్వు. వీరందరినీ పిడికిలిపోట్లతో చంపేస్తానమ్మా! అన్నాను. దానికి అమ్మ అన్నది, నీవు నీ ప్రభువు చెప్పింది చేశావు. వాళ్ళ ప్రభువు చెప్పింది వాళ్ళు చేశారు. వాళ్ళనెందుకు చంపడం? అన్నది అమ్మ.

5. *మీరు సాధన చేయవలసినది ఏమిటి?*

జ. మీ ఆత్మను అందరి ఆత్మలతో ఇముడ్చుకోండి. నీ ఆత్మను అందరికీ పంచండి. ఇతరుల ఆత్మలను నీలో ఇముడ్చుకో. అలా చేయడం వలన ఎంతటి ఆనందం కలుగుతుందో నువ్వు తెలుసుకోగలవు. ఆత్మను తెలుసుకోలేకపోవటం ఆత్మహత్యతో సమానం. ఎంతకెంత నిన్ను నువ్వు ఇతరుల సేవలో ఆత్మార్పణం చేసుకుంటావో, అంతకంత ఆనందాన్ని పొందగలవు. అదే మోక్షానికి దారి తీస్తుంది.

6. *సాధకునికి అత్యంత అవసరమైనవి ఏవి?*

జ. భక్తి, నిశ్చలత, మనోనిబ్బరం చాలా అవసరమైనవి. ఆధ్యాత్మిక సోపాన అవరోహణలో ఈ మూడూ ప్రధానపాత్ర పోషిస్తాయి.

7. *ఈ ఆంజనేయుని బోధలు అవసరమనిపిస్తున్నాయా, లేక దీనిని ఎలా భావిస్తున్నారు?*

జ. స్వామీ! మీరు అందించే బోధలు మానవాళి జీవితపథాన్ని మార్చి అనంతమైన, అద్వితీయమైన, అమోఘమైన ఆత్మతత్త్వాన్ని చాటిచెబుతున్నాయి. ఆ అనంతతత్త్వంలో మునిగిన జీవులు బ్రహ్మానందాన్ని అనుభవించే తీరాలి. రాక్షససంహారులైన మీరు మాలోని రాక్షసగుణాలను సంహరిస్తూ, సదా రామసన్నిధిలో ఓలలాడేలా చేస్తున్నది తప్పక మీ సాన్నిధ్యం. మీ బోధలు అత్యంత ఆవశ్యకం స్వామీ. కృతజ్ఞతలు స్వామీ!

***నరుడు భువిపై జన్మించిననాడు, నాగరికత తెలియని నాడు***
***నరసంబంధ బాంధవ్యాలు పెంపొందించుకుని***
***ఐకమత్యభావాలను కలగొలుపుకొని, నాగరికతను నేర్చుకుని,***
***అభివృద్ధిదిశగా అడుగులు వేసిన నాటి నరుడు***
***నేడు ఎందుకు మారిపోయాడు ఇలా? భవబంధాల విలువలు తెగ్గొట్టుకుని***
***పైకి ధ్యానమగ్నుడై వున్నా, లోపల స్వార్థం అనే రాక్షసితత్త్వాన్ని కలిగివుంటూ,***
***మానవీయ విలువలను మరచి మారిపోతే లోపం ఎక్కడ?***
***మారిన మనుషులదా? లేక మార్పులేని మారుతిదా? లోపం ఎక్కడ వుంది?***
***ఆలోచించి చెప్పండి నా చిన్నారి ముద్దుబిడ్డలారా!***
***మార్చినది మీ యాంత్రిక జీవన విధానమైతే,***
***విలువలుగల ఈ ఆంజనేయుని విలువైన మాటలను విన్నపాలుగా తీసుకుని***
***వినమ్రులై విధేయులై వింత ప్రవర్తనలను మాని విచ్చేయండి***
***విరివిగా ఆశీస్సులను అందుకొనుటకై విలువైన జీవితాన్ని గడుపుతూ***
***నా చిన్నారి బిడ్డలారా.***

ॐ

**30-10-2018** 10:25 AM

1. *భగవంతునికి కృతజ్ఞత ఎందుకు చెప్పాలి?*

జ. సృష్టిలో ఏ ప్రాణికీ లేని విశేషగుణాల్ని భగవంతుడు మానవునికిచ్చాడు. ఉత్తమగుణాలతో పాటు జ్ఞానాన్ని కూడా ప్రసాదించాడు. ధర్మకార్యాచరణకు అనుకూలమైన శరీరాన్ని ఇచ్చాడు. అందుకు మీరు భగవంతునికి కృతజ్ఞులై వుండాలి. అందుకోసం మీరు ఏమి చేయాలి? మానవాళిని, ప్రాణసముదాయాన్ని ప్రేమించాలి, సేవించాలి. వాళ్ళకు కలిగిన కష్టాల్ని దూరం చేయాలి. అప్పుడే భగవంతుడు మీకు ఇచ్చిన శరీరానికి, అతనికి కృతజ్ఞత తెలుపుకున్నట్లు అవుతుంది. ఈ విధంగా భగవంతుని కృపకు పాత్రులవుతారు. అతడిచ్చిన ఈ శరీరంతో పరోపకార్యాలు చేస్తూ చేస్తూ, చేరువకాగలుగుతారు.

2. *కీర్తికాయులని ఎవరిని అంటారు?*

జ. కొంతమంది తమ శరీరాలను పరోపకారార్థం త్యజిస్తారు. తాము మరణించినప్పటికీ, 'కీర్తి' అనే కాయంతో లోకంలో చిరకాలం వుండిపోతారు. కలకాలం బ్రతికి వున్నట్లుగానే వీళ్ళు ప్రజల మనసులో నిలిచిపోతారు. లోకంలో మన్ననలు పొందుతూనే వుంటారు. అందుచేత వీళ్ళని కీర్తికాయులని అంటారు. శరీరం నశించకముందే మంచిపనులు చేస్తే, ఆ కీర్తి యుగయుగాలుగా లోకంలో నిలిచిపోతుంది. శరీరం సార్థకం చెందుతుంది.

*3. అసలు భగవంతుడంటే ఎవరు?*

జ. భగవంతుడు వ్యక్తి కాదు, శక్తి కాదు, వస్తువు కాదు, పదార్థం అంతకన్నా కాదు. భగవంతుడు నిరాకార, నిరంజన, నిర్గుణుడు. భగవంతుడు కేవలం 'స్థితి' మాత్రమే. శూన్యస్థితి, భావాతీతస్థితి, ఆలోచనారహితస్థితి, నిరహంకారస్థితి, ఆత్మస్థితి, పరబ్రహ్మస్థితి. అది కేవలం 'స్థితి' మాత్రమే. అక్కడ వర్ణనలు, వివరణలు, అంచనాలు, ఊహలు వుండవు. అయితే, సామాన్యమైన వారి కొరకు భగవంతుని ఉనికిని తెలుపుట కోసం అనేక రూపాలతో, నామాలతో వారు ఊహించిన రూపంతో ప్రత్యక్షమవుతాడు.

*4. మిమ్మల్ని వదిలి వెళ్ళేటప్పుడు, ఆత్మ ఏ రకంగా ఘోషిస్తుంది? దాని గురించి యథాలాపంగా ఆలోచించి సమాధానమివ్వండి.*

జ. వెళ్తాను అంటే వెళ్ళవద్దనే చెబుతారు. నీకోసం పెద్ద భవంతులు కట్టించాను అని చెప్పినా, ఎంత డబ్బు సంపాదించానో చూడు అన్నా, ఇదంతా నీ తృప్తి కోసమే కదా అన్నా, నాలోనే వుండి ఇవన్నీ అనుభవించమని అన్నా, "అనుభవించాలా? ఎలా? నీ శరీరానికి డయాబిటిస్ కాబట్టి, తీపి పదార్థం తినలేను. శరీరానికి బి.పి. సమస్య వుంది కావున, కారం మీద మమకారం చంపుకున్నాను. ఇష్టమైనది ఏదీ తినలేను. ఎందుకంటే నీ శరీరం అరిగించుకోలేదు కాబట్టి. నీ శరీరం మొత్తం కళ్ళ నుండి కాళ్ళ వరకూ మొత్తం ఓ రోగాలపుట్ట. ఆ పొట్ట చూడు. బానలాగా ఎలా ఉబ్బిపోయిందో. అడుగు తీసి అడుగు వేయటానికి నువ్వెంత ఆయాసపడతావో మనిద్దరికీ తెలుసు. నువ్వే చెప్పు, నీ శరీరంలో ఎలా వుండను? ఎక్కడికక్కడ శిథిలమైన ఇంట్లో ఎవరైనా వుంటారా? నువ్వు కట్టించుకున్న నీ ఇంటితో నాకు సంబంధమేమిటి? నేనుండేది నీ శరీరంలో. అదే నా నివాసస్థలం. నా ఇంటికి వున్న తొమ్మిది ద్వారాలకూ సమస్యలే. నాకు రక్షణ లేదు, సుఖం లేదు. అన్నింటికన్నా మీకు ముందుగా వచ్చిన జబ్బు డబ్బుజబ్బు. అది వచ్చిన నాటినుండి నన్నసలు పడుకోనిచ్చావా? నేనుండే ఈ శరీరాన్ని విశ్రాంతి తీసుకోనిచ్చావా? ప్రతిక్షణం, ఇంకొకడితో పోటీపడి, నాలో అసూయ నింపావు. ఇంకొకడ్ని వెనక్కు తోయడానికి నాతో కుట్రలు చేయించావు. ఎన్నిసార్లు పగతో నన్ను రగిలిపోయేలా, ఈర్ష్యతో కుళ్ళిపోయేలా చేశావు? గుర్తుతెచ్చుకో. రోగాలు చుట్టుముడ్తున్నా, ఏనాడైనా పట్టించుకున్నావా?" అంటూ వెళ్ళటానికి సిద్ధపడుతుంది. ఇన్ని రకాల బాధలు పెట్టినా, పరమశాంతంతో నీలో వుండి నీవు అనుకునే శరీరానికి రక్షణ కల్పిస్తున్న ఈ ఆత్మ ఎంత శాంతంగా వుందో చూడండి. ఆ శాంతియే కావాలి. అదే ఆత్మశాంతి.

***మనస్సు లౌక్యం తెలియని మానవుడు***
***సౌఖ్యం కోసం శోధన చేస్తాడు శూన్యంలో***

***పంతాలుమాని, శత్రువులను సైతం ప్రేమించగల్గెడి***
***చిత్తమును పొంది, అనుభవించవలెను దీనిని***
***కాయమునందు కల్గెడు వికారములనెడి రుగ్మతలను ద్రుంచి***
***మాయ అనే రోగాన్ని త్రుంచి***
***మానవమాత్రుల సేవ చేయుచూ, రోగం గుర్తుపట్టగనే***
***ధ్యానం చేయుచూ, పరధ్యానాన్ని విడనాడి***
***పూర్వపుణ్యపు ఫలితము దారి చూపగా***
***బిడ్డల ఆధ్యాత్మిక ఆకలి తీర్చుటకై***
***గురువు, తండ్రి, తల్లి, బంధువు, స్నేహితుడు,***
***ఆఖరుకు నీవుగానే నీదరి ఏతెంచిన***
***ఈ హనుమ హాయి సంభాషణ ఆలకించి***
***అబ్ధి (భవసాగరమనే సముద్రం) లంఘించి***
***ఈ ఆంజనేయుని చేరండి***
***నా ముద్దుబిడ్డలారా!***

ఓం

**04-12-2018** 10:25 AM

*1. సానుభూతి, సహానుభూతి ఈ రెండు పదాలు ఒకేలా వుంటాయి. కానీ, అర్థాలు వేరు. నిజానికి వాటి అర్థం, పరమార్థం వేరుగా వున్నాయి. అవి ఏమిటి?*

**జ. సానుభూతి చూపడమంటే, ఎదుటివారి బాధను చూసి జాలిపడటం. సహానుభూతి అంటే ఎదుటివారు అనుభవిస్తున్న కష్టాల్లో పాలుపంచుకోవటం. రెండింటి మధ్య చాలా తేడా వున్నది. అంతేకాదు, వారి స్థానంలో మిమ్మల్ని ఊహించుకుంటూ వీలైతే వాటిని తొలగించుటకై ప్రయత్నించడం కూడా సహానుభూతి అనిపించుకుంటుంది.**

*2. దానమునకు, త్యాగమునకు వ్యత్యాసమేమిటి?*

**జ. మీకున్న దానిలో ఏదో కొంత ఇతరులకు అందించి తామేదో త్యాగం చేశామనుకుంటారు. కానీ, ఇది త్యాగం కాదు. దానమునకు, త్యాగమునకు ఎంతో వ్యత్యాసమున్నది. మీకేది ఇష్టమో, ఏది ప్రీతికరమో దానిని పరులకు అందించటమే త్యాగము. మానవునికి అత్యంత ప్రీతికరమైనది ప్రాణము. త్యాగమంటే, ప్రాణాన్నైనా అర్పించటమే. మీకున్న దానిలో ఏదో కొంత పరులకు అందించటాన్ని దానమంటారు. ఇందులో కొంత స్వార్థం వుండవచ్చు. కానీ, త్యాగంలో ఎట్టి స్వార్థమూ వుండదు.**

*3. అమృతత్వాన్ని పొందటానికి అనుసరించవలసిన మార్గమేది?*

**జ. ఏ పంట పండించాలంటే దాని విత్తనాలనే నాటుకోవాలి కదా. వాటినే ఎన్నుకోవాలి కదా.**

**త్యాగమనే విత్తనాలను నాటండి, అమృతం అనే పంటను అందుకోండి.**

*నిర్విరామంగా, అవిశ్రాంతంగా నేను బోధనలు చేస్తూనే వున్నాను, మీరు వింటూనే వున్నారు. కేవలం విన్నంత మాత్రాన ప్రయోజనం లేదు. ఒక్క వాక్యాన్నైనా ఆచరణలో పెడ్తున్నారా? లేదు. ఎంతకాలమైనా మీరు తెలుసుకోవటంలోనే వుంటే, ఇంక ఆచరించేదెప్పుడు? ఈనాడు మీరు అన్నీ తెలుసుననుకుంటున్నారు. కానీ, అన్నీ తెలుసుకున్న మీరు మిమ్మల్ని తెలుసుకోలేకపోతున్నారు. ఇది చాలా దయనీయమైన స్థితి. విన్నదాన్లో, తెలుసుకున్నదానిలో ఒక్కటైనా ఆచరణలో పెట్టండి, నేను సంతోషిస్తాను. మీ తాపాన్ని, మీ పాపాన్ని రెండింటినీ చల్లార్చి, దూరం చేసేది ప్రేమ. ఈ ప్రేమ ఒక్కటే సంసారసాగరంలో ఎన్ని బాధలున్నప్పటికీ, మీ జీవితమనే పడవను ప్రేమ వైపుకే మళ్ళించి విజయాన్ని సాధిస్తుంది. ప్రతిగా దైవాన్ని, దైవప్రేమను పొందేలా చేస్తుంది. ద్వేషాన్ని, క్రోధాన్ని, అసూయను దగ్గరకు రానివ్వకుండా వుంటే, అవ్యక్తానందము మీకు చేరువవుతుంది. ఈ జగమంతా మిథ్య. ఇందులో ఎవరికి ఎవరు? ఏదో దేహాభిమానంతో ఒకరినొకరు ప్రేమించుకుంటున్నారు. ఇది కూడా స్వార్థమే. అందరినీ ప్రేమించండి, సేవించండి. అందరిలో వున్న దైవాన్ని ప్రేమించండి. ఈ ప్రేరేపణలో మీ జీవితాన్ని సుఖమయం చేసుకోండి!*

ॐ

**05-12-2018** 09:35 AM

**55) భూత-భవిష్యత్-వర్తమానాల గూర్చి మా ఆలోచనా తీరు ఏ విధంగా ఉండాలి స్వామీ?**

*మీ జీవితంలో వచ్చే కాలాన్ని మీరు మూడు స్థితులుగా విభజిస్తారు గదా! అంటే, భూత-భవిష్యత్-వర్తమానకాలాలు. దేని ప్రాముఖ్యత దానికే వుంది అనేది వాస్తవం. అయినా సామాన్యంగా చాలామంది "గతం గతః వదిలేయండి" అని, "రేపు ఏమి జరుగుతుందో ఎవరికి తెలుసు?" అంటూంటారు. ఆలోచించవద్దని కూడా అంటుంటారు. కానీ, గతం తాలూకు ప్రభావం వర్తమానం మీద, వర్తమాన ప్రభావం మీ భవిష్యత్తు పైన పడితీరుతుంది. మరి అలాంటప్పుడు ఈ రెండింటినీ ఎంతవరకు విస్మరించాలో, ఎంత వరకు గుర్తుంచుకోవాలో చిరుప్రయత్నం చేయండి. గతం గతః అని మీరు వదిలేసినా, మరి గతంలో మీరు చేసిన దుష్కర్మల ఫలితాన్ని ఇవ్వకుండా భగవంతుడు "పోనీలే, వాళ్ళు గతాన్ని మరచిపోయారు పాపం! నేను కూడా వదిలివేస్తాను" అని భావిస్తాడా? మీరు ముండ్లచెట్ల విత్తనాలు, పండ్లచెట్ల విత్తనాలను తెచ్చి నాటారనుకోండి. ఏమవుతుంది? ముండ్లచెట్ల విత్తనాలు ముండ్లచెట్లుగానూ, పండ్లచెట్ల విత్తనాలు పండ్లచెట్లుగానూ పెరుగుతాయి. అందుకు విరుద్ధంగా జరగదు గదా! పాపపుణ్యాల విషయంలో కూడా అంతే. భగవంతుడు మీకన్నా గొప్ప అకౌంటెంట్! ఆయనది మీవంటి బ్యాలన్స్‌షీట్ కాదు. పుణ్యానికి పుణ్యాన్ని, పాపానికి పాపాన్ని అనుభవింపచేస్తాడు. దేంట్లోంచి దేన్నీ మైనస్ చేయడు. అంటే గతంలోని మీ క్రియలకు ప్రతిక్రియ నేటి మీ వర్తమానకాలంలో జరిగితీరుతుంది. నాకే ఎందుకు జరుగుతోంది? అని మీరు ప్రశ్నించుకునే ముందు ఒక్కసారి మీ గతంలోకి తొంగి చూసి, నిజాయితీగా ఆత్మపరిశీలన*

*చేసుకోవాలి. అలాగే, గతంలో చేసిన సత్కర్మల సత్ఫలితాలు కూడా వర్తమానంలో మిమ్మల్ని సంతోషపరుస్తాయి.*

*కావున, మంచి–చెడు ఏది జరుగుతున్నా, గతం గతః అని ఎందుకు అనుకోవాలో ఆలోచించండి. గడిచిన కాలాన్ని తిరిగి తెచ్చే శక్తి ఏ మానవుడికీ లేదు, ఉండబోదు. అందువలననే, అయిందేదో అయిపోయింది అని సరిపెట్టుకుంటారు. గతంలో చేసిన మంచిపనుల గురించి పదేపదే చెప్పుకోవటం వలన అహం పెరిగే ప్రమాదం ఖచ్చితంగా వుంటుంది. అలాగే జరిగిన పొరపాట్లని మీరు తరచుగా తలచుకుంటే ఆత్మన్యూనతాభావం ఏర్పడటం తప్ప ఇంక ఏమి ప్రయోజనముంది? గతంలోని తప్పులను, పొరపాట్లను మరచిపోండి. కానీ, అవి నేర్పిన గుణపాఠాలను మరచిపోవద్దు. నేటి వర్తమానంలోని ప్రశాంతతను, ఆనందాన్ని నాటి గతం పదేపదే భంగం చేయకూడదు. ఏ పుస్తకం అందించలేని జ్ఞానం, మీ అనుభవాలు ప్రత్యక్షంగా అందిస్తున్నాయి. ఎవరికీ లభించని అవకాశం మీకు వరించింది. దానిని పారవేసుకోకండి. జరిగిన దాన్ని నెమరువేసుకుంటూ కృంగిపోవటం కాదు. అందులోనుండి పొందిన జ్ఞానాన్ని తీసుకుని పైకి ఎదగటమే మీ నేటి కర్తవ్యం. దారిదోపిడీ చేసే రత్నాకరుడు రామాయణ కావ్యాన్ని రచించిన వాల్మీకిగా మారలేదా? భోగియైన వేమన విరాగియై యోగిగా మారలేదా? నారాయణసేవలు చేయండి, నరరూపంలో వున్న నారాయణులకు నాదీ అనుకున్న మొత్తాన్ని దానం చేయండి. అహంకారం పటాపంచలవుతుంది. నేడు అనేది ఇంకా మీ చేతిలోనే వున్నది. దానిని సద్వినియోగపర్చుకోండి. చేస్తామని ఒక్క అడుగు ముందుకు వేయండి. మీకు కావలసిన వనరులు భగవంతుడే చేకూరుస్తాడు. దానితోపాటు మీ ఆలోచనలు, సదా సదా సదా సదా సదా సదా సదా సదా సదా అహంకారరహితమై, రామనామ అమృతసుధాంబుధిలో మునిగిపోవాలి. అప్పుడే మిమ్మల్ని తేల్చటానికి రాముడు పరిగెత్తుకు వస్తాడు. ఇపుడు మీ వెంట వున్న ఈ ఆంజనేయుని ఆనందింపచేయాలి. చెప్పిన వాటిని సద్వినియోగం చేసుకోవాలి. ఇంకొక గమనార్హమైన విషయం చెబుతాను. మీరు చేసినదాన్ని సరిదిద్దుకునే అవకాశం కూడా వున్నదని చెబుతున్నాను. నేటి మీ సత్కర్మలే గతంగా రూపుదిద్దుకున్నప్పుడు, మీ స్మృతిపథంలో అవి మెదిలినప్పుడు, మీకు ఆనందం, తృప్తినిస్తాయి. నేటి మీ కర్మలే మీకు అందమైన భవిష్యత్తుని అందిస్తాయి. సారాంశమేమిటంటే, మీ వర్తమానమే గతానికి ఆకారమిస్తుంది. రేపటిని నిర్ణయిస్తుంది. కావున ఈ క్షణాలు మీ చేతిలోనుండి జారిపోకముందే నామస్మరణ, సేవాకార్యక్రమాలు, దానధర్మాలు చేయటం మీ తక్షణ కర్తవ్యం. మీ డబ్బు మొత్తం మీకే చెందాలని అనుకునేవారు దానధర్మాలు చేయాలి. ఇది ఆంజనేయుని మాట, మూట. ఈ విషయంలో నా రాముని నేను రోజూ ఇలా ప్రార్థిస్తాను.*

*సంకల్పమాత్ర సంజనిత పద్మభవాండమండలాయ వినుత ఘుండలాయ*
*దాక్షిణ్య కరుణాకటాక్ష రక్షిత భక్త నికరాయ సర్వమౌనిసుకరాయ*
*దోర్దండకేళి ప్రతుండిత శంభు బాణాసనాయా మోఘ శాసనాయ*
*కోదండ సింహలీలా దండితాసుర వారణాయ భవ విదారణాయ!*

*(39 పటికముక్కలు 3 సద్గుణాలు [త్రిగుణాలు] 9 నవవిధభక్తులు)*

"శ్రీరామచంద్రప్రభూ! నీవు సంకల్పమాత్రముననే ఈ సృష్టిని సృజించి లయమొనర్చువాడవు. భక్తులను నీ కరుణాకటాక్ష వీక్షణములచే సంరక్షించువాడవు. దీనజనుల ఆర్తిని బాపెడివాడవు. వేదవేద్యుడవు, ధర్మనిరతుడవు, ఆశ్రితజనవత్సలుడవు అగు నిన్ను ఈ దీనుడిని బ్రోవమంటూ నమస్సుమాంజలులు సమర్పిస్తున్నాను, అందుకొనుము" అని ఈ హనుమ ప్రార్థన. దీనిని ఎందుకు చెప్పానో అర్థము చేసుకుంటారని భావిస్తున్నాను.

ॐ

**06-12-2018** 10:20 AM

**56) నారాయణసేవ ఏ దృష్టితో చేయాలి స్వామీ? ఎలా భావించాలి స్వామీ?**

దానం పుచ్చుకునే వ్యక్తి మీకు పుణ్యం ప్రసాదించి తరింపచెయ్యడానికి వచ్చే ప్రత్యక్షనారాయణుడే. మీ ఎదుట వున్న వ్యక్తి సాక్షాత్తు నారాయణుడు అని భావించడం నారాయణసేవలో చాలా ముఖ్యం. కానీ, అదే చాలా కష్టం. ఊరకే దానం చేయడం సులభం. "భక్తిలేని పూజ పత్రిచేటు" అన్నట్లుగా, మీరు సమర్పిస్తున్నది ఎదుటివానిలో వున్న దైవానికే అన్న భావన లేకపోతే, మీ సేవలో స్వచ్ఛత, నిజాయితీ లోపించే ప్రమాదం కలదు సుమా! అప్పుడు ఆ సేవ వలన ప్రయోజనం శూన్యం.

**57) భగవంతుడ్ని ఏ రకంగా దర్శనం చేసుకోగలుగుతారు స్వామీ?**

భగవంతుడ్ని దర్శించటానికి పుస్తకాలు, శాస్త్రాలు ఔపోసన పట్టనక్కరలేదు. బుద్ధికుశలత వల్లనే కాక, అంతర్గత అనుభూతి ద్వారా ఆధ్యాత్మిక జ్ఞానం అలవడుతుంది. దాని ద్వారా భగవంతుని అనుభవించి దర్శన-స్పర్శనానుభూతులు పొందవచ్చు.

**58) ఆత్మసాక్షాత్కారం ఎలా కలుగుతుంది స్వామీ?**

ఆత్మసాక్షాత్కారం ఒళ్ళు వంచటం వల్ల కలగదు. అహంకారాన్ని వంచినట్లయితే ఆత్మసాక్షాత్కారం తప్పక దొరుకుతుంది.

**59) ఆరాధన అంటే ఏమిటి స్వామీ?**

ఆరాధన అంటే ఆవేదన. ఏడుపు అంటే కన్నీళ్ళు కాదు. హృదయాన్ని దగ్ధం చేసే అగ్ని ప్రవేశించి దహనం చేస్తుంది. అది సర్వమమతలను, రాగద్వేషాదులను దహనం చేసే మహాయోగం. అదే భక్తియోగం. సర్వకాల సర్వావస్థలయందు ఉన్నప్పుడు, అదే జ్ఞానం. అదే నిష్కామకర్మ, అదే సర్వమూ.

ॐ

**08-12-2018** 10:25 AM

**60) భక్తి వలన భగవంతుడు ఎందుకు స్పందిస్తాడు స్వామీ?**

భక్తి వలన భగవంతుడు ఎంతో గొప్పవాడన్న జ్ఞానం మీకు కల్గుతుంది. కలగటమే కాదు,

*మిమ్మల్ని మీరు ఆయనకు అర్పించుకోవాలనే తపన కల్గుతుంది. ఇలాంటి తపన వేదపఠన జ్ఞానం వలన కూడా కలుగుతుంది. తద్వారా అగ్ని ఆరాధన చేస్తారు. అగ్నికి దహించే సహజ లక్షణం వుంటుంది. భౌతికంగా మీరు చూసే అగ్ని హవిస్సులను దహిస్తుంది. జ్ఞానాగ్నికి రూపం వుండదు. కానీ అది చెడుకర్మలను దహిస్తుంది. దానివల్ల జ్ఞానం మరింత ప్రభవిస్తుంది, వెలుగులీనుతుంది. వేదాన్ని చదవాలి. అందుకు అక్షరజ్ఞానం అవసరము, అనివార్యము. కాబట్టి, చదవటాన్ని ఒక యజ్ఞంగా భావించి, ఒక తపస్సుగా అభ్యసించాలి. ఒక్క క్షణం వ్యర్థం చేసుకున్నా, తపోఫలాలు దక్కటంలో ఆలస్యం జరుగుతుంది. ఇది మీ పురోగతి వేగాన్ని మందగింపచేస్తుంది. ఒక్క క్షణం మనసుపెడితే, ఒక అమూల్యసత్యం మీ మనసుఖజానాలోకి ఆణిముత్యంలా చేరవచ్చు. అది మీ జీవితాంతం అక్కరకు వస్తుంది. అపుడే భగవంతుడు స్పందిస్తాడు (భాషాభిమాని, భావాభిమాని కావున).*

## 61) మానవుని యొక్క గమ్యమేది స్వామీ?

*ప్రతి మానవుడు ఆనందం కోసం అనేక ప్రయత్నములు చేస్తున్నాడు. కానీ, అతను వెదికే ప్రదేశములయందు ఈ ఆనందం కానరాదు. తానే ఆనందస్వరూపుడైయుండగా ఆనందాన్ని ప్రపంచంలో వెదకటానికి ప్రయత్నిస్తున్నాడు. అది వెర్రితనము. మానవత్వమనేది ఆనందమునందే పుట్టి, ఆనందమునందే పెరిగి దానియందే లయమౌతున్నది. ఆనందమే మానవుని యొక్క జన్మము, ధర్మము, గమ్యము. ఇదే మానవత్వంతో నిండిన మర్మము.*

## 62) ఎటువంటి తృప్తి ముక్తినిస్తుంది స్వామీ?

*ప్రతి జీవి జీవితంలో తనకు లభించినదానితో తృప్తిపడి, "ఇంతకు మించి నాకింకేమీ అక్కరలేదు. ఇది చాలు" అనే భావనతో వుంటే, అదే ఆ వ్యక్తికి ఎనలేని ఆనందం, తృప్తిని ఇస్తాయి. జీవితంలో ఇంతకన్నా ఇంకేమీ అక్కరలేదనుకోవటమే ఆనందం. ఆ ఆనందమే తృప్తిని కలుగచేస్తుంది. అదే మనిషిని 'స్థితప్రజ్ఞుని' గా మారుస్తుంది. ఆ స్థితప్రజ్ఞతే ముక్తిమార్గం వైపు నడిపిస్తుంది.*

## 63) నవరాత్రులు అంటే ఏమిటి స్వామీ?

*రాత్రి అంటే చీకటి అని చెప్పవద్దు. చీకటి అంటే అజ్ఞానానికి సంకేతం అని అంటారేమో. పగలు వెలుతురు అంటే జ్ఞానానికి అర్థం. మీరు తొమ్మిది పగళ్ళు అనకుండా తొమ్మిది రాత్రులు అనటం ఎందుకు? మీరు దేవాలయం వెళ్ళి కళ్ళు మూసుకుని నమస్కారం చేస్తారు, ఎందుకు? కళ్ళు మూసుకుంటే చీకటి గదా! కనిపించేది అయితే, ఆ చీకటిలో భగవంతుడనే వెలుతురు చూడటానికి ఆ ప్రయత్నము. అలాగే రాత్రులు క్రొత్తవి ఎందుకు? భగవంతుని చూడాలనే తపనతో చీకటి అనే అజ్ఞానాన్ని తొలగించేవి కనుక, ఈ తొమ్మిది రోజులు దీక్షతో వెలుగు కోసం తపిస్తారు గనుక, ఇవి మీలో నూతనత్వాన్ని తెచ్చిపెడ్తాయి. సత్యం తెలిస్తే చీకటి లేదు. సూర్యుడు ఇరవైనాల్గు గంటలూ వుంటాడు. సూర్యునికి అస్తమించటం లేదు. భూమి తన చుట్టూ తాను తిరుగుతూ సూర్యుని చుట్టూ తిరుగుతున్నది. కనక, రాత్రింబవళ్ళు ఏర్పడుతున్నాయి మీ ఆరోగ్యం కోసం. "తమసోమా జ్యోతిర్గమయ" అని వేదాలు అంటే, వెలుతురుకాధారమైన చీకటియే వెలుతురు అని నేనంటాను. మీరేమంటారు?*

***అందరూ ఆనందంగా జీవించాలంటే ఆవేదనల బ్రతుకులకు అండగా నిల్చి***
***ఆశల రెక్కలకు ఆసరా అయ్యి, మానవాళి మనుగడకు కల్పవల్లులై***
***ప్రగతిపథంలో పయనించి, ఆశలకు శాంతిగీత కపోతాలై***
***పరుల కోసమే పరుగులు తీస్తూ, మీరు వెయ్యాలి ముందడుగు***
***అపుడు ధరణి ధగధగలతో వెలిగేను***
***అది చూచి ఈ ఆంజనేయుని హృదయము ఉప్పొంగేను***
***అజ్ఞాన అంధకారాలను తొలగించుకుని***
***ఆంజనేయుని బాట, మాట ఆనందకరమై,***
***మీ అడుగులు ఆర్తితో వేసినట్లయితే, విలువైన సన్నిధి చేరి సుఖింతురు***
***నా చిన్నారి బిడ్డలారా!***

ॐ

**12-12-2018** 10:05 AM

**64) మేము ఆధ్యాత్మికముగా ఉన్నతస్థితికి ఎలా చేరగలము స్వామీ?**

*మీరు ఉన్నతస్థితికి చేరాలంటే స్థూల జగత్తు యొక్క స్వరూప స్వభావాన్ని గుర్తించి, దానినంతటినీ మాయగా, భ్రమగా, భ్రాంతిగా తెలుసుకుని, అనుభవంలోకి పొందగలగాలి. ప్రస్తుతం మోహబంధాలలో చిక్కుకుని సైన్సు, సాంకేతిక పరిజ్ఞానపు మత్తులో వుండినారు. భౌతికవాదపు మత్తులో జీవిస్తూ, మీ మేధస్సుల ద్వారా టన్నుల కొద్దీ సమాచారాన్ని సృష్టించుకుంటున్నారు. ఇది ప్రమాదకరమైన కలుషితమైన జ్ఞానమవుతుంది. మిమ్మల్ని కలుషితం చేసే ఎటువంటి విధానమైనా ప్రమాదకరమే. ఆధ్యాత్మికంగా పరిణతి చెంది జీవిత పరమార్థం నెరవేర్చుకోవటమనేది ఒక రకంగా కత్తిమీద సాము లాంటిది. ఎందుకంటే, కలుషితమైన మేధస్సులను శుద్ధి చేయడమనేది మామూలు విషయం కాదు. అందుకు సద్గురువు మార్గదర్శకత్వం, పరిపూర్ణ అద్వైతబ్రహ్మజ్ఞానము, క్రమం తప్పని సాధన ఆవశ్యకం. ఈ ఆంజనేయుడు సద్గురువై బోధిస్తున్న బోధనలను ఆసాంతం ఆకళింపు చేసుకుని అడుగు తీసి అడుగు వేయండి. ఆ దిశగా మీ జీవితాన్ని క్రమబద్ధీకరించుకుని సత్ఫలితాన్ని పొందవలసినదిగా విజ్ఞప్తి చేస్తున్నాను.*

ॐ

**13-12-2018** 10:10 AM

**65) గురుశిష్యుల సంబంధం ఎలా వుండాలి స్వామీ? ఒక గురువు ద్వారా శిష్యుడు ఏ విధంగా లబ్ధి పొందుతాడు? గురువు యొక్క అంతరంగంలో తన అంతరంగాన్ని అనుసంధానం గావించగలిగితే, శిష్యుడు ఉన్నతంగా ఎదగగలుగుతాడా? తన అంతరంగమందు ఉద్భవించే అనుమానాలకు గురువు**

**నుండి శిష్యుడు ఎటువంటి సమాధానములు పొందుతాడు? గురువును పరీక్షించవచ్చా? అది ఎంత వరకు సబబు? ఆధ్యాత్మిక పురోభివృద్ధికి ఏమైనా ఆటంకమవుతుందా స్వామీ?**

*గురుశిష్యుల సంబంధమనేది ఆత్మానుబంధం. భౌతికపరమైనది కానే కాదు. ఏ వ్యక్తియైనా ఆధ్యాత్మికంగా పరిణతి చెందాలంటే, గురువు తప్పక అవసరం. అయితే, ఆ గురువుతో భౌతికబంధం, ఆ గురువు పట్ల ప్రగాఢమైన అనుబంధంగా దారి తీస్తుంది. గురువు పట్ల ప్రేమను పెంపొందిస్తుంది. గురువు ప్రపంచం లోనికి ప్రవేశించకుండా, శిష్యులను ప్రవేశించకుండా చూడగలుగుతాడు. ప్రపంచంలో ప్రవేశించినట్లయితే, రాగద్వేషాలకు లోనయ్యే అవకాశముంది. గురువు మాటను వేదవాక్కుగా తీసుకున్న శిష్యుడు అతి త్వరితగతిన బంధవిముక్తుడవుతాడు. విధానాలు ఎన్నయినా, అంతిమలక్ష్యం ఒక్కటే కావున, గురువుతో వున్న సంబంధంతో మీకు అవసరమైన దానిని గ్రహించవచ్చు, అనవసరమైన దానిని వదిలివేయవచ్చు. నదిని దాటడానికి పడవ ఎంత అవసరమో, ఆధ్యాత్మిక మార్గంలో ఎదుగుదలకు గురువు అంత అవసరము. అయితే, సాధనలో పట్టు సాధించాలి. అంతర్వాణి మేల్కొనాలి. ఆ అంతరంగం నుండే జ్ఞానం ఉప్పొంగుతుంది. గురువు బోధించే అంశాలు అనుభవంలోకి వచ్చేంత వరకూ అనుమానాలు పెల్లుబుకుతూనే వుంటాయి. సందేహనివృత్తి కలిగే వరకు శిష్యునిలో విపరీతమైన జిజ్ఞాస కలగాలి. తనను తాను తెలుసుకోవటం ప్రారంభించాలి. మీకొక సంస్థను గురువును ప్రసాదించిన వైనాన్ని అర్ధం చేసుకోండి. కేవలం ఈ గురువు డమ్మీ మాత్రమే. అసలు గురువు ఈ ఆంజనేయుడు. డమ్మీ ద్వారా కావలసిన దానిని అందిస్తూ, మరలా డమ్మీ బిగించి, తనను ఉపయోగించుకుంటున్నాడు. పూర్తి స్వేచ్ఛను అనుభవిస్తూ, పరిపూర్ణ అద్వైత బ్రహ్మజ్ఞానానికై సంపూర్ణ అవగాహనను కల్పిస్తున్న ఈ గురువు తత్త్వాన్ని అర్ధం చేసుకోండి. మీకు స్వేచ్ఛనివ్వకుండా బంధించలేదు. స్వేచ్ఛతో విముక్తిని ప్రసాదించి డమ్మీకి, మీకు ముక్తిని ప్రసాదిస్తానని అప్పుడూ చెప్పాను, ఇప్పుడూ చెబుతున్నాను. డమ్మీని జాగ్రత్తగా ఉపయోగించుకోండి. డమ్మీ లేకపోతే, నీరు బయటకు రాదు. ఈ డమ్మీ డమ్మీయే. డమ్మీ పంపులో ఎప్పుడూ ఫ్రెష్ నీళ్ళనే పట్టుకోవచ్చు.*

***ఆత్మ తెలియనివారు అజ్ఞానులు.***

***అంధకారబంధమందు అసురులై వుండి, లోకమందు చరింతురు శోకతప్తులై***

***నేను,నాదను దుష్కర్మలను వదిలి, ధర్మకర్మలు చేస్తూ, తాను మారి, నూరేండ్లు జీవించాలి***

***వేగమందు మనసును మించు వేగము వుండి, చలనరహితుడు, స్థిరముగా జగాలనెల్లా***

***దాటిపోవు దశరథనందనుని పాదాశ్రితుడు పవనపుత్రుడు అందిస్తున్న***

***పావనమార్గాన్ని పట్టుకుని పదండి ఇక విశ్రమించక***

***వినమ్రులై వెలితి అనునది లేక, విలువకట్టలేని రత్నసంపదనందుకుంటున్న***

***నా చిన్నారి ముద్దుబిడ్డలారా!***

ॐ

**14-12-2018** 10:50 AM

**66) లక్ష్యం సాధించుటకు మా భావం ఏ విధంగా ఉండాలి స్వామీ?**

*మీ జీవితలక్ష్యం ఏమిటనేది గుర్తించడం చాలా గొప్ప విషయం. కానీ, దానిని మీరు సాధించే ప్రయత్నం చెయ్యనినాడు నిష్ఫలం. చాలామందికి ఏమి చేయాలో తెలుసు కానీ, ఏమీ ప్రయత్నం చేయకుండా జరిగిపోవాలనుకుంటారు. ఏమీ ప్రయత్నం చేయకుండా కూర్చోవటం కన్నా, అసలు లక్ష్యమే లేకపోవటం ఉత్తమం. లక్ష్యమంటూ వుంటే, నీకున్న సమయమూ, మీరు చేయవలసిందీ ఒక ప్రణాళికను ఏర్పర్చుకుంటారు. మీ ఆలోచన దాని మీదే వుంటే, మీరు తప్పించుకోలేరు.*

**67) 'నమస్కారం' అన్న పదం యొక్క అంతరార్థం ఏమిటి స్వామీ?**

*కొందరు మస్కా కొట్టడానికే నమస్కారాలు చేస్తూవుంటారు. కొందరు కారం కొట్టడానికే నమస్కారం అంటారు. కొందరు కాకాపట్టి, తమ పని పూర్తి చేసుకోవటానికి నమస్కారాలు పెడతారు. కొందరు పీడ వదిలించుకోవటానికి "నమస్కారమయ్యా బాబూ, ఇక వెళ్ళు" అంటారు. కానీ, భగవంతునికి భక్తుడు చేసే నమస్కారం అలాంటిది కాదు, కాకూడదు. తనను తాను సమూలంగా సమర్పించుకోవటమే నమస్కారం. 'నమమ' అంటే, "నాదేం లేదు. నిన్నే నమ్ముకున్నాను. నీవే దిక్కు" అనియే కనుక, ఈ నమస్కారవందనం. చందనం లాగా చల్లగా వుండేది వందనం. మీరు దైవాన్ని భక్తితో ఆరాధిస్తున్నారు. "ధ్యానం, జపం మొదలైన సాధనలు బహునిష్టతో చేస్తున్నాం. అయినా, భగవంతుడికి మాపై కృప కలగటం లేదు" అని అనుకుంటే, మీరందరూ ఆత్మసంయమనం, పూజాపునస్కారాలు, జపధ్యానాలే భక్తిసాధన అని భావిస్తారు. కానీ, భగవంతుని దృష్టిలో అలా కాదు. పవిత్రభావనతో చేసేవాడే నిజమైన సాధకుడు అని నేను చెప్పదల్చుకున్నాను.*

***ఏదో కొంత చదివేసి, నేనొక జ్ఞానిని అనకండి***
***విన్నదేదో వినేసి అదే నిజమని నమ్మకండి***
***చూసిందేదో చూసేసి అదే యదార్థమనుకోకండి***
***నిప్పు కాలుతుందని తెలిసి కూడా అనుకోకుండా కాల్చుకుంటావు.***
***ముళ్ళు గుచ్చుకుంటాయని తెలిసే, ముళ్ళ మార్గాన నడుస్తారు.***
***అంతా తెలుసునని గర్వంతో అందరినీ నిరసిస్తారు. మాటల ఈటెలు విసురుతారు.***
***మంచివారిని హింసిస్తారు. గర్వం మత్తులో నివసిస్తారు.***
***అంతా తెలుసునని గర్విస్తారు.***
***నీవు విన్నదాంట్లో, కన్నదాంట్లో, అన్నదాంట్లో సత్యమెంతుందో***
***పాల నుండి నీటిని వేరుచేసే హంసవు కావు నీవు***
***పాలను పాలగా, నీటిని నీటిగా త్రాగే మానవజాతి కావున***
***మలినమైన మనస్సును వదిలి, మంత్రాల సాయముతో***

***సాధన అనే ఆరాధన ద్వారా***
***ఆంజనేయుని అతిబలవంతమైన ఈ మాటలు ఆచరించి,***
***అత్యున్నత స్థితిని అందుకోండి***
***ఈ నా చిన్నారి బిడ్డలారా!***

**14-12-2018** 06:30 PM

*ఏమీ అడగకుండా నిశ్చింతగా నిద్రించే పసిబిడ్డకు ఏ సమయానికి ఏమి కావాలో అన్నీ తల్లే చూసుకుంటుంది. అదే విధంగా ఏ చింతలూ లేక దైవచింతన చేస్తూ, ధర్మాచరణ చేస్తున్నవాని యోగక్షేమాలు భగవంతుడే చూసుకుంటాడు. దేవుని పూజించేటప్పుడు నేత్రం సమర్పయామి, హృదయం సమర్పయామి అంటూ ఒక పుష్పాన్ని వేస్తూంటారు. ఆ పుష్పాన్ని భగవంతునికి అర్పించే ముందు, అందులోని పురుగులను తీసి, పరిశుభ్రం చేస్తారు. అట్లే, మీ హృదయకమలంపై వున్న అరిషడ్వర్గములనే పురుగులను తీసి, దానిని ప్రేమ అనే పవిత్రజలంతో కడిగి, భగవంతునికి అర్పించండి. ఇది సాధనాదిశలో అవలంభించవలసిన జాగ్రత్తలు.*

ॐ

**15-12-2018** 06:30 PM

**68) విజయాన్ని సాధించుటకు మేము ఏవేవి తెలుసుకోవాలి స్వామీ?**

*గెలుపు కోసం సాగే పరుగు పందెంలో గెలిచే శక్తి ప్రతి ఒక్కరికీ వుంటుంది. ఎటొచ్చీ, ప్రతిభకు మెరుగులు దిద్దుకుని నైపుణ్యాన్ని పెంపొందించుకున్నప్పుడే గెలుపు మీ సొంతం అవుతుంది. వ్యక్తిగత గెలుపు ప్రతి ఒక్కరికీ అవసరమే. వ్యక్తిగా గెలుపు సాధించినపుడే మీరు ఎవ్వరికైనా ఏమైనా ఇవ్వగలరు, చెప్పగలరు. ఓటమి ద్వారా నేర్చుకునేది మీరొక్కరే. కానీ గెలుపు సాధించటం ద్వారా ఎందరికో స్ఫూర్తిని ఇవ్వగలరు, మరెందరికో మీ అనుభవాలను వివరించి చెప్పగలరు. నిర్ణయించుకున్న లక్ష్యాన్ని చేరుకోవాలంటే, నిర్ణయించిన అర్హతలు ముఖ్యంగా విద్యార్హతలు వుంటే సరిపోదు. వాటి ద్వారా గెలవగలరు. గెలిచిన తరువాత రాణించాలంటే, మరికొన్ని ప్రత్యేకతలు మీలో వుండాలి. ఈ ప్రత్యేకతలే మిమ్మల్ని ముందు నిలబెడతాయి, గుర్తింపును తీసుకువస్తాయి. అందుకే గెలుపు సాధించాలంటే ప్రతి ఒక్కరూ వారి బలం, బలహీనతలు గురించి తెలుసుకోవాలి. వాస్తవానికి ప్రతి ఒక్కరూ తమకు ఎంతో శక్తిసామర్థ్యాలు వున్నాయని, గెలిచే శక్తి తమకు కూడా వున్నదని భావిస్తారు. ఇలా భావించడం మంచిదే గానీ, "నాకు తెలుసు" అన్న అహాన్ని వదిలి, అంతరంగంలోకి వెళ్ళి చూస్తే, బలం, బలహీనతలు తెలుస్తాయి. అప్పుడే "నేను కాబట్టి" అంటూ ప్రతి చిన్న విషయాన్ని సమర్థించటం మానివేస్తారు. ప్రతి చిన్న విషయంలోనూ నిక్షిప్తమై వున్న గూడార్థాలను ప్రయోజనాత్మక సందేశాలుగా పసిపిల్లలకు చెప్పినట్లు విడమరచి చెబుతూ, అనుక్షణం మీ మనోవికాసానికి తోడ్పడటం ఈ ఆంజనేయుని నైజం.*

## 69) సంస్కారం అంటే ఏమిటి స్వామీ?

*దైవానికి, దీనునికి మధ్యగల దూరాన్ని చెరిపివేయటం నా లక్ష్యం. సంస్కృతి అంటే సంస్కరించబడినది అని అర్థం. చెడ్డను దూరం చేసి, మంచిని పోషించడమే సంస్కారం. వరి పండుతున్నది. కానీ, పండిన దానిని అట్లే భుజించుటలేదు కదా. గడ్డి నుండి వడ్లను తీసి, పొట్టును తీసివేసి, బియ్యముగా సంస్కరించిన తర్వాతనే భుజిస్తున్నారు. ఒక వడ్లబస్తా విలువ రెండువందల రూపాయలైతే, బియ్యంబస్తా విలువ వేయి రూపాయలు. అనగా, సంస్కారము చేత పదార్థము పరిశుద్ధమవటంతో బాటు, దాని విలువ కూడా పెరుగుతుంది. మీరు మిమ్మల్ని పనికివచ్చేటట్లుగా చేసుకోవటమే సంస్కారము.*

***విషయవాంఛలు మిమ్ము వేటాడు సమయమున, కష్టాలు కాలుదవ్వుతున్నప్పుడు,***
***సంసార తాపంబులు సంఘటిల్లినప్పుడు, మదిలో దురహంకారాలు మొదలైనప్పుడు***
***సంస్కారమన్నది ఘన గంగా ప్రవాహంగా మానవతను ఒక మహత్తర శక్తిగా మలచుకుని,***
***ఆధ్యాత్మిక సాధనను ఆహారముగానిచ్చిన***
***ఈ ఆంజనేయుని భాషణలు జ్ఞప్తియందిడుకుని***
***ఉపకారమే ఉత్తమసంపద అన్న జ్ఞానముతో, ఉన్నత పథం వైపు అడుగులు వేస్తూ,***
***అభినవ అభిమన్యులవలే జీవనచక్రవలయాన్ని ఛేదించుకుని***
***చిరంజీవులై ఈ చిరంజీవిని చేరి సుఖించండి సదా***
***నా చిన్నారి బిడ్డలారా!***

*మనసు చాలా పవిత్రమైనది. మోక్షానికి కూడా అర్హత గలది. ఆవరించిన మాలిన్యాన్ని కప్పిపెట్టడం చేతే, అది పెడమార్గం పడుతుంది. మనసును పరిశుద్ధం చేసుకుంటే, అంతకంటే పవిత్ర సాధన మరొకటి లేదు. మీ దోషాలు పెద్దవైనా కప్పిపెట్టుకోవటం, పరుల దోషాన్ని పెద్దదిగా చూడటం అనేటటువంటిది మనసును దట్టమైన మాలిన్యాన్ని కప్పుకొనిపోతుంది. ఇది ఉదాహరణకు ఇచ్చాను. ఇటువంటి తెలియని ఎన్నో విషయాలలో మనస్సు స్వేచ్ఛగా సంచారము చేసి, చిక్కులలో పడవేస్తుంది. మనస్సును పరిశుద్ధం కావించుకున్నపుడు, మీకు మీరే దైవస్వరూపాన్ని అనుభవించగలరు. అహంకారం దట్టమైన అట్టవంటిది. ఆ తెరను పూర్తిగా నిర్మూలనం కావించే వరకు, ఆత్మానందం లభ్యం కాదు.*

ॐ

**16-12-2018** 10:20 AM

## 70) ఆనందం కొరకు ఎక్కడ ప్రయత్నించాలి స్వామీ?

*మనిషి జీవిస్తాడు ఆనందం కోసం. శ్రమిస్తాడు ఆనందం కోసం. ఆనందప్రాప్తి కోసమే అన్ని తాపత్రయాలూ. అన్ని ఇంద్రియాలు ఆనందస్పర్శ కోసం నిరంతరం అన్వేషిస్తూనే వుంటాయి. అయితే, ఆనందం ఎక్కడ? చేసే పనిలోనా? చూసే దృశ్యంలోనా? తినే పదార్థంలోనా? వినే రాగంలోనా?*

ఎక్కడ? చేసే పనిలో ఆనందం వుంటే అందరూ ఒకే పనిని ఇష్టపడరెందుకు? ఒకవేళ ఇష్టపడినా ఒకేలా ఇష్టపడరెందుకు? చూసే దృశ్యంలో ఆనందం వుంటే, అన్ని దృశ్యాలు అందరినీ ఒకే విధంగా ఆకట్టుకోవెందుకు? సాయం సంధ్యలో సువిశాల గగనంలో నిశ్శబ్ద సూర్యాస్తమయ సుందర దృశ్యం అందరిలో ఒకే విధమైన ఆనందాన్ని కలుగచేయదు. అలాగే, అలలు లేని కొలనులోని తెల్లని కలువ అందరిలో ఒకే విధమైన ఆనందాన్ని కలిగించదెందులకు? ఇష్టమైనది తింటే కలిగే తృప్తి అంతా ఇంతా కాదు. తినే పదార్థంలో ఆనందం వుంటే, దానిని తినేకొద్దీ, తినేకొద్దీ ఆనందం పెరగదెందులకు? నచ్చిన వస్తువును నానా ప్రయాసలుపడి కొంటారు. నచ్చినది సొంతం చేసుకోవడంలో పరమానందం. నచ్చి, మెచ్చి కొన్న మారుతికారు ఇన్నోవాను చూడగానే, నచ్చిన మారుతికారు ఇక నచ్చదెందుకు? ఒకరిని సులలిత సంగీత శాస్త్రీయగీతం అలరిస్తే, మరొకరికి గుండెలను దద్దరిల్లచేసే వికట విచిత్ర ధ్వనులు ఆనందానిస్తాయి ఎందులకు? ఏరికోరి ఎంచుకున్న స్నేహితులు జన్మశత్రువులుగా మారతారెందులకు? ఆనందం స్నేహితునిలోనా? స్నేహంలోనా? ఎక్కడ? సకల భోగభాగ్యాలున్న భాగ్యవంతుని ముఖంలో అసంతృప్తినీ, పూరిగుడిసెలోని పేదవాని కళ్ళల్లో ఆనందం వెల్లువను చూసినప్పుడు ఆనందం, ధనంలో లేదని అర్థం చేసుకోవటానికి ఎంతసేపు పడుతుంది?

కొందరు సర్వకాల సర్వావస్థలలో, ఎవ్వరి సాంగత్యంలోనైనా ఆనందంగా వుంటారు, ఆనందాన్ని పంచుతారు. కొందరు అనుకూల పరిస్థితిలో కూడా చీటికీమాటికీ చికాకుజల్లులు కురిపిస్తూ, విషాదఛాయలు పరిసరాలపై ప్రసరింపచేస్తూ వుంటారు. మరి పరిస్థితుల వల్ల ఆనందం స్థానభ్రంశం చెందుతుందని ఎలా చెప్పగలరు? దీనినిబట్టి, ఆనందం చేసే పనిలో కాదు చేసేవారిలో వుందని, చూసే దృశ్యంలో కాక చూసేవారిలో వుందని, తినే పదార్థంలో కాదు తినేవారిలో వుందని, వినే రాగంలో కాదు వినేవారిలో వుందని, మీకు అర్థమై, ఆ ఆనందభాండారం సాక్షాత్తు మీరే అన్నది స్పష్టమవుతుంది. ఆనందం ఎక్కడో లేదు, మీలోనే వుంది. అయితే, ఎవరు ఎందులో ఎంత ఆనందం పొందుతారన్నది మారుతూ వుంటుంది. భోగికి ఇంద్రియభోగంలో ఆనందం, త్యాగికి విషయవస్తువుల మరియు విషయవాంఛల త్యాగంలో ఆనందం, యోగికి నిజస్వరూప సంయోగంలో ఆనందం. మరి భోగి-త్యాగి-యోగి త్రయంలో ఎవరి ఆనందం ఎక్కువ?

***విత్తు నాటితే, విత్తు ధర్మం మొలకెత్తడం***
***మనిషి ధర్మం మానవత్వం అనే మొక్కను పోషిస్తే, అవుతుంది మహావృక్షం***
***మనిషి ఆలోచనలను విశ్లేషిస్తే, పుడుతుంది అద్భుతం***
***పండిన మానవత్వమే మనిషికి దైవం***
***మొక్క చిగురిస్తూ ఎదగటం సకల ధర్మం***
***నీ విధికి శిల్పివి నీవే అన్నది నగ్నసత్యం***
***యద్భావం తద్భవతి అన్నది వేదాంతం***
***సాధనతో సాధ్యం కానిది ఏదీ లేదన్నది నగ్నసత్యం***
***అదును చూచి పదును అన్నది రైతు చెప్పే ధర్మం***

***నీరు పల్లమెరుగును అన్నది నగ్నసత్యం***
***నిన్ను నీవు తెలుసుకోవటమే వేదాంతసారం***
***ఆటుపోట్లు సముద్రదేవునికి ఆలవాలం***
***మరి మీకు ఏది ఆలవాలం?***
***ఈ ఆంజనేయునికి అక్కున చేర్చుకుని బోధలు చేయుటయే ఆలవాలం!***
***ఈ వాలాన్ని పట్టుకుని, వారధి దాటుటయే మీ ఆలవాలం కావాలి.***
***ఇదే మీరు నాకు చేసే వాగ్దానం***
***తీరం దాటిస్తానని నా వాగ్దానం***
***నా చిన్నారి బిడ్డలారా!***

భోగం కన్నా త్యాగంలో ఆనందం ఎక్కువ
స్వార్థం కన్నా నిస్వార్థంలో ఆనందం ఎక్కువ

ॐ

**17-12-2018** 10:10 AM

**71) నిస్సంగబుద్ధిని అలవర్చుకోలేకపోవుటకు కారణం ఏమిటి స్వామీ?**

*"తేన త్యక్తేన భుంజీథ" – త్యజించి తీసుకోవాలి. అంటే నిస్సంగబుద్ధితో స్వీకరించాలి. అశాశ్వితమని తెలిసినా, మీరు నేడు ప్రతిదానితో విపరీతంగా మమేకమై ఎడబాటు కలిగినపుడో లేదా మీదనుకున్న వస్తువు పోయినప్పుడో హృదయావేదనకు గురి అవుతున్నారు. అంతా నిష్క్రమించేవారే, అన్నీ వెళ్ళిపోయేవే అన్న భావన వుంటే, ఏదీ మిమ్మల్ని బాధించదు, బాధించలేదు. కానీ మీరు ఎప్పుడూ ఈ విషయాన్ని మరచిపోతూనే వున్నారు. ప్రతి కలయికకూ ఒక విడిపోవటం వుంటుంది. ఇది ప్రకృతి నియమం. కర్మ మిమ్ములను కలుపుతుంది, కర్మ మిమ్ములను విడదీస్తుంది. కలపటం ఎంత సత్యమో, విడిపోవటం కూడా అంతే సత్యం. విధి నిర్ణయం అలా వున్నప్పుడు ఎవరితో మీరు శాశ్వితంగా వుండగలుగుతారు? ఎవరు మీవారు? ఎవరు పరాయివారు? ఐతే, అందరూ మీవారే అవ్వాలి లేదా ఎవరు మీవారు కాదు. కానీ, మీకు భయం. ప్రతి మనిషీ తనవాళ్ళు అనుకున్న వాళ్ళంతా తనతో శాశ్వితంగా వుండాలి అనుకుంటారు. అది సాధ్యమవదని తెలిసినా, నిస్సంగబుద్ధిని అలవర్చుకోరు. తనను తాను ఎడబాటుకు సిద్ధం చేసుకోడు. అందుకే తనవారు అని అనుకున్నవారు వెళ్ళిపోతే, వెంటనే బాధలో కూరుకుపోతాడు. అనుబంధం వలన కలిగిన జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ నెమరువేసుకుంటూ జీవితాన్ని వెళ్ళదీయడం చేస్తున్నాడు కానీ మరణం అనే జీవననాటకం నుంచి తనను కూడా తొలగించబోతున్నదనీ, భగవంతుడ్ని ఆలంబనగా చేసుకొని జీవించడమే జీవిత ప్రయోజనమనీ అర్థం చేసుకోవడానికి ప్రయత్నించడం లేదు. ఇది మీ బలహీనత. మీ అశక్తత. ఈ అశక్తత నుంచి బయటపడాలి. సంగరాహిత్యాన్ని అలవర్చుకోవాలి.*

## 72) మేము ఎదుర్కొనే సమస్యలకు పరిష్కారం ఏమిటి స్వామీ?

దేనితోనూ పూర్తిగా మమేకం కాకుండా కావలసినపుడు మనస్సును నిలిపి, మళ్ళీ అనుకున్న వెంటనే మనస్సును వ్యక్తి లేదా సంఘటన నుండి విడదీయగలగటమే తపస్సు. ప్రతి ఒక్కరికీ పరీక్షలు సహజమే. మీరు ఎదుర్కొనే కష్టాలు, ఒత్తిడులు అన్నింటినీ ఆధ్యాత్మికంగా మార్చుకోవాలి. అంటే ప్రాపంచిక బాధల బరువును పారమార్థిక బాధ్యతతో అనుసంధానం చేయాలి. అపుడు ప్రతి ప్రశ్నకూ సమాధానం లభిస్తుంది, ప్రతి సమస్యా పరిష్కరింపబడుతుంది. కష్టాలు, ఒత్తిడులు సమసిపోతాయి. అప్పుడు అనునిత్యమూ సంతోషమే. అనవసరంగా మిమ్మల్ని ఇతరులతో పోల్చుకుని విచారించడమే అసలు సమస్య. భగవంతుడు ప్రతి ఒక్కరికీ ఏదో ఒక విలక్షణతను, వైవిధ్యాన్ని ప్రసాదిస్తాడు. దానిని గుర్తించకపోవటమే అశాంతికి కారణం. మీకు లేనిదాన్ని గురించి విచారించడంకన్నా, మీకున్న దానితో సంతృప్తిపడి సంతోషించడమే నేర్చుకోవలసింది. నిజానికి పరమపదమార్గంలో పోల్చుకోవలసిందీ, పోటీపడవలసిందీ పరితాపంలోనూ, వైరాగ్యంలోనూ. అంతే కానీ, ప్రతిభాపాటవాలలోనో, పాండిత్యంలోనో కాదు. సాధనామార్గంలో ఎదగాలి. అనవసర అవరోధాలను కల్పించుకోవద్దు.

***కట్టెలో పుట్టిన నిప్పు ఆఖరికి దాన్నే కాల్చిబూడిద చేసినట్లు,***
***మనసులో రే గిన కోపం చివరకు మనిషినే దహించివేస్తుంది.***
***అంతర్‌శత్రువులలో ప్రధానమైనది, అతి ప్రమాదకరమైనది ఆగ్రహం.***
***అందుకే కోపం మూర్ఖుల లక్షణం.***
***హితులను, సన్నిహితులను, స్నేహితులను, ఆత్మీయులను, సమాజాన్ని దూరం చేస్తుంది.***
***క్రమశిక్షణను, మనశ్శాంతిని దూరంచేస్తుంది.***
***సర్వనాశనం చేస్తుంది మనుగడకు అర్థం తెలియనంతగా.***
***ఇక శాంతం ప్రేమామృతాన్ని కురిపిస్తుంది, ఆలింగనం చేసుకుంటుంది,***
***స్నేహసౌరభాలను విరజిమ్ముతుంది, విజయాన్ని దరిచేరుస్తుంది.***
***శాంతం సకల మానవాళికీ శ్రేయోదాయకం***
***అందుకే శాంతి మార్గంలో పయనించి, వ్యక్తిత్వవికాసంతో శీలనిర్మాణం చేసుకుని***
***దేవునియందు విశ్వాసంతో ఆధ్యాత్మికత వైపు అడుగులు వేసి, మానవత్వం కలిగిన మనిషిగా***
***మీ జన్మలను ధన్యం చేసుకొని, చేరువ కావాలి చిరంజీవికి***
***చిరస్మరణీయులై, చిదానందరూపులై***
***చిత్తమును మరచి, చిన్ముద్రులై***
***చెంగు చెంగున చేరండి ఈ చిరంజీవి హనుమను***
***నా చిన్నారి బిడ్డలారా!***

ఓం

**18-12-2018** 10:25 AM

**73) దైవానుగ్రహం ఎలా పొందగలము స్వామీ?**

మీ బాధల్ని మరచిపోవటానికి మరొకరి మీద భారం వేసి, ఊపిరి పీల్చుకోవటానికి మనిషికి దొరికిన మహత్తర కానుక, దైవం. మతం, వర్గం, కులం, ప్రాంతం ఏదైనా మనషులు ఏదో ఒక సమయాన తమకు నచ్చిన దైవాన్ని కొలుస్తారు. మనసులోని మాటను చెప్పుకుంటారు. దైవం మీద భారం వేసి నిశ్చింతగా వుంటారు. అందువల్లనే ఒత్తిడిని అధిగమించటానికి ఉపకరించే దివ్యౌషధంగా ప్రార్ధనను తలపోస్తారు. జీవితం ఒక బంధం, ఒక పాశం. మృత్యువు ఒక్కటే ముక్తిమార్గం. ఈ మర్త్యజీవనం ఒక అశ్రుసరోవరం అని అనుకుంటారు. అదే తప్పు. మానవప్రయత్నం త్రికరణశుద్ధిగా చేసి, ఆపై దైవానుగ్రహం కోసం ప్రార్ధించాలి. భూలోక, భువర్లోక, సువర్లోక, జనలోక, తపోలోక, సత్యలోకాలు ఏడులోకాలు కాగా, అతల, వితల, సుతల, తలాతల, రసాతల, మహాతల పాతాళాలు క్రింది లోకాలుగా ఆ విరాట్‌పురుషుడైన దైవాన్ని వేదాలు వేనోళ్ళా స్తుతిస్తుంటాయి. అందుకే అందుకలడు, ఇందులేడని సందేహం వలదని భాగవతోత్తములు పలుకుతుంటారు. వేదాన్ని వల్లించడం, మరణించిన పితృదేవతలకు తర్పణాన్ని అర్పించడం, దేవతలకు అగ్నిలో అర్ఘ్యం మొదలగువాటిని సమర్పించడం, మీతో కలసివుండే పశుపక్ష్యాదులకు ఆహారాన్ని పెట్టడం, తోటి మానవులను సత్కరించడం అనే పలు మహాయజ్ఞాలలో స్త్రీపురుషులు పాల్గొని దైవప్రార్ధన చేసినట్లయితే, దైవానుగ్రహం తప్పక పొందుతారు. 'నాది' అనే భావంతో ఏదీ చేయకూడదు. దైవం కోసమే ధర్మం. ధర్మం కోసమే కృషి. ఈ నిస్సంగత్వం అలవాటు పడ్డాక, అద్భుతమైన ఈ రహస్యం బోధపడ్తుంది. అదెలాగంటే, ఏకకాలంలోనే ప్రచండమైన కార్యరూపం ప్రశాంతమైన స్థైర్యం అవుతుందో, అనుక్షణం క్రియ, నిష్క్రియత్వం ఉన్నాయో అవగాహన కాగలదు. ఇదే దైవప్రార్ధనా మర్మం.

**74) దైవానుభూతిని పొందగల మార్గాలు ఏవి స్వామీ?**

**జన్మాంతర కృతం పాపం వ్యాధిరూపేణ బాధతే ।**
**తచ్ఛాంతి రోషదైః దానైః జప హోమ సురార్చనైః ॥**

జన్మాంతరంలో చేసిన పాపాలు ఈ జన్మలో వ్యాధిరూపంలో బాధిస్తాయి. దానికి శాంతి ఔషధం, దానం, జపహోమాలు, దైవార్చన అవసరం. కళ్ళతో చూడలేనిది మనస్సుతో చూడవచ్చు. మనసుతో చూడలేనిది బుద్ధితో చూడవచ్చు. మీ ప్రయత్నాలు మీరు చేస్తుంటే, దైవం భాగస్వామి అవుతాడు. అలా ఒకసారి మీరు ప్రయత్నం మొదలుపెడితే, దైవం యొక్క గొప్పదనం అర్ధమవుతుంది. నేను అంటే దేహస్థితి కాదు, బాహ్యస్థితి కాదు. ఆది లేని, అంతం లేని ఆత్మధృతి దేహం. అంటే, సప్తధాతువులు, పంచకోశాలు, వాయువులు, నాడులు, ఆత్మను కప్పి వుంచిన ఆధారాలు, ఆధరువులు, నివురుగప్పిన నిప్పులా లోలోన దైవశక్తి ప్రజ్వరిల్లుతుంది. అది మహాకాంతిదీపం. ఎప్పుడూ వాడని అనంతచైతన్యపుష్పం. ఉన్నతమైన ప్రదేశంలో కూర్చున్నంత మాత్రాన కాకి గరుత్మంతునిలా గొప్పది కాలేదు. తల్లి దాస్యాన్ని

అమృతాపహరణంతో పోగొట్టి సాక్షాత్తూ శ్రీహరికే వాహనంగా మారిన గరుత్మంతుడు ఎక్కడ? పురుగుల్ని, పిండాల్ని, కుళ్ళిన మాంసాన్ని తినే కాకి ఎక్కడ? అలాగే దైవచింతనతో శుచిగా శుభ్రంగా శరీరాన్ని, మనసును వుంచుకొని పవిత్రభావనలతో ప్రార్థించాలి. జీవుడు కూడా పరమాత్మవలే సంచారం చేసే ప్రయత్నమే చేయాలి. ప్రపంచం పరమాత్మస్వరూపం కనుక, చీమ నుంచి బ్రహ్మం వరకూ జీవుడు ప్రేమించాలి. ఏమీ అంటని వినిర్మల, విశుద్ధ ప్రేమతో దైవధ్యానంతో సంచరించాలి. దైవం ఒక అద్భుతం. దైవధ్యానం అంతకంటే అద్భుతం. సుఖసంతోషాలను జీవితంలో అనుభవించి ఆదర్శవ్యక్తిగా తనను తాను తీర్చిదిద్దుకోవాలంటే, మనిషి సదభ్యాసాలను, సత్సంబంధ బాంధవ్యాల్ని దైవలీలల సమాచారంతో ఆహ్వానించాలి. దైవత్వం అనేది ఒక పాలకడలిలాంటిది. భక్తితత్త్వమనే కవ్వంతో చిలికితే, మనోసాగరంలో చేరిన కాలుష్యాలు, వైకల్యాలు మటుమాయమైపోతాయి. భక్తుడికి దైవం తప్ప ఏదీ అవసరం లేదు. దైవం నుంచి ఏదీ ఆకాంక్షించడు. భక్తితత్త్వంలో కోరికలకు తావులేదు. భక్తుడు తన మానససంద్రంలోని ప్రతి నీటిబొట్టులోనూ దైవాన్ని మాత్రమే చూస్తాడు. పరమాత్మకు సంపూర్ణంగా వశం కావడంవల్ల అమృతుడవుతాడు. సత్వశోధనలో మీరు అంతరంగాన్ని శోధనకు గురి చేయవలసి వుంటుంది, సాధనతో మథించాల్సి వుంటుంది. పరమాత్మ వుండేది అక్కడే. ఆయనకోసం శోధించాల్సిందీ అక్కడే, సాధించాల్సిందీ అక్కడే. అంత ప్రాముఖ్యమైన అంతరంగాన్ని మీరు ఎంతో ఎన్నో శ్రమలకోర్చి సంస్కరించుకోవాలి.

***ఊపిరి విడిచిన మనిషిని ఊరి బయట వుంచు***
***కోట్లు వున్నా చచ్చిన మనిషిని ఇంటి బయట వుంచు***
***చావు పేదైనా రాజైనా సమముగావున, అహము ఎందుకు మీకు మానవా?***
***ఇహములోన వందకోట్లు మీకున్నను ఎందుకు?***
***కడుపు మించిన కూడును గతకలేవు ఎందుకు?***
***మీకున్నది ఏమి చేతురు?***
***చిన్న సాయమైనా చేయండి.***
***దానితో కొంచెము తృప్తియు, కొంచెము కీర్తి పెరుగును.***
***దాచుకున్నది నిల్వదు, దోచుకున్నది ఇలను దక్కదు***
***సిరులతో ఏమి చేతువు?***
***చిల్లిగవ్వకూడా రాదు చివర నీకు***
***ఊపిరి వున్నప్పుడే సాయమొకటి చేయండి***
***భోగములకు పోతే హెచ్చు రోగములు***
***రుచులు కోరిన మనిషికి రోగమొచ్చు.***
***మంచిపనులను చేసిన మనిషివి అవుదువు.***
***నాది నాది అను మోహము నరకమవును***
***నరోత్తముడిగా మారుటకు***

***నాణ్యమైన ఈ మారుతి మాటలు మూటలుగా తీసుకొని,***
***ముక్తిపథం వైపు అడుగులు వేస్తూ***
***ఆంజనేయుని అద్భుత పరిష్వంగనలో ఆప్లుతై***
***అంతరంగ నివాసులై ఆనందించండి***
***నా చిన్నారి బిడ్డలారా!***

ॐ

**20-12-2018** 10:20 AM

**75) మేము దేనిని త్యాగం చేయాలి స్వామీ?**

*త్యాగం ద్వారా, సేవ ద్వారా అమృతత్వం సిద్ధిస్తుంది. అందుకు ప్రయత్నం చేస్తున్నారా? తెలివిగలవాడు చేయవలసిన పని ఏమిటి? తానెవరో, ఎందుకు వచ్చారో, తానేం చేయాలో తెలుసుకోవటం వదిలిపెట్టి, ఎన్ని పనులు చేసి ప్రయోజనమేమిటి? త్యాగం అంటే ఏమిటి? కొంత డబ్బునో, సామాగ్రినో ఇతరులకు ఇవ్వడమా? కాదు. కానేకాదు. త్యాగము ఒక యోగము. త్యాగం అంటే ఆస్తిని, ఆలిని వదిలి అడవులకు పోవటం కాదు. మనసులోని చెడును వదిలివేయటం త్యాగం. మీలోని చెడును వదిలివేయగల మనోస్థైర్యం, ఇంద్రియ నిగ్రహం ఏర్పడాలంటే గట్టిగా గుర్తుంచుకోవలసిన జీవితసత్యం. "ఏదీ నాది కాదు, ఏదీ నాతో రాదు". ఏది శాశ్వితం? ఆలోచించండి. పొలాలు, పుట్రా అని ఎంత కొట్టుకులాడినా చివరకు పిడికెడు మట్టి అయినా పట్టుకుపోలేడు. చచ్చే ప్రతివ్యక్తి పిడికెడు మట్టిని పట్టుకునిపోయే వీలుంటే, ఈ భోగోళం ఎప్పుడో వట్టిపోయేది. మట్టికి కూడా మీవాళ్ళు రేషన్ పెట్టేవాళ్ళు. ఈ రోజిక్కడ, రేపెక్కడో? ఈ బిడారు? ఈ కాసేపు ఈ కరుణాక్షేత్రంలో నీవు సంతరించుకునే సంపదలన్నింటికీ నీవు ట్రస్టీవి. వాటిని సద్వినియోగం చేయండి అంతే. ఇలా తనను తాను ట్రస్టీ అనుకుంటే, త్యాగభావం పెంపొందగలదు. నాలుగురోజుల జీవితం అని గుర్తుంచుకుంటే, దానిని సక్రమంగా గడపాలనే సద్బుద్ధి కలుగుతుంది. అపుడు నేను, నాది అనే రెండక్షరాలకే పరిమితమైన జీవనపరిధి విస్తరించగలదు. భక్తిమార్గాన మొదటి అడుగు వేయాలంటే, 'నేను' ని తగ్గించుకోవాలి. చివరి సోపానం ఆత్మనివేదనం వరకూ చేరుకోవాలంటే, "నాది ఏదీ లేదు. అంతా నీదే" అని సమస్తం త్యజించవలసిందే. నేను అనే అహం అన్నింటా అడ్డు వస్తూనే వుంటుంది. అందుకనే ముందుగా త్యజించవలసినది దానినే కదా! చెప్పినంత తేలిక కాదు సుమా! అయినా నాకింత ఆనందానిచ్చే 'నేను' అనే భావాన్ని ఎందుకు వదులుకోవాలి? అన్న ప్రశ్న ఉదయిస్తే, అలా అహంను కాపాడుకున్నవారంతా ఏమైపోయారో తెలిపే వందలాది గాథలలో కొన్నింటిని జ్ఞప్తికి తెచ్చుకోండి. సూది మొన పైన వచ్చే అంతభూమి కూడా (అంటే ఎంత?) పాండవులకు ఇవ్వనని భీష్మించుకుని యుద్ధానికి సిద్ధపడ్డ దుర్యోధనుడు అతని నూరుగురు సోదరులు ఎంత భూమిని దక్కించుకున్నారు? ఎందరు మిగిలారు? నాకు ఏమీ వద్దు అంటూ ధనుర్బాణాలు వదిలివేసిన పార్థునికి, గీతోపదేశం వినే మహద్భాగ్యం కల్గింది కదా! అంత మహా*

సంగ్రామం జరిగినా, పంచపాండవులు క్షేమంగా ఉన్నారు కదా. త్యాగము చేయనివానికి ప్రకృతి నిర్బంధముగా త్యాగము నేర్పుతుంది. అట్లుకాక మునుపే త్యాగమును నేర్చుకొనుట మంచిది. ముఖ్యముగా వాంఛలను త్యాగము చేయండి. తదుపరి సంపూర్ణ శరణాగతి తత్త్వంతో, అనన్యభక్తితో చిత్తమును భగవంతునికి అర్పించితిరా, ఆయనే మీ యోగక్షేమాలను చూసుకోగలడు. మానవులలో వున్న బలహీనత ఇదే. ప్రకృతి నిర్బంధముగా నేర్పేవరకూ త్యాగము నేర్చుకోకపోవడం అంటే, (నోట్లు రద్దయిన తర్వాత దానధర్మాలు చేయటం, ఇతరుల ఖాతాలో డబ్బు జమ చేయడం) అల్సర్, బీపి, షుగర్ వచ్చిన తర్వాత ఘాటైన మసాలా వంటకాలు, తీపిపదార్థాలు తగ్గించడం ఇంద్రియ నిగ్రహమా? వాంఛలను త్యాగము చేయకుండా అడ్డుపడే మీలోని అరిషడ్వర్గాలను 'షడ్‌రిపు' అని శత్రువులుగా సంబోధించే వాటిని గురించి ఒక్కసారి ఆలోచించండి.

***ఓ ఆత్మీయ ఆలింగనం ప్రోత్సాహానిచ్చే ఓ పలుకు***
***అసాధ్యాన్ని సుసాధ్యం చేస్తుంది***
***అందర్నీ చూడలేకపోవచ్చు***
***ఆలోచనల అంతర్నేత్రంతో అందరినీ చదువగలరు***
***నిజాలను చూడలేని కళ్ళకన్నా, సాయం చేయని చేతుల కన్నా,***
***పరుగులు తీయని కాళ్ళకన్నా మనసును వక్రీకరించే బుద్ధికన్నా,***
***నిరాశల నీడలు క్రమ్మినా, అవివేకపు సెగలు తరిమినా***
***ఆశలే ఆలంబనగా ఆత్మస్థైర్యంతో అడుగులేస్తూ,***
***కలల కౌముదిని సాకారం చేస్తూ***
***కనువిప్పు కలిగించే మీరే వెలుగుజిలుగుల రారాజులు***
***కావాలని కాంక్షిస్తూ సుందరమైన జీవితాన్ని***
***సుస్వరాలు పలికిస్తూ, పవనకుమారుని***
***పలుభాష్యాలు పలుమార్లు పఠించి***
***పావనమార్గంలో పయనించి***
***ప్రత్యర్థిగా నిలచిన త్యాగాన్ని వరించి***
***వరములనిచ్చు వీరాంజనేయుని చేరి సదా సుఖించండి***
***నా చిన్నారి ముద్దుబిడ్డలారా!***

ఓం

**21-12-2018** 10:20 AM

**76)** షడ్‌రిపుల ప్రభావం ఎట్టిది స్వామీ? వాటిని ఏ విధంగా నియంత్రించాలి స్వామీ?

షడ్‌రిపుల గురించి ఒకసారి ఆలోచించండి. అందులో మొదటిదైన కామం అంటే భౌతిక

*విషయాల ఎడ అమితమైన ఆసక్తి, వాటిని పొందాలనే తీవ్రమైన ఆకాంక్ష. దానితో మంచి-చెడు అనే విచక్షణా జ్ఞానాన్ని కోల్పోవడం, ఐహిక విషయాల ఎడ ఆసక్తి ఎన్నో వాంఛలను జనింపచేస్తుంది. అంతం లేని కోరికల ఊబిలో మనిషి నిలువెల్లా మునిగిపోతాడు. కోరికలను నియంత్రించాలి. ఆధ్యాత్మికమార్గాన పయనించదలచినవారు అవశ్యముగా ఆచరించి తీరవలసింది, కోరికల అదుపు అనేది. భగవంతుడు తన హృదయంలో స్థానం ఇవ్వాలంటే, ముందుగా ప్రాపంచిక వాంఛలను త్యజించటం ప్రారంభిస్తేనే అచట చోటు దొరుకుతుంది. దానగుణానికి, త్యాగానికి అడ్డుపడే పెద్ద ఆటంకం లోభం. ఏడుతరాలు కదలకుండా కూర్చుని తిన్నా సరిపోయేంత ఆస్తిపాస్తులు సంపాదించినా, మరి ఎనిమిదవ తరం మాటేమిటి? అని దిగులుపడేవారిని పట్టిపీడించేది లోభమే కదా! నాది నాదే, నీది కూడా నాదే అనే లోభం త్యాగానికి ఏ మాత్రం తావివ్వకుండా అన్యాయార్జితాన్ని పెంచిపోషిస్తుంది. ధర్మార్థ కామ మోక్షాలలో అర్థం కూడా ధర్మమార్గంలోనే ఆర్జించాలి. ఆపైన దానధర్మాలు చేసే త్యాగభావం వుండాలి. ఇక క్రోధ, మోహాలు, మదమాత్సర్యాలు తప్పకుండా వదిలివేయవలసిన దుర్గుణాలు. వీటివల్ల ఇసుమంతైనా మీకు లాభం లేదు. పైగా ఎనలేని నష్టం చేకూరుతుంది. చేతిలో వున్నది విషసర్పమని తెలిసిన తర్వాత, ప్రమాదకరమైనదని అర్థమైనాక, దానిని వదలకుండా పట్టుకుంటారా లేక వదిలివేస్తారా? అలాగే ఈ దుర్గుణాలు మీకు తీరని హాని చేస్తాయని తెలియగానే ఏం చేయాలి? పామును మెల్లమెల్లగా వదులుతారా లేక వెంటనే చేయి విదిలిస్తారా? అలాగే, ఈ చెడుభావాలను వదిలివేయాలి. ఒకసారి మిమ్మల్ని మీరు ప్రశ్నించుకోండి. ఏ సద్గుణాన్ని అయినా మీరు అలవర్చుకోకుండా మీకు అడ్డుపడేదేమిటి? ధైర్యంగా ప్రశ్నించుకుని, నిజాయితీగా ఆత్మపరిశీలన చేసుకుని జవాబు వెతుక్కోండి. ఉదాహరణకు మీలో ఎవరైనా రోజులో కొంతసేపు మౌనం పాటించాలి అని అనుకుంటే, మీ స్పందన ఇలా వుంటుంది. అమ్మో! మాట్లాడకుండా మేము కాసేపు కూడా వుండలేము. ఎందువలన? మేము చాలా బాగా మాట్లాడతామనే అతి నమ్మకము. ఇతరులకు విసుగు కలుగుతుందని, మాకస్సలు అనిపించదు. పరనింద, ఆత్మస్తుతితో చాలా (చౌకబారు) ఆనందం కలుగుతుంది. ఈ కఠోరసత్యం మీ మనోఫలకంపై మెరవగానే ఏం చేయాలి? జవాబు మీకందరికీ తెలిసిందే. దుర్భావాలను త్యజించాలని అంటారు. వాస్తవానికి ఏ సద్గుణం అయినా మీరు ఆహ్వానిస్తే వెంటనే ఒక దుర్గుణాన్ని త్యజించవలసిందే. నలుగురితో మంచిగా వుంటూ, అందరినీ ప్రేమించు అనే మాటను ఆచరించదలచుకుంటే, వారిలోని లోపాలను భూతద్దంలో వెతకటం మానివేయాలి. సహృదయత, విశాలదృక్పథం అలవర్చుకోవాలంటే ముందుగా, ఈర్ష్యాద్వేషాలనే టెర్రరిస్టులను తరిమికొట్టాల్సిందే. అందరినీ సేవించు అంటూ సేవామార్గాన్ని అనుసరించాలంటే, అహంకారం, ఆడంబరం లాంటి భావాలను పొలిమేరకి ఆవల విడిచి రావాల్సిందే. భక్తుడిగా రూపుదిద్దుకోవాలంటే, నేను-నాది అనే మోహానికి తిలోదకాలివ్వవలసిందే. శాంతం, సహనం నేర్చుకోవాలంటే, కామక్రోధాలను నిర్జన అరణ్యంలో వదిలి వెనుదిరిగి చూడకుండా రావాలి. చివరగా చిన్న ప్రశ్న. మీరు ఏ వస్తువునైనా, ఎవరైనా, ఎవరికైనా ఇచ్చి త్యాగం చేశామని అంటారు. కానీ, ఇలా అనగలరా? "నా ఈర్ష్యాద్వేషాలను మీకిస్తాను. కొంచెం తీసుకుంటారా?" అని అడిగినట్లయితే వాళ్ళు తీసుకునే సమస్యే లేదు. మరి, పాపాలకు భైరవుడు వున్నాడుగా... ఆ కరుణాసముద్రుడు పరమాత్మ!*

*మీ చెడును అంతా ఆయనకు వదిలివేయండి. మీ మనసును సద్భావాలతో నింపుతాడు. మరింక ఆలస్యం దేనికీ? మీ ఎదురుగా వున్న ఈ ఆంజనేయుడు దేనినైనా మోయగలడు. కావున, మీకు బరువుగా వున్న చిల్లరభావాలను ఇచ్చివేసి, కరుణతో కూడిన కరెన్సీని పొందండి. ఈ త్యాగం కోసమే నిరీక్షిస్తున్నాను. మరి ఆలస్యం చేయకండి!*

***మీ జీవితంలో నడత నేర్పేది గురువు***
***మీకు గుర్తింపు తెచ్చేది గురువు***
***మీరు రుణం తీర్చుకోలేనివాడు గురువు***
***జీవితంలో ఎలా ఎదగాలో, ఎక్కడ ఏం చేయాలో చెప్పేవాడు గురువు***
***తన జీవితాన్ని మీ కోసం వెచ్చించి, మీ తప్పుల్ని సరిదిద్ది, లోకజ్ఞానం నేర్పేవాడు గురువు***
***గురువు చెప్పే విద్య గుప్తనిధితో సమానం***
***గురువు లేని జీవితం శూన్యం***
***గురువు లేకుంటే నీవు ఎదగవు***
***అనంత ఐశ్వర్యాలగని, ఆ అనంతశక్తిని ఎలా సేవించాలి?***
***కేవలం మీ మనస్సు, బుద్ధి, ఆత్మను కలిపి ఆ విశ్వేశ్వరుడికి అంకితమొనర్చి***
***ఆయన దీవెనలతో, అఖండ భక్తితో***
***ఈ ఆంజనేయుడు గురువై బోధించిన బోధలు బాగుగా అర్ధము చేసుకుని***
***అర్ధవంతమైన జీవనాన్ని గడుపుచూ, గమ్యం వైపు అడుగులు వేయండి***
***నా చిన్నారి ముద్దుబిడ్డలారా!***

ॐ

**22-12-2018** 10:20 AM

**77)** **మానవ సంబంధాలలో ఎవరి పాత్ర ఎట్టిది స్వామీ?**

*జన్మలన్నింటిలోనూ మానవజన్మ ఒక గొప్ప ప్రస్థానం. ఆదిదేవుడు మనిషికిచ్చిన ఒక వరం. అది తెలుసుకుని జీవించడం మనసున్న మనిషిగా మీ ధర్మం. జీవితాన్ని ఒక మంచి మార్గాన, మంచి గుర్తింపుతో, మచ్చలేని మనిషిగా జీవించడం ఒక సంకల్పం. పుట్టుక అనేది దేవుని వరం. తరువాత బాల్యం నుంచి యవ్వనం వరకూ మీ తల్లిదండ్రులు, గురువులు నీ యొక్క జీవిత అభివృద్ధికి పునాది వేయగలరు. అంతవరకు అది వారియొక్క బాధ్యత. తర్వాతకాలంలో నీ వయసుతోపాటు మనసు కూడా పరివర్తన చెందుతూ వుంటుంది. అప్పటి నుండి నీవు సంకల్పితుడవో, అసంకల్పితుడవో తేల్చుకునే బాధ్యత నీవే నిర్ణయించుకోవాలి. అది నీ జీవితానికి ముఖ్యమైన తొలిమెట్టు. తల్లిదండ్రులు, గురువులు, నీకు యుక్తవయసు వచ్చే వరకూ, నీ అభివృద్ధికి శాయశక్తులా కృషి చేస్తారు. వారు ఏ స్వార్ధంతోనూ ఆ బాధ్యతకు పూనుకోరు. దాన్ని వారి కర్తవ్యంగా భావిస్తారు. మిగిలిన జీవితాన్ని సక్రమమార్గంలో నడుపుతావో*

*లేక ముళ్ళబాటలో నడుస్తావో నీ ఇష్టం. నీవు ఎలా నడవాలంటే అలా నడవటాన్కి నేటి సమాజంలో అన్ని దారులున్నాయి. ఎందుకంటే, నాడు మనిషి యొక్క జీవితకాలంలో సగభాగం తల్లిదండ్రులు, గురువుల యొక్క చెప్పుచేతల్లో వుండేది. నేడు అది కరువైంది. ప్రస్తుతకాలంలో ఊహ తెలిసి, మనసు కొద్దిగా పరివర్తన చెందేసరికి, "నాకు నేనే మగాడ్ని, నాకు ఎవరూ చెప్పనక్కరలేదు" అనే మనస్తత్వాన్ని ఏర్పర్చుకుంటున్నాడు. నేటి తల్లిదండ్రులు కూడా "మనం స్వేచ్ఛగా పెరగలేదు, మన పిల్లలు అలాగే ఎందుకు బ్రతకాలి?" అని ఇవ్వవలసిన స్వేచ్ఛ కన్నా ఎక్కువగా స్వేచ్ఛను ఇస్తున్నారు. ఆ 'అతిస్వేచ్ఛే' వాళ్ళ జీవితానికి అయితే ఆ ఒడ్డు లేదా ఈ ఒడ్డు అన్నట్లు తయారవుతున్నారు. కాబట్టి, వయసు, మనసు పరిణతి చెందేవారు, మీ జీవితానికి సక్రమమైన బాట మీకు మీరే ఆలోచించి వేసుకోవాలి.*

## 78 ) స్నేహం ఎలా ఉండాలి స్వామీ?

*నేటి సమాజంలో కుళ్ళు, కుతంత్రాలు, మోసాలు, స్వార్థాలు తాండవిస్తున్నాయి. వాటిని పసిగట్టి, అడుగులు ముందుకు వెయ్యాలి. నీకు అనువైన అందరితోనూ స్నేహం చెయ్యి, అందరితోనూ కలసిమెలసి వుండాలి. కానీ, గ్రహింపు మర్చిపోకండి. అందరు స్నేహితులూ ఒకేలా వుండరు. స్వార్థంతో స్నేహం చేసేవాళ్ళని, నిస్వార్థంతో స్నేహం చేసేవాళ్ళని గుర్తించి, ఎంతవరకు వుండాలో అంతవరకు వుండాలి. నీ కష్టాన్ని, బాధని గుర్తించి, వాళ్ళ కష్టంగా భావించే స్నేహితుని మదిలో నిలుపుకోవాలి. స్వార్థంతో చేసే స్నేహం ముందుగా నీకు మంచిగా, నిజంగా కనిపిస్తుంది. కానీ, అది గ్రహించడం అవసరం. నిస్వార్థంతో చేసే స్నేహం పరిస్థితులను బట్టి మందలిస్తుంది, మరియు ఓదార్చుతుంది, అవసరానికి చేయూతనందిస్తుంది. కాబట్టి, దాన్ని గ్రహించి మసలుకోవాలి. ఎప్పుడైతే కష్టాల్లో, బాధల్లో మీకంట కన్నీరు వస్తే, ఆ కన్నీరుని చూచి తన కళ్ళు కూడా తడితో చెమర్చి, నీ కన్నీళ్ళని తుడవాలని భావన కలిగిందో, ఆ స్నేహబంధానికి జగతిలో విలువ కట్టలేరు. మనసు+మనసు=మహోన్నతం. కాబట్టి, అటువంటి స్నేహం కోసం పరితపించాలి. అటువంటి స్నేహబంధాలు కలిగిననాడు, అలవోకగా మీ జీవితదారి పూలబాటే అవుతుంది. స్నేహం చెయ్యకపోయినా ఫర్వాలేదు, కపటస్నేహం చేయకండి. ముఖస్తుతి కోసం పెదవుల మీద వచ్చీరాని నవ్వు నవ్వకండి. కపటం నటిస్తే, మీకు దొరికే స్నేహితులు కూడా కపటస్నేహ సూత్రధారులుగా తయారవుతారు. కష్టాల్ని, బాధల్ని అడక్కుండా తెలుసుకుని, పాలుపంచుకునే స్నేహం కోసం పరితపించండి. ఆ స్నేహమే మీ జీవితానికి చివరి వరకు గొప్ప అండగా వుంటుంది. నిష్కల్మష స్నేహితులు పరిస్థితులను బట్టి, వారి మధ్య విభేదాలు వచ్చినా పగలు, ద్వేషాలు పెంచుకోరు మరియు ఆ విభేదాన్ని ఛేదించగలరు. ఇది నిజం. ఇది ఉన్నతమైన స్నేహం కలిగిననాడు పరిస్థితులను బట్టి, జీవితం ఎప్పుడైనా గాడి తప్పినా, మరలా గాడిలో పెట్టుకోవచ్చు. ఇది ఆంజనేయుని స్నేహసూత్రం. నా స్నేహితుడు ఎవరో ఊహించి చెప్పండి!*

***వేలకు వేలు వెచ్చించి, వేల మైళ్ళు పయనించి పుణ్యనదుల స్నానములాచరించి,***
***వేలుపులనెందరినో వేడుకుని ముడుపులు కానుకలు చెల్లించుకుని,***

***వ్యయప్రయాసలకోర్చుకొని వెతలు చెంది***
***కోరికలు తీర్చమని దేవుని కోరుటకన్న,***
***ఆపదలలో వున్నవారిని ఆదుకున్న ఆపన్నులకు అభయము నిచ్చిన***
***ఆకలి కడుపులకు అన్నము పెట్టిన***
***దీనముగా వున్న దీనుల దిగులు తీర్చిన***
***ఇట్టి పరోపకార పనులెంతయో మిన్న***
***మానవసేవయే మాధవసేవ అని భావించండి***
***ఆపద్బాంధవులకే అనంతుని అనురాగం దక్కు***
***అట్టివారిని కష్టాల కడలిని దాటించండి***
***ఆంజనేయుడు అతి మందహాసముతో***
***మందగమనమున గాక వాయువేగంతో***
***వరాలననుగ్రహించుటకై మిమ్ము వరించును***
***నా చిన్నారి ముద్దుబిడ్డలారా!***

ॐ

**24-12-2018** 10:20 AM

**79)** దుఃఖము నుండి ఉపశమనం కలగాలంటే ఏమి చేయాలి స్వామీ?

*మానవుడు అనుభవించే సుఖదుఃఖములు, రాగద్వేషములు, విషయవాసనలు మనసు నుండే ఆవిర్భవిస్తున్నాయి. మనసులో ఏకాత్మభావాన్ని పెంచుకున్నప్పుడు, ఇలాంటి ద్వంద్వభావనలు ఏమాత్రమూ కలగవు. మానవుడు సుఖదుఃఖములును సమభావంతో స్వీకరించాలి. దుఃఖం వలన నష్టంకన్నా లాభమే అధికంగా వుంటుంది. కష్టములే లేకుండిన సుఖమునకు విలువే లేదు. ప్రతిమానవుడూ తాను నిరంతరమూ ఆనందంగా వుండాలని ఆశిస్తున్నాడు. ఆనందం బయట లభించేది కాదు. దైవంతో చేరితేనే ఆనందం. ఈ లోకసంబంధ విషయములన్నీ దుఃఖమునే అందిస్తాయి. అయితే, ఆ దుఃఖములోనే ఆనందం నిక్షిప్తమై వుంటుంది. మీ హృదయపీఠముపైన భగవంతుని ప్రతిష్ఠించుకున్నప్పుడే, అద్వైతానందము స్వంతమవుతుంది. భగవంతుడనగా ఎవరు? 'భ' అనగా కాంతి, 'గ' అనగా వ్యాప్తిగావించడం, 'వాన్' అనగా సమర్థుడు. కాంతిని సర్వత్రా వ్యాప్తిగావించేవాడే భగవంతుడు. రూపరహితుడై, అణువుకన్నా అతి సూక్ష్మమైనవాడు, మీలోవున్న ఆత్మయే భగవత్స్వరూపం. బ్రహ్మలోనే మీరూ, మీలోనే బ్రహ్మ వున్నారు. మీకు-బ్రహ్మకు ఎట్టి భేదమూ లేదు. అట్టి భావరహితమైన తత్త్వమును విశ్వసించకపోవుట వలననే, దుఃఖానికి గురి అవుతున్నారు. ఆత్మవిశ్వాసంతో మీ జీవితాలను గడపాలి. సర్వజీవులను ప్రేమించండి. అసలు ద్వేషులనేవారే లేకుండా చేసుకోండి. మిమ్మల్ని ఎవరు ద్వేషించినప్పటికీ, మీరు మాత్రం ద్వేషించకండి.*

నేను ఎవరినీ ద్వేషించను, విమర్శించను. మీరూ అటువంటి ఆదర్శాన్ని ఆచరించినపుడు, మీరు కూడా నాతో సమానమైన తత్త్వాన్ని పొందుతారు. ప్రేమతత్త్వమే నా నిజమైన ఆస్తి. ఈ ప్రేమతత్త్వాన్నే మీరు కూడా పంచుకుని, ఆత్మవిశ్వాసాన్ని పెంచుకుని, మీరు క్షేమంగా వుంటూ, లోకానికి ఆదర్శాన్ని అందించాలి. అందరియందూ దేవదేవుడే దేహియై వున్నాడు. మీ ఇంటి ముందుకు బిచ్చగాడు వచ్చి, భవతీ భిక్షాందేహి అని అడుగుతాడు. ఎవరిని? మిమ్మల్ని కాదు, మీ యందున్న దేహిని. అనగా దైవాన్ని అడుగుతున్నాడు. ఈ సత్యాన్ని మీరు గుర్తుంచుకోలేక, వాడు మిమ్మల్ని భిక్ష అడుగుతున్నాడని భ్రమపడుతున్నారు. ఇదియే అజ్ఞానము, అహంకారము. వాడు అడిగేది మిమ్మల్ని కాదు, మీలోపల వున్న దివ్యశక్తివంతమైన దేహిని. ఆ దివ్యతత్త్వాన్ని మీరు ప్రేమతో ఆరాధించండి. అంతర్యామిని గుర్తించండి. భగవంతునికి–మీకు గల సంబంధం హృదయానికి–హృదయానికి, ప్రేమకు–ప్రేమకు. దుఃఖరాహిత్యానికి అద్వైతసిద్ధియే పరమౌషధము!

***ధనరాసులును కావు ధాన్యరాసులును కావు***
***ధార్మిక చింతనే ధనము***
***మనసును అదుపు చేసి మమకారమును త్రుంచి***
***తత్త్వార్థమును ఎరుగుటే ధనము***
***చక్రవర్తి పదవిని సాధించుట కాదు***
***దైవత్వముతో వుండుటే ధనము***
***వాంఛలను అణచి తీవ్రవైరాగ్యమును మించి***
***తనకు తాను ఎరుగుటే ధనము***
***వాద భేదము లేని సుబోధలనెరిగి***
***మోదము నొందుచూ మోక్షమునందుకొనుటే ధనము***
***మారుతి మాటలు మస్తిష్కమునకెక్కించుకుని***
***మరువలేని మహిమాన్వితమైన జీవితపథమ్మున నడచి***
***నన్ను చేరి సుఖించండి***
***నా చిన్నారి ముద్దుబిడ్డలారా!***

ఓం

**25-12-2018** 10:20 AM

**80)** మనోనిగ్రహం సాధించాలంటే ఏమి చేయాలి స్వామీ?

మానవుడు భవబంధాలకు కట్టుబడినా, మోక్షం సాధించే కారణం మనస్సు. కష్టాల కడలిలో మునుగుతున్నా, ప్రశాంతతను సృష్టించగలదీ మనస్సు. అందుచేత, మనస్సును తన ఆధీనంలో వుంచుకుని నియంత్రించగలవాడే కష్టసుఖాలకూ, సుఖదుఃఖాలకు అతీతుడిగా వుండి, ప్రశాంతతను అనుభవించగలడు. అందుకే, నా శ్రీరామచంద్రమూర్తి అంటాడూ, "ప్రచండ ప్రభంజనాన్ని ఒక చేత్తో నేను నియంత్రించగలను.

ఊహాతీత జలప్రళయాన్ని గుండె ఎదురొడ్డి నేను ఆపగలను. కానీ, నా మనస్సును నేను అదుపులో పెట్టుకోగలను అంటే, నేను నమ్మను" అని. అందుకే స్వర్గంలో నరకాన్ని, నరకంలో స్వర్గాన్ని సృష్టించగలది మనస్సే. అందుచేత, సన్మార్గవర్తులుగా వుంటూ, ఏ స్వార్థమూ లేకుండా నిరంతరం లోకకళ్యాణం కోసం కృషి చేయాలనుకునే సజ్జనులు సాధించవలసింది మనోనిగ్రహం. ఆ మనోనిగ్రహాన్ని సాధించాలంటే, ఎటువంటి సాధన చేయాలో ఆలోచించండి. మంచి విత్తనాన్ని నాటితేనే, పూర్ణఫలాన్ని పంటగా పొందగలరు. తేనె వంటి పలుకులు పలికేవాడ్ని, సత్కర్మలు చేసేవాడిని, గంగాజలంలా నిర్మలమైన హృదయం గలవాడు చూసే ఒక్క చూపు, నిన్ను నీ దుఃఖాల నుండి, ఆవేదనల నుండి దూరం చేస్తుంది. నామస్మరణ అనే విత్తనాన్ని నాలుకపై నాటితే, మృదుమధుర సంభాషణలతోపాటు, నాలుక చేసే నాలుగు పాపాల్ని హరియిస్తుంది. అవి ఆత్మస్తుతి, పరనింద, అతిభాషణ, అసత్యప్రలాపం. ఎవరి గురించీ చెడు తలచకుండా, ఎవరికీ చెడు చేయకుండా, ఎవరి గురించీ చెడు చెప్పకుండా, ఎదుటివారిలోని సద్గుణాలను గ్రహిస్తూ నిరంతరం అందరి యోగక్షేమాల్ని, విశాల విశ్వంలో ప్రతి ఒక్కరి సుఖసంతోషాలని కోరుకోగలగటమే నిర్మలహృదయం. అది గంగాజలంలాంటిది. ఏ కల్మషాన్నయినా హరించగలదు. తన ప్రతి ఆలోచన, ప్రతి మాట, ప్రతి చర్య కళ్యాణకారకంగా వుండాలి అన్న తపనతో త్రికరణశుద్ధిని సాధించగలగటం, నిరంతర సత్పురుషుల సాంగత్యం, సత్కథాశ్రవణం వల్ల మాత్రమే సాధ్యమవుతుంది.

ఎవరైతే తనకు సంప్రాప్తించిన కష్టకాలంలో దుఃఖభాజనుడు కాకుండా సమతౌల్య ప్రవర్తనను ప్రదర్శిస్తాడో, అతడు తన కష్టకాలం నుండి పాఠాలు నేర్చుకుంటాడు. ఆ విధంగా తన కష్టకాలాన్ని బంగారంగా మార్చుకుంటాడు. మనసు కోరికలకు, ఆశలకు నిలయంగా మార్చుకున్నారా, ఏ విధంగానూ మంచిగా మారలేరు. మనోవేదనతో శరీరం ఉష్ణోగ్రత పెరిగినపుడు, గంధం పూయడం వలన ప్రయోజనం లేదు కదా. మనస్సు ఉత్తమోత్తమమైన పూజ చేయగలదు. దీనికి ఉపకరణాలు, పరికరాలు అవసరం లేదు. మనస్సునూ, సత్యాన్ని అవగాహన చేసుకోగలగటమే పూజ యొక్క ప్రయోజనం. చివరికి నష్టమైనా, లాభమైనా నీకు కలిగించేది మనస్సే. కర్మవృక్షానికి జీవం పోసేది మనస్సనే విత్తనమే. నిరంతరం మీ ఇష్టదైవాన్ని స్మరించడమే జపము. జపాన్ని మానసికపూజ అంటారు. అందుకే యజ్ఞానాం జపయజ్ఞోస్మి అన్నాడు గీతాచార్యుడు. వాచికజపం కన్నా మానసికజపం వందరెట్లు ఫలితాన్నిస్తుంది. పూజ పరమార్థం ఆచారవ్యవహారాలు గాని, విధివిధానాలు గాని కాదు. మనస్సుయొక్క పరిణామశైలిని, సర్వాంతర్యామి భగవంతుడన్న సత్యాన్ని గ్రహించగలగటమే నిజమైన పూజ. భగవంతుని దివ్యానుగ్రహం పొందటానికి నిరంతర భగవధ్యానాన్ని మించిన సాధన లేదు. మీ హృదయంలోనే దైవం కొలువై వున్నాడని ఎవరు మనస్ఫూర్తిగా విశ్వసిస్తారో, వారి ఇంటా, వెంట, జంట వుండి, దైవం కాపాడుతూ వుంటాడు.

**భగవంతునికి కావలసినవి వినయం, విధేయత, భక్తి, శ్రద్ధ**
**తనకు తాను ఒదిగి వుండేవాడే భగవంతుని ప్రేమకు అర్హుడు**
**అంతరంగంలోని అజ్ఞానాన్ని వదిలివేసి, రాగద్వేషాలకు మంగళం పాడి**
**దివ్యమైన జ్ఞానాన్ని స్వీకరించి ఆధ్యాత్మిక పూజను గుర్తించి**
**ఆనందమే పరమానందమనేది అనుభవంలోకి తెచ్చుకుని**

***మట్టిలో పుట్టిన మీరు మరలా మట్టిలో కలిసేవరకూ***
***మానవత్వంతో మనుగడ సాగించి***
***మానవత్వానికి పాలాభిషేకము చేసి***
***నిన్ను నీవు దర్శించుటకు అడ్డుగా నిల్చిన మనస్సును***
***మారుతి బోధలతో గుర్తించి మునుపెన్నడూ కనీవినీ ఎరుగని రీతిలో***
***సాధనా ప్రక్రియలైన నామస్మరణతో***
***అఖండ తేజోవంతులై తెచ్చుకున్న మార్పుతో***
***మాయాలోకమును వీడి మాధవ సామ్రాజ్యమును చేరి***
***సుఖించండి సదా***
***నా చిన్నారి ముద్దుబిడ్డలారా!***

ॐ

**04-01-2019** 07:00 PM

**81) అహంకారం ఎట్టిది స్వామీ? దానిని ఎలా తొలగించుకోవాలి స్వామీ?**

*అనహంకారము అంటే అహంకారం లేకుండుట. అసలు దేవుడికి-జీవుడికి మధ్యనున్న అడ్డుగోడ అహంకారమే. అహంకారం తొలగించుకోగలిగితే జీవుడే దేవుడు అవుతాడు. ఈ అహంకారం అవగుణాల పుట్ట. పుణ్యం-పాపం, మంచి-చెడు, ధర్మం-అధర్మం, న్యాయం-అన్యాయం అనేవి ఈ అహంకారికి పట్టవు. పొలంలో మంచి పంట రావాలంటే, కలుపుమొక్కలను పీకివెయ్యాలి. అలాగే పరమాత్మను చేరుకుని మీ జన్మ అనే పంటను పండించుకోవాలంటే, ఈ అహంకారమనే కలుపుమొక్కను పీకివెయ్యాలి. హృదయంలో 'నేను' వున్నంతవరకు గురువు లేడు. గురువు వచ్చాడా, 'నేను' వుండదు. ఆ 'నేను' అహంకారమే. అహంకారికి సర్వనాశనం తప్పదు. దుర్యోధనుడు అహంకారాన్ని ముందు పెట్టుకుని సర్వనాశనమయ్యాడు. అర్జునుడు భగవంతుని ముందు పెట్టుకుని సార్థకజీవి అయ్యాడు. అహంకారి అన్నాడు, "నేనెవ్వరికీ తల వంచను" అని. "మరి మంగలికో?" అన్నాడు పొరుగువాడు. దానికి పాపం జవాబు చెప్పలేకపోయాడు. పెద్దలకు, వృద్ధులకు, జ్ఞానులకు, గురువులకు, భగవంతుడికి తలవంచి నమస్కరించాలి అనే బుద్ధి అందరికీ కలగదు. పూర్వజన్మ సుకృతం గలవారికే కలుగుతుంది. అహంకారికి అధోగతి తప్పదు. అహంకారం తియ్యని విషం లాంటిది. మిత్రుడుగా కనిపించే శత్రువు. తేనె పూసిన కత్తి. దీని లీలలు బహు విచిత్రాలు. భాగవతంలో గోపికల వస్త్రాలను అపహరించాడు బాలకృష్ణుడు. ఇది మీకు పైకి కన్పించే కథ. నిజంగా జీవుల యొక్క అజ్ఞానమనే అహంకారాన్ని హరించటమనే దివ్యలీలయే అది అర్థం చేసుకుంటే. అహంకారాన్ని భగవంతుడే కరుణించి తొలగించాలి. స్వప్రయత్నంతో సాధ్యం కాదు. దీనిని ఈశావాస్యోపనిషత్తులో చెబుతారు ఇలా:*

**హిరణ్మయేన పాత్రేణ సత్యస్యాపి హితం ముఖం ।**
**తత్త్వం పూషన్నపావృణు సత్యధర్మాయ దృష్టయే ॥**

అంటే "పరమాత్మ ముఖం బంగారుపాత్రతో కప్పబడింది. ఓ భగవానుడా! నేను నిన్ను దర్శించటానికి వీలుగా నీవు ఈ పాత్రను తొలగించు" అని ప్రార్థించాలి శిష్యుడు. అయితే, భగవంతునిపై మీకు అనన్యభక్తి వుండాలి. అది వున్నప్పుడే, అహంకారమనే బంగారుపాత్ర తొలగించబడి, సత్యదర్శనమవుతుంది. ఈ అహంకారం జ్ఞానార్జనకు అడ్డంకి. అహంకారి, గురువు వద్ద తల వంచలేడు. అందుకే జ్ఞానాన్ని పొందలేడు. పొందినా, అర్థం చేసుకోలేడు. అర్థం చేసుకున్నా, అనుభూతి కలగదు. కనుక, అహంకారం తొలగించుకోవాలి.

**82) మేము అనుభవించే దుఃఖములు ఏవి స్వామీ?**

మానవజీవితం అంతా దోషభూయిష్టం, దుఃఖభూయిష్టం. అప్పుడప్పుడు కొన్ని సుఖాలున్నా, దుఃఖాలు మాత్రం తప్పవు. ఇలా దుఃఖాలతో కూడినదే ఈ మానవజన్మ అని తెలిస్తే, దీనిపై వైరాగ్యం కల్గుతుంది. ఇక ఈ జన్మలు వద్దు అనిపిస్తుంది. జన్మరాహిత్యానికి ప్రయత్నించాలి అనిపిస్తుంది. కనుక, ఈ జన్మలోని దుఃఖదోషాలను నిశితంగా పరిశీలించండి. ప్రపంచం దుఃఖమయం, దేహం రోగమయం. వ్యాధులతోనూ, అభిమానంతోనూ కూడి దుఃఖాల చేత సతమతమైపోతున్నదీ జన్మ. పుట్టేటప్పుడు ఏడుస్తాడు, చచ్చేటప్పుడు ఏడుస్తాడు. మధ్యలో రోగాలొస్తే ఏడుస్తాడు. ముసలితనం వచ్చినా ఏడుస్తాడు. దీనినే జన్మదుఃఖం, జరాదుఃఖం, వ్యాధిదుఃఖం, మరణదుఃఖం అంటారు. ఇది ఎలాంటిదో చెబుతాను వినండి. తలచుకుంటే సిగ్గుతో చచ్చిపోవాలి. సిగ్గో ఎగ్గో అది బహిరంగరహస్యం. కోడిగ్రుడ్డు అంత పరిమాణం గల గర్భకోశంలో 9 నెలలు నివాసం. అక్కడి క్రిముల చేత పీడించబడటం, జఠరాగ్ని చేత తపించిపోవటం, తల్లి ఆహారవిహారాల చేత అలమటించిపోవడం, మావి చేత బిగించబడి తలక్రిందులుగా వుండటం, పూర్వజన్మల స్మృతితో విపరీతంగా దుఃఖించటం, ప్రసూతి వాయువుల చేత త్రోయబడటం, బయటపడి మలమూత్రాదులతో పెద్దపురుగులాగా పొర్లాడటం, ఇవన్నీ జన్మదుఃఖాలే. పుట్టిన ప్రతిజీవి తప్పించుకోలేని దుఃఖం. ఇక మృత్యుదుఃఖం. ఈ దేహం మృత్యుదేవత సొత్తు. పాలు, వెన్న, నెయ్యి, జీడిపప్పు, స్వీటు హోటులతో చక్కగా పెంచి, ఫారిన్ సెంట్లు, పౌడర్లు, సోపులు, కాస్మోటిక్స్‌తో పోషించినా, ఈ బంగారంలాంటి శరీరానికి చివరి దశ ఏమిటో కళ్ళుమూసుకుని ఒక్కసారి భావనకు తెచ్చుకోండి. మర్మస్థానాలు భేదించబడటం, అంగసంధులు వికలమైపోవటం, నాడుల నుంచి ప్రాణాలు నిర్బంధంగా బయటకు రావటం, ప్రాణోత్క్రమణి జరిగేటప్పుడు లక్ష తేళ్ళు ఒక్కసారిగా కుడితే కలిగేటంత బాధ, వశం తప్పి మలమూత్రాదులు విడిచిపెట్టడం, భరించలేని యాతనలు ఇవి మృత్యుదోషాలు. ఇంతేనా? ఇక మరణించబోతున్నాను అని తెలియగానే, అమ్మాయి పెళ్ళి, అబ్బాయి ఉద్యోగం, కట్టాలనుకున్న మేడలు, ఇప్పటి వరకూ దాచుకున్న బ్యాంకు బాలెన్స్, లెక్కలు కట్టీ కట్టీ దాచిన సొమ్ము, భార్యాబిడ్డలు... అంతా గుర్తుకు వస్తారు. ఇంత సంపాదించి వదిలిపెట్టిపోతున్నాననే బాధ మృత్యుబాధ.

**వయసు అయిపోతున్నది, మనసు దిగజారిపోతున్నది**
**తనువుతోలు ఊగులాడుతుంది**
**చెవులు వినరాక వున్నవి, కనులు కానరాక వున్నవి,**

***అన్నం రుచి తప్పింది, తిన్నా జీర్ణం కాని స్థితిలో వున్నది,***
***వెన్ను వంచి కూర్చుందామన్నా బలహీనం***
***కాళ్ళు తనువును మోయనంటున్నది***
***కీళ్ళనొప్పులు వదలనంటున్నవి, మూత్రానికి లేవలేక మూలపడి వున్నది***
***ధ్యానం పైన, గురుభక్తి పైన ధ్యాసపెట్టి నడవలేక***
***ఐశ్వర్యమే శాశ్వితమనుకుంటూ దరిచేర్చే పరమాత్ముని ఎరుగక,***
***ఏరులై పొంగివచ్చు అహంకారాన్ని త్రుంచలేక***
***త్రుళ్ళిపడు జీవుడు తుంటరితనాన్ని వదిలి***
***వాయువేగ మనోవేగాలతో వచ్చిన దారిని గుర్తించి***
***గురుతు తెలుపు ఆంజనేయుని ఆశ్రయించి***
***ఆపదలను దాటి, అక్కున చేరండి సాధనోన్ముఖులై***
***నా చిన్నారి బిడ్డలారా!***

ఓం

**19-01-2019** 10:15 AM

# ఆంజనేయుని ప్రశ్నోత్తరములు

*1. ఆత్మవిశ్వాసం కోల్పోతే ఏమవుతుంది?*

జ. ఆత్మవిశ్వాసం కోల్పోతే దైవమందు విశ్వాసం కోల్పోయినట్లే.

*2. మీరు చేస్తున్న సాధన గురించి ప్రశ్నించుకున్నారా? అసహనాన్ని ఎంత దూరంలో వుంచగలిగారు? దానిని ఏ విధంగా ప్రశ్నించుకుని సమాధానాన్ని పొందుతున్నారు?*

జ. ప్రతి మానవునికి మదిలో గాఢమైన కోర్కెలతో భగవంతుని అనుగ్రహం తమపై ప్రవహిస్తూ, కన్నీళ్ళు, కష్టాలు దరికి చేరకుండా ఆర్థిక, శారీరక బాధలు తటస్థించకుండా, జీవితం పూలబాటలో సాగిపోవాలని అనుకుంటారు. ఇలా కోరుకోవటంలో తప్పులేదు. కానీ, అందుకు తగిన సాధన మేము చేశామా? ఈ కోర్కెకు మేము అర్హులమేనా? అని ఎవరికి వారు ప్రశ్నించుకోరు. మీకు నచ్చని పని ఎవరైనా చేస్తే, సహనం కోల్పోయి, ద్వేషం పెంచుకుంటారు. అనరాని మాటలంటారు. ఆ వ్యక్తిని ద్వేషిస్తారు. మరి ఇన్నాళ్ళూ నామసంకీర్తన, సేవలు కలిగించిన ఆధ్యాత్మిక పరివర్తన ఏమిటి? కష్టాలు, కన్నీళ్ళు ఎదురవుతున్నప్పుడు భక్తి విశ్వాసాలు సడలిపోతున్నాయి కదా అని ప్రశ్నించుకోండి. మీరు ద్వేషిస్తున్న వ్యక్తిలో కూడా భగవంతుడున్నాడన్న విశ్వాసాన్ని స్ఫురణకు తెచ్చుకుంటే, అదే నిజమైన సాధన కాదా? మీరే చెప్పండి. నిజాన్ని ఒప్పుకోండి.

*3. నీవెవరవు?*

జ. నీవు సాక్షివి. కేవల సాక్షివి. స్వయంప్రకాశానివి. నిత్యసత్యానివి. ఆత్మవు. సాక్షివైన నీవు సాక్షిగానే వుండు.

*4. ఇంద్రియగోచరమయ్యే ఈ స్థూలశరీరం ఎలా ఏర్పడింది?*

జ. పంచభూతాలు పరమాత్మనుండి సూక్ష్మభూతాలుగా వచ్చినవి. అవి పంచీకరణం చెంది స్థూలభూతాలుగా మారుతాయి. ఈ స్థూలభూతాలతోనే ఈ స్థూలదేహం ఏర్పడ్డది. ఎముకలు మొదలైన గట్టి పదార్థాలు భూమికి సంబంధించినవి. రక్తం, చీము మొదలైనవి జలసంబంధమైనవి. శరీరంలోని ఉష్ణోగ్రత అగ్ని సంబంధమైనది. ఉచ్ఛ్వాసనిశ్వాసలతో బయటగాలి లోపలికి, లోపలి గాలి బయటకు వస్తుంది. ప్రాణంగా మారే ఈ గాలియే వాయు సంబంధమైనది. మీరు తిని త్రాగే పదార్థాల కొరకు లోపల వుండే ఖాళీ ప్రదేశాలు (వ్యాక్యూమ్) ఆకాశ సంబంధమైనది. ఇలా పంచభూతాలనబడే మహాభూతాలతో ఈ స్థూలశరీరం వచ్చింది. ఇందులో మీది అనబడేది ఏది? దీనిలో నుండి ఎవరు ఏది దొంగిలించారు? దేనికి ఈ కోపతాపాలు, అసూయాద్వేషాలు? మా వస్తువులు వాడుకుంటూ, ప్రక్కనున్న మా మీదనే కోపాన్ని, ద్వేషాన్ని, అసూయను ప్రదర్శిస్తున్నారా? ఆలోచించండి! ముందుకు వెళ్ళండి, ఆగవద్దు! భయంకరమైన నిజమిది!

***ఈ సృష్టిలో వున్న ప్రతి జీవియందు ఆత్మ వున్నది***
***దానిని మీరు గౌరవిస్తే, అది మిమ్ములను గౌరవిస్తుంది.***
***మహాజ్ఞానులు, మహర్షులు, మహామునులు, జ్ఞానవృద్ధులు వారందరూ దేవతలే***
***వారందరూ గౌరవనీయులే. వారిని నిందించి నిరసించిన యెడల***
***అవ న్నీ మీరు చేసిన పాపాలై, ఫలితంగా మీ పాలిట శాపాలై,***
***మీకు ఇహజన్మలోనే పాపకర్మఫలాలై అనుభవించేలా చేస్తాయి.***
***అలాగాక, వారిని గౌరవిస్తే కలిగే ఫలితాలు***
***వారి నుండి మీరు గౌరవం పొందటమే గాక, వారి నుండి శుభాశీస్సులు పొందుతారు***
***అదే భాగ్యం, సౌభాగ్యం, పుణ్యలాభం***
***మరి అటువంటి లాభాన్ని పొందుతారా?***
***పరమాత్మ ఆశీస్సులు కావాలా? శాపాలు కావాలా?***
***అహంకారులై పరమాత్మను గౌరవించకుండా అగౌరవాన్ని అందించాలా?***
***నిర్ణయం తీసుకోండి. తీసుకుని ఏం చేయాలో ఆ విధంగా అప్పుడైనా, ఇప్పుడైనా చేయండి***
***ఏం చేయాలో నిర్ణయం మీదే అని ఈ నిరంజనుడు చెబుతున్న నిత్యసత్యాలను***
***మదిలో నిలుపుకుని, మారుతాత్మజులై, మంచిని ఎంచుకుని ముందడుగు వేయండి***
***నా చిన్నారి ముద్దుబిడ్డలారా!***

ॐ

**20-01-2019** 10:00 AM

ఇప్పటి ఈ విషయం, ఒకసారి నా రామునికి – నాకూ మధ్య జరిగిన సంఘటన. చెప్పాలని అన్పించింది. ఎందుకో మీరు అర్థం చేసుకోండి చాలు! ఒకసారి రాముడు "నాతో వస్తావా?" అన్నారు. "వస్తావా? అని పిలిస్తే రాకుండా వుంటానా? అలాగే స్వామీ!" అన్నాను. స్వామిననుసరించి, వారితో వెళ్ళగా, ఎన్నెన్నో ఉపదేశాలు, వింత లీలలు, ఒక ఆశ్రమంలో కూర్చుని ఎంతోమంది సాధకులకు ఎన్నెన్నో సాధనోపదేశాలు అందించుట. "ఏదైనా అడగండి!" రామాదేశం. ఎవ్వరు మాట్లాడలేదు. కేవలం దర్శనానికే పరిమితమై, సుందరరూపుడ్ని, ధవళవస్త్రధరుడ్ని, నవయవ్వనశోభాలంకృతుడ్ని చూసేందుకే చూపులు చాలడం లేదు. ఇక అడిగేందుకు ఎవరికి మాత్రం మాటలు వస్తాయి? కానీ, రాముడు తానే అడిగించుకుని ఉపదేశించే శక్తిమంతులు కాబట్టి, "నీవు అడుగు" అని నన్ను ఆదేశించగానే, నా స్వామి ఏమి అడిగించదల్చుకున్నారో అని అడిగాను, "స్వామీ! ఆధ్యాత్మిక సాధన అనగా ఏమిటి?" అని అడిగినాను. దానికి రామయ్య చిరునవ్వు నవ్వి, "లేటు వయస్సులో లేటుగా అడిగినా, మంచి ప్రశ్న అడిగినావు" అని చమత్కరించి, "నీ మొహం. ఆధ్యాత్మిక సాధన ఏమిటి? ఆధ్యాత్మిక సాధన, లౌకిక సాధన అదీ ఇదీ లేదు. వున్నదొక్కటే సాధన. ఆదే సాధన!" అని అన్నారు. నా అజ్ఞానపు ప్రశ్నకు సిగ్గుపడి, "అదే స్వామీ, సాధన అంటే ఏమిటి?" అని అడిగాను. "సాధన అంటే క్రమం తప్పకుండా నియమంగా ప్రతినిత్యం ప్రయత్నం సాగించుట" అని విడమర్చి చెప్పారు. "ప్రతిరోజూ భజనకు వెళ్ళడం, సాధనేనా స్వామీ?" అని అడిగాను. "అయితే, ప్రతిరోజూ భజనలకు వెళ్తున్నావా? భజనలకు వెళ్ళి మనసును ప్రతిచోటా త్రిప్పుతున్నారు. అది కాదు భజన. ఉదా:– బ్రాహ్మణులు త్రికాలాలలో సంధ్యావందనం చేయాలి. ఉపనయన యోగ్యత కలవారు ఏకకాలం సంధ్యావందనం చేయాలి. మూడు కాలాలలో సంధ్యావందనం అది అసాధ్యమని నా సందేహం. ఎందుకు సాధ్యం కాదు? ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం పది నిముషాలు మనసును గాయత్రి మంత్రజపం వైపు త్రిప్పలేవా? నడుస్తూ వేరే పనులు చేస్తూ చేసేది జపం కాదు. నామస్మరణం కాదు. అది కేవలం కాలాన్ని పవిత్రం చేస్తుంది. దేహాన్ని పవిత్రం చేసేది సాధన. దానిలో మనస్సు, కర్మ ఏకత్వం కావాలి!". "పవిత్రం అంటే ఏమిటి స్వామీ?" "పవిత్రం అంటే, ఇంత చిన్నదాన్ని పెద్దదాన్నిగా చేసుకోవడం. సంకుచితం నుండి విశాలత్వం చెయ్యడం. నీ మనస్సు పవిత్రం కాలేదు కానీ, నిలకడ అయింది. ఎదురుగా వున్న వ్యక్తినుద్దేశించి, అతని మనస్సు పవిత్రం అయింది. కానీ, నిలకడ కాలేదు. మనస్సు పవిత్రం అయితే నిలకడ అవుతుంది. రెండూ వుంటే, అదే సాధనా లక్ష్యం. ఇంకా అర్థం కాలేదా? ఏర్పర్చుకున్న లక్ష్యానికి చేరడానికి చేసే ప్రయత్నమే సాధన. అది ఏ లక్ష్యమైనా కావచ్చు. ఇష్టంతో చేస్తే కష్టం అన్పించదు. ప్రయత్నంలో ఇష్టత ఏర్పడాలి. కాయాన్ని పవిత్రం చేయగల లక్ష్యాన్ని ఎన్నుకోవాలి. కేవలం కాలాన్ని కాదు. దానికి ఏ పేరైనా పెట్టుకో. అందరికీ రుచించటంలేదు. ఔషధం చేదు కదా!" అంటూ లేచి వెళ్ళసాగారు. నేనూ వారిని అనుసరించాను. ఒకదారిలో వెళ్తూ ఆగిపోయారు. నన్ను చూసి "ఇక ఈ దారిలో నేను వెళ్ళను" అన్నారు ముందువైపు దారి చూపుతూ. అక్కడ ఒక్కటే దారి. ముందుకు వెళ్ళకపోతే, తిరిగి వెనుకకు వెళ్ళాలి. ఆయన

*వెనుకకు తిరుగుతారని అనుకుని ప్రక్కకు జరిగాను. నా ఉద్దేశ్యం కనిపెట్టిన స్వామి, దారి మధ్యలో నిలుచుని చేతులు రెండు వైపులా చాచారు. రెండు ప్రక్కలా రెండు దారులు ఏర్పడ్డాయి. స్వామి నిల్చున్న స్థలం నాలుగురోడ్ల కూడలి అయింది. నేను ఆశ్చర్యంగా చూస్తున్నాను. నాలుగురోడ్ల కూడలిలో అప్పటికప్పుడు ఏర్పడ్డ గద్దె మీద కూర్చుని నన్ను కూర్చోమన్నారు. "నాలుగు దారులు. నీవు ఏ దారిలో వెళ్తావు?" అని ప్రశ్నించారు. నాకు ఏమీ అర్థం కాలేదు. ఏ దారిలో వెళ్ళాలి? అన్న సందిగ్ధము. స్వామి లేచి వచ్చిన దారిలోనే నాలుగడుగులు వేశాను. "స్వామీ! ఈ దారిలో వెళ్ళనన్నారు గదా?" అన్నాను. స్వామి చిరునవ్వు చిందిస్తూ, "ఒక్కసారి ఈ దారిని చూడు!" అన్నారు. అంతకు ముందు ఎండిపోయి, వాడిపోయి, కీకారణ్యంలా వున్న చెట్లు, చక్కగా పుష్పించి, ఫలించి అందమైన ఉద్యానవనంగా మారింది. ప్రతి చెట్టుకూ పండిన పండ్లు విరివిగా వున్నాయి. అందమైన పూవులు ఆహ్లాదకరమైన ప్రకృతి. స్వామి చూస్తూ, "నేను రానంటే ఈ దారి ఏడుస్తూ ఎండిపోయింది. నేను అడుగులు వేస్తూ వుంటే, సంతోషంతో నిండిపోయింది" అన్నారు. "స్వామి వస్తే పచ్చగా పండుతుంది, స్వామి రాకపోతే ఎండుతుంది" అన్నారు. ఆ మాటలో అంతరార్థం అర్థమయింది. స్వామిని మన జీవితాలలోకి ఆహ్వానించామా, మన బ్రతుకు పచ్చదనంతో పరవశిస్తూ, నిండుగా వుంటుంది. మనం స్వామికి దూరమయ్యామా, మన జీవితాలు ఆకులు రాలిన అడవిలా ఎండిపోతుంది. ఆశ్చర్యంగా చూస్తున్నాను. "జామచెట్లు, మామిడిచెట్లు, రకరకాల చెట్లు రారమ్మని పిలుస్తున్నాయి. వెళ్ళి ఒక పండు కోసుకో" అన్నారు. ఏ పండు కోసుకోవాలి? మళ్ళీ సందేహం. "మామిడిపండు కోసుకో" అన్నారు. నేను మామిడిపండు కోసుకొని, దాని సుమధుర పరిమళానికి, అందానికి ఆశ్చర్యంగా చూస్తున్నాను. స్వామి వెంటనే, "నువ్విక్కడ వుండు, నే వెళ్ళొస్తాను" అన్నారు. అంతే మాయం! ఇది సాయిరాముడు తన ప్రియపుత్రుడైన ఈ ఆంజనేయునికి ఒసగిన వరం. కలవరం, 'కల' వరం!*

***కనిపించు దృశ్యంబులు కమలాక్ష నీలోని అణువు అయితే వాడనయ్యా!***
***అనిపించు భావము అక్షయా! నీదైతే భావగ్రాహ్యత నాకు పట్టుబడునా!***
***తలపించు రూపాలు దైవమా నీదైతే చూడ నా కన్నులు చాలవయ్యా!***
***విలపించు ప్రార్థనల్ విశ్వేశ నీవైతే మాటొక్కటైన నా నోట రాదు***
***వరియించు సేవలు హరిహరా నీవైతే అర్పించు సేవ నాకలవియగునా!***
***అంతటా అన్నిటా అలరారు శ్రీరాముండే సత్యసాయియైయుండ చోద్యమగును***
***నేను నీలోన నీవు నా మేనులోన ఒక్కటై యుండ వేరొండు లెక్కసేయ తగునా***
***ఏకాత్మతాభావమిద్ది పరగ పరిపూర్ణమే కదా***
***పవనకుమారుని భావమిది పరిపూర్ణముగా స్వీకరించి***
***స్వీయానుభవాలతో, స్వీయ సంస్కరణలతో***
***సదా నిన్ను చేరి సుఖించుట ఈ బిడ్డల పని***
***ఈ బిడ్డలను అందుకుని ఆశీర్వదించు స్వామీ అంటూ ప్రార్థించి***
***పయనమునకు సిద్ధంకండి***
***నా చిన్నారి బిడ్డలారా!***

ఓం

**21-01-2019** 10:30 AM

**83) జీవితంలో ఎదురయ్యే సుఖదుఃఖములను ఏ విధంగా భావించాలి స్వామీ?**

*ఈశ్వరుడి యొక్క సృష్టిలో ఒకటి ఎక్కువా కాదు, మరొకటి తక్కువా కాదు. ఆయన దృష్టి ఎప్పుడూ సమానంగానే వుంటుంది. ఎందుకంటే, ఆయన మనుషుల వంటివారు కాదు కదా భేదం చూపించటానికి, వ్యత్యాసాన్ని కనబరచటానికి. ఆయన అందరిపట్ల ఒకే విధమైన ప్రేమాభిమానాలను కలిగి వుంటాడు. మరి భేదం ఎక్కడ వుంది? ఎందుకని మానవులు దుఃఖాన్ని, సంఘర్షణలను, బాధలను అనుభవిస్తున్నారు? కొందరి జీవితంలో సుఖాలను, ఆనందాలను ఆస్వాదిస్తున్నారు. ఇంకొందరి జీవితాలయితే వారి జీవన పర్యంతం కూడా సంఘర్షణల నడుమనే బ్రతుకులను కడవరకు కొనసాగిస్తున్నారు. ఎక్కడ వుంది వ్యత్యాసం? భగవంతుని సృష్టిలోనా? లేక మీ ఆలోచనా దృక్పథంలోనా? భేదం అనేది ఆయన సృష్టిలోనూ లేదు, ఆయన ఉద్దేశ్యంలోనూ లేదు. కేవలం ఆ వ్యత్యాసం మీ మనసు నుండి వచ్చిన ఆలోచనలోనే వుంది. ఎందుకంటే, సుఖాలు, దుఃఖాలు మనిషి బ్రతుకుబండికి రెండు చక్రాలలాంటివి. ఏ ఒక్కటి లేకపోయినా, ఆ బ్రతుకుబండి సాఫీగా కొనసాగలేదు. సుఖమైనా, దుఃఖమైనా అది శాశ్వితంగా వుండిపోదు. అవి వస్తూంటాయి, పోతూంటాయి. కానీ, ఇలాంటి పరిస్థితులలో మీ బాధ్యత ఏదైనా వుందంటే, అది కేవలం మీరు వాటిపై ఏ విధంగా స్పందిస్తారన్నదే. ఇదే మీ యొక్క బాధ్యత అవుతుంది. ఏ ఒక్కరి జీవితం కూడా సుఖదుఃఖాలకు అతీతం కాదు. ప్రతి ఒక్కరూ వీటిని స్వీకరించవలసినదే. అయితే, వీటిని అనుభవం చెందుతున్నప్పుడు, మీరు రెండింటిపట్ల సానుకూలంగా స్పందించవలసి వుంటుంది. సుఖాన్ని పొందినప్పుడు సంతోషంగానూ, దుఃఖాన్ని పొందినప్పుడు విచారంగానూ కాకుండా రెండింటినీ సమతాదృష్టితో చూచినప్పుడు మాత్రమే వారి జీవితం ప్రశాంతతకు నిలయంగా మారిపోతుంది. ఒకవేళ మీ జీవితాన్నే విధ్వంసం చేయగల కష్టమే వస్తే కూడా మిమ్మల్ని రక్షించటానికి ఆ భగవంతుడు తప్పక సహాయం చేయగలడు. ఎందుకంటే, ఎవరి హృదయం దుఃఖంతో నిండి వుంటుందో, ఎవరి మనసు సంఘర్షణల నడుమ నలిగిపోతుంటుందో అలాంటివారి విజ్ఞాపన ఆ భగవంతుడు తప్పక వింటాడు. వారి దుఃఖకరమైన పరిస్థితుల నుండి శీఘ్రమే వారిని బయటకు తీసుకురాగల శక్తిసామర్థ్యాలు ఆ భగవంతునికి మెండుగా వున్నాయి.*

***నేనే నీవని నీవు అన్నంత మాత్రాన***
***నేనెవరో నీకు తెలియంగరాదే***
***(మిమ్ములను దృష్టిలో పెట్టుకుని చెబుతాను)***

***నీవే నేనని నీవు అన్నంత మాత్రాన***
***నీవెవరివో నాకు తెలియంగరాదే***
***నేనెవరినో నాకు తెలియనే తెలియదు***
***నిన్ను తెలియంగ నా తరమౌనా స్వామీ?***

***నా శరీరము నేను కానే కాదంటివి***
***సత్కర్మలను చేసి సద్గతిని పొందుటకు***
***సహకరించే సాధనమ్ము ఈ దేహమ్ము***
***నాది నాదని విర్రవీగిననాడు***
***నాదేమీ లేదని తెలియచేశావు***
***నీవే సర్వంబని నాకు తెలిసినదిపుడు***
***తెలుసుకోదగినది తెలుసుకుంటినిపుడు***
***నా ప్రయాణము కొనసాగించుటకై***
***కొసరి కొసరి వడ్డించు ఆంజనేయుడు***
***అతి సమీపమున వచ్చినాడు***
***వచ్చిన వారిని గట్టిగా పట్టుకుని***
***పట్టు సడలక పరుగులంఘించుకుని, పరమాత్ముని పెన్నిధి అందుకొందుము***
***హనుమ చిన్నారి బిడ్డలమైన మేము***

ॐ

**30-01-2019** 10:20 AM

**84)** విగ్రహారాధన యొక్క అంతరార్థం ఏమిటి స్వామీ?

*ఇది ఒక పుష్పము అని వ్రేలు చూపుతున్నది. ఇది ఒక టంబ్లర్ అని వ్రేలు చూపుతున్నది. చూపేంత వరకు మాత్రమే ఆ వ్రేలు. ఆ పుష్పమును చూచిన తర్వాత మీ దృష్టి వ్రేలుపై పోదు. అదే విధముగనే ఈ విగ్రహములన్నియూ మీ వ్రేలుతో చూపించినట్లుగా అవి అన్నియూ దైవాన్ని చూపుతాయి. దైవాన్ని చూపిన తర్వాత ఈ విగ్రహాలు మీకు అక్కరలేదు. దైవాన్ని నిరూపించేటటువంటివే ఈ విగ్రహములు. కనుక, ఇట్టి మూర్తులను విస్మరించరాదు. మీ తల్లిదండ్రుల, తాతల, ముత్తాతల ఫోటోలు ఇంటిలో వుంచుకుని ఆరాధించటం పరిపాటే. కానీ, ఈ చిత్రములలో చైతన్యము వున్నదా? లేదు. కానీ, వాటిని పూజించటంలో వున్న అంతరార్థం ఏమిటి? ఆ చిత్రాలలోనివారు అనేక విధములైన ఉత్తమ ఆదర్శాలను మీకు అందించిపోయారు. కనుక ఆరాధిస్తూ వస్తున్నారు. నూరు రూపాయలనోటు వున్నది. అయితే, దానిలో చైతన్యము వున్నదా? లేదు. దానిలో ప్రేమ వున్నదా? లేదు. చైతన్యం, ప్రేమ లేని దానిని మానవుడు ఎందుకు ప్రేమిస్తున్నాడు? నూరు రూపాయల నోటును ద్వేషించేవాడు జగత్తులో కానరాడు. ఏ ప్రాంతీయుడుకానీ, విదేశీయుడుగానీ, ఏ కాలంలో వారైనప్పటికీ ధనమునాశించేవారేకానీ, దానిని నిరోధించేవారే లేరు. దీని మహత్వమేమిటి? దీని విలువ ప్రభుత్వముద్రయే దీని విలువ పెరగటానికి, విగ్రహారాధన మూఢత్వము అని భావిస్తున్నారు. అదియే నిజమైనటువంటి మూర్తిని దర్శింపచేసేది. ఇది పుష్పము అని వ్రేలు చూపిస్తున్నది కనుక, చూపించేది వ్రేలు, చూపబడేది పుష్పము. అదే విధముగా చూపించేది విగ్రహము, చూపించబడేటటువంటిది దైవము. కనుక, దైవం అనేటటువంటి విగ్రహాన్ని*

మీరు ఏమాత్రం విస్మరించరాదు. నీ దృష్టిలో అది జడముగా కన్పించవచ్చును. క్షీరంలో మీకు వెన్న కన్పిస్తుందా? లేదు. కానీ, ఆ క్షీరమును పెరుగుగా చేసి, దానిని చిలికినపుడు వెన్న లభ్యమవుతుంది. ఆత్మ కనిపించలేదే అనుకుంటే చాలా పొరపాటు.

**85) మేము ఆచరించవలసిన విలువలు ఏవి స్వామీ?**

ప్రేమను పెంచుకోండి. విస్మరిస్తే, మీరు మరణించిన వారితో సమానము అవుతారు. సత్యం నాలుకకు ప్రాణం. ధర్మం చేతికి ప్రాణం. అహింస హృదయానికి ప్రాణం. కనుక, వీటిని రక్షించుకోవాలి. 'శివ' అంటే అణకువ, వినయం. అహంకారమనేటటువంటి శవంను మీరు ఆశ్రయిస్తున్నారు. వినయ విధేయతలతో కూడిన 'శివం' ను మీరు ఆశ్రయించుట లేదు. హృదయాన్ని రంజింపచేయకుండా ప్రజలను రంజింపచేసి, ప్రయోజనమేమిటి? సాధ్యమైనంత వరకు ఇతరులను బాధించకుండా చూచుకోండి. ఒకవేళ మీకు బాధ కల్గినా ఫరవాలేదు. నీ బాధలను భగవంతుడు వైతొలగిస్తాడు. మీకై మీరు మాత్రం ఇతరులకు బాధ కల్గించకండి. ఇతరుల మంచిని చూచి ఆనందించండి, సంతోషించండి. అపుడు మీరు ఆనందాన్ని పొందగలరు, సుఖాన్ని అనుభవిస్తారు. మీరు చెయ్యవలసిన దానిని చెయ్యకపోతే, అపకీర్తి పాలవుతారు. అప్రతిష్ఠ కన్నా మరణమే మేలు. ఎందుకనగా, ఏ రంగములోవారైనా ఎవరికి నిర్దేశించిన పనిని వారు నిస్స్వార్థంగా చెయ్యాలి. స్వార్థబుద్ధితో చేసి అపకీర్తిని పొందేదాని కన్నా మరణించటమే మంచిది. మీకు నిర్దేశించిన పనులను మాత్రమే చెయ్యండి. పరుల పనులు మీకనవసరం. జీవితంలో వచ్చే కష్టనష్టములకు క్రుంగిపోవద్దు. తృప్తిగా జీవించటం నేర్చుకోవాలి, ఆనందంగా బ్రతకటం నేర్చుకోవాలి.

***ఏదైనా పని కాలేదంటే, అంటే సఫలం కాలేదంటే, నీవు కోరుకున్నది దక్కలేదంటే,***
***నిరాశపడవద్దు, బాధపడవద్దు.***
***విశ్వం నీ కోసం అంతకంటే మంచిది ఇవ్వాలనుకున్నది***
***నీవు ఆశించిన దానికంటే మెరుగైనది ఇవ్వాలనుకుంది***
***అందుకే నీవు ఆశించినది కాలేదు.***
***నీకు తెలుసా ఈ విశ్వరహస్యం? నీవు చేజార్చుకున్న వాటి కన్నా***
***మంచివి, మెరుగైనవి ఏవో నీ కోసం ఎదురు చూస్తున్నాయన్నది అర్థం.***
***అందుకే గతంలో మీరు కోరుకున్నవి అందలేదు***
***ఇంకా మేలైనవి నీకోసం ఎంపిక చెయ్యబడి వున్నాయి***
***నీకోసం అవి ఎదురు చూస్తున్నాయి. వాటికోసం నిరీక్షించు***
***ఆశావాదంతో ముందుకు ఉరుకు***
***మెరుగైనది సాధించాలి, మంచి మనిషిగా జీవించాలి***
***మారుతి బోధలు మానసిక చైతన్యాన్ని ఇవ్వాలి***
***అప్పుడే మనసు పరిపక్వమై పవనకుమారుని చేరి సుఖింతురు***
***నా చిన్నారి బిడ్డలారా!***

ఓం

**31-01-2019** 10:30 AM

**86) అంతర్యామిని గుర్తించేది ఎలా స్వామీ?**

*శాస్త్రములన్నీ మానవుడు దివ్యాత్మస్వరూపుడని, భగవంతుడు మీలోనే వున్నాడని చెబుతున్నాయి కదా! మరి మీలోపలే వున్న భగవంతుని, ఆ దివ్యతత్త్వాన్ని మీరు ఎందుకు గ్రహించలేకపోతున్నారు? మీ అనుభవంలోకి ఎందుకు తెచ్చుకోలేకపోతున్నారు? ఒక భారతీయుడు ఫోన్ చేసే ఉద్దేశ్యంతో అమెరికాలో వున్న ఒక టెలిఫోన్‌బూత్‌లోకి ప్రవేశించాడు. టెలిఫోన్ డైరక్టరీ కోసం చూశాడు. అది ఒక చైన్‌కు కట్టివేయబడి వుంది. లోపల లైటు వెలగటం లేదు. అంతా చీకటిగా వుంది. ఆలోచిస్తున్నాడు. ఇంతలో రోడ్డుమీద నడుస్తున్న ఒక అమెరికన్ ఇతనిని చూచి, టెలిఫోన్‌బూత్ తలుపు క్లోజ్ చేస్తే, లోపల లైటు వెలుగుతుంది అని చెప్పి వెళ్ళిపోయాడు. అది విని తలుపు క్లోజ్ చేశాడు. వెంటనే లోపల లైటు వెలిగింది. ఫోన్ చేసి బయటకు వచ్చాడు. కానీ, అతను ఆలోచనలో పడ్డాడు. ఎంతటి విచిత్రమైన అనుభవం! బయట తలుపు క్లోజ్ చేస్తే, లోపల లైట్ వెలిగింది. అంటే, లోపల లైటు, బల్బు ఏర్పాటు చేసే వున్నాయి. కానీ, స్విచ్‌కి తలుపుతో సంబంధం వుంది. లైటు వెలగాలంటే, మీరు ఏమీ చేయనక్కరలేదు, తలుపు క్లోజ్ చేస్తే చాలు, లైటు దానంతట అదే వెలుగుతుంది. దీని అంతరార్థం ఆలోచించాడు. మీలోనే వున్న భగవంతుడనే వెలుగును చూడాలంటే బయటి ప్రపంచం యొక్క తలుపులు మూసివేయాలి. మీరు బాహ్య సంబంధమైన చాలా చిన్న చిన్న విషయాలలో కూడా చిక్కుకుపోయి వుంటారు. అందుకే మీలోనే వున్న భగవంతుడనే వెలుగును గ్రహించలేకపోతున్నారు. అంతే కదా! మీరు కాలమంతా మీ చుట్టుప్రక్కల వున్న ఇండ్ల గురించి ఆలోచిస్తుంటే, మీ ఇంటి గురించి ఆలోచించటానికి సమయమే వుండదు. అయితే, సత్సంగం ద్వారా, సత్సాంగత్యం ద్వారా మీలోనే ఆ వెలుగునిచ్చే బల్బు వుందని తెలుసుకుంటారు. కానీ, దానిని వెలిగించే స్విచ్ ఎక్కడ వున్నది అని మీరు గ్రహించలేకపోతున్నారు. ఆ స్విచ్ బయటి ప్రపంచంలో మీకు కనిపించదు. ఎందుకంటే, ఆ స్విచ్ మీ లోపలే వున్నది కాబట్టి. అంటే, మీరు ఈ బాహ్యప్రపంచాన్ని చూసే తలుపుకి వెనుకవైపు వున్నది. ఎప్పుడైతే ఈ తలుపులు మూసివేస్తారో, అప్పుడు ఆ స్విచ్ ఆన్ అయి, లైటు వెలుగుతుంది. మీ కళ్ళు, ముక్కు, చెవులు, నోరు ఇవి అన్నీ తలుపులు. ఇవి ఎప్పుడైతే మూసుకున్నావో, బాహ్యప్రపంచం కనుమరుగవుతుంది. అపుడు మీకు లోపలవైపు చూడటం అలవాటవుతుంది. అందుకే కళ్ళు మూసుకుని దైవాన్ని ప్రార్థిస్తారు. అంటే ఎదురుగా వున్న దేవుడు మీలోనే వున్నాడని తెలుసుకునేందుకే. దీనినే అంతర్ముఖం లేదా అంతర్‌దృష్టి అంటారు. అంటే, మీ ఇంద్రియాల ద్వారా ఈ ప్రపంచంతో ఎంత ఎక్కువ సంబంధం పెట్టుకుంటే భగవంతునికి అంత ఎక్కువ దూరం అవుతారు. అందుకే దీనిని పిల్లలు ఆడుకునే SEE-SAW, బల్లతో పోల్చవచ్చు. ఒకవైపు బరువుగా కూర్చుంటే, రెండోవైపు పైకి పోతుంది. అంటే ఒకవైపు పైకిపోతే, రెండవ వైపు క్రిందికి వస్తుంది.*

**87) ఈ బాహ్యప్రపంచాన్ని భగవంతుడే సృష్టించాడు కదా. మరి దీనితో మేము ఏ విధమైన సంబంధం**

**పెట్టుకోకూడదా? మా ఇంద్రియాలను మూసివేస్తే, ఈ ప్రపంచాన్ని ఏ విధంగా అనుభవించగలం స్వామీ?**

*మీరు ఇంద్రియాలనే తలుపులను క్లోజ్ చేయనక్కరలేదు. భగవత్సృష్టిని మీరు అనుభవించవచ్చు. కానీ, దానికి ముందుగా మీరు ఒక పని చేయాలి. మీ లోపలి దివ్యజ్యోతిని వెలిగించే స్విచ్‌ను గ్రహించి, దానితో మీ లోపలి దివ్యత్వమనే జ్యోతిని వెలిగించి, ఆ వెలుగులో ప్రపంచంలోని అన్నింటినీ అనుభవించవచ్చు. మీరు ఈ జడమైన శరీరం కాదని, సాక్షాత్తూ భగవంతుని స్వరూపులనే ఎరుకతో వుండటమే మీలోని జ్యోతిని వెలిగించటం. నేనే కాదు, మీరందరూ దైవస్వరూపులే. ఆ ఎరుకతో వున్నప్పుడు, ఈ ప్రపంచంలోని సంబంధ బాంధవ్యాలన్నీ మీకు ప్రతిబంధకాలు కావు. అవి అన్నీ సత్సంబంధాలుగా, సత్సాంగత్యాలుగా మారతాయి. భగవంతుని స్మరిస్తూ చేసే ప్రాపంచిక పనులు కూడా భగవంతుని పూజగా మారిపోతాయి. కనుక, మీరు ప్రపంచాన్ని వదిలిపెట్టవలసిన పని లేదు. ప్రపంచంలో కూడా పరమాత్ముని దర్శించటమే నిజమైన ఆధ్యాత్మికత.*

***టెన్షన్ టెన్షన్ టెన్షన్ టెన్షన్ టెన్షన్***
***నేడు ప్రతిమనిషి జీవితంలోనూ శ్వాసతోపాటే వుంటుంది.***
***నడకలతో సాగే ప్రయాణాన్ని పరిగెత్తింపచేస్తూ***
***పాలందుకొమ్మని, వున్న నీళ్ళను పారబోసుకునేలా చేస్తుంది టెన్షన్***
***చేసే పనిలో ఆనందమొందక, ఆనందమిచ్చే పని చేయలేక***
***మనసుకు, మనిషికి జరిగే అంతర్మథనం నుండి పుడుతూ***
***సకల మనో శారీరక అనారోగ్యాలకు కారణమవుతుంది టెన్షన్***
***దీనితో మనిషి మనిషిలా వుండలేక, ఏ పనీ చేయాలనిపించక***
***నిరాశ పెంచుకుని, నిస్తేజంతో జీవిస్తూ,***
***అన్నీ వుండి ఏదీ ఆనందాన్ని ఇవ్వలేక, తన బ్రతుకింతే అనుకునేలా చేసి***
***తనను తాను ఆహుతి చేసుకునేలా చేసి, తనకేమీ తెలియదన్నట్లు తప్పుకుంటుంది టెన్షన్***
***అందుకే***
***కాసింత శ్రద్ధ వహించి, తనకేది సప్పుతుందో ఎంచుకుని***
***ఈ ఆంజనేయుని సలహాలతో***
***జీవితాన్ని నిలబెట్టుకుని, తెలుసుకుని పాటిస్తే***
***పారిపోదా ఈ టెన్షన్?***
***అందుకే వుండండి అటెన్షన్!***
***ప్రేమే జీవితాన్ని అందంగా తయారుచేస్తుందని తెలుసుకుని,***
***అర్థం చేసుకుని ఆచరిస్తే, పారిపోదా ఈ టెన్షన్?***
***అందుకే వుండండి అటెన్షన్!***
***ఆంజనేయునికి అభిముఖమై***

***అందుకోండి ఆశీస్సులు సదా***
***నా చిన్నారి ముద్దుబిడ్డలారా!***

ఓం

**02-04-2019** 06:45 PM

**88) సమస్యలు ఎదురైనప్పుడు సాధకుడికి ప్రేరణ ఏ విధముగా దొరుకుతుంది స్వామీ?**

*సాధించాలనే తపనపడే లక్ష్యాన్ని చేరుకోవాలంటే, విద్యార్హతలు వుంటే సరిపోదు. ఎన్నో నైపుణ్యాలు కలిగివుండాలి. నిరంతరం బలాన్ని పెంచుకుంటూ బలహీనతలను దూరం చేసుకుంటూ వుండాలి. అపుడే కలలుకనే స్వప్నం వాస్తవరూపం దాల్చుతుంది. లేకపోతే, ఆశలు ఆవిరి అవుతాయి. కలలు కల్లలుగా మిగిలిపోతాయి. విజయసాధన కొరకు కృషి చేసేవారు నిరంతరం ప్రేరణ పొందుతూ వుండాలి. సానుకూల దృక్పథం, స్పందించే హృదయం వున్నవారికి ప్రేరణ త్వరగా లభిస్తుంది. మనస్సు అనే వీణపై ప్రేరణ అనే తంతువులను మీటుతూ వుంటే, ఉత్సాహం ఉరకలు వేస్తూ వుంటుంది. ఈ ఆంజనేయుని వెనుకా ముందూ ఇది దండిగా వుంది. దానిని గ్రహించండి. దానిలో సృజనాత్మకత వెల్లివిరుస్తుంది. సమస్యలు ఎదురైనప్పుడు, సమర్ధవంతంగా ఎదుర్కొనటానికి ఎప్పుడూ సిద్ధంగా వుంటారు. అందుకే గమ్యాన్ని చేరుకోవటానికి, చేరుకున్న తర్వాత రాణించటానికి ప్రేరణ ఎంతో అవసరం. స్పందించే హృదయం వుండాలే గాని, చెరువుగట్టు మీద పూచిన గడ్డిపువ్వు చాలు, మీలో ప్రేరణ జనించటానికి. మీ చుట్టూ వుండే పరిసరాలు, వ్యక్తులు నిరంతరం మిమ్మల్ని ప్రేరేపించుతూ వుంటాయి. వినే మాటలు, పాటలు, చదివే పుస్తకాలు, జ్ఞాపకాలు ఎన్నో ఎప్పుడూ మిమ్మల్ని ప్రేరణకు గురిచేస్తూ వుంటాయి. ఈ ఆంజనేయుడు చేసిన కార్యాలు, నడచిన వైనం, మీకు ఎప్పుడూ ప్రేరణను అందిస్తూనే వుంటుంది అన్నది నగ్నసత్యం. కొన్ని సమయాల్లో కుటుంబంలోని వ్యక్తులు, పరిస్థితులు కూడా మీకు ప్రేరణ కలుగచేస్తాయి. మీతో మీరు మాట్లాడుకున్నా అంతర్గత ప్రేరణ పొందవచ్చు. ఆ ప్రేరణ ద్వారా మీరు కార్యోన్ముఖులు అవుతారు. కాలమేదైనా, సమస్యలు ఎప్పుడూ వుంటాయి. లక్ష్యసాధనలో సమస్యలు ఎదురైనప్పుడు నిస్సత్తువ ఆవరిస్తుంది. నిరుత్సాహం కమ్ముకుంటుంది. ఆలోచనలు స్తంభిస్తాయి. సమస్య చిన్నదైనా పెద్దదైనా, పెనుభూతంలా కన్పిస్తుంది. ఏం చేద్దాం? అన్న ఆలోచన మీ మనస్సును తొలిచేస్తూ వుంటుంది. అదిగో, అప్పుడే విజయం కోసం కృషి చేసేవారికి ప్రేరణ ఎంతగానో అవసరమవుతుంది. సమస్య వెనుక సమాధానం ఎప్పుడూ వుంటుంది. ఆ సమాధానం కోసం ధైర్యంగా నిలబడాలి. వెతికి పట్టుకోవాలి. మీకంటే ముందే విజయం సాధించిన వ్యక్తుల అనుభవాల నుంచి మీకు జవాబు లభిస్తుంది. వారి అనుభవాలను, జ్ఞాపకాలను మీరు ఒడిసి పట్టుకోవాలి. వాటి ద్వారా మీరు ప్రేరణ పొందాలి. వారు ఎదుర్కొన్న సమస్యల ముందు మీ సమస్యలు చిన్నవిగా కన్పిస్తాయి. వారు అధిరోహించిన అడ్డంకులు మీకు ఎదగటానికి సోపానాలు అవుతాయి. చేరుకొన్న మైలురాళ్ళు మీకు ఉత్సాహాన్ని, ఉత్తేజాన్ని అందిస్తాయి. సాధారణంగా ఒక స్థాయికి చేరుకున్న వ్యక్తులు గడిచిపోయిన కాలానికి మెరుగులు అద్దరు, గొప్పల*

జోలికి పోరు. మనసు విప్పి మాట్లాడుతారు. వాస్తవాన్ని వివరిస్తారు. కాబట్టి, అట్టివారు చెప్పే మాటలు, వ్రాసే వ్రాతలు అన్నీ వాస్తవాలే అన్న సంగతి గుర్తించండి. మీకున్న అభిమానాన్ని త్యజించండి. అప్పుడే మీ సమస్యలు, మీకు కలిగే అవరోధాలు అన్నీ దాటలేని పెద్దపెద్ద శిఖరాలుగా కన్పించవు. ప్రేరణ పొందేటప్పుడు వుండవలసింది నిశితపరిశీలన, నిరంతర అన్వేషణ, స్వీకరించే మనస్తత్వం. అప్పుడే అనుభవజ్ఞుల నుండి నిజమైన ప్రేరణ పొందగలరు.

***వేలకు వేలు వెచ్చించి వేలమైళ్ళు పయనింతురు***
***పుణ్య నదులయందు స్నానమాచరించెదరు***
***వేలుపులనెందరినో వేడుకుని వేయివేయి ముడుపులు, కానుకలు చెల్లించుకుని***
***వ్యయప్రయాసలకోర్చి, వెతలు చెంది***
***కోర్కెలు తీర్చమని దేవుని కోరుటకన్నా,***
***ఆపదలో వున్నవారిని ఆదుకుంటూ, ఆపన్నులకు అభయహస్తమునిచ్చిన,***
***ఆకలి కడుపులకు అన్నం పెట్టిన, దీనముగానున్న దీనుల వెతలు తీర్చిన***
***వెన్నంటి వుండు వీరాంజనేయుడు***
***వీనుల విందుగా నామస్మరణ గావించుచూ***
***నిన్ను వదిలి, నన్ను పట్టుకొన్నచో***
***అట్టి వారిని కష్టాల కడలిని దాటించి,***
***వారి ఇష్టాలను ఎన్నింటినో తప్పక నెరవేర్చుతానని, నెట్టికంటి ఆంజనేయుడినై***
***భవసాగరము నుండి నెట్టి, ఆవలపడవేస్తున్న ఆంజనేయుని***
***అనుంగు ప్రేమపుత్రులైన***
***నా చిన్నారి బిడ్డలారా!***

ॐ

**03-04-2019** 08:15 AM

**89) సాధన ఎంతకాలం చేయాలి స్వామీ?**

సాధన అనేది కర్మ, భక్తి, జ్ఞానాల సమాహార స్వరూపమై వుండాలి. ఈ సాధన ఒక నిరంతర ప్రక్రియగా, జీవితపు తుదిశ్వాస వరకు కొనసాగుతూనే వుండాలి. దీనికి విరామం గానీ, విశ్రాంతి గానీ వుండవు. సూర్యునికి-సూర్యకిరణాలకు వుండే అవినాభావ సంబంధమే, సాధన-సాధకుల మధ్య కూడా వుంటుంది. సాధకుని ఏమాత్రపు ఏమరుపాటు కూడా అతనికి ప్రమాదం తెచ్చిపెడ్తుంది. ఎందుకంటే, బ్రతుకు అనే మహారణ్యంలో మనస్సనే పెద్దపులి ఎప్పుడూ పొంచి వుంటూ, ఏమాత్రం అవకాశం దొరికినా, సాధనాగోవుపై దాడి చేయాలని ఎదురుచూస్తూ వుంటుంది. అందువల్ల, సాధకుడు ఎంతో జాగరూకతతో వుండాలి.

## 90) కర్మ, భక్తి మరియు జ్ఞానమార్గములు వేరుగా అగుపించినా, గమ్యం ఒక్కటే కదా స్వామీ?

*కర్మ, భక్తి, జ్ఞాన విషయాలకొస్తే, ఈ మూడింటినీ భిన్నదృష్టితో చూడకూడదని, నిజానికి భాష పరిధిలో మూడుగా కన్పించే ఈ మూడూ భావపరిధిలో ఒక్కటే. ఉదాహరణకు మహానారాయణసేవలో పాల్గొంటున్నారనుకోండి, అలాంటి సమయంలో నేను వడ్డన చేస్తున్నానని, నేను వడ్డన చేస్తున్నది అన్నార్తుడైన వ్యక్తికి కాక సాక్షాత్తు నారాయణుడుకేనని, ఆ నారాయణుని వయోరూపాలను బట్టి నేను పదార్థాలను ఇంతింత మాత్రంగా వడ్డించాలని ప్రత్యేకంగా ఎవరూ అనుకుంటూ సేవలో పాల్గొనరు. కేవలం నేను భగవంతుని సేవలో పాల్గొంటున్నాననే అనిర్వచనీయమైన ప్రేమభావంతో హృదయం నిండిపోగా, సేవ అసంకల్పితంగా జరిగిపోతుందే తప్ప, ఆ క్షణంలో కర్మ, భక్తి, జ్ఞానాల ప్రత్యేకమైన ఉనికి అంటూ ఏమీ వుండదు. ఇదే నిశ్చలమైన భక్తి. ఇదే నిర్మలమైన ప్రేమ. అనుభూతిమయమైన ఈ నిశ్చలప్రేమను సాకారపర్చటమే పురుషోత్తమయోగం. సేవలో సాకారమవుతున్నప్పుడు, పారవశ్యం చెందిన హృదయం నామస్మరణలో నిమగ్నమై వుంటుంది. ఇదే జీవితపు ఆధ్యాత్మిక సౌందర్యం.*

## 91) నామస్మరణను సాధనగా ఎలా చేయాలి స్వామీ?

*నామామృత మాధుర్యములు, జీవితకళయు వేరు కాదు. నామామృత ఆంతరిక ఘోషకునూ, బాహ్యజీవిత కళకునూ సామరస్యమున్నది. భావమేమిటంటే, మీరు ఏ రూపనామాలను మీ అనుస్మరణమనే సాధనకు ఆధారం చేసుకుంటారో, ఆ రూపనామాలకు సంబంధించిన ఆదర్శాలు మీ జీవనగమనంలో సుస్పష్టంగా సాకారమవ్వాలి. అలా చేయలేనప్పుడు, మీరు చేసే సాధన యాంత్రికము, నిరర్థకము అని గ్రహించాలి. ఉదాహరణకు, ప్రతిరోజూ మీరు అష్టోత్తర శతనామావళిని చదవడం ఒక సాధనగా పెట్టుకున్నారనుకోండి. ఆ నామాలలో "ఓం శ్రీసాయి ప్రేమాత్మనే నమః, ప్రేమమూర్తయే నమః, శ్రీసాయి ప్రేమప్రదాయనమః" అనే మూడు నామాల ద్వారా వ్యక్తమవుతున్న అద్వితీయమైన ప్రేమతత్త్వాన్ని మీరు మీ ప్రవర్తనలో ప్రదర్శించలేనప్పుడు, ప్రతిబింబించలేనప్పుడు, మీ సాధన వ్యర్థమే కదా? అలాగాక, స్వామిని స్తుతిస్తున్నామనుకుంటే, అది స్వామివారి తత్త్వాన్ని స్వామికి గుర్తుచేయటానికి ప్రయత్నిస్తుట్లుగా వుంటుంది తప్ప వేరుగా వుండదు. బహుశా ఇది స్వార్థ వ్యర్థ సాధనాకోటికి చెందుతుందనటం అనుచితం కానేకాదు.*

## 92) నన్ను నేను ప్రేమించుకోవడం అంటే ఏమిటి స్వామీ?

*ఈ భూమండలంపై కోటానుకోట్ల మంది నివసిస్తున్నారు. ఈ అందరిలో కొంతమందిని మినహాయిస్తే, ఎక్కువమంది పేదరికంతోను, విద్యారాహిత్యంతోనూ, అనారోగ్యంతోనూ, రకరకాలైన అంగవైకల్యాలతోనూ చాలా బాధలు పడుతున్నారు. ఈ స్థితిలో వ్యక్తి తనను తాను ద్వేషించుకోవటం, దూషించుకోవటం చాలా సహజం కదా! అలాంటప్పుడు ఈ వ్యక్తి ఇతరులను ప్రేమించలేకపోవటం కూడా సహజమే కదా! ఇలాంటి పరిస్థితులలో కూడా ఎవరైతే తమ జీవితపు విధానం పట్ల సంతృప్తిని కలిగి వుంటారో, వారే తమను తాము ప్రేమించుకుంటున్నట్లు భావించాలి. అంటే, తమ జీవితాన్ని దైవదత్తంగా పరిగణించాలి. అంటే, శరణాగతి చేయడమన్నా, తనను తాను ప్రేమించుకోవడమన్నా*

ఒక్కటే అని గ్రహించాలి. ఈ మానసిక పరిపక్వత ఏర్పడిన తర్వాతనే ఇతరులనందరినీ ప్రేమించగలిగే సమతాహృదయం సాధించబడుతుంది. కానీ, దీనికి కూడా ఒక ప్రతిబంధకం లేకపోలేదు. అది నిరంతరం ఇతరుల మంచిచెడులను తర్కించే విపరీతబుద్ధి. అందుకే, అందరిలో మంచిచెడ్డలను విశ్లేషిస్తున్నంత కాలం, నువ్వు ఎవ్వరినీ ప్రేమించలేవు. సామాన్యంగా చాలామంది ఏ విషయానికైనా భాష్యాలు, నిర్వచనాలు చెబుతూ తమ మేధస్సును, జ్ఞానాన్ని ప్రకటిస్తారు. భగవంతుని ఆదేశాలను తు.చ. తప్పకుండా పాటించాలి. ఈ విషయంలో మీకు ఎట్టి స్వతంత్రతా లేదు. ఆయన ఆజ్ఞలను పాటించడమే మీ కర్తవ్యము. మీ తర్కము, తెలివితేటలు, మీ అనుకూలములు అనుసరించి భగవంతుని ఆజ్ఞలకు వ్యాఖ్యానము చెప్పటానికి ప్రయత్నించకండి. మీ జీవితంలో ప్రధమ కర్తవ్యం భగవంతుని సేవించడం. మిగిలిన విషయాలు, వ్యక్తులు అన్నీ ఆ తర్వాతనే. ఇప్పుడు మీకు లభించిన ఈ అవకాశాన్ని పోగొట్టుకుంటే, మీకు మరలా తిరిగి లభించటానికి కొన్ని జన్మలు పట్టవచ్చు.

***గురువు గురుడని గురుతుగా నెరిగిన శిష్యులకు కాంతిదాత అతడు.***
***శాంతి క్రాంతి ఆనంద మార్గదర్శిగాను, శిష్య శీలనిర్మాణ శిల్పి అతడు.***
***హృద్య నందనవన నిర్మాణ తోటమాలి***
***బాల్యమాదిగా జ్ఞానబీజాలు వేసి, మనసు మాలిన్యమరకలు తుడిచి,***
***జీవితధ్యేయానికి మార్గమును చూపు విశ్వకళా క్షేత్రంలో***
***విజ్ఞాన వీధులందు పరము చేరుసట్టి వివరంబు తెలిపి***
***విశ్వాత్ముని చేరు విజయపథమును చూపు గురువు అందుకే దైవమగును.***
***అందుకే ఈ ఆంజనేయుడు అందుబాటులోకి వచ్చి***
***అందించిన జ్ఞానసంపదను జాగృతం చేసి***
***జయజయ ధ్వానాలతో విజయపతాకమునెగురవేసి,***
***మిమ్ముల పాలించు పవనకుమారుని చేరి, ప్రయత్నపూర్వకముగా సుఖించండి***
***నా చిన్నారి ముద్దుబిడ్డలారా!***

ॐ

**04-04-2019** 09:05 AM

**93) మానవుడు ఆధ్యాత్మిక పురోగమనం సాధించాలంటే చాలా కష్టం. అది ఎందుకు స్వామీ?**

జీవితం పుట్టుక-మరణాల మధ్య కొనసాగుతుంది. కానీ, అనుభవం మాత్రం పుట్టుటకు ముందు ఎన్నో తరాల నుండి కొనసాగుతుంది. మరణం తర్వాత కూడా పొడిగించబడుతుంది. అనుభవించింది ఏదైనా సత్యమౌతుంది. మిగిలినదంతా ఊహకు సంబంధించి వుంటుంది. వాస్తవానికి అనుభవం ద్వారానే పరిణామం జరుగుతుంది. అటువంటి అనుభవం మనిషి పురోభివృద్ధికి దోహదపడితే, పురోగమనమవుతుంది. అలాకాక, బలహీనతలను పెంచితే, తిరోగమనమవుతుంది. ప్రస్తుతం తిరోగమనం

జరగటానికి మూలకారణం మనిషి ప్రకృతికి విరుద్ధమైన, అధర్మవంతమైన జీవితానికి అలవాటుపడటమే. ప్రకృతి సూత్రాలకు అనుగుణంగా జీవిస్తున్నప్పుడు, అది ఉపరితలపు అనుభవమవుతుంది. అందుకు విరుద్ధంగా జీవించేటప్పుడు, అది లోతైన అనుభవమవుతుంది. లోతైన అనుభవం నాడీవ్యవస్థను సమూలంగా బలహీనపరచి, ఆ వ్యక్తి ద్వారా విడుదల చేసే బీజాన్ని కూడా బలహీనపరుస్తుంది. అందునా, తిరోగమన విధానం లోతుగా, బరువుగా, భారంగా వుండి, త్వరగా కరిగిపోదు. మనిషి పురోగమనంలో వున్నంత వరకూ ఎటువంటి ఇబ్బంది కలగదు. అలాకాక, తిరోగమనానికి మళ్ళాడంటే, తాను బలహీనపడతాడు. దానిని తిరిగి బలోపేతం చేయడం బహుకష్టతరము. అందుకే గమనించండి. మానవులకు ఎన్నిరకాల బోధలు చేసినా, శిక్షణలను అందించినా, కేవలం ఉపరితలంలో తాత్కాలికంగా మార్పు వస్తుంది తప్ప, సమూలన ప్రక్షాళన జరిగే అవకాశమే లేదు. బండి ఒకసారి గాడి తప్పిందంటే, తిరిగి మామూలు స్థితికి రావటం బహుకష్టతరం. ఎందుకంటే, బలహీనపడటం చాలా సులభం. బలోపేతం కావటం అత్యంత కష్టం. కొండ ఎక్కడం చాలా కష్టము. జారిపడటం చాలా తేలిక. జారిపడితే, మామూలు స్థితికి రావటం ఇంకా కష్టము. అందుకే, నెగెటివ్ స్థితిలో వున్నవారు మామూలు స్థాయికి రావటానికి దశాబ్దాల తరబడి కాలవ్యవధి అవసరమవుతుంది. అంతేగాక, వారు విషయ పరిజ్ఞానాన్ని అర్థం చేసుకోవడం కూడా కష్టమే. ఒకవేళ అవగాహన కల్గినా, శరీరము, మనస్సు సాధనకు సహకరించవు. అయితే, అంతరంగం నుండి బలీయమైన సంకల్పముంటే మాత్రం, కొంతవరకు సాధ్యమవుతుంది. ప్రస్తుత పరిస్థితులలో మార్పును వాంఛించినా, పరిసరాల సహకారం లభించటం కష్టమే. ప్రపంచంలో ప్రాపంచిక విషయవాసనలతో విడరాని సంబంధం వున్నప్పుడు, మనసు అంతర్ముఖానికి మళ్ళడం చాలా కష్టం.

***ఈ పది వరాలను నీ మది వనరులను***

***పవిత్ర పది ఆజ్ఞలుగా భావించుకోండి. మీ జీవితంలో సదా వల్లెవేసుకోండి.***

***'నేను' అనే మాటను మరచిపోండి. 'మనము' అనే బాటలో నడవండి.***

***'అహం' అనే పదం అంతం చేసుకోండి. 'ప్రేమ' అనే ఫలాన్ని అందరితో పంచుకోండి.***

***'నవ్వు' అనే నగలు సొమ్ములు సదా ధరించండి. 'తప్పు' అనే నిప్పును సదా దూరంగా వుంచండి.***

***'విజయం' అనే గమ్యం కోసం నిరంతరం శ్రమించండి. 'ఈర్ష్య' అనే శత్రువును దూరంగా వుంచండి.***

***'విజ్ఞానం' అనే మిత్రుడ్ని సంపాదించుకోండి. 'స్నేహం' అనే వరంతో మనుష్యుల్ని అక్కున చేర్చుకోండి.***

***ఆంజనేయుని అభ్యున్నత మార్గం, అత్యున్నత శిఖరాలనధిరోహించి***

***ఈ నవజీవన రహస్యాలు మనిషికి సుఖజీవనసారాలుగా గ్రహించినట్లయితే***

***నీవే ఋషివి, మహామనిషివి, మరో మనీషివి అవుతావు***

***ఇది తథ్యం నా చిన్నారి బిడ్డలారా!***

ఓం

**11-04-2019** 10:25 AM

**94) మరణానంతరం జీవుడు ఏమవుతాడు స్వామీ?**

*ప్రతి ప్రాణికీ పుట్టుక-మరణాలనేవి సహజం మరియు అనివార్యం. మానవుడు కూడా అందుకు భిన్నమేమీ కాదు. అయితే, ఎక్కువ శాతం ప్రాణులలో మరణం తర్వాత వాని జీవచైతన్యం విశ్వంలో సునాయాసంగా కలిసిపోతుంది. మానవులు మాత్రం మరణాన్ని తీవ్రంగా వ్యతిరేకించటం వలన, జీవభావం ఇంకా మిగిలివుండి, కోరికలు, సంకల్పాలు నెరవేరనందు వలన, మరణం తర్వాత వాటిని నెరవేర్చుకోవటం కోసం, మరొక ప్రౌఢ శరీరాన్ని ఆశ్రయించవలసి వుంటుంది. పుట్టుకకు ముందు తల్లిదండ్రుల ద్వారా విడుదలైన బీజాలయందు కోరికలు, సంకల్పాల రూపంలో వుంటే, మరణం తర్వాత మిగిలివున్న కోరికలను నెరవేర్చుకోవటం కోసం మరొక దేహం కొరకు అన్వేషణ చేస్తాడు. ఎటువంటి శరీరం ద్వారానైతే తన కోరికలు, సంకల్పాలు నెరవేరుతాయో, అటువంటి శరీరంలోనికి ప్రవేశించవలసి వుంటుంది. ఎందుకంటే, వేరే శరీరాల ద్వారా తన కోరికలు నెరవేరే అవకాశమే లేదు. మరికొన్ని సందర్భాలలో జీవుడు మరణం తర్వాత భౌతికదేహాన్ని వదిలి, పరిసరాల లోనికి ప్రవేశిస్తాడు. అటువంటి వాసనాబీజాలు, కలుషితమైన గాలి, నీరు, భూమి, ఆహారాలలోనికి కూడా ప్రవేశించి, వానిని స్వీకరించినవారి దేహాలలోనికి ప్రవేశించటం జరుగుతుంది. అటువంటి సందర్భాలలో కేవలం మానవులే కాకుండా, ఇతర జంతువుల లోనికి కూడా జీవుడు ప్రవేశించే అవకాశముంది. అయితే, ఉత్తమ సంస్కారాలతో జీవించిన వ్యక్తి యొక్క వాసనాబీజాలు మాత్రం చాలా దూరం ప్రయాణించి, కొంతకాలం భూమండలమంతటా పరిభ్రమిస్తూ, అటువంటి సారూప్యమున్న వ్యక్తినే ఎన్నుకోవటం జరుగుతుంది. చెడు సంస్కారాలున్న వ్యక్తి నుండి విడుదలైన వాసనాబీజాలు చుట్టూవున్న కలుషితం లోనికి చేరుతాయి. అటువంటప్పుడు, అవి ఇతర జంతువుల లోనికి కూడా ప్రవేశించే అవకాశముంది. ఎందుకంటే, జంతుప్రవృత్తి వున్న వాసనాబీజాలు అటువంటి జంతువుల దేహాలనే ఆశ్రయించే అవకాశముంది. ఎవరైతే జ్ఞానపరంగా పరిణతి చెంది జీవించి వుండగానే భౌతిక ప్రపంచంతో వున్న సంబంధాన్ని పూర్తిగా వదులుకుని, సంచిత ప్రారబ్ధ కర్మలను సమూలంగా కరగించుకుని సంపూర్ణస్వేచ్ఛను అనుభవిస్తారో, వారు బ్రతికి వుండగానే అన్నిరకాల బంధాల నుండి విడుదలకాగలుగుతారు. అటువంటి వారికి మరణించిన తర్వాత మరొక దేహం యొక్క అవసరమే వుండదు. దానినే జన్మరాహిత్యమంటారు. ఇది చనిపోయిన తర్వాత సంక్రమించేది కాదు. ఎవరో ఇచ్చేది అంతకన్నా కాదు. ఎవరికి వారు స్వతహాగా కృషి చేసి, కర్మలను సమూలంగా కరగించుకోగలగాలి. అందుకే, "జ్ఞానాగ్నిదగ్ధ కర్మాణామ్" అంటారు. అందుకు సద్గురువు మార్గదర్శకత్వంతోపాటు, పరిపూర్ణ అద్వైత బ్రహ్మజ్ఞానం, అత్యంత ఆవశ్యకం. అపుడే జీవుడు సమూలంగా కరిగిపోయి, అంతిమదశలో జీవాత్మ పరమాత్మతో సునాయాసంగా అనుసంధానమవుతుంది. దానినే, వేదాంత పరిభాషలో ముక్తి లేక మోక్షము అంటారు. ప్రస్తుతం పరిస్థితులు కడు దుర్భరంగా వుండి, అంతరంగం పూర్తిగా కలుషితమై, చెడుసంస్కారాలతో నిండివున్నందు వలన, వానిని సమూలంగా కరగించుకుని, విశ్వవ్యాపిత భావనలను*

*అలవర్చుకుని జీవితపరమార్థం నెరవేర్చుకోవాలి. అయితే, ఆధ్యాత్మికతను సశాస్త్రీయ పంథాలో మలచుకుని, క్రమం తప్పకుండా సాధన చేయగలిగితే, ఉన్నతస్థితికి చేరవచ్చు. అందుకు, పాతకర్మలు సమూలంగా కరిగిపోవాలి. నూతనంగా అదనపు సంస్కారాలు చేరకుండా వుండాలి. అపుడే జీవితపరమార్థం నెరవేరి, జీవితం సాఫల్యమవుతుంది. అనుమానమే లేదు!*

***మాధవసేవే మానవసేవ***
***నీవే జీవుడు నీవే దేవుడవు***
***ఉన్నదాంతో సుఖంగా జీవించండి***
***మానవతతో సదా పరిమళించండి***
***శాంతి క్రాంతిల ఆనంద మార్గదర్శకులుగా***
***శిష్యశీల నిర్మాణమును సల్పు గురువు గురుడని గురుతు నెరిగి***
***జీవిత ధ్యేయానికి మార్గమును చూపు***
***ఈ మారుతి మాటలు విశ్వకళాక్షేత్రంలో***
***విజ్ఞాన వీధులందు పరము చేరునట్టి వివరములు అందచేసి***
***ఆంజనేయుని విజయపథము వినూత్నశైలిలో అందుకుని***
***ఆచితూచి అడుగులు వేసి***
***అందుకోండి ఆవలిగట్టును***
***నా చిన్నారి బిడ్డలైన సాధకులారా!***

ॐ

**12-04-2019** 07:30 PM

**95) సాధకుడు ఎలా ఉండాలి స్వామీ?**

*జీవభావం కరిగిపోతే, జీవుడే దేవుడవుతాడు. అందుకు తనను తాను అన్ని కోణాల నుండి విశ్లేషించుకుని, బాహ్యపరమైన బంధాల నుండి పూర్తిగా విడుదలయ్యే ప్రయత్నం చేయాలి. తనను గురించి తాను తెలుసుకుని, తనను గురించి తాను ఆలోచించుకుంటూ, తనలోనికి తాను ప్రయాణించి, పూర్తిగా అంతర్ముఖమై, జీవితాన్ని గురించి లోతుగా అధ్యయనం చేయగలగాలి. ఇంకొక విధంగా వివరించాలంటే, తన ఆధ్యాత్మికత పురోభివృద్ధి మీదనే పూర్తిగా దృష్టిని కేంద్రీకరించగలగాలి తప్ప, వేరే ఇతర విషయాల వైపుకు తన దృష్టిని మళ్ళించకూడదు, ఇతరులను గురించి ఆలోచించకూడదు. అంటే, అతడు పూర్తిగా తన జీవిత పరమార్థం నెరవేర్చుకోవడం మీదనే దృష్టిని కేంద్రీకరించాలి. అందువల్లనే, 'ఆధ్యాత్మికవేత్త' అంటే, "స్వార్థపూరితంగా జీవించేవాడే" అని చెబుతాను. ఎందుకంటే, సమాజాన్ని తన కోసం వాడుకునే స్వార్థం కాదు. తనను తాను ఉద్ధరించుకునే విధానమే. తన అంతరంగాన్ని శుద్ధి గావించుకునే కొలదీ ప్రజ్ఞ అనంతంగా విస్తరించి, మోహబంధాల నుండి పూర్తిగా విడుదలై, సంపూర్ణస్వేచ్ఛను*

పొందే అవకాశముంది. అయితే, మామూలుగా మీ వాడుకభాషలో స్వార్ధమనగానే ఇతరులను దోచుకోవటం, తమ అవసరాలను తీర్చుకోవటం, ఉపయోగించుకోవటం అనుకుంటారు. వాస్తవానికి తనను తాను ఉద్ధరించుకున్న వ్యక్తి, ఏవ్యక్తినైనా ఉద్ధరించగలుగుతాడు. అంతేకాదు, తనవంతు సమాజానికి విశిష్ఠమైన సేవలను అందించగలుగుతాడు. ఎందుకంటే, అతనిలో తప్పక సేవాభావం, వైరాగ్యం, త్యాగనిరతి వంటి విశిష్ఠ లక్షణాలుంటాయి. ఎవరైనా ఆధ్యాత్మికమార్గంలో పరిణతి చెంది కూడా సమాజ ఉద్ధరణకు కృషి చేయడం లేదంటే, అతడు తప్పక స్వార్ధపరుడు. ఆధ్యాత్మిక పరిణతి చెందలేదని భావించాలి. ఎందుకంటే, తాను అనుభవిస్తున్న ఆనందాన్ని, మనశ్శాంతిని తన తోటివారికి తెలియచేసి, వారిని ఉన్నతపథం వైపుకు మళ్ళించాలనే తపన తప్పక వుంటుంది. అనుమానమే లేదు. భగవంతుడు నిరాకార, నిరంజన, నిర్గుణుడు. అందరినీ, అన్నింటినీ సాక్షీభూతంగా చూడగలుగుతాడు. విశ్వమంతా తననుండే ఆవిర్భవించినా, తాను మాత్రం దానికి అతీతం. ఇక మానవుని విషయానికొస్తే, అతని అంతరంగ సంస్కారాలనుబట్టి జీవితం కొనసాగుతుంది తప్ప అందులో భగవంతుని ప్రమేయం అసలు వుండదు. రాజకీయనాయకులు తమ గెలుపు కోసం దేవుని ఆశ్రయించడం, ఆరాధించడం, పూజించడం, మొక్కులు చెల్లిస్తామని వాగ్దానం చేయడం సహజమే కానీ, భగవంతుడు మాత్రం వారి కోరికలను తీర్చడు. తీర్చే అవకాశమే లేదు. అయితే, భగవంతుని పట్ల విశ్వాసం ఏర్పర్చుకోవడం ద్వారా తనపట్ల తనకు విశ్వాసం కల్గుతుంది. భగవంతుని ద్వారా జరిగిందనే భావన బలీయమవుతుంది. తనవంతు కృషి చేయకుండా భగవంతుని మీద భారం వేస్తే, అది బానిసత్వమవుతుంది. ఎటువంటి ఫలితం లభించదు. యజ్ఞయాగాదులనేవి పవిత్రమైన వైదిక క్రతువులు. నియమనిష్ఠలతో, భక్తిశ్రద్ధలతో ఆచరించినట్లయితే, అద్భుతమైన ఫలితమొస్తుంది. యజ్ఞం ముగిసిన తర్వాత, పూర్ణాహుతిలో వేసే హోమద్రవ్యాల వలన ఉత్పన్నమయ్యే పవిత్రమైన శక్తిని దేవతలు స్వీకరించి ఆశీర్వదిస్తారు. అన్నింటికంటే మహోన్నతమైనది జ్ఞానయజ్ఞం. పరిపూర్ణ అద్వైత బ్రహ్మజ్ఞానాన్ని అవగాహన చేసుకుని, అనుభవంలోకి పొందగలిగితే, అంతరంగ స్థితిని సమూలంగా మార్చుకోవచ్చు. వేరే ప్రత్యామ్నాయమే లేదు. మనసే దైవ మందిరం. పవిత్ర హృదయమే దేవుని నిలయం. దేహాన్ని దేవాలయంగా, అందలి జీవుడ్ని సాక్షాత్తు భగవంతునిగా భావించగలిగితే మానవ జీవిత పరమార్ధం నెరవేరుతుంది. మంచి మనసుకు మించిన మందులేదు. మంచి మనసుకు మించిన సంపద లేదు. మంచి మనసును మించిన ముహూర్తం లేదు. అయితే, అదే మనసు తిరోగమనం వైపుకు మళ్ళితే, అతి ప్రమాదకరమవుతుంది. అరిషడ్వర్గాలకు నిలయమైతే, దానవత్వం ప్రకోపిస్తుంది. ఆలోచనా విధానం సమూలంగా మారిపోతుంది. తాను బలహీనపడి, మనోకాలుష్యాన్ని అంతటికీ వ్యాపింపచేస్తాడు. కావున, స్వర్గనరకాలు బయట ఎక్కడో లేవు – మీ అంతరంగంలోనే వున్నాయి. అంతరంగం పవిత్రంగా, ఉత్తమ సంస్కారాలతో కూడివుంటే స్వర్గం, చెడు సంస్కారాలమయమైతే నరకం. అందువలన, మీ కర్మలకు మీరే బాధ్యులు. వేరే మరెవ్వరికీ అందులో ఎటువంటి ప్రమేయం వుండదు.

**సూర్యోదయపు సమయమందు భానుకిరణాలు**
**ఎదురు తాకునటుల, కార్యోన్ముఖులుగా నిలచి చేసే సాధన**

***సూర్యనమస్కారాలు ఎంతో మేలు***
***కాలం మీద పట్టు సాధిస్తారు, మనసు మీద సూర్యుని ప్రభావముండ గలదు.***
***కానీ, అంతదూరం నుండి ప్రాణశక్తిని అందించి మేలు చేసే సూర్యునికి***
***మీరు పొంచి మొగపు పలుకరింతలే కరువగుట ఎంత కృతఘ్నతయో ఆలోచించండి!***
***అమృతరశ్మిని విషపూరితం చేస్తున్నారు.***
***హృదయస్థానంలో సూర్యుని దర్శించి, సూర్యునిలాగే విశాలంగా ఆలోచించి***
***సమాజానికి ఉపకారం చేసి, ఉపకరణములుగా మిగిలి***
***మింగుడుపడలేని మోక్షతత్వాన్ని ముందుగా ఆలకించి***
***ఆచరణ చేసి, అందుకోలేని దానిని అందుకుని***
***ఆంజనేయుని మది ఉప్పొంగేలా ఉన్నతులై, సాధనాపరులై***
***సాగిసాగిసాగి సాక్షాత్తు ఆ పరంధామం చేరి సుఖించండి సదా***
***నా చిన్నారి ముద్దుబిడ్డలారా!***

ॐ

**13-04-2019** 11:15 AM

**96)** భగవంతుని దృష్టిలో ఎవరు గొప్ప దానవంతుడు స్వామీ?

ఇద్దరు వ్యక్తులు కాలక్షేపానికి ఊర్లో వున్న గుడి దగ్గర కూర్చుని కబుర్లు చెప్పుకుంటున్నారు. అప్పటికి కాస్త చీకటి పడుతోంది. కొంచెం మబ్బు కూడా పట్టింది. ఇంతలో అక్కడికి మరో వ్యక్తి వచ్చాడు. "మీ ఇద్దరితోపాటు నేనూ కూర్చోవచ్చా?" అని అడిగాడు. అందుకు ఆ ఇద్దరూ, "అదేం భాగ్యం. ఈ చోటు మాది కాదు. మేము కూడా కాలక్షేపానికి కూర్చున్నాం. నువ్వు కూడా కూర్చో" అన్నారు. ముగ్గురూ కూర్చుని కబుర్లలో పడ్డారు. ఇంతలో గాలివాన మొదలైంది. వారు ఇక అక్కడ నుండి వెళ్ళలేపోయారు. ఇంతలో మూడవ వ్యక్తికి ఆకలి వేసింది. అదే విషయం మిగిలిన ఇద్దరితో చెప్పాడు. "మేము కూడా అదే ఆలోచిస్తున్నాము. అతడి దగ్గర మూడు, నా దగ్గర ఐదు రొట్టెలున్నాయి. ఇవే అందరం పంచుకుని తిందాం" అని రెండో వ్యక్తి అన్నాడు. కానీ, ఎనిమిది రొట్టెలను ముగ్గురు సమానంగా పంచుకోవటం ఎలా? అన్న ప్రశ్న ఉత్పన్నమైంది. అందుకు మూడవ వ్యక్తి ఒక ఉపాయం చెప్పాడు. "ఒక్కో రొట్టెను మూడు ముక్కలుగా చేద్దాం. అప్పుడు వచ్చిన ఇరవైనాలుగు ముక్కలను ముగ్గురం సమానంగా తిందాం" అని అంటాడు. అది అందరికీ సబబుగా తోచి, ఎనిమిది రొట్టెలను మూడుమూడు ముక్కలుగా చేసి, తలా ఎనిమిది ముక్కలు తిని ఆకలి తీర్చుకుని నిద్రపోతారు. తెల్లవారి నిద్రలేచిన తర్వాత మూడవ వ్యక్తి వెళ్ళబోతూ, "మీరు రాత్రి నాకు తోడుగా వుండటమే కాకుండా, నాకు మీ రొట్టెలు పెట్టి, ఆకలి కూడా తీర్చారు. మీకు చాలా కృతజ్ఞతలు. నా దగ్గర వున్న ఎనిమిది బంగారు నాణేలు మీకు ఇస్తాను. మీ ఇద్దరు తీసుకోండి" అని చెప్పి, ఆ ఎనిమిది నాణేలు ఇచ్చి వెళ్ళాడు. అతడు

వెళ్ళిపోయాక, మొదటి వ్యక్తి "నా నాలుగు నాణేలు నాకు ఇస్తే, నేను వెళ్ళిపోతాను" అంటాడు రెండవ వానితో. అయితే రెండవ వ్యక్తి, "నీవి మూడు రొట్టెలే. నావి ఐదు రొట్టెలు. కాబట్టి లెఖ్ఖ ప్రకారం నాకు ఐదు బంగారు నాణేలు, నీకు మూడు నాణేలు చెందుతాయి" అన్నాడు. ఇలా వీరిద్దరి మధ్య వివాదం మొదలైంది. ఈ చిక్కు తీర్చుకోవటానికి ఇద్దరూ రచ్చబండనెక్కుతారు. అక్కడ న్యాయాధికారి మొత్తం కథ విని, బంగారు నాణేలు తన వద్ద పెట్టమని చెప్పి, తీర్పు తెల్లవారికి వాయిదా వేస్తాడు. రాత్రి పడుకున్న తర్వాత కలలో దేవుడు కన్పించి "ఏం తీర్పు చెబుతావు?" అని అడుగుతాడు. "నాకు రెండవ వ్యక్తి చెబుతున్నదే న్యాయంగా తోస్తున్నది" అని అంటాడు. అందుకు దేవుడు, "నవ్వేసి, నువ్వు కథ సరిగ్గా విన్నావా?" అని అడిగి, "మూడు రొట్టెలు ఇచ్చినవాడికి ఒక బంగారు నాణెం మాత్రమే ఇవ్వాలి" అని అంటాడు. న్యాయాధికారి "అదెలాగా?" అని అడుగుతాడు. "ఎలాగంటే, మొదటి వాడి దగ్గర వున్నవి మూడు రొట్టెలు. వాటిని అతడు తొమ్మిది ముక్కలు చేశాడు. రెండవవాని దగ్గర వున్నవి ఐదు రొట్టెలు. వాటిని అతడు పదిహేను ముక్కలు చేశాడు. అయితే, మొదటివాడు వాడి రొట్టెలలోని తొమ్మిది ముక్కలలో, ఎనిమిది అతడే తినేశాడు. కానీ, రెండవవాడు తన పదిహేను ముక్కలలో ఏడు ముక్కలు మూడో వానికి పెట్టాడు. కాబట్టి ఏడు నాణేలు రెండో వాడికి చెందాలి. ఇదే నా లెఖ్ఖ. ఇదే న్యాయం కూడా" అని తేల్చేశాడు. తెల్లవారి న్యాయాధికారి ఇదే తీర్పు చెప్పాడు. ఇది విని మొదటివాడు, "ఇతడే నయం, మూడు నాణేలు ఇస్తానన్నాడు. మీరు ఒక్కటే ఇస్తున్నారు" అని వాపోయాడు. అది విని న్యాయాధికారి అతడికి ఒకటే ఎలా చెందుతుందో వివరించాడు. దీనిని బట్టి అర్థం చేసుకోవలసింది ఏమిటంటే, మీరు వేసుకునే లెఖ్ఖలు వేరు, దేవుడి లెఖ్ఖలు వేరు. మీ దగ్గర వున్నదాంట్లో ఎలా ఇతరులతో పంచుకోగలుగుతున్నారు అనేది దేవుడు లెఖ్ఖలోకి తీసుకుంటాడు. ముప్పయి కోట్లు వున్నవాడు మూడు లక్షల దానం చేయటం గొప్పగా దేవుడు పరిగణించడు. మూడువేలు వున్నవాడు మూడు వందలు దానం చేయటం మామూలుగా భావిస్తాడు. అతి తక్కువగా వున్నవాడు తనతో వున్నది కొంత ఇతరులకిస్తే, అతడే గొప్పవాడు. పుణ్యంగా జమ కడతాడు. దేవుడి దృష్టిలో మీకెంత వున్నది అన్నది కాదు, మీకున్న దాంట్లో ఎంత దానం చేశారు అనే దానికే విలువనిస్తాడు.

**విద్యకు ప్రతిరూపం వాగ్దేవి**

**తమస్సును తొలగించి జీవితాన ఉషఃకాంతులను వెలిగించి తేజస్సును అందించేది విద్య**
**మనిషిని ఆవరించిన అజ్ఞానము అనే అవిద్యలను పారద్రోలుటకై**
**తన జ్ఞానకాంతులతో దివ్యచైతన్యస్ఫూర్తియై అంతఃకరణాన్ని శుద్ధి చేసే ఆధ్యాత్మికశక్తిని**
**ఉదాత్తమైన యుక్తితో మీ సందేహాలను నివృత్తి చేస్తూ**
**అభ్యున్నతిని కాంక్షిస్తూ, మహోన్నతమైన గురుస్థానాన్ని అధిష్ఠించి**
**జ్ఞానదానం, విద్యాదానం చేస్తున్న . వీరాంజనేయుని విన్నపములు విని**
**విశ్రాంతి ఎరుగక, విద్యావికాసాన్ని పొంది**
**విలువైన జీవనమార్గాన జీవనగమ్యాన్ని చేరి విశ్రాంతిని పొందండి సదా**
**నా చిన్నారి ముద్దుబిడ్డలారా!**

ॐ

**14-04-2019** 10:10 AM

**97) "మనయేవ మనుష్యాణాం కారణం బంధ మోక్షయోః" అంటారు కదా స్వామీ?**

*మనిషికి పరిగెత్తడము చాలా కష్టం కానీ, నిల్చి వుండటం చాలా సులభం. కానీ, మనసుకు పరిగెత్తడం చాలా సులభం, నిల్పడం చాలా కష్టం. మనిషికి, మనసుకు వున్న వ్యత్యాసం ఇదే. "మనోమూలమిదం జగత్". మనిషి అంతయూ తిరిగి రావాలంటే, చాలాకాలం పడుతుంది. మనస్సు ఒక్క క్షణంలో తిరిగి రాగలదు. అంత వేగంతో తిరిగే మనసును, కొంతవరకు అరికట్టుటకు ప్రయత్నించాలి. మనసు చెడ్డది కాదు. దానిని ఉపయోగించుకునే విధానమును పురస్కరించుకొనియే, మంచి-చెడ్డలు ఏర్పడుతున్నాయి. మనిషి యొక్క ప్రవర్తన, మనసుపైనే ఆధారపడి వుంటుంది. కనుక, మనసునెపుడూ అదుపులో పెట్టుకోవాలి. అది ఒక నిముషంలో పిచ్చికోతివలే ప్రవర్తిస్తుంది, మరో నిముషంలో దివ్యమైన భావనలతో ప్రకాశిస్తుంది. ఒకానొక సమయంలో మనిషిని చూచి మా జాతి నవ్వింద‌ట. "ఓ మనిషీ! నువ్వు మహాశక్తిమంతుడవని గర్వించవద్దు. ఎందుకంటే, నేను నీయందు మనసునై వున్నాను. నీ జీవితం నాపైన ఆధారపడివున్నది" అన్నదట. మనసు పెడమార్గాన పడితే, జీవితమే పెడమార్గాన పడుతుంది. నేను కోతిని అయినప్పటికీ, నిరంతరం రామనామస్మరణ చేస్తూ, రామస్మరణలో పాల్గొని రామకార్యమును విజయవంతము గావించాను. అదే విధముగా మనస్సు సక్రమమైన మార్గములో ప్రవేశించినపుడే, దైవసన్నిధిని, దైవపెన్నిధిని అనుభవించగలుగుతారు. దివ్యత్వమును స్మరించవలెనన్న మనసే ఆధారం. అందుకని, చిన్న వయసు నుండి మీరు మనస్సును సక్రమమైన మార్గంలో పెడితే, మీరు కూడా చాలా దివ్యమైన స్థానాన్ని పొందుతారు.*

**98) పురుషప్రయత్నం లేనిది దైవసాన్నిధ్యం సాధ్యం కాదు అంటారు కదా స్వామీ?**

*మానవుడు ఎంత శక్తిమంతుడైనా, పురుష ప్రయత్నమే లేకపోతే, అది నిరుపయోగమవుతుంది. మానవుడు పుట్టిన వెంటనే పండితుడు కాలేడు, శ్రీమంతుడు కాలేడు. ప్రయత్నిస్తేనే క్రమంగా ఉన్నతస్థాయికి చేరుకుంటాడు. పురుష ప్రయత్నం వున్నప్పుడే, దైవానుగ్రహం కలుగుతుంది. దీనికి ఒక చిన్న ఉదంతం చెబుతాను. ఒకానొక సమయంలో ఒక వ్యక్తి బండిని తోలుకుంటూ వెడుతుంటే, ఆ బండిచక్రం దిగబడిపోయింది. దానిని సరిచేసే శక్తి అతనికి వున్నప్పటికీ, అతను దానికి తగిన ప్రయత్నమే చేయక, ఊరికే కూర్చుని రాం రాం రాం అంటూ రామనామస్మరణ చేస్తున్నాడు. నేను రామనామం విన్న తక్షణమే అచట ప్రత్యక్షమై, "నాయనా! ఏమి కావాలి నీకు?" అని అడిగాను. అతను "స్వామీ! నా బండి చక్రం విరిగిపోయింది. అందుకు మీ సహాయం కావాలి" అన్నాడు. అందుకు నేను, "ఓరీ పిచ్చివాడా! పురుష ప్రయత్నం ఉన్నప్పుడే దైవ సహాయం లభిస్తుంది. నీ ప్రయత్నం నీవు చేయక కేవలం రాం రాం అంటూ కూర్చుంటే ఏ విధంగా సహాయం లభిస్తుంది?" అంటూ మందలించాను. పొటాటో, చపాతి ప్లేటు ముందే వున్నది. కానీ, మీ కడుపు నిండాలంటే, చేతికి, నోటికి పని పెట్టాలి కదా! అది చెయ్యకుండా ఆ పదార్థాన్ని చూస్తూ కూర్చుంటే, మీ పొట్ట నిండుతుందా? అలాగే, కేవలం నామస్మరణ*

చేస్తూ కూర్చున్నందువలన ప్రయోజనం లేదు. నామస్మరణతోపాటుగా దైవకార్యమునందు కూడా మీరు పాల్గొనాలి. ఈ కలిప్రభావం వల్ల మానవుడు పురుష ప్రయత్నమునకు స్వస్తి చెప్పి సోమరితనాన్ని అభివృద్ధిపరచుకుని, దైవానుగ్రహానికి దూరమైపోతున్నాడు. నేను ఎంత చెప్పినా అన్నీ మీరే చేయాలి స్వామీ, మీదే బాధ్యత స్వామీ అంటూ భక్తులు కర్తవ్యపాలనను విస్మరిస్తున్నారు. భగవంతుడు ఎల్లప్పుడూ మీ వెంటనే, జంటనే, కంటనే వున్నాడు. కానీ భగవంతుడు మీ మాటల చేతనూ, మీ ప్రవర్తన చేతనూ, మీలో పెంచుకుంటూపోతున్న దుర్గుణాల చేతనూ మీరే దైవానికి దూరమైపోతున్నారు, భగవంతుడ్ని అర్థం చేసుకోలేకపోతున్నారు. అవును. మీరెప్పుడూ అర్థం చేసుకోలేరు. ఒక చిన్న ఉదాహరణ చెబుతాను. మీరు కారులో కోయంబత్తూరు నుండి కొడైకెనాల్‌కు బయల్దేరానుకోండి. కొంతసేపటికి కొడైకెనాల్ వచ్చిందంటారు. అయితే, కొడైకెనాల్ మీ దగ్గరకు వచ్చిందా? లేక మీరు కొడైకెనాల్ వద్దకు వచ్చారా? కొడైకెనాల్ ఉన్నచోటనే వున్నది. అదే విధంగా, దైవం మీకు సమీపంగా వచ్చాడనీ, లేక దైవం మీకు దూరమవుతున్నాడని భావించటం చాలా పొరపాటు. దైవం మీకు దగ్గరవ్వటం లేదు, దూరమవ్వటం లేదు, దూరంగా పోవటం లేదు. ఎప్పుడూ మీ వెంటనే వుంటున్నాడు. ఈ సత్యాన్ని మీరు సంపూర్ణంగా విశ్వసించాలి. కానీ, అటువంటి సద్గుణాలు మీలో క్షణక్షణమునకు తగ్గిపోతున్నాయి. మీకొక ఉదాహరణ చెబుతాను. భగవంతుడు ఒక వ్యక్తితో, "నాయనా! నువ్వు ఎక్కడికైనా వెళ్ళు, నేను నీ వెంటనే వస్తాను" అని చెప్పాడు. "భగవంతుడు చెప్పినమాట నిజమేనా? భగవంతుడు నా వెంట వస్తున్నాడా?" అన్న సందేహంతో వెనుకకు తిరిగి చూచాడు. కానీ భగవంతుడు కన్పించలేదు. అయితే భగవంతుడు అక్కడ లేడా? కానీ అతని వెనుక వుంటానని చెప్పాడు. అతను వెనుకకు తిరిగినప్పుడు భగవంతుడు కూడా వెనుకకు తిరిగాడు. కానీ, అతను ఈ సత్యాన్ని గుర్తించలేక, భగవంతుడు తన మాట తప్పాడని అపోహపడ్డాడు. అంతర్యామిగా వున్న భగవంతుని సందర్శించగలగాలి. ఏకాత్మతత్త్వంతో ముందుకు సాగిపోవాలి. అద్వైతసిద్ధిని పొందగలగాలి. మీరు భగవంతుడంటే భయం భయంగా వుండుటవల్ల ప్రయోజనం లేదు. భగవానుని, మీ పాత స్నేహితునిగా భావించి దైవంతో స్వేచ్ఛగా మెలగాలి. మీలో పాపభీతి వుండాలి గానీ, దైవభీతి వుండకూడదు. దైవాన్ని పరిపూర్ణంగా ప్రేమించాలి. అపుడే దైవం మీకు లభ్యమవుతాడు. ఇది ఆంజనేయుని అభయం!

***రామనామ స్మరణం సర్వశ్రేయస్కరం***
***సర్వశక్తిమంతం సకల బాధోపశమనం***
***సర్వవ్యాధి నివారకం దుష్కర్మ నివారకం***
***సర్వపాపహరణం సత్కర్మ ప్రేరకం***
***సకల పుణ్యప్రదం సర్వ దుఃఖనివారకం***
***సమస్త సుఖప్రదాయకం నిత్యానిత్య వివేకహితం***
***ఇహపర సుఖభోగ విరాగ సాధనం చిత్తశుద్ధికి దోహదం***
***ఆత్మవిచార సఫలతకు సాధనం***
***అనాయాస మరణప్రాప్తం దేహాంతే రామ సాయుజ్య భాగ్యం***

***ఇంతటి సంపదను అందించు రామనామం***
***జపించి, సుఖించి సదా చిత్తమును మరచి,***
***చిన్మయులై చిదానందులై . చిరంజీవి హనుమ హాయిహాయి పదములు***
***పథమ్మును చూపి పయనము చేసి***
***పదపదమని ఈ పవనకుమారుడు పట్టుకున్న పట్టులోనున్న***
***పసిప్రాయపు చిన్ని బిడ్డలైన***
***చిన్నారి నా ముద్దుబిడ్డలారా!***

ॐ

**16-04-2019** 07:40 AM

**99) జీవిత పరమార్థాన్ని ఏ విధంగా సాధించాలి స్వామీ?**

*నీవు అందరితో, అన్నింటితో సమానం అనుకుంటే ఎలా వుంటుంది? కొందరి కన్నా ఎక్కువ, మరికొందరి కన్నా తక్కువ అనుకుంటే ఎలా వుంటుంది? ఎక్కువ అనుకుంటే ఆధిక్యతాభావం, తక్కువ అనుకుంటే ఆత్మన్యూనతాభావం ఏర్పడతాయి. అవి రెండూ ప్రమాదకరమే. ఎక్కువ తక్కువలన్నీ భిన్నత్వానికి ప్రతిరూపాలు. అంతా సమానమనుకుంటే, సమదృష్టి అలవడుతుంది. అదే సమాధికి రాచబాట అవుతుంది. తనకన్నా వేరే ఎవరు తక్కువగా వున్నారనుకున్నా, ఎక్కువగా వున్నారనుకున్నా అది భిన్నదృష్టి అవుతుంది. భిన్నదృష్టి ద్వారా శక్తి హరించుకుపోతుంది. సమదృష్టి శక్తిని పెంచుతుంది. దీనినే అవధూతస్థితి అంటారు. మానవ జీవిత పరమార్థం ఏమిటంటే, సంచిత ప్రారబ్ధ కర్మలను కరిగించుకొని, కర్మబంధం నుండి సమూలంగా విడుదలై, స్వేచ్ఛను అనుభవిస్తూ ప్రశాంతంగా జీవితాన్ని ముగించడమే. అందుకు పాతకర్మలు కరిగిపోవాలి, అదనంగా కర్మలు చేరకుండా వుండాలి. దీనినే కళాత్మక జీవనవిధానం అంటారు. అందుకు సద్గురువు మార్గదర్శకత్వం, పరిపూర్ణ అద్వైత బ్రహ్మజ్ఞానం, క్రమం తప్పని సాధన అత్యంత అవసరం. సద్గురువు తాను స్వేచ్ఛను అనుభవిస్తూ, శిష్యుని కూడా అదే పంథాలో ముందుకు నడిపిస్తాడు. శాస్త్రీయత ఉన్నచోట ఎటువంటి అనుమానాలకు, సంకోచాలకు, అపోహలకు, సందేహాలకు అవకాశముండదు, వుండనేరదు. అపుడే సాధకునికి ఆ మార్గంపట్ల పూర్తి విశ్వాసం కలుగుతుంది. పరిపూర్ణ అద్వైత బ్రహ్మజ్ఞానము ద్వారా భౌతిక ప్రపంచంతో వున్న అన్నిరకాల బంధాలు తెగిపోతాయి. రాగద్వేషాలకు అతీతంగా జీవించే పరిస్థితి ఏర్పడుతుంది. ఆ తదుపరి, సాధనను కొనసాగించగలగాలి. ఎందుకంటే, పూర్ణజ్ఞానాన్ని తెలుసుకుని, దానిని అనుభవంలోకి పొందాలంటే, సాధన అనేది తప్పక అవసరం. కేవలం తెలుసుకున్నంత మాత్రాన ఎటువంటి ప్రయోజనం వుండదు. అది తప్పక అనుభవంలోకి రావాలి.*

***గౌరవం ఇచ్చిపుచ్చుకునేది***
***అంటే, గౌరవం ఇతరులకు మీరు ఇచ్చి, వారి నుండి మీరు పొందేది అని తెలుసుకోగలగాలి.***

***అప్పుడే ఇతరులు మిమ్ము గౌరవిస్తారు.***
***మీరు అహంకారంతో, అబద్ధాలతో ఇతరులు పెద్దలైనా, వృద్ధులైనా***
***వారిని నిందించి, నిరసించి, అవమానించి, ఆ పరమాత్మ శాపాలు పొందుతారా?***
***లేక వారిని గౌరవించి వారి దివ్యమైన ఆశీస్సులు పొందుతారా?***
***ఏం చేయాలో మీరే ఆలోచించండి.***
***ఇది సాధనాక్రమంలో మొట్టమొదటి మెట్టు***
***మెట్టుపైనున్న సద్గురుని చేయి పట్టుకుని***
***దిక్కులు చూడక జీవితం ధన్యత్వమొందుటకై***
***అతి త్వరితముగా ఆంజనేయుని బోధలు***
***బాగుగా వంటబట్టించుకుని, రామనామమును వల్లెవేస్తూ***
***వేగముగా వీరాంజనేయుని చేరి సుఖించండి సదా***
***నా చిన్నారి ముద్దుబిడ్డలారా!***

సాధకులు అనబడే మీరు ఒక చిన్న పద్ధతిని అవలంభించండి. దీని ద్వారా మనో ఇంద్రియములు కట్టుబడతాయి. అదేమిటంటే, నేను చెప్పే వరకూ అంటే, 'విరమించమని చెప్పే వరకూ' సాగించండి. మనసులో ఏదైనా ఒక సందర్భము బాధ కల్గించిందనుకోండి, ఆ సందర్భాన్ని మీరు మామూలుగా ఆలోచించే విధానంలో ఆలోచించండి. దానిని మరలా ఆధ్యాత్మిక దృష్టితో ఆలోచించండి. ఈ సందర్భానికి, ఆ సందర్భానికి ఎలా స్పందిస్తారో పుస్తకంలో వివరించండి. ఎన్ని సందర్భాలలో మీరు ఏకాగ్రతను కోల్పోవుచున్నారో గమనించండి. ఇది మంచి సాధనామార్గం. చాలాసార్లు చెప్పాను. కానీ, మరలా మరలా మరలా చెబుతున్నాను. ఈ చెప్పుటలోనే ఆంజనేయుని ఓర్పు, సహనం గుర్తించండి. వాటిని మీ వాటిగా స్వీకరించండి. దానితోపాటు మీరు సంతోషించే సందర్భాలను కూడా విశ్లేషించండి. అలా చేసినట్లయితే మీ మనస్సు ఎలా ఆలోచిస్తుందన్నది పట్టుబడుతుంది.

ॐ

**17-04-2019** 07:55 AM

**100) సాధనకు ఎటువంటి పవిత్రమైన భావములు ఉండవలెను స్వామీ?**

మీ దినచర్యలో భాగం ప్రదోషకాలంలో కన్నులు విప్పారినది మొదలు తాత్కాలికమైన మరణమనే నిద్రలోకి జారుకునే వరకూ మీరు చేసే సమస్తమైన కర్మలకు సమాధానం తెలుసుకోవటానికి మీరు ప్రయత్నించకపోతే, మీకంటే దైవద్రోహులు ఎవరూ వుండరు. అవసర-అనవసరాలను గుర్తించకుండా మీరు మాట్లాడే మాటలను దైవస్తుతిగానూ, ఊరికే తిరిగే మీ తిరుగుళ్ళను దైవానికి చేసే ప్రదక్షిణలుగానూ, చివరకు ఒంటిమీద స్పృహ లేనట్లుగా మీరు పోయే నిద్రను సాధనా చరమాంకమైన సమాధిగానూ నేను చెప్పడానికి కారణం, మీ వాక్కులను, కర్మలను దుర్వినియోగపర్చకూడదని. అంతేగాక, వీనికి ఆధారభూతమైన శరీరానికి శక్తినిచ్చే ఆహారం యజ్ఞకర్మలో ఉపయోగించే హవిస్సంత పవిత్రమైందని

మీరు గ్రహించాలి. ఎప్పుడైతే, ఇటువంటి పవిత్రభావాలు మీలో కలుగుతాయో, అప్పుడు మీరు ఆధ్యాత్మిక ప్రయాణానికి సన్నద్ధులైనట్లుగా భావించాలి. అయితే, భావనామాత్ర ప్రయాణం మిమ్మల్ని వాస్తవమైన గమ్యానికి చేర్చలేదు గదా! అందువల్ల, ముందుగా కూర్చుకున్న సాధనకు విశుద్ధ కర్మాచరణ, అచంచలమైన దైవభక్తి, పట్టుదల అనేవాటిని కూడా మూటగట్టుకుంటే, మీరు ప్రయాణం ప్రారంభించవచ్చు.

**101) సాధకునకు సద్గుణసంపత్తి యొక్క ఆవశ్యకత ఎట్టిది స్వామీ?**

కేవలం బుద్ధిగత జ్ఞానం వల్ల ప్రయోజనం లేదు. అది జీవితమందెల్లనూ వ్యాపించాలి. ఆ జ్ఞానము చేతులు, కాళ్ళు, కన్నులు మొదలైన జ్ఞానేంద్రియాల ద్వారా ప్రకటితము కావాలి. జ్ఞానేంద్రియములను, కర్మేంద్రియములను వివేకముతో అనుష్ఠించు స్థితికి రావలెను. వట్టి పాండిత్యము, 'జ్ఞానము' అనబడదు. నేను 'సద్గుణములనే' జ్ఞానము అని అంటాను. అందువల్ల, మిమ్మల్ని దైవసాన్నిధ్యానికి చేర్చే జ్ఞానరాశి సద్గుణ సంపదేనని అర్థమవుతుందా? ఈ సద్గుణ సంపదలో కూడా 'భక్తిముక్తాఫలమే' బహు శ్రేష్ఠమైనదని గ్రహించాలి. భక్తులలో వుండవలసినది పార్ట్‌టైమ్ డివోషన్ కాదు. పర్మినెంట్ డివోషన్ కావాలి. ఎందుకంటే, మూడు సమస్యలు, ఆరు కష్టాలు రాగానే చలించిపోయే భక్తి, పర్మినెంట్ భక్తి ఎలా అవుతుంది? దృఢమైన పట్టుదలతో కూడినదే నిశ్చలమైన భక్తి.

***పూట పూట రుచులు నోట నీరూరించు ధనవంతమైన భోజనములేల?***
***సంతృప్తిని మించి సంపద ఇల లేదు అవసరానికి మించి ఆస్తులేల?***
***భక్తపోతన కానాటి భాగ్యమెంత? యోగి వేమనకు మించి భోగి గలడా?***
***వ్యసనములు మాని యోగిగా మసలుకొనుడు***
***మనసు ఇంద్రియపోకడల్ మానుకొనుడు***
***శిష్యులుగా ఆంజనేయుని ఆశీస్సులందుకుని***
***అజేయులై శాశ్వత స్థిరత్వమునొంది***
***బుద్ధికుశలురై, భావ ప్రపంచమున, బాహ్య ప్రపంచమున***
***రామనామమును వీడకుమని రఘురాముడీ తీరున విన్నవించే***
***వీనుల విందుగా విని, అధరమ్ముల అమృతపు ధారను ఒడిసిపట్టి***
***అమృతతుల్యులై ఆనందాంబుధిలో మునిగి ముమ్మారు ప్రణవనాదంతో***
***పవనకుమారుని చేరి పరవశించండి***
***పసికూనలైన నా చిన్నారి ముద్దుబిడ్డలారా!***

ॐ

**18-04-2019** 08:05 AM

ఈ రోజు స్వామి బాల్యంలో మాట్లాడిన కొన్ని మాటలు గుర్తుకు తెచ్చుకుందాము. ఎందుకంటే, వారి పదాలలోనే తాను సర్వమూ నెరిగినవాడినని చెప్పకనే చెబుతున్నాయి. వీటిని మీరు ఎప్పుడూ విని

వుండకపోవచ్చు. పదాలను మార్చి, క్రొత్త అర్థాలను స్ఫురింపచేయడం స్వామికి వెన్నతో పెట్టిన విద్య. స్వామి చాలా చిన్నగా వున్నప్పుడు, చిత్రావతి నదిలో ఈదటానికి వెళ్ళారు. అక్కడవారితో, "బిడ్డకు డబ్బు సొమ్ము. తల్లికి బిడ్డ సొమ్ము" అని రెండు చిన్న వాక్యాలలో తల్లీబిడ్డల మధ్యగల తారతమ్యాన్ని విడమరచి చెప్పారు. ఒక సందర్భంలో ఒకరు స్వామిని, "లోపలగానా?" అని ప్రశ్నిస్తే, చిన్నగా వున్న స్వామి ఆ పదాన్ని విడగొట్టి, "లోపల గానా – బయట బజానా" అని చెప్పి అక్కడ వున్న వారందరినీ అప్రతిభుల్ని చేశారు. స్వామిని బెదిరించటానికి ఒక పోలీస్ "(బందికానా) కావాలా?" అని అంటే, చిన్నపిల్లవాడిగా వున్న స్వామి భయపడకపోగా, "జైలుకొడతావా? అప్పుడే వద్దులే!" అన్నారు. జైలు అనే ఆంగ్లపదానికి జై కొట్టడమనే తెలుగు అర్థాన్ని స్వీకరించి, "జయజయ ధ్వానాలు" అనే అర్థంలో ప్రయోగించడం ఆ సమయంలో వాక్చమత్కారాన్ని తెలియచేస్తున్నట్లుగా పైకి తోచినా, భావిసూచకమైనదిగా అందరికి తర్వాత అర్థమయినది. తొమ్మిది సంవత్సరాల వయస్సులో ఒక స్వామివారు అడిగిన ప్రశ్నకు బదులిస్తూ, 'ఏమీ వద్దు' అని చెప్పటానికి, "ఏమీ కావాలనేది అక్కరలేకుండా కావాలి" అని చెప్పి, "కావాలి" అంటూనే, "ఏమీ అక్కరలేదు" అని చెప్పిన స్వామి వాగధీశ్వరుడే! వాక్యాలను, పదాలను తిప్పి చెప్పడంలో, భాషతో సంబంధము లేకుండా ఏ భాషాపదాన్ని, పదబంధాన్నయినా అలవోకగా మార్చివేసి, అప్పటి వరకూ ఆ పదానికో, ఆ వాక్యానికో వున్న అర్థాన్ని ద్విగుణీకృతం చేయగలవాడు స్వామి! "మదర్‌హుడ్ ఏమిటి? హుడ్డే మదర్ కదూ!", "డివైన్‌మదర్ ఏమిటీ? మదర్ డివైన్ కదూ!", "డివైన్‌పవర్ ఏమిటి? పవర్ డివైన్!" అని ఆ వాక్యాలలోని అర్థాలను మరింత స్పష్టం చేసేవారు. "దైవసంకల్పమేమున్నది? సంకల్పమే దైవం", భగవద్భక్తి ఏముంది? భక్తే భగవంతుడు", "స్వామి రక్షణ కాదు, రక్షణే స్వామి", "బ్రహ్మజ్ఞానము అంటారు. జ్ఞానమే బ్రహ్మ", "దైవశక్తి ఏముంది? శక్తియే దైవం" వంటి ఎన్నో వాక్యాలు స్వామి చేసిన చిన్నమార్పుతో వాక్యార్థాన్ని గాక, పరమార్థాన్ని అందించి సర్వసాధారణంగా లోకవ్యవహారంలో వున్న వాక్యాలలోని పదాలను అటూఇటూ మార్చి స్వామి చెప్పే తీరు, ఆ వాక్యార్థాన్ని ఇనుమడింపచేస్తుంది. "కఠోరసత్యం కాదు, సత్యమే కఠోరం", "మధురస్మృతి కాదు, స్మృతే మధురం", "ఆదర్శప్రేమ కాదు, ప్రేమే ఆదర్శం", నిష్కళంక ప్రేమ కాదు, ప్రేమే నిష్కళంకం" వంటి ఆ పదాలకు నిర్దుష్టమైన అర్థాలను తెలియచేస్తాయి. "జగన్మాత అంటే జగత్తుకు మాత కాదు. జగత్తే మాత" అంటారు అద్వైతమూర్తియైన మన స్వామి. "మృత్యుంజయుడు అంటే మృత్యువు అంటే భయము లేనివాడు", "సంసారం అంటే సంకల్పమే" అని, "వైకల్యం లేకపోవటమే కైవల్యం" అని, "ఆపద్బాంధవుడు అంటే ఆపదలకు బాంధవుడు" అని నిర్వచించారు. "ధ్యాసే ధ్యానం", "తృప్తే ముక్తి" వంటి చిన్నచిన్న పదాలకు ఆధ్యాత్మికమైన విశేషార్థాలను చొప్పించి, "దయలేనివారే దయ్యాలు గానీ, వేరే దయ్యాలు లేవు" అని చెప్పి మూఢనమ్మకాలకు ఏమాత్రము తావీయక, మానవతను మేల్కొల్పారు. "భ్రమే బ్రహ్మరాక్షసి". బ్రహ్మరాక్షసులంటూ ఎక్కడో లేరని, నీలోని భ్రమే బ్రహ్మరాక్షసి అని విడమరచి చెప్పారు. "సమస్యల తోరణం" అనే దాన్ని, "సమస్యలతో రణం" అని విడగొట్టి, జీవిత సత్యాలను వెలికి తీశారు స్వామి. "సిద్ధులందరూ ప్రసిద్ధులూ కారు, వక్తలందరూ ప్రవక్తలూ కారు" అంటూ సందేహానికి తావులేని సమాధానం ఇచ్చారు స్వామి. "జవాబుల కోసం వెతుక్కోవయ్యా" అని అన్నవారితో, "ఎక్కడైనా పెట్టి మర్చిపోతే కదా!" అంటూ సమాధానమిచ్చారు.

ఇలా చెప్పుకుంటూ పోతే ఒకటా రెండా, పదులా వందలా... వేలాదిగా పదబంధాలు, వాక్చమత్కారాలు, అనిర్వచనీయ నిర్వచనా వైఖరులు ఎన్నో ఎన్నెన్నో పలుకులలోని కొన్ని చమక్కులను మచ్చుతునక మాదిరిగా ఈ మారుతి మీ ముందు వుంచటమే తప్ప, స్వామి వాగ్విలాసాన్ని వర్ణించ నా తరమా!

***అన్నదానంతో బిడ్డల కడుపు నింపుతున్న సాయిమా***
***నువ్వు అపర అన్నపూర్ణవే కదా!***
***ఉపమాలంకారాలతో చెప్పటం నాకిష్టం లేదు***
***నిన్ను ఉపమేయంగా చూపటం సరైంది కాదని నా ఉద్దేశ్యం***
***లోకానికంతటికీ ఆదర్శమూర్తివి కాబట్టి***
***ఉపమానంగా నీ స్థానం సుస్థిరం***
***నీకు చేసే అలంకరణలు, నీపై కవులుపయోగించే అలంకారాలు***
***మా సంతృప్తి కోసమే గానీ,***
***సుగుణాల పసిడి కొండవు కదయ్యా నువ్వు***
***లోకరక్షకాలైన నీ లక్షణాలన్నీ స్వభావసిద్ధమే***
***స్వభావోక్తిలోనే చాటుతాను నీపట్ల మా భక్తి, ఆసక్తి, అనురక్తి***
***అన్ని నేనులూ నువ్వేనన్నావు***
***ఇంక మా మేనుల్లో అహంకారమెక్కడ మిగిల్చావు?***
***జ్ఞాన నిధివి, జ్ఞానదాయనివి అని చెప్పటం ఉత్ప్రేక్ష కాదు***
***నువ్వివ్వకుంటే పదుగురికీ పంచేందుకు మాకెక్కడిదయ్యా ఈ లేశమాత్రం జ్ఞానం***
***ఇదంతా మిమ్మల్ని మీరు తెలుసుకుంటూ, భగవత్‌తత్త్వాన్ని అర్థం చేసుకొని***
***ఈ హనుమ అవిచ్ఛిన్నంగా అందిస్తున్న ఆణిముత్యాలనేరుకుని***
***నేర్పుగా మలచుకుని, మారుతి మార్గంలో పయనించి***
***పవనకుమారుని పవిత్రసన్నిధి చేరి***
***సదా సుఖించండి, ఆధ్యాత్మికతనః అనుభవిస్తూ***
***నా చిన్నారి ముద్దుబిడ్డలారా!***

ఓం

**19-04-2019** 09:15 AM

**102)** అన్నింటికీ మూలం ఏమిటి స్వామీ?

*మూలం అనే పదానికి వేరు, ఆధారం, పునాది అనే అర్థాలున్నాయి. మూలం ఎంత పటిష్టంగా వుంటే, దానిపైన ఆధారపడినవి, దాని నుంచి రూపాంతరం చెందినవి అంత స్థిరత్వాన్ని కలిగివుంటాయి. అలాగే, వేరు ఎంత పటిష్టంగా వుంటే, ఆ చెట్టుకి అంత బలం, ఆరోగ్యం. పునాది ఎంత బలంగా*

వుంటే, ఆ భవనానికి అంత దృఢత్వం. అలాగే, వంశమూలాలు, సాంస్కృతిక మూలాలు, ఇలా స్థావర జంగమాత్మకమైన ప్రతి విషయంలోనూ మూలమే ప్రధానపాత్ర వహిస్తుంది. ఇంత చేసినా, అది పైకి కనిపించకపోవడమే ఆ మూలంలోని విశేషం. మూలాలు స్థిరమైనవి, శాశ్వితమైనవి, నశ్వరమైనవి. భావిని శాసించేది, సృష్టికి పుష్టినిచ్చేది తద్వారా వృద్ధి పొందిన వాటికి స్వతంత్రంగా జీవించే ధైర్యాన్ని, స్థైర్యాన్ని, లక్షణాలను, గుణాలను కలుగచేసేది మూలమే. వాటితో అనునిత్యం అనుసంధానమై వుంటేనే, మంచి మనుగడ వుంటుంది. అందుకే, ఎంతటి ఉన్నత స్థాయికి ఎదిగినా, ఆ ఎదుగుదలకు దోహదం చేసిన మూలాలను అనునిత్యం స్మరించుకోవాలి. అది మరచినవారు, 'కృతఘ్నులు' అనిపించుకుంటారు. అలాంటివారు జీవనగమనంలో విజయం సాధించలేరు. ఒకప్పుడు ఎలా బ్రతికారు అన్నది గుర్తుంచుకున్న మనిషిలో అహంకారము, అసూయ వుండవు. తమ జీవన మూలాలను గుర్తుంచుకుని, సత్ప్రవర్తనతో మెలిగి, మహానుభావులుగా శాశ్వతకీర్తిని పొందిన వారెందరో వున్నారు. చరిత్ర, సంస్కృతి, ఆచారాలులాంటి వాటినన్నింటికీ మూలాలు ఆయా దేశాల పురాతన సాహిత్యంలోనే వున్నాయి. ప్రపంచంలోని అన్ని దేశాల్లోనూ ప్రాచీనతకు అత్యంత ప్రాధాన్యతనివ్వటానికి కారణం అదే. భాషలు, మతాలు, అలవాట్లు, మనుగడలాంటివి దేశ, కాల, పరిస్థితులనుబట్టి వేరువేరుగా వుండవచ్చు. కానీ, విశ్వాన్ని నిడిపే అజేయమైన శక్తి మాత్రం ఒకటుంది. దానికి ఏ దేశంవారు ఏ పేరు పెట్టినా, భారతీయులు పెట్టినపేరు మాత్రం 'పరబ్రహ్మం'. దానికొక రూపం, స్థితి, స్థాయిలాంటివి లేవు. విశ్వాన్ని చైతన్యవంతంగా నడిపించడమే దాని పని. దానిని జ్ఞాననేత్రంతోనే చూడగలరు. కాబట్టి, జ్ఞానమే జీవన గమనానికి మూలం. ఈ విషయాన్ని గమనించి ప్రతి ఒక్కరూ జ్ఞానవంతులు కావాలి, జీవిత పరమార్థం నెరవేర్చుకోవాలి అన్నది నా అభిప్రాయం.

***ఆంజనేయుని భాషను ఆకళింపు చేసుకుని***
***అరుదైన భాషను అందిస్తున్న వైనాన్ని,***
***సంస్కారాన్ని, సంస్కృతిని నేర్పే భాష ఈ ఆంజనేయునిది.***
***కవితా సౌరభ్యం కలిగిస్తూ, అచ్చమైన, స్వచ్ఛమైన, అమరమైన భాషను***
***మధురానుభూతులను పదుగురికీ పంచుతూ***
***అనునిత్యం అమృతధారలొలికిస్తూ, అఖండ జ్యోతులవలే వెలుగును నింపు***
***ఈ ఆంజనేయుని భాషను కాసింత శ్రద్ధ వహించి***
***మీకేది నప్పుతుందో ఎంచుకుని, అవసరమైతే నిపుణుల సలహాలతో***
***తనపై తనకు గల నమ్మకమే జీవితాన్ని నిలబెడుతుందని తెలుసుకుంటే,***
***అంతర్మథనం నుండి ఆంజనేయుని పదాలు అతి సున్నితంగా పలుకరించి,***
***పారవశ్యతను పొందేలా చేసి, పరమార్థాన్ని బోధించి***
***భవ్యమైన జీవనగమ్యాన్ని చేరుస్తుంది అని వక్కాణించి చెబుతున్న***
***ఈ ఆంజనేయుని చేరు మార్గం అతి చేరువలోనే వున్నది***
***నా చిన్నారి ముద్దుబిడ్డలారా!***

ఓం

**25-04-2019** 07:40 AM

### 103) తల్లి, తండ్రి, గురువు మరియు దైవము యొక్క పాత్ర ఏమిటి స్వామీ?

*మానవజన్మ దేవుడిచ్చిన ఒక వరం. జన్మలన్నింటిలోనూ మానవజన్మ ఒక గొప్ప ప్రస్థానం. అది తెలుసుకుని జీవించటమే మనసున్న మనిషిగా నీకు ఒక సంకల్పం. పుట్టుక వరకు దేవుని బాధ్యత. తర్వాత బాల్యం నుండి యవ్వనం వరకు తల్లిదండ్రులు, గురువులు నీ అభివృద్ధి కొరకు పునాది వేస్తారు. అంతవరకు నీ జీవితం వారి చేతుల్లోనే వుంటుంది. అంతవరకే వారి బాధ్యత కూడా. తర్వాత నీ జీవితం, వయస్సుతోపాటు మనసు కూడా పరివర్తన చెందుతూ వుంటుంది. అప్పటి నుంచి, నీ యొక్క దారి, జీవితసంకల్పం, ప్రయోజకత్వం నేర్చుకుని, తెలుసుకునే బాధ్యత నీ మీదనే వుంటుంది. నీ అభివృద్ధికి తల్లిదండ్రులు, గురువు ఏ స్వార్థంతోనూ ఆ పనిచెయ్యరు. అది వారి బాధ్యతగా వ్యవహరిస్తారు. తర్వాత నీ వయసు పెరుగుతుంది. మనసు వికసిస్తూ వుంటుంది. అప్పటి నుండి, నీవు సక్రమమైన మార్గంలో నడుస్తావో, వక్రమార్గంలో పయనిస్తావో నిర్ణయించుకునే అధికారం నీదే. నీవు ఎలా నడవాలంటే అలా నడవటానికి సమాజంలో అన్ని దారులూ వున్నాయి. నాడు జన్మించిన దగ్గర నుంచి, సగం జీవితకాలం తల్లిదండ్రులు, గురువులు చెప్పుచేతల్లో వుండి నేర్చుకుని నడిచేవారు. నేడు అది కరువైంది. నేడు కొద్దిగా 'ఊహ' తెలిసి, వయసు పెరిగేకొద్దీ "నాకు నేనే గొప్ప మగాడ్ని. నాకు అంతా తెలుసు. నాకు ఎవరూ చెప్పనవసరం లేదు" అనే మనస్తత్త్వం ఎక్కువైపోయింది. అతిస్వేచ్ఛ నేటి యువతకు, పిల్లలకు. అయితే ఆ ఒడ్డు, లేకపోతే ఈ ఒడ్డు అన్నట్లు అవుతున్నారు. వయసు, మనస్సు పరిణతి చెందించుకుని, మీ జీవితాలలోకి ఆశయాలతో కూడిన సక్రమమైన బాట మీరే వేసుకోవాలి. దొరికిన గురువును చేయి వీడక చెప్పిన దానిని వినయంతో ఆచరణ చెయ్యండి. ఎన్నో జన్మల పుణ్యఫలంగా దొరికిన ఈ అవకాశాన్ని చేయిజార్చుకోకండి. చిత్‌స్వరూపుడైన చిదానందునకు స్వయంపోషక కర్తయై, ఆవలితీరాన్ని చేర్చటానికి నడుంకట్టి, ఆంజనేయుని రూపంలో అతి చేరువలో వుండి నడిపిస్తున్నాడు. అహంకార మమకారాల్ని, మమతానురాగాలను, ఆవేశకావేశాలను, మీమీ అభిప్రాయాలను మట్టుబెట్టి, క్రోధాగ్నిని యాగాగ్నిగా మార్చుకుని సద్బుద్ధులనే సమిధలను హవిస్సులుగా అర్పించి, సార్థకత్వాన్ని పొంది, గురువు, సద్గురువుల చేతిలో పనిముట్లుగా మారండి. దాసులుకండి, దాస్యం నుండి విడుదలకండి. భవబంధాల నుండి విముక్తిని పొందండి. సుకృతము వెంటపడితే, సున్నితంగా, సూక్ష్మంగా, సునిశితబుద్ధితో సూదంటురాయివలే సూక్ష్మాతిసూక్ష్మమైన ఆత్మలో లయమవుట ఖచ్చితమని ఈ ఆంజనేయుడు మీకు చేతిలో చేయివేసి ప్రమాణపూర్వకంగా గురూపదేశంగా ఆజ్ఞను పాలించమని చెబుతున్నాను, లేదా ఆజ్ఞ జారీ చేస్తున్నాను.*

***నరుడు భువిపై జన్మించినాడు***
***నరసంబంధ బాంధవ్యాలు పెంపొందించుకుని, ఐకమత్యభావాలను విడనాడి,***
***అభివృద్ధి దిశగా అడుగులు వేయవలసిన నరుడు నేడు ఎందుకు మారిపోయాడు?***
***భవబంధాల విలువలను తెగగొట్టుకుని, పైకి ధ్యానమగ్నుడై వున్నా,***

***లోపల స్వార్థం అనే రాక్షసి తత్త్వాన్ని కలిగి వుంటూ,***
***మానవీయ విలువలను మరచి మారిపోతే ఎలా?***
***మారుతి మాటలు మన్నించి మనుగడ నిస్వార్థంగా మలచుకుని***
***మంచివారుగా మారి, మారుతి మదిలో సుస్థిర స్థానాన్ని పొంది,***
***పొదుగులో దాచుకున్న అమృతభాండాన్ని బయటకు తీసి అమృతాన్ని గ్రోలి,***
***ఆంజనేయుని అతి చేరువకు చేరండి సాధకులైన***
***నా ఈ చిన్నారి ముద్దుబిడ్డలారా!***

ॐ

**26-04-2019** 09:40 AM

*తెలిపినవి తెలిపినట్లు, తెలిసినది తెలిసినటుల, యోగ్యమైనది, భవ్యమైనది, భాగ్యమైనది, భజరంగభళి అందించు అఖండమైన జ్ఞానప్రవాహంలో అద్భుతమైన, అత్యద్భుతమైన, అసమాన ఆజ్ఞాపాలన కర్తవ్యంగా భావించి భాసిల్లాలని అందిస్తున్న వైనాన్ని అందుకుని, అడుగు అడుగు ఊర్ధ్వముఖంగా ఉన్నతులై, ఉభయ జీవనయానాన్ని కొనసాగిస్తూ, కొసరి కొసరి వడ్డిస్తున్న వీరాంజనేయుని వీరోపదేశాల్ని వీనుల విందుగా విని తరించటానికి తత్క్షణమే సమాయత్తమై ఉరకండి నా చిన్నారిబిడ్డలారా!*

ॐ

**06-05-2019** 07:15 PM

**104) సాధకుడు స్వయంకృషితో సాధన చేయవలసిన ఆవశ్యకత ఎటువంటిది స్వామీ?**

*మీ గతంలో ఏవో, ఎవరో ఘనకార్యాలు చేసినంత మాత్రాన మీరు ఘనమైన వారేమీ అయిపోరు. వారి గొప్పదనం మీకేమీ శాశ్వితమైన గౌరవాన్ని తెచ్చిపెట్టదు. మీరు వేయవలసిన ఎన్నో సుస్థిరమైన అడుగులకు, ఘనవారసత్వం కొంత స్ఫూర్తినివ్వాలి, నమ్మకాన్నివ్వాలి అంతే. గడచిన కాలంలో ఎవరో ఏదో సాధించారని సంబరపడకుండా, మీ ప్రత్యేకతను, మీ ప్రాభవాన్ని మీరు రుజువు చేసుకోవాలి. మూసధోరణిలోనే ముందుకు వెళ్ళటానికి మొగ్గుచూపుతారు. తండ్రులపేరో, తాతలపేర్లో, వంశాలపేరో, వెనుక తరాలపేరో చెప్పుకుని బ్రతికేస్తూ వుంటారు. చెట్టుపేరు చెప్పుకుని ఎన్నాళ్ళు ఇలా కాయలు అమ్ముకుంటారు? మీరూ ఓ మొక్క నాటి మంచిచెట్టుగా పెంచి, ఆ పళ్ళు ఆరగించి, అమ్ముకున్నప్పుడే, మీ జన్మ సార్థకత. మిమ్మల్ని మీరు ఆవిష్కరించుకునే సాధనలో కారకంగా మిమ్మల్ని మీరు స్వీకరించాలి. ఎక్కడో చదివితేనో, ఏదో అనుకూలిస్తేనో అందలమెక్కుతాం అనుకోవటం, మీ మానసిక బలహీనతకు నిదర్శనం. చెట్టునీడన విత్తనాలు మొలకెత్తవు. వాటిని చెట్టుకు దూరంగా వేసినప్పుడే ఏపుగా ఎదుగుతాయి. ఈసన్యసత్వమనేది అదే. తల్లిదండ్రులకు, బంధువులకు దూరంగా వుంచి, వున్న శక్తినంతా ఈ మొక్కకే అందించి, దీన్ని భద్రంగా పెంచే ప్రయత్నమే సద్గురువు తోటమాలి పని. ఏపుగా పండ్లు కాసే చెట్టు*

*సిద్ధంగా వుంటే, దాని ఫలాలను తింటూ, అవసరమైతే అమ్ముకుంటూ కాలం గడపక, కొత్త చెట్టుకోసం కష్టపడటమెందుకు? అసలు ఆ మొక్క మొలుస్తుందో లేదో అని నిరాశావాదులు (మీ అనుకునేవారు) నిరుత్సాహపర్చవచ్చు. కాని, అసాధ్యాలను సుసాధ్యం చేయవచ్చు. అనేక ప్రయోగాలు, ప్రయాసలతోటే జీవితం పరిపూర్ణమవుతుంది. మీలో చాలామంది ఎవరో సాధించిన వారి చరిత్రలను చర్వితచరణం చేసుకోవటం వరకే పరిమితమవుతారు తప్ప, మేమూ చరిత్రలో ఓ పుటలా మిగిలిపోదామనుకోరు. రాముడైనా, కృష్ణుడైనా, సాయిరాముడైనా, ఆంజనేయుడైనా వారిని కీర్తిస్తూ కూర్చుంటారా? వాళ్ళేం సాధించారో తెలుసుకుంటారా? దానిని సాధించే ప్రయత్నం చేసి విజయ సాధకులవుతారా? లేదా? ఎవరో వడ్డించిన విస్తరిలో మీరు తినటం కన్నా, మీరే కుట్టుకున్న విస్తరిలో విందారగించడం ఎంత సంతృప్తి వుంటుందో ఆలోచించండి. ఆత్మవిశ్వాసానికి, ఆత్మగౌరవానికి అర్థంగా నిలవాలి!*

### 105) ఆలోచనలను ఏ విధంగా అరికట్టాలి స్వామీ?

*మీ ఆలోచనలు మంచివైతే నిర్మాణాత్మకమైనవైతే, వాటి ప్రభావం ఆచరణలో సుస్పష్టంగా ప్రతిబింబిస్తుంది. ప్రతిరోజూ సగటున 50 వేల నుండి 60 వేల పైచిలుకు ఆలోచనలు వస్తాయి. ఎంతో జాగ్రత్త వహిస్తే తప్ప, అవి వరదలా వచ్చిపడ్తాయి. ఇలా నిరంతరం కొనసాగే ప్రక్రియ గురించి జాగ్రత్త వహించకపోతే, ఆ ఆలోచనలు ప్రక్కదారి పట్టిస్తాయి. అనుభవం వల్ల కొంత, సంస్కారంవల్ల కొంత, సునిశిత పరిశీలనవలన కొంత, ఆధ్యాత్మిక చింతనలవల్ల కొంత మీమీ ఆలోచనలు మిమ్ములను క్రిందపడవేయకుండా జాగ్రత్తపడేలా చేసుకోగలగాలి. లేకపోతే, ఆ ఆలోచనలు మీ మనస్సులలో స్థిరనివాసం ఏర్పర్చుకుంటాయి అని మరలా మరలా మరలా నొక్కి చెబుతున్నాను. ఆధ్యాత్మిక చింతన గలవారే విలువలపట్ల అవగాహన కల్గివుంటారు. ఓటమి ఎదురైనా నిరుత్సాహపడకుండా ముందుకు సాగటానికి దిశానిర్దేశము చేయుట ఈ ఆంజనేయుని కర్తవ్యం. మనస్సును చక్కని మార్గంలో ప్రయాణించేలా చేయటం సాధకుల బాధ్యతగా స్వీకరించవలసిన అవసరం ఉన్నదని ఈ ఆంజనేయుడు పదేపదే జ్ఞప్తిచేస్తున్నాడు. రోజుకొక ఆలోచన, నెలకొక మార్గం అంటే, మీరు ఎక్కడ వున్నవారు అక్కడే వుండిపోతారు. ప్రతిపనిలో, ప్రతి లక్ష్యంలో సవాళ్ళు, సమస్యలు వుంటాయి. అవరోధాలు ఎదురవుతాయి. నిర్దుష్టమైన లక్ష్యంతో సదా ముందుకు సాగాలి. అటువంటి వారికి దైవం సదా ధైర్యాన్ని, స్థైర్యాన్ని ప్రసాదిస్తాడు.*

***నా భాష విమలభాష. విశ్వాసం తేజరిల్లుతుంది.***
***అంతే లేని ఆనందసాగరమది.***
***ఘనీభవించిన హృదయాలలో సుతిమెత్తగా రాలుతుంది హిమం***
***సముద్రం ఎగసినా, ఉప్పెన ముప్పైనా, గుండె చెదరని ఆత్మవిశ్వాసంతో***
***చక్కనైన, చిక్కనైన, కమ్మని భాషతో మల్లెల సౌరభం, చందన సుగంధం,***
***గులాబీల అందం, వెన్నెల చల్లదనం, మకరందపు మాధుర్యం కలగలిపి***
***ఆధ్యాత్మిక బోధలను, ఓంకార నాదాలను, రామనామ మాధుర్యాన్ని***
***పదములే ఎరుగని పసిబిడ్డలకు, పరవశించే పద్యాల రూపంలో***
***అందించిన ఆంజనేయుని అనుంగు సోదరునివలే, మిత్రునివలే***

**అక్కున చేరి, ఆనందాశ్రువులు అందించి, అభయాన్ని అందుకోండి**
**ఆశ్రితులైన ఆంజనేయుని చిన్నారి ముద్దుబిడ్డలారా!**

*భగవానునిచే సృష్టించబడిన మానవదేహమే పుండు. తినే ఆహారమే దానికి తగిన మందు. ధరించే వస్త్రమే దానికి కట్టే బ్యాండేజీ. త్రాగే నీరే పుండును కడిగి శుభ్రపరిచే ద్రవం. ఈ భావనతో దేహాభిమానాన్ని పూర్తిగా వదిలివేసి, ఆత్మాభిమానాన్ని అభివృద్ధి చేసుకోవాలి!*

ఓం

**07-05-2019** 07:30 PM

## 106) భగవద్గీత పారాయణం వల్ల కలుగు ఉపకారం ఏమిటి స్వామీ?

*మిమ్మల్ని భగవద్గీత పారాయణ చేయమని స్వామి చెప్పారు. భగవంతుడు నిర్దేశించిన దాన్లో ఏదో ఒక విశేషం లేకుండా వుండదు. దానిని త్రికరణశుద్ధిగా చేస్తున్నారా లేదా అన్నది ప్రశ్న. అది మీకు మీరు వేసుకుని, సమాధానం పొందవలసినది. మనిషి బుద్ధిని వ్యామోహములకు దూరం చేసి, అసలు నిజం తెలుసుకునేటట్లుగా చేసి, కర్తవ్యోన్ముఖునిగా తీర్చిదిద్దేదే భగవద్గీత. కర్తవ్యానుగుణమైన కర్మ ప్రాధాన్యతను వివరించి, జీవితాన్ని ఋజుమార్గంలో నడిపించి మనిషిని మహనీయుడిని చేసే అద్భుతశక్తి భగవద్గీతే. అటువంటి భగవద్గీతలో ఏయే అధ్యాయాలు చదివితే, ఏ జ్ఞానం లభ్యమవుతుందో తెలుసుకోండి. విడివిడిగా పొందే జ్ఞానం సంపూర్ణంగా పఠించి పూర్ణంగా పొందండి.*

*1. అర్జునవిషాదయోగం : పూర్వజన్మ స్మృతి కలిగిస్తుంది.*
*2. సాంఖ్యయోగం : ఆత్మస్వరూపాన్ని తెలియచేస్తుంది.*
*3. కర్మయోగం : అకాలమృతిని పొంది ప్రేతత్వం పోని జీవులు పరిసరాలలో వుంటే, వాటి ప్రేతత్వం నశిస్తుంది.*
*4, 5. జ్ఞానయోగం, కర్మసన్యాసయోగం : పశుపక్షుల పాపం నశించి ఉత్తమగతిని పొందుతాయి.*
*6. ఆత్మసంయమయోగం : సమస్త దానాల ఫలితం కలిగిస్తుంది.*
*7. విజ్ఞానయోగం : జన్మరాహిత్యం ప్రసాదిస్తుంది.*
*8. అక్షరపరబ్రహ్మయోగం : స్థావరత్వం, బ్రహ్మరాక్షసత్వం దూరమవుతాయి.*
*9. రాజవిద్యా రాజగుహ్యయోగం : పరుల నుండి ఏదైనా గ్రహిస్తే, వారి నుండి సంక్రమించే పాపం నశిస్తుంది.*
*10. విభూతియోగం : ఆశ్రమధర్మాల సక్రమ నిర్వహణవల్ల లభించే పుణ్యం కల్గుతుంది.*
*11. విశ్వరూపసందర్శనయోగం : మృతులు కూడా పునర్జీవులు అవుతారు.*

| | | |
|---|---|---|
| 12. భక్తియోగం | : | ఇష్టదేవతా సాక్షాత్కారం లభిస్తుంది. |
| 13. క్షేత్రక్షేత్రజ్ఞవిభాగయోగం | : | చంచలత్వం దూరమవుతుంది. |
| 14. గుణత్రయవిభాగయోగం | : | స్త్రీహత్యా పాతకం, వ్యభిచార దోషం నశిస్తుంది. |
| 15. పురుషోత్తమప్రాప్తియోగం | : | ఆహారవృద్ధి కలుగుతుంది. |
| 16. దైవాసురసంపద్విభాగయోగం | : | అధైర్యము నశించి ధైర్యం కలిగి సుఖశాంతులు లభిస్తాయి. |
| 17. శ్రద్ధాత్రయవిభాగయోగం | : | సమస్త భయంకర రోగాలు దూరమై, స్వస్థత చేకూరుతుంది. |
| 18. మోక్షసన్యాసయోగం | : | సకలారిష్టములు తొలగి, మోక్షప్రాప్తి కల్గుతుంది. |

విశ్వాసముంటే విధినైనా ఎదిరించవచ్చు. విశ్వాసముంటే విశ్వాన్ని జయించవచ్చు. విధిని కూడా వశము చేసుకునే శక్తి ధర్మపథానికుంది. ప్రాపంచికంలో మానవుడు ఎప్పుడూ కూడా న్యాయాన్ని, ధర్మాన్ని విడనాడకుండా జీవితాన్ని గడపాలి. ధర్మాన్ని, సత్యాన్ని, న్యాయాన్ని మీరు రక్షించినప్పుడు, ఈ మూడూ మిమ్మల్ని శారీరక, మానసిక ఆరోగ్యంతో వుంచుతూ, ఉన్నతస్థితికి చేరుస్తాయి. "పునరపి జననం, పునరపి మరణం" అన్నది కర్మసిద్ధాంతం. జననం, మరణం ముగించుకుని, శివైక్యం కావాలి. అందుకే మానవజన్మను తీసుకున్నారు.

***వేలకు వేలు వెచ్చించి, వేలమైళ్ళు పయనించి, పుణ్యనదులలో స్నానమాచరించి,***
***వేలుపులనెందరినో వేడుకుని, ముడుపులు కానుకలు చెల్లించుకుని,***
***వ్యయప్రయాసలకోర్చుకుని, వెతలు చెంది***
***కోరికలు తీర్చమని దేవుని కోరుట కన్నా,***
***ఆపదలో వున్నవారిని ఆదుకున్న, ఆపన్నులకభయహస్తమునిచ్చిన,***
***ఆకలి కడుపులకు అన్నం పెట్టిన, దీనంగా వున్న దీనుల దిగులు తీర్చిన***
***ఇట్టి పరోపకార పనులెంతయో మిన్న!***
***మానవసేవే మాధవసేవ అని భావించండి.***
***ఆపద్బాంధవులకే అనంతుని అనురాగం దక్కు***
***అట్టివారిని కష్టాల కడలిని దాటించు, ఇష్టాలనెన్నింటినో నెరవేర్చు***
***ఎంత చెప్పినా, ఇంత చెప్పినా, ఇసుమంతైనా పాటించి***
***పావనమార్గమున పయనించి, పవనకుమారుని పలుకులు***
***పసిడిప్రాయపు చిన్నబిడ్డలైన మీకు మురిపెంతో ముద్దులు కుమ్మరిస్తూ,***
***మారుతి మనసు విప్పి, మాయాధీనులైన మానవకోటికి***
***మహాహర్షంతో అందిస్తున్న విలువగల ఈ రత్నహారాన్ని ధరించి***
***ధరపై ధగధగ శోభాయమానంగా వెలుగులు చిందిస్తూ దరిచేరండి***
***ఆశ్రితులైన నా చిన్నారి ముద్దుబిడ్డలారా!***

ఓం

**08-05-2019** 08:55 AM

**107) మహాభారతములోని అంతరార్థము ఏమిటి స్వామీ?**

*భారతము వినే వుంటారు. దానిలోని అంతరార్థాన్ని గ్రహించారా? భారతగాథలో పాండవులందరూ అన్నగారైన ధర్మరాజు మాటకు కట్టుబడివున్నారు. సాధనాంశములన్నీ ధర్మాధర్మ వివేకమునకు కట్టుబడి ఉండునన్న తత్త్వమునకు ఇది కథలోని సూచన. మోక్షసాధన యుద్ధంలో సాధకుడు తన కామశత్రువులనందరినీ చంపి, తన లోకములను జయించి, తన సాధనాంశములతో తానొక్కడే మిగిలివుంటాడని చెప్పుటకే కథలో యుద్ధానంతరం పంచపాండవులే మిగిలివున్నారు. ఇదే సాధకునకు కైవల్యం. సాధకుడు కేవలమై నిలిచే స్థితి. కుంతికి ధర్మరాజు పుట్టుసరికి, గాంధారి ఏడు మాసముల గర్భిణి. కుంతి ముందుగా ప్రసవిస్తే కుంతీపుత్రుడు రాజ్యాధికారికాగలడు. కుంతి కంటే ముందుగా తాను పుత్రుని కనవలెనని ఈర్ష్యతో తొందరపడి గాంధారి తన అసంపూర్ణ గర్భం పగులగొట్టుకున్నది. ఆ గర్భం నూటొక్క ముక్కలుగా బయటపడ్డది. వాటిని సీసాలలో (ద్రావకములో) భద్రపరిచారు. కాలాన అవి నూటొక్క శిశువులైనవి. ఈ విధంగా కౌరవులు క్రమం తప్పి పుట్టినవారైనారు. కామశత్రువుల జన్మలిట్లే వుంటాయి. వారు అటు తల్లిదండ్రులకు పుట్టినవారునూ కాదు, ద్రావకములో పుట్టినవారునూ కారు. అటు పరమార్థమునకూ పనికిరానివి, ఇటు వ్యవహార జీవితమునకూ సరికానివి. దుర్యోధనుని జననకాల స్థితుల విపరీతములను భారతం వర్ణించింది. పుట్టగనే దుర్యోధనుని వధించి కురువంశమును కాపాడమని విదురుడు ధృతరాష్ట్రునికి అనేక రీతుల నీతులను చెప్పినాడు. పుత్రవాత్సల్యం చేతచిక్కిన ధృతరాష్ట్రుడు లక్ష్యపెట్టకపోగా, అంతకు మించి ముద్దుగా ప్రియపుత్రునికి 'సుయోధనుడు' అని పేరు పెట్టుకున్నాడు. సుయోధనుడనగా, మంచి ఆలోచనలు గలవాడని అర్థము. కానీ, రాజ్యకాంక్ష వలన అసూయను పెంచుకొని, పాండవులను చంపే ప్రయత్నం పట్టినాడు. కామాదులరాజు దుర్యోధనుడి సాధనాంశములను చంపే వ్రతం పట్టింది. అతని ప్రవర్తనలో ఒక్కటైనా మంచి ఆలోచన లేనందువలన, కృష్ణభగవానుడు కాలాన, సుయోధనునకు బదులు దుర్యోధనుడు అని పేరు మార్చాడు. దుర్యోధనుడన్న పేరు చరితార్థమైంది. దుకారారంభశీలురు కౌరవులు. కామభావములన్నీ సుయోధనమువలే తోచి, దుర్యోధనునివలే ప్రవర్తించేవేగా. పవిత్రంగా జన్మించినవి సాధనాంశములు (పాండవులు) - క్రమం తప్పి (అక్రమంలో) పుట్టినవి కామభావములు (కౌరవులు). జన్మలోనే పూర్తి వ్యతిరేకత వున్నది. ఈషణ అనగా కోరిక, వేగమని కూడా అర్థం ఈ పదానికి వున్నది. అంటే తీవ్రమైన కోరిక, వేగంగా ప్రయాణించేది. అందుకే దీనిని ఈషణత్రయం అంటారు. 1) భోగేషణ, (విత్తేషణ, ధనేషణ) 2) శాస్త్రేషణ, (లోకేషణ) 3) దారేషణ (పుత్రేషణ).*

*మానవుడు నిజానికి జగద్విలక్షణమైన ఆత్మస్వరూపుడే అయినా, శాశ్వత సుఖస్వరూపుడే అయినా, ఆత్మకంటే వేరైన దానిని ఏదైనాసరే అనుభవించాలనే ప్రవృత్తిని అంటే, బహిర్ముఖమై వుండే ప్రవృత్తిని భోగేషణ అంటారు. ఇవి 8 విధాలు. 1) గృహం 2) శయ్య 3) వస్త్రం 4) ఆభరణం 5) స్త్రీకి పురుషుడు,*

*పురుషుడికి స్త్రీ 6) పుష్పం 7) గంధం 8) తాంబూలం అని చెబుతారే గానీ, మానవునికి లెక్కలేనన్ని భోగములు వున్నవి. అవి అనుభవించటానికి ధనం కావాలి కదా! ఆ ధనం కొరకు ప్రాకులాడుతూ, న్యాయాన్యాయాలు విచారించక, బహిరంగంగా బహిర్ముఖుడవుతాడు. ఇది భోగేషణలో వేగం. హంస పాలు, నీరు కలిసిన దానిలో ఎలా పాలనే గ్రహిస్తుందో, అట్లే సర్వత్రా వ్యాపించి వున్న తత్త్వసారాన్ని తెలియచెబుతున్నాను. శాస్త్రాలు చాలా రకాలుగా మీకు చెప్పినా, ఈ ఆంజనేయుడు పలురకాలుగా బోధించినా, స్వామి అనేక రీతులుగా చెప్పినా, సగటు మానవుడు ఇహలోక భోగములే గాక, ఇంకా అనేక అధిక భోగములు అనుభవించాలని, స్వర్గం మొదలైన అనేక పుణ్యలోకాలు కలుగుతాయని ఆశపడి, కీర్తిప్రతిష్ఠల కొరకు ప్రాకులాడుటయే వేగం అని చెబుతాను. భార్య, కొడుకులు, కూతుళ్ళు, మనుమలు, మునిమనుమలు, బంధువులందరునూ తనకు సుఖం ఇస్తారని భ్రమ చెందుతారు. వారి వలన కలుగు బంధం గుర్తించలేరు సరికదా, నిత్యమూ దుఃఖమే కలుగుతున్నప్పటికీ, సాలీడు గూటిలో చిక్కుకుని బయటపడే మార్గం తెలియక పట్టుబడి సాలీడుకు ఎరగా అయ్యే పురుగులవలే, సంసారం నుండి బయటపడే మార్గం తెలియక, మృత్యుసంసారమునకు ఎరగా అవుతారు. ఇది దారేషణ, పుత్రేషణ, కాలం, బలం, ధనం, సర్వమూ వారికే అర్పించి, వారిలో ఎవరికైనా కష్టము, నష్టము కలిగితే తనకే కలిగినట్లు దుః ఖిస్తారు. అంతలో సంసారము దుఃఖమని భావిస్తారు. అయినా, అంతిమ ఘడియవరకూ వారికి లౌకికంగా ఏదైనా సమకూర్చాలనే ప్రయత్నిస్తారు. సంసారంలో అంతా దుఃఖమే అనే తన అనుభవం వారికి చెప్పి, వారినైనా సంసారబంధం నుండి తప్పించుటకు కొంతైనా ప్రయత్నించరు, సుంతైనా దయచూపరు. వారి వలన పీడితులై, గత్యంతరం లేక, తమకున్నది వారికి వ్రాసి యిచ్చి, ముందుగా వారిచే చంపబడి, తర్వాత మృత్యుముఖంలో సుఖంగా చిక్కుకుంటాడు. ఇది దారేషణలో వేగం. మానవునిలోని ఈషణత్రయాది కామాలే కౌరవసేన, సాధకుని కర్మలకు ఉపకరించే పంచ కర్మేంద్రియాలు, పంచ జ్ఞానేంద్రియాలు, పంచ ప్రాణాలు, మనసు, బుద్ధి, చిత్తం, అహంకారం, సప్తధాతువులు అనేవి పాండవసేన. సాధకుడు ఈ సాధనాంశములను పునః విచారణ చేసి, ఈషణత్రయాది కామములను జయిస్తే, తప్పక జీవన్ముక్తుడై జీవిస్తాడు.*

***పలు పలు భాషల సుందర హృదయనేత్రులై,***
***అందరినీ ఒకటిగా చూసే పవిత్ర ధాత్రిపై***
***రాతిని, నాతిని కూడా పూజిస్తూ జగతికి సందేశాలను అందిస్తూ,***
***కైవల్యపథం వైపు నడిచి, జీవన సాఫల్యాన్ని సాధించే ప్రయత్నములో,***
***సద్గురువు చేయి పట్టుకుని, ప్రేమతో పలుకరించి,***
***ప్రేమతత్త్వంతో సంపూర్ణ ప్రేమమయులై, ప్రేమ అంతరార్థాన్ని గ్రహించి,***
***సర్వజనహితము కోరే సంపన్నులై,***
***నిత్యమూ నామస్మరణతో, మోహసాగరాన్ని దాటి,***
***మీకోసమై ఎదురుచూస్తున్న ఏలిక అయిన సాయిరాముడు***
***బంటు హనుమను చేరి సదా సుఖించండి***
***నా చిన్నారి ముద్దుబిడ్డలారా!***

ॐ

**09-05-2019** 08:50 AM

## 108) దానం ఎలా చేయాలి స్వామీ?

*'విశ్వజిత్' అనే యజ్ఞం ఒకటి వున్నది. ఆ యజ్ఞం చేసేవారు తమ సమస్త సంపదను దానం చేయాలి. మీరు తిరుపతిలో ఇచ్చే నిలువుదోపిడీలాంటిదన్నమాట. ఒక గృహస్థుడు 'విశ్వజిత్' యజ్ఞాన్ని సంకల్పించాడు. యజ్ఞవిధి ప్రకారం గృహస్థుడు గోదానాలు ఇవ్వసాగాడు. కానీ, ఆ గోవులు "పీతోదకా, జాగ్ధతృణా, దుగ్ధదోహాః నిరింద్రియాః". అంటే, ఆ ఆవులు ప్రాణంపోయే దశలో వున్నాయి. నీళ్ళు త్రాగలేవు, గడ్డి తినలేవు, పాలిచ్చే ప్రశ్నలేదు. జవసత్వాలుడిగి వున్నాయి. తనకు భారమైన ఆవులను వదిలించుకోవటానికి ఇదొక ఉపాయంగా యజ్ఞాన్ని తండ్రి నిర్వహిస్తున్నాడని కుమారుడు గ్రహించాడు. ఇలాంటి వ్యర్థ యజ్ఞమువల్ల కలిగే ఆనందం ఏమిటి? అని బాధపడ్డాడు. ప్రపంచంలో మీకు ఇలాంటివారు కనిపిస్తూనే వుంటారు. లేకపోవటం దరిద్రం. కానీ, వున్నా ఇవ్వలేకపోవటం మానసిక దరిద్రం. కొందరు తమకు పనికిరాని వస్తువులను దానం చేస్తూంటారు. వాటివల్ల పుణ్యం ఎలానూ రాదు, ఆ వస్తువులు పనికిరానందుకు, వాటిని తీసుకున్నవారి శాపనార్థాలు తగులుతాయి. మిగిలిపోయినవి, పాచిపోయినవి అయిన ఆహారపదార్థాలు పనివాళ్ళకు వేయటమంత మహాపాపం మరొకటి లేదు. తినటానికి యోగ్యమైన ఆహారాన్నే ఇతరులకు పెట్టాలి. ఎవరికి ఏ ఆహారం పెట్టినా తల్లి మనసుతో పెట్టాలి. ఉన్నంతలో తృప్తిగా పెట్టాలి. ఇది మనుష్యులకే కాదు, మీ చేత్తో ఏ ప్రాణికి ఆహారం పెట్టినా అలాగే పెట్టాలి. అప్పుడే సర్వప్రాణులలో వున్న పరమాత్మ సంతోషపడ్తాడు. భగవంతుడు ఒక ఆలయంలోనే ఉంటాడనుకోకూడదు. ప్రతి దేహమూ ఆలయమే. ప్రతి ఆత్మ దైవస్వరూపమే. తండ్రికి ఇలాంటి భావన లేకపోవుటవల్ల, పనికిమాలిన దానాలు చేయసాగాడు. తండ్రి ధోరణికి బాధపడ్తూనే కొడుకు తండ్రి వద్దకు వెళ్ళి, "కస్మైమాందాస్య సీతి" "తండ్రీ! అంటే నన్ను ఏ ఋత్విక్కునకు దానం చేస్తావు?" అని అడిగాడు. కానీ, తండ్రి జవాబు ఇవ్వకపోవటం చేత, మరి రెండుసార్లు అడిగాడు. దాంతో తండ్రికి కోపం వచ్చింది. "మృత్యువే వైవస్వతాయ త్వాత్వాం దదామి ఇతి" "నిన్ను సూర్యుని కుమారుడు యమధర్మరాజుకి ఇస్తాను" అన్నాడు ఆగ్రహంతో. కోపం ఎంత అనర్థదాయకమో చూడండి! ఒక ప్రక్క తండ్రి చేస్తున్నది ధర్మవిరుద్ధమనే సత్యాన్ని తెలుసుకోలేకుండా వున్నాడు. రెండో ప్రక్క తన అధర్మకార్యం వలన నరకానికి వెళ్ళవలసి వస్తుందనే బాధ కొద్దీ, కుమారుడు అడ్డుపడుతుంటే, ఆగ్రహంతో అమంగళంగా, "నిన్ను యమునికి ఇస్తున్నాను" అనటం ఎంత అనౌచిత్యం! కానీ అనేశాడు గనుక, అలాగే చెయ్యమని కుమారుడు పట్టుబట్టాడు. చివరకు తండ్రి, కొడుకును యమలోకానికి పంపాడు. ఇక్కడ ఒక విశేషం జరిగింది. కొడుకు వెళ్ళిన సమయంలో యమధర్మరాజు తన లోకంలో లేడు. ఆయన కోసం నిరీక్షిస్తూ మూడురోజులు ఉపవాసమున్నాడు. మునిబాలుడు కాబట్టి, యథావిధిగా సంధ్యావందన, గాయత్రి మంత్రము, శివధ్యానము వంటివి చేస్తున్నాడు. యమధర్మరాజు తిరిగి వచ్చాడు. తన ఇంట అతిథిగా వున్న ఆ బిడ్డ గురించి ఆయన మంత్రులు, భార్య ఇలా చెప్పారు, "ఓ ధర్మదేవతా! ఎవరి ఇంట బ్రాహ్మణుడు*

ఉపవాసం వుంటాడో, ఆ గృహ యజమానికి పాపములు కలుగుతాయి. పుణ్యం తరిగిపోతుంది. కాబట్టి, తమరు తత్క్షణమే ఆ బ్రాహ్మణబాలుని ప్రసన్నుని చేసుకోవలసినది" అని అర్థించారు. వెంటనే యమధర్మరాజు ఆ బ్రాహ్మణబాలుని వద్దకు వచ్చి నమస్కరించాడు. "ఓ బ్రాహ్మణ కుమారా! నీకు నమస్కారం. నీకు కళ్యాణమగుగాక! నీవు నమస్కార యోగ్యుడవైన అతిథివై వుండి కూడా, మా గృహంలో మూడు దినాలు ఉపవాసమున్నావు. రోజునకు ఒకటి చొప్పున, మూడు వరాలు ఇవ్వదలచినాను. కోరుకో!" అన్నాడు. ఈ కథ ఎందుకు చెప్పానో, దీన్లోని అంతరార్థాన్ని గ్రహించండి. నిజజీవితంలో మీరు చేసే కర్మలే, మీ దుఃఖానికి, సంతోషానికి, ఆనందానికి మూలకారణం అని ఆంజనేయుడు అతి వినయంతో విధేయుడినై విన్నవించుకుంటున్న ఈ పలుకులను, ఏ పలుకులనైనా మన్ననతో స్వీకరించి, స్వీయజీవితాల్ని సరిచేసుకోండి. ఇది వేడికోలు.

***నలుగురి నోటా నలిగే నానుడి అయినా చాలు***
***పదుగురి నోట పలికే పల్లవి అయినా చాలు***
***ఆ శిల్పి చేతిలో కదిలే ఉలి అయినా చాలు***
***రంగులు దిద్దే చేతిన వుండే కుంచె అయినా చాలు***
***జాతిభేదములు వద్దని వ్రాసే కవి కలాన్నైనా చాలు***
***ఆఖరి శ్వాస వుండే వరకూ మంచి చేస్తే చాలు***
***ఆ మంచిని ప్రోత్సహిస్తే చాలు***
***దురాచారాలను రూపుమాపుతూ , నీవో మనిషివైతే చాలు ,***
***గోటితో కొండనెత్తే కొండంత దేవుడవు నీవే ,***
***అనంత సాగరానికి వారథి కట్టిన కోదండరాముడవు నీవే ,***
***చిన్ముద్రలో అరచేతిలో సంజీవిని ఇముడ్చుకున్న ఆంజనేయుడివి నీవే ,***
***మంచిని పెంచుకుని మమతానురాగాల ప్రేమవలయంలో బంధించుకున్న***
***ప్రేమను విడుదల చేసి వీరాంజనేయుని చేరి***
***విధిగా శరణాగతులై శరవేగంతో దరిచేరండి***
***సాధనాపరులైన నా చిన్నారి ముద్దుబిడ్డలారా!***

వరాల సంగతి రేపు చెబుతాను. వాటిని విని వసుధపై వర్థిల్లండి. ఆత్మతత్త్వాన్ని ఆ బాలుడు కోరిన విధం, దానికి యమధర్మరాజు బోధించిన విధానాన్ని రేపు చెబుతాను. సమయం లేకపోవుటయే కారణం, అన్యము కాదు!

ఓం

**10-05-2019** 08:15 AM

**109)** శివరాత్రి, శవరాత్రి అని ఎందుకు అంటారు స్వామీ?

*దైవగుణమే మంగళకరమైనది. అట్టి మంగళకరమైన గుణాలను అభివృద్ధి చేసుకునే రాత్రే 'శివరాత్రి'. అట్లు కాకుండా విన్నంతవరకూ విని, తిరిగి అవగుణాలను అలవర్చుకుంటే, అది శివరాత్రి కాదు, 'శవరాత్రి' అని చెప్పవచ్చు. శివము అంటే మంగళము అని అర్థం. ఉచ్ఛ్వాస-నిశ్వాసములతో కూడిన జీవితతత్త్వానికి 'శివము' అని పేరు. ఉచ్ఛ్వాస-నిశ్వాసములు ఆగిపోయినపుడు అది శవముగ మారిపోతుంది. ఉచ్ఛ్వాస-నిశ్వాసములు మీకు సోహం అని ఆత్మబోధ సల్పుతున్నాయి. సో అనగా అది (భగవంతుడు), హం - అనగా నేను. ఈ విధంగా ఉచ్ఛ్వాస-నిశ్వాసములు "నేనే దైవము" అని ఉచ్చరిస్తున్నాయి. కనుక, "నేనే దైవము" అని నీవు స్మరించుటయే మంగళకరమైనది (శివము). అది ఎప్పుడైతే సో-హం అనేది నిల్చిపోతుందో అదే అమంగళకరం (శవము).*

**110) ప్రతిరాత్రీ శివరాత్రిగా ఎలా భావన చేస్తారు? ఎలా అనుభవిస్తారు స్వామీ?**

*దైవత్వాన్ని చింతించే దినమే శివరాత్రి పర్వదినం. సంవత్సరానికి ఒక పర్యాయమే కాదు, ప్రతిరాత్రీ కూడా శివరాత్రిగానే భావించాలి, అనుభవించాలి. రాత్రంతా మీరు భగవన్నామస్మరణ చేయకపోయినప్పటికీ, నిద్రించే సమయంలో ఒక పర్యాయం, మేల్కొనే సమయంలో ఒక పర్యాయం భగవన్నామాన్ని స్మరిస్తే, అదే శివరాత్రి అవుతుంది.*

**111) భక్తిని ఎలా పెంచుకోవాలి స్వామీ?**

*ఆధ్యాత్మిక మార్గమందు అనేక భిన్నభావాలు వ్యక్తులయందు ఆవిర్భవిస్తూ వుంటాయి. కానీ, భగవత్ భావమందు మాత్రము ఏకాగ్రతను కలిగి వుండాలి. మీ ప్రేమను జగత్తుపైన మరల్చడమే అభిమానం, మోహము అని చెప్పవచ్చు. భగవంతునిపై మీ ప్రేమను మరల్చుకోవాలి. అదే భక్తి. అట్టి ప్రేమతత్త్వాన్ని మీరు పెంచుకోవాలి. మోహము నాశనము చేసుకోవాలంటే, ఆ మోహమును భగవంతునిపై మరల్చాలి. అదే నిజమైన భక్తి.*

**112) సాధన అనేది ఎంతవరకు కొనసాగాలి స్వామీ?**

*సాధన అనేది ఒక నిరంతర ప్రక్రియగా జీవితపు తుదిశ్వాస వరకూ కొనసాగుతూనే వుండాలి. దీనికి విరామంగానీ, విశ్రాంతిగానీ, వుండవు. సూర్యునికి-సూర్యకిరణములకు వుండే అవినాభావ సంబంధమే సాధన-సాధకుల మధ్య కూడా వుంటుంది.*

**113) అలా లేని పక్షంలో సాధకుని పరిస్థితి ఏమిటి స్వామీ?**

*సాధకుని ఏమాత్రపు ఏమరపాటు కూడా అతనికి ప్రమాదం తెచ్చిపెడ్తుంది. ఎందుకంటే, బ్రతుకు అనే మహారణ్యంలో మనస్సనే పెద్దపులి ఎప్పుడూ పొంచి వుంటూ, ఏమాత్రం అవకాశం దొరికినా సాధన అనే గోవుపై దాడి చేయాలని ఎదురుచూస్తూ వుంటుంది. అందుకని, సాధకుడు ఎంతో జాగరూకతతో వుండవలెను.*

**114) నేత్రాన్ని ఎందుకు గొప్పగా చెబుతారు స్వామీ? అంతా దృష్టిలోనే వుంది అనే వాక్య అంతరార్థము ఏమిటి స్వామీ?**

*దైవం ఎక్కడ వున్నాడు? మీ కనుచూపులోనే వున్నాడు. మీ కనుగ్రుడ్డులో ముక్కాలు భాగం నలుపే. నల్లగ్రుడ్డుకు ఆధారమైన తెల్లగుడ్డు సత్యం. కొనభాగంలో రజోగుణమైన ఎరుపు ప్రకటితమవుతూ వుంటుంది. కనుక, సృష్టికంతా మూలాధారమైనది నేత్రమే.*

**115) వేదాలన్నీ కూడా మానవునియందే ఇమిడి వున్నాయి ఎలా స్వామీ?**

*మీ దేహము ఒక యంత్రము. ఉచ్ఛ్వాస-నిశ్వాసములే మంత్రము. భగవంతుని ఉచ్ఛ్వాసనిశ్వాసములే వేదములు. మీ హృదయమే తంత్రము. భగవంతుని ప్రార్థించే రాగతాళయుక్తమైన భావనలు సామవేదమైతే, అష్టోత్తర నామార్చనలవంటి మంత్రసహిత అర్చనలు ఋగ్వేదము. దుర్గుణాలను, దురాచారాలను, దుష్ప్రవర్తనలను వదులుకోవటానికి పూనుకోవటం రజోగుణానికి తగిన మంత్రస్వరూపము. మిమ్మల్ని ఆవరించే ఆపదలనూ, దుఃఖములనూ ఎదుర్కొని, వాటితో పోరాడి, వాటిని ప్రతిఘటించటానికి తగిన కృషి చేస్తూవుంటారు. అదే అథర్వణవేదం. దేవుడెక్కడున్నాడని మీరు వెతుకనవసరం లేదు. తనయందే ఉన్నాడన్న సత్యాన్ని ఋగ్వేదం ప్రకటిస్తుంది.*

**116) ఏ శాస్త్రమూ తెలియని గోపికలు ఏమి గ్రహించి చరితార్థులయ్యారు స్వామీ?**

*ఏ శాస్త్రమూ తెలియని గోపికలు తమ అందుబాటులో వున్న క్షీరాన్ని వేదసారంగా, ఉపనిషత్తులుగా గ్రహించి, చరితార్థులయ్యారు. పాట పాడుతూ, కృష్ణా! పలుకు తేనెలొలుకునటుల మాటలాడుమా ముకుందా! మనసు తీరగా వేదసారమంతా తీపి నాదరూపముగా మార్చి ధన్యత్వం చెందారు.*

**117) సూర్యుని ఏ విధంగా స్తుతించాలి స్వామీ?**

*సూర్యునికి ప్రాతఃకాలమున అభిముఖంగా నిలబడి స్తోత్రము చేసినచో, మహావ్యాధులు నశించును. దారిద్ర్యము తొలగును. పాపములు నశించును. మధ్యాహ్నకాలమున ప్రార్థించిన పంచమహాపాతకములు నశించును. ప్రాతఃకాల పఠనము భాగ్యమును ప్రసాదించి వేదవిజ్ఞానమును కలిగించును. వేదస్వరూపుడైన సూర్యభగవానుడు అంతరేంద్రియములగు మనో, బుద్ధి, చిత్త, అహంకారములు, పంచప్రాణములైన వ్యాన, సమాన, ఉదాన, అపాన ప్రాణములు, జ్ఞానేంద్రియములగు శ్రోతు, త్వక్కు, చక్షువు, జిహ్వ, ప్రాణములు, కర్మేంద్రియములగు వాక్కు, పాణి, పాదము, గుదము, గుహ్యములు, పంచతన్మాత్రలైన శబ్ద, స్పర్శ, రూప, రస, గంధములు నీవే. ఆదిత్యుడే సర్వ వాఙ్మయస్వరూపుడు, ఆనందమయుడు, విజ్ఞానఘనుడు. అట్టి భానునికి మృత్యువు నుండి తరింపచేయమని, దీర్ఘాయువును ప్రసాదించమని, సర్వత్రా నిండిన సూర్యుని స్తుతించాలి.*

**118) సూర్యోపాసన వలన ఏమి లభిస్తుంది స్వామీ?**

*సూర్యోపాసన బుద్ధిబలమును, శారీరక బలమును కలిగిస్తుంది. చివరిలో మహామృత్యువును తరింపచేస్తుంది. ఎప్పుడో ఒకప్పుడు ఈ దేహమును వదిలినా, త్రికరణశుద్ధిగా సూర్యోపాసన చేసినట్లయితే, జన్మరాహిత్యాన్ని పొందవచ్చు. ఒకవేళ ఇంకా సాధనాస్థితిలోనే వుంటే, ఉత్తమజన్మ కలిగి, ఆ జన్మలో తరించవచ్చు. యజ్ఞయాగాది క్రతువులలో సూర్యనమస్కారాలు చేయాలి. ఆదిత్యుడు కర్మసాక్షి, లోకసాక్షి, ప్రత్యక్షసాక్షి, ప్రత్యక్షదైవం!*

ॐ

**11-05-2019** 07:30 PM

*జీవితమనే పాఠశాలలో ప్రతీ క్షణము, ప్రతీ సంఘటన మీరు నేర్చుకోవలసిన పాఠములను నేర్పుతూనే వున్నది. దానిని గుర్తించుట మీలోని అహంకారాన్ని వీడుట. మీరు చేసే సకల కర్మలను అణిచివేసి, కష్టనష్టాలను సంతోషంగా సహనంతో భరించాలి. సత్సంగంలో పాల్గొని, భగవత్ చింతన ధ్యానంలో లీనమై, ఆయుఃకాలాన్ని కరిగించటమే నిజమైన సాధన. మానవులు అందచందాలపై, దేహంపై పెంచుకున్న ఆశల్ని, భ్రమల్ని సమూలంగా వదులుకుని, ఆత్మసాక్షాత్కారం కోసం నిరంతరం కృషి చేయడం ఉత్తమం!*

ॐ

**12-05-2019** 08:00 AM

**119) కర్మేంద్రియ, జ్ఞానేంద్రియములు మమ్ము ఏ విధంగా ప్రభావితం చేస్తాయి స్వామీ?**

*మానవదేహంలో జీవనవిధానంలో కీలకపాత్ర పోషించేవి దశేంద్రియములే. వీనిలో కళ్ళు, చెవులు, ముక్కు, చర్మం, నాలుక అనేవి పంచజ్ఞానేంద్రియాలు. రెండు కాళ్ళు, రెండు చేతులు, నోరు, మలనాంగం, జననాంగం వంటివి పంచకర్మేంద్రియాలు. జ్ఞానేంద్రియాలు సమాచార సేకరణలో, కర్మేంద్రియాలు శారీరక విధులను నిర్వహించడంలో ప్రముఖపాత్ర పోషిస్తాయి. అయితే, జ్ఞానేంద్రియాలు ప్రాపంచిక సమాచారాన్ని సేకరించడమనేది అంతకు ముందు గడచిన జీవితం మీద ఆధారపడి వుంటుంది. అంతరంగంలోని సంస్కారాల స్వభావాన్ని బట్టే, జ్ఞానేంద్రియాలకు ప్రేరణ కల్గుతుంది. ఏ ఇద్దరి సంస్కారాలు ఒకే రకంగా వుండవు. అందువలన, వారివారి సంస్కారాల స్వభావాన్ని బట్టి, పరిసరాలలోని సమాచార సేకరణ జరుగుతుంది. ప్రస్తుతం మానవులంతా ప్రకృతి, ప్రపంచాల మీద నిరంతరం ప్రయోగాలు చేస్తూ, సమాచార సేకరణలో నిమగ్నమవుతున్నారు. కాబట్టి, పుట్టినప్పటి నుండి, మరణించేంత వరకూ సంస్కారాల మోతాదు పెరుగుతూనే వుంది. పాత సంస్కారాలు కరిగిపోకుండా, నూతన సంస్కారాలు అదనంగా చేరుతున్నట్లయితే, మనిషి కర్మబంధంలో చిక్కుకుంటాడు. మానసిక ఒత్తిడి పెరుగుతుంది. జీవితం సమస్యాత్మకంగా మారుతుంది. అందువలన, పాత సంస్కారాలు కరిగిపోతూ, నూతన సంస్కారాలు ఏర్పడకుండా వుండాలంటే, బాహ్యప్రపంచానికి బహిర్మార్గాలైన పంచజ్ఞానేంద్రియాలను సమూలంగా ఉపసంహరించుకోవాలి. దానినే వేదాంతపరంగా ప్రత్యాహారమంటారు. ఆ తదుపరి ధారణ, ధ్యాన, సమాధి వంటి సూక్ష్మమైన ప్రక్రియలను సాధన చేయవలసివుంటుంది.*

**120) మేము నిమిత్తమాత్రులమని ఎలా గ్రహించాలి స్వామీ?**

*మానవులు ఎన్నో జన్మల కర్మఫలాలను వెంట తెచ్చుకుని, దైవకృపతో అవి తొలగిపోతున్నా, ఇంకా నిరాశ, నిస్పృహలతో కృంగిపోవటం మానవుని బలహీనత. గతజీవితపు కర్మఫలాలు ఎరుగక, ప్రస్తుతం నిలకడలేని ఆశాసౌధాలు నిర్మిస్తూ, అసంతృప్తితో కుమిలిపోతూంటాడు మానవుడు. సంతోషానికి*

తాళంచెవి, తృప్తి మాత్రమే. ధనధాన్యాలు, ఆస్తిపాస్తులు కావు. మీరు నన్ను తలుస్తూవుంటే, నేను మిమ్మల్ని తలుస్తూ వుంటాను. అప్పుడు మీ కర్మ అంతా కాలిపోతూ వుంటుంది. నన్ను ఒక్కడ్నే స్మరిస్తూ వుండండి. మీకు విముక్తి కలుగుతుంది. నాకు మనసునర్పించి, వ్యాకులపడితే చాలు, మిమ్మల్ని నేను తీరానికి చేరుస్తాను. విధి ఆడే వింత నాటకం ఎలా వుంటుందో, విధి ఎంత బలవత్తరమైనదో గ్రహించండి. సాధారణంగా ప్రతి మానవుడూ సందర్భం వచ్చినప్పుడు ఇలా మాట్లాడుతూ వుంటాడు. ఎవరైనా తనకు పనిచెప్పి, "ఎలా చేస్తావో జాగ్రత్తగా చెయ్యి" అనటంతో, "అలాగే! నీవు ఇంతగా చెప్పాలా? నా సర్వశక్తులూ ధారపోసి చేస్తాను. సరేనా?" అంటాడు. అంటే, తనకేవో గొప్పశక్తులున్నాయని, ఆ శక్తులన్నింటినీ ధారపోసి ఆ పని నెరవేరుస్తానని. కానీ, నిజంగా మీలో శక్తులున్నాయా? లేవు! కానీ, ఒక్కొక్క పని చేసేటప్పుడు, చాలా గొప్పగా చేస్తారు గదా! నిజమే. మీరు చేస్తున్న పనిని బట్టి, ఆ శక్తులు మీనుండి వ్యక్తమవుతూ వుంటాయి. ఏదైనా దైవకార్యాన్ని తలపెట్టినప్పుడో, పదిమందికీ ప్రయోజనం కలగాలని నిస్వార్థంగా కోరుకుని పనిని ప్రారంభించినప్పుడో ఆ పనులను నెరవేర్చటానికి కావలసిన శక్తియుక్తులను మీనుండి వ్యక్తమవుతూ వుంటాయి. ఆ పనులకు ఏ మేరకు శక్తి అవసరమో, ఆ మేరకు వ్యక్తమవుతూనే వుంటుంది. అంటే, మీలో శక్తి మిమ్మల్నిబట్టి కాక, చేసే పనినిబట్టి వ్యక్తమవుతుందన్న మాట. ఇది తెలియనప్పుడు, మీకే అలాంటి శక్తి వున్నదని భ్రమపడతారు, అప్పుడప్పుడు అహంకరిస్తారు. కానీ, నిజమేమిటంటే, దైవప్రీతి కొరకు, లోకకళ్యాణం కొరకు కార్యక్రమాలు చేపట్టినప్పుడు, దైవమే మీ ద్వారా అవసరమైన శక్తియుక్తులను వ్యక్తం చేస్తూ వుంటాడు. ఆ కార్యక్రమం ముగిసిపోతే, ఆ శక్తియుక్తులన్నీ ఆయనే ఉపసంహరిస్తాడు. అంటే, మీరు దైవం చేతిలో పనిముట్టువంటి వారని, నిమిత్తమాత్రులని గ్రహించాలి. గ్రహించి, అలా నడుచుకోవాలి. ఇలా మీ ద్వారా శక్తియుక్తులు ప్రసారమైనప్పుడు, వాటిని మీరు ఆరాధించాలి. అలా ఆరాధించటం చేతనైతే, లోకకళ్యాణ కార్యక్రమాలకు, దైవవిహిత కార్యక్రమాలకు మీరు ఎంతవరకూ అవసరమో అంతవరకు భగవంతుడు మిమ్మల్ని వినియోగించుకుంటాడు.

**మాటంటే రామయ్యదే మాట**
**అది చూపుతుంది సరియైన బాట**
**అదేమిటంటే పదిమంది మెచ్చేలా నడవడమన్నది**
**పదుగురికీ నచ్చేలా మెలగమన్నది**
**మనిషిపోయినా గానీ, మాట మిగలవలెనన్నది**
**చేసినట్టి మేలు మరువకూడదన్నది**
**చెప్పిందే చేసి చూపడమన్నది**
**మంచితనం ఎందున్నా పంచుకోమంటున్నది**
**విలపించే కళ్ళకై వెదకమన్నది**
**వీలైతే కళ్ళను తుడవమన్నది**
**మనిషి మనిషిగా వుంటూ, దేవుడవ్వాలంటున్నది**
**ఈ మాటలు మన్నించి ఈ కపి చిరంజీవుడైనాడు**

***చిరకాలం మీరు నాతో చెలిమి చెయ్యాలంటే***
***నా రామయ్య మాటలు పాలించి***
***మారుతి ఇచ్చిన జీవితపు కానుకలనే మూటలను మోసుకుంటూ మోహవారధి దాటి,***
***మున్నెన్నడూ కనీ వినీ ఎరుగని సాధనాపరులై***
***సాధ్యమైనంత త్వరగా అబ్ధి లంఘించండి***
***నా చిన్నారి ముద్దుబిడ్డలారా!***

ॐ

**13-05-2019** 08:10 AM

**121) అరిషడ్వర్గములను ఏ విధంగా అరికట్టవచ్చును స్వామీ?**

*మనిషిని ప్రలోభపర్చి, మైమరపించి, మత్తులో ముంచి, అమూల్యమైన జ్ఞానరత్నాన్ని తస్కరించటానికి నిరంతరం వెంటాడే దొంగలు ఆరుగురు. ఆ ఆరుగురు దొంగలు కామం, క్రోధం, లోభం, మోహం, మదం, మాత్సర్యం. మనిషిని అష్టకష్టాలపాలు చేసి, అశాంతికి గురిచేసే అత్యంత శక్తివంతమైన దొంగ కామం (కోరిక). ఈ కామమే దొంగలముఠా నాయకుడు. ఈ నాయకుడ్ని బంధించగలిగితే, మిగిలిన వారంతా సునాయాసంగా స్వాధీనమైపోతారు. కామతస్కరుడు ఎంత భీభత్సం సృష్టిస్తాడో, ఎంత ప్రమాదకారో, మహాత్ములను సైతం ఎలా పతనమొందించాడో అందరికీ తెలిసిన విషయమే. మాయ అంటే, మరేమిటో కాదు, కోరికలే. ఈ కోరికల వలననే మనిషి మోహితుడై తనలో అంతర్గతంగా ఉన్న ఆత్మను దర్శించలేకపోతున్నాడు. మరి ఈ కామతస్కరుడ్ని బంధించాలంటే, అతడి స్థావరాన్ని తెలుసుకోవాలి కదా. ఆ దొంగ ఎక్కడ ఉంటాడు? కామం నివాసస్థానాలు ఇంద్రియాలు, మనస్సు, బుద్ధి. వీటి ద్వారా కామం జ్ఞానాన్ని కప్పివేసి, మనిషిని మోహితుడ్ని చేస్తుంది. విషయభోగాల వైపు ఆకర్షితమవడం, విషయసుఖాల కోసం పరుగులు తీయడం, ఇంద్రియాల సహజస్వభావం. ఇంద్రియాలు సేకరించిన కలుషిత సమాచారం, అపవిత్రభావాలు మనస్సును విషపూరితం చేస్తాయి. వాటి ప్రభావం వల్ల బుద్ధి విచక్షణాజ్ఞానం కోల్పోతుంది. అప్పుడు మనిషి పతనావస్థకు చేరుతాడు. అందువల్ల కాముడ్ని వధించాలంటే, రాముడ్ని ఆశ్రయించక తప్పదు. భోగ వస్తువుల పట్ల ఆకర్షితమవ్వటం ఇంద్రియాల నైజం కాబట్టి, ఇంద్రియాలను ప్రేరేపించే విషయవస్తువులకు దూరంగా వుండాలి. ఇంద్రియాల ద్వారా ప్రవేశించిన కామవాసనలు మనస్సులో స్థిరనివాసం ఏర్పర్చుకుంటే, వాటిని నియంత్రించటం కష్టతరమవుతుంది. అందువల్ల, ముందు ఇంద్రియాలను నియంత్రించడంలో జాగ్రత్తలు తీసుకుంటే, తర్వాత మనస్సును, బుద్ధిని నియంత్రించడం సులభతరమవుతుంది. అందుకే, కళ్ళు వెళ్ళే ప్రతిచోటుకీ మనస్సు వెళ్ళకూడదు. మనస్సు వెళ్ళే ప్రతిచోటుకీ మనిషి వెళ్ళకూడదు.*

*ఒక గురువు తన శిష్యులతో కలిసి, పొరుగూరు వెడుతుండగా, మార్గమధ్యంలో ఏరు దాటాల్సివచ్చింది. అదే సమయంలో ఏరు దాటుతున్న బాటసారుల బృందంలో ఒక యువతి కాలుజారి*

నీటిలో పడిపోయింది. వెంటనే గురువు ఆమెను తన భుజాలపై ఎత్తుకుని అవతలి ఒడ్డుకు చేర్చాడు. సాయంత్రానికి గురుశిష్యులు ఆశ్రమానికి చేరుకున్నారు. ప్రయాణ బడలికతో విశ్రమిస్తున్న గురువు వద్దకు ఒక శిష్యుడు వెళ్ళి, "గురువుగారూ! మీరు ఏరు దాటుతూ ఒక యువతిని మీ భుజాలపై ఎక్కించుకున్నాడు. అది సన్యాసధర్మానికి విరుద్ధం కదా?" అని అడిగాడు. వెంటనే గురువు నేను ఆ యువతిని నా భుజాలపై ఎక్కించుకుని ఏరు ఒడ్డు వరకే మోశాను. కానీ, నువ్వు మాత్రం ఆమెను నీ మనస్సులో మోసుకుని ఆశ్రమం వరకూ తీసుకొచ్చావు" అని సున్నితంగా మందలించాడు. కాబట్టి, ఇంద్రియాలు సేకరించిన విషయ సమాచారాన్ని, అపవిత్రమైన ఆలోచనల్నీ మనస్సులోకి చొరబడనీయకుండా ప్రారంభంలోనే వాటిని త్రుంచివేయాలి. ఈ అంతర్జాల యుగంలో ఇంద్రియాలను ప్రలోభపర్చే ఎన్నో విషయవస్తువులు, మోహానికి గురి చేసే మరెన్నో విషయభోగాలు అత్యంత అందుబాటులో వున్నాయి. ముఖ్యంగా మీరు వాడుతున్న చరవాణీల రూపంలో ప్రపంచమే మీ చేతిలో ఇమిడిపోయింది. అందువల్ల, నేటితరం మానవులు, ఇంద్రియాలను నియంత్రించడంలో మరింత అప్రమత్తంగా మెలగాల్సిన అవసరం ఎంతైనా వున్నది. మీలో ప్రతి ఒక్కరూ నాకంటే నూరురెట్లు గొప్పవారు కావాలి. మీలో ప్రతి ఒక్కరూ ఒక వీరాధివీరుడు కావాలి. విధేయత, సంసిద్ధత, పని మీద శ్రద్ధాసక్తులు ఈ మూడూ మీలో వుంటే, మిమ్మల్ని ఏ శక్తీ అడ్డుకోలేదు. ఆటపాటల్లో, వేషభాషల్లో, సుఖదుఃఖాల్లో, అన్ని దైనందిన అలవాట్లలో నీతి తప్పని ధీరులై జీవించండి. అలాంటి ఆదర్శంతో జీవితాన్ని నిర్మించుకుంటే, ఇతరులు కూడా మిమ్మల్ని అనుసరిస్తారు. మొదట మీరు పవిత్రులు కండి. ప్రపంచమంతా పవిత్రంగా కనబడుతుంది.

***కార్యసిద్ధి కరువైపోయి, కష్టాల ప్రవాహంలో కొట్టుకుపోతూ***
***కాలం కలిసిరావాలని మీ బ్రతుకు పండాలని***
***ప్రసిద్ధ పండితుల సలహాలతో రక్షలు కట్టించుకున్నారు,***
***రకరకాల రత్నాల ఉంగరాలు ధరించారు, ఇంటికి వాస్తు మార్పు చేయించారు.***
***సంఖ్యా శాస్త్రాన్ని పాటించి, పేరు కూడా మార్చుకున్నారు.***
***ఎందరో దేవుళ్ళను సేవించారు, ఇంకా ఎన్నెన్నో చేశారు.***
***సమస్తం వృధా! పురోగతి శూన్యం!***
***మీ అంతరాంతరాల్లో పరిహాసపు పలకరింపు పిచ్చివాడా! ఓరీ పిచ్చివాడా!***
***నీలో కొలువు తీరిన పరమాత్మను ప్రక్కనబెట్టి, జీవాత్మకు పట్టం గట్టి,***
***పడరానిపాట్లు పడుతున్నావు కదరా!***
***అహంకారపూరితమైన శక్తికి లొంగనివాడు, అమాయకపు భక్తి నుండి తప్పించుకోలేనివాడు,***
***పరమాత్ముడని తెలియకున్నారు.***
***పదిమంది దేవుళ్ళకు నీ భక్తిని పంచిపెట్టకు, అది పలుచబడిపోతుంది***
***ఏ ఒక్కరినో నమ్మి, ఆరాధించు. నీట ముంచినా, పాలముంచినా నీదే భారమనుచూ***
***శరణాగతుడవై సంరక్షించుమా అంటూ భగసాగరుడైన భద్రాత్మకుడ్ని***
***భద్రంగా నుతిమెత్తగా, సన్నిహితంగా సంరక్షించుకోవలసినవి రక్షించుకుంటూ***

***రామపదాంబుజాలై, రామనామ మాధుర్యంలో ఓలలాడుతూ***
***రమ్యమైన మార్గంలో నడిచి రక్షకుడైన ఆంజనేయుని చేరి రంజిల్లండి సదా***
***నా చిన్నారి ముద్దుబిడ్డలారా!***

ॐ

**14-05-2019** 08:10 AM

*నేను మారాను. నేను మారుతున్నాను. మారటానికి ప్రయత్నిస్తున్నాను అన్న పదాల్ని వాడేవారు అతి జాగ్రత్తతో, కొన్ని విషయాలను పరిశీలించుకోండి. అపుడు మీ మార్పులోని యదార్ధము మీకు గోచరిస్తుంది.*

*1. తల్లిదండ్రులను, బంధువులను, భార్యను, పిల్లలను, స్నేహితులను ఇప్పటి వరకూ ప్రేమించావు. ఇప్పుడిప్పుడే నిన్ను ప్రేమించుకోవటం మొదలుపెట్టావా?*

*2. నీవేమీ ప్రపంచపటానివి కాదు. ప్రపంచాన్నంతా నీవేమి ఉద్ధరించాలని అనుకోనక్కరలేదు.*

*3. కూరగాయలవాళ్ళతో, పండ్లకొట్టువారితో బేరాలు ఆడటం మానివేయండి. వాళ్ళకు నాలుగు రూపాయలు ఎక్కువ ఇచ్చినంత మాత్రాన నీవు పెద్దగా నష్టపోయేది ఏమీ లేదని తెలుసుకోండి. ఆ డబ్బులు వాళ్ళ పిల్లల స్కూలు ఫీజులకన్నా పనికివస్తాయని ఆలోచించండి.*

*4. టాక్సీడ్రైవరు దగ్గర చిల్లరకోసం తగాదా పడనక్కరలేదు. ఆ కాస్త చిల్లర అతని మొహంలో నవ్వులు పూయించడం మీకు ఆనందంగా వుండాలి. ఏది ఏమైనా, జీవితం కోసం మీకన్నా ఎంతో కష్టపడుతున్నాడు అతడు.*

*5. చెప్పిందే ఎందుకు చెబుతున్నావు? అని పెద్దవాళ్ళను అడగటం మానివేయండి. వాళ్ళు గతాన్ని నెమరువేసుకోవటానికి పనికి వస్తుందని గ్రహించండి.*

*6. తోటివారిలో తప్పుంది అని గ్రహించినా, వారిని సరిదిద్దే ప్రయత్నం మానుకోండి. నీకు చేతనైనంత నీవు చేసి చూపించి, మౌనంగా తప్పును అర్థం అయ్యేలా చేయండి.*

*7. అందరినీ సరియైన దారిలో పెట్టే బాధ్యత మీ ఒక్కరి భుజాలపైన లేదని తెలుసుకోండి. సరిచేయడం కన్నా, మిమ్మల్ని మీరు సరిచేసుకోవడం ముఖ్యం.*

*8. ఉచితంగా, ఉదారంగా అభినందనలు అందరిపై కురిపించండి. అది వారితోపాటు, మీకూ ఆనందాన్నిస్తుంది.*

*9. చొక్కాపై పడ్డ మరకలు చూచి బెంబేలు పడకండి. ఆకారం కన్నా వ్యక్తిత్వం ముఖ్యం అని తెలుసుకోండి.*

*10. మీకు విలువ ఇవ్వని వారికి దూరంగా ఉండటం నేర్చుకోండి. వారికి మీ విలువ ఏమిటో తెలియకపోవచ్చు. కానీ, మీ విలువ ఎంతో నాకు తెలుసు.*

*11. ఎవరైనా మిమ్మల్ని పోటీ లోనికి లాగాలని ప్రయత్నించినప్పుడు శాంతంగా, ప్రశాంతంగా ఉండటం నేర్చుకోండి. మీకు ఎవరితోనూ పోలిక, పోటీ అవసరం లేదు.*

*12. మీ భావావేశాలు, మిమ్మల్ని కలవరపెట్టకుండా చూచుకోండి. ఎందుకంటే, మిమ్మల్ని మీరుగా నిలబెట్టేవి, అంటే మనిషిగా వుంచేవి అవే.*

*13. ఒక బాంధవ్యాన్ని, ఒక సంబంధాన్ని తుంచుకోవటం కన్నా, అహంకారాన్ని చంపుకోవటం మంచిదని గ్రహించండి. ఎందుకంటే, అహంకారం నిన్ను ఒంటరిగా నిలబెడుతుంది – సంబంధబాంధవ్యాలు కొనసాగితే మీరు ఎప్పుడూ ఒంటరి కాదు కదా!*

*14. ప్రతిరోజూ అది చివరిరోజు అన్నట్లుగా బ్రతకటం నేర్చుకోండి. నిజానికి ఈ రోజే చివరిరోజు కాకపోవచ్చునేమో!*

*15. నీవు ఈ ప్రపంచంలో సాధించవలసింది, కనిపెట్టవలసింది, మార్చవలసింది, శోధించవలసింది, అన్వేషించవలసింది ఏమీలేదని తెలుసుకోండి. ప్రపంచాన్ని సరిచేయడమన్నది నిన్ను నీవు సరిచేసుకోవడంలో భాగంగా భావించండి.*

*మీకేది సంతోషాన్ని ఇస్తుందో అది చేస్తున్నారు. మీ సుఖసంతోషాలకు మీరే... మీరే బాధ్యులు. మరెవ్వరికీ అందులో ఎటువంటి సంబంధమూ లేదు అని తెలుసుకోవడమే మీలో సంభవించే మార్పు. అందుకు మీరు ఆధ్యాత్మిక మార్గాన్ని ఎన్నుకోండి. వేదాలు, ఉపనిషత్తుల సారాన్ని గురించి ఎంతో కొంతమేరకు అవగాహన చేసుకోగలిగితే, జీవిత పరమార్థం తెలుస్తుంది. జీవితాన్ని ఆనందమయం చేసుకునే అవకాశం లభిస్తుంది. అంతకన్నా మీ జీవితానికి ఇంకేం కావాలి? అందుకే మీరు మారుతున్నారనేది నూటికి నూరుశాతం వాస్తవం కావాలి. ఈ ఆంజనేయుడు అతి తేలిక మార్గాలను ప్రబోధిస్తూ, ప్రాకారాన్ని దాటుటకు సహాయ సహకారాలను అందిస్తున్నాడు. అతి తేలికగా జీర్ణించుకోండి, జీవనమార్గాన్ని సుగమం చేసుకోండి!*

***గుండెను గుప్పెట్లో పెట్టుకుని,***
***అంతరంగంలోని నిర్లిప్తతను మనసుపొరలలో భద్రపరుచుకుని,***
***వర్తమానంలోని విషాదాన్ని హృదయకుహరంలో దాచుకుని,***
***పెదాలపై చిరునవ్వులు పులుముకుని***
***గతంలోని అనుభూతుల్ని మననం చేసుకుంటూ***
***బ్రతుకును భారంగా మోస్తూ,***
***నీవు తెలుసుకున్న వాస్తవాన్ని, జీవితసత్యాలను భవిష్యత్తు తరాలకు చెప్పి,***
***ఈ సృష్టిలో అజాతశత్రువులెవరూ లేరని, మీతోపాటే మీ శత్రువులూ పుడతారని***
***నిరంతరం మిమ్మల్ని వెన్నంటి వుంటారని, సమయం చూచి మీపై పగ సాధిస్తారని ,***
***రేపటి మీ శత్రువు వృద్ధాప్యమేనని గ్రహించి,***
***మిమ్మల్ని దోచుకునే శత్రువులే ఆరుగురు వుండనే వున్నారు***

***అరుదెంచిన కార్యాన్ని ఆరంభించి, అణకువతో జీవనసత్యాన్ని గ్రహించి,***
***అనుగ్రహాన్ని పొంది, ఆంజనేయుని తనయులై అతిత్వరలో నన్ను చేరండి***
***నా ప్రియమైన చిన్నారి ముద్దుబిడ్డలారా!***

ॐ

**15-05-2019** 08:10 AM

**122) ఆత్మ అంటే ఏమిటి స్వామీ?**

*వస్తువులను, ప్రపంచాన్ని ప్రకాశింపచేయడం ఆత్మచైతన్యం యొక్క పనేనా? ఆత్మచైతన్యం మీరు చూసి తెలుసుకోవడానికి తన ప్రకాశాన్ని ప్రసరింపచేస్తున్నదా? అని ఆలోచించండి. సమాధానంగా ఆత్మ నిష్క్రియం, ఏమీ చేసేదికాదు. పైగా, అది నిరవయవం. దానికి ఏ అవయవాలూ లేవు. నిరాకారం, సూక్ష్మాతి సూక్ష్మం. అటువంటి ఆత్మ ఏమీ ఆలోచించదు, ఏ కార్యాన్నీ చేయదు. సూర్యుడు అందరికీ వెలుగునిస్తున్నాడు. అంటే ఎంత తప్పో, అలాగే ఆత్మ అన్నిటికీ చైతన్యాన్ని, ప్రకాశాన్ని ఇస్తుంది అంటే అంతే తప్పు. సూర్యుని స్వభావం వెలగటం. అలాగే ఆత్మ స్వభావం చైతన్యం, ప్రకాశం. అంతే! కనుక, వస్తువు యొక్క స్వభావాన్ని వస్తువు యొక్క కార్యంగా చెప్పరాదు. స్వభావంలో ఏ శ్రమా వుండదు. హాయిగా జరిగిపోతుంది. కార్యం అలా కాదు. ఎంతో కష్టంగా జరుగుతుంది. కంటిరెప్పలు వేయటం మీ స్వభావమే గానీ, పని కాదు. దానిని పనిగా చేద్దామంటే అది మీకు ఎంతో భారమవుతుంది. కంటికి నొప్పి కలుగుతుంది. కనుక, ఆత్మ యొక్క స్వభావం ప్రకాశం. అటువంటి ఆత్మ యొక్క సాన్నిధ్యం వల్ల ప్రపంచం, అందులోని వస్తువులు ప్రకాశిస్తున్నాయి, తెలియబడుతున్నాయి. ప్రపంచానికి స్వతహాగా ప్రకాశత్వం లేదు. అది కేవలం జడం, మిథ్య, భ్రమ. ప్రకాశమే స్వభావంగా గల ఈ ఆత్మను తెలుసుకోవటం ఎలా? నిజంగా ఆత్మను తెలుసుకోవటం కుదరదు. ఎందుకంటే, ఆత్మను ఏది తెలుసుకోవాలన్నా, దానికి ఆత్మ యొక్క ఆసరా కావాలి. కనుక, ఆత్మ అనుభవానికి రావాలంతే! ఈ ఆత్మ 3 దశలుగా అనుభవానికి గోచరమవుతుంది. 1) కలుషితంగా 2) సవికల్పంగా 3) నిర్వికల్పంగా.*

*1) ఆత్మ ఉపాధులతో కూడి వుంటుంది. అయితే, అనేక కోరికలతో, ఆలోచనలతో వున్న మనసులో ప్రతిబింబించినపుడు, అది కలుషితంగానే తెలియబడుతుంది. మురికి నీటిలో వేసిన రూపాయి నాణెంలాగా సరిగ్గా తెలియబడదు. ఇదే కలుషితంగా అంటే. 2) కోరికలు, ఆలోచనలు శాంతించినప్పుడు, అహంబ్రహ్మాస్మి అనే మహావాక్యార్థాన్ని నిత్యం మననం చేస్తూ, నిశ్చలంగా, ఏకాగ్రంగా, ఏకోన్ముఖంగా బుద్ధి నిలిచి వున్నట్లయితే, అప్పుడు వ్యక్తమయ్యే ఆత్మప్రకాశాన్ని సవికల్పం అంటారు. ఇందులో సత్యం పలుచటి ఆవరణ వెనుక వుంటుంది. బుద్ధి శాంతించినా జీవభావం వుంది. చూసేవాడు ఆత్మకన్నా అన్యంగా వున్నాడు. 3) ఇక మనోబుద్ధులు పూర్తిగా అంతరించి, ధ్యానించే తానే ధ్యేయంగా మారినపుడు, ఒక్కటే అయినప్పుడు, ఆత్మ నిశ్చలంగా, ఏకంగా తానుగానే వుంటుంది. అదే నిర్వికల్పం. శుద్ధమైన ఆత్మ చైతన్యప్రకాశాన్ని రజోగుణ-తమోగుణ ఆవరణల నుండి విముక్తి గావించి, నిత్యశుద్ధంగా, ఏకంగా,*

తన్ను తాను గుర్తించి స్వానుభవంగా సాధించినవాడే గురువు. ఆయన పరమాత్మే! అటువంటి గురువుకు నా ప్రణామములు. అంటే, ఇక్కడ కూడా గురువును పరమాత్మగా భావించి, ఆత్మప్రకాశమే అయిన గురువుకు నమస్కారములు అంటున్నాడు ఈ ఆంజనేయుడు.

***అరవై నాలుగు విద్యలు నేర్చినా, అసంతృప్తియే మిగులు***
***ఆత్మవిద్య నొక్కటి అభ్యసించిన అఖండ శాంతి లభించును.***
***అన్నీ తెలుసునన్న అజ్ఞానముతో అహంకారివై యుండకు***
***నిన్ను నీవు గుర్తెరిగి నడచిన, నీ జన్మము సుకృతమగును***
***అందచందములనాకర్షించిన, బందిఖానా జీవితమగు***
***అందాలొలికెడు ఆత్మజ్ఞానమే సుందరదేవుని చూపుతుంది.***
***ఆశపడక జీవితమును గడపిన, ఆచార్యుడవే నీవగుదువు***
***దోషములెన్నక దొడ్డ మనసున్న, ఈ ఆంజనేయుడు మెచ్చు***
***పూలమొక్కలవలే పెంచి, సత్యమైన హృదయాలనొసంగి***
***చింతలు తొలగించి, చిన్మయులై చిరంజీవిని చేరి***
***చిరుప్రాయములో చిన్ముద్రులై అందముతో అందరినీ ఆకట్టుకుంటూ,***
***సుమకోమల హృదయులై, ప్రీతివర్ధనులై,***
***పరుగుపరుగున పవనకుమారుని చేరి పరవశించండి***
***నా చిన్నారి ముద్దుబిడ్డలారా!***

ॐ

**16-05-2019** 08:10 AM

**123) జగత్తు మిథ్య అని ఎలా అర్థం చేసుకోవచ్చు స్వామీ?**

- సమస్త భూతములను సృష్టించేది, పోషించేది, లయం చేసేది ఆ పరమాత్మే. అలలు సముద్రంలోనే పుట్టి, కొంతసేపు ప్రయాణించి, తిరిగి సముద్రంలోనే లయమైపోతాయి.
- వర్షంలో పైనుంచి పడ్డ చినుకుల వల్ల క్రిందపారే నీటిలో బుడగలు పుట్టి, కొంతదూరం ప్రయాణించి అందులోనే 'టప్' మని పగిలిపోతాయి.
- స్వప్నం అనేది నిద్రించిన జీవుడి మనసులో సృష్టించబడి, కొంతసేపు వుండి, తిరిగి ఆ మనస్సులోనే లయమవుతుంది. అలాగే, ఈ జగత్తు-జీవుళ్ళు అన్నీ కూడా ఆత్మయందే పుట్టి, కొంతకాలముండి, చివరకు ఆత్మయందే లయమైపోతాయి.

జగత్తు సత్యమనే భ్రమలో వున్న సామాన్యులందరికీ పై ఉపమానాల ద్వారా తెలుసుకున్న సృష్టి, స్థితి, లయలన్నీ నిజమే అనిపిస్తాయి. కానీ, లోతుగా ఆలోచిస్తే ఈ జగత్తు, జీవుళ్ళు అంతా మిథ్య.

అంటే సత్యం కాదు. కానీ అజ్ఞానంలో, ఉన్నప్పుడు ఉన్నట్లు అనిపిస్తుంది. ఇట్టి మిథ్యాజగత్తు యొక్క మిథ్యాభూతాల యొక్క పుట్టుట, ఉండుట, లయించుట అనేది ఆత్మలో ఎలా వుంటుందో ఒక ఉపమానం చెబుతాను. ఒక పెద్ద చెట్టు నిర్జనప్రదేశంలో వుంది. మీరు అటుగా చీకటిలో వెళ్తున్నారు. ఆ చీకటిలో గాలికి చెట్టుకొమ్మలు, ఆకులు కదులుతూ వుంటే, దానిని చూచి దయ్యం అనుకున్నారు. దానితో భయం వేసింది. తప్పించుకోవటం ఎలాగా అని అనుకున్నారు. ఆంజనేయస్వామి దండకం చదువుతున్నారు. అంతలో పెద్ద మెరుపు మెరిసింది. ఇప్పుడు మెరుపు వెలుగులో చూస్తే, అక్కడ దయ్యం లేదు, చెట్టు మాత్రమే వున్నది. భయం పోయింది. చీకటి కారణంగా దయ్యం పుట్టింది, కొంతసేపు మనస్సును భయపెట్టింది, చివరకు వెలుగు రాగానే అదృశ్యమైంది. ఇదంతా ఎక్కడ జరిగింది? ఆ చెట్టులోనే. ఎప్పుడు? చీకటిలో. కనుక, చీకటిలో వున్నంత వరకు ఆ చెట్టే దయ్యంగా కనిపించింది, కొంతసేపు భయపెట్టింది, చీకటి తొలగిపోయి కాంతి రాగానే దయ్యం అదృశ్యమైంది. మెరుపుకు ముందు వున్నదీ చెట్టే, వెనుక వున్నదీ ఆ చెట్టే. దయ్యం పుట్టుట, వుండుట, పోవుట అన్నది వట్టి అబద్ధం. అలాగే, అజ్ఞానంలో ఉన్నంత వరకు ఆత్మయే జగత్తుగా కనిపిస్తుంది. కొంతకాలం సుఖం, దుఃఖం, భయం, బాధ కల్గిస్తుంది. ఎప్పుడైతే అజ్ఞానం తొలగి, జ్ఞానం కల్గుతుందో, అంటే ఆత్మజ్ఞానం కలిగిందో, "నేను ఆత్మను" అనే స్థితిలో నిల్చిపోయారో, జగత్తు మాయం – ఆత్మ ప్రత్యక్షం! చెట్టు సాక్షాత్కారమైతే దయ్యం మాయం. ఆత్మ సాక్షాత్కారమైతే జగత్తు మాయం. కనుక, మిథ్యయైన జగత్తు యొక్క పుట్టుకా ఆత్మలోనే, ఉండటమూ ఆత్మలోనే. ఈ రెండూ మీ అజ్ఞానంలోనే. జ్ఞానోదయం కలిగిందా... జగత్తు మాయం. అదే లయం. మిగిలేది ఆత్మయే. జ్ఞేయవస్తువే. అంటే, వెలుగులకు వెలుగు, తమస్సు కన్నా వేరైనది అని చెబుతున్నాను. అంటే జ్ఞానం–జ్ఞేయం–జ్ఞానగమ్యం అనే త్రిపుటి అందరి హృదయాలలోనూ నిలచివుంది. పరమాత్మ యొక్క స్వరూప స్వభావాలను కొంత రేపు చెప్పుకుందాం.

***గాలికి లేదు మతభేదం, నీటికి లేదు కులభేదం***
***భూమికి లేదు జాతిభేదం, నిప్పుకు లేదు వర్ణభేదం, ఆకాశానికి లేదు ప్రాంతభేదం.***
***పంచభూతాలకు లేని భేదం, నీకెందుకు మనిషీ ఈ విభేదం?***
***గాలిలోన పుడుతావు, గాలిపోతే పోతావు.***
***భూమి నుంచి వస్తావు, భూమిలోనే కలిసిపోతావు***
***నీటిలోనే వుంటావు, నీరు లేక ఛస్తావు***
***నిప్పుతోనే వుంటావు, నిప్పుతోనే కరగిపోతావు***
***ఆకాశం నుంచి వచ్చావు, ఆకాశంలోనే కలిసిపోతావు.***
***వాటికి లేని ఈ భేదం నీకెందుకు ఈ విభేదం?***
***స్వర్గసుఖాలకై లోకమంతా వెదికావు***
***మోక్షప్రాప్తికై క్షేత్రాలన్నీ తిరిగావు***
***ముక్తి కోరి దానాలు, ధర్మాలు చేస్తావు***
***పుణ్యం కోసం యాగాలు, యజ్ఞాలు చేస్తావు***

***ఆత్మజ్ఞానాన్ని తెలుసుకోలేని నీకు ఎలా వస్తుంది మోక్షము?***
***మోహక్షయముగానిదే మోక్షము లేదు అంటూ***
***మోదముతో మోతాదును మించి అందిస్తున్న అభయాంజనేయుని***
***అభయంలో చేరి ఆపదలకు ఆవలి తీరం చేరండి***
***సాధనోన్ముఖులైన నా చిన్నారి ముద్దుబిడ్డలారా!***

ఓం

**17-05-2019** 08:20 AM

**124) జ్ఞానం, జ్ఞేయం, జ్ఞానగమ్యం అంటే ఏమిటి స్వామీ?**

*మీకు ఈ ప్రపంచంలో వెలుగును ఇచ్చే జ్యోతులు సూర్యుడు, చంద్రుడు, నక్షత్రాలు, అగ్ని, దీపం, విద్యుత్తు వగైరా ఇవన్నీ వెలుపలి జ్యోతులు. కన్ను, ముక్కు, మనసు, బుద్ధి ఇవి అంతరంగజ్యోతులు. ఇవన్నీ స్వయంజ్యోతులు కాదు. ఎవరో ఒకరు శక్తినిస్తేనే వెలిగేవి మాత్రమే. వేడినీరు అన్నప్పుడు, వేడి ఆ నీటిది కాదు. అది అగ్ని లక్షణం. అలాగే, ఈ జ్యోతులన్నింటి యొక్క వెలిగేశక్తి వాటిది కాదు. ఆ శక్తి ఆత్మది. సూర్యుడు, నక్షత్రాలు స్వయం ప్రకాశకాలు. కానీ, అవి కూడా ఆత్మ యొక్క శక్తి వల్లనే ప్రకాశిస్తున్నాయి. అలాగే, కన్ను, ముక్కు మొదలైన ఇంద్రియాలు కూడా ఆత్మశక్తి వల్లనే పనిచేస్తున్నాయి. అన్నింటినీ తెలుసుకోగలుగుతున్నాయి. పరమాత్మ జ్యోతిస్వరూపుడని కొందరు కళ్ళు మూసుకుని ప్రకాశరూపంలో, వెలుగు రూపంలో చూడటానికి ప్రయత్నిస్తారు. కానీ, పరమాత్మ మనసుతో భావించేందుకు, కంటితో చూచేందుకు దృశ్యవస్తువు కాదు. ఈ కంటికి కనిపించేది ఏదైనా భ్రమ మాత్రమే, మిథ్య మాత్రమే. ఇది తెలియచెప్పే గురు-శిష్య సంవాదం వినండి.*

*గు: నీకు జ్యోతి ఏది?*

*శి: పగలు సూర్యుడు, రాత్రి దీపం.*

*గు: ఆ సూర్యుడ్ని గానీ, దీపాన్ని గానీ చూచేందుకు నీ దగ్గర వున్న సాధనం ఏమిటి?*

*శి: కన్ను.*

*గు: కళ్ళు మూసుకుంటే అప్పుడు నీకు ప్రకాశం (సాధనం) ఏది?*

*శి: బుద్ధి.*

*గు: ఆ బుద్ధిని తెలుసుకోవాలంటే?*

*శి: నేనే.*

*గు: కనుక, నీవు పరంజ్యోతివి గదా! స్వయంజ్యోతివి కదా!*

*శి: అవును ప్రభూ! ఆ పరంజ్యోతిని, జ్యోతులకు జ్యోతిని నేనే.*

సూర్యచంద్రులే నిజమైన జ్యోతులని ముందు బాహ్యదృష్టిగల శిష్యుడున్నాడు. గురువు క్రమంగా అతడి దృష్టి అంతర్ముఖం చేయాల్సివచ్చింది. అందుకే కన్నే జ్యోతియని, బుద్ధియే జ్యోతియని, చివరకు ఆత్మయే జ్యోతియని స్థిరనిశ్చయం కలిగించాడు. అన్నింటినీ చూపగలిగినదేదో, అదే జ్యోతి. బయట వస్తువులనన్నింటినీ దీపం చూపుతుంది. కళ్ళు లేనివాడు దీపాన్ని చూడలేడు. కంటిని చూపేది బుద్ధి. బుద్ధిని ప్రకాశింపచేసేది ఆత్మ. అందుచే "ధీయోయోనః ప్రచోదయాత్" అని వేదమాత గాయత్రి బుద్ధిని ప్రచోదనం చేసేది ఆత్మయని తెలియచేశారు గదా! కాబట్టి, జ్యోతులకు జ్యోతి ఆత్మయే – జ్ఞేయమే – క్షేత్రజ్ఞుడే. ఆత్మ తమస్సు కన్నా వేరైనది. తమస్సు అంటే చీకటి, అజ్ఞానం, అవిద్య. వీటికి వ్యతిరేకమైనది, వేరైనది ఆత్మ. తమస్సు చీకటి. ఆత్మ స్వయంజ్యోతి. సూర్యునికీ చీకటికీ సంబంధం లేదు. సూర్యుడున్న చోటికి చీకటి రాలేదు. చీకటి వున్న చోటికి సూర్యుడు రాగలడు, చీకటిని పారద్రోలగలడు. అలాగే ఆత్మకు, ఆత్మజ్ఞానానికి సంబంధం లేదు. అజ్ఞానంలో వున్నవాడు ఎప్పటికీ ఆత్మనందుకోలేడు. ఆత్మ మాత్రము అజ్ఞానాన్ని పారద్రోలగలదు. క్షేత్రం గాని, జగత్తు గానీ మిథ్య. మరి పరమాత్మ మాయకు, అజ్ఞానానికి ఆవల వున్నవాడు. అజ్ఞాన ఆవరణ తొలగితే, అది ఆత్మదర్శనమే. కళ్ళు మూసుకున్నావు–అంతా చీకటే. అయితే, నీవు చీకటిని చూచేవాడవే గానీ, ఆ చీకటి నీవు కాదు కదా! అంటే, నీవు చీకటికి ఆవల వున్నావు. అంటే, నీవు స్వయంజ్యోతివి. అజ్ఞానాన్ని తెలుసుకునే జ్ఞానస్వరూపుడివి. చీకటిని తెలుసుకునే వెలుగువు. చీకటికి వేరైనవాడివి. జ్ఞానం అంటే తెలివి. జ్ఞేయం అంటే తెలుసుకోవలసినది. జ్ఞానగమ్యం అంటే తెలివిద్వారా పొందవలసినది. మూడూ ఆత్మయే. ఆత్మయే జ్ఞానం. మనసుకు నచ్చచెప్పండి. నేను మీకు ఎలా ఎంత శాంతంతో చెబుతున్నానో, అంత శాంతితో నచ్చచెప్పండి. తప్పక మీ మాట వింటుంది.

***పరమపావనమైన భగవంతుని పట్టుకో, పట్టి భజియించు మనసా!***
***ఎల్లవేళల నీవు యుల్లమందున భగవంతుని తలవవే ఓ మనసా!***
***ఆటపాటలతో కాలమంతా గడిపి భక్తినే మరిచావు మనసా!***
***సుఖదుఃఖములలో మునిగితేలుతూ నీవు ముక్తినే మరిచావు ఓ మనసా!***
***పుణ్యఫలములు నీకు లేశమైనా లేవు జాగు ఇక ఏలనే మనసా?***
***ఇహలోక పాపములు వెంటాడు, మరువక ముక్తిమార్గం చేరు ఓ మనసా!***
***ఇంత సులభుడు నీకు ఇలలోన దొరకడు ఇది తెలుసుకోవే మనసా!***
***సాయిరూపంలో కొలువయ్యె పర్తీపురమందు కనులారా గాంచవే ఓ మనసా!***
***మనసుకు మనిషి మధ్య జరిగే అంతర్మధనాన్ని గుర్తించవే మనసా!***
***అంతర్మధనము నుండి పుడుతూ, సకల అరిష్టాలకు కారణం గుర్తించవే ఓ మనసా!***
***నడకలతో సాగే ప్రయాణాన్ని పరిగేత్తేటట్లు చేయకు మనసా!***
***పాలనందుకొమ్మని వున్న నీళ్ళను పారబోసుకునేలా చేయకు ఓ మనసా!***
***దీనితో మనిషి మనిషిలా ఉండలేక, ఏ పని చేయాలనిపించక,***
***నిరాశానిస్పృహలతో అన్నీ వుండి, ఏదీ ఆనందాన్నివ్వక***

***తన బ్రతుకింతే అనుకునేలా చేస్తున్న, చేసిన మనసుకు నచ్చే విధంగా***
***నూరు రకాల ప్రయోగాలతో బుజ్జగించి, ఊరడించి, మైమరపించి***
***తనువు ధ్యాసను వీడి, తనను రంజింపచేయమని రక్షకుడైన***
***ఆత్మనివాసి ఆంజనేయుని అతి ప్రేమతో దరిచేరండి ఆత్మపుత్రులారా!***

ఓం

**18-05-2019** 07:00 PM

**125) ఆత్మవిద్య యొక్క విశిష్ఠత ఏమిటి స్వామీ?**

*సర్వలక్షణ సంపన్నుడే జ్ఞాని. జ్ఞాని పరమాత్మే. కనుక, పరమాత్మే జ్ఞానం. అంటే తెలుసుకోవలసినవి ప్రపంచంలో ఎన్నింటిని తెలుసుకున్నా, ఎటువంటి ప్రయోజనం లేదు. ఆ తెలివి ఎప్పుడో ఒకప్పుడు నిష్ప్రయోజనం అవుతుంది. ఎప్పుడు? ఎప్పుడైతే జ్ఞేయవస్తువును తెలుసుకున్నావో, ఇక అప్పటి వరకూ తెలుసుకున్నదంతా నిష్ప్రయోజనం. ఎందుకంటే, ప్రపంచజ్ఞానం అంతా అనిత్యం. అంతంతో కూడుకున్నది. కనుక, అంతా వ్యర్థమయ్యేదే. ఒక శాస్త్రపరిశోధకుడు ఎన్నో పరిశోధనలు చేసి క్రొత్త విషయాలు కనిపెట్టాడు. అయితే ఏం లాభం? మరణంతో నేర్చుకున్నదంతా వృధా అవుతుంది. అదే ఒక వేదాంతి ఆత్మను గురించి పరిశోధన చేశాడు. ఇంకా ఆత్మసాక్షాత్కారం కాలేదు. మరణించాడు. మరి తాను చేసిన పరిశోధన అంతా వృధా అవుతుందా? కాదు. ఈ జన్మలో ఈ ఆత్మశోధన-జ్ఞానం-సాధన అన్నీ ఉపయోగపడతాయి. అదే ఈ జన్మలోనే స్వస్వరూపజ్ఞానం కలిగితే, ఇక జననమరణాలు లేవు. కనుక, ఎవరికైనా తెలియదగినది (జ్ఞేయం) ఆత్మయే. ఆత్మను తెలుసుకుంటే, ఇక తెలుసుకోవలసింది ఏమీ లేదు, ఏదీ వుండదు. అది తెలిస్తే, అన్నీ తెలిసినట్లే. "చదువులలో మర్మమెల్లా చదివితి తండ్రీ" అన్న ప్రహ్లాదుని పలుకులలోని మర్మం ఇదే. జ్ఞేయవస్తువును తెలుసుకుంటే చాలు. ఇక తెలుసుకోవలసింది ఏదీ లేదు అని. "చదివి చదివి చావంగానేటికి, చావులేని చదువు చదువవలయు" అన్న వేమన పలుకులలోని వేదాంత రహస్యం కూడా ఇదే. చావులేని చదువు అంటే, జననమరణాల నుంచి తప్పించే చదువు. అదే ఆత్మవిద్య. బ్రహ్మవిద్య కనుక తెలుసుకోవలసింది పరమాత్మ గురించే. ఇతర లౌకిక విద్యలన్నీ చావును తప్పించలేవు. అంటే జననమరణాలను తప్పించలేవు.*

**126) ఆత్మను ఎక్కడ దర్శించాలి స్వామీ?**

*జ్ఞానగమ్యం కూడా ఆత్మయే, జ్ఞేయవస్తువే. ఆత్మజ్ఞానంతో పొందదగినది, జ్ఞానసాధన ద్వారా పొందదగినది ఆత్మయే గనుక, అది జ్ఞానగమ్యం. కనుక, జ్ఞానం-జ్ఞేయం-జ్ఞానగమ్యం మూడూ ఆత్మయే. ఇంతకూ, పొందవలసింది ఆత్మ (జ్ఞేయవస్తువు) ఎక్కడుందో, ఎంతదూరంలో వుందో అని భయపడవలసిన పని లేదు. అది సర్వుల హృదయాలలోనూ వున్నది. అది నీలోనూ వుంది. ఆత్మ అంతటా వున్నదే అయినా, దర్శించాల్సింది మాత్రం మీ హృదయంలోనే. పసివాడుగా వున్న శ్రీరాముడు, ఆకాశంలో పూర్ణచంద్రుని చూచి, "నాకు కావాలి" అని హఠం పట్టి ఏడుస్తున్నాడు. ఎలా ఓదార్చాలో కౌసల్యకు*

తెలియలేదు. అంతలో అక్కడకు వచ్చిన వశిష్ఠుడు అద్దాన్ని తెప్పించి అందులో చంద్రుడ్ని చూపాడు. అలాగే, సర్వవ్యాపియైన పరమాత్మను మొదట హృదయంలోనే చూడాలి. నిర్మలమైన అంతఃకరణములోనే ప్రతిబింబింప చేసుకోవాలి. మట్టితో చేసిన అద్దంలో చంద్రుని చూచినట్లు, మాయతో చేసిన అంతఃకరణములోనే ఆత్మను దర్శించాలి. గేదెకు పాలు శరీరమంతా వున్నా, పొదుగు నుండే తీసుకోవాలి. ఆత్మ సర్వత్రా వున్నా, ఆ అనుభవాన్ని హృదయం నుండే పొందాలి. హిందూ ధర్మంలో ఒక ఆచారం వుంది. ఏ క్షేత్రానికి వెళ్ళినా, భగవంతుని విగ్రహాన్ని చూడగానే కళ్ళు మూసుకుంటారు. కొన్ని మతాలవారు చెవులు మూసుకుంటారు. కొందరు చేతులు పైకెత్తుతారు. కొందరు ఆకాశం వైపు చూస్తారు. మీరు మాత్రం ఆ భగవంతుని చూచేదాకా కళ్ళు తెరుచుకుని క్యూలో నిలబడతారు. తీరా అక్కడకు వెళ్ళగానే, కళ్ళు మూసుకుంటారు. కళ్ళు తెరిచేటప్పటికి గార్డులు లాగి బయటకు అంటే అవతలకు లాగిపడేస్తారు. ఎందుకిలా చేస్తుంటారు? భగవంతుడు (పరమాత్మ) ఎక్కడో ఆకాశంలోనో, ఏ గుడిలోనో ఉంటాడని గాక, అతడు అంతర్యామిగా, ఆత్మస్వరూపంగా మీ హృదయంలోనే వున్నాడనే నమ్మకం. కనుక, కళ్ళు తెరచి బయటకు చూడటం గాక, కళ్ళు మూసుకుని మీ హృదయంలోనే దర్శించాలి అనే భావం. అంతర్ముఖం కావడమే పరమార్థం.

***కాసింత శ్రద్ధ వహించి తనకేది నప్పుతుందో ఎంచుకుని***
***అవసరమైతే ఆంజనేయుని సలహాలతో***
***మీపైగల మీ నమ్మకమే జీవితాన్ని నిలబెడుతుందని తెలుసుకుని పాటిస్తే ఆనందమే మిగులుతుంది.***
***ప్రేమే జీవితాన్ని అందంగా తయారుచేస్తుందని తెలుసుకుని, అర్థము చేసుకుని ఆచరిస్తే,***
***ఆంజనేయుడు సదా హర్షమును తెలుపుతూ, ఎంతో మహోన్నతమైన ఆత్మతత్వాన్ని ఎరింగి***
***ఎగసిపడుతున్న మనసును ఒక లాలనతో, బుజ్జగించి, మైమరపు దానికిచ్చి,***
***మన్ననలు నీవు పొంది, ప్రతి అక్షరము జ్ఞానగుళికయై,***
***గురుతు తెలుపునట్టి ఈ గురువు మాటలు మన్నించి మారుతామని నిర్ణయం తీసుకుని***
***మారుతిని చేరండి నా చిన్నారి ముద్దుబిడ్డలారా!***

ॐ

**19-05-2019** 08:10 AM

**127) భగవంతుని స్మరించుటకు ఏ సమయము అనుకూలము స్వామీ?**

ఎవరు ఉత్తమయోగులు? భగవంతుని యందే సంపూర్ణంగా మనసు లగ్నం చేసినవారే ఉత్తమయోగులు. వారు స్త్రీలా, పురుషులా, చిన్నలా, పెద్దలా, పండితులా, పామరులా అనే పట్టింపు లేదు. భగవంతుని యందు మనసునుంచినవాడే యోగి, మహాయోగి. సామాన్యమానవులు సంసారంలో మనసునుంచుతారు. యోగులు భగవంతునియందు మనసునుంచుతారు. మనసు ద్రవపదార్థంలాంటిది. ఏ పాత్రలో పోస్తే, ఆ ఆకారాన్ని ధరిస్తుంది. గ్లాసులో పోస్తే గ్లాసు ఆకారం, చెంబులో పోస్తే చెంబు

ఆకారం, బిందెలో పోస్తే బిందె ఆకారం. అలాగే మనసును ఏ వస్తువులో వుంచితే ఆ ఆకారం ధరిస్తుంది. విషయాల్లో చేరితే విషయాకారం, భగవంతునిలో చేరితే భగవదాకారం. ఈ విధంగా మనస్సులో భగవంతునికి మాత్రమే చోటుండాలి. ఇదే, "మయ్యావేశ్య మనః బుద్ధిః" అంటే. మనసు భగవంతునిలో వుండాలని ఇంత వరకూ చెప్పుకున్నాం కదా. అయితే, ఎప్పుడో రోజులో కొద్దిసేపో, వారానికి ఒకరోజు కాదు. నిత్యం, నిరంతరం భగవంతునియందే వుండాలి. రోజూ ఒక గంటో, రెండు గంటలో డ్యూటీలాగా భగవంతుని స్మరిస్తే అది నిజమైన భక్తి కాదు, నిజమైన ఉపాసన కాదు. పూజ చేసేటప్పుడో, భజన చేసేటప్పుడో, జపధ్యానాలు చేసేటప్పుడో, దేవాలయాల్లో కూర్చున్నప్పుడో, లేదా ఇలా సత్సంగంలో పాల్గొన్నప్పుడో భగవంతునియందు మనసుపెట్టి ఇక మిగిలిన సమయాల్లో భగవంతుని స్మరణయే లేకుంటే, అది నిత్యభక్తి కాదు, అతడు నిత్యయుక్తుడు కాదు. సర్వకాల సర్వావస్థలలోనూ భగవత్ స్మరణను విడిచిపెట్టరాదు. నిజంగా భగవంతుడెప్పుడూ మిమ్మలను విడిచి వుండటం లేదు. మీరు కూర్చున్నా, పడుకున్నా, నిద్రపోయినా, బస్సులో వున్నా, విమానంలో వున్నా ఏం చేస్తున్నా ఆయన మీలోనే స్థిరంగా వున్నాడు. కానీ, మీరే ఈ ప్రాపంచిక విషయాల కోసం, భోగాల కోసం ఆయనను విడిచిపెడుతున్నారు. అలా వుండకూడదు. పశ్యన్, శృణ్వన్, స్పృశన్, జిఘ్నన్, అశ్నన్, గచ్ఛన్, స్వపన్, శ్వపన్ – కంటూ, వింటూ, తింటూ, తిరుగుతూ, తెస్తూ, ఇస్తూ, లేస్తూ, కూర్చుంటూ సర్వకాల సర్వావస్థలలోనూ చిత్తం భగవదాయత్తమై వుండాలి. అంతటా ఆ భగవంతుడిని చూస్తూ, నిరంతరం ఆ భగవంతుని చింతించటమే నిత్యయుక్తః అంటే. అట్టి భక్తుడే శ్రేష్ఠితమగును. తేనెటీగ పుష్పాలలోని మకరందాన్ని పీల్చుకుంటుంది. ఈగ కొద్దిసేపు బెల్లం మీద వాలుతుంది. కొద్దిసేపు పెంటకుప్పల మీద వాలుతుంది. పేడపురుగు ఎప్పుడూ పెంటకుప్పలలోనే వుంటుంది. ఒకవేళ దానిని తెచ్చి పుష్పాలలో వేస్తే చచ్చివూరుకుంటుంది. మీరు తేనెటీగలలాగా ఎప్పుడూ భగవంతునితోనే చరించాలి. ఈగలాగా కొద్దిసేపు భగవంతునిపైన, కొద్దిసేపు ప్రపంచవిషయాల మీద వ్రాలకూడదు. ఏ క్షణంలో మృత్యువు మిమ్మలను కబళిస్తుందో తెలియదు గనుక, నిరంతరం దైవచింతన చేయాలి. ఇక మృత్యువు ఎప్పుడు వచ్చినా చిక్కులేదు. కనుక, మోక్షార్థియైనవాడు నిరంతరం దైవచింతన చేయాలి, దైవస్మరణ చేయాలి. అతడే నిత్యయుక్తుడు. అతడే నిజమైన భక్తుడు. అంతేగానీ, సంకటమొస్తే వేంకటరమణ అన్నట్లు కష్టాలు వచ్చినప్పుడో, కోరికలు తీరినప్పుడో, ఎన్నికలు వచ్చినప్పుడో చేసేది దైవచింతన కాదు. నిరంతరం దైవచింతన చేయుటయే భక్తుని లక్షణం. ఇలా నిత్యం, నిరంతరం దైవచింతనలో, దైవస్మరణలో వుంటే ప్రయోజనమేమిటి? అని అడుగవచ్చు. భ్రమర–కీటక న్యాయాన్ని అనుసరించి భక్తుడే భగవంతుడౌతాడు. జీవుడే దేవుడౌతాడు. నరుడు నారాయణుడౌతాడు. భ్రమరం కీటకాన్ని మట్టిగూటిలో పెడుతుంది. ఆ గూటికి ఒకచోట రంధ్రము చేసి, లోపలున్న కీటకాన్ని చూస్తూ, దాన్ని పొడుస్తూ వుంటుంది. దాని నుండి తప్పించుకోవటానికి ఆ కీటకం భ్రమరాన్నే తలుచుకుంటూ తలచుకుంటూ లోపల తిరుగుతూ, చివరకు ఆ కీటకం భ్రమరమే అవుతుంది. ఇదే భ్రమర–కీటక న్యాయం. కనుక, నిరంతరం భగవంతుని తలచుకుంటూ వుండాలి భక్తుడు.

***ఎందరిలో వున్నా మనసు ఒంటరిది***

***ఎన్ని విన్నా మనసు తుంటరిది***

***మనసు పోకడ ధర్మానికి విరుద్ధం***
***నీతి నిజాయితీలు నిషిద్ధం***
***జీవితం కానుక - జీవించడం వేడుక***
***సంపద కన్నా సద్గుణం మిన్న***
***ఐశ్వర్యం కన్నా ఆరోగ్యం మిన్న***
***మతిమారితే గతి మారుతుంది***
***మాట మారిస్తే పరువుపోతుంది***
***మరణానికి ఛాయిస్ లేదు***
***మరణించాక వాయిస్ లేదు***
***ఆత్మదీపం వెలిగించుకోండి***
***అజ్ఞానపు చీకట్లను తొలగించుకోండి***
***ఇంటి విషయాలపై మలుపు సంసారం - ఇంద్రియాలపై గెలుపు సన్యాసం***
***ఇచ్చిపుచ్చుకునే నైజం మానవుడిది***
***కేవలం ఇచ్చేది భగవంతుని నైజం***
***దైవత్వం ప్రకాశించాలి***
***పవనకుమారుని బోధలు పావనమై, ప్రణవనాథుని చేరుటకు మార్గమై ,***
***మారుతిగా మీ ముంగిట నిలచివున్న నన్ను చేరండి***
***చిన్నారి నా ముద్దుబిడ్డలారా!***

ॐ

**20-05-2019** 07:30 PM

**128) జీవితంలో ఎదురయ్యే కష్టాలను ఏ విధముగా ఎదుర్కోవాలి స్వామీ?**

ఆనందమయ జీవితంలో ఎన్నో అడ్డంకులు, నష్టాలు, కష్టాలు, బాధలు ఎదురవుతాయి. ఇవన్నీ జీవితంలో అనుభవాలుగా భావించి, ఓర్పుతో నీవు నమ్ముకున్న భగవంతునిపై భారం పెట్టి, ధర్మంగా నీ బాధ్యతను నెరవేర్చుకోగలిగితే, నీకు ఎదురయ్యేవన్నీ సుఖసంతోషాలతో కూడిన ఆనందమే. వాటిని మీరు అనుభవించగలరు. ఏవీ శాశ్వతం కానప్పుడు కష్టాలు, బాధలు శాశ్వితంగా వుండిపోతాయా? జన్మ వుందంటే, మరణం అప్పుడే వుంది. భయపడటం వలననే విచక్షణ కోల్పోతున్నారు. దేనికీ భయపడవలసిన పనిలేదు. తప్పు చేస్తే భయపడాలి. సుఖానికైనా, కష్టానికైనా బాధ్యులు మీరే కదా. సుఖపడి ఆనందించగలయోగం నీకున్నది కాబట్టే, కష్టాలు, బాధలు కలుగుతున్నాయి. చెట్లు ఎండిపోయి, ఆకులు మొత్తం రాలి మోడుగా అయిపోయి, మరలా వసంతఋతువులో ఎంతో అందంగా పచ్చగా చిగురిస్తున్నాయి. ఆకులు రాలినప్పుడు ఏ మాత్రం బాధపడలేదు సరికదా, మళ్ళీ చిగురిస్తాయని ఆనందించింది, చిగురించింది. కష్టాలను ధైర్యంగా ఎదుర్కోగలిగితేనే ఆనందం మీ సొంతమవుతుంది.

చెప్పటం చాలా సులువే, మరి ఆచరించడమే కష్టం అంటారా? ఈ ఉపోద్ఘాతం ఎందుకు అంటారా? మీకు అన్ని విషయాలు తెలుసు. కానీ, మీ వరకూ వచ్చేసరికి అమలు చేసుకునే శక్తిని కోల్పోతారు. ఇద్దరు వ్యక్తుల మధ్య ఏదైనా ఒక చిన్నమాటకే పట్టింపు వస్తే, పెద్దఘర్షణై కొట్టుకోవటంతో ఆగకుండా, తారాస్థాయికి వెళ్ళిపోతుంది. ఇరువురిలో ఏ ఒక్కరు తగ్గినా, అంత రభస జరగదు. నిగ్రహం కోల్పోయినప్పుడు జరిగే పని ఇది. తర్వాత ఆలోచిస్తే, "అయ్యో! అలా చేయకుండా వుంటే ఎంత బాగుండేదో" అనుకుని పశ్చాత్తాపపడతారు. "చిన్న విషయం గురించే ఇంత జరిగిపోయిందే!" అని బాధపడతారు. గమనంలో వుండలేక, ఇవేమీ ఆలోచించుకోలేక, ఆత్మహత్యలకు కూడా పాల్పడుతున్నారు.

**129) అంతఃకరణాలు ఏవి స్వామీ? వాటి ప్రభావం ఎట్టిది స్వామీ?**

మనసు, బుద్ధి, చిత్తం, అహంకారం ఈ నాలుగింటినీ కలిపి అంతఃకరణాలు అంటారు, లేక సూక్ష్మశరీరం అంటారు. ఇవి జీవుడి రూపంలో వుండి జీవితాన్ని నడిపించడంలో కీలకపాత్ర పోషిస్తాయి. అయితే, అటువంటి సూక్ష్మశరీరం మీ కంటికి కన్పించదు. ఆత్మస్థితికి చేరినవారు మాత్రమే దానిని అంచనా వేయగలుగుతారు. సూక్ష్మశరీరమనేది ప్రాణశక్తి యొక్క రూపాంతరం. అంటే, అంతా భగవంతుని ప్రతిరూపమే. అనుమానమే లేదు! మానవదేహంలో ఇంద్రియ, మనోబుద్ధి, చైతన్యాలుంటాయి. ఇంద్రియచైతన్యం అధికంగా వుంటే, జంతుస్వభావం ఎక్కువగా వుంటుంది. అరిషడ్వర్గాలు అతిగా ప్రకోపిస్తాయి. మనిషి శారీరక, ఇంద్రియాల వరకే పరిమితమవుతాడు. మనోచైతన్యం అధికంగా వుంటే, అరిషడ్వర్గాలు బలహీనపడి, మానవత్వం వికసిస్తుంది. బుద్ధిచైతన్యం అధికంగా వుంటే, మనిషిలో విచక్షణ, వివేచన, విచారణ, విశ్లేషణ వంటి ఉన్నత లక్షణాలుండి, తనను గురించి, సమాజ, ప్రపంచ ప్రకృతులను గురించి అవగాహన ఏర్పర్చుకుని, జీవితాన్ని సార్థకం చేసుకునే అవకాశముంది. మనస్సు సంకల్ప-వికల్పాలతో కూడివుంటే, బుద్ధి మనస్సు యొక్క స్థితిని బట్టి నిర్ణయాధికారాన్ని కలిగి వుంటుంది. చిత్తమనేది గత జీవితం, జీవితాల అనుభవాల సమాచారకేంద్రమవుతుంది. అదంతా సంస్కారాల రూపంలో రికార్డవుతుంది. అటువంటి రికార్డు వ్యక్తులనుబట్టి మారుతూ వుంటుంది. కాబట్టి, ప్రతివ్యక్తి తన చుట్టూ అహంకారాన్ని ఏర్పర్చుకుని, పరిధిలో ఇరుక్కుని, "నేను ఫలానా" అనే భావనతో పరిమితతత్త్వంతో జీవిస్తాడు. అయితే, అటువంటి అంతఃకరణాల మధ్య భౌతికపరమైన వ్యత్యాసముండదు గానీ, ప్రజ్ఞ కుంచించుకుపోయే కొలది, ఇంద్రియచైతన్యం అధికంగా వుంటుంది. విస్తరించే కొలది అదే బుద్ధిచైతన్యంగా రూపాంతరం చెందుతుంది. పరిమితంగా వుంటే, అహంకారం బలోపేతమవుతుంది. విస్తరించే కొలది అది కరిగిపోతూ వుంటుంది.

***పగ, ద్వేషం, శత్రుత్వం ఎందుకు?***
***అదంతా గతాన్ని గూర్చియే కదా!***
***అప్రస్తుతపు గతాన్ని గూర్చి, చింతించి, ప్రస్తుతాన్ని విషపూరితం చేయడమెందుకు?***
***నేటి సుఖానికి అది మహాచేటు.***
***భవిష్యత్తుకు కానేకాదు అది బాట***
***వాటి విస్మరణ సుఖాన్ని అందించు***

***నిర్మలమైన మనస్సునిచ్చేను భగవదనుగ్రహం***
***సృష్టిలో అందరూ మనుషులే కావచ్చు***
***మనిషి మనిషిగా బ్రతకటమే కష్టం కావచ్చు***
***కాష్టంలో మనిషి దేహం కాలడానికి ముందు***
***మనిషి మనిషని పిలిపించుకోవటానికి ఎన్ని కష్టాలైనా పడొచ్చు, మారుతి మాటలు వినొచ్చు***
***విన్న దానిని ఆచరణలో పెట్టి, మనిషంటే మహిషి కాదు, మహర్షి .***
***బుద్ధి చేత, చేతనల చేత చిరంజీవిని చేరు మహామనీషులై***
***సద్గురువు గురువుల పదక్రాంతులై పట్టువీడక దరిచేరండి***
***నా చిన్నారి ముద్దుబిడ్డలారా!***

ఓం

**24-05-2019** 08:25 AM

**130) ఆధ్యాత్మికత అంటే ఏమిటి స్వామీ?**

*ఆధ్యాత్మికత అంటే ఆత్మ విజ్ఞానం. తనను గురించి తాను తెలుసుకోవడం. తన అంతరంగంలో ఏముందో సూక్ష్మంగా గుర్తించగలగటమే. తనను తాను సంస్కరించుకోవడమే. తనలోని అన్ని రకాల లోపాలను సరిదిద్దుకోవడమే. తనను గురించి తాను తెలుసుకోగలిగితే విశ్వమంతా తెలిసిపోతుంది. తనను గురించి తాను విశ్లేషించుకోగలిగితే జీవితం పట్ల స్పష్టత ఏర్పడుతుంది. తనలోని లోపాలను తెలుసుకుంటే, అందరి లోపాలు తెలిసిపోతాయి. తన మనస్తత్వాన్ని తాను అవగాహన చేసుకోగలిగితే, అందరి మనస్తత్వం తెలిసిపోతుంది. ప్రస్తుతం మీలో జరుగుతున్న ప్రమాదకరమైన అంశము ఏమిటంటే, మీరందరూ ఇతరులను గురించి అతిగా ఆలోచిస్తున్నారు. అందరి మీదా విస్తృతంగా పరిశోధనలు చేస్తున్నారు. అందరినీ తమకు అనుకూలంగా మార్చుకునే ప్రయత్నంలో ఉన్నారు. అది చాలా అపాయకరమైనదిగా గుర్తించండి. ప్రేమను విస్మరిస్తున్నారు. భగవంతుడు మీకు బోధించే బోధల సారాంశమేమిటి? మీరు అనుభవిస్తున్న జీవితం ఏమిటి? చెప్పినదానిని చెప్పినటుల ఆచరించలేని దౌర్భాగ్యం ఎక్కడినుండి వస్తుంది? ఎందుకంటే సత్యం, ధర్మం విస్మరించి, ఇక మనిషి సాధించేదేముంటుంది? దివ్యత్వానికి దూరమైన ప్రతివ్యక్తి అంతరంగంలో అసంతృప్తి తారాస్థాయికి చేరుతుంది. అందుకే మీరంతా అయోమయంగా, గందరగోళంగా, అస్తవ్యస్థంగా జీవిస్తున్నారు. దీనినంతటినీ పురోగమనం అనరు. తిరోగమన పరిణామమంటారు. తిరోగమనం అతివేగంగా జరుగుతుంది. పురోగమనం నెమ్మదిగా జరుగుతుంది. తిరోగమనమనేది ఎంతటి పురోగమనాన్నైనా కబళించివేస్తుంది. జీవితాలను పతనం చేస్తుంది. అందుకే, దానికి అడ్డుకట్ట వేయడం కోసం, ఆధ్యాత్మిక జీవనానికి వ్యక్తిత్వవికాసం తప్పనిసరి. అపుడే మీ పరిసరాలవారు శాంతిగా వుండగలరు. ఎప్పుడు? మీరు శాంతంగా వున్నప్పుడే. పశుత్వ లక్షణాలు పెంచుకుంటూ నేను మానవుడ్ని అని చెప్పుకోవటానికి*

మీకు మనసెలా ఒప్పుతుంది? మీలోని అసహనానికి అడ్డుకట్ట వేయలేనివారు, మీరెలా సాధకులవుతారు? అమ్మా! అన్న పిలుపులోని మాధుర్యాన్ని మీ నరనరాన జీర్ణింపచేసుకోవాలి. స్త్రీ స్వరూపమంతా మాతృస్వరూపమే. ఒక్కమాటలో చెప్పాలంటే, జీవితమే సాధనగా మారాలి. అపుడు, ప్రత్యేకంగా సాధన అవసరమే వుండదు. శరీరాన్ని ఆపాదమస్తకం శుద్ధి చేసుకోండి. పూర్ణజ్ఞానాన్ని పొందగలిగితే, అద్భుతమైన ఫలితాలను పొందగలరు. అటువంటి ఫలితాన్ని పొందిన తర్వాత మరలా ఇతర అంశాల మీదకు మీ దృష్టిని మళ్ళించకూడదు. మధ్యలో ఎన్నో ఆటంకాలు, అవరోధాలు, ఇబ్బందులు ఎదురైనప్పటికీ, వాటిని అధిగమించే ప్రయత్నం చేయాలి, సాధించితీరాలి. నావను తీరానికి చేర్చాలి. సాధకులుగా మనస్సును సాధించే ప్రయత్నం కొనసాగుతూనే వుండాలి.

***పగ పొగవంటిది. నిన్ను చుట్టుముట్టేస్తుంది. నిన్ను చుట్టేస్తుంది.***
***పగ నీలో సెగ పెడుతుంది. భగభగమంటూ నిన్ను మండిస్తుంది, నిలువెల్లా మసి చేస్తుంది.***
***ఎవరో నీపట్ల అనుచితంగా ప్రవర్తించారని పగబట్టడం వద్దు. ఆ పగను ప్రేమగా మార్చుకో!***
***నీకు అన్యాయం చేసినవాళ్ళే, నీ ప్రవర్తనకు పరివర్తన చెందుతారు.***
***నీకు న్యాయం చేయడానికి ముందుకు ఉరుకుతారు.***
***పగకంటే ప్రేమ గొప్పదని తెలుసుకుంటారు.***
***ఆ పగవాళ్ళను కూడా మారుస్తుంది.***
***మనసు మనిషికి ఒక దైవవరం. అది మరొకందుకు శాపం కూడానూ.***
***మనసు భావనలను సృజిస్తుంది.***
***భావనలు బుద్ధులుగా మారి ఆచరణరూపం పొందుతాయి.***
***కావున, బుద్ధిని మేల్కొల్పుతూ, అనంతమైన శాంతిని పెంచుతూ, పంచుతూ***
***పవనకుమారుని బోధలు పయనములో స్వీకరించి, సన్మార్గులై జీవిత సత్యాన్ని గ్రహించి ,***
***గ్రక్కున అక్కున చేరండి***
***నా చిన్నారి ముద్దుబిడ్డలారా!***

ॐ

**25-05-2019** 08:10 AM

**131) భౌతిక జగత్తు ఏ విధంగా ఏర్పడింది స్వామీ?**

విశ్వం అనంతం. దానికి ఆది-అంతాలు వుండవు. అది భిన్నత్వంతో, స్థూలత్వంతో, రూపనామాలతో, జీవనిర్జీవులతో కూడివుంటుంది. అవన్నీ పరిణామక్రమంలో ఒక భాగంగా ఉద్భవించినవే. భౌతికపదార్థంలో జరిగే మార్పులను భౌతిక పరిణామమని, జీవులలో జరిగే దానిని జీవపరిణామమని అంటారు. విశ్వంలో ముందు భౌతిక పరిణామం జరిగింది. ఆ తదుపరి జీవపదార్థమేర్పడి, దాని నుండి జీవులు ఆవిర్భవించి, జీవపరిణామం జరుగుతుంది. ఆ రెండింటిలో భౌతికపరిణామం అతి నెమ్మదిగా,

*జీవపరిణామం అతివేగంగా జరుగుతుంది. ఎందుకంటే, జీవులకు పుట్టుక-మరణాలు వుంటాయి. నిర్ణీతమైన కాలపరిమితి వుంటుంది. అయితే, అసలు ఈ పరిణామం ఎందుకు జరగాలి? దానికి ప్రేరణ ఎక్కడినుండి వస్తుంది? అందుకు మూలకారణమేమిటి? దీనిని గురించి శాస్త్రీయపంథాలోనే ఆలోచించండి, అవగాహన చేసుకోండి. విశ్వంలో ఏదీ నిలకడగా వుండదు. నిరంతరం మార్పులు చెందుతూ వుంటుంది. అందులో ఒక భాగంగానే, భౌతికజగత్తు ఆవిర్భవించడానికి ఆధారమైన ఆత్మ కూడా మార్పులు చెందుతుంది. అది విస్తరించినట్లయితే, స్వచ్ఛంగా, స్థిరంగా, శుద్ధంగా వుంటుంది. ఘనీభవం చెందే కొలదీ, విశ్వప్రాణశక్తిగా రూపాంతరం చెందుతుంది. అంటే, ఆత్మ ప్రాణశక్తిగా రూపాంతరం చెందుతుంది. అంటే, ఆలోచన అనేది ప్రాణశక్తి అవుతుంది. అటువంటి ప్రాణశక్తి, ఆ తదుపరి ఆలోచనాశక్తిగా రూపాంతరం చెందుతుంది. అంటే, ఆలోచన అనేది ప్రాణశక్తి యొక్క రూపాంతరమే. అది కంటికి కన్పించేది కాదు. అందువలన, దాని ఉనికిని గుర్తించడం బహు కష్టతరం. అటువంటి ఆలోచన అనేది, సూక్ష్మంగా సంకల్పంగా, లేక కోరికగా మారుతుంది. కాబట్టి, సంకల్పమనేది సూక్ష్మమైనది. అటువంటి సంకల్పం నెరవేరాలంటే, దానికి తప్పక ఒక వస్తువు కావాలి. ఆ విధంగా, అది ఒక భౌతిక వస్తువును తయారుచేసుకుంటుంది. అయితే, ఆ వస్తువు ఎలా తయారవుతుంది? ప్రాణశక్తి యొక్క రూపాంతరం వలన రేణువులు, ఆ రేణువుల కలయిక వలన పరమాణువులు, ఆ పరమాణువుల కలయిక వలన అణువులు, ఆ అణువుల కలయిక వలన పదార్థం, దాని వలన ఇతర ఆకారాలు, రూపాలు ఏర్పడ్డాయి. అయితే, ఏ రెండు సంకల్పాలు ఒకే రకంగా వుండవు కాబట్టి, తయారయ్యే వస్తువులు కూడా ఒకే రకంగా వుండవు. అందుకే విశ్వమంతా భిన్నత్వంలో కన్పిస్తుంది. మీరు జాగ్రత్తగా విశ్లేషించుకున్నట్లయితే, విశ్వంలో కన్పించే వస్తువులన్నీ సంకల్పాల యొక్క రూపాంతరాలే. సంకల్పం నెరవేరేంత వరకు వస్తువు అవసరమవుతుంది. సంకల్పం నెరవేరిన తర్వాత ఆ వస్తువు యొక్క అవసరముండదు. కాబట్టి, అది విచ్ఛిన్నమై, విచ్ఛేదనమై పంచభూతాలలో కలిసిపోతుంది.*

***మరణమంటే భయమెందులకు?***
***అనుభవమేగా మీకందరికీ***
***జీవనరణానికి ముగింపు మరణమే కదా!***
***తీరిన ఋణానికి ప్రామిసరీ నోటు చింపివెయ్యటమే గదా!***
***నీ ఇష్టానికి నీవు పుట్టావా నీ ఇష్టప్రకారమే చావటానికి?***
***చావుపుట్టుకలు చదరంగపు ఆటలే కదా***
***సతీసుతులు, బంధుమిత్రులు ఏమైపోతారోనని సంకటమా?***
***కొంచెం ముందు వెనుకగా నిన్ను అందరూ చేరుకుంటారుగా.***
***మనిషి చనిపోతేనేం? ఆత్మ అనంతంగా వుంటుంది గదా!***
***చొక్కా చిరిగిపోతే మరో చొక్కా మార్చుకోరా?***
***ఎన్నాళ్ళని గడ్డికూడు తింటారు? ఎన్నాళ్ళని మట్టిగూటిలో వుంటారు?***
***పాడు పంజరం వీడి, పరమపథం పట్టకూడదా?***

***పవనకుమారుని బోధలు పరిపరి విధాల అర్థం చేసుకుని,***
***ఆంజనేయుని అతి లాలనతో, అతి చేరువగా చెంత చేరుటకై***
***చింతలు మాని, క్షణికమైన దానికై వెంపరలాడక***
***అహంకార అభిమానాలను అతిచేరువకు రానివ్వక,***
***అత్యున్నత స్థితిని అందుకొనుటకై ప్రయత్నము అనునది ప్రారంభించి అందుకొనండి***
***సాధకులైన నా చిన్నారి ముద్దుబిడ్డలారా!***

ॐ

**26-05-2019** 08:10 AM

**132) నిస్సంగత్వ భావంతో కర్మలు ఆచరించాలి అంటారు కదా స్వామీ? అది ఎలా స్వామీ?**

*తామరాకుపై నీటిబొట్టు నిలవదు. అలాగే, యోగిపై కూడా కర్మలు ప్రభావం చూపవు. ఎందుకంటే, యోగి కర్మలను భగవదర్పణ బుద్ధితో చేయడం వల్ల, ఫలితాలపట్ల ఆసక్తి లేకుండా చేయడం వల్ల. ఏ వ్యక్తిపట్లనైనా, ఏ వస్తువుపట్లనైనా, ఏ విషయంపట్లనైనా, ఏ కర్మపట్లనైనా ఇష్టం-అయిష్టం, సంగం-అసంగం, రాగం-ద్వేషం ఇలాంటి భావాలు ఏర్పడటానికి కారణం 'నాది' అనే భావన ఏర్పడటం వల్లనే. మమత్వం ఆపాదించుకోవటం వల్లనే సుఖదుఃఖాలు, జయాపజయాలు, లాభనష్టాలు మొదలైన ద్వంద్వఫలితాలు మీపై ప్రభావం చూపుతాయి. కాబట్టి, కర్మలను మమత్వబుద్ధి లేకుండా భగవదర్పణబుద్ధితో, భగవత్‌కార్యమనే భావనతో ఆచరించాలి. ఉదాహరణకు, ఒక వ్యక్తి వర్తకుని వద్ద పనిచేస్తున్నాడు. ఆ ఉద్యోగి యజమాని ఏ పని చెబితే ఆ పని చేస్తాడు. అతడు చేసిన పనులన్నీ యజమాని కోసమే. అందువల్ల, ఆ వర్తకునికి వ్యాపారంలో లాభం వచ్చినా, నష్టం వచ్చినా ఉద్యోగిపై ఎలాంటి ప్రభావం చూపదు. అలాగే, మీరు చేసిన కర్మలన్నీ, 'భగవంతుని కోసం' అనే భావనతో చేస్తే, ఆయా కర్మలపట్ల ఎలాంటి మమత్వబుద్ధి ఉదయించదు, ఫలితాలపట్ల ఎలాంటి ఆసక్తి జనించదు, ఫలితాలు ఎలాంటివైనా ప్రభావం చూపవు.*

**133) సాధన ద్వారా ఎట్టి పరివర్తన కలుగుతుంది స్వామీ?**

*యోగులు మమత్వబుద్ధి లేకుండా, ఫలాకాంక్ష త్యజించి, భగవదర్పణ బుద్ధితో కర్మలను ఆచరిస్తారు అని చెబుతాను. అసలు యోగులకు కర్మలను ఆచరించవలసిన అవసరం ఏమిటి? అని మీరడగవచ్చు. యోగులు ఫలాకాంక్షను త్యజించి, కేవలం శరీరం, మనస్సు, బుద్ధి, ఇంద్రియాలతో చిత్తశుద్ధి కోసం, కర్మలను ఆచరిస్తారు. యోగులు అంతఃకరణశుద్ధి కోసం తమ శరీరం, మనస్సు, బుద్ధి, ఇంద్రియాలతో కర్మలను ఆచరిస్తారు. ఏ ఆధ్యాత్మిక సాధనల ప్రయోజనమైనా చిత్తశుద్ధిని పొందటం కోసమే, అంతఃకరణ పవిత్రత కోసమే, మనోనిర్మలతను సాధించటం కోసమే. కాబట్టి, కర్మానుష్టానం కూడా చిత్తశుద్ధి చేకూరటం కోసమే. మబ్బులు కమ్మినంత మాత్రాన ఆకాశంలో సూర్యుడు లేడనలేరు కదా! అలాగే, మీ చిత్తాన్ని అజ్ఞానమనే మేఘం ఆవరించినంత మాత్రాన పరమాత్మ మీలో లేరనలేరు కదా! ఆకాశాన మబ్బు తొలగితే సూర్యుడు ప్రకాశించినట్లు, మీ అంతఃకరణను ఆవరించిన అజ్ఞానం*

అంటే మలినం తొలగితే, పరమాత్మ దర్శనం కలుగుతుంది. ప్రతి ఒక్క సాధకుడూ ప్రయత్నించేది ఆ అంతఃకరణశుద్ధి కోసమే. అదే సకల సాధనల ఉద్దేశ్యం, అదే సర్వయోగాల ప్రయోజనం.

ॐ

**27-05-2019** 08:15 AM

**134) మహాభారతం యొక్క అంతరార్థం ఏమిటి స్వామీ?**

*మహాభారతం కౌరవ-పాండవుల కథగా విన్నంత వరకూ వినాలనే ఆసక్తితో ఉత్సాహంగానే వుంటుంది. కానీ, తత్త్వదృష్టితో జీవుని కథగా సరియైన విధంగా అవగాహన చేసుకుంటే, స్వస్వరూపజ్ఞానం కలిగి, అమృతత్వాన్ని పొందగలదు. భారతకథ ముఖ్యంగా జీవుని వ్యవస్థను, సాధకుని వ్యవస్థను చెబుతున్నది. జీవితసంగ్రామములో జీవుడు 84 లక్షల జీవరాశుల గర్భములలో జన్మించి, చివరకు మానవుడై పుట్టి, ఏ విధంగా ఉంటుందో, ఎన్నెన్ని రూపాలలో కామశత్రువులెట్లెట్లు జీవుడు తనకు తానే గుర్తించలేని విధంగా ప్రవర్తిస్తూ, అతనిని సంసారబంధంలో పడవేస్తున్నవో, ధర్మాధర్మముల వివేకమెట్టిదో, తత్త్వదృష్టి ఎటువంటిదో, సాధకుని మోక్షసాధనా యుద్ధం ఎలా జరుగుతుందో, తనలోని కామశత్రువులను జీవుడు ఎలా గుర్తించి సంహరించాలో, మాధవుడు సాధకునిలో ఎలా సారధ్యం సలుపుతాడో... మొదలైన విషయాలను మనిషి కోరినా కోరకున్నా, గుర్తించినా గుర్తించకున్నా అతనికి కావలసిన విషయాలన్నీ మహాభారతం స్పష్టంగా తెలియచేసింది. క్షత్రియుల కథతో పోల్చి, మోక్షసాధన యుద్ధవీరుడైన మానవునికి తన ఈ సాధన కర్తవ్యమును గుర్తుచేస్తూ, జీవితమార్గము మలచుకోమని, కామశత్రువుల నుండి మరలమని, కుల మత భేదము లేకుండా అందరికీ తెలుపుతున్నది. అనాదిగా వస్తున్న జీవుడు మానవుడై, మాధవుడిగా మారగలిగిన వృత్తాంతమును ఇప్పటికీ, ఎప్పటికీ సత్యమైనదీ, సనాతనమైనది అయిన మార్గమును తెలియచేస్తున్నది. తన పుణ్యవిశేషమైన ప్రయత్నం చేత, మానవజన్మను పొంది, తాను నమ్మిన కొద్ది ధర్మమువలన కామములను పూర్తిగా త్రెంచుకోలేక, దుఃఖాంతం పొందలేక, ఇంకా దేహాత్మభావంలోనే నిలిచిపోతాడు. అనేక జన్మలలో ఇట్లు, సంసార ప్రవాహంలో కొట్టుకుని, ఎప్పటికో తన హృదయంలోనే వున్న మాధవుడ్ని ఆశ్రయిస్తాడు. ఈ సంసార దుఃఖం అంతం చేసుకునే మార్గం అడుగుతాడు. మాధవుడంటే, లక్ష్మికి భర్త అని కాదు. 'మా' అంటే ప్రకృతి. ప్రకృతికి అధిపతి మాధవుడు. తన ప్రకృతిని జయించి, మానవుడు పొందవలసిన ఉన్నత పథమే మాధవత్వం. అదే మాధవుడు. కనుక, తత్త్వమునకు సంబంధించిన దృష్టి కావాలి. అలా ప్రవర్తించడమే తత్త్వదృష్టి. జిజ్ఞాస వుంటే, సామాన్యులెవరైనా సాధనార్హతను సంపాదించగలరు. పాండవుల జననమునకు తత్త్వసమన్వయం ఇలా వుంది.*

*ధర్మరాజు:- యముడు ధర్మదేవత. 84 లక్షల జీవరాశుల గర్భముల ప్రాణులలో ఏ జీవి ఎంతటి ప్రమాణమైన ధర్మం ఆచరించుటకు పుట్టిందో అనే వివేకం తెలిసినవాడు యమధర్మరాజు. ధర్మాధర్మ వివేకం యముని స్వరూపలక్షణం. ఈ వివేకంతో ధర్మమునకు విరుద్ధంగా ప్రవర్తించినవారిని దండించి,*

దోషం గుర్తింపచేసేవాడు. కనుక, ధర్మాధర్మ వివేకమును విచారించుకొనుటకుగల అవకాశమే ధర్మరాజు పాత్ర.

*భీముడు:–* వాయువు వరం వల్ల భీముడు పుట్టాడు. అంటే, వాయు అంశం భీముడిలో వున్నదన్నమాట. వాయువు కంటికి కనబడకుండా సంచలనం లేక అంతటా వ్యాపించి వుంది. భూమి తిరుగుట వలన గాలికి సంచలనం కలిగింది. ఒత్తిడి తక్కువై, ఎటు త్రోవ దొరికితే అటు పరుగెడుతుంది. సందర్భమునునుసరించి, అప్పుడప్పుడు, అక్కడక్కడ ఒత్తిడి చాలా తక్కువగుట వలన, అతి వేగంగా, బలంగా వీస్తుంది. అడ్డువచ్చిన వాటిని కూల్చేస్తుంది. అలాగే సాధకుని దృఢత్వం, సాధకుని లోపల లక్షణం బయట ఇంద్రియాలలో కనబడేది కాదు. దృఢమైన స్థితిలో స్థిరంగా వుంటుంది. విషయములలో సంచరించాల్సిన అవసరం లేకనేవుంటుంది. ఏ విషయంలోనైనా సాధనాబలమునకు ఒత్తిడి తగ్గితే, వెంటనే సంచలనం కలిగించుకుని వ్యాపిస్తుంది. విషయము విపరీతమైతే, నామరూపాలు లేకుండా విషయం నాశనం చేసేటట్లు వ్యాపిస్తుంది. అంటే, సాధకునిలోని సాధనా దృఢత్వమనే సాధనాంశమే భీముని పాత్ర.

*అర్జునుడు:–* ఇంద్రుని వరం వల్ల పుట్టినవాడు అర్జునుడు. ఇంద్రుని ప్రత్యేకత – అతని వజ్రాయుధం. లోకంలో వజ్రం కంటే వాడియైనది మరొకటి లేదు. వజ్రాయుధమునకు దూసుకొనిపోయి శత్రుసంహారం చేయుటయే కానీ తిరుగులేదు. అట్లే సాధకుడు వజ్రం వంటి గట్టి పదునైన జ్ఞానంతో ముందుకు సాగాలి. వెనుతిరగని తీవ్రవేగంతో సాధన చేసే సాధకునిలోని సాధనా కరుకుతనమే అర్జునుని పాత్ర.

*నకులుడు, సహదేవుడు:–* యుక్తి, అనుభవం. అశ్వనీదేవతలు దేవతలకు వైద్యం చేసేవారు. సాధనలో వెనుకంజ వేయుటయే ఏకైకమైన పెద్దవ్యాధి. దీనిని తప్పించుటకు సాధనలో నిలువ గలిగే విధంగా, ముఖ్యంగా రెండు చికిత్సలు కావాలి. 1. యుక్తి 2. అనుభవం. సాధనలో పతనం కాకుండుటకు యుక్తి, అనుభవములు సరియైన చికిత్సలే. నకులునికొక విద్యయున్నది. రథంలో ప్రయాణం చేస్తున్నప్పుడు, పెద్దవర్షం కురిస్తే, తన కత్తిని చక్రంవలే అడ్డంగా తిప్పుతూ, తనమీద ఒక్క వర్షపుబొట్టు కూడా పడకుండా ప్రయాణం చేయగలడు. అట్లే, సాధకుడు తన సాధనా చతుష్టయ సంపదలోని అంశములను సాధిస్తూ, వాటిని తన సాధనకు ఆయుధములుగా చేసికొని, తన స్థానంలో కుదురుగ నిలిచే, తన సాధనాంశమే నకులుని పాత్ర. ఈ విధంగా అవగాహన చేసికొనలేని స్థితికి యుక్తి చికిత్స అవుతుంది. సహదేవునికి పాండిత్యం వున్నది. లౌకికంగా ఏ విషయంలోనైనా పాండిత్యం అంటే వివేకం ప్రయోగించుటలో అనుభవం, అనుభవం చేత ఆయా రంగాలలోని సమస్యలకు పరిష్కారం దొరుకుతుంది. అందువలన ఆధ్యాత్మిక సాధనలోని అనుభవం ఆధ్యాత్మిక సాధనకు చికిత్స. సాధకునిలో సాధనానుభవమనే సాధనాంశమే సహదేవుని పాత్ర. పాండవులందరూ అన్నగారైన ధర్మరాజు మాటకు కట్టుబడి వున్నారు. సాధనాంశములన్నీ ధర్మాధర్మ వివేకమునకు కట్టుబడి ఉండునన్న తత్త్వము దీనిలోని సూచన. మోక్షసాధన యుద్ధంలో తన కామశత్రువులందరినీ చంపి, తన లోకములను జయించి, తన సాధనాంశములతో తానొక్కడే మిగిలి వుంటాడని చెప్పుటకే యుద్ధానంతరం పంచపాండవులే మిగిలివున్నారు. ఇదే సాధకునికి కైవల్యం. సాధకుడు కేవలమై నిలిచేస్థితి.

***వృద్ధాప్యం వరమో శాపమో తెలియక అయోమయంలో నీవున్నావు***
***ప్రశాంత జీవనం జీవిత చరమాంకంలో కావాలని***
***ఆత్మీయుల ఆప్యాయతలే రాగవల్లరిగా అల్లుకుపోవాలని,***
***గతస్మృతులే వృద్ధాప్యానికి మధురస్మృతులుగా నిలవాలని,***
***సంతోషమయ జీవితానికి పరమావధిగా నీవు నిలవాలనుకున్నావు***
***వార్ధక్యానికి వసంతం రావాలని, తీరని కోరిక దేవుడ్ని కోరుతూ భగవన్నామస్మరణ చేస్తున్నావు.***
***దైవస్మరణే వృద్ధాప్యానికి ప్రాణవాయువని, ఆధ్యాత్మిక చింతనలే వృద్ధాప్యానికి తోడుగా నిలవాలని***
***నీ మదిలో ఎన్నో ఆశలు, మామిడి చిగురుల్లా చిగురించాయి***
***పేగుబంధాల కోసం పరితపిస్తూ, మదిలో మెదిలే కాంక్షలు చకోరపక్షుల్లా ఎదురుచూస్తున్నాయి,***
***కాంతివిహీనంగా మదిలో నిలిచిపోతున్నాయి.***
***ఈ మారుతి మాటలు చెవికి ఎక్కించుకుని, బరువుల మూటను దింపి,***
***మలిసంధ్య కాదు, అది మదిసంధ్యగా గుర్తించి, గురుతు తెలుపు గురువును చేరి సదా సుఖించండి***
***నా చిన్నారి ముద్దుబిడ్డలారా!***

ॐ

**28-05-2019** 08:15 AM

**135) దుర్గుణములు జీవుడ్ని ఏ విధంగా ప్రభావితం చేస్తాయి స్వామీ?**

*కామ, క్రోధ, లోభ, మోహములు ప్రతి మానవునికీ వుంటాయి. ఇవి కేవలం దేహమునుండి ఆవిర్భవించేటటువంటివే. ఈ కామం చేత, ఈ కోరిక చేత, రామాయణమే మీకు చక్కగా బుద్ధి చెప్పింది. ఏమి చెప్పింది? రావణుడు గొప్ప తపస్వి, గొప్ప సంపదను కలిగినటువంటివాడు. శక్తిసామర్ధ్యములు కలిగినవాడు. భుజబలం, బుద్ధిబలం, ధనబలం కావలసినంత ఉండినటువంటివాడు. అన్నీ వుండికూడానూ, కామదృష్టికి లోబడటం చేతనే తాను సర్వమునూ కోల్పోయినాడు. తన రాజ్యమును సర్వనాశనం గావించుకున్నాడు. కనుక, కామదృష్టి ఎట్టివారికైనా మంచి చేయదు. రెండవది, క్రోధము. ప్రపంచములోనే గొప్ప సైంటిస్టు హిరణ్యకశిపుడు. చంద్రమండలం వరకే కాకుండా, సూర్యమండలానికి కూడా పోయాడు. అన్ని మండలాలు తిరిగాడు. పంచభూతములను తన హస్తగతం చేసుకున్నాడు. ఇంతటివానిలో కూడా క్రోధం అధికం కావటం చేతనే, తాను కూడా పతనమైపోయాడు. పరుల మీద కాదు, భగవంతునిపైనే క్రోధం సాగిస్తూ వచ్చాడు. కట్టకడపటికి, అధఃపతనమైపోయాడు. ఇంక లోభం. ఇంత పెద్దరాజ్యం తీసుకొని కూడా, సూదిమొన మోపే స్థలం కూడా పాండవులకు ఇవ్వ నిరాకరించాడు దుర్యోధనుడు. తత్ఫలితంగా, ఆ దుర్యోధనుడు తన కుటుంబంతో సహా పతనమయ్యాడు. కనుక, కామమునకు రామాయణం, క్రోధమునకు భాగవతం, లోభమునకు భారతం. రామాయణం*

చదువుతున్నారు. చదివినంత మాత్రమున చాలదు. కామతత్త్వాన్ని దూరం చేయాలి. రామతత్త్వాన్ని విశ్వసించాలి. అప్పుడే మీ జీవితం రమిస్తుంది. కేవలం రామాయణ పారాయణం సరిపోదు. అంతరార్థమును గ్రహించాలి. రామాయణంలోని దుర్గుణం కామమే. ఈ కామానికి దాసుడు కావటం చేతనే శక్తివంతుడైన రావణుడు సర్వనాశనం అయిపోయినాడు. కనుక, రామాయణ పారాయణం, లోపలనున్న కామాన్ని దూరం చేయాలి. భాగవత పారాయణంతో క్రోధాన్ని దూరం చేసుకోవాలి. హిరణ్యకశిపుడు క్రోధంతో తన కన్నకుమారుని ఏనుగుల చేత తొక్కించుతుండగా, నారాయణ నారాయణ అంటాడు. ఏనుగులు కూడా నారాయణుడు అయిపోతాయి. అదే విధంగా విషసర్పాలు, పర్వతాలు నారాయణుడు అయిపోతాయి. యద్భావం తద్భవతి. మీరు ఎట్టి భావం అభివృద్ధి చేసుకుంటారో, అట్టి భావస్వరూపాన్ని పొందుతాడు భగవంతుడు. కనుక, ప్రేమ చేత భగవంతుని మీరు ప్రార్థించండి. అపుడే మీరు భగవంతుని చేరగలరు. ఇక లోభం. ఈ లోభంతో దుర్యోధన దుశ్శాసనులు చేయరాని పనులు చేశారు. కట్టకడపటికి, పడరాని బాధలు అనుభవించారు. సిరిసంపదలు, పరాక్రమం అంతా అదృశ్యమైపోయాయి. కట్టకడపటికి సత్య ధర్మ శాంతి ప్రేమ అహింసలనే పంచపాండవులే విజయాన్ని సాధించారు. కనుక, సద్గుణములను పెంచుకున్నప్పుడు, ఎప్పుడూ విజయాన్నే సాధిస్తూంటారు. అపజయం మీ చెంతకే రాదు. మిమ్మల్ని మీరు ప్రేమతో నింపుకోండి. హస్తాలను త్యాగంతో నింపుకోండి. చేతికి త్యాగమే అలంకారం. కంఠమునకు సత్యమే అలంకారం.

***ఇంతింతగా నేనిచ్చిన విద్యలు ఎంత నేర్చినా, ఎన్నడు తరగవు***
***భోగము కొరకై తపనలు ఆగనిచో, రోగముల పాలై, మూల్గులు తప్పవు.***
***మదము విరుగదు, మోదము పెరగదు.***
***అహము కోసమై ఇలలోను పరుగులు తీసి, అహమే పరమని పడు ఇబ్బందులు***
***పరమేమో, ఆ పరమేమో, మరి కావరమే ఇహమందు మిగులునిక ,***
***వేదన ఆగదు, సాధన సాగదు***
***మోహము కరుగదు, మోదము పెరుగదు***
***పంతములతో ఇటు పొంతన పొసగదు***
***గెంతులకే ఈ జీవనమయినట్లయితే, చింతలవంతల నడిపించును***
***గతుకుల దారిని మెతుకుల కొరకై ఎదలోతులలో సాధన సాగదు,***
***సాగే జీవితంలో సఫలీకృతమును సాధించుటకై, సత్త్వమనస్కులై, సత్యమును వీడక,***
***వీరావేశంతో వీరాంజనేయుని విలువైన మాటల మూటను భద్రపరుచుకుని***
***భజరంగభళి నుడివిన రామనామ సుధా స్రవంతిలో మునిగి,***
***ముచ్చటైన ముక్తిపథాన్ని చేరండి***
***నా చిన్నారి ముద్దుబిడ్డలారా!***

ఓం

**29-05-2019** 08:30 AM

**136) సత్సాంగత్యం యొక్క విశిష్ఠత ఏమిటి స్వామీ?**

జ్ఞానుల్ని, తత్త్వదర్శుల్ని, దైవభక్తుల్ని, త్యాగమూర్తుల్నీ మన్నించి, ఆదరించడం మీ సంప్రదాయం. అందుకే మహనీయులెవరైనా, మీ ఇంటికి వచ్చినప్పుడు వారి పాదాలు కడిగి, శిరస్సుపై చల్లుకొని, అర్ఘ్యపాద్యాలు, ఆతిథ్యము ఇచ్చి గౌరవించాలి. "అభ్యాగతిః స్వయం విష్ణు, అతిథి దేవోభవ" అన్న సూక్తి, ఈ సత్యాన్నే చెబుతుంది. సాధుసజ్జనులను ఆదరిస్తున్నప్పుడు, మరింత భక్తిశ్రద్ధలు కనబరిస్తే, సుఖము, శాంతి, ఆనందము మీకు ప్రాప్తిస్తాయి. సాధుసజ్జనుల దర్శనం వల్ల ఆ రోజు శుభప్రదమవుతుంది. దీని వల్ల మీ పాపాలు, వేదనలు హరిస్తాయి. మీరు సంపన్నులవుతారు. సాధుసజ్జనుల పాదాల వద్ద మనస్సు శాంతంగా ఉంచాలి. ఎంతో తృప్తి పొందుతారు. సాధుసజ్జనులు వచ్చినరోజు దీపావళి దసరా వంటి పండుగరోజుల్లాగా ఆనందోత్సాహాలతో గడపండి. దుస్సంగం మంచిది కాదు కానీ, సత్సంగం మంచిది. మహాత్ములతో సంబంధం మంచికి మార్గమవుతుంది. సజ్జనసాంగత్యం భౌతిక విషయాల కోసం కాకుండా, ఆధ్యాత్మిక తత్త్వవిచారణ కోసం, జ్ఞానసముపార్జన కోసం పెద్దలనాశ్రయించడం, వారిద్వారా ఆత్మోన్నతికి కావలసిన విశేషాలను తెలుసుకోవడం చాలా మంచిది. సత్సంగం కల్పవృక్షంలాంటిది. ఇది ఐహిక, ఆముష్మికాభీష్టాలను సాధించిపెడుతుంది. మహాత్ములు ఉపదేశించిన మంచిమాటలు అనే, అమృతవృష్టితో, మీలోని తాపాలన్నింటినీ ఒక్క క్షణంలో మటుమాయం చేస్తుంది. అందుకని, సత్సంగం ప్రతి వ్యక్తికీ అత్యంత ఆవశ్యకం. మహనీయుల, సజ్జనుల సాంగత్యాన్ని మీరు పొందాలి. దానివల్ల లౌకిక ప్రపంచముతో పెంచుకున్న సాంగత్యం మెల్లమెల్లగా దూరమవుతుంది. దానివల్ల నిస్సంగులౌతారు. అంటే బంధాలకు, అనుబంధాలకు అతీతులవుతారు. ఏ అహంకార మమకారాలకు లోనుకాని ఉత్తమస్థితికి చేరేందుకు దోహదం చేసే నిస్సంగంవల్ల, వ్యక్తులపట్ల, వస్తువులపట్ల, ధన కనక వస్తువాహనాలపట్ల, అవి కావాలనే తీవ్ర ఆకాంక్ష అంటే వాంఛ వుంటే, మోహం నశిస్తుంది. ఇలా ప్రాపంచిక విషయాలపట్ల మోహం అంటే, అవి పొందాలనే తపన నశించి, జీవన్ముక్తులవుతారు. రత్నాకరుడనే బందిపోటు దొంగ, సప్తమహర్షుల సాంగత్యం పొంది, రామనామ ఉపదేశం పొందటం వలన, వాల్మీకి మహర్షిగా మారి, రామాయణం వ్రాశాడు. అంగులీమాలుడనే నరహంతకుడు గౌతమబుద్ధుని దర్శనంతో, మహనీయమూర్తిగా మారిపోయాడు. ఇప్పటి అవతారం సత్యసాయినే తీసుకోండి. స్వామి భక్తుల సాంగత్యం వల్ల, ఏనాడూ తండ్రికి కూడా పిడికెడు అన్నం పెట్టనివారు, ఈనాడు నిత్యనారాయణసేవలో పాల్గొంటున్నారు. హరిస్మరణ అలవాటులేనివారు కూడా నిత్యనామసంకీర్తన, నగరసంకీర్తనలలో పాల్గొంటున్నారు. దానధర్మాలెరుగనివారు, నిస్వార్థసేవా కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. విరాళాలిస్తున్నారు. ఇదంతా సజ్జనసాంగత్య ప్రభావమే కదా!

**137) అయితే, సజ్జనసాంగత్యం నిత్యం చేయాలనే తపన, సంకల్పం ఎలా కలుగుతుంది స్వామీ?**

మీరు చేసే ప్రతిపనీ భగవదర్పితంగా చేయండి. మీరు చేసే ప్రతిపని, ఆడే ప్రతిమాట, ప్రతి ఆలోచన వారి చూపునుండి తప్పించుకోజాలదు. ఆయన సర్వసాక్షి. నిన్ను అనుక్షణం గమనిస్తూ

వుంటాడనే స్పృహ కలిగి వుంటే, మీరు ఎప్పుడూ హరినామస్మరణ చేస్తూ, భగవత్సేవలో గడిపే సజ్జనుల సాంగత్యాన్ని పొందుతారు. సజ్జన సాంగత్య మహిమతో భగవంతునికి దగ్గరౌతారు, అంటే చేరువౌతారు. పరిమళాలు వెదజల్లే పూవును ముట్టుకున్న మీ చేతికి కూడా పరిమళం సోకుతుంది కదా. ఇది మీరు మరువరాదు. ఇవేవీ నాకు తెలియకపోయినా, నాకు తెలిసింది ఒక్కటే. నాకు తెలిసిన నగ్నసత్యం ఒక్కటే. అదొక్కటే... అదే నమ్మకం, విశ్వాసం. అదే నడిపిస్తున్నది ఈ జీవితాన్ని ఇప్పటికీ, ఎప్పటికీ. ముమ్మాటికీ అది సత్యస్యసత్యం!

***అఖిలాండకోటి బ్రహ్మాండనాయకుడు, అనంత ఐశ్వర్యాల గని,***
***ఈ సృష్టిలో ప్రతి అణువులో నిండినవాడు, కదిలే ప్రతిజీవిలో కదలని జడంలో,***
***అనంత విశ్వంలో నిండిన ఆ దైవానికేం ఇవ్వగలరు? ఆ అనంతశక్తిని ఎలా సేవిస్తారు?***
***సర్వం ఆయనే అయినప్పుడు, ఆయనకేం సమర్పించగలరు?***
***కేవలం మీ మనసు, బుద్ధి, ఆత్మను కలిపి, ఆ విశ్వేశ్వరుడికి అంకితమై,***
***ప్రగాఢ భక్తితో ధ్యానించి, మీ గురుదేవుడైన ఈ ఆంజనేయుని దీవెనలతో, అఖండభక్తితో,***
***అంతిమ శ్వాస వీడు వరకు, విలువైన సత్యాన్ని వడిసిపట్టుకుని***
***పరమపథము వైపు నడవండి***
***సాధకులైన నా చిన్నారి ముద్దుబిడ్డలారా!***

ॐ

**30-05-2019** 08:10 AM

**138)** అన్ని సంపదలలోకెల్లా గొప్ప సంపద ఏది స్వామీ?

మీరు ఒక విషయాన్ని గుర్తుపెట్టుకోవలసి వుంటుంది. ఎక్కువగా భౌతిక సంపత్తిని పొందినవారిని చూచి, మిగతావారు ఈర్ష్య, అసూయపడటం జరగవచ్చు, లేదా మాకు లేదని బాధపడవచ్చు. జ్ఞానసిరి, భౌతికసిరిని మించిన సిరి అని మీరు భావించుట లేదు. పైన నేను చెప్పిన మిసిమిసి చూచి, మిగతా మనుషులెవరూ అసూయపడరు. జ్ఞానసంపదను చూచి కొద్దిమంది అసూయపడతారేమో. ఇక ఇంతకు మించిన ధనం ఇంకొకటుంది. ఆ సంపదను చూచి, మానవులెవ్వరూ ఈర్ష్య చెందరు. తమ దగ్గర ఆ సంపద లేదని వ్యధ చెందరు. అదే శీలసంపద. అది సర్వోత్కృష్టమైన భాగ్యం. మిమ్మల్ని సత్యం వైపుకు నడిపించేది, అజ్ఞానపొరల్ని తొలగించి మీమీద జ్ఞానకాంతులు ప్రసరింపచేయగల సంపద. శీలసంపద. గుణసంపద పెంచుకోకుండా, మోక్షప్రాప్తి అనే లక్ష్యం లేకుండా, మనిషి తన అంతర్గత శక్తులను నియంత్రించలేడు, పరిపూర్ణ శాంతిని పొందలేడు. సమాజంలో తనకు ఎంత గుర్తింపు వచ్చింది? తాను ఎంతమందికి ఉపాధిని, ఉద్యోగాన్ని కల్పించాడు? ఎంతమంది తన అజమాయిషీలో ఉన్నారు? తాను ఎంత పేరుప్రఖ్యాతులు సంపాదించాడు? ఎంత సంపదను కూడబెట్టాడు? అన్న విషయంపై మనిషి ఆనందం ఆధారపడిలేదు.

*సమాన సంపద గల ఇద్దరు ధనవంతులు ఒక సాధువు దగ్గరకు వస్తారు. మాటల్లో తామిద్దరూ ఒకే స్థాయి శ్రీమంతులమని ఆ సాధువుకు చెప్తారు. వెంటనే ఆ సాధువు, "లేదు లేదు" అని ఇద్దరిలో ఒకరిని ఇంకొకరికి చూపిస్తూ, "ఈయన నీకన్నా సంపన్నుడు" అంటాడు. అప్పుడు వారిద్దరూ, "లేదు స్వామీజీ, మాకు సమానమైన సంపద ఉన్నది" అని ఆయనకు వివరిస్తారు. అప్పుడు సాధువు, "లేదు. భౌతికపరమైన సంపద మీ ఇద్దరి దగ్గరా సమానంగా వుండవచ్చు. కానీ, ఈయనలో దయాగుణం, దానగుణం నీకన్నా ఎక్కువగా వున్నాయి. అందువల్ల ఈ వ్యక్తి నీకన్నా ధనికుడు" అని చెబుతాడు. అన్నీ పొందినవారు కూడా ఇంకా ఏదో చేయాలి కాబట్టి, చేయటమే కానీ, నిజానికి తాను వాటిని ఎందుకు చేస్తున్నాను, చేస్తున్న వాటి వలన తనకు నిజమైన తృప్తి, శాంతి, సంతోషాలు కలుగుతున్నాయా? అని ఆలోచించుకోవటం లేదు.*

## 139) ఆనందప్రాప్తికి కర్మాచరణ ప్రతిబంధకమా స్వామీ?

*ఈ రోజుల్లో ఎవరిని చూచినా అందరు తీరికలేని పనుల్లో మునిగివున్నవారే. అందరూ ఏవో పనుల్లో నిమగ్నమై (నిమగ్నం కాకుండా కూర్చోలేరు కాబట్టి), తమను తాము సంతోషపెట్టుకోవాలని అనుకుంటున్నారు. పని లేకుండా మనసును నిగ్రహించడం ఇంకా కష్టం కాబట్టి, తమను తాము సదా ఏదో పనిలో నియోగించుకుంటున్నామని చెప్పి, సిద్ధి కోసం సరియైన స్థాయిలేనివారు ధ్యానమని, ఆధ్యాత్మికత అని. ఒకేసారి కర్మను వీడకూడదు. మనసు పూర్తిగా అదుపు తప్పే ప్రమాదముంది. నిజానికి సిద్ధిని పొందినవారు నిష్క్రియాపరులవుతారు. వారికి ఆనందం కొరకై కార్యమవసరం లేదు. అంటే, వారు కార్యం చేయరని కాదు. వారి ఆనందం కార్యంపై ఆధారపడిలేదు. ఎవరికైతే ఆనందం స్వతః సిద్ధమవుతుందో, ఆ స్వతఃసిద్ధమైన ఆనందం నుండి, కావలసినంత మేరకు కార్యం చేస్తారో, వారు పరిపూర్ణ మనుషులు. మిగతా వారంతా తప్పనిసరై కార్యంలో నియోగించబడ్డవారు, లేదా నియోగించుకుంటున్నవారు. ఈ రెండవకోవకు చెందినవారు సంతోషాన్ని అదృష్టం కొద్దీ పొందటమే జరుగుతుంది.*

## 140) గుణసంపద ఎట్టిది స్వామీ?

*కార్యరహిత స్థితి, సిద్ధిని పొందటానికి, మీకున్న ఆధ్యాత్మిక ప్రక్రియలే నేను బోధించిన రాజయోగ, కర్మయోగ, భక్తియోగ మరియు జ్ఞానయోగాలు. సనాతనధర్మంలో ఉన్న అన్ని యోగాలను నాలుగు ప్రధాన యోగాలుగా విభజించి మీకు అందిస్తున్నాను. మనుషులు గుర్తించినా, గుర్తించకపోయినా గుణసంపద మాత్రమే భగవంతుడి దృష్టిని ఆకర్షిస్తుందని మీరు సదా జ్ఞప్తిలో వుంచుకోవాలి. నేడు దృష్టి అంతా శరీరంపై పెట్టి, సౌందర్యమంటే బాహ్యాపరమైనది అని అనుకుంటూ, అంతఃసౌందర్యాన్ని పెంచుకోవటంపై ఆవగింజంత ధ్యాస కూడా పెట్టడం లేదు. రూపసౌందర్యమున్నా, గుణసౌందర్యం లేకపోతే, అది పెద్దగా లెక్కలోకి రాదు. అది అపరిచితులకు తప్పించి మిగతా వారెవ్వరికీ సౌందర్యంగా కూడా తోచదు. కావున, మీ ప్రయత్నమంతా సౌశీల్యసిరిని పెంచుకోవడానికే అని గ్రహించి నిజమైన శ్రీమంతులు కండి – దేవతలకు సహితం ఈర్ష్య రగిలించండి!*

***అరవై నాలుగు విద్యలు నేర్చినా, అసంతృప్తియే మిగులు***
***ఆత్మవిద్యనొక్కటి అభ్యసించిన చాలు, అఖండశాంతి లభించును***
***అన్నీ తెలుసునన్న అజ్ఞానముతో, అహంకారివైయుండకు***
***నిన్ను నీవు గుర్తెరిగి నడచినచో, నీ జన్మము ధన్యమగును***
***అందచందములనాకర్షించిన, బందిఖానా జీవితమగును***
***అందాలొలికెడు ఆత్మజ్ఞానమే సుందరదేవుని చూపును***
***ఆశపడక జీవితమును గడిపిన ఆంజనేయుని ఆశీస్సులందుకొందువు***
***దోషము లెన్నని దొడ్డమనసున్న యెడల, దోసిలిపట్టి, క్షమాభిక్షను కోరుకున్న యెడల***
***నీవు కోరుకున్నది, నీవు కోరనిదీ కూడా నీకు కూర్చేను . హనుమ***
***పదాలు ఎంత గొప్పవైనా, పథము గట్టిదైనచో, పరుగుపరుగున***
***ఈ పవనకుమారుడు మిమ్ము దరిచేర్చుకొనును అనుమాట ముమ్మాటికీ తథ్యము***
***నా చిన్నారి ముద్దుబిడ్డలారా!***

ॐ

**31-05-2019** 08:20 AM

**141) రామాయణం నుంచి మేము నేర్చుకొనవలసినది ఏమిటి స్వామీ?**

*శ్రీరాముడంతటి వాడినే నిందించేవారు, దూషించేవారు, దుర్భాషలాడేవారు వున్నప్పుడు, మీలాంటివారిని దూషించేవారు ఉండరనుకోవటం మీ అమాయకత్వం. మీరు అందరిచేత మంచివారనిపించుకోవాలనే ఆరాటం మీ అవివేకానికి చిహ్నం. అయితే, మంధర, రావణాసురుడు లాంటివారు రాముడ్ని దుశ్శీలునిగా భావించినంత మాత్రమున అతను ఎన్నడూ తన మానసిక సమతుల్యాన్ని కోల్పోలేదు. కాబట్టి, ఎప్పుడూ ఎవరో ఒకరు నిందించేవారు ఉంటారని గుర్తెరిగి, మానసిక ప్రశాంతతను కోల్పోకుండా వుండటం అభ్యసించాలి. శ్రీరాముడు ఆటవికులు, ఋషులు, దేవతలు, వన్యజీవులు ఇలా అందరితో సామరస్యంగా మెలిగాడు. చివరకు, చపలచిత్తులైన వానరులతో సైతం సమర్ధవంతంగా పని చేయించుకోగలిగాడు. కానీ మీలో చాలామంది సామరస్యంగా పని చేయలేరు, చేయించుకోలేరు. అందరిలో ఒకరిగా వుంటూ, అందరితో సామరస్యంగా జీవించడమెలాగో శ్రీరాముడి నుండి నేర్చుకోవాలి. కౌసల్య గర్భవతిగా వున్నప్పుడు, దశరథుడు ఆమెతో "నీకు ఏమైనా కోరికలుంటే చెప్పు, నెరవేరుస్తాను" అన్నాడు. అప్పుడామె, "ప్రభూ! నాకు ఏ కోరికలూ లేవు. నేనిప్పుడూ చాలా తృప్తిగా వున్నాను, ఆనందంగా వున్నాను" అని బదులిస్తుంది. అలాగే, రాముడు జన్మించిన ఆనందంలో కౌసల్య తన దాసికి ఒక రత్నాలహారాన్ని ఇవ్వబోతుంది. అప్పుడు ఆ దాసి, "అమ్మా! నాకు ఎలాంటి ఆభరణాలు వద్దు. దివ్యకాంతులతో ప్రకాశిస్తున్న ఈ బాలుడ్ని ఒక్క నిముషం ఎత్తుకోవటానికి అనుమతినివ్వండి చాలు" అంటుంది. దీన్నిబట్టి, ఆ పరమాత్మ సన్నిధిలో, చింతనలో ఉన్నవారికి ప్రాపంచిక కోరికలపట్ల ఆసక్తి, సంపదలపట్ల అనురక్తి ఉండదని అర్ధం చేసుకోండి. అలాగే, సీతాదేవి అరణ్యవాసంలో వున్నప్పుడు,*

ఆమె దర్భశయ్యనే పట్టుపాన్పుగా, కందమూలాదులనే పంచభక్ష్య పరమాన్నాలుగా, పంచవటినే అంతః పురముగా భావించి తృప్తి చెందేది. ఎందుకంటే, నిరంతరం శ్రీరాముని సన్నిధిలో ఉండటం వల్లనే, అరణ్యవాసంలో ఎదురయ్యే కష్టాలేమీ ఆమెకు కష్టాలుగా తోచలేదు. ఇలా అరణ్యవాసంలో పదమూడేళ్ళు ఆనందంగా గడిపిన సీతామాత ఒక్క సంవత్సరంపాటు కష్టాలను ఎదుర్కోవలసి వచ్చింది. అందుకు కారణం రాముని సన్నిధిలో ఆనందంగా జీవిస్తున్న ఆమె మనస్సు బంగారులేడిని వాంఛించడమే, ప్రాపంచిక విషయం వైపు మనస్సు మరలటమే. సీతాదేవికి రాముని సన్నిధిలో అరణ్యవాసం కూడా అంతఃపురంలాగా తోచినట్లు, మీరు సదా పరమాత్ముని స్మరణలో, చింతనలో ఉన్ననాడు, మీకు ఎదురయ్యే విషమపరిస్థితులు మీపై ఎలాంటి ప్రభావమూ చూపవు. ఎప్పుడైతే మనసు పరమాత్ముని నుండి ప్రాపంచికం వైపు మరలుతుందో, అప్పటినుండే మీకు కష్టాలు ఆరంభమవుతాయి. సీతాదేవి బంగారులేడి కావాలని కోరడం వల్ల, ఆ ప్రయత్నంలో రాముడు ఆమెకు దూరమయ్యాడు. అలాగే మీరు భగవంతుని ముందు మీ కోరికల చిట్టాను విప్పితే, ఆ కోరికల్ని తీర్చే క్రమంలో ఆయన మీకు దూరమవుతాడు. కాబట్టి, పరమానందాన్నిచ్చే పరమాత్ముని సన్నిధి కావాలో, లేదా పరమదుఃఖాన్ని కొనితెచ్చే ప్రాపంచిక విషయాలు కావాలో మీరే నిర్ణయించుకోవాలి. మంథరలాంటి ఒక్క విషపుచుక్క చాలు, పాలలాంటి స్వచ్ఛమైన కైకేయి మనస్సును విషపూరితం చేయటానికి. విషపుపాత్రలాంటి రావణుడి మనస్సులో మండోదరి, మారీచుడు, విభీషణుడులాంటి ఎన్ని పాలచుక్కలు వేసినా ప్రయోజనం శూన్యం. కాబట్టి, దుష్టులైన మంథరలాంటి వారికి దూరంగా వుండాలి. దుర్మార్గుడైన రావణాసురుడులాంటి వారిని మార్చడం దుర్లభం అని గ్రహించాలి. మంథర మాటలు కైకేయిలో అసూయాద్వేషాలు రగిలించడం వల్ల, అయోధ్య అతలాకుతలమైంది. రావణుడిలోని కామక్రోధాలకు శూర్పణఖ మాటల ఆజ్యం తోడవటంతో, లంకానగరం నాశనమైంది. అందువల్ల, అసూయాద్వేషాలు, కామక్రోధాల బారిన పడకుండా నిర్వికారంగా, నిశ్చలంగా ఉండగలిగినపుడే, శ్రీరాముడిలాగా ఆదర్శవంతమైన జీవితం నడపగలుగుతారు. అప్పుడే మీ జీవితాలకు సార్థకత చేకూరినట్లు, మానవజన్మ సార్థకత సాధించినట్లు!

***మాటంటే రామయ్యదే మాట***
***అది చూపుతుంది సరియైన బాట***
***పదిమంది మెచ్చేలా నడవమన్నది***
***పదుగురుకీ నచ్చేలా మెలగమన్నది***
***మనిషి పోయినా గాని, మాట మిగలవలెనన్నది***
***చేసినట్టి మేలు మరువకూడదన్నది***
***చెప్పిందే చేసి చూపమంటున్నది***
***మంచితనం ఎందున్నా పంచుకోమంటుంది***
***విలపించే కళ్ళకై వెతకమన్నది, వీలైతే కన్నీళ్ళను తుడవమంది***
***మనిషి మనిషిగా వుంటూ, దేవుడవ్వాలంటున్నది***
***దేవదేవుని మాటల మూటలు జ్ఞప్తియందిడుకొని, జీవితాన్ని పూలబాటగా తీర్చిదిద్దుకొని***

***పవనకుమారుడు అందిస్తున్న ఆణిముత్యాల సమాహారంలో ఒక ముత్యమై***
***ముక్తిపథాన్ని చేరండి సాధకులైన***
***నా చిన్నారి ముద్దుబిడ్డలారా!***

ఓం

**01-06-2019** 08:15 AM

**142) మేము ఏ విధమైన విశాల భావములు కలిగియుండవలెను స్వామీ?**

*మరణం అందరినీ సమం చేస్తుంది. వట్టి చేతులతో ఈ ప్రపంచంలోకి వస్తున్నారు, వట్టి చేతులతో తిరిగి వెళ్ళాలి అన్న విషయం సదా గుర్తుంచుకుంటే విజయం మీదే, వైఫల్యభావనల నుండి దూరంగా వుండవచ్చు. అక్కడ విజయాలూలేవు, వైఫల్యాలూ లేవు. రెండు విభిన్న అనుభవాలు. విభిన్న అనుభవాలతో మీరు ఎంత త్వరగా పాఠాలు నేర్చుకోగలుగుతారో చూచుకోండి. మీరు ఉన్నదానితో సంతృప్తి చెందకపోవటానికి కారణం, ఆనందం అనే ఖనిని త్రవ్వి వజ్రాలను పొందే ప్రక్రియలో మీకు బుద్ధికన్నా బాగా ఉపయోగపడేది హృదయం అని తెలుసుకోకపోవడమే. ఇతరులను మీలో భాగంగా చేసుకుంటూ, ప్రతి మనిషి సంస్కారాన్ని, ఆధ్యాత్మిక విలువలను, హృదయవికాసాన్ని పొంది, తనకు పరులెవ్వరూ లేరని భావిస్తూ, అందరినీ తన భాగస్వాములుగా చేసుకోవటానికి ప్రయత్నిస్తే, భావోద్వేగ్వాలు అదుపులో వుండటమే కాకుండా, మనిషి విశ్వమానవ ప్రేమికుడుగా ఎదుగుతాడు. ప్రేమద్వారా శాంతి సంతోషాలు కలుగుతాయి. ఈ లోకంలో పరాయి వారెవ్వరూ లేరు. అందరూ నీవారే. ప్రపంచమంతా నీదిగా చేసుకోవటానికి ప్రయత్నించాలి. అందుకని, మీరు సేవాకార్యక్రమాల్లో పాల్గొనాలి. సేవద్వారా కలిగే ఆనందాన్ని రుచిచూడాలి. హృదయవికాసమే దీని ప్రయోజనమవ్వాలి. అందరూ తనలో భాగమని, తాను అందరిలో భాగమని నిరంతరం గుర్తుంచుకోవాలి. ఈ ఒక్క శరీరంతో మమేకమై, తన సర్వాత్మకత్వాన్ని మనిషి మరచిపోతున్నాడు. దానితో స్వార్థపరత్వం పేరుకొంటున్నది. నీ దగ్గర వున్న ధనం నీది కాదు, అది భగవంతునికి చెందుతుంది. నీవు కేవలం ధర్మకర్తవు మాత్రమే. లోకకళ్యాణానికి భగవంతుడు తనను కేవలం ఉపకరణంగా చేసుకొనే ప్రక్రియలో భాగంగా తనకు అంతటి సిరిని సమకూరేటట్లు చేశాడన్న భావన మీలో బలపడాలి. మీ దగ్గర అవసరాలకు మించి ధనం పోగైతే, అది ఇతరులకు సేవ చేసుకోవడానికి భగవంతుడిచ్చిన అవకాశంగా భావించి, దీనులను, నిరుపేదలను ఆదుకోవటానికి ఉపయోగించాలే తప్ప, అంతా తన కష్టార్జితం కాబట్టి, తాను, తన కుటుంబసభ్యులు మాత్రమే అనుభవించాలి అని కోరుకోకూడదు. మీరు ఈ ప్రపంచంలో దేనికీ యజమానులు కారు. మీకున్నదంతా భగవంతుడి అనుగ్రహఫలంగా వచ్చిందేనని భావించి దుఃఖితులను, అన్నార్తులను ఆదుకోవాలి. అలా కాకుండా, అంతా మీరే అనుభవించాలనుకుంటే, ప్రకృతి అనుభవించనివ్వదు. కూడబెట్టినదంతా తన శరీరం, లేదా తన శరీరాలకు సంబంధించిన ఇద్దరు ముగ్గురు మాత్రమే అనుభవించాలని కోరుకుంటే, భగవంతుడికి దూరమవుతారు. కేవలం కష్టపడటం వల్లనే అన్నీ సమకూరేటట్లయితే, లోకంలో చాలామంది*

*కష్టపడుతున్నారు. మరి, అందరూ శ్రీమంతులవటం లేదే? మీకొచ్చిందంతా మీ కష్టార్జితమేనని భావించి, తోటి మనిషిని నిరాదరించడం, లేదా ఉపేక్షించటం తగదు. ప్రతి మనిషికీ ఒక సామాజిక బాధ్యత వుంటుంది. సమాజంలో మీ స్థితిగతులు మెరుగుపడుతున్న కొద్దీ, బాధ్యత కూడా పెరుగుతూ వుంటుంది. ఆ బాధ్యతను విస్మరిస్తున్నారంటే, మీ హృదయం కుంచించుకుపోతున్నదన్నమాట. హృదయమే భగవంతుడి ఆవాసం. సర్వశక్తికి ఆలవాలం. ఈ ఆవాసం బలహీనమవకూడదు. ఈ కేంద్రం బలహీనమవటమే చాలా మానసిక, శారీరక రోగాలకు కారణం. మరి సేవ ద్వారా ప్రేమను అందించటం ద్వారా హృదయవికాసాన్ని పొంది, జీవనసాఫల్యాన్ని పొందే ప్రయత్నం కొనసాగిస్తారా?*

***అతికించడం నీకు తెలియనప్పుడు, చింపుకుంటూ కూర్చోవద్దు.***
***బ్రతికించడం చేతకానప్పుడు, చంపుకుంటూ కూర్చోవద్దు.***
***మనిషిగా నీవు పుట్టినప్పుడు, మహిషిగా మసలటం అనుచితం కాదు.***
***మంచి ఆలోచనల్ని చేసినప్పుడే, మానవత్వపు సుమాలు మదిలో పూస్తాయి***
***మంచి మనిషిగా మసలినప్పుడే మమతానురాగాలు వెల్లివిరుస్తాయి.***
***బ్రతికినంత కాలం, బ్రతుకు సారం తెలియాలి***
***నీ చుట్టూ వున్నవారికి మమకారం పంచాలి***
***నీలోని జ్ఞానదీపాన్ని నీవే వెలిగించుకోవాలి***
***నీ చుట్టూ వున్న చీకటిని వెన్వెంటనే తరిమికొట్టాలి***
***నీ హృదయం నిండా ప్రేమ నిండాలి***
***నీ సదనమంతా అనురాగం పండాలి***
***ఆంజనేయుని బోధల అమృతం కురవాలి***
***బోధించిన బోధలు మీ ముంగిట భోగిపళ్లై కురవాలి***
***నిరంతర రామనామం అంతరాలను పోగొట్టి, శుభాలను అందించాలి***
***అందుకున్న దానిని అర్థము చేసుకొని, అందంగా అద్భుతంగా ఆశీర్వచనాలతో***
***దరిచేరండి నా చిన్నారి ముద్దుబిడ్డలారా!***

ఓం

**02-06-2019** 08:10 AM

**143) భగవంతుడు సర్వవ్యాపకుడన్న అనుభూతి ఎలా కలుగుతుంది స్వామీ?**

*భగవంతుడు (పరమాత్మ) సూక్ష్మాతిసూక్ష్మం, సర్వవ్యాపకం. పరమాత్మ కన్నా వేరుగా రెండవదేదీ నిజంగా లేదు. "ఏకమేవా ద్వయం బ్రహ్మనేహనా నాస్తి కించన". ఉన్నదంతా ఒక్కటేయైన బ్రహ్మమే (పరమాత్మే), దానికన్నా వేరుగా రెండవదేదీ కొంచెం కూడా లేదు. మరి అంతటా వ్యాపించియున్న బ్రహ్మం ఎందుకు కనిపించుట లేదు? అంతటా వున్న ఆకాశాన్ని ఎందుకు చూడలేకపోతున్నారు? అంటే, బుద్ధిలోని దోషమే. సూక్ష్మాతిసూక్ష్మమైనదేదీ స్థూలదృష్టికి (కంటికి) కనిపించదు. ఆకాశాన్ని,*

*శబ్దాన్నిబట్టి తెలుసుకుంటున్నారు గదా. తెలుసుకుంటున్నారు, నిజమే. దానికి కారణం ఆకాశానికి శబ్దమనే గుణం ఒకటి వుండటం వల్ల తెలుసుకోగలుగుతున్నారు. కానీ, పరమాత్మ గుణరహితుడు. అంటే ఏ ఒక్క గుణం లేనివాడు. కనుకనే, కంటితోగానీ, మనసుతోగానీ, బుద్ధితోగానీ తెలుసుకోలేకపోతున్నారు. మరి దేనితో తెలుసుకోవాలి అన్న ప్రశ్న వచ్చినట్లయితే, బుద్ధితో తెలుసుకోవాలి. కాకపోతే, బుద్ధిలోని దోషాన్ని తొలగించుకొని శుద్ధం చేసుకొని, ఆ శుద్ధబుద్ధితో తెలుసుకోవాలి. బుద్ధిలోని దోషమేమిటి? అని అడిగినట్లయితే, ప్రాపంచిక విషయవాసనలే. వాటి వల్లనే బుద్ధి స్థూలమై కూర్చుంది. సూక్ష్మం చేసినప్పుడు పైపైన కన్పించే ఈ మనసు, శరీరాలను కాక, వీటికి ఆధారమైన ఆత్మను దర్శింప నేర్పు కలుగుతుంది. అప్పుడు ఎవరిని చూచినా ఆత్మగా, తానుగా తెలుస్తుంది. అన్ని ప్రాణులను ఆత్మలోనే దర్శిస్తారు. ఇలా అంతటా పరమాత్మనే దర్శించేవారికి, తాను పరమాత్మ స్వరూపమేననే అనుభూతి కలుగుతుంది. అలాంటప్పుడు ఇక పరమాత్మకన్నా తాను ఎలా వేరుగా ఉంటాడు? పరమాత్మ తన నుండి ఎలా వేరవుతాడు? ఉన్నదొక్కటే గదా! అదే పరమాత్మతో ఐక్యత, అదే సాక్షాత్కారం. నీవొక డాక్టరువు. ఒక నాటకం వేయాలని తోటి స్నేహితులతో కలిసి ప్రాక్టీసు చేశావు. అందులో నీది స్త్రీపాత్ర. ఆ పాత్రలో ఎంతో చక్కగా నటించి రాణించావు. స్త్రీలాగా నడుస్తూ, స్త్రీ హావభావాలను ప్రదర్శిస్తూ, డాక్టరునని మరచిపోయి, బాగా నటించావు. నాటకం ముగిసిన తర్వాత వేషం తీసివేశావు. ఇప్పటిదాకా ఆ స్టేజి మీద ఉన్న స్త్రీ నీకన్నా వేరా? కాదు. ఎవరన్నా అడిగినా, ఆ స్త్రీని నేనేనయ్యా అంటావు. అంటే, నీకు-ఆ స్త్రీకి ఏమీ తేడా లేదన్నమాట. కాకపోతే, వేషంలోనే తేడా వుంది. అదే విధంగా, భగవంతుడు అహంకారమనే మాయతో (వేషంతో), జీవుడిగా ఈ సంసారచక్రమనే నాటకంలో జీవిస్తున్నాడు. తాను భగవంతుడినని మరచిపోయి అనేక బాధలు, భయాలతో, దుఃఖాలతో పైకీ క్రిందకీ ఎగిరెగిరిపడుతున్నాడు. మహాత్ముల సాన్నిధ్యం వల్ల, శాస్త్రాన్ని తెలుసుకోవటం వల్ల తానెవరో తెలుసుకుని, తాను తానుగా వుండేందుకు తీవ్రప్రయత్నం సాగించాలి. అదే ధ్యానయోగం. ఆ యోగంతో అహంకారమనే మాయను తొలగించుకుని, జీవభావమనే వేషాన్ని కడిగివేసుకుని, తన యదార్థ స్వరూపమైన భగవంతునిగా ఉంటాడు. మరి, ఈ భగవంతుడికి – ఇప్పటిదాకా జీవుడిగా ఉన్నవాడికి భేదమున్నదా? అని అన్నట్లయితే, లేదు. ఆ జీవుడే భగవంతుడు, ఈ భగవంతుడే అప్పటి జీవుడు. ఇప్పుడిద్దరూ లేరు, ఉన్నది ఒక్కడే. ఆ ఒక్కడూ భగవంతుడే, పరమాత్మే. తానే అదే – తత్ (పరమాత్మ). తత్, త్వం ఒక్కరే 'అసి' అయివున్నారు. అసి అంటే అన్ని ప్రాణులలోనూ ఉన్న (నేను) ఆత్మను ఏకత్వంలో నిలిపి ఎవరు చూస్తారో, అతను ఎలా సంచరించినా, నాలోనే వర్తిస్తూ వుంటాడు.*

***గూటిలో దీపంలా తన - పరల నడుమ ఊగుతున్న ఊపిరి లయలు***
***స్పర్శ కోల్పోయిన జీవితం అవిటి శిలలా మంచానికతుక్కుని***
***ఒక శ్వాస అదేపనిగా ధ్యానిస్తూ వుంది***
***కళ్ళల్లో గూడుకట్టుకున్న చిత్రపటాలు మసకబారుతున్న వేళ***
***పరిభ్రమించే పాదాలు స్థాణువులై, నిశ్చలంగా ఎదురుచూస్తున్నాయి ఒక మృత్యులోగిలికై***
***చీకటి కమ్ముతున్నది నిశ్శబ్దంగా ఒక ఆత్మదీపం అనంతాత్మునిలో లీనం అయ్యింది***
***చితుకులపై ఆహుతి అయ్యింది***

***మరి ఆంజనేయుని మాటలు ఏమయినాయి, తెలుసుకునే ప్రయత్నం అంతం అయినది***
***రేపు లేదు నిన్న లేదు నేడు లేదు***
***ఉన్నది ఏది?***
***బ్రతికిన కాలంలో, బుజ్జగించి చెప్పిన మాటలు విని, జీవితాన్ని సరిదిద్దుకున్నట్లయితే,***
***చితుకులపై వున్నా, చిరంజీవివే అయ్యి, ఆంజనేయుని చేరి***
***అనగా, నీవే ఆంజనేయుడివన్న నగ్నసత్యాన్ని ఎరుకలో వుంచుకొనెదవు***
***సాధన మరువకండి నా చిన్నారి ముద్దుబిడ్డలారా!***

ॐ

**03-06-2019** 08:10 AM

**144) ప్రార్థన యొక్క ఆవశ్యకత మరియు విశిష్ఠత ఎట్టిది స్వామీ?**

*నేను, నాది అనే పదాలు వాడకుండా వ్యక్తిగతమైన అనుభవాలను చెప్పటం ఎవరికైనా కష్టసాధ్యం. వ్యక్తిగత అనుభవాలన్నీ కూడా చివరకు ఆధ్యాత్మిక అనుభవాలుగా మారిపోతాయి. వ్యక్తిగత జీవితం కూడా తనదికాని జీవితం అవుతుంది. నేను అనే వ్యక్తిగత భావం నశించినవాళ్ళు, అదృష్టవంతులు. భగవంతుని ఆశీస్సులు పొందినవారవుతారు. అలాంటి వారిలో అత్యున్నతమైన మహోన్నత స్థితి ప్రకాశవంతంగా నెలకొంటుంది. మీ ఆధ్యాత్మిక అనుభవాల గురించి మొదలుపెట్టాలంటే, ముందుగా విశ్వశాంతి ప్రార్థనలకు మీరు గౌరవాన్ని, భక్తిని ప్రకటించాలి. అది మీ బాల్యం నుండి కూడా ఎంతో సహాయపడ్తుంది. అటువంటి ప్రార్థనలు చేసిన ప్రతి పర్యాయం, అది మీలో ఆనందాన్ని, దివ్యానుభూతిని, తన్మయత్వాన్ని నింపి, మిమ్మల్ని మీలోపల నిండియున్న పరమాత్మ ఉనికిని, మీ శరీరంలో ప్రతి అణువులో నిండి నిబిడీకృతమైన ఈశ్వరుని అనుభూతి చెందేలా చేస్తుంది. విశ్వశాంతి ప్రార్థన చేసిన ప్రతీసారి, మీకు అలాంటి అనుభవమే కల్గుతుంది. మీరు విశ్వశాంతి ప్రార్థన చేసినప్పుడు గానీ, లేదా ఇంకేమైనా మీ మనస్సుకు బాగా నచ్చిన ప్రార్థన చేసినప్పుడు గానీ, లేదా ఆధ్యాత్మిక ప్రార్థనలు చేసినప్పుడు గానీ, మీకు అలాంటి దివ్యానుభూతులు కల్గవచ్చు, కల్గుతాయి. అది మిమ్మల్ని ఈశ్వరుడి సన్నిధికి చేర్చటానికి సహాయకారిగా మారుతుంది.*

**145) దీక్షలు ఎందుకొరకు చేయాలి స్వామీ?**

*ఎవరైనా ప్రార్థనను, ఉపవాసాన్ని, ధ్యానాన్ని వేరువేరుగా భావించరాదు. ఉపవాసదీక్షలో సాధకుడు అహంకార రాహిత్యం కోసం ప్రార్థన చేయాలి. దానితో, శరీరంలో ఆరోగ్యం, బుద్ధిలో వికాసం, హృదయంలో శాంతి పెరగటం గమనించాలి. చాలామంది తరచుగా ఆరోగ్యం బాగాలేనపుడు మాత్రమే ఉపవాసం చేస్తుంటారు. మీరు భౌతికమైన లబ్ధి కోసమో, ఆరోగ్యం కోసమో, దీర్ఘకాల జీవితం కోసమో కాకుండా, అంతర్యామిగా కొలువైన భగవంతుని కోసం ఉపవాసదీక్ష చేయాలి. శాంతి ప్రార్థన ద్వారా ఆనందానుభూతిని, నిశ్చలస్థితిని, శాంతిని పొందాలి.*

**146) భగవంతునికి చేరువవటం అంటే ఏమిటి స్వామీ? అది ఎలా సాధ్యము స్వామీ?**

*భగవంతుని దివ్యానుభూతిని మీ లోపలా బయటా కూడా అనుభవించాలి. మౌనంగా వుంటూ కూడా వీటిని సాధించవచ్చు. ఆ సమయంలో ఉపవాసం కావచ్చు, విందు భోజనం కావచ్చు. అలాంటి పవిత్రమైన అనుభవాలు అమరమైనవి. అలాంటి మహోన్నతములైన అనుభవాల్ని, దివ్యానుభవాన్ని, దివ్యానుభూతులను మాటల్లో వివరించలేరు, వివరించడం అసాధ్యం. చక్కెర తీయదనాన్ని ఏ విధంగా వర్ణించి చెప్పగలరు? అది కేవలం అనుభవించినపుడే మీకు తెలుస్తుంది. పరిమితమైన భాషలో, పరిమితమైన బుద్ధితో అపరిమితమైన భగవంతుని వైభవాన్ని వివరించడం ఎవరికైనా ఎలా సాధ్యమవుతుంది? సాధ్యపడుతుందా? అందువలన, మీరు బ్రహ్మాన్ని తెలుసుకోవడానికి ప్రయత్నించాలి. మిలియన్ల కొద్దీ సూర్యుల తేజస్సును తనలో స్వయంప్రకాశంగా వెలుగొందుతున్న పరమేశ్వరుడ్ని తెలుసుకోవటానికి ప్రయత్నించాలి. అప్పటిదాకా వైభవంగా అన్పించిన అహంకారమే కాకుండా, గొప్పదైన ప్రపంచం కూడా మాయమైపోతుంది. ఎప్పుడూ బయట సంచరించే విషయవాసనలన్నీ (ఇంద్రియాలు) అంతర్ముఖమవుతాయి. బుద్ధిలో ఏకాగ్రత కుదురుతుంది. ఆలోచనాశక్తి స్థిరపడుతుంది. అహంకార రాహిత్యం ఏర్పడుతుంది. అన్ని స్థితులు దాటి, ఆనందాల్లో తేలియాడే సత్యాన్వేషకుడు ఆ స్థితిలో ప్రయాణించి చివరకు మౌనంలో నిమగ్నమవవలసిందే. ఈ విధమైన ఆధ్యాత్మిక సందేశ అనుభవాల గురించి చెబుతున్నప్పుడు, మీలో చాలామంది నిరాశ చెందవచ్చు. అటువంటి వారికి అతీంద్రియశక్తుల మీద ఆసక్తి వుంటుంది. ఆధ్యాత్మిక అనుభవాలు వుంటే దూరదృష్టి ఏర్పడటం, చనిపోయినవారితో లేదా దూరంగా వున్నవారితో మాట్లాడగలగటం, వింత వింత వెలుగులను, కాంతులను దర్శించటం లేదా ఏదైనా పవిత్రమైన మంత్రోచ్చారణలు వినటం, సంగీత ధ్వనులు వినటం ఇలాంటివన్నీ ఊహించుకుంటారు. కానీ, నేను నిజమైన సత్యాన్వేషకులకు వాస్తవాన్ని, సత్యాన్ని తెలియచేయాలని భావిస్తున్నాను. అలాంటి ఆలోచనలు తక్కువ స్థితికి చెందిన సాధకులకు గానీ, ఉన్నతమైన స్థితికి చేరుకున్న సాధకులకు గానీ కల్గవచ్చు. అయితే, ఇక్కడ ద్వైతస్థితి వుంటుంది. ద్వైతం అజ్ఞానానికి సంకేతం. అన్ని ఆధ్యాత్మిక అనుభవాలకీ చరమగమ్యం భగవంతుని దివ్యానుభూతిని పొందటం, పరమాత్మ ఉనికిని తెలుసుకోవటం, గుర్తించటం. దానిని ముందుగా గుర్తించాలి. నీవు ఏదైనా పనిచేస్తున్నా, ప్రార్థనలో వున్నా, ధ్యానంలో వున్నా, మాట్లాడుతున్నా, లేదా పూర్తి మౌనంలో వున్నా నీవు తెలుసుకోవలసింది ఏమిటంటే, పనిచేయటమే పరమాత్మను తెలుసుకోవటం, పరమాత్మను పూజించటం, పరమాత్మానుభవం లేదా అద్వితీయ మౌనం అన్నింటిలోకీ మహోన్నతమైన స్థితి. కానీ, పనికిమాలిన పనులతో గమ్యాన్ని మరచిపోకూడదు. జీవించి వుండగానే నీలో ఆ దివ్యమైన తేజస్సు ప్రకాశిస్తూ వుండగానే, నీ నిజమైన గమ్యాన్ని చేరుకోవటానికి ప్రయత్నం చేయాలి. అపుడు వ్యక్తులు సార్వత్రికమవుతారు. వ్యక్తిగతం, ప్రత్యేక వ్యక్తిగతం కాకుండా వుంటుంది. 'అవుతారు' అని చెప్పటం ఒక విధంగా సరియైన పదం కాదు. ఎందుకంటే, నిజానికి వ్యక్తులెన్నటికీ సార్వత్రికము (స్వతంత్రులు) లేదా విశ్వము కాలేరు. ఉన్నది ఒక్కటే. అది ఎల్లప్పుడూ వుంటుంది. మీ కంటికి కన్పించని విశ్వశక్తి అది. వ్యక్తులు దాన్ని తెలుసుకోగలుగుతారు, గుర్తించగల్గుతారు*

*లేదా గ్రహించగల్గుతారు. అలా గ్రహించిన జీవుడు, బ్రహ్మంగా మారిపోతాడు. మీరు భావాతీతమైన అతీత తాత్త్విక చింతన యొక్క వైభవంతో శాశ్వితంగా నిమగ్నమవుదురు గాక! అది ఇంద్రియాలు, బుద్ధి, వివేకం, అహంకారం, కాలం, కారణం అన్నింటికీ అతీతమైంది. మీ ఆలోచనలు, దృష్టికోణం పరిమితమైన బుద్ధితో కేవలం ఇంద్రియాలకు మాత్రమే గోచరమయ్యే దృశ్యములన్నీ కూడా భ్రమ అని ఎడారిలో ఎండమావుల్లాంటివి అని గుర్తించుకోవాలి. మీరు ఎప్పుడు సంతోషంగా, సంతృప్తిగా వుంటారో, అప్పుడే మీకు శాంతి యొక్క అనుభవం, అవగాహన ఏర్పడుతుంది.*

***శ్రీకరమగు మనిషి జీవితంబును చూడ***
***తనది-నాదియు తపనతో***
***అల్పబుద్ధి మరగి, ఆత్మను మరచినట్లైతే,***
***పుట్టినపుడు ఏమి పట్టుకొచ్చితివి? పోవునపుడు ఏమి పొందగలవు?***
***నిన్న పనిని గూర్చి నేడు తలచవద్దు***
***నేటి పనిని పూని నేడొనర్చు***
***రేపటి పని గూర్చి లేశమంద వలదు***
***ఆదుకొనుటకై ఈ ఆంజనేయుడు***
***ధరణిలో గురువుగా చెంత చేరి***
***నాశనంబు చేయు 'నాది' యనిన మాట***
***మనసు హాయి పొందు 'మనది' యనిన***
***మనదియన్న మాట మానవత్వమును పెంచు***
***అన్న జ్ఞానసుమాలను సున్నితంగా అందించి***
***సుమధురమైన భావాలను మీ హృదిలో భద్రపర్చుకునేందుకై***
***భజరంగభళి భజనగీతాలతో వ్యక్తిత్వాన్ని భస్మం చేసి***
***అవ్యక్తమైన ఆత్మతత్త్వంలో లీనంకండి సాధకులైన***
***నా చిన్నారి ముద్దుబిడ్డలారా!***

ౘ

**04-06-2019** 08:10 AM

**147) స్వామీ! బంధాలు మా ఆధ్యాత్మిక పురోగతికి ఏ విధంగా ఆటంకాలు స్వామీ?**

*బంధాలలో వున్న వ్యక్తి, స్వేచ్ఛను ఎలా అందుకోగలుగుతాడు? ఆలోచించండి. పూర్ణత్వం నుండి ఏమి ఆలోచించినా, మాట్లాడినా, చేసినా అది శక్తినిస్తుంది. బంధాలను ఏర్పర్చదు. పరిమితతత్త్వం నుండి జరిగేవన్నీ శక్తిని హరించివేస్తాయి. నీవు అందరితో, అన్నింటితో సమానం అనుకుంటే ఎలా వుంటుంది? కొందరి కన్నా ఎక్కువ, మరికొందరి కన్నా తక్కువ అనుకుంటే ఎలా వుంటుంది? ఎక్కువ*

అనుకుంటే ఆధిక్యతాభావం, తక్కువ అనుకుంటే ఆత్మన్యూనతాభావం ఏర్పడతాయి. అవి రెండూ ప్రమాదకరమే. ఎక్కువ తక్కువలన్నీ భిన్నత్వానికి ప్రతిరూపాలు. అంతా సమానమనుకుంటే సమదృష్టి అలవడుతుంది. అదే సమాధికి రాచబాట అవుతుంది. తనకన్నా వేరే ఎవరూ తక్కువగా వున్నారనుకొన్నా, ఎక్కువగా వున్నారనుకొన్నా అది భిన్నదృష్టి అవుతుంది. భిన్నదృష్టి ద్వారా శక్తి హరించుకుపోతుంది–సమదృష్టి శక్తిని పెంచుతుంది. దీనినే అవధూతల స్థితి అంటారు. ఆధ్యాత్మికత యొక్క ముఖ్య ఉద్దేశ్యం ఆనందంగా జీవించటమే. అయితే, అసలు ఆనందం అంటే ఏమిటి? ఆనందమంటే, ఆత్మస్థితి. అది కనిపించేది, వర్ణించేది, వివరించేది, నిరూపించేది కానేకాదు. నేను ఆనందంగా వున్నాను అని ఎవరైనా అంటే, అది ఆనందం కానేకాదు. శారీరక, ఇంద్రియ, మానసిక, బుద్ధుల పరిమితులను అధిగమించగలిగితేనే ఆనందం అనుభవంలోకి వస్తుంది. ఆనందాన్ని అనుభవించే స్థాయికి చేరితే, ఇక శరీరమనేది వుండదు. శరీరమే లేకపోతే, జీవితం, సమాజం, ప్రపంచం, ప్రకృతి వంటివి ఎలా వుంటాయి అని అన్నట్లయితే, ఇదే నిరాకార, నిర్గుణోపాసనలోని కీలకాంశం. అయితే, ఆ స్థాయికి చేరటం బహుకష్టతరమే కానీ, ఆంజనేయుని బోధలను ఆలంబనగా చేసుకొని, భౌతిక ప్రపంచంయొక్క స్వరూప స్వభావాన్ని గురించి స్పష్టంగా అవగాహన చేసుకోగలిగితే, ఆ స్థితికి చేరవచ్చు. కాబట్టి, వ్యక్తి ముఖ్యం కాదు. తత్త్వం కూడా ముఖ్యం కాదు. అంతరంగస్థితి ముఖ్యం. నీ గురించి నీవు తెలుసుకుంటే, అందరినీ గురించి, అన్నింటినీ గురించి తెలిసిపోతుంది. ఇతరులను గురించి ఆలోచిస్తూంటే, వారి ప్రతి కదలిక మీ అంతరంగములో సంస్కారాల రూపంలో నిక్షిప్తమై, రాగద్వేషాలను సృష్టిస్తుంది. ప్రపంచ సమాచారమనేది ఏదైనా, ఎటువంటిదైనా మాయకు ప్రతిరూపమే. అది అంతరంగాన్ని కలుషితం చేస్తుంది తప్ప స్వేచ్ఛనివ్వదు. నిరంతరం మారుతూ ద్వంద్వాలకు సంబంధించిన అనవసరపు మిథ్యా సమాచారాన్ని సేకరించటమంత అజ్ఞానం మరొకటి వుండదు. బంధాలున్నంత వరకూ స్వేచ్ఛకు అవకాశమే లేదు. అటువంటి బంధాలకు మూలకారణం భౌతిక ప్రపంచపు అనవసరపు సమాచారమే. అందువలన, మార్గం ఎంత మహోన్నతమైనదైనప్పటికీ, అనుసరించే విధానంపట్ల అప్రమత్తంగా వుండాలి. అనుసరించే విధానం సరిగ్గా లేకపోతే, సత్ఫలితం రాకపోగా, నష్టపోయే అవకాశముంటుంది. ఒక వ్యక్తి రూపం అంతరంగంలో బలీయంగా ప్రతిష్ఠితమైతే, దానిని తొలగించటం బహుకష్టతరము. వ్యక్తులతో సంబంధాలు స్వేచ్ఛకు అవరోధాలు. కాబట్టి, వ్యక్తిత్వం వికసించాలంటే, అంతరంగ సంస్కారాలన్నీ సమూలంగా కరిగిపోవాలి. నేను, నా కుటుంబం ముఖ్యమనే భావనలో వుంటారు కాబట్టి, ఎటువంటి సాధనలు చేసినా, ప్రమాదకరమే. ఆధ్యాత్మిక మార్గంలో జీవించేవారు విశ్వవ్యాప్త భావనలో వుంటారు కావున, అంతరంగం పూర్తిగా శుద్ధి అవుతుంది. అంతరంగంలో తమో, రజోగుణ సంబంధమైన సంస్కారాలుంటే, విశ్వవ్యాపిత భావనలకు అవరోధములవుతాయి. అందుకు వ్యక్తిగత సంబంధాలను పూర్తిగా వదిలివేయాలి. అపుడే విశ్వంలో కలిసిపోయేలా అవకాశముంటుంది. అందుకు శారీరక, మానసిక, ఇంద్రియ, బుద్ధి పరిధులను అధిగమించి ఆత్మస్థితికి చేరాలి. ప్రస్తుతం మీ మానసిక పరిధులు బలోపేతం చేసే విధానమే వున్నందువలన పరిపూర్ణ వ్యక్తిత్వాన్ని అందుకోలేకపోతున్నారు. తనను తాను తెలుసుకునే ప్రయత్నంలో విశ్వమంతా తెలిసిపోతుంది. తనను తాను తెలుసుకోకుండా ఇతరులను గురించి తెలుసుకునే ప్రయత్నం చేస్తే, బంధాలు బలోపేతమై,

స్వేచ్ఛకు అవరోధాలవుతాయి. ఎందుకంటే, బంధాలు ఏర్పడటం చాలా సులభం – అవి తొలగిపోవటం బహుకష్టతరం. అందువలన, పూర్ణజ్ఞానాన్ని పొంది, పరిపూర్ణ వ్యక్తిత్వాన్ని సంతరించుకొని, మీ జీవితాలను ఆనందమయం చేసుకోవాలని మనసా, వాచా, కర్మణా కోరుకుంటున్న ఈ ఆంజనేయునికి సంతసము కల్గించండి నా ముద్దుబిడ్డలారా!

***సత్కర్మ, దుష్కర్మ చదరంగమే జన్మ-జీవన-మరణచక్రము***
***ముక్తి ఏనాటికో మనిషికి తెలియదు***
***భౌతికకాంక్షల మోహమందు ధర్మమే క్షీణించి దైత్యమాయే***
***సద్బోధ సంస్కారమే లేక సతతం తిమిరాంధకారంలో***
***అంతరంగములోని నిర్లిప్తతను హృదయకుహరంలో దాచుకుని***
***కష్టాలను, కన్నీళ్ళను, సుఖాన్ని, సంతోషాన్ని కలసి పంచుకునేందుకై***
***కదలివచ్చిన కరుణాంతరంగుడు శ్రీసత్యసాయి పాదపద్మములయందు మనసు నిల్పి***
***అహరహము పరితపించు ఈ పవనపుత్రుని పసిడివాక్యాలు***
***మిమ్ము పరిపాలించుటకై, సమయానుకూలంగా స్పందిస్తూ, స్ఫురణకు తెస్తూ,***
***తామరాకుపై నీటిబొట్టువలే జీవనయానాన్ని కొనసాగించాలని కోరుతున్న***
***కోటి శుభాశీస్సులనందిస్తున్న కోదండరాముని దాసుడైన***
***ఈ ఆంజనేయుని ముద్దుబిడ్డలారా!***

**U P** : **ఉ**త్సవ **ప**రిసమాప్తి తర్వాత
**U P** : **ఉ**త్పన్నమయ్యే **ప**రిపూర్ణానందంతో
**U P** : **ఉ**త్సాహము భావోద్వేగము **ప్ర**ముఖమై
**U P** : **ఉ**త్సవమూర్తులైన పరమాత్ముని **పా**వనరూపముపై
**U P** : **ఉ**న్న దృష్టిని నిలువరించి **పా**రమార్థికమైన జీవితంలో
**U P** : **ఉ**న్న అవలక్షణాలను **పో**గొట్టుకుని
**U P** : **ఉ**న్నత జీవితానికై **ప్ర**ప్రథమంగా
**U P** : **ఉ**త్పన్నమయే **ప్ర**ణతులర్పిస్తాము స్వామి!
**U P** : **ఉ**న్నత **ప**యనానికై
**U P** : **ఉ**త్పన్నమయ్యే మనో **ప్ర**కంపనలను అరికట్టుటకు
**U P** : **ఉ**న్నతోన్నతమైన **ప**రమాత్మస్వరూపులైన భగవాన్ బాబా
**U P** : **ఉ**పదేశ **ప**రంపరను ఆలకించి, ఆచరించినట్లయితే
**U P** : **ఉ**త్కృష్టమైన **ప**రమపథాన్ని చేరుట తథ్యము

## ***కృతజ్ఞతలు స్వామీ!***

ఓం

**05-06-2019** 08:10 AM

**148) స్వామీ! వాక్కును నియంత్రించుట సాధకునకు ఎటువంటి ప్రయోజనం చేకూరుస్తుంది స్వామీ?**

*చంద్రహారంలా ప్రకాశించే రత్నాలహారాలు, స్నానలేపనాలు, పువ్వులు, కేశాలంకరణలు ఇవేవీ మనిషికి నిజమైన సౌందర్యాన్ని చేకూర్చలేవు. చక్కగా సంస్కరించబడిన వాక్కు ఒక్కటే మనిషికి నిజమైన అలంకారం. మిగిలిన భూషణాలన్నీ నశించినా, చివరకు శరీరం నశించిన తర్వాత కూడా వాక్కు నిలచి వుంటుంది. మరి, వాక్కుకు అంతటి శక్తి ఎక్కడి నుండి వచ్చింది? భగవంతుని మాటకు అంత శక్తి ఎందుకు? అని అడిగినట్లైతే, పవిత్రభావం, విశ్వజనీన ప్రేమ భగవంతునిలో వెల్లివిరుస్తాయి. కాబట్టి, ఆ వాక్కుకు అంత మహత్తర శక్తి వుంది. అలాగే, మీ మనస్సు, వాక్కు ఏకం చేయండి. అంటే, కపటం లేకుండా వుండాలని అర్థం. అపుడు సత్యం దానంతట అదే ప్రతిఫలిస్తుంది. మహాత్ముల మాటలకు అమోఘమైన శక్తి ఉంటుంది. వారి నోట పలికింది అక్షరాలా జరిగి తీరుతుంది. అలాగే, నా మాటలు కూడా ప్రాణవంతాలై, శక్తివంతాలై అవి మీ హృదయాంతరాళాల్లోకి చొచ్చుకొనిపోతాయి. యోగానికి ప్రథమద్వారం వాఙ్నిరోధం, అసత్యభాషణం, పరుషభాషణం, అసంబద్ధభాషణం, పై శూన్యభాషణం (ఒకరి మీద మరొకరికి మనస్సుని విరిచివేసే మాటలు) చేయకుండటం ద్వారా వ్యర్థప్రేలాపనలను అరికట్టాలి. పొదుపుగా మాట్లాడటం వల్ల వాక్కుపై అదుపు వస్తుంది. తరచుగా మౌనవ్రతం పాటించడం, సత్సాంగత్యాల వల్ల వాక్శుద్ధి కలుగుతుంది. వాక్శుద్ధి, మానసిక పవిత్రతల కారణంగానే మాటలకు బలం చేకూరుతుంది.*

**149) పవిత్రమైన జీవనానికి నామజపం ఏ విధముగా సహాయకారి స్వామీ?**

*బాహ్యంగా వుండే అశుద్ధి, అపవిత్రతలను చూచినంత మాత్రమున, తాకినంత మాత్రాన తాము మైలపడ్డామనో, లేక అపవిత్రులమయ్యారనో అనుకోవటం సాధనకు అతిపెద్ద అవరోధం. పరిశుద్ధం, అపరిశుద్ధం అంతా మీ మనస్సులోనివే, మనస్సు మాయలే. పరిశుద్ధ జీవితం గడిపేవారు భగవంతుడ్ని ప్రార్థించినా, ప్రార్థించకపోయినా త్వరితగతిన భగవంతుని వైపు పురోగమిస్తారు. లౌకిక పంకిలంలో కూరుకునిపోయినవారు భగవంతుడ్ని తలచుకోవటానికి ప్రయత్నించినా వారికి బంధవిముక్తి అసాధ్యం. అరిషడ్వర్గాలుగా పిలువబడే కామ, క్రోధ, లోభ, మోహ, మద, మాత్సర్యాలు నిరంతరం మనిషిని ఆవరించుకునే వుంటాయి. వాటి ప్రభావంవల్ల ఆలోచనలు కలుషితమవుతాయి. జీవనగమనమే అతలాకుతలం అవుతుంది. అటువంటి దుర్భర పరిస్థితి నుండి బయటపడి ఆలోచనాధోరణి మారాలంటే, జపధ్యానాలే చక్కటి పరిష్కార మార్గం. కామాన్ని జయించడమెలాగ? అని మీరడిగినట్లైతే, ఎక్కడ భగవన్నామం వుంటుందో, అక్కడ కామానికి స్థానం లేదు, వుండదు అని గట్టిగా చెబుతున్నాను. ఒక్కసారి మనస్సు భగవన్నామానికి అలవాటుపడితే, అపుడు కామవాసనలు మనస్సులో తలెత్తే అవకాశమే లేదు. మీకు మరలా సందేహం కలగవచ్చు. మెలకువగా ఉన్నప్పుడు అది సాధ్యమే కావచ్చు కానీ, నిద్రిస్తున్నప్పుడు కూడా కోరిక 'కలల' రూపంలో వెంబడిస్తే ఇక రక్షణ ఎక్కడిది? అటువంటి ప్రమాదాల నుండి కూడా భగవన్నామం మిమ్మల్ని రక్షిస్తుంది. భగవన్నామాన్ని సరిగ్గా జపిస్తే, దాని శక్తి నిద్రిస్తున్నప్పుడు కూడా*

పనిచేస్తుంది. భగవన్నామాన్ని ఎలా జపించాలో తెలుసుకున్నవారు పగలు, రాత్రి దానిని విడువరు. అప్పుడు శ్వాసక్రియ, జీర్ణక్రియలవలే నిద్రిస్తున్నప్పుడు కూడా నామజపం కొనసాగుతూ వుంటుంది. ఆ నామమహిమ కలల రాకను అరికడుతుంది. మనఃశరీరాలను పరిశుద్ధంగా వుంచుతుంది. ఒకవేళ ఏవైనా కలలు తలెత్తినా, నామశక్తి సాధకుడ్ని వెంటనే మేల్కొల్పుతుంది. రేయింబవళ్ళూ రక్షిస్తుంది. చెడుభావనలు మనిషిని పతనావస్థకు చేర్చుతాయి. వాటి నుండి తప్పించుకుని ఆ ఆలోచనలను శుద్ధి చేసుకోవాలంటే, ప్రేమతత్త్వం అలవర్చుకోవాలి. సాధుజనుల సాంగత్యం చేయాలి. అప్పుడే పరిశుద్ధులవుతారు. అలాంటివారే పరమాత్మకు చేరువకాగలరు.

***ఈ తనువు, మనసు శాశ్వతమనే భ్రమల ముసుగు కప్పకండి***
***ఈ దేహపు స్నేహంతో నీవు అద్దెకు బద్ధుడవై సిద్ధపడ్డావు***
***ఇది నీ సొంత ఇల్లు కాదు, యజమాని ఆ పరమాత్మే .***
***ఏనాడు ఖాళీ చేయమని కబురు వస్తుందో, ఆనాడే ఇల్లు విడిచిపెట్టాలి***
***ఎంత చిత్రం! నాలుగు రోజులు సంబడానికి నడమంత్రపు సిరి భాగవతానికి***
***ఎందుకు నిక్కులు, ఎందుకు టెక్కులు?***
***మనో జిజ్ఞాసం మహతీమెట్లపై జ్ఞానపరిమళాలు మీటి***
***మాయ తొలగించి ప్రతి మనసు తోటలో***
***జన్మ చరితార్థపు సువాసనల తొడుగు శాశ్వతంగా ధరించేలా***
***భగవన్నామ సంకీర్తనా భాగ్యపు భవంతిని సొంతం చేసుకోండి***
***నేను, నాదన్న అహంకారాన్ని అంతం చేయండి***
***ఆంజనేయుని ఆదరణకు, ఆప్యాయతకూ నోచుకున్న***
***నా చిన్నారి ముద్దుబిడ్డలారా!***

ॐ

**08-06-2019** 08:45 AM

**150) ఆత్మకు ఏదీ అంటదని ఎలా తెలుసుకోవాలి స్వామీ?**

"ఆత్మ, శరీరంలో వున్నప్పటికీ కర్మ చెయ్యదు, కర్మ మాలిన్యాన్ని అంటించుకోదు. ఆత్మ కర్మ చేసేది కాదు గనుక ఫలితాన్ని పొందదు, మాలిన్యం అంటదు" అంటే సరిపోతుంది. కానీ, ఈ శరీరం ఎప్పుడూ ఏదో ఒక పని చేస్తూనే వుంటుంది కదా! కర్మ చేసినప్పుడల్లా ఆ కర్మఫలాలు శరీరానికి అంటక తప్పదు మరి. మాలిన్యాలు ఆ శరీరంలోనే అంతటా వ్యాపించియున్న ఆత్మను అంటకుండా ఎలా వుంటాయి? అనే సందేహం ఎవరికైనా కలుగవచ్చు. ఎందుకంటే, ప్రతిరోజూ గిన్నెలో నీళ్ళుపోసి స్టౌమీద వుంచి, స్టౌ ముట్టిస్తారు. దానితో గిన్నె వేడెక్కుతుంది. ఆ వేడికి గిన్నెలోని నీరు కూడా వేడెక్కుతుంది గదా. అలాగే, శరీరానికి అంటిన మలినం ఆ శరీరంలోని ఆత్మకు అంటకుండా వుంటుందా? అన్న

సందేహం! ఆ సందేహం తీర్చటానికి ఆకాశమును దృష్టాంతముగా తీసుకోవచ్చు. ఆత్మకు, ఆకాశానికి దగ్గర పోలికలున్నాయి. ఏమిటవి? అంటే, ఆత్మ సూక్ష్మాతిసూక్ష్మం. ఆకాశం పంచభూతాలన్నింటిలోకి సూక్ష్మం. ఇక అంతకన్నా సూక్ష్మమైనది ఏదీ లేదు. అయితే, ఆకాశాన్నే దృష్టాంతంగా ఎందుకు అంటే, ఈ రెండింటికీ దగ్గర పోలికలున్నాయి. ఆత్మ సర్వవ్యాపకం – ఆకాశం కూడా సర్వవ్యాపకమే. లేకపోతే స్థూలవస్తువులలో ఆకాశం వుండదు. ఆత్మ ఇంద్రియ అగోచరం – ఆకాశం కూడా అగోచరమే. ఒక్క శబ్దానికి తప్ప ఇతరత్రా తెలుసుకునే వీలులేదు. ఆత్మ అచరం – ఆకాశం కూడా అచరమే. కదిలే వీలులేదు. ఇలా ఆత్మకు దగ్గర పోలికలున్నది ఆకాశం తప్ప మరొకటి లేదు. ఇప్పుడు ఆకాశం ఏ మాలిన్యాలు అంటనిదైతే, ఆత్మ కూడా ఏ మాలిన్యాలు అంటనిదని నిర్ద్వంద్వంగా ఋజువవుతుంది. ఆకాశం అంతటా వ్యాపించి, అన్నింటికీ అవకాశం ఇస్తుంది. ఆకాశంలో గాలి వుంది, అగ్ని వుంది, నీరు వుంది, భూమి వుంది. ప్రచండంగా గాలి వీస్తున్నప్పటికీ, ఆకాశం చలించదు. జ్వాజ్వల్యమానంగా అగ్ని మండుతున్నా, ఆకాశం కాలిపోదు. కుంభవృష్టిగా వర్షం కురిసినా, ఆకాశం తడిసిపోదు. గాలిదుమారం వచ్చి దుమ్ము రేగినా, ఆకాశానికి దుమ్ము పట్టదు. గాలిలో మల్లెపూలవాసన కలిగినా, భరించలేని కంపువాసన కదిలినా, ఆకాశాన్ని తాకదు. దానికి ఏ వాసనా అంటదు. ఆకాశంలో మెరుపులు మెరుస్తాయి, పిడుగులు పడతాయి. ప్రళయభయంకర గర్జనలు వినిపిస్తాయి. అయినా, ఆకాశం తనకేమీ కానట్లు, ఏ సంబంధం లేనట్లు ఎప్పటి మాదిరిగానే వుంటుంది. ఏదైనా హత్య జరిగితే, రక్తంతో భూమి తడిసిపోతుంది. అయినా, ఆకాశంపై ఏ మరకలూ పడవు. ఆకాశంలో ఎన్నో పక్షులు ప్రయాణిస్తూ వుంటాయి. కానీ, వాటి కాళ్ళగోళ్ళు గుర్తులు గాని, రెక్కల గుర్తులు గాని ఆకాశంలో పడవు. దానికేదీ అంటదు. కనుక, అన్నిటికీ అవకాశమిచ్చి, అన్నింటిలోనూ వ్యాపించియున్న ఈ ఆకాశం ఆయా గుణదోషాలు అంటకుండా వుంటుంది. ఎందుకంటే, ఆకాశం సూక్ష్మం గనుక, సూక్ష్మవస్తువుపై స్థూలవస్తువులు తమ ప్రభావాన్ని చూపించలేవు. ఆకాశం సూక్ష్మం గనుక, స్థూలవస్తువుల దెబ్బలు, గుర్తులు ఆకాశం మీద పడవు. మరి భౌతిక వస్తువైన ఆకాశానికే ఇట్టి పరిస్థితి వుంటే, ఆకాశం కన్నా సూక్ష్మాతిసూక్ష్మమై, స్థూలవస్తువులతో సహా అన్నింటిలోనూ, అంతటా వ్యాపించియుండే ఆత్మ సంగతి ఇక వేరే చెప్పాలా? ఆత్మకు ఏ మలినాలూ అంటవు. ఏ శరీరంలో వున్నా, అది శరీరానికి అంటకుండా అసంగంగా వుంటుంది కనుక, ఆ శరీరం యొక్క కార్యకలాపాలకు, మాలిన్యాలకు ఆత్మ అసంగం. దేవతాశరీరంలో వున్నా, మనుష్యశరీరంలో వున్నా, పశు, పక్షి, క్రిమి, కీటకాది శరీరాలలో వున్నా, వాటి మంచిచెడ్డలు, గుణదోషాలు ఆత్మకు అంటవు. శరీరదోషం, మనోదోషం, బుద్ధిదోషం, శీతోష్ణ సుఖ దుఃఖాదులు ఏవీ ఆత్మను అంటవు. కాబట్టి, నీవు ఆత్మవే గనుక, శరీరానివి కాదు. కనుక వాసనలు, కర్మఫలాలు అనే మలినాలు మిమ్ములను అంటవు. నీవు అసంగుడవు. స్వచ్ఛమైన వాడవు. “నేను దేహాన్ని” అని అజ్ఞానంతో భావించేవాడే దేహమలినాలతో దుఃఖిస్తాడు. మళ్ళీమళ్ళీ జన్మలెత్తుతూ, కర్మఫలాలు అనుభవిస్తాడు. “నేను ఆత్మను” అని గ్రహించి అలా ఆత్మగా వున్న జ్ఞానికి దేహమలినాలు అంటవు గనుక, ఆనందస్వరూపుడిగా వుండిపోతాడు. సర్వక్షేత్రాలను ఆత్మ ఎలా ప్రకాశింపచేయగలుగుతున్నదో, సూర్యుని ఉపమానంతో తెలుసుకోవచ్చు. ఏ ప్రకారంగా ఒక్కడే అయిన సూర్యుడు ఈ యావత్తులోకాన్ని ప్రకాశింపచేస్తున్నాడో, అలాగే ఈ యావత్తు క్షేత్రాన్ని

ఒక్కడే క్షేత్రధారి ప్రకాశింపచేస్తున్నాడు. ఆత్మ నిర్లిప్తము. అది కర్మ చెయ్యదు. ఫలమును అంటించుకోదు. ఇంతవరకూ ఆకాశాన్ని దృష్టాంతంగా తీసుకుని వివరించాను. దానిని మరలా వివరిస్తాను.

***గత జన్మల సంస్కారఫలం అనుభవించక తప్పదు***
***జీవి పాపపుణ్యాల బేరీజు లెక్కల అంచుల పంచల్లో స్థానభ్రంశం చెందినప్పుడు,***
***కొందరి మనసులు తరచి చూసినా, ఆలోచనా సరళిలో చెడునడవడికలు***
***అడుగులు సుడులే గుడి కడతాయి.***
***మానవజన్మను సంతరించుకున్న ప్రతి వ్యక్తి, సంస్కారం నేర్వాలి, కుసంస్కారం విడవాలి***
***కొన్ని జన్మతః సిద్ధిస్తాయి, కొన్ని పరిసరాల ప్రభావం వలన బుద్ధిలో స్థిరపడతాయి***
***కొన్ని సుగుణాలు, గురుబోధతో అలవడుతాయి.***
***కొన్ని దుర్గుణాలు సత్సంగం, సద్గ్రంథపారాయణం, సజ్జన సాంగత్యం వల్ల దూరమవుతాయి***
***ఏది ఏమైనప్పటికీ, సద్గురువు సాన్నిధ్యంలో మనసును స్థిరపరచి***
***చెడు ఆలోచనలకు పుటం వేసి, నిగ్గు తేల్చినప్పుడే***
***అసలు సిసలైన జ్ఞానం అనే పసిడి మీ వశమవుతుంది.***
***కానీ, ప్రతిజీవి సార్థకత వైపుకు పయనం సాగించాలి***
***పవనకుమారుని పలుకుల సారాంశం గ్రహించి,***
***బ్రతుకుకు అర్థం, పరమార్థం గ్రహించి***
***నిష్కల్మషంగా నిష్కామకర్మలు చేస్తూ, సేవాభావాన్ని అలవర్చుకుని***
***దైవ సాన్నిధ్యం పొందినపుడే, ఆ జన్మ సార్థకమై, చరితార్థమై***
***యుగాలు మారినా, జగాన ఆ సత్కీల భావనాఛాయలు ప్రతిఫలిస్తాయి***
***అందుకై సిద్ధపడి, బుద్ధులై, నిషిద్ధకర్మలకు బద్ధులై, మానవతకు పద్దులై***
***కీర్తిప్రతిష్ఠల సరిహద్దులు నెరపి, కరుణామృత రామనామ జపతపములు ఆచరిస్తే,***
***ఆ కర్మఫలం విఫలం - ఈ జన్మసఫలం***
***అని ఆంజనేయుడు ఆత్మీయులైన తన ముద్దుబిడ్డలకు బోధిస్తున్న వైనం గ్రహించండి***
***నా చిన్నారి ముద్దుబిడ్డలారా!***

ఓం

**09-06-2019** 08:25 AM

**151) చంచల స్వభావము ఎట్టిది స్వామీ?**

*చంచలమైన స్వభావాన్ని చాంచల్యం అంటారు (నిలకడ లేకుండా వుండటము). ఇది ఆధ్యాత్మిక చింతనలో గానీ, లౌకిక వ్యవహారాల్లో గానీ గొప్ప చేటును తీసుకువస్తుంది. మనసును ప్రశాంతంగా వుంచుకోవటానికి, పాపభీతితో దుష్కార్యాలు చేయకుండా వుండటానికి సహజంగా అంతరాత్మ మిమ్ములను*

ప్రేరేపిస్తూ వుంటుంది. ఆ ప్రభావంతో, కొన్ని క్షణాలైనా "రేపటి నుండి ఇక సత్కార్యాలే చేయాలి" అనే ఆలోచన వస్తుంది. "రేపటి నుంచి" అనుకోవడమే ఆలోచనలోని డొల్లతనం, చాంచల్యం స్పష్టమవుతాయి. ఈవేళ కాదు, రేపటి నుంచి అనుకోవటం ఏదో ఒక దుష్కృత్యం చేయటానికి ఈవేళ అవకాశం మిగుల్చుకోవటమే. "పూజలు, భజనలు చేసే వయసు కాదు మాది. దానికింకా సమయం ఉన్నది" అనుకోవటము ఇలాంటిదే. ఒకవేళ ఏ దేవాలయానికో వెళ్ళినా, అనన్యభక్తితో దైవదర్శనం చేయటానికి బదులు, ఇతరేతర ప్రసంగాలు చేయటం చాంచల్యమే. బుద్ధిచాంచల్యం వల్ల పారమార్థిక సుగతిని, జిహ్వాచాపల్యం వల్ల ఆరోగ్యస్థితిని కోల్పోతున్నారు. ఈ చాంచల్యాన్ని వదలటం వల్ల అమలబుద్ధి, ఆరోగ్యసిద్ధి సమకూరుతాయి.

## 152) అహంకారము ఎట్టిది స్వామీ?

అహంకారం అంటే గర్వం. ప్రతీ దానికీ అహం–అహం, నేను–నేను అని గొప్పతనాన్ని తాను చాటుకోవటానికి ప్రాధాన్యం ఇవ్వటం. ఇది మనిషిని అల్పస్థితికి చేరుస్తుంది. అందరికంటే, తాను ఉన్నతుడనని భావించేవాడు అహంకారి. ఈ అహం మనిషిని పరిపూర్ణంగా ఎదగనివ్వదు, క్రొత్త విషయాలను తెలుసుకోవటానికి ఆస్కారం ఇవ్వదు. దాని వల్ల, అహంకారి సంకుచిత పరిధిలో మిగిలిపోతాడు. జ్ఞానసంపద, స్నేహసౌభాగ్యం వారికి అందనే అందవు. ఒక నిసర్గ ఆనందనిధిని వారు కోల్పోతారు. ఎన్నో యజ్ఞాలు చేసిన యయాతి, ఇంద్రుని వద్ద అహంకారభాషణం చేసి, స్వర్గం నుండి దిగువ లోకానికి వచ్చాడు. ఇచ్చట సందర్భం వచ్చినది కావున ప్రస్తుతం ఈ విషయాన్ని తెలుపుచున్నాను. ఈ ఆంజనేయు శరీరం రామశక్తితో శతయోజన విస్తీర్ణమైన సముద్రాన్ని దాటి, తన వద్దకు వచ్చిన ఈ మారుతిని సీతమ్మ మనఃపూర్వకంగా ప్రశంసించినా, ఏ మాత్రమూ అహంకరించక, తాను ఆవలితీరంలో వున్న వానర వీరులందరికంటే అత్యల్పుడనని వినయంతో చెప్పిన నన్ను, నా స్వామి "చిరంజీవివై సర్వులకూ ఆరాధ్యుడవై అలరారు!" అని దీవించాడు. అంటే, అహంకారాన్ని వీడితే, సర్వ సమస్త భాగ్యాలూ పొందవచ్చు.

## 153) దైన్యమును ఎలా అధిగమించాలి స్వామీ?

జీవులందరూ ఆనందస్వరూపులే. విషాదస్వరూపులు కారు. "మా కశ్చిత్ దుఃఖభాగ్భవేత్" (ఎవరూ దుఃఖితులు కాకుందురు గాక!) అనేది ఒక ఉదాత్త ఆశయం. ఈ దైన్యమనేది జీవుల అస్వాభావిక స్థితి. పాపపుణ్యాలు తెలియని పిల్లలు నవ్వుతూ వుంటే, (ఏదో ప్రత్యేక సందర్భం వుంటే తప్ప), ఎందుకు నవ్వుతున్నావు? అని అడగరు. ఏడుస్తూ వుంటే మాత్రం వెంటనే మీ దృష్టి అటువైపుకు మరలుతుంది. ఎందుకు ఏడుస్తున్నావు? అని అడుగుతారు. మానవుడు తనను తాను నీచపరుచుకోకుండా, తాను ఉన్నతుడననే భావం కలిగి వుండాలి. ఆ భావం అతనిని అకల్మషుని చేస్తుంది. శంకరాచార్యస్వామి "చిదానందరూపః శివోహం శివోహం" అనటంలోని మహౌచిత్యం ఇదే. ఇంతటి ఉదాత్తభావన వుంటే, అసలు ఎవరిలోనైనా దుష్టసంకల్పాలు అంకురిస్తాయా? నేను ఆనందస్వరూపుడిని అనుకున్న వారికి ఏ చింతా, కర్దమము అంటదు. నేను దీనుడను అనుకోవటం ఆత్మన్యూనతను పెంచుతుంది, మీలోని సహజశక్తులను నిర్వీర్యం చేస్తుంది. మిమ్ములను దుర్బలురను చేస్తుంది. అందుకే గీతాచార్యుడు, "క్షుద్రం

హృదయదౌర్బల్యం, త్యక్త్వోత్తిష్ఠ పరంతప" అంటే, "క్షుద్రమైన మానసిక దౌర్బల్యాన్ని వదిలి లెమ్ము!" అని అర్జునుడ్ని హెచ్చరిస్తాడు. ఆదిశంకరులు, "అనాయాసేన మరణం, వినా దైన్యేన జీవనం, దేహాంతే తవ సాయుజ్యం" అని ఈశ్వరుడ్ని కోరుకున్నారు. ఏ ప్రయాసా లేకుండా చనిపోవటం, దైన్యస్థితి లేకుండా జీవించడం, మరణానంతరం శివసాయుజ్యాన్ని పొందటం కంటే జీవులు కోరతగ్గది ఏముంది? భౌతికమైన సంపదలూ, అల్పమైన అనుకూల్యాలు లేకపోవటం దైన్యం కాదు. "కోహం" అనే ప్రశ్నతో ప్రయాణించి, "సోహం" అని గ్రహించకపోవటమే నిజమైన దైన్యం అని నేను గట్టిగా చెబుతాను. చెప్పినదాంట్లో సత్యాన్ని గ్రహించండి.

***ధ్యానమును మించినది లేదు ఈ జగాన***
***ధ్యానమే నిన్ను ధన్యుడిని చేస్తుంది***
***నీలోని మాలిన్యాన్ని వదిలించి, నిన్ను అమలిన మనస్కుడిగా తీర్చిదిద్దుతుంది.***
***కష్టాల కడలిని ఈదే విధంగా తయారుచేస్తుంది***
***సామాన్యుడు, అసామాన్యుడు ఎవరైనా ధ్యానం వద్ద సాగిలిపడితే,***
***సకల రుగ్మతలు తొలగిపోయి, మనసులోని గజిబిజిలన్నీ పటాపంచలైతీరుతాయి***
***ఎన్ని కష్టాలైనా దూదిపింజల్లా అలా తేలిపోతాయి***
***ఆరాధనకు ఆది తెలుస్తుంది***
***జీవితాధ్యాయాలకు దారి సుగమం అవుతుంది***
***ఆధ్యాత్మికతలో మర్మం అవగతమవుతుంది***
***కల్మషం లేని మనసే మనుగడకు ఆలంబనం అవుతుంది***
***సజలనయనాలతో ఆపన్నులను అక్కున చేర్చుకొని***
***శాస్త్రీయ దృక్పథంతో వారి అవసరాలు తీర్చి***
***స్త్రీ పురుష భేదం లేని మానవలోకాన్ని***
***మానవీయ ఆలోచనలతో ముందుకు సాగే వీలవుతుంది***
***మాతృస్థానాన్ని ధ్యానమే ఒసగుతుంది***
***సగౌరవంగా బ్రతికే స్థానం ధ్యానమే ఇస్తుంది***
***పరుల కోసం త్యాగం చేసేవారిని***
***అప్రతిహంగా జగాన్ని జయించగలిగే జగదేక వీరశక్తిని సదా ప్రసాదిస్తుంది, ఇస్తుంది***
***అని ఈ వీరహనుమాన్ వీరోచితంగా అందిస్తున్న సందేశాల సమధుర భావాలు***
***భావావేశంగా, గురుసూచనలు పాటిస్తూ, సద్గురువు మార్గదర్శకత్వంతో ప్రవహించే నదిలా***
***పరుగులు తీస్తున్న మనసుకు ఆనకట్ట కట్టినట్లైతే,***
***ఆంజనేయుడు అతిత్వరలో అబ్ధి లంఘించుటకు చేయూతనిచ్చి చేరువలో వుండి***
***చేరదీస్తానని చేతిలో చేయివేసి చెబుతున్నాడు చేరువకండి***
***నా చిన్నారి ముద్దుబిడ్డలారా!***

ఓం

**12-06-2019** 08:15 AM

**154) ఈ రోజుల్లో ఎవరిని నమ్మాలో, ఎవరిని నమ్మకూడదో తెలియటం లేదు స్వామీ?**

***పరాపవాద నిరతాః పరమదుఃఖోదయేషు చ ।***
***పరస్పర విరోధే చ యతన్తే సతతోత్థితాః ॥***

*కొందరు ఇతరులను తూలనాడుటలో ఆసక్తి కలిగి వుంటారు. ఇతరులకు దుఃఖాన్ని పుట్టించడంలో, ఒకరికొకరికి కలహములు పెట్టుటలో ఎల్లవేళలా జాగరూకులై యత్నిస్తూంటారు. మలినమనస్కులు ఇతరులకు ఏ విధంగా బాధ కలిగించాలో ఆ విధంగానే ప్రవర్తిస్తారు. అసూయవల్ల ఇతరుల ఉన్నతిని సహించలేరు. అకారణంగా ద్వేషం పెంచుకుంటారు. ఇతరుల్ని అకారణంగా తిడతారు. అపనిందలు వేస్తారు, దుష్ప్రచారాలు చేస్తారు. ఇతరులకు దుఃఖం కల్గించి వీరు ఆనందిస్తారు. వీరినే మీ భాషలో 'శాడిస్టులు' గా చెబుతారు. వీరి మనస్సు రోగభూయిష్టంగా వుంటుంది. అసూయ అనే అగ్ని లోలోపల చెలరేగుతూ వుంటుంది. అది మనశ్శాంతిని దహిస్తూ వుంటుంది. అసత్యాలు, రెచ్చగొట్టే మాటలతో పోట్లాటలు పెట్టుకుంటారు, పెడతారు. భారతంలో శకుని, రామాయణంలో మంథర దుష్టపాత్రలు. దుర్యోధనుడు స్వభావరీత్యా క్రూరస్వభావి, అసూయాధనుడు. శకుని దుర్యోధనుడి సర్వనాశనానికి చేయవలసిందంతా చేశాడు. నమ్మకంతోనే ద్రోహం చేశాడు. మొదట నమ్మకం కలిగించాడు, తర్వాత తమని గ్రుడ్డిగా నమ్మిన స్థితిలో ద్రోహం చేశాడు. గొప్పగుణాలు సమృద్ధిగా కలిగి, వినయంలో ఘనుడైనవాడు కూడా ప్రాణులకు కలిగే అతి చిన్న బాధను కూడా సహించడు. దయాగుణం వల్లనే మనుషుల ఉత్తమగుణాలను ప్రజలు గుర్తిస్తారు. దయ, దైవీగుణం. భగవంతుడు దయాగుణం చేత జీవుల అపరాధాలను సహిస్తున్నాడు. ముఖ్యంగా మనిషి చేసే అపకారాలు లెఖ్ఖకు మించి వుంటున్నాయి. అయినా భగవంతుడు సహిస్తున్నాడు. దయ అనే గుణం చేత, రాక్షస, పైశాచిక ప్రవృత్తుల నుండి మనిషి సాధుగుణాలతో ఉత్తమ వ్యక్తిగా జీవించాలంటే, సద్గురు సేవ ఒక్కటే తేలిక మార్గం. ఎందుకంటే, రోగికి వైద్యుడే సేవ చేయాలి. బలహీనుడికి బలవంతుడే సాయం చేయాలి. పతితుడ్ని సద్గురువే ఉద్ధరించాలి. హితహరవంశీ అనే కారణజన్ముడు, నరవాహనుడు అనే బందిపోటు దొంగలో గొప్ప పరివర్తన తీసుకువచ్చి, ఉత్తముడిగా మార్చాడు. ఇది మధుర బృందావనంలో జరిగిన యదార్ధగాథ. కఠిన శిలను అందమైన శిల్పంగా శిల్పి మలచినట్లే, సద్గురువు క్రూరుడ్ని, పతితుడ్ని సైతం ఉద్ధరించగలడు. వాల్మీకి కథ అదే కదా! అయితే, మనిషి మనసుకు వశుడు గనుక, మనస్ఫూర్తిగా తనను తాను గురువుకు సమర్పించుకోవాలి. వినయం లేకుండా విద్య లభించదు. విద్య లేకుండా జీవనరథం గమ్యానికి చేరదు.*

**సదోషం దర్శనం యేషాం సంవాదే సమహద్భయమ్ ।**
**అర్థాదానే మహాన్ దోషః ప్రధానే చ మహద్భయమ్ ॥**

*కలహాలను సృష్టించేవారిని చూడటం, కలసి వుండటం భయం కల్గిస్తుంది. వారికి ధనం ఇవ్వటం, తీసుకోవటం రెండూ కీడు కల్గిస్తాయి. కొందరు స్వభావరీత్యా కలహాలను సృష్టిస్తారు. తద్వారా ఆనందం*

పొందుతారు. లేనిపోని చాడీలతో వ్యక్తుల మధ్య అపార్థాలు కలిగిస్తారు. సహనం లేనివారు త్వరగా అపార్థం చేసుకుంటారు. అర్థం చేసుకోవడం కష్టం. అందుకు సహృదయం వుండాలి, ఓర్పు వుండాలి. ఎవరు ఏమి చెప్పినా తక్షణమే నమ్మకూడదు. చెప్పేవారి మనస్తత్వాన్ని తెలుసుకోవాలి. తమ సన్నిహితుల గురించి అప్పటికే తెలిసి వుంటుంది గనుక, నిదానంగా నిజాన్ని నిర్ధారించుకోవాలి. నింద అంటే మనిషి తప్పును ఖండించటం. అపనింద అంటే చెయ్యని తప్పును ఆపాదించటం. పై రెండు సందర్భాలలోనూ మీరు సహనమే చూపాలి. మౌనం కలహ నాశనం. ప్రతికూలతలను మౌనంతోనే గెలవాలి. వాదనలతో, కొట్లాటలతో కాదు. మీరు తప్పు చేసినప్పుడు ఎవరూ నిందించరాదనుకోవటం సరికాదు. పెద్దలకు తప్పును సరిదిద్దగల అధికారం, హక్కు వుంటాయి. పెద్దలు అంటే, గురువులు కూడా కావచ్చు. మీరు ఏమి మాట్లాడినా, ఎలా ప్రవర్తించినా ఎదురు వుండదు అనుకుంటే, అది పతనానికి దారి తీస్తుంది. కాలులో ముల్లు గుచ్చుకుంటే తీసేదాకా బాధ పోదు. సజ్జనులు తమ తప్పును సరిదిద్దుకునే వరకూ అశాంతిగా వుంటారు, పశ్చాత్తాపం చెందుతూంటారు. అబద్ధం కూడా మహాపరాధమే. ఒక్కొక్క అబద్ధం ఒక్కో మెట్టు క్రిందకూ దించుతుంది. ఆ దిగుడుమెట్ల మీద మీరు నిగ్రహించుకోకపోతే, మీ అంతిమగమ్యం అధఃపాతాళము. పతనాన్ని ఆపగలవాడు గురువే. మీరు గురువుపట్ల చూపే భక్తిప్రపత్తుల స్థాయినిబట్టి, ఆయనలోని దివ్యత్వం ప్రకాశితమవుతుంది. మీరు చెట్టునున్న ఫలాలను మీ ఎత్తునుబట్టి అందుకోవచ్చు. మీ చేతికందుతాయి. మీరు భౌతికంగా ఎదగలేరు కానీ, ఆధ్యాత్మికంగా ఎదగటం అసాధ్యం కాదు. అందుకు జ్ఞానప్రదాతయైన సద్గురువు శరణాగతి తప్ప వేరే మార్గం లేదు. విద్యావిధానం కేవలం చదువుకే పరిమితం కాదు. చదువులలోని మర్మం ఏమిటో, ఆత్మజ్ఞానం అంటే ఏమిటో సుబోధకంగా తెలియచేస్తుంది.

***ప్రతి విషయానికీ చికాకుపడే మనసుకు,***
***అయినదానికీ కానిదానికీ కక్షపెంచుకునే మనిషికి***
***ఒక చికిత్స వుంది - అదే కృతజ్ఞతా వైద్యం!***
***మీకు లభించే ప్రతి సేవకూ కృతజ్ఞత తెలపకపోవటం నిజంగా మానసిక వైకల్యమే.***
***మిమ్మల్ని బాధకు గురిచేసినా కక్షగట్టక, మీలో క్షమాగుణాన్ని పెంచినందుకు***
***వారికి కృతజ్ఞలు తెలిపారా... అదే ఉన్నత ఆధ్యాత్మిక స్థితి***
***కృతజ్ఞతలు అన్నమాట ఒట్టి ప్రాణం లేని పదం కాదు - అది ఒక వ్యక్తిత్వవికాస మంత్రం***
***దానిని పెదవులపై నుంచి కాక, హృదయపు లోతుల్లోంచి పలుకగలిగితే***
***అదే పరిపూర్ణ ఆరోగ్యసూచిక***
***కృతజ్ఞత మీ హృదయాలను విశాలపరుస్తుంది***
***మీలోని అహంకారాన్ని మటుమాయం చేస్తుంది***
***గురుసూచనలను పాటిస్తూ, ప్రప్రథమంగా వినయం మీ సొత్తు చేసుకుంటే,***
***సదా ఆపన్నులను ఆదుకొను ఈ ఆంజనేయుడు ఆదుకొనుటకై***
***అంజలి ఘటించిన హస్తములను ప్రేమతో పొదివి పట్టుకుని, పట్టుతప్పని మార్గంలో***
***మిమ్ము పయనింపచేసి, ఈ పవనకుమారుని సన్నిధి చేర్చుకొనుట తథ్యమని***

***సాధ్యమయ్యే రీతిలో తెలియబరుస్తున్నాడు హనుమ***

***సాధకులైన నా చిన్నారి ముద్దుబిడ్డలారా అంటూ దారి చూపుతున్నాడు!***

## ***హాయిని గొల్పేవాడు హనుమ***

ॐ

**13-06-2019** 08:55 AM

### 155) జీవితం మూడునాళ్ళ ముచ్చట అంటారు కదా స్వామీ?

*ఎండమావుల్లాంటి సుఖాలు, ఎడారి మంటల్లాంటి దుఃఖాలు. మొదటివి శాశ్వితంగా ఆనందాన్నిచ్చేవి కావు – రెండవది సంపూర్ణంగా ఆరిపోయేవీ కావు. ఆయువు వున్నన్నినాళ్ళు ఆ ఎండమావుల వెంట పరుగు తప్పదు. ఆ ఎడారి మంటల్లో పరితాపమూ తప్పదు. మనిషి బ్రతుకుకు ఇంతకన్నా మించిన నిర్వచనం లేదు. అయినా మీకు ఈ లోకమనే పండు నుంచి ఏదో పిండుకోవాలనే పేరాశ. అనుకున్నంత మాధుర్యం లభించకపోతే తీవ్రమైన నిరాశ. తీక్షణంగా ఆలోచిస్తే, మీరు భ్రమించినంతగా ఈ బ్రతుకులో ఏ స్థిరసుఖమూ లేదు. ఈ బంధాల్లో చిరశాంతి లేదు. ఈ జీవితాన్ని, ఈ దేహాన్ని దీపపువత్తి, ధాన్యపుపొల్లు తదితర అశాశ్వితమైన పదార్థాలతో పోల్చుకోండి. సంపదలు, సంసారము అన్న యావతో, ఆ వ్యామోహాలతోనే విలువైన కాలాన్ని వృథా చేసుకోవద్దు. ప్రపంచసుఖాలు రేగిపండులాంటివి. ఏమి సారముంది ఈ లౌకిక సుఖాల్లో? భగవంతుడి గురించి ఆలోచించకుండా ఇంకా ఎన్నాళ్ళు వీటిలోనే పడి కొట్టుకుంటూ సమయాన్ని దుర్వినియోగం చేసుకుంటారు? నిర్వేదంతో కూడిన ఈ బ్రతుకు ఒక నిద్దుర. ఏదో కల మెరుపులా మెరుస్తోంది. దేని కోసమో ఆశతో చేతులు చాచినట్లుగా వాంఛతో కనులు తెరవగానే, ఆ కల కరిగిపోతుంది. మళ్ళీ యథాస్థితి. ఆరాటం, నిర్వేదం మిగులుతాయి. కోరకలతో కాగిపోయే మనస్సు ప్రవృత్తే విచిత్రమైనది. ఎంత పెనుగులాడినా, అది వృథా ప్రయాసే తప్ప పెద్దగా ఫలితం వుండదు. ఈ కోరిక అనే దానికి ఆది–అంతం అంటూ వుండవు. అదుపులో లేని ఆ మనసువల్లే ఈ లోకంపై మీకు ఆకర్షణ అధికమవుతుంది. పెనుగులాడినా మచ్చిక చేసుకోకపోతే, మనసు పరిపరివిధాలా పరిగెడుతుంది. మీ ప్రశాంతతకు అదే చిచ్చుపెడుతుంది. ప్రమిదలో వేసిన వత్తి, అందులోని నూనె ఎంతవరకూ వుంటుందో, అంతవరకు వెలుగుతుంది. తైలం అయిపోగానే ఆరిపోతుంది. అలాగే, మీ బ్రతుకులు కూడా. ఆయుష్షు అనే చమురు ఉన్నంత వరకూ జీవనం శోభాయమానం. ఆ తర్వాత స్మశానానికే పయనం. ఇలాంటి బ్రతుకుపై ఎందుకు అంత తీపి? విత్తనంపైనున్న పొట్టులాంటి నిరుపయోగమైన దేహంపై ఎందుకు అంత అపేక్ష? ఈ ప్రపంచంలో మీరు ప్రీతితో పెంపు చేసుకునేవి ఏవీ ఎల్లకాలమూ వుండేవి కావు. ఎడతెగని సుఖశాంతులను ఇచ్చేవి కావు. అయినా మీ ఆరాటానికి అంతే వుండదు. అదే మీ దురవస్థ. శరీరమైనా, సంపదలైనా, ప్రాణాలైనా ఏవీ మీ సొంతం కావు. మీరందరూ కూడా అనంతమైన ఈ భువనమనే విడిదిగృహానికి వచ్చారు. తొలిపొద్దు, మలిపొద్దు అనే రెండు రంగుల వాకిళ్ళతో కూడిన ఈ విశ్రాంతిమందిరంలో*

మీతోసహా పెద్దపెద్ద పాలకులైనా సరే, ఏదో కొన్నాళ్ళు సుఖపడి రాబోయేవాళ్ళకు చోటిస్తూ వెళ్ళిపోతారు. కర్మఫలంగా పుట్టిన మీ సంసార సమయం, కొలచి గాదెలో పోసిన ధాన్యంవంటిది. ఏదో ఒక నాటికి అది పూర్తిగా తరిగిపోకతప్పదు. అలాగే, తుచ్ఛమైన బ్రతుకు సిద్ధం చేసిపెట్టిన పాసిపోయిన అన్నంలాంటిది. అది పనికిరాదని తెలిసినా, తినక తప్పదు. భగవంతుని కృప వుంటే గాని, అంతులేని ఆవేదన తీరదు. ఆత్మానందం పొందితేనే గదా, మోక్షం లభించేది? భగవంతుని ఆధారం చేసుకుని, ఈ సంసారంలో ఎంత పరిభ్రమించినా ప్రమాదం లేదు. సమయం రాగానే ఆయనే మిమ్మల్ని తన ప్రక్కకు లాగేసుకుంటాడు. ఈ సంసారం వేడి పెనంలాంటిది. కానీ, పరమాత్మపై ప్రేమను పెంచుకుంటే, ఆయనే పెనంపై నుంచి తప్పించి, చల్లనైన తన ఒడిలోకి తీసుకుంటాడు. మీలోని ప్రేమను పెంచుకోండి. ఆ ప్రేమే పరమాత్ముని దివ్యసౌధం. అందుకని, మీ జీవనాడియైన ప్రేమను గట్టిగా పట్టుకోండి.

***అదేమి ధ్యానము? అదేమి జ్ఞానము?***
***అదేమి సోద్యము? అదెలా సాధ్యము?***
***కళ్ళు మూసుకున్నంతనే, కదిలే ఆలోచనలు***
***ప్రవహించే నదిలాగ పరుగులు తీస్తుంటే,***
***సమాధిలో వుండలేక సతమతమవుతుంటే,***
***ఏకాగ్రత కుదుర్చుకోండి, ఆధ్యాత్మిక బాటలో అడుగువేయండి.***
***ఆంజనేయుని మాటలు వినండి. ఆహారపుటలవాట్లు మార్చుకోండి***
***ప్రతినిత్యం సాధన చెయ్యండి మానసిక పరిపక్వత సాధించే వరకు***
***సద్గురువు సూచనలను పాటిస్తూ వుంటే,***
***అప్పడే ఏకాగ్రత దొరుకుతుంది, మనోజిజ్ఞాస మొదలవుతుంది***
***మారుతి వాక్కు వేదవాక్కై వేదనను దూరం చేసి***
***వేయి తల్లుల, తండ్రుల ప్రేమ పంచుతు, పెంచుతూ పవనకుమారుని బిడ్డలుగా***
***ఈ భువిపైన ఆసీనులుకండి***
***ప్రేమైకమూర్తులుగా వెలుగొందండి***
***నా చిన్నారి ముద్దుబిడ్డలరా!***

ఓం

**22-06-2019** 09:05 AM

**156) కఠినాత్ములపట్ల మా ప్రవర్తన ఎలా ఉండాలి స్వామీ?**

మహాకఠినాత్ములుగా మరిగే మనసులతో సహా కనిపించే మనుష్యుల్లో కూడా మరుగున, మానవీయత పరిమళిస్తూనే వుండాలి, వుంటుంది. ఎవ్వరూ ఎప్పుడూ ఒకేలా వుండరు. ఎంతటి శిలలోనైనా, ఎప్పుడో ఒకప్పుడు, ఎంతో కొంత కదలిక కనిపించాలి. కఠినశిలలోనూ తొలిచితే నీటిచెమ్మ తగులుతుంది.

అలాగే, ఏమాత్రం మానవత్వం లేదనుకుంటున్న వాళ్ళ హృదయం కూడా ఎప్పుడో ఒకప్పుడు మానవీయతతో స్పందించాలి. గంభీరంగా కనిపించే ప్రతివారూ గుండెలులేని కరకు స్వభావులేమీ కాదు. సమయం వచ్చినప్పుడు వాళ్ళు ప్రదర్శించే ప్రేమానురాగాలకు అంతే వుండదు. దానికి ఈ ఆంజనేయుడే ఉదాహరణ. ఎన్నోసార్లు చెబుతూంటాను మారమని. మానవత్వమే లేకపోతే మనుష్యులు అని ఎలా చెప్పవచ్చు? ఒక విషయం చెబుతాను అర్థం చేసుకోండి. అర్థం చేసుకుని నడిచినట్లయితే అదృష్టవంతులవుతారు లేదా, మీ....... . మీరు చాలాసార్లు కొందరికి కొన్ని రకాల ముద్రలు వేసి ఆ కోణం నుంచే చూస్తూ వుంటారు. మనుపటి ముద్ర నుంచి బయటపడాలని వాళ్ళు ప్రయత్నిస్తున్నా, మీరు మాత్రం మీ స్థిర అభిప్రాయాలతో, వ్యవహారశైలితో వాళ్ళను పూర్వస్థితిలోనే వుంచేస్తారు. ముల్లు గులాబీగా మారాలని ఎంత ప్రయత్నిస్తున్నా, ఎంత తాపత్రయపడ్తున్నా మీరు మాత్రం ఆ ముల్లును ముల్లుగానే స్థిరపడిపోయేలా చేస్తూ వుంటారు. ఫలితంగా కంటకం కలకాలం కంటకంగానే మిగిలిపోతుంది. త్రాకిన ప్రతి వేలునీ తనకు నచ్చినా నచ్చకపోయినా గుచ్చుతూనే వుంటుంది. అయితే, నేను చెబుతాను. ముళ్ళను వద్దనకండి. మీరు స్పృశించిన పులకించాలి. కంటకాలు పుష్పాలే అని చెబుతాను. మంటల మాటున మంచును చూస్తూ, మనుషుల్లోని మంచినే గాంచుతూ, వాళ్ళలోని మానవీయకోణాన్ని మేల్కొలిపేవారే మహాత్ములు. సుగ్రీవుని రాజ్యంలో ఒక డాక్టరు వుండేవాడు. ఆయన నిర్మోహమాటస్థుడు. నోటి నుంచి మాటలు ఈటెల్లా దూసుకువచ్చేవి. ఆయన భార్యాపిల్లలకు కూడా ఆయన అంటే భయం. ఆయనది రాతిగుండె అని వాళ్ళందరి అభిప్రాయం. కానీ, సుగ్రీవుడు మాత్రం ఆయనతో ఎంతో ఆప్యాయంగా మాట్లాడేవాడు. ఎంత కటువుగా ప్రశ్నలు సంధించినా, తాను మాత్రం సరళంగా, సామరస్యంగా సమాధానాలిచ్చేవాడు. ఓ సందర్భంలో ఆయన, "నా భార్యాపిల్లలు కూడా నన్ను మీలా అర్థం చేసుకోలేదు. వాళ్ళు నాకు హృదయమే లేదనుకుంటారు. నాకూ కన్నీళ్ళు వస్తాయంటే నమ్మనే నమ్మరు. అందుకే నాకు బయట పనిలేకపోతే, మీ వద్దనే గడపాలని అనిపిస్తూ వుంటుంది" అన్నాడు. ఒకరోజున, చాలా జోరుగా వర్షం కురుస్తూవుంది. సుగ్రీవునికి ఆరోగ్యం బాగాలేదు. అపుడు ఆయన సుగ్రీవుని గురించి మందిరంలో తలుపులు వేశారో లేదో, ఆయనకు మందులు ఇచ్చారో లేదో అని బాధపడి తెల్లవారి, ఆ మాటలు సుగ్రీవునికి చెబుతాడు. అది విన్న నేను దావాగ్నిలాంటి మనుషుల్లో కూడా దయార్ద్రతలను చిగురింపచేసేవారే మహాత్ములు అని భావించాను.

మృదువుగా మసలుకునే వాళ్ళతో మీరు మృదువుగా మసలుకోవటంలో గొప్పేముంది? కఠినమైనవాళ్ళతోనూ కలివిడిగా మాట్లాడితేనే మీ మృదుత్వానికి పరిపూర్ణత. అట్టి పరిపూర్ణత కలిగిన హృదయాన్ని నేను ఆశిస్తున్నాను. మీలో వున్న కరడుగట్టిన పాషాణాన్ని సైతం కరిగించండి. లోపలనున్న మానవత్వాన్ని వెలికి తీయండి. ఉషోదయము అయిపోయింది. అస్తమయానికి దగ్గరగా వుండి, ఇప్పటికే మీ హావభావాలలో మార్పు రాకపోతే, ఈ మారుతి మాటలు వృధా, ప్రయాసపడటం వృధా, దరిచేరటం వృధా. ఇన్ని వృధాలతో వృద్ధాప్యంలో వృధాగా జీవించే బదులు, వ్యర్థాలను వదిలి, సమృద్ధిగా జీవనాన్ని కొనసాగించండి.

**బ్రేకు లేని బండి, కళ్ళేనికి లొంగని గుర్రం, కాడి క్రిందకు రాని ఎద్దులాగా**
**ఇంద్రియనిగ్రహం లేని మనుజుడు ప్రమాదంలో పడిపోతాడు**

***

***శుభాలనొసగి, జగతికి జీవనాడిగా నిలిచే కల్పతరువు***
***ఆరోగ్య సౌభాగ్యాలకు తరగని పెన్నిధి ప్రేమవృక్షం***
***వైద్యానికి - నైవేద్యానికి తరువే ఏకైక సన్నిధానం***
***జీవాత్మకు - పరమాత్మకు సమన్వయకర్త ప్రేమతరువు***
***రామాయణ కల్పవృక్షమై, భారతానికిదే శమీవృక్షమై, గోకులానికిదే వన్నె తెచ్చినది***
***భూత భవిష్యత్తు వర్తమానాలకు ప్రత్యక్షంగా***
***ప్రేమలోని ప్రతిభాగం తరతరాలకు తరగని సౌభాగ్యం***
***ఆ సౌభాగ్యం, ఆ సౌందర్యం మీ సొంతం చేసుకుని సౌశీల్యవంతులై***
***సహస్రవిధాల బోధిస్తున్న ఈ సహనాన్ని అర్థము చేసుకొని***
***అర్రులు చాపి అర్థిస్తున్న ఆంజనేయుని అర్థము చేసుకుని జీవనమార్గాన్ని గుర్తించి,***
***గుర్తింపచేసిన ఈ గురుని మాటలు తు.చ. తప్పక పాటించేందుకు సమాయత్తమైతే,***
***అంతులేని ఆనందమే మీరవుతారు***
***నా చిన్నారి ముద్దుబిడ్డలారా!***

ఓం

**24-06-2019** 08:30 AM

**157)** పూర్ణత్వాన్ని ఎలా సాధించాలి స్వామీ?

ఆహారం అనేది అన్నమయకోశ శుద్ధికి సంబంధించింది – ఆధ్యాత్మికత అనేది ఆత్మమయకోశ శుద్ధికి సంబంధించినది. మొట్టమొదట నియమాలు అనేవి తప్పక అవసరమే. అయితే, అవి కూడా ఒక రకంగా బంధమే. ఆధ్యాత్మికంగా పరిణతి చెందిన వ్యక్తి ఎటువంటి నియమాలు పాటించడు. ఎందుకంటే, నియమాలు పాటించడమంటే, అహంకారాన్ని బలోపేతం గావించుకోవడమే. సమాధి అంటే ఏమీ చేయకుండా వుండటమే. ఏదో ఒకటి చేయడమంటే ప్రాథమిక స్థితే. అటువంటి సమాధిలో పట్టు సాధించాలంటే, సాత్త్విక ఆహారం తప్పనిసరి. పరిమితంగా తీసుకుంటే, సాత్త్వికమవుతుంది, అతిగా తీసుకుంటే తమోగుణం, అవసరానికి సరిపడ తీసుకొనకపోతే రజోగుణమవుతుంది. అన్ని పదార్థాలు తీసుకోవడమే యోగం – కొన్ని పదార్థాలను బలవంతంగా నిషేధించడమే రోగం. ధనార్జన ధర్మపథంగా వుంటే, ఆహారం అమృతమవుతుంది. అధర్మంగా జీవిస్తూ, అక్రమార్జనకు అలవాటుపడి, అమృతాహారం పేరుతో కాయగూరలు తిన్నా, ఎటువంటి ఫలితముండదు. అంతరంగం పవిత్రంగా వుంటే, తీసుకున్న ఆహారం కూడా పవిత్రమవుతుంది. అంతరంగం కలుషితంగా వుంటే, ఎటువంటి ఆహారం సేవించినా

అది విషంగా మారుతుంది. శారీరక సుఖానికి అలవాటుపడి ఎటువంటి నియమాలు పాటించినా, ప్రయోజనముండదు. కష్టించి పనిచేసేవారు ఎటువంటి ఆహారాన్ని భుజించినా పూర్తిగా భస్మమవుతుంది. ఇప్పుడంతా మేధావులు. ఈ మేధావివర్గమంతా ఆరోగ్యాన్ని గురించి జాగ్రత్తపడుతూ, ఆహారానికి అతిగా ప్రాధాన్యతనిస్తున్నారు. ధైర్యం, ఆత్మవిశ్వాసం, మనోబలం, సమర్థత వంటి ఉత్తమ లక్షణాలుంటే, శరీరం కూడా ఆరోగ్యంగా, దృఢంగా వుండి, ఎక్కువకాలం జీవించవచ్చు. జీవితాన్ని కళాత్మకంగా కొనసాగించేవారు, నైతిక విలువలతో క్రమశిక్షణను అలవర్చుకుంటే, ఆరోగ్యాన్ని గురించి ఆలోచించవలసిన అవసరమే వుండదు. అంతరంగశుద్ధి జరుగుతూ వుంటే, ఆలోచనా విధానంలో కూడా మార్పు వస్తుంది. శరీరంపై మనసుకు పూర్తి పట్టు లభిస్తుంది. అంతరంగ అవయవాలు అద్భుతంగా పనిచేస్తాయి. ఇక శారీరక ఆరోగ్యాన్ని గురించి ఆలోచించవలసిన అవసరమే వుండదు. మీరు తీసుకునే ఆహారంలో స్థూలభాగం అన్నమయకోశానికి, సూక్ష్మభాగం మనోమయకోశానికి అందించబడుతుంది. అందువలన, కఠోరనియమాలు పాటించవలసిన అవసరమే వుండదు. అయితే, మాంసాహారాన్ని మాత్రము పూర్తిగా నిషేధించాలి. ఎందుకంటే, జీవహింస అనేది ఆధ్యాత్మిక పురోభివృద్ధికి పూర్తి విరుద్ధమైన అంశం. అందువలన, సాత్త్విక ఆహారాన్ని తీసుకుంటూ, క్రమం తప్పకుండా సాధనను కొనసాగిస్తూ, ప్రశాంత జీవనాన్ని గడపగలిగితే చాలు. మానవజీవిత పరిపూర్ణత్వానికి ఆధ్యాత్మికమార్గం తప్ప వేరే ప్రత్యామ్నాయమే లేదు. ఎందుకంటే, పూర్ణత్వం సిద్ధించిన వ్యక్తి ప్రజ్ఞ అనంతంగా విస్తరించి, సంపూర్ణ స్వేచ్ఛను పొంది, అదే విధంగా జీవిస్తూ, అదే రీతిలో జీవితాన్ని ముగిస్తాడు. అందుకు అన్నమయకోశం నుండి, ఆత్మమయకోశం వరకు అన్ని కోశాలు సమూలంగా శుద్ధిగావించబడి, అసలు శరీరమే లేదు అనే అంశాన్ని ప్రయోగపూర్వకంగా అనుభవించగలగాలి. ఇది ఒక అసాధారణమైన అంశం. కోట్లాదిమందిలో కొద్దిమందికి మాత్రమే సాధ్యమవుతుంది. ప్రస్తుతం మీరు అనుభవిస్తున్న మార్గం, ఆలోచనలను, విధానాలను గమనించండి. కేవలం శారీరక ఆరోగ్యాన్ని దృష్టిలో వుంచుకుని ఆచరిస్తున్నారు. అందువలన కేవలం తాత్కాలిక ఉపశమనం మాత్రమే లభిస్తుంది తప్ప, శాశ్వత పరిష్కారం పొందే అవకాశమే లేదు. అందువలన, ఈ గురుడు చెప్పిన రీతిలో శారీరక, ఇంద్రియ, మానసిక, బుద్ధి పరిమితులను అధిగమించగలిగితేనే, పరాకాష్ఠ స్థితికి చేరుకోగలుగుతారు. వేరే ప్రత్యామ్నాయం లేదు. అందుకు పరిపూర్ణ అద్వైతబ్రహ్మజ్ఞానమే పాశుపతాస్త్రం. అందునా, అది సశాస్త్రీయంగా, స్వచ్ఛంగా అందించబడాలి. అజ్ఞానాన్ని తొలగించుకోవాలంటే, ఆత్మజ్ఞానమనే వెలుగు కావాలి. అయితే, అది పరిపూర్ణజ్ఞానమై వుండాలి. ప్రస్తుతం అటువంటి పరిపూర్ణజ్ఞానాన్ని మీకు అందించేవారు బాహ్యంగా లేరు – అందుకోవాలని ఆరాటపడేవారూ లేరు. అటువంటి స్థితిలో ఈ ఆంజనేయుడు గురువై, సద్గురువై, అఖండతేజోమయజ్ఞానాన్ని అతి తేలికగా అందిస్తున్నాడు. అందుకున్నవారు అనుభవించితే, తప్పక పూర్ణజ్ఞానులవుతారనేది తథ్యము! పూర్ణజ్ఞానాన్ని అందుకున్న వ్యక్తి మనసు నిండుకుండవలే వుంటుంది. అట్టి స్థితిలో "శరీరమే లేదు" అనే భావన కల్గుతుంది. శరీరమే లేకపోతే, ఇక ఇంద్రియ, మనో, బుద్ధి, చిత్తం, అహంకారాలకు అవకాశమే వుండదు. శరీరం కరిగిపోతే, ఇక జీవితముండదు. దానిని నడిపించే జీవుడికి ఇక ఉనికి వుండదు. అట్టి స్థితిలో సమాజ, ప్రపంచ, ప్రకృతి, విశ్వాలకు సంబంధించిన సమాచారం కూడా మాయగా కన్పడుతుంది.

కొందరికి అటువంటి స్థితికి చేరటం సాధ్యం కాదేమోనని అనుమానం కలుగవచ్చు. అయితే, ఈ ఆంజనేయుని ప్రమాణముంటే, అది తప్పక సాధ్యమవుతుంది. కనిపించే ఈ స్థూలజగత్తంతా ఏకత్వం నుండి, బ్రహ్మం నుండి, పరమాత్మ నుండి, భగవంతుడి నుండి ఆవిర్భవించిందనేది నూటికి నూరు శాతం వాస్తవము. అందులో ఎటువంటి సందేహం లేదు. విశ్వం ఒక్కటే, సత్యం ఒక్కటే, బ్రహ్మం ఒక్కటే, భగవంతుడు కూడా ఒక్కడే. రెండు గానీ, రెండవది గానీ వుండదు. వుండే అవకాశమే లేదు. అటువంటి ఏకత్వంతో కూడిన ఆత్మ నుండి భిన్నత్వం, స్థూలత్వం, రూపనామాలతో కూడిన భౌతికజగత్తు ఆవిర్భవించింది. దానిని వేదాంతపరంగా అనాత్మ అంటారు. అటువంటి అనాత్మ, ద్వంద్వాలతో కూడి వుంటుంది. ద్వంద్వం అంటే రెండు అర్ధభాగాలు సమానస్థాయిలో వుంటాయి. ఉదా:– జ్ఞానం–అజ్ఞానం; సత్యం–అసత్యం; భగవంతుడు, భక్తుడు – పరమాత్మ, ప్రపంచం వగైరా... ఈ విధంగా జంటలుంటాయి. వానిని అన్యోన్యాశ్రయాలు అంటారు. ఇదే విధంగా మానవజీవితంలో కూడా పుట్టుక–మరణం; మంచి–చెడు; విజయం–అపజయం వగైరా రెండుగా కన్పిస్తాయి. మీరు వాటి గురించి అవగాహన కలిగించుకోగలిగితే, పూర్ణత్వం సిద్ధిస్తుంది. వాస్తవానికి అవి రెండుగా కన్పించినా, అవి రెండూ ఒక్కటే. ఒకటి, మరొకదానికి ప్రతిబింబము. ఉదా:– ఆత్మ నుండి అనాత్మ ఆవిర్భస్తుంది. అనాత్మ తిరిగి మరలా ఆత్మలోనికి కలిసిపోతుంది. కాబట్టి, అనాత్మ కూడా ఆత్మయే కదా! దానిని మానవజీవితానికి కూడా అన్వయించుకోవచ్చు. పుట్టుక–మరణాలనే తీసుకుంటే, పుట్టుక వుందంటే, మరణం వుంటుంది. అయితే, ఆ రెండింటికీ ఆధారం భగవంతుడే కదా! అందువలన, పుట్టుక–మరణాలు రెండూ అశాశ్వితాలే. పూర్ణత్వముంటే, వాటిని కరిగించివేయాలి. అందుకు గతజీవిత సంస్కారాలను పూర్తిగా తొలగించుకోవాలి. జ్ఞాని ద్వంద్వాలను సమానంగా స్వీకరిస్తాడు – అజ్ఞాని దాని మధ్య ఘర్షణపడతాడు. కాబట్టి, పూర్ణజ్ఞానం పొందిన తర్వాత, సాధనను కొనసాగించగలిగితే, సంస్కారశుద్ధి జరిగి, ద్వంద్వాలు పూర్తిగా కరిగిపోయి, పూర్ణత్వం సిద్ధిస్తుంది. ఇందులో అనుమానమే లేదు. ఇది ఆంజనేయుని మాట, ఆన!

***ప్రజల్లో చాలామందికి తెలుసు***
***కోర్టులు 'కోడిపందెములు' వద్దన్నా, బాహాటంగానే పలుచోట్ల ఆడారు***
***పొగత్రాగితే వచ్చే దుష్ప్రభావాలు తెలిసినా, వినే ఉద్దేశ్యం లేకపోయినా రోగాలు వస్తాయి***
***బ్యాన్ చేసినా, వ్యాన్‌ల ద్వారా అన్నిచోట్లా దొరికే పాన్‌పరాగ్‌లు, గుట్కాలు***
***మిమ్ములను గుటకాయస్వాహా చేస్తున్నా, క్యాన్సర్ వ్యాధులు వస్తున్నా,***
***ఎవరు ఎన్ని విధాలుగా చెప్పినా వినరు.***
***మీ మారని మీ అభిమతం!***
***మనుషులు మారాలన్నా, మానవత్వం వెల్లివిరియాలన్నా, ఆదర్శవంతమైన జీవితం రావాలన్నా,***
***ఆత్మీయత పెరగాలి. అందుకు అడ్డుగా వున్న సాధనాలను సాధన కొరకు***
***సాధ్యమయినంత దూరంలో ఉంచుతూ,***
***నెట్‌వర్క్‌కు దూరంగా వుంటూ, నీట్‌వర్కర్‌గా గుర్తింపు కలిగి,***

***సెల్‌ఫోన్‌కు బదులు, సోల్‌ఫోను కల్గి వుండినట్లయితే,***
***స్పీడ్‌గా సట్లను బిగించుకుని, భజరంగభళిని చేరుట తథ్యము***
***నా చిన్నారి ముద్దుబిడ్డలారా, మర్మము తెలుసుకోండి!***

ॐ

**25-06-2019** 09:00 AM

**158) జీవితంలో కర్మ యొక్క ప్రాధాన్యత ఎట్టిది? ఎటువంటి కర్మలు ఆచరించాలి స్వామీ?**

*కర్మకు – కర్మఫలానికి మధ్య అవినాభావ సంబంధముంటుంది. కర్మ జరిగిందంటే, తప్పక కర్మఫలముంటుంది. కర్మ నుండి కర్మఫలాన్ని వేరుచేసే అవకాశమే లేదు. అయితే, అటువంటి కర్మలు ఎలా వుండాలి? తనకు, తన కుటుంబానికి, సమాజానికి ఉపయోగపడే విధంగా వుండాలి. అటువంటి వానిని ఉత్తమకర్మలు అంటారు. అలాగాక, తనకు, తన కుటుంబానికి, సమాజానికి హాని కల్గించే విధంగా వుంటే, వానిని చెడుకర్మలు అంటారు. స్వార్థంతో తనకు సంబంధించిన వస్తుసంపదపట్ల గాని, సంతానంపట్ల గాని, అమితమైన ప్రేమ ప్రదర్శించటం మోహంగా గుర్తించవచ్చు. అట్టి మోహము ఊబితో సమానము. తెలివిగలవాడు చిన్న గడ్డిరెబ్బ దొరికితే, దానిని ఆలంబనగా చేసుకుని సురక్షితంగా ఒడ్డు చేరుతాడు. బుద్ధిహీనుడు ఏనుగు వచ్చి తన తొండంతో బయటకు లాగే ప్రయత్నం చేస్తున్నా, తన సహకారాన్ని అందించకుండా, ఇంకా లోపలకు వెళ్ళే ప్రయత్నం కొనసాగిస్తాడు. సహాయమందించటానికి వచ్చిన గజరాజు ఆవేశంతో తన పాదాన్ని శిరస్సుపై పెట్టి అణగద్రొక్కుతాడు. దీనికి కారణం ఎవరు? ఒక్కసారి ఆలోచించండి. వివేకము కావాలా, అవివేకము కావాలా? మీ లోపలనున్న అహంకారాన్ని వీడండి. సహాయపడుటకు వచ్చిన ఈ వీరాంజనేయుని మాటలు వీనుల విందుగా విని పాటించటానికి సంసిద్ధంకండి. చెప్పినదాన్లో, ఒక వంతు పాటించినా, ఈ పవనకుమారుడు పరవశించిపోతాడు. సాధకులు అని పిలువబడే మీరు సతమతమవుతూ, సద్గుణాలనేవి లేక అల్లాడుతూ, మిమ్ములను చూచేవాళ్ళను అల్లాడించుచూ వుంటే, ఇది ఏమి సాధన? దీనిని సాధన అంటారా? కొంచెము విశదీకరించండి, విని తరిస్తాను. నేను తరించటానికి ఇంతకన్నా గొప్పమార్గం నాకు కన్పించుట లేదు. ఇది మీ అదృష్టం, నా దురదృష్టం. భావాలు బాగాలేనప్పుడు, ఈ భజరంగభళి, భజన చేసుకుంటూ కూర్చోవడం ఉత్తమం. ఇది నాపాలిట ఉత్తమకర్మ. ఉత్తమకర్మల ద్వారా తాను ఉన్నతంగా ఎదగడమే గాక, అందరికీ అన్ని విధాలా ఉపయోగపడతారు. చెడుకర్మల ద్వారా ముందు తనకే నష్టం కలుగుతుంది. ఆ తదుపరి కుటుంబానికి, సమాజానికి కూడా విస్తరిస్తుంది. ఎవరైతే చెడుకర్మలను ఆచరిస్తారో, వారికి మానసిక ప్రశాంతత లోపిస్తుంది. ఆనందం లభించే అవకాశమే లేదు. అందువలన, మీరు చేసే కర్మలను గురించి మీరు జాగ్రత్త వహించాలి. అయితే, ఎవరైనా చెడుకర్మలు చేయటానికి మూలకారణం వారివారి గతజీవితపు చెడుసంస్కారాలే. అయితే, చెడుకర్మల ద్వారా చెడుకర్మఫలం, ఉత్తమకర్మల ద్వారా ఉత్తమకర్మఫలం సంక్రమిస్తాయి. దీనికి ఎవరితోనూ ఎటువంటి సంబంధముండదు. మీ జీవితం మీ*

ద్వారానే కొనసాగుతుంది. దానికి ఎవ్వరూ బాధ్యులు కారు. భగవంతునికి – మీ జీవితానికి ఎటువంటి సంబంధమూ వుండదు. భగవంతుని మీద ఆధారపడటమంటే, బానిసత్వాన్ని పెంచుకోవడమే. అసలు భగవంతుడే మానవుల ప్రధాన బలహీనత. మీ కర్మలకు ఇతరులు కారణమని భావించడమంత అజ్ఞానం మరొకటి లేదు. భగవంతుని మీద భారం వేసేవారిలో బానిసత్వం పెరుగుతుంది. తమోగుణం అధికమవుతుంది. అయితే, చెడుకర్మఫలాన్ని క్షయం గావించుకోవటం కోసం, భగవంతుని ఆలంబనగా చేసుకోవాలి తప్ప, భగవంతుడే తొలగిస్తాడని ఆయన మీద పూర్తిగా భారం వేయడమంత ప్రమాదం మరొకటి వుండదు. మీ సృష్టికి భగవంతుడు కారణం కావచ్చునేమో గాని, కర్మకు మాత్రం కారకుడు కాదు. బయట భగవంతుని గురించి ఆలోచించేవారు, తమ అంతరంగమందలి భగవంతుని గుర్తించలేకపోతున్నారు. కాబట్టి, బాధ్యతను స్వీకరించండి. బంధాల నుండి బయటపడి, జీవితాన్ని సార్ధకం చేసుకోండి. ఇది నా ప్రార్ధన, వేడికోలు!

***విత్తు నాటితే, మొక్క***
***విత్తు ధర్మం మొలకెత్తడం. మనిషి ధర్మం మానవత్వం***
***మొక్కను పోషిస్తే అవుతుంది మహావృక్షం***
***మనిషి ఆలోచనను విశ్లేషిస్తే పుడుతుంది అద్భుతం***
***పండిన మానవత్వమే మనిషికి దైవం***
***మొక్క చిగురిస్తూ ఎదగటం సకలధర్మం***
***నీ విధికి నీవే శిల్పివన్నది నగ్నసత్యం***
***యద్భావం తద్భవతి అన్నదే వేదాంతం***
***సాధనతో సాధ్యం కానిది ఏదీ లేదన్నది నగ్నసత్యం***
***అదును చూచి పదును అన్నది రైతు చెప్పే ధర్మం***
***నీరు పల్లమెరుగు అన్నదీ నగ్నసత్యం***
***నిన్ను నీవు తెలుసుకోవటమే ఇంతకీ నేను చెప్పే సారాంశం***
***ఆటుపోట్లు సముద్రదేవునికి అలవాటు***
***మరి మీకేమి అలవాటు?***
***విషయచింతన చేస్తూ, విషయాలలో మునిగి వుండుట మీకలవాటు.***
***ఈ విషయాలే విషంగా మారి, మానవత్వాన్ని మంటగలుపుతూ,***
***మీరూ, మీ ప్రక్కనున్నవారూ కూడా కుతంత్రపు కుచ్ఛితపు కూటమిలో కలిసేలా చేసే***
***అద్భుతమైన ఊబిలో మునగకుండా,***
***ముప్పొద్దులా అందిస్తున్న ఆంజనేయుని అతి విలువైన మాటల మూటల సారాంశాన్ని గ్రహించి,***
***గ్రహపాటు లేని బిడ్డలుగా ఎదగండి***
***నా చిన్నారి ముద్దుబిడ్డలారా!***

ఓం

**26-06-2019** 08:10 AM

# ఆంజనేయుని ప్రశ్నోత్తరములు

*1. మీలోని బలహీనతలు మిమ్మల్ని ఏమి చేస్తాయి?*

**జ: గెలవాలన్నా, గెలిచిన తర్వాత రాణించాలన్నా మీరు మీలోని బలహీనతలను దూరం చేసుకోవాలి, బలాన్ని పెంచుకోవాలి. అయితే, గెలుపే మీ లక్ష్యమైనప్పటికీ, చాలామంది తమలో వున్న బలహీనతలను గుర్తించరు. పైపెచ్చు, అవి అందరిలో వుండే సహజలక్షణాలని, అవి ఏమీ తమ లక్ష్యానికి అవరోధం కాదని భావిస్తారు, వాదిస్తారు. వాస్తవానికి చిన్నవైనా, పెద్దవైనా బలహీనతలను త్వరగా వదిలించుకుంటేనే మీ బలం పెరుగుతుంది. ఎందుకంటే, బలహీనతలు ఎప్పుడూ మీ ఓటమికి దారితీస్తాయి. ఎప్పుడో ఒకప్పుడు, మీ పేరుప్రతిష్ఠలకు భంగం కల్గిస్తాయి.**

*2. లక్ష్యం వైపు అడుగులు వేసేవారు కోపాన్ని ప్రదర్శించటం మంచిది కాదు అన్నది ఎలా గ్రహిస్తారు?*

**జ: వ్యక్తులందరిలో వుండే బలహీనత కోపం. చాలా సహజగుణంగా భావించే కోపం, ఒక మానసికస్థితి. మీ యొక్క సహజ పరిస్థితికి విరుద్ధంగా ప్రవర్తించే పరిస్థితి కోపం వలన వస్తుంది. కోపం వచ్చినప్పుడు మీరు నేర్చుకున్న విషయాలను మరచిపోతారు. తెలుసుకున్న సత్యాలు మరుగున పడిపోతాయి. వ్యక్తుల మధ్య దూరాన్ని పెంచుతుంది. మాటల ద్వారా, చేతల ద్వారా అవతలవారిని బాధించినవారవుతారు. కోపం చిన్నగా వచ్చినా, పెద్దగా వచ్చినా చివరకు ఓ చేదు అనుభవాన్ని మిగుల్చుతుంది. అందుకే, లక్ష్యం వైపు అడుగులు వేసేవారు, కోపాన్ని ప్రదర్శించటం మంచిది కాదు అని చెబుతాను.**

*3. కోపం వలన ఒత్తిడి పెరుగుతుంది. దాని వలన మానసికస్థితి ఎలా వుంటుందో తెలియపర్చండి.*

**జ: చేసే పని, చేయవలసిన పని చిన్నదైనా, పెద్దదైనా వ్యక్తులలో ఎంతో కొంత ఒత్తిడి వుంటుంది. దానికి తోడు, "నేనే చెయ్యాలి, నా వలన తప్పు జరగకూడదు. అందరూ నన్ను, నా పనినీ మెచ్చుకోవాలి" అన్న భావనలు మనస్సులో వుంటే, ఒత్తిడి మరింత పెరుగుతుంది. ఆ ఒత్తిడికి తపన తోడైతే, ఇక చెప్పనక్కరలేదు. ఏ చిన్న పొరపాటు, లేక తప్పు గమనించినా, చూచినా కోపం కట్టలు త్రెంచుకుంటుంది. ఆవేశం హద్దులు దాటుతుంది.**

*4. "తన కోపమే తన శత్రువు" అనే పద్యాన్ని అందరూ చదివారు. అయినా కోపం వస్తే, ఆ సంగతి మరచిపోయి ప్రవర్తించే విధానం గురించి చెప్పండి.*

**జ: తన కోపమే తన శత్రువు అని తెలుసుకున్నప్పటికీ, కోపం వస్తే, ఆ సంగతి మర్చిపోతారు. సహజ పరిస్థితికి భిన్నంగా ప్రవర్తిస్తారు. కొందరిలో స్వరం హెచ్చుస్థాయిలో వుంటుంది. కన్నులు కలువరేకుల్లా విచ్చుకుంటాయి. కనుబొమ్మలు ముడిపడతాయి. చూపులు తీక్షణంగా వుంటాయి. శరీరంలో**

రక్తప్రసరణ వేగం పెరుగుతుంది. హృదయస్పందన మారుతుంది. మాటలు మృదుత్వాన్ని కోల్పోతాయి. కోపం తారాస్థాయిలో వుంటే, శరీరం చిగురుటాకులా వణుకుతుంది. కొందరు ఈ పరిస్థితికి భిన్నంగా కఠినమైన మౌనదీక్షను చేపడతారు. ఎవరితో మాట్లాడరు. ఏదైనా తినటానికి, త్రాగటానికి నిరాకరిస్తారు. అవతలివారు ఎంతసేపు బ్రతిమిలాడినా గానీ మెట్టు దిగరు, దీక్షను విరమించరు. మనస్సులో వున్నది విప్పి చెప్పరు. ఇన్ని అవలక్షణాలను కల్గినది క్రోధం.

*5. కోపం వలన ఏమేమి సాధిస్తారో ఆలోచించి చెప్పండి.*

జ: కోపం వచ్చినప్పుడు ఎవరు ఏ పద్ధతి పాటించినా, ఎదురుగా వున్నవారు మీ కోపానికి బలికావటం ఖాయం. మాటల ద్వారా, చేతల ద్వారా అవతలవారిని బాధించినవారవుతారు. చివరకు ఓ చేదు అనుభవం మీకు మిగులుతుంది. ఏం సాధించాం? లాభమెంత? అని మిమ్మల్ని మీరు ప్రశ్నించుకుంటే, సమాధానం శూన్యం. పైపెచ్చు, మీరు అశాంతికి గురి అవుతారు. ఏకాగ్రత ఛిన్నాభిన్నం అవుతుంది. చివరకు ఇంత చిన్న విషయానికా నేను ఇంతగా స్పందించింది అని మీకే అపరాధభావం కలుగవచ్చు. అందుకే, కోపం వలన ఘనత కొంచమైపోవు.

*6. మరి దీనిని గురించి ఎలా ఆలోచించి, ఎలా మారతారు?*

జ: ఏ విషయంలో ఎవరి వలన కోపం వచ్చింది? వారికి మీ మాటల ద్వారా ప్రశాంతంగా చెప్పవచ్చు. మీ మాటలలో నిజాయితీ, స్పష్టత వుంటే, అవతలవారికి తొందరగా అర్థం అవుతుంది. అన్నింటి కంటే, అందరికీ మెచ్చే విధంగా, నచ్చే విధంగా మీ ప్రవర్తన, మీ పనులు వుండవు. అవతలివారు కూడా మీకు నచ్చిన విధంగా వుండరు, మీరు మెచ్చే పనులు చేయరన్న సత్యాన్ని గ్రహిస్తే, కోపం మీ చెంతకు చేరదు. మీరు మీ లక్ష్యాన్ని ప్రశాంతంగా చేరుకోవచ్చు.

*7. మరి, ఇటువంటి వాటిని వదిలి ఎప్పుడు, ఏ విధంగా, ఏ రకంగా సాధన మొదలుపెట్టాలి?*

జ: సత్యాసత్య వివేచన చేయుచూ, ఎల్లప్పుడూ సత్యమునే గ్రహిస్తూ, సారాసార విచారణ ద్వారా సారమునే పొందాలి. చిప్పలను పారవేసి, ముత్యములనే గ్రహించు చందమున, జీవితమును ప్రారంభించవలెను. తర్వాత స్వప్రయత్నం, ఈశ్వరకృప. మీకు ఏ విచారణ చేయటానికైనా ముందు సత్యాసత్య విచారణ చేయుట సర్వశ్రేయస్కరము. ఆ విచారణ ప్రతి లౌకికమునందు గానీ, వ్యావహారికమునందు గానీ, ఇక ఏ చిన్న విషయమునందైనా గానీ తప్పక అది అవసరం.

***గతజన్మల సంస్కారఫలం అనుభవించక తప్పదు***
***స్థానభ్రంశం చెందినపుడు కొందరి మనసులు తరచి చూచినా,***
***ఆలోచనా సరళిలో చెడునడవడికలు, అడుగుల సుడులే గుడికడతాయి.***
***మానవజన్మను సంతరించుకున్న ప్రతివ్యక్తి సంస్కారం నేర్వాలి, కుసంస్కారం విడవాలి.***
***కొన్ని జన్మతః సిద్ధిస్తాయి, కొన్ని పరిసరాల ప్రభావం వలన బుద్ధిలో స్థిరపడతాయి.***
***కొన్ని సుగుణాలు గురుబోధతో అలవడుతాయి,***

***కొన్ని సుగుణాలు సజ్జనసాంగత్యంతో అలవడుతాయి.***
***ఏది ఏమైనప్పటికీ, సద్గురువు సాన్నిధ్యంలో మనసును స్థిరపరచి,***
***చెడు ఆలోచనలకు పుటం వేసి, నిగ్గు తేల్చినప్పుడే,***
***అసలుసిసలైన జ్ఞానము మీ వశమవుతుంది.***
***అందుకే, ప్రతిజీవి సార్ధకత వైపు పయనం సాగించాలి***
***పవనపుత్రుని మాటలు విని ఈ జన్మను సార్ధకపరుచుకుని***
***చరితార్ధులై నిషిద్ధ కర్మలకు బద్ధులై***
***ఈ చిరంజీవిని చేరి సదా సుఖించండి***
***నా చిన్నారి ముద్దుబిడ్డలారా!***

ॐ

**27-06-2019** 08:30 AM

**159) స్వామీ! మా పతనానికి మేమే కారకులము. మా పతనాన్ని మేము ఎలా నివారించుకొనవచ్చు స్వామీ?**

*మీరు శోధించి, పరిశోధించి, అహర్నిశలు శ్రమించి, మీ ప్రగతి కోసం పరితపించి, ప్రవేశపెట్టుకుంటున్న సమాచార విప్లవం మిమ్మల్ని ఎటువైపుకు మళ్ళిస్తున్నాయో గమనిస్తున్నారా? మీరు చేస్తున్న మీ ప్రయోగాల వలన మనోకాలుష్యం మీ హృదయమంతా వ్యాపించింది. సమాచార విప్లవమే అన్ని రకాల సమస్యలకు మూలకారణము. మీరు మీ మస్తిష్కాలను అనవసరపు అతి ప్రమాదకరమైన కలుషిత సమాచారాలతో నింపుకుని, దాని ప్రభావంతో శరీరాన్ని దానిలో వున్న పటుత్వాన్ని కోల్పోతున్నారు. అనవసరపు చెడు సమాచారం అతిసులభంగా లభించడం వలన దానికి ఆకర్షించబడి చెడుబీజాలు మనోఫలకంలో నుండి తర్వాత కాలంలో అవి ఫలాలుగా రూపాంతరం చెందుతున్నాయి. నైతిక విలువలు, పవిత్రత, బాధ్యత, క్రమశిక్షణ, ప్రేమ, త్యాగం, సేవ అనే అంశాలకు అవకాశమే లేకుండాపోయింది. మీరు మత్తులో కూరుకుపోతున్నారు. భక్తి, భజన, బంధాలు, అనుబంధాలు దైవత్వం అనే ధోరణి నామమాత్రంగా కూడా కన్పించుటలేదు. ఇవి అన్నీ బాహ్యక్రియలతోపాటు అంతర్గతంగా మిమ్ములను సంస్కరించబడినపుడే వాటిని మీరు పాటించి పాలించినవారవుతారు. బాహ్యక్రియలు బాహ్యాన్ని శుద్ధిచేస్తే, అంతరంగ ఆలోచనలు ఒక అద్భుతాన్ని సృష్టించి, మిమ్ములను ఒక అద్భుతమూర్తిగా తీర్చిదిద్దుతాయి. నేను ఎన్ని జాగ్రత్తలు తీసుకున్నా, మీలోపల కలుషితమైతే, మీలోపల ప్రశాంతమైన వాతావరణం కరువైతే, మిమ్మల్ని ఎంతకాలం బంధించగలుగుతాను? ఆనకట్టలు తెగి నది ఉధృతంగా ప్రవహిస్తుంటే ఒకరో ఇద్దరో తమ చేతులతో దానిని ఆపగల్గుతారా? ఆలోచించండి! మంచిని బోధించేవారు, తెలియచేసేవారు వెలివేయబడుతున్నారు. బలహీనతలను రెచ్చగొట్టేవారు ఆప్తులౌతున్నారు. చెడు అనేది అంతటా అన్నిటా ఆధిక్యతను పెంచుకుంటుంది. మీ మానసిక స్థితి కుళ్ళిపోయింది గమనించండి! ఇటువంటి ప్రమాదకరమైన*

అంశాలను గురించి ఎన్నో రోజులుగా నిరంతరం నేను హెచ్చరిస్తూనే వున్నాను. కానీ, నా మాటలన్నీ అరణ్యరోదనలుగానే మిగిలిపోతున్నాయి. చెవిటివాని ముందు శంఖం ఊదినట్లుగా తయారైంది. ఎందుకంటే, మీకు దాన్ని స్వీకరించి ఆచరించే ధైర్యం లేదు. అవగాహన చేసుకునే స్థాయి లేదు, తనను తాను ఉద్ధరించుకోవటానికి సమయం దొరకటం లేదు. నేను ఏదో సాధించాలి అనే తపన, ఆరాటంతో జీవితానికి సరిపడా కార్యక్రమాలను, ప్రణాళికలను, పథకాలను సంసిద్ధం చేసుకొని, బాహ్యాముఖ ప్రయాణంలో జీవిస్తూ, తన అంతరంగంలో ఏం జరుగుతుందో ఆలోచించుకోలేకపోతున్నారు. ఏదో తెలుసుకోవాలని పరితపిస్తున్నారు. కానీ, తాము తెలుసుకొనేదంతా మాయ అని తెలుసుకోలేకపోతున్నారు. జరగవలసిన పతనమంతా జరిగేపోయింది. ఇప్పటికైనా పరివర్తన పొందకపోతే, జరిగే నష్టం గురించి ఆలోచించండి. సమయం మించితే ప్రయోజనమేమిటి? అందుకే, ఆఖరి అస్త్రంగా మీకు నేను ఒక అద్భుతమైన మార్గాన్ని చూపుతున్నాను. మిమ్మల్ని రాచబాట వైపుకు మళ్ళించాలనుకుంటున్నాను. అందుకు మీరు సిద్ధంగా వున్నారా? ఉన్నట్లయితే, ఈ క్షణమే మీకు మోక్షప్రాప్తి లభిస్తుంది. అది, ఈ ఆంజనేయుని మాటపై, బాటపై నమ్మకముంటే, తప్పక ఆచరించండి. లేకుంటే, పాతకథే పునరావృతమవుతుంది. ఎంతకాలం నరకంలో జీవిస్తారు? ఎందర్ని బాధపెడ్తారు? ఎన్నిరకాల సమస్యలు సృష్టిస్తారు? గాడి తప్పి జీవిస్తున్నామని గమనించగలిగితే, పరిష్కారం కోసం ప్రయత్నం ప్రారంభించాలి. భౌతికపరమైన అభివృద్ధే ప్రామాణికమనుకుంటున్నారా? మీకు మీరుగా పతనాన్ని కోరుకుంటున్నట్లే! పరివర్తన, పశ్చాత్తాపం చెందాలి. సత్యం వైపుకు ప్రయాణించాలి. ధర్మాన్ని ఆలంబనగా చేసుకుని ముందుకు సాగాలి. జీవితపరమార్థం నెరవేర్చుకోవాలి. కాలం గడిచాక, అంతిమ దశకు చేరాక, అంతా అయిపోయిన తర్వాత మీరు, నేను చేయగలిగిందేమిటి? జీవిత పరమార్థాన్ని గ్రహించగలిగితే భవిష్యత్తులో జరగబోయే పతనాన్ని ఆపగలిగే అవకాశముంటుంది. అందుకు మీరు సిద్ధంగా వుంటే, మార్గం తప్పక లభిస్తుంది. ఎవరో వస్తారని, ఏదో చేస్తారని ఎదురుచూడవద్దు. అంతరాత్మను చంపుకోవద్దు. ఆత్మవంచన చేసుకోవద్దు. జీవితాన్ని ఎవరికీ తాకట్టు పెట్టవద్దు. జీవితాన్ని చక్కదిద్దుకోండి. ఇప్పటి మీ నిర్ణయం మీ భవితకు బంగారుబాట అవుతుంది. అది వృక్షమై, కల్పవృక్షమై, మీ కోరికను తీర్చే కామధేనువవుతుంది. అందుకే ఆలస్యం చేయవద్దు. ఆలోచించి ముందుకు సాగండి. మీ సంభాషణలో మృదుత్వాన్ని నింపుకోండి. సున్నితంగా మసలుకోండి. జపతపాలు మీలో జన్మిస్తున్న అరిషడ్వర్గాలను ఆపుచేయాలి. మీరు చేస్తున్న దైవాగ్ని, మీ గుణాలను కాల్చివేయాలి. మీలో వున్న నెగెటివ్‌ను నాకు సమర్పించి, పాజిటివ్‌ను నానుండి పొందండి. అంటే, చిల్లర నాకిచ్చి, కరెన్సీనోటుని నానుండి పొందండి. బరువు తగ్గించుకోండి. ఈ ఆంజనేయుని ఆదుకోండి. ఆపన్నహస్తాన్ని అందించి అందుకోండి. మంచి మనసున్న మనుషులు అనిపించుకుని, జీవితానికి సార్థకత చేకూర్చుకోండి.

**మిమ్ములను చూచి భగవంతుడికి భయమేమో... అందుకే బండగా మారిపోయాడు.**
**జాబిలికి జాలి లేదేమో... అందుకే నింగి నుంచి నేలకు దిగిరాలేదు.**
**కొండలకు అదురుపుట్టిందేమో... అందుకే అద్దం ముందు చిన్నబోయి కూర్చుంది.**
**కానీ, ఈ ఆంజనేయుడు కావాలని మీ ముందుకు వచ్చి**

***మానవజన్మ అంతరార్థాన్ని, మానవీయతను బోధించటానికి వచ్చాడు.***
***ఇప్పటి మీ పరిస్థితిని చూచి క్షణకాలము ఆలోచించినట్లయితే,***
***ఈ ఆంజనేయుని మానసమున ఒక చిన్న ఆలోచన సాక్షాత్కరించింది.***
***నన్ను ఏ అనకొండగానీ మ్రింగి వేసినదా? లేక నా చుట్టూ అజ్ఞానమనే చీకటి క్రమ్ముకుందా?***
***కాలప్రవాహంలో పడికొట్టుకుపోతున్న మీకు చేయూతనందిస్తున్న***
***ఈ మహాసంగ్రామంలో ద్వంద్వయుద్ధము చేస్తున్నాడీ వానరుడు***
***సత్యానికి ఎప్పుడూ జయమే. పరాజయమనునది పవనకుమారునికి లేదు.***
***పల్లవించాలి మీ మనసులు, పరుగులు పెట్టాలి పరమాత్మ తత్త్వం వైపు***
***నా చిన్నారి ముద్దుబిడ్డలారా!***

ॐ

**28-06-2019** 08:05 AM

**160) యోగి అంటే ఎవరు స్వామీ?**

*యోగి అంటే యోగంలో వుండేవాడు. యోగం అంటే కలయిక. జీవుడు దేవుడితో కలయిక. అంటే, తానెప్పుడూ ఆత్మనని భావించాలి లేదా, తన మనసును ఆత్మతో కలిపి ఉంచేందుకు ప్రయత్నించాలి. అట్టివాడే యోగి. భక్తుడైనవాడు, అలా ఎల్లప్పుడూ యోగిగానే ఉంటాడు. సాధారణంగా మీరు ఉదయం యోగులుగా, మధ్యాహ్నం జోగులుగా, రాత్రిపూట భోగులుగా, మూడుపూటలా రోగులుగా వుంటారు. ప్రతిరోజూ అనేక అవతారాలు ఎత్తుతూ వుంటారు. భక్తుడు మాత్రం ఎప్పుడు ఏ పని చేస్తున్నా, మనసును ఆత్మతో, భగవంతునితో కలిపి వుంచుతాడు. మీరు మాత్రం ఉదయం ఒక గంట, వీలైతే రాత్రికి ఒక గంట లిమిట్ ప్రకారం, డ్యూటీలాగా మనసును భగవంతునిపై ఉంచేందుకు ప్రయత్నిస్తారు. అదీ కష్టమైతే శరీరాన్ని మాత్రం భగవంతుని దగ్గర పడేస్తారు. అంటే రెండు గంటలపాటు యోగులు. ఇరవైరెండు గంటలు వియోగులు. ఎప్పుడో కాసేపు సరదా కోసమో, కాలక్షేపం కోసమో, నలుగురిలో ప్రత్యేకత కోసమో, కోరికలను తీర్చుకోవడం కోసమో యోగులు అయినంత మాత్రమున భక్తులు కాలేరు, భగవంతునికి ఇష్టులు కాలేరు. నిరంతరం చిత్తం భగవంతునితో అనుసంధానమై వుంటేనే యోగులు, భక్తులు, భగవంతునికి ప్రియులు అవుతారు. భక్తుడు మీలాగే పనిపాటలు చేస్తుంటాడు, మీలాగే తింటాడు, వింటాడు, విహరిస్తాడు. అయితే తేడా ఎక్కడ? అతడు మీలాగే ప్రపంచంలో వున్నా, అతడిలో ప్రపంచం లేదు, పరమాత్మే వుంటాడు. మీకు మాత్రం లోపల, బయట ఒకటే సరుకు – అదే ప్రపంచం! అంటే ప్రాపంచిక విషయాలు, వస్తువులు, అవసరాలు, భోగాలు ఇవే. ఇచట భోగాలు అనే పదానికి అర్థం బాగా తెలుసుకుని, పదాన్ని ఉపయోగించాలి. అనేక పదాలకు అనేక అర్థాలుంటాయి. కొన్ని మీ భావాలను బట్టి అర్థాలు మారిపోతాయి. నీవు ప్రపంచంలో వుండవచ్చు కానీ ప్రపంచం నీలో వుండకూడదు. పడవ నీటిలో వుండవచ్చు కానీ నీరు పడవలోనికి చేరకూడదు. కావున, నీలో వుండవలసింది భగవంతుడే*

కానీ ప్రపంచం కాదు. నీవు ఈ ప్రపంచంలో తిరుగు, ప్రాపంచిక విషయాలను పొందు, అనుభవించు. కానీ, నీలో ఆ ప్రాపంచిక భావనలకు చోటు ఇవ్వరాదు. ఎల్లప్పుడూ మీ మనసులో భగవంతుడే వుండాలి. భగవత్ విషయాలే వుండాలి. నీ చేతులతో నీవు పని చేస్తున్నా, నీ హృదయంలో రాముడే వుండాలి. చేతులతో పని చేస్తూ, హృదయంలో భగవంతుని నిలపటం ఎలా? ఒకసారి వ్యాసమహర్షి యమునానదిని దాటి వెళ్ళవలసి వచ్చింది. ఆయన నది ఒడ్డుకు చేరుకునే సమయానికి అక్కడ గోపికలు కొందరు వున్నారు. వారు పాలు, పెరుగు, వెన్న అమ్ముకునేందుకు వచ్చినవారు. వారు కూడా నదిని దాటి ఆవలి ఒడ్డుకు వెళ్ళాలి. అయితే, అక్కడ ఒక్క పడవ కూడా లేదు. అయ్యో ఎలాగా? అని గోపికలు విచారంలో మునిగిపోయారు. అక్కడే వున్న వ్యాసుని చెంతకేగి, "మహాత్మా! మేము వెంటనే ఈ నదిని దాటి వెళ్ళాలి. ఇక్కడ ఒక్క పడవ కూడా లేదు. మీరే ఏదో ఒక తరుణోపాయాన్ని సెలవివ్వరా?" అని ప్రార్థించారు. అంతట వ్యాసుడు "ఓ గోపికలారా! దిగులు పడకండి. నేను తప్పకుండా ఈ నది దాటిస్తాను. అయితే, నాకు ఆకలిగా వున్నది. తినటానికి ఏమైనా మీ దగ్గర వుంటే పెట్టగలరా? అని అడిగాడు. గోపికలు తమ వద్దనున్న పాలు, పెరుగు, వెన్న, మీగడ వ్యాసునికి భక్తితో సమర్పించారు. ఆయన వాటినన్నింటినీ తిని ఆకలి తీర్చుకున్నాడు. అంతట గోపికలు మమ్ములను నది దాటించవా? అని అడిగారు. అప్పుడు వ్యాసుడు ఆ గోపికలతో సహా నది ఒడ్డున నిలిచి, "ఓ యమునా! నేను ఈ రోజున ఏమీ తినకుండా ఉపవసించిన వాడినైతే, మేమందరం నిన్ను దాటి, నడచిపోవటానికి వీలుగా నీరు పాయలు చేసి, మాకు త్రోవనిత్తువు గాక" అని ప్రార్థించాడు. ఆయన నోటి నుండి ఈ మాటలు వెలువడగానే యమునా జలం రెండు పాయలుగా చీలి, దారి ఇచ్చింది. దానితో వ్యాసుడు, గోపికలు నడచి ఆవలి ఒడ్డుకు క్షేమంగా చేరారు. ఇప్పుడు గోపికలకు ఒక సందేహం వచ్చింది. "మేము పెట్టినవన్నీ తిని, 'నేనేమీ తిననివాడినైతే' అని ఈ మహానుభావుడు అన్నాడు. దానితో యమున దారి ఇచ్చింది. ఏమిటీ విచిత్రం?" అని అనుకున్నారు. వ్యాసుడు స్వయంగా తానేమీ తినలేదని, తన హృదయంలోని పరమాత్మయే సర్వాన్నీ ఆరగించాడనీ విశ్వాసం గలవాడు. తానేం చేస్తున్నా, పరమాత్మయందే మనస్సు నిల్పిన మహాత్ముడు గనుకనే తిన్నది అహం వైశ్వానరోభూత్వా, ప్రాణినాం దేహమాశ్రితః । ప్రాణాపానసమాయుక్తః పచామ్యన్నం చతుర్విధం ॥ అన్నట్లు, వైశ్వానరరూపంలో వున్న పరమాత్మయే సర్వాన్నీ తిన్నాడని ఒక భావం. పెట్టేవారు కూడా అదే భావంతో సమర్పించాలి. వ్యాసుడు తాను జీవుడ్ని కాదని, సాక్షాత్తు పరమాత్మనేనని అనుభూతి కలవాడు గనుక, నిరంతరం అట్టి పరమాత్మగానే వుండిపోయేవాడు గనుక, పరమాత్మ అకర్త, అభోక్త గనుక, తాను ఏమీ తినలేదని, ఆత్మస్థానంలో నిలచి నేనేమీ తినలేదు అన్నాడు. ఇదే, తాను ప్రపంచంలో వున్నా, తనలో ప్రపంచం లేదని, పరమాత్మే వున్నాడని ఋజువు చేసే అద్భుత దృష్టాంతం. అలా, ఎల్లప్పుడూ తాను పరమాత్మతో అనుసంధానమై కలసి వున్నవాడే యోగి. అతడే గొప్ప భక్తుడు, నిజమైన భక్తుడు, భగవంతుడు మెచ్చే భక్తుడు. ఈ ఆంజనేయుడు కోరుకుంటున్నది అదే. ఇచట ఒక చిన్న ఉదాహరణ చెబుతాను. నాకు, నా రాముడికి యుద్ధం జరిగింది, తెలుసుకదా? దానినే రామాంజనేయ యుద్ధంగా చెప్పుకుంటారు. ఆ యుద్ధంలో రాముడు నాపైన బాణం వేశాడు. నేను నమస్కారం చేశాను. అంతే, రామబాణం వెనుతిరిగింది. భక్తి ముందు ఏ శక్తి పనిచేయదు, ఏ నిందలూ పనిచేయవు.

***నిజాన్ని నిలువ లోతున పాతేసి,   అబద్ధాన్ని అందలమెక్కిస్తే అంతా కల్తీయే.***
***స్నేహంలో కల్తీ, రక్తంలో కల్తీ, ప్రేమలో కల్తీ,***
***సత్యంలో కల్తీ, మాటల్లో కల్తీ, చూపుల్లో కల్తీ, భక్తిలో కల్తీ***
***ఈ జగమే కల్తీ!***
***బాహ్యభక్తి పనికిరానిది.   అంతరంగభక్తి కల్తీలేని గొప్పది.***
***అటువంటి గొప్ప భక్తిని పెంపొందించాలంటే, నీ లోపలనున్న నన్ను గుర్తించి,***
***అంతరంగమున ప్రతిష్ఠించుకుని, ఆంజనేయుని మాటలు కల్తీ కాదని విశ్వసించి***
***విశ్వజనీనమైన ప్రేమను పెంచుకుని, పెరుగుతున్న పారమార్థికతను గుర్తించి***
***గురుతు తెలియుటకు గునపములాంటి మాటలుపయోగించిన ఈ గురుని మనసు గుర్తెరిగి***
***గురి చూచి, గురి పెట్టిన మార్గాన నడిచి, గుడిలాంటి సద్గురువు ఒడి చేరండి***
***నా చిన్నారి ముద్దుబిడ్డలారా!***

ॐ

**29-06-2019** 08:25 AM

**161) స్వామీ! జీవితంలో మేము పాటించవలసిన విలువలు ఎట్టివి స్వామీ?**

*ఒకరిని బాధపెట్టడం, నీటిలో రాయిని వేసినంత సులువు. కానీ, వారిని తిరిగి మామూలు స్థితికి తీసుకురావడం నీటిలోనుండి ఆ రాయిని వెదికి తీసుకొచ్చేంత కష్టం. అందుకే ఎవరినీ బాధపెట్టకుండా వుండాలి.*

| | | |
|---|---|---|
| *ఉపవాసం* | – | *జీర్ణకోశాన్ని శుద్ధి చేస్తుంది* |
| *స్నానం* | – | *దేహాన్ని శుద్ధి చేస్తుంది* |
| *ప్రార్థన* | – | *ఇంద్రియాలను శుద్ధి చేస్తుంది* |
| *దానం* | – | *సంపాదనను శుద్ధి చేస్తుంది* |
| *మౌనం* | – | *మనస్సును శుద్ధి చేస్తుంది* |
| *క్షమాపణ* | – | *సంబంధాలను శుద్ధి చేస్తుంది* |

*ఎవరితో అయినా సరే, ఎంతవరకు వుండాలో అంతవరకే వుండాలి. అందరూ మనవాళ్ళే కదా అని వాళ్ళ మంచి కోసం ఏదైనా మంచిమాట చెబితే, వాళ్ళ దృష్టిలో మీరు చెడ్డవాళ్ళు అవుతారు జాగ్రత్త. మీ గురించి పదిమందీ గొప్పగా చెప్పుకోవాలంటే, ముందు మీరు వందమంది గొప్పవాళ్ళ గురించి తెలుసుకోవాలి. సత్యం వైపుకు మీరు నిలబడాలంటే, ఒంటరిగా మహావృక్షంలా నిలబడటానికి సిద్ధంగా వుండాలి. ఒకవేళ పడిపోవాల్సివస్తే, మళ్ళీ మొలకెత్తటానికి ఉపకరించే విత్తనంలా పడిపోవాలి. జీవితం ఎప్పుడూ ఒకేలా వుండదు. చాలా సమస్యలనే చూడాల్సివస్తుంది. వాటినన్నింటినీ ఎదుర్కొనే ధైర్యం వున్నప్పుడే జీవితం అర్థవంతంగా వుంటుంది. ఏ క్షణంలో అయితే మీ పట్ల మీరు నమ్మకాన్ని కోల్పోతారో,*

*ఆ క్షణం నుంచే మీరు చచ్చిన శవంతో సమానం. కరుగుతున్న కాలానికి, జరుగుతున్న సమయానికి, అంతరించే వయసుకీ, మిగిలిపోయే జ్ఞాపకమే మంచితనం, అదే మీకు ఆభరణం. అదృష్టం అంటే ధనం, వస్తువులు వుండటం మాత్రమే కాదు. చేతినిండా పని, కడుపునిండా తిండి, కంటినిండా నిద్ర, అవసరానికి ఆదుకునే ఆప్తులను కలిగి వుండటమే అసలైన అదృష్టం. మిమ్మల్ని అర్థం చేసుకుంటే, గుండెల్లో గుడి కట్టినా తప్పులేదు. కానీ, మీకే విలువ లేనిచోట, ఎదుటి వ్యక్తిని గురించి ఎంత ఆలోచించినా వ్యర్థమే. మనిషిలో అహంకారం తగ్గిన రోజు, ఆప్యాయత అంటే అర్థమవుతుంది. గర్వం పోయినరోజు, ఎదుటివారిని ఎలా గౌరవించాలో తెలుస్తుంది. నేనేంటి? నాకేమిటి? అనుకుంటే, చివరకు ఒక్కడిగానే వుండాల్సివస్తుంది. గౌరవమర్యాదలు ఇచ్చిపుచ్చుకుంటూ, అందరితో కలసి ఆనందంగా జీవించడమే మంచి జీవితం. నిరంతరం వెలిగే సూర్యుడ్ని చూచి చీకటి భయపడుతుంది. అలాగే, నిత్యం కష్టపడే మనిషిని చూచి ఓటమి భయపడుతుంది. ఇతరులు ఎలా వున్నారో, అలా వుండాలని భావించకండి. నీకంటూ ఒక విలువ వుందని తెలుసుకోండి. అలాగే నీకన్నా తక్కువ స్థాయివారిని చూచి, తృప్తి పడకండి. పైస్థాయి వారిని చూచి లక్ష్యమేర్పర్చుకోండి. మీరు ఈ ప్రపంచానికి అర్థం కాకపోయినా, బ్రతికేయవచ్చు కానీ, మీకు మీరే అర్థం కాకపోతే, ఈ ప్రపంచంలో ఎక్కడా బ్రతుకలేరు. జీవితంలో సంపాదన పెంచుకుంటే ధనవంతుడివి అవుతావు. వయస్సు పెరిగితే ముసలివాడవవుతావు. కానీ, మీలో మంచితనం పెంచుకుంటే, మంచిమనిషిగా కలకాలం జీవించగలుగుతారు. ప్రస్తుతం బంధాలలో ఇరుక్కుని జీవితపరమార్థం తెలుసుకోలేక, జీవితాన్ని యాంత్రికంగా గడుపుతూ, బలవంతంగా ముగిస్తున్నారు. తమ విలువ తెలియని వ్యక్తులకే ప్రపంచం విలువైనదిగా కన్పిస్తుంది. తనను తాను తెలుసుకున్నప్పుడు, ఇక ప్రపంచం నుండి పొందవలసింది ఏముంటుంది? ఆలోచించండి! ప్రస్తుతం అందరూ మోక్షాన్ని పోగొట్టుకుంటూ, మోహబంధాలను పటిష్టం చేసుకుంటున్నారు. తనను తాను సరిచేసుకున్న వ్యక్తికే ప్రపంచం దాసోహమంటుంది, వారి మాటలకే విలువనిస్తుంది. ఎందుకంటే, వారిది అనంతమైన, అపారమైన అనుభవమవుతుంది. అనుభవసారాన్ని పెంపొందించుకున్న వ్యక్తి ఉనికే సమాజానికి వరమవుతుంది. అటువంటి వ్యక్తి ఎవ్వరికీ ఎటువంటి బోధనలు చేయనవసరం లేదు. జీవితమే సందేశమవుతుంది. అసలు, ప్రపంచంలోకి ప్రవేశించటంలోనే బలహీనత దాగివుంటుంది. ప్రపంచం తనవైపుకు మళ్ళే విధంగా మీ అంతరంగం పవిత్రంగా వుండాలి. ప్రపంచంలోకి పరుగులు తీసే వారంతా బలహీనులే. వారి అవసరార్థం ప్రపంచాన్ని ఉపయోగించుకునే ప్రయత్నం చేస్తారు. అందుకే వారిని ప్రపంచం స్వీకరించదు, తిరస్కరిస్తుంది. అంతకు మించిన దురదృష్టం ఏముంటుంది? బాహ్యాపరమైన బంధాలను పెంచుకుని, అది సరికానందువలన తీవ్ర నిరాశ, నిస్పృహలకు లోనవుతారు. ఇది కాదు, ఈ ఆంజనేయుడు కోరునది. బోధ చేయటానికి వచ్చాను. బోధ ఎక్కాలంటే, బాధపెట్టక తప్పదు. అది జీవులను ఉద్ధరించటానికి వాడే ఆయుధం. ఆయుధం లేకపోతే, ఆపరేషన్ జరగదు. ఆపరేషన్ వలన స్వస్థత చేకూరాలి. బాధపెట్టుట నా నైజం కాదు, నిజమూ కాదు. మీలోపల మార్పును తెచ్చే ప్రయత్నము మాత్రము నిజము!*

***మధురగేయాలు వినిపించటానికి బదులు వెర్రికేకలు వేస్తే,***

***ఏ కూతల వెనుక ఏముందో తెలుసుకుని, అంతరంగం బాధను అనుభవిస్తుంది.***
***కోకిల కూతలాంటి కూతతో, హృదయం ఉప్పొంగుతుంది***
***మీ గానమాధుర్యంతో బాధలనన్నింటినీ మరపించి, మురిపించి***
***పారవశ్యంలో మునిగేటట్లు చేస్తారు***
***మీ పలుకులోని చల్లదనం వీనులవిందుగా కమ్మని, చల్లని స్పర్శను అందిస్తుంది***
***మీ మృదుమధుర స్వరం మీ గాత్రానికి అర్థం***
***మాధుర్యం పొంచివుందని అర్థం చేసుకున్న మరుక్షణం, ప్రకృతి పరవశించి***
***మీ ముద్దుబిడ్డలై, మీ ముంగిట వ్రాలి, మీ మంచిని గుర్తించి***
***నీరాజనాలు సమర్పిస్తూ, సమయానుకూలంగా స్పందిస్తూ,***
***సరసమైన మీ సంభాషణతో హృదయ స్వాగతాలను సమర్పించి,***
***వారివారి హృదయాలలో ప్రతిష్ఠించుకుంటారన్న నిజాన్ని***
***బహిరంగంగా ఈ భజరంగభళి బోధిస్తున్నాడు తన చిన్నారి ముద్దుబిడ్డలకు***
***అందుకోండి నా చిన్నారి ముద్దుబిడ్డలారా!***

ఓం

**30-06-2019** 08:10 AM

**162) భగవంతుడు అంతర్యామి అని అంటారు కదా? అది ఎలా అర్థం చేసుకోవాలి స్వామీ?**

వానరులను నరులను చేయటానికి శ్రీరాముడు జన్మించాడు. నరులను నారాయణులుగా తీర్చిదిద్దటానికి శ్రీకృష్ణుడు జన్మించాడు. ఎంత చక్కని భావన! ఎంత సత్యమైన భావన! ఒక్కసారి ఆలోచించండి! జీవుడుగా వ్యవహరిస్తున్న మీ అసలు స్వరూపం ఆత్మయే. జీవుడే దేవుడని, నరుడే నారాయణుడని, ఆత్మయే పరమాత్మయని, శ్రీకృష్ణుడు జీవేశ్వర ఏకత్వాన్ని స్పష్టంగా చెప్పాడు. జీవుడే పరమాత్మ, పరబ్రహ్మం. మీరు నరులు కాదు, నారాయణులు. జీవులు కాదు, శివులు. మానవులు కాదు, మాధవులు. జనులు కాదు, జనార్దనులు. మీ నిజస్వరూపం ఏదో తెలుసుకోండి. మీ స్వస్వరూపాన్ని తెలుసుకోండి. రెండు గంటల నాటకంలో బిచ్చగాడి వేషం కట్టావే గానీ, నీవు నిజంగా బిచ్చగాడివి కావు. నీవు కోటీశ్వరుడివి. ఈ నాటకంలోని బాధలు కూడా నీవి కాదు. అవి క్రియాపాత్రలకు సంబంధించినవే. నీవు రామారావువి కాదు, సుబ్బారావువి కాదు, సుబ్బాయమ్మ కాదు, వెంకాయమ్మ కాదు. నీవు పరమాత్మవు. భారతరత్న, పద్మశ్రీ, పద్మభూషణ్ బిరుదుల కోసం మొహంవాచిపోతారు, దేవురిస్తుంటారు. కానీ, తత్త్వమసి, ఆ పరమాత్మవు నీవే, క్షేత్రజ్ఞుడ్ని నేనే, నీవు నేనే అని భగవంతుడిచ్చే అసలు సిసలైన బిరుదుల్ని మాత్రం పెడచెవిన పెడతారు, పట్టించుకోరు. ఎంతటి దౌర్భాగ్యమో చూడండి! పదిమందిని "నేను నీకు ఈ బిరుదునిస్తాను, నీవు నాకు ఆ బిరుదు ఇవ్వు" అని తంటాలు పడతారే గాని, అసలు వున్న బిరుదు సంగతి తెలుసుకోలేరు ఈ మూర్ఖమానవులు. భగవంతుని మాటలను వదిలి, భ్రష్టమైన ఆలోచనలు చేస్తూంటారు మానవులు. భగవంతునిపై విశ్వాసం లేని వారికి ఉద్ధారకమే లేదు.

శ్రద్ధలేని వారికి జ్ఞానం లభించదు. జ్ఞానం లేనివారికి మోక్షం లేదు. కనుక, భగవంతుని మాటపై శ్రద్ధ వుండాలి. ఈరోజు ఏకాదశి, ఈరోజు ద్వాదశి అని చెప్పేవారి మాటను నమ్ముతారు. ఎందుకంటే, అది పంచాంగంలొ వ్రాసింది ఒక సిద్ధాంతి. అతడు మానవమాత్రుడే. అతడి మాటపై నమ్మకముంది కానీ, భగవంతుని మాటపై విశ్వాసం లేదు, నమ్మలేకపోతున్నారు. భగవంతుని మాటపైన, వాక్యాలపైన, గురువుల, పెద్దల వాక్యాలపైన విశ్వాసం లేనివాడు నిజంగానే చెడిపోతాడు. వ్యర్థజీవి అవుతాడు. ఈ శరీరంలోని క్షేత్రజ్ఞుడు, ఆత్మ ఆయనే. ఈ శరీర మనో బుద్ధులకు చైతన్యాన్ని ఇచ్చి నడిపించేది ఆయనే.

**163) భగవంతుడే అన్ని క్షేత్రాలను నడిపించేటప్పుడు, అన్నింటినీ ఒకే రకంగా ఎందుకు నడపడం లేదు స్వామీ?**

లైటు, ఫ్యాను, ఫ్రిజ్, టీవీ, హీటర్ అన్నింటినీ నడిపేది ఒకే కరెంట్. మరి లైటు వెలుగుతున్నది, ఫ్యాను తిరుగుతున్నది, ఫ్రిజ్ చల్లబరుస్తున్నది, హీటర్ వేడి చేస్తున్నదేం? అవన్నీ క్షేత్రాల స్వభావం వల్లనే. కరెంటు కేవలం అవి పనిచేయటానికి శక్తినిస్తుందంతే.

**164) నేను నా నిజతత్త్వము ఎలా గుర్తించాలి స్వామీ?**

ఈరోజు మీరు మీ గురించి తెలుసుకోవటం లేదు. బాహ్యపరమైన అంశాలకే ప్రాధాన్యతనిస్తున్నారు. అనవసరపు మిథ్యా సమాచారాన్ని మస్తిష్కంలోనికి నింపుకుంటూ, సంస్కారాల మోతాదులను పెంచుకుంటున్నారు. అంతరంగశుద్ధికి అంతర్ముఖమే చక్కని రాచబాట. వేరే ప్రత్యామ్నాయమే లేదు. భగవంతుని లక్షణాలతో జీవించే ఏ వ్యక్తియైనా తప్పక భగవంతుడు అవుతాడు. అవి ఏమిటని మీరు అడిగినట్లయితే, చెప్పవలసిన బాధ్యత నాది.

1. రాగద్వేషాలకు అతీతమైన విశ్వవ్యాపిత భావన వుండాలి.
2. ఆశించే తత్త్వముండకూడదు. అందించగలగాలి.
3. ఆది-అంతాలు లేని అనంతస్థితిని అనుభవించగలగాలి.
4. తాను స్వేచ్ఛగా జీవిస్తూ, అందరికీ స్వేచ్ఛను కలుగచేయాలి.
5. ప్రపంచాన్ని సరిచేయడం కాదు, తనను తాను ఉద్ధరించుకోవాలి.
6. నేను సాధించవలసింది ఏమీ లేదు అనే భావన వుండాలి.
   (నీవే నేను, నేనే నీవు అన్న పూర్తిజ్ఞానం అనుభవంలోకి వచ్చిన తర్వాతనే)
7. నేను ఏమీ కాదు అనే భావన నుండి సర్వం నేనే అనే భావనకు విస్తరించాలి.
8. ప్రజా సంబంధాలకు అతీతంగా, వేరుగా వుండాలి.
9. జీవితాన్నే సాధనగా మలచుకోవాలి. ప్రత్యేకంగా సాధన అవసరం లేకుండా వుండాలి.
10. సంపూర్ణ గమనంలో చైతన్యవంతంగా వుండాలి.

మానవజీవితం తప్పనిసరిగా జీవభావంతో ప్రారంభమవుతుంది. అయితే, జీవితం గడిచేకొలది జీవభావాన్ని తగ్గించుకుని, విశ్వవ్యాపిత భావనను అలవర్చుకోవాలి. అద్వైతమే ఆధ్యాత్మిక పరిణతికి విధానం. భగవంతుని స్థితికి చేరటమే స్వేచ్ఛకు సంకేతమవుతుంది. అందుకు భగవంతునికి సంబంధించిన

స్పష్టమైన అవగాహన వుండాలి. బంధాలే, బాధలకు మూలం. సంపూర్ణ స్వేచ్ఛే అన్ని సమస్యలకు శాశ్విత పరిష్కారం. అదే మానవ జీవితపరమార్ధం. బంధంతో, జీవభావంతో, జీవితం ప్రారంభమైనప్పటికీ అది స్వేచ్ఛతో, దివ్యత్వంతో అంతం కావాలి. అందుకు అంతరంగశుద్ధే అత్యంత కీలకం. సంస్కారశుద్ధి జరిగే కొలదీ, ఇక శరీరమే లేదు అనే భావన బలంగా వుంటుంది. శరీరాన్ని సమూలంగా కరిగించగలిగితే, ఆత్మకు చేరువ అయినట్లే. అటువంటి ఆత్మస్థితిని అందుకుని, మీ జీవితాలను పరిపూర్ణం గావించుకోవాలని ఈ ఆంజనేయుడు ఆశీర్వదిస్తున్నాడు. శ్రీరామ కటాక్ష ప్రాప్తిరస్తు! శుభం భూయాత్!

***దిగంతాల అంచులనే దాటినా, గ్రహగోళాలనన్నింటినీ మీటినా,***
***ఏమీ పట్టనట్లు ముక్కు మూసుకుంటివా?***
***పిచ్చిలేచినట్లు బూడిద పూసుకుంటివా?***
***అన్నింటా ఉన్నావని అందువా? ఎంత వెదికినా దొరకకుండెనా?***
***మహామాయకు లోబడి వున్నావేమో?***
***మిమ్ములను మాయలో ముంచాలనుకున్నాడేమో?***
***ఆ జ్ఞానప్రదాతయైన శివునికి మొరపెట్టుకో***
***ఏమని అని అన్నట్లయితే, నేను నా గొంతు చించుకుంటున్నా. నా బాధను నీవెరుగవా?***
***విషము దాచుకోవటం మా తరమా? అవయవాల పట్టు గుట్టు నాకు తెలుపవా?***
***పరమయోగివైన నీకసాధ్యమేమీ లేదు. తిరోగామిగా నన్ను చేస్తావా?***
***వినోదంగా నన్ను మారుస్తావా? నా బాధ నీకు విన్పించలేదా?***
***నా భావమేమిటో గుర్తించు మహేశా! విప్పి చెప్పు సర్వేశా!***
***అంటూ మీలోని అపశృతులను, ఆతురతను ఈ అంజనీపుత్రుడు జ్ఞప్తికి తెస్తూ,***
***జ్ఞానోదయమునకై, అబ్ధి లంఘించుటకై సహాయమందించమని మహేశ్వరుడ్ని ప్రార్థించి***
***అనుగ్రహప్రాప్తిని దోసిలి నిండా అందుకుని, అమరత్వాన్ని పొంది***
***ఆత్మభావనలో సుస్థిరంగా కొలువు తీరండి***
***నా చిన్నారి ముద్దుబిడ్డలారా!***

ఓం

**01-07-2019** 08:10 AM

**165)** భయాన్ని ఏ విధంగా అధిగమించవచ్చును స్వామీ?

అసూయ అనేది ఎప్పటికైనా చేటు కలిగించేదే. ఈ గుణం ఎవ్వరినీ అంత తేలికగా వదలదు. చివరకు, సర్వసంగ పరిత్యాగులైన సన్యాసులు కూడా దీని దెబ్బకు లొంగేవారే. అతడికి నాలుగు ఆశ్రమాలున్నాయి, నాకు ఒక్కటే. అతడి ఉపన్యాసాలకు లక్షలమంది వస్తారు, నాకు పదివేలమంది మాత్రమే వస్తారు. అతడికి కార్లు, శిష్యులు, టన్నుల కొద్దీ బంగారం, డబ్బు వుంది. నాకెంత వుందీ?

అని బాధ. భక్తులకు ఈ అసూయ ఉండరాదు. భయం అనేది అజ్ఞానం వల్లనే కలుగుతుంది. అజ్ఞానం తొలగితే భయం పోతుంది. ఒక పిట్ట రెపరెపలాడే కొమ్మపై కూర్చుంది. ఆ సన్నని రెమ్మ పిట్ట బరువుకు ఊగుతున్నది. ఆ ఊగే రెమ్మపై కూర్చున్న పిట్ట ఊగుతూనే వుంది గాని, భయపడటం లేదు. పైగా కేరింతలు కొడుతున్నది. ఎందుకంటే, అది రెమ్మపై ఆధారపడిలేదు. దాని రెక్కలపై ఆధారపడి వున్నది. రెమ్మ విరిగితే అది తుర్రుమంటుంది. మీరు కూడా ఈ సంసారమనే రెమ్మపై కూర్చున్నారు. ఇది అశ్వత్థం. ఎప్పుడూ ఊగేదే. మీకు స్వంతబలం లేదు. ఆత్మబలం లేదు. అందుకే భయం. ఎప్పుడు ఏమవుతుందో అని భయం. ఈ అనిత్యసంసారంపై దృష్టి పెట్టినంత కాలమూ భయమే. కానీ, నీవు పరమాత్మునిపై ఆధారపడ్డావా... ఇంక భయం లేదు. భక్తుడైనవాడు ఈ అనిత్యమైన ప్రపంచంపై ఆధారపడడు. నిత్య, సత్య పరమాత్మునిపైనే ఆధారపడివుంటాడు. మార్కండేయునిలాగా శివలింగాన్ని కౌగిలించుకుంటాడు. కనుకనే భక్తునికి భయం వుండదు. సాధారణంగా మీరు మీ చుట్టూ వున్న బాహ్య విషయాలతో సంబంధం పెట్టుకుంటారు. వాటి వల్లనే మీకు సంతోషం, సుఖం కలుగుతుందని భావిస్తారు. వాటిని సంపాదించుకోవాలని తపిస్తారు. వాటి కోసం ఎన్నో ప్రయత్నాలు చేస్తారు. ఇదే ఆపేక్ష. అందితే ఆనందిస్తారు, అందకపోతే దుఃఖిస్తారు. అయితే, భక్తుడైన వానికి ఆనందం బయట వస్తువుల ద్వారా రాదని, అది లోపలనుండే వస్తుందని తెలుసు. ఏ బాహ్యవస్తువునూ కోరడు. ఒక వ్యక్తి పేదరికంలో వున్నాడు. పూట గడవటం కూడా కష్టంగా వుంది. ఆయనను ఒకసారి వారి గురువు పిలిచి, "నీవు దరిద్రంతో సతమతమవుతున్నావు. భగవంతుని ప్రార్థించి నీ అవసరాలు తీర్చుకోరాదా?" అన్నాడు. దానికి ఆ వ్యక్తి, "గురూజీ! నాకు ఈ అభిప్రాయము ఇంతకు ముందే వున్నది. కానీ, అదేమి చిత్రమో తెలియదు. భగవంతుని ఎదుటికి పోగానే, నా దారిద్ర్యాన్నీ, నా కుటుంబాన్నీ, అసలీ ప్రపంచాన్నే మరచిపోతాను. భగవంతుడా! నాకు చలించని భక్తిని ప్రసాదించు అని వేడుకుంటాను. సంపదలను కోరాలనే అనిపించదు" అన్నాడు. అఖిలాండకోటి బ్రహ్మాండ నాయకుడైన పరమాత్మయే తనకు తల్లి, తండ్రి, ప్రభువు, ప్రాణరక్షకుడు అయివుండగా, ఆయనను ఇది కావాలి, అది కావాలి అని ఆటబొమ్మలను, చిలిపి కోరికలను, క్షుద్రభోగాలను ఎలా కోరుకుంటాడు? కల్పవృక్షం దగ్గరకు వెళ్ళి కాకరకాయలు కోరుకుంటాడా? అందుకే, భక్తుడైనవాడు అనపేక్షుడు. ఆపేక్ష లేనివాడై వుంటాడు. ఆ వ్యక్తే వివేకానందుడు!

**166) గురువు మరియు దైవం – వీరిలో ఎవరు ప్రధానం స్వామీ?**

గురువు – దైవం ఇద్దరిలో ఎవరికి ముందు నమస్కరించాలంటే, గురువుకే అని చెబుతాను. కేవలం గురువు సన్నిధిలో వినయంతో, తలవంచి అంటే అహంకారాన్ని వంచి, ఆయన దర్శనం చేసుకుంటే చాలు. గురువు ప్రధానం కాబట్టి, గురువుకే నమస్కరించాలని నేను చెప్పటం బట్టి, గురువు గొప్పదనం అర్థం చేసుకోవచ్చు. మట్టిముద్దలాంటి మనిషికి జ్ఞానముద్ర వేయటానికి, అజ్ఞానపు చీకటిలో వున్న వ్యక్తికి విజ్ఞానకాంతిని అందివ్వటానికి గురువే కారకుడు. అందుకే గురువు లేని విద్య గ్రుడ్డి విద్య. గురుసందేశంగా ఒకమాట చెబుతాను. దైవాన్ని దర్శించాలంటే, శమ, దమాదులు రెండూ వుండాలి. శమము అంటే అంతర్ఇంద్రియ నిగ్రహశక్తి. దమము అంటే బాహ్యఇంద్రియ నిగ్రహశక్తి. అవి వున్నాయా మీకు? మీకు భగవంతుడు దేహాన్ని ఇచ్చాడు. దేహం వుండబట్టే కర్మలు చేయగలుగుతున్నారు. కర్మలద్వారా

మనసును ప్రక్షాళన చేసుకొని, జ్ఞానం సంపాదించుకోగలిగితే, సత్యమైన భగవంతుడు మీకు దర్శనమిస్తాడు. అసలు భగవంతుడు సాకారుడు కాదే... ఎలా దర్శనమిస్తాడు మీకు? అందుకే, భగవత్తత్త్వాన్ని అర్థం చేసుకోండి ముందుగా. అప్పుడు భగవంతుడు అర్థం అవుతాడు. కర్మలద్వారా ఫలితాలు అంటే, చేసిన కర్మల ఫలితాలు మాత్రమే వస్తాయి. జ్ఞానం ద్వారా మాత్రమే, సత్యాన్ని అర్థం చేసుకోగలరు ఎవరైనా. అర్థం అయ్యిందా?

***లోకంలోని అంధకారాన్ని తొలగిస్తూ వెలుగునిస్తుంది సూర్యకాంతి***
***మనిషి మనసులోని అజ్ఞానాన్ని పోగొట్టి జ్ఞానాన్నిస్తుంది జ్ఞానజ్యోతి***
***మనిషిలో స్వార్థమూ, అహంకారమే అజ్ఞానం***
***ఆ అజ్ఞానాన్ని పోగొట్టేదే త్యాగశీలం***
***మనిషి మానవుడవ్వటానికి మార్గమే ఆ త్యాగశీలం***
***తోటి మానవుల అవసరాలను తీర్చే సహకారమే త్యాగం***
***త్యాగం, సహకారం కూడా నిస్వార్థంగానే చేయాలి***
***కీర్తికాంక్షతో చేసేదేదైనా స్వార్థమే అవుతుంది***
***మానవసేవయే మాధవసేవ అవుతుంది.***
***అలాంటి సేవయే ఇతరులకు ఆదర్శమవుతుంది***
***కాంక్ష, స్వార్థం, సహకార రాహిత్యం, అహంకారం మనిషిని మృగతుల్యులుగా చేస్తాయి.***
***మనిషి మృగత్వం నుండి మానవుడై, మానవత్వం కలిగి, దేవుడిగా పూజింపబడాలి.***
***అందుకే, తోటి మనిషిపై ప్రేమ, అనురాగం చూపి, వారికి సహకరించి, మానవత్వాన్ని చూపి***
***సద్గురువు చూపుతున్న మార్గంలో పయనించి,***
***ఈ పవనకుమారుడు మార్గదర్శకత్వం వహిస్తున్న గురుతర బాధ్యతను గుర్తించి***
***గురుతెరిగిన బిడ్డలుగా, ద్వారాల్లేని ఇరుకు మనసులను***
***ఆధ్యాత్మిక ద్వారాలు ఏర్పరుచుకుని***
***గడ్డి మేసి బలిసిన గొంతుక నుండి, గార్ధభస్వరం తప్ప, గంధర్వగానం వినిపిస్తుందా?***
***అన్నట్లు కాక, ఆంజనేయుని మనస్సునెరిగి, గంధర్వగానాన్ని వినిపించి విడుదల కోరండి***
***నా చిన్నారి ముద్దుబిడ్డలారా!***

ॐ

**02-07-2019** 08:10 AM

**167) భక్తులకు ముఖ్యముగా ఉండవలసిన లక్షణము ఏమిటి స్వామీ?**

భక్తుడు ఎప్పుడూ దృఢనిశ్చయుడై వుండాలి. సంశయాలతో, సందేహాలతో వుండకూడదు. భగవంతుని చేరుకోవాలంటే, దృఢనిశ్చయం కలిగి వుండాలి. మీకు లౌకిక ప్రపంచంలో వ్యవహరించేటప్పుడు అనేకమైన ప్రాపంచిక ఆకర్షణలుంటాయి. భక్తుడైనవాడు, భగవంతుని కోసం, ఆయనను పొందటం

కోసం అన్నింటినీ వదిలివేస్తాడు. అన్ని సుఖాలను, భోగాలను వదిలి, కఠినమైన జీవితాన్ని అనుభవిస్తాడు. అయితే, మనసు భగవంతునియందు దృఢంగా నిలవనప్పుడు, ప్రపంచంలోని ఆకర్షణలు తమ వలను విసిరినప్పుడు, సామాన్యుడు తన నిర్ణయాలను వెనక్కు తీసుకుంటాడు. అలా వెనక్కు తీసుకునేవాడు, ఈ ప్రాపంచిక విషయాలలో చిక్కి, పతనమైపోతాడు. ఈ లోకంలో ఎన్ని ఆకర్షణలు వున్నా, ఎన్ని అవాంతరాలు, ఆటంకాలు వచ్చినా, ఎన్ని కష్టాలు వచ్చినా, భగవంతుని శరణు కోరి ఆయనను అందుకొనుటయే తన జీవితలక్ష్యం అనే భావనతో దృఢనిశ్చయంతో ఎవరైతే వుంటారో, వారే నిజమైన భక్తుడు, భగవంతునికి ప్రియమైనవాడు. అయితే, మీకూ దృఢనిశ్చయం వుంటుంది. ఎప్పుడూ? ఇలా వేదాంతాన్ని వినేటప్పుడో, మహాత్ములను సందర్శించినపుడో, ఆశ్రమ వార్షికోత్సవనాడో, ఏదైనా పెద్ద కష్టం వచ్చి, జీవితం మీద విరక్తి కలిగినపుడో, ఉపన్యాసాలు చెప్పేటప్పుడో, పూలదండ మెడలో పడి పూనకం వచ్చినపుడో, "ఏమైనాసరే భగవంతుని చేరుకోవాలి, మోక్షాన్ని పొందాలి. ఈ ప్రాపంచిక భోగాలతో నాకు పనిలేదు. ఇవేవీ నాతో వచ్చేవి కావు" అన్న దృఢ నిర్ణయాన్ని, గట్టి నిర్ణయాన్నే తీసుకుంటారు, ప్రకటన చేసేస్తారు. అయితే, కాస్త ఆవేశం తగ్గితేనో, కడుపు మాడుతుంటేనో, ఇతరులు తనకన్నా భోగాలను అనుభవిస్తూ వుంటేనో, తనకన్నా అధికంగా ధనం, సంపదలు కలిగి వుంటేనో, కష్టాలు దుఃఖాలు వెంటపడి తరుముతూ వుంటేనో... మీరు తీసుకున్న నిర్ణయాలన్నీ గాలికిపోతాయి. "ఆ... కడుపు నిండిన తర్వాతేనండీ, భగవంతుడు!" అని తీర్మానం చేసేస్తారు. ఇలా ఊసరవెల్లిలాగా రంగులు మార్చేవారు ఎప్పటికీ భక్తులు కాలేరు. అతడు భగవంతునికి భక్తుడు కాలేడు – పరిస్థితులకు భక్తుడు అవుతాడు. ఒక రాజుగారి ఆస్థానంలో ఒక ఆంతరంగికుడు వుండేవాడు. బహుచమత్కారి. మాటలలో నేర్పరి. సమయస్ఫూర్తి గలవాడు. మహా తెలివితేటలు గలవాడు. అతడెప్పుడూ రాజుగారిని అంటిపెట్టుకుని వుండి, అన్ని విషయాలలో ఆయనకు తోడుగా, నీడగా వుండేవాడు. వుండటమే గాక, ఆయనకు వినోదం కలిగిస్తూ వుండేవాడు. ఒకరోజున వంటవాడు వంకాయకూరను భలే బ్రహ్మాండంగా చేశాడు. రాజుకు కూర బాగా నచ్చింది. భలే మజాగా వుంది. మళ్ళీ మళ్ళీ పెట్టించుకుని భుజించాడు. కడుపు నిండా తిని బ్రేవ్‌మని త్రేన్చుతూ, బయటకు వచ్చిన తర్వాత ఆంతరంగికుడితో, "కూర బ్రహ్మాండంగా వుందయ్యా! ఎంత తిన్నా, ఇంకా ఇంకా తినాలనిపించింది. అసలు వంకాయ లక్షణం ఎలాంటిదంటావు?" అన్నాడు. "ప్రభూ! చెప్పేదేముంది? వంకాయవంటి కూర శంకరుని వంటి దైవం మరిలేరు అనేది లోకమంతా ప్రసిద్ధే కదా! కాయగూరల్లో ఏదైనాసరే, వంకాయ తర్వాతనే అంటే నమ్మండి!" అన్నాడు. అలా సందర్భోచితంగా యుక్తియుక్తంగా చెప్పేటప్పటికి ఎంతో ఆనందించాడు రాజు. నాల్గురోజులు గడిచాయి. చక్రవర్తిగారికి వంకాయ కూరంటే భలే ఇష్టపడుతున్నాడు కదా అని వంటవాడు, ప్రతిరోజూ వంకాయకూరను చేస్తున్నాడు. రోజూ అదే కూర తినేటప్పటికి రాజుకు మొహంమొత్తింది. ఆ రోజున బయటకు వస్తూ మళ్ళీ ఆంతరంగికునితో రాజు, "వంకాయ లక్షణం ఎలాంటిదంటావు?" అని అడిగాడు. అతను వెంటనే రాజు ముఖంలోకి చూచి, "రాజా! వంకాయ ఒట్టి పనికిమాలినది. ఏ వైద్యుడ్ని అయినా అడగండి, ముందు నిషేధించేది వంకాయే. అందుకే, అవి మార్కెట్లో కారుచౌకగా అమ్ముతుంటారు" అన్నాడు. వెంటనే రాజు విస్మయం చెందాడు. "ఏమయ్యా! మొన్న అడిగితే అలా చెప్పావు, ఈరోజు అడిగితే ఇలా చెబుతున్నావు?" అన్నాడు రాజు. దానికి ఆంతరంగికుడు, "రాజా! నేను మీకు జీతగాడ్ని. వంకాయకు కాదు గదా!" అన్నాడు.

వంకాయ ఎప్పుడూ ఒక్కటే. అయినా దానిని తిన్న ప్రభువు యొక్క మనసును బట్టి వంకాయ లక్షణం మారిపోయింది. పరిస్థితులను బట్టి మీరు కూడా నిశ్చయాలు మార్చుకుంటారు. ఇక్కడున్న గంటసేపూ "భగవంతుడ్ని అందుకోలేని జన్మ ఎందుకు? ఎన్నాళ్ళు ఇలా బ్రతికినా, చివరకు అన్నీ వదిలిపోవాల్సిందే కదా!" అని అనుకుంటారు. ఇంతలో సెల్‌ఫోన్ మ్రోగుతుంది. అంతే! "ఆ... ఉన్న నాలుగు రోజులూ ఏమీ అనుభవించకుండా బండరాయిలా బ్రతికే బ్రతుకు కూడా ఒక బ్రతుకేనా?" అనుకుంటారు. దృఢనిశ్చయం అనేది వుండదు. దృఢనిశ్చయమే కాదు, అసలు నిశ్చయమే వుండదు. "పురమే లేనివారికి అంతఃపురమా?" అన్నట్లు, నిశ్చయమే లేనివారికి దృఢనిశ్చయమా? నిశ్చయం ఎలా వుంటుంది? ఒకసారి ఆత్మనిశ్చయం, బ్రహ్మనిశ్చయం, ఈశ్వరనిశ్చయం చేశారంటే, ఇక దానికి తిరుగుండకూడదు. ఇదే నా బిడ్డలుగా నేను మీ నుంచి ఆశించేది. ఆశించడం ఆంజనేయుని తత్త్వం కాకపోయినా, గురువుగా సద్గురువుగా సాహసం చేసి ఆశిస్తున్నాను అందిస్తారన్న నమ్మకంతో. ఆ నమ్మకాన్ని ఒమ్ము చేయకండి.

***ఎంతో సుదీర్ఘకాలం తర్వాత, ఎన్నో దూర ప్రయాణాల తర్వాత నీవు తెలుసుకుంటివి.***
***అదేమిటంటే, నీవే నిజమని!***
***ఎలా తెలుసుకున్నావు?***
***నీ మనసులో మనసునైతిని, నీ వెలుగులో వెలుగునైతిని***
***నీ గానంలో రాగమునైతిని, నీ పదములలో అక్షరమునైతిని***
***నీ సుఖములో జోడునైతిని, నీ దుఃఖములో తోడునైతిని***
***కానీ,***
***ఇప్పటికీ, సాటి మనిషిలో మనిషిని కాలేకపోతున్నా,***
***మనిషిని మనిషిలా ప్రేమించలేకపోతున్నా,***
***ఈ మానవ దౌర్భాగ్యాన్ని, పురుషార్థాల దౌర్జన్యాన్ని జయించలేకపోతున్నావు***
***ఏదో స్వార్థంతో, అహంతో, ఏదో అర్థంతో, ఏదో అభావంతో***
***తృప్తి రాక, తృప్తి లేక, నమ్మలేక, నిరంతరం దేన్నో వెదుకుతూనే వున్నావు.***
***అసలే అంధుడివి.***
***నీవున్న అంధకారంలో నుండి ఒక్కసారి అన్నింటినీ వదులుటకై***
***భగవంతుడా! నన్నీ అన్వేషణ నుండి, ఈ ఆలోచనల నుండి మరల్చు నేడు***
***అంటూ, ఆంజనేయుని ప్రబోధలతో అంతరంగాన్ని శుద్ధి చేసుకుని***
***సూక్ష్మమైన దానిని బరువుగా చేసుకోకండి***
***నా చిన్నారి ముద్దుబిడ్డలారా!***

ॐ

**03-07-2019** 08:05 AM

**168)** సాధకుడు తన లోపాలను ఏ విధంగా భావించాలి స్వామీ?

మీలోని లోపం చిన్నదైనా, పెద్దదైనా పరిగణనలోనికి తీసుకోదగింది. పైకి కనిపించనంత చిన్నదైనా, దానిని పరిగణనలోనికి తీసుకోకపోతే, భారీమూల్యం చెల్లించవలసివస్తుంది. పడవకు ఒక వైపున చిన్న కన్నం పడింది. బొట్టు బొట్టుగా నీరు లోపలకు ప్రవేశిస్తుంది. అంతే తప్ప మరే ఇబ్బందీ లేదు. అయినా, అలా విడిచిపెట్టకుండా వెంటనే సవరించాలి. లేకపోతే, క్రమంగా అది పెద్ద రంధ్రంగా మారి, పడవనే ముంచేసే ప్రమాదం వుంది. కాబట్టి, ముందుగానే తేరుకోవాలి. జాగ్రత్తలు తీసుకోవాలి. ఎందుకంటే, శాఖోపశాఖలుగా విస్తరించి, మహావృక్షం అనిపించుకున్న మర్రిచెట్టు విత్తనం చిన్నదిగానే వుంటుంది. అందుకే పెద్దమర్రిచెట్టుకి విత్తనం ఎంత చిన్నదో, అలాగే చిత్తశుద్ధితో చేసేపని కొంచమైనా, దాని ఫలితం గొప్పది. ఆధునిక, ఆధ్యాత్మిక, సామాజిక అంశాలన్నింటిలోనూ ఈ విషయానికి ఎన్నో ఉదాహరణలు వున్నాయి. "చిన్న పామునైనా పెద్ద కర్రతో కొట్టాలి" అనే సామెత వినే వుంటారు. అలా అనడానికి మూలకారణం ముందుజాగ్రత్తే. పాము చిన్నది కదా అని చిన్న కర్ర తెస్తే, ఆ పాము బలమైనదైతే, కర్రశక్తి చాలకపోవచ్చు. అప్పుడు ఇబ్బందులు పడవలసిన పరిస్థితి నెలకొంటుంది. కాబట్టి, ముందుజాగ్రత్త అవసరం. ఒక వ్యక్తి గురువుగారి ప్రసంగాన్ని వింటున్నాడు. ఆ ప్రసంగం అహింస గురించి. అదే సమయంలో వ్యక్తి మీద దోమ వాలింది. అతను దాన్ని చంపాలనుకున్నాడు. అంతలోనే గురువు చెబుతున్న విషయం గుర్తుకు వచ్చి ఆగిపోయాడు. ఆ భావం గ్రహించిన గురువుగారు "దోమను భౌతికంగా చంపకపోయినా, మానసికంగా చంపేశావు. కావున, అదీ హింస క్రిందే లెఖ్ఖ" అన్నారు. కాబట్టి, మనసును నియంత్రించుకోవడం అంటే, మనసులోకి చెడు ఆలోచనలు రానివ్వకుండా చూచుకోవడమే. బలి గొప్ప చక్రవర్తే గాని, "నా అంతటివాడు లేడు" అనే అహంకారం అంతర్గతంగా వుంది. ఐనా, బయటపడేవాడు కాదు. ఆ చిన్న లోపమే విష్ణువు చేత అవతారం ఎత్తించటానికి కారణమై, ఆయన చేత అణగద్రొక్కబడే పరిస్థితి తటస్థించింది, కల్పించింది అని చెప్పవచ్చు. వాలి గొప్పవీరుడు. కానీ, కామం, క్రోధం అనే లోపాలవల్లే నశించాడు. అవి అయినా, కొద్ది మోతాదులోనే వుండేవి. అవే అతని వినాశనానికి దారితీశాయి. రామకృష్ణపరమహంస విరాగిగా, నిర్వికల్పసమాధి గురించి బోధన చేశాడు. ఆ బోధ విన్న వివేకానందుడు, "నేను సన్యసించి ఈ అనుభూతితో జీవితాన్ని ప్రశాంతంగా గడిపేస్తాను" అంటాడు. ఆ మాట విన్న రామకృష్ణుడు "నీ ఒక్కడి సుఖం చూచుకోవడం చిన్న విషయం. ఇతరుల కోసం పాటుపడటం పెద్ద ప్రయోజనం. కాబట్టి, చిన్న విషయాలని జీవితప్రయోజనంగా మార్చుకోకుండా, ప్రజలందరకూ మేలు చేసే పనులు చేయమని" ఆదేశించాడు. ఒక శిల్పి చాలారోజులు కష్టపడి 100 అడుగుల విగ్రహాన్ని చెక్కాడు. దానిని నిలబెట్టే సమయం ఆసన్నమైంది. చివరిసారిగా పరీక్షించిన అతడికి ఆ శిల్పం ముఖభాగంలో చిన్నలోపం కన్పించింది. అది మామూలుగా చూచినా ఇతరులు ఎవ్వరూ కనిపెట్టలేరు. కానీ, ఆ శిల్పి ఆ విగ్రహాన్ని నాశనం చేయటానికి సిద్ధపడ్డాడు. ఆ విషయం గ్రహించిన కొడుకు "ఉన్నది అతి చిన్నలోపం. ఈమాత్రం దానికి ఇన్నాళ్ళ శ్రమ వృధా చేస్తావా? అయినా, అది ఇక్కడ వున్నప్పుడే ఎవరూ గుర్తించలేదు. అలాంటిది అంత ఎత్తుకు వెళ్ళిపోయాక దానిని ఎవరు గుర్తిస్తారు?" అని అడిగినాడట. ఆ మాటకు శిల్పి "ఎవరు చూచినా చూడకపోయినా, గుర్తించినా గుర్తించకపోయినా ఆ చిన్నలోపం నాకు మాత్రం నిత్యం కనబడుతూనే వుంటుంది" అని అన్నాడు. ఆధునిక కాలంలోనూ, ఈ చిన్న లోపాలను పట్టించుకునే ఆచారం వుంది. పేరున్న పెద్ద కంపెనీలో

ఉత్పత్తుల నాణ్యత పరిశీలించే విభాగం వుంటుంది. కంపెనీలో తయారైన వస్తువుల్లో దేనికైనా, ఏ చిన్నలోపం వున్నా, అమ్మకానికి అనుమతించరు. అతిసూక్ష్మ లోపాలైతే మాత్రం రెండవరకం వస్తువులుగా ముద్రవేసి ధర బాగా తగ్గించి అమ్మకానికి పెడతారు. వాళ్ళు అలా చెయ్యకపోయినా, కొనుగోలుదార్లు దానిని కనిపెట్టలేరు. కానీ, కంపెనీవారు వారి పేరు నిలబడాలంటే ఆ జాగ్రత్త చర్యలు అవసరం. అలాగే, దేనికైనా చిన్నవిషయం అని ఏ మాత్రం అలసత్వం చూపించినా, ఫలితాలు మరోలా వుంటాయి. ఋణశేషం, అగ్నిశేషం, శత్రుశేషం వుండకుండా పూర్తిగా తీర్చేసుకోవాలి. ఈ ఆంజనేయుని ఋణం కూడా తీర్చుకోవాలి. మీలోని ప్రతి సద్గుణం ఈ ఆంజనేయుని ఋణం తీరుస్తున్నట్లే. కానీ, నేను ఊహించినంతగా నా లెఖ్ఖలో జమ కావటం లేదు. బాకీ తీర్చుకోవటం కోసం వెంటపడాలి గదా! వెంటపడ్తాను. మీరు తిట్టినా, అసహ్యించుకున్నా, లెఖ్ఖ చేయకపోయినా, ఇచ్చినవాడిని కదా, పుచ్చుకొనటానికి వాటిని చాలా ప్రేమగానే స్వీకరిస్తాను. నాకు కావలసింది మీలోని మార్పు. ఆ మార్పు, ఈ కూర్పు వల్లనే వస్తుంది. అందుకే చిన్నగా ఉన్నప్పుడే దేన్నయినా సరిచేయండి. పెద్దదిగా మారాక, సరిచెయ్యలేకపోవచ్చు. చిన్నగా వున్నదానిని గోటితో సరిచేయవచ్చు. పెద్దదైతే, గొడ్డలి అవసరమొస్తుంది.

***సాధిస్తే, చందనపు ముక్క ఇస్తుంది సుగంధం***
***సాధన చేస్తే, ప్రతి మనిషికీ విజయం సొంతం***
***కృషి వుంటే మనుషులు ఋషులవుతారు అన్నది సత్యం***
***సాధనంబున పనులు సమకూరు ధరలోన అన్నది తెల్సిందే***
***వేప తినటం అలవాటైతే, చేదే కదా తియ్యదనం***
***ఆలోచనకు విశ్లేషణ తోడైతే జీవితం అమృతతుల్యం***
***వటవృక్షం కావటానికి విత్తే కదా మూలం***
***చరిత్ర సృష్టించడానికి గమ్యాన్ని ఛేదించటం కదా ముఖ్యం***
***ఇందుకు కావాలి మహానుభావుల జీవితాలు మీకు ఆదర్శం***
***చిన్న ఆలోచనను చిలికితే, గొప్ప ఫలితం***
***ఆవేదన నుంచే కదా ఆలోచన,***
***ప్రేరణ నుంచే కదా విశ్లేషణ,***
***తపనే గమ్యాన్ని ఛేదించే విలక్షణమైన గుణం***
***గమనమే కదా గమ్యానికి ప్రేరణ***
***మౌనంతోనే ప్రతి మనిషి మునీశ్వరుడు***
***ధ్యానంతో ప్రతి ఒక్కరూ పరమేశ్వరుడు***
***ఆటంకాలు ధీరుని విజయానికి సోపానాలు***
***సుఖదుఃఖాలు యోధునికి కావెప్పుడూ ప్రతిబంధకాలు***
***లక్ష్యాన్ని ఛేదించటమే విజయానికి ఓనమాలు***
***వినీలాకాశంలో విహరిస్తున్నారు పక్షిగా***

***సముద్రం లోతు తెలుసుకుంటున్నారు చేపలా***
***ఇవన్నీ మీ విజయాలకు చిహ్నాలు***
***బాధ్యతలు మరువకపోవటమే భోగవంతం***
***కష్టాన్ని సుఖంగా మలచుకోవటమే జీవితం***
***దేహం ఒక పరికరం. ఆత్మ దానికి చైతన్యం***
***ఆత్మావలోకంతో మిమ్మల్ని మీరు ఎందుకు తెలుసుకోలేరు అన్నది ఆంజనేయుని సంశయము!***
***ఈ సంశయాన్ని ప్రక్కకు నెట్టి, మోక్షసౌభాగ్యానికి దారి జ్ఞానమేనని గ్రహించండి***
***నా చిన్నారి ముద్దుబిడ్డలారా!***

# ఆంజనేయుని ప్రశ్నోత్తరములు

*1. దేవునికి హారతి ఇచ్చేటప్పుడు గంట ఎందుకు కొడతారు?*

**జ: దేవాలయం మూసేటప్పుడు, తెరిచేటప్పుడు, హారతి ఇచ్చేటప్పుడు గంట కొట్టాలి. దీని అర్థం ఆ దేవతను విగ్రహంలోకి ఆహ్వానించటమే.**

*2. పెద్దలు మీ తలపై అక్షింతలు వేస్తే ఏమవుతుంది?*

**జ: పెద్దలు మీ తలపై అక్షింతలు వేసినప్పుడు, వారి శక్తి మీకు వస్తుంది. మీ తలరాత కొంతవరకు మారుతుంది.**

*3. పాదయాత్ర చేస్తూ, భగవంతుని దర్శనం చేసుకుంటారు ఎందుకు?*

**జ: శనికి నడక అంటే ఇష్టం, చాలా ప్రీతి. అందుకే ఎక్కువ ప్రదక్షిణలు చేస్తే, శని అనుగ్రహం వుంటుంది. అందుకే కొంతమంది రాజకీయ నాయకులు పాదయాత్ర చేసి ముఖ్యమంత్రులవ్వటం చూసే వుంటారు.**

*4. మీరు ఏ దిశలో తల పెట్టుకుని నిద్రించాలి? మిగతా దిక్కుల్లో ఎందుకు పెట్టుకోకూడదు?*

**జ: మీరు ఉత్తర, దక్షిణ దిక్కుల్లో తల పెట్టుకుని పడుకుంటే, అయస్కాంత తరంగాలు మీ మెదడులోని శక్తిని తగ్గిస్తాయి. అందుకే తూర్పు, పడమర దిశగానే నిద్రించాలి.**

*5. తులసి చెట్టు వల్ల ఉపయోగాలేమిటి?*

**జ: తులసి చెట్టు వున్న ఇంటికి భూత, ప్రేత, పిశాచాలు రావు. పురుగూపుట్ర తిరుగదు. ఈ చెట్టు 24 గంటలు ఆక్సిజన్‌ను ఇస్తుంది. క్షీరసాగర మథనంలో జన్మించిన చెట్టు, తులసి.**

*6. మీరు తెలుసుకోవలసింది లేనిది ఎప్పుడు?*

**జ: ఆత్మబోధ తర్వాత తెలియవలసింది ఏదియునూ లేదు. బాహ్యజగత్తు మాయయే. సత్పదార్థము మీ శరీరములో ఆత్మ రూపమున వున్నది. దానిని తెలుసుకొనుటయే సద్దర్శనము – ఈశ్వరదర్శనం. దాంతో, మానవజీవితపు మూలోద్దేశ్యము పూర్తి అవుతుంది.**

7. *శరీరాన్ని, మనసును సాధనకు సంసిద్ధం గావించటమెలా?*

**జ: అందుకు వ్యక్తిగత జీవితం, జీవనవిధానం స్వచ్ఛంగా, నియమబద్ధంగా, క్రమశిక్షణతో వుండాలి.**

8. *చచ్చిన తర్వాత కట్టెలతో కాలుస్తారు గనుక, దహించబడేది అన్నారా? మరి కొందరి దేహాలను కట్టెలతో కాల్చరు గదా? అవి దహింపబడవు గదా? మరి వాటిని దేహాలు అనరా?*

**జ: చనిపోయిన తర్వాత దహింపబడటం కాదు. జీవించి వున్నప్పుడే తాపత్రయాలనే అగ్ని చేత నిరంతరం దహించబడుతూ వుండేదే ఈ దేహం. ఆదిదైవిక, ఆదిభౌతిక, ఆధ్యాత్మిక తాపాలే, తాపత్రయం.**

9. *తిరుమల లడ్డు ఎందుకు అంత రుచిగా వుంటుంది?*

**జ: తిరుమల లడ్డు అంత మధురంగా వుండటానికి కారణం, ఆలయంలో వున్న బంగారు బావి నీటితో చేయడమే. ఈ నీటిలో అద్భుతమైన వనమూలికలు వున్నాయి.**

ఓం

**04-07-2019** 08:30 AM

**169) మనోబలం ఎలా చేకూరుతుంది స్వామీ?**

*మనిషికి మనోబలమే దివ్యౌషధం అవుతుంది. మనసు బలహీనంగా వుంటే, ఆహారం విషంగా మారుతుంది. మనోబలముంటే, ఎటువంటి ఆహారమైనా సులభంగా జీర్ణమవుతుంది. అటువంటి మనోబలం చేకూరాలంటే, అంతరంగశుద్ధి జరగాలి. చెడు సంస్కారాలు తొలగిపోయి, ఉత్తమ సంస్కారాలను పెంపొందించుకోగలగాలి. మనోబలాన్ని పెంపొందించుకోవడానికి చెడు సంస్కారాలను సమూలంగా తీసివేసుకోగలగాలి. అందుకు జీవితంలో కష్టాలు, నష్టాలు, బాధలు, ఇబ్బందులు, ఓటములు, వైఫల్యాలను చవిచూస్తూ వుండాలి. అన్ని రకాల సమస్యల నుండి బయటపడిన వారికే అపారమైన జీవితానుభవం సమకూరుతుంది. వాస్తవానికి అనుభవాన్ని మించింది ఏముంటుంది? అనుభవించింది ఏదైనా సత్యం అవుతుంది. మిగిలినదంతా ఊహగా మారుతుంది. ఊహ అనేది వాస్తవం కావచ్చును గానీ, సత్యం కాదు. మనస్సుకు నిరోధకశక్తి పెరగాలంటే సమస్యలను, కష్టాలను కోరుకుంటూ వుండాలి. దాని వలన, మీలోపల వున్న చెడు అంతా ఖర్చయిపోతుంది. తమో, రజోగుణాలు బలహీనపడి, రెండూ సమానస్థాయికి చేరి, అదే సత్త్వగుణంగా రూపాంతరం చెందుతుంది. మనసును కష్టపెట్టడమే అసలుసిసలైన సాధన అవుతుంది. సమస్యలను అధిగమించగలిగితేనే ఇతరుల మీద ఆధారపడకుండా జీవించగలుగుతారు. అదే మోక్షం, అదే ముక్తి. ఎన్ని కష్టాలు వచ్చినా పాండవులు ఎంత శక్తిమంతులు, యోగ్యవంతులు అయినప్పటికీ, జీవితాంతం కృష్ణునిపట్ల విధేయతతో ఆరాధిస్తూ వచ్చారు. అదే, కౌరవులు అరిషడ్వార్గాలకు లోనై, ఆయనపట్ల ఆరాధనాభావం లేకుండా, వినాశనాన్ని కొనితెచ్చుకున్నారు. అందుకే, ఈ రోజుల్లో కష్టాలకు కారణభూతమైన, ప్రతిమానవుడ్ని పట్టి పీడించే ఈ అరిషడ్వర్గాల గురించి తెలుసుకోవటం మంచిది.*

మొదటిది కామం:– సీతామాత స్వయంవరంలో శ్రీరాముడు శివధనుస్సు ఎత్తినప్పుడు చూచిన రాముని పరాక్రమాన్ని గురించి తెలిసినా, కామం వల్లనే తన మరణాన్ని కొనితెచ్చుకున్నాడు రావణాసురుడు.

రెండవది క్రోధం:– పాండవుల కీర్తి పరాక్రమాల వల్ల అసూయ చెంది, ఈర్ష్యతో కూడిన క్రోధం వలన, కులనాశనానికి కారణభూతుడైనాడు దుర్యోధనుడు.

మూడవది లోభం:– కృష్ణుని చిన్ననాటి స్నేహితుడు సుధాముడు ఆకలి బాధ చేత శ్రీకృష్ణునికి ఇవ్వవలసిన అటుకులను సహితం, తాను భుజించి, కృష్ణునితో పంచుకోవల్సి వస్తుందేమో, తనకు లేకుండాపోతుందేమో అన్న భయంతో లోభత్వంతో ప్రవర్తించి, ఎన్నో ఏళ్ళు కటిక దారిద్ర్యాన్ని అనుభవించవలసి వచ్చింది.

నాల్గవది మోహం:– భారతయుద్ధంలో తాత ముత్తాతలు, బంధువర్గంపై మోహావేశుడై, అస్త్రసన్యాసం చేసి విలపించాడు అర్జునుడు. ఈ మోహం వల్ల భగవంతుని మాట సులువుగా వినక, వేదాంత సారాన్ని తెలుసుకున్నాక, తర్వాత చివరకు విన్నాడు.

ఐదవది మదం:– వాలి, సుగ్రీవుని కన్నా శక్తిమంతుడైనప్పటికీ, శ్రీరాముని దైవశక్తిని గుర్తించలేకపోవటానికి కారణం, అతని మదం వల్లనే.

ఆరవది మాత్సర్యం:– ధృతరాష్ట్రుడు రాజ్యాన్ని, చనిపోయిన తన తమ్ముడి పిల్లలకు పంచకుండా, తారతమ్యం చూపిస్తూ మాత్సర్యం వలన బాధలకు లోనైన విషయం మీకు చరిత్ర చెబుతూనే వున్నది.

ఇప్పుడు నేను చెప్పిన సంఘటనలన్నీ మహాశక్తిమంతులు, మహానుభావుల ఉదాహరణలే. అంతటివారే అరిషడ్వర్గాలకు దాసులయ్యారంటే, ఇక సామాన్యులైన మీరు ఈ ఆరు గుణాలని పట్టుకుని భగవంతునికి ఎలా ప్రీతిపాత్రులవుతారు? అందుకే, మీ మనస్సుతో, మిమ్మల్ని మీరే ఉద్ధరించుకోండి. భగవంతుని సన్నిధిలో గాని, ఏకాంతంలో వున్నప్పుడు గానీ, విశ్రాంతిలో గానీ ఎవరికి వారు తమను గురించి నిష్పక్షపాతంగా సమీక్షించుకోవాలి. ఆత్మవిమర్శ చేసుకోవాలి. మీలోనే అంతర్గతంగా మీ మిత్రుడు వున్నాడు, మీ శత్రువు వున్నాడు. ఇతరుల అవసరం లేకుండానే మీకు మార్గదర్శనం చేసేది మీ మనస్సాక్షే. మీ ప్రమేయం లేకుండా మీ మనసును ప్రభావితం చేయలేరు. భగవంతునిపట్ల, పైన ఉదహరించిన సంపూర్ణ శరణాగతికి ఇదొక్కటే మార్గం. ఈ అరిషడ్వర్గాలను వదిలేసి, సంపూర్ణ శరణాగతి చేసినవారిలో అహంకారం లేశమాత్రం కూడా వుండదు. మనోపవిత్రత లేనిచోట భక్తి వుండదు. భక్తి లేక, పవిత్రత సిద్ధించదు. సత్కర్మలను ప్రోత్సహించే సత్పురుషుల వెంట భగవంతుడు వుంటాడు. ప్రతి మనిషిలోనూ అపరిచితుడై వుంటాడు. కర్త, కర్మ, క్రియ ఈ మూడింటికీ మూలం అతడే. ఆ ఎరుక కలిగివుంటే దుష్కర్మలకు తావే లేదన్నది ఈ ఆంజనేయుడు చెప్పదల్చుకున్న విషయం. తెలుసుకుని అనుభవించావా... అదే జ్ఞానము. తెలుసుకోలేకపోయావా... అదే అజ్ఞానము. ఆ జ్ఞానమే ఆంజనేయుడు!

**పూర్ణమది, పూర్ణమిది.**

**అట్టి పూర్ణమందు, పూర్ణమును తీసినా, కూడినా, చివరన పూర్ణమే మిగులును.**

**పరిపూర్ణమైన పూర్ణమే జనించి, అది సంపూర్ణమగును.**

***ఈ జగత్తు ఈశునిదే. ఇహము, పరము అతని రూపమే.***
***జ్ఞానికి సత్యము ఒక్కటే - శోకమైనా, ఆనందమైనా***
***సుందరమగు పరమసత్యమై పరమాత్మ ప్రబలుచుండు,***
***నామ రూప క్రియారహిత నాథుడతడు,***
***సర్వమీశ్వర కల్పిత జగమిదియని, ఏదియును నాది కాదని ఎరుకతోడ***
***ఆత్మరక్షణ చేకొని, ఆచరించుచుండు***
***కపటమెరుగని కర్మయోగిగా అందరూ మెచ్చే అజాతశత్రువుగా,***
***నీతి నిజాయితీలకు నిలువెత్తు మనిషిగా, తన అభివృద్ధికై అహరహము శ్రమించి,***
***జీవితాన్ని జగన్నాథునికి ధారపోసి, అందరి మన్ననలు పొంది***
***అపరయోగులుగా, సమున్నత విలువల సత్వాలనకై,***
***ఆత్మీయ చిరునగవే ఆభరణమై,***
***ఆంజనేయుని మాట సూక్తిసుధయై,***
***అపరనమ్మకంతో అడుగులు వేస్తూ, మిమ్మల్ని మీరు మరువక,***
***మానవత నడుమ మహోన్నత చరితులై, సంచరించండి***
***సంకటమోచనుని చిన్నారి ముద్దుబిడ్డలారా!***

ॐ

**05-07-2019** 08:10 AM

**170) ఆత్మజ్ఞానము ద్వారా చేకూరే ప్రయోజనము ఎట్టిది స్వామీ?**

"నేను జీవిస్తున్న జీవనవిధానం సక్రమంగా లేదు. నాకు ఇంకా ఏదో కావాలి" అనే భావన వుందంటే, మీకు అంతరంగంలో అసంతృప్తి వున్నట్లే. కోరిక బలీయంగా ఉన్నట్లే. ఏదో సాధించాలి అనే తపన, ఆరాటం ఎక్కువగా వున్నట్లే. అటువంటివారే ఉన్నదానిని వ్యతిరేకిస్తూ, మరొకదానిని కావాలని కోరుకుంటారు. మనసులో అన్వేషణ మొదలైందంటే, మనిషి వర్తమానాన్ని కోల్పోతున్నట్లే. కళ్ళు తెరచి చూస్తున్న ప్రపంచాన్ని వ్యతిరేకిస్తూ, కళ్ళు మూసుకుని ఏదో పొందాలన్న భావన కలుగుతుందంటే, అది అసంతృప్తికి మూలమవుతుంది. ఆది-అంతము లేని అనంతమైన దానిని గురించి తెలుసుకుంటే, మీ జీవిత పరమార్థము నెరవేరినట్లే. ఆనందం అనేది వర్ణించేది, వివరించేది, బయటకు నిరూపించేది కాదు. కానేకాదు! ఎవరైనా "నేను ఆనందంగా జీవిస్తున్నాను" అని చెబుతున్నా, భావిస్తున్నా అది పూర్తిగా అవాస్తవమే. విశ్వం ఏ విధంగా అనంతమైనదో, ఆనందం కూడా అంతము లేనిది, కంటికి కన్పించేది, నిరూపించేది కాదు. ఇంద్రియగోచరం కాని దానిని అవగాహన గావించుకుని, అనుభవంలోకి పొందగలిగితే, ఇక మీ జీవితం సార్థకమైనట్లే. అందుకు ఆత్మను గురించిన విషయపరిజ్ఞానం తెలిసి వుండాలి. ఎవరైతే, ఆత్మస్థితికి చేరుతారో, వారు విశ్వంలోని రహస్యాలనన్నింటినీ ఛేదించగలుగుతారు. అందుకు భౌతికపరమైన అంశాలపట్ల కూడా స్పష్టత వుండాలి. మీరు దేనిని గురించి అయితే

తెలుసుకుంటున్నారో, దానిని సమాచారం అంటారు. అది ఆలోచనల పరంపరే. అటువంటి ఆలోచనలన్నీ ప్రాణశక్తియొక్క రూపాంతరమే. అటువంటి ప్రాణశక్తికి ఆధారం శుద్ధచైతన్యమే. అటువంటి శుద్ధచైతన్యాన్ని గురించి అవగాహన చేసుకోగలిగితే, అనంతమంతా తెలిసిపోతుంది. అదే మానవజీవిత పరిపూర్ణత్వానికి నిదర్శనమవుతుంది. ఈ భూమండలమంతటిలో దానిని ఛేదించగల అవకాశం, అర్హత వున్న ఏకైక జాతి మానవుడే. అందుకు ఉపయోగపడే చక్కని రాచబాటే, ఆధ్యాత్మికత. ఆత్మను గురించిన అవగాహన కలిగితే, ఇక మీరు విశ్వంలో దేనిని గురించీ తెలుసుకోవలసిన అవసరం లేదు అనే స్థితికి చేరారంటే, పరిపూర్ణత్వం సిద్ధించినట్లే.

***జీవితలక్ష్యం జీవనగమ్యం మోక్షమొక్కటే***
***మానవలక్ష్యం ముక్తి మాత్రమే... మరువకండి, ముక్తి మాత్రమే!***
***పాదాలు మీకు రెండున్నా, పయనాలు ఎన్నెన్నో,***
***కానీ, ఆ పయనాల గమ్యం పరమాత్మను చేరుటకే.***
***పరమత్మునిలో ఐక్యమొందుటకే అన్నది గుర్తించండి.***
***కనులు రెండైనా, కలలెన్నో వస్తాయి***
***ఆ కలలోనైనా కమలనాథుని కనుల నిండుగా కనవే మనసా***
***అని చెప్పండి మీకు చేతనైన రీతిలో***
***బాగుపరిచేది విచక్షణ, నష్టపరిచేది నిర్లక్ష్యము***
***అవసరం లేదు లక్షలు మీకు***
***విచ్చుకోవాలి అంతఃచక్షువులు అన్నది తెలుసుకోండి***
***మారితే అందుతుంది మోక్షము***
***లేకుంటే ఎదుర్కొంటారు పరీక్షలు***
***ఏ దేవుడూ కాడు ప్రత్యక్షము***
***నీకు నీవే దైవసాక్ష్యము అని ఈ ఆంజనేయుడు ఆత్మతత్త్వాన్ని బోధిస్తూ,***
***బోధించినదే బోధిస్తూ***
***మనిషి మనిషిలా నిలబడి మానవత్వానికి చిరునామాగా***
***చిరంజీవియైన హనుమ ముద్దుబిడ్డలుగా ఈ భువిపైన నిలవండి***
***నా చిన్నారి ముద్దుబిడ్డలారా!***

*ఈ ఆంజనేయుడు మీ వద్దకు వచ్చినది*
*తల్లిలాంటి శిక్షణ, తండ్రిలాంటి రక్షణ, ఇదే అందరికీ సంరక్షణ అని చెబుతున్నాను.*
*ఎందుకు వచ్చాను అనే ప్రశ్న మీరడిగారు కదా, అందుకే ఇది నా సమాధానం!*

ఓం

**06-07-2019** 09:45 AM

**171) లక్ష్యాన్ని సాధించుటకు మేము ఏ విధముగా వ్యవహరించాలి స్వామీ?**

*లక్ష్యాన్ని నిర్ణయించుకుని గమనాన్ని నిర్దేశించుకున్న ప్రతి ఒక్కరూ చేయవలసిన పని, సమయాన్ని సద్వినియోగం చేయటం. గడచిపోయిన కాలం తిరిగి రాదని గుర్తించి, ప్రతి క్షణాన్ని సక్రమంగా ఉపయోగించుకోవాలి. ప్రయోజనకరంగా తీర్చిదిద్దుకుని, ప్రగతికి సోపానంగా మలచుకోవాలి. అట్టివారే లక్ష్యసాధనలో విజేతలుగా నిలుస్తారు. ఆ మార్గంలోనే పయనిస్తే, మీరు ఎంచుకున్న రంగంలో రాణిస్తారు. మీలో చాలామంది ఉన్నత లక్ష్యాలను ఎంచుకుంటారు, పటిష్టమైన ప్రణాళికలను రూపొందించుకుంటారు. ఆచరణలో మాత్రం నిర్లక్ష్యం చేస్తారు. సమయపాలన వుండదు. చేయవలసిన పనిని అలసట, విసుగు, బోరు వంటి కారణాలతో వాయిదా వేస్తారు. చేద్దాంలే, చూద్దాంలే అన్న తీరున కాలాన్ని వెళ్ళబుచ్చుతారు. తీరా సమయం దగ్గరపడగానే, ఒత్తిడికి గురి అవుతారు. హడావిడి, హంగామాతో ఆదరాబాదరాగా పని పూర్తిచేసి, హమ్మయ్య అనుకుంటారు. చేసిన పనిలో విజయం సాధిస్తే అది తమ ప్రతిభకు నిదర్శనం అని చెబుతారు. అనుకున్న రీతిలో ఫలితం లేకపోయినా, అపజయం ఎదురైనా టైం సరిపోలేదు, ఇంకొంచెం టైం వుంటేనా... అంటూ దాటేయటానికి ప్రయత్నిస్తారు. ఎక్కువమంది నైజం ఇదే అయినా, విజయం సాధించాలని తపన పడేవారికి ఉండవలసిన లక్షణం ఇది కాదు. ఊహ మనిషికి ప్రేరణను ఇస్తుంది. ఆచరణ ఊహకు వాస్తవరూపం ఇస్తుంది. అందుకుగాను, ప్రతి సెకనుకు ఉన్న విలువ తెలుసుకోవాలి. సెకను తేడాతో ఎక్కవలసిన రైలు అందుకోలేకపోవచ్చు. పరీక్ష వ్రాసే అవకాశాన్ని జారవిడుచుకోవచ్చు. ఎన్నో అవకాశాలు సెకను వ్యవధిలో చేజారిపోవచ్చు. కాబట్టి, ప్రతి సెకను అమూల్యమైనదే. అమోఘమైన తెలివితేటలు ఎన్ని వున్నా, ఎన్నో నైపుణ్యాలు, మెళకువలు సొంతం చేసుకున్నా, కాలానికి విలువ ఇవ్వకపోతే, చేతికి వచ్చిన అవకాశం చేజారిపోవచ్చు. చేస్తున్న, చేయవలసిన పనిని వాయిదా వేయటానికి సహేతుకమైన కారణం వుండాలి. విసుగు, అలసట వంటి కారణాలతో ఆచరిస్తున్న ప్రణాళికను ప్రక్కన పెట్టకూడదు. అర్థంలేని భయాలను, అనుమానాలను విడనాడాలి. ఊహల పల్లకీలో విహరించటం మానుకోవాలి. మొహమాటాన్ని వదిలిపెట్టి, సున్నితంగా లేదు, కాదు అన్నది చెప్పటానికి అలవాటు పడాలి. అర్జెంట్ కాదులే, చేద్దాంలే, చూద్దాంలే వంటి మాటలను ప్రక్కనబెట్టి, ఏ సమయానికి చేయవలసిన పని ఆ సమయంలో చేయాలి. ఉన్న సమయాన్ని సరదాలకు, షికార్లకు ఎక్కువ కేటాయించకుండా, లక్ష్యసాధనకు ఖర్చు చేయాలి. జీవితమంటే, ఒక తియ్యటి కల. ఆ కలలోని అనుబంధాలు, ఆత్మీయతలు, చిన్నచిన్న సంతోషాలతో ముడిపడిన బంధం. ఊహల పల్లకీలో విహరించటం మానుకోవాలి. వాటినన్నింటినీ అనుభవిస్తూ, ఆస్వాదిస్తూ, ఆశయసాధన కోసం కృషిచేయాలి. తిరిగిరాని కాలం విలువను గుర్తించి, అనుకున్నది సాధించటానికి ప్రయత్నం చేయాలి. అసాధ్యమన్నది ఏదీ లేదు. వ్యక్తిగా మీరు గెలిస్తేనే, మీ చుట్టూ వున్నవారికి ఎప్పుడైనా, ఏదైనా ఇవ్వగలరు. ఈ సత్యాన్ని గుర్తించిన ప్రతి ఒక్కరూ ప్రతి సెకను, విలువైనదిగా భావిస్తారు. అట్టివారే విజయపథంలో ముందు*

వుంటారు. జీవితంలో ఏదైనా గెలవాలన్న తపన, గెలవగలననే నమ్మకం, గెలిచేందుకు కావలసినది నిరంతర సాధన. ఈ మూడే, మిమ్మల్ని గెలుపునకు దగ్గర చేసే మార్గాలు.

***ఆశలేమో ఎక్కువ అయినవి***
***అక్కర్లేని పనులాయే***
***ఆశ మొలకెత్తి మోడైపోయింది***
***బ్రతుకులేమో పాడైపోయినాయి***
***సెల్ నిండా హోళీ రంగులు***
***బుర్రలన్నీ బరువు బండలు***
***సమయమెంతో అమూల్యము***
***వృధా చేస్తే తప్పదు మూల్యము***
***లైక్ గొట్టే దోస్తులెందరో నెట్టులోన***
***నెట్టు తెరిచితే ఎందరో,***
***మూస్తే నీవు ఒంటరివే***
***ముక్కు మొఖము తెలియనోళ్ళు ఎందరుంటే ఏమి లాభము?***
***తెలిసినవాడు ఈ ఆంజనేయుడు***
***లేనివారిని ఊహించకు - తెలిసిన వారిని దూరముంచకు***
***నిజం తెలుసుకుని మసలుకోండి***
***ఆ నిజంతోనే సాగిపోవాలి.***
***బుద్ధిగా పదిమంది మెచ్చుకునేలా***
***నువ్వు కోరిన జీవితానికి స్వాగతం అని పలికి***
***ఆది అంతం - దైవసొంతం - తెలియకుంటే లేదు అర్థం***
***పోరాడి గెలిస్తేనే విజయం - ఇదియే జీవితసత్యం అని తెలుసుకోండి***
***ఆధ్యాత్మికతను అందుకోబోయే ఆంజనేయుని***
***నా ఈ చిన్నారి బిడ్డలారా!***

**కారు అంటే జీవితములో**

**కారు శరీరం - కళ్ళు లైట్లు - ఉదరం పెట్రోలుట్యాంకు - నోరు హారన్ - మనస్సు స్టీరింగ్ స్వామి కారు గురించి చెప్పారు!**

**ॐ**

**07-07-2019** 08:20 PM

## 172) మౌనాన్ని ఏ విధంగా అవలంభించాలి స్వామీ?

మౌని అన్నా, ముని అన్నా ఒక్కటే. ముని అంటే మననశీలుడు అంటారు. తాను విన్న భగవత్ సంబంధమైన విషయాలను నిరంతరం మననం చేసుకుంటూ, ఇక అన్యవిషయాలను మాట్లాడకుండా వుండేవాడు. మాట్లాడటానికి వీలు లేకుండా వుండేవాడు మౌని. మౌనం అంటే మాట్లాడకుండా వుండటం అని మాత్రం తెలుసుకుని, ఏ విషయం మాట్లాడకుండా మూతి బిగించుకుని కూర్చున్నవారు మౌని కాదు. ఏ భగవత్ సంబంధ విషయములను మాట్లాడవలసి వచ్చినా, ఎవరన్నా ఏదైనా సందేహం అడిగినా, ఈరోజు మౌనంలో వున్నాను కనుక మాట్లాడను అని మూతి బిగించుకుని కూర్చున్నవాడు మౌని కాదు. ఇంకా విచిత్రం ఏమిటంటే, అన్ని విషయాలకు సైగల ద్వారా సమాధానం ఇస్తుంటారు. ఈ మౌనులు, తాళపుచెవి ఎక్కడ పెట్టావు? అని ఇంట్లోవారు అడిగారనుకోండి, ఫలానా గదిలో, గూటిలో పెట్టాను అని చెప్పటానికి అరనిమిషం సరిపోతుంది. దానిని సైగలతో తెలియచేయటానికి 10 నిమిషాలు కూడా చాలదు. ఇదొక రకం మౌనం. తాను విన్నటువంటి, చదివినటువంటి ఆధ్యాత్మిక విషయాలను గానీ, భగవత్ తత్త్వాన్ని గానీ, భగవంతుని వైభవాన్ని గాని, కథలను గానీ ప్రశాంతమైన, నిర్మలమైన మనస్సుతో నిరంతరం మననం చేస్తూ వుండటమే నిజమైన మౌనం. అట్టివాడే నిజమైన మౌని. అలా మననం చేసుకుంటూ ఉండేవారికి ఇతరులతో మాట్లాడవలసిన అవసరమే వుండదు, మాట్లాడటం కుదరదు. అందువల్ల, వ్యర్థమైన విషయాలకు ఆస్కారం లేదు. ఒకవేళ తప్పనిసరి అయితే, ఒకటి రెండు మాటలు క్లుప్తంగా మాట్లాడినా ఫరవాలేదు. అసలు ముఖ్యంగా గమనించవలసింది ఒక్కటే – మీరు భగవత్ సంబంధిత విషయాలను మననం చేస్తూ ఉన్నారా, లేదా అని మాత్రమే. అతడే మౌని. అతడంటేనే భగవంతునికి ప్రీతి. అంతేకానీ, కేవలం వాగ్బంధనం చేసి, వ్యాపారాలు, ఉద్యోగాలు, డబ్బు సంపాదన, లంచాలు, రాజకీయాలు, లోకాభిరామాయణం మొదలయిన విషయాలను తలచుకుంటూ, నిర్ణయాలు తీసుకుంటూ వుండటం కాదు. దీనిని బట్టి మౌనం అంటే మూగబోవాల్సింది మనస్సేగాని, వాక్కుకాదు అని మీరు గ్రహించాలి. అసలు వాక్కు అనేది నాలుగు రకాలుగా వుంటుంది. అవి **పర, పశ్యంతి, మధ్యమ,** వైఖరి అని. ఇక ఐదవ రకం లేదు. (1) ఎల్లప్పుడూ లోకవ్యవహారాలు, వ్యర్థప్రసంగాలు, చెప్పిందే చెప్పి సాగదీయటం ఇవ్వన్నీ వైఖరి అంటారు. లోకంలో వీరే ఎక్కువ. వీరు వాక్కును వ్యర్థం చేయుటయే గాక, అనేక అబద్ధాలు మాట్లాడటం జరుగుతుంది. (2) కొందరు ప్రాపంచిక విషయాలు, వ్యర్థప్రసంగాలతోపాటు, అప్పుడప్పుడు భగవత్ సంబంధమైన విషయాలు కూడా మాట్లాడుతారు. వీరి వాక్కులనే మధ్యమ అంటారు. (3) భగవత్ సంబంధ విషయాలుగానీ, ప్రాపంచిక విషయాలు గానీ, ఏవైనా సరే, ఉన్నది ఉన్నట్లుగా మాట్లాడేవారి వాక్కులు పశ్యంతి అంటారు. (4) పూర్తిగా ఆత్మకు సంబంధించిన విషయాలు, పరమాత్మ తత్త్వాన్ని తెలిపే వేదాలు, ఉపనిషత్తులు, భగవద్గీతకు సంబంధించిన విషయాలను మాత్రమే మాట్లాడితే, ఆ వాక్కును పర అంటారు. మీరు వైఖరీ వాక్కును మధ్యమ వాక్కునందు, మధ్యమ వాక్కును పశ్యంతినందు, పశ్యంతి వాక్కును పరావాక్కునందు లయంచేసి శ్రీపరబ్రహ్మ మీరే అని గ్రహించి అలా వుండిపోవటమే నిజమైన మౌనం. భక్తుడు వాక్కును అధీనంలో వుంచుకుని కేవలంగా వుండాలి. అదే నిజమైన మౌనం.

***చూపుల్లో అనురాగవర్షం కురిపిస్తూనే వుండాలి***
***పలుకుల్లో దీవెనలందిస్తూనే వుండాలి***
***సకల జీవరాసులలో ఉన్నది దివ్యత్వమని గుర్తించాలి***
***పసిడి మనసులో పసిమనసు చేసి***
***నీతి సూత్రాలను నుడువుచూ, మరపురాని త్యాగాన్ని***
***మాటలలో, చేతలలో చూపుతూ***
***పెదవులపై వసంతాన్నే పూయిస్తూ***
***తనువంతా తన్మయత్వంతో నింపుకుని, సహనంతో సహవాసం చేస్తూ***
***వీడని సత్తువతో సడలని ధైర్యంతో***
***ప్రాణదీపం వెలిగించే ఈ వీరాంజనేయుని నీతిసూత్రాలను నుడువుచూ***
***ఈ జగతికే ఆదిగురువైన ఆంజనేయుడు ఆకాశమంత ప్రేమను అక్కున చేర్చుకుని***
***ప్రవహించే అనంత అంతర్వాహినిని తెలుపుచూ***
***మాటలతో మనసును రంగరించి, లాలనతో పాలనతో అక్కున చేర్చుకుంటున్న***
***నా చిన్నారి ముద్దుబిడ్డలారా!***

ॐ

**08-07-2019** 08:15 AM

**173) ఆనందమయమైన జీవితాన్ని ఏ విధంగా పొందవచ్చును స్వామీ?**

*ఆకాశంలో ఒక గ్రద్ద ఆహారం కోసం చూస్తుండగా, ఒక నక్క ఎరలతో నిండిన బండిని లాగుతూ వెళ్తోందట. పైనుండి దానిని చూచిన గ్రద్ద రయ్యిమని ఆ నక్క ముందు వ్రాలి, ఆ ఎరలు కావాలని నక్కను అడిగిందట. అప్పుడు ఆ నక్క తప్పకుండా ఇస్తాను. కానీ, కొంత వెల అవుతుంది అని అన్నదట. దానికి ఆ గ్రద్ద ఏమివ్వాలి? ఎంత ఇవ్వాలి? అని అడిగితే, నీ రెండు ఈకలు ఇస్తే, నేను ఒక ఎరను ఇస్తాను అని నక్క అన్నదట. గ్రద్ద తన రెండు ఈకలు పీకి ఇచ్చిందట. నక్క వాటిని తీసుకుని ఒక ఎరను తీసి ఇచ్చిందట. దానిని తింటూ, ఆహా ఎంత రుచిగా వుంది. మళ్ళీ ఇంకొకటి తిందాం అనుకుని మళ్ళీ నక్క దగ్గరకు వచ్చిందట. అలా రుచి మరగి మళ్ళీమళ్ళీ తన ఈకలనిచ్చి ఎరలను కొంటూ వచ్చిందట ఆ గ్రద్ద. చివరకు ఆ గ్రద్ద ఈకలన్నీ అయిపోయాయి. అప్పుడు ఒక్కసారిగా నక్క పెద్దగా నవ్విందట. గ్రద్ద తేరుకుని నిజం తెలుసుకునేలోగా తన ఈకలన్నీ ఊడి పైకి ఎగరలేకపోయింది. నక్క అమాంతం ఆ గ్రద్దపైన పడి, చీల్చి తినేసింది. విచక్షణ కోల్పోయి, శక్తినంతా అమ్ముకుని, దేవుడిచ్చిన ఎగిరేశక్తిని కోల్పోయి, చివరకు ప్రాణాలు విడిచింది ఆ గ్రద్ద. సరిగ్గా మీ జీవితంలో కూడా మిమ్మల్ని ఆకర్షించి, ప్రలోభపెట్టి, మీకు తాత్కాలిక ఆనందాన్ని, ఆహ్లాదాన్ని ఇచ్చే విషయాలే మీ పాలిట విషప్రాయాలై, మీ జీవితాలను విషాదంలో ముంచేస్తాయి. ఆకర్షణల, ప్రలోభాల కారణంగా మీ దృష్టి మరల్చబడుతుంది. మనిషి యొక్క లక్ష్యాన్ని, ఏకాగ్రతను భగ్నం చేసే పరిస్థితులు, ప్రలోభాలు అడుగడుగునా ఎదురవుతూనే*

వుంటాయి. ఒక వ్యక్తి తన ముందున్న లక్ష్యాన్ని సాధించే ప్రయత్నంలో ఆకర్షణలు, ప్రలోభాల రూపంలో ఎదురవుతూ వుంటాయి. వాటిని ఎదుర్కొని తీరాల్సిందే. ఒక నిర్జన అరణ్యంలో ఒక సన్యాసి అక్కడ దొరికిన ఫలాలను తింటూ, సాధుజలాలను త్రాగుతూ, స్వాధ్యాయం, జపం, ధ్యానం, తపస్సు సాగిస్తూ, ఆనందంగా వుంటున్నాడు. అతడికి రాగద్వేషాలు గానీ, కామక్రోధాలు గానీ, ఏమీ లేవు. అయితే, ఒకనాడు దారితప్పి, సమీపంలోని పల్లెకు వచ్చాడు. అక్కడ ఒక భార్యాభర్తల జంటను చూచాడు. వారు ఎంతో హాయిగా, ఉల్లాసంగా వున్నట్లు గమనించాడు. దాంతో అతడు తన సన్యాసాన్ని వదిలివేసి, వివాహం చేసుకున్నాడు. పిల్లలు పుట్టారు. ఇల్లు తీసుకున్నాడు. వస్తువులు సమకూర్చుకున్నాడు. తన సంపాదనకు ఒక వృత్తిని చేపట్టాడు. ఆశలు, కోరికలు కల్గినవి. అవి తీరకపోతే కోపం వస్తుంది. తనవారిపై రాగం, మమకారం కల్గింది. వారికి ఏదైనా బాధ కలిగితే విలవిలలాడిపోతున్నాడు. ఇలా అన్ని ఒడిదుడుకులు తనకు వచ్చి చేరినవి. ప్రపంచానికి దూరంగా వున్నప్పుడు హాయి. ప్రపంచాన్ని తగిలించుకోవటంతో ఈ ప్రపంచపు వికారాలు, సుఖదుఃఖాలు, రాగద్వేషాలు అన్నీ అనుభవించవలసి వచ్చింది. ప్రపంచానికి దూరంగా వుంటే సన్యాసి, ప్రపంచాన్ని తగిలించుకుంటే సంసారి. అలాగే పురుషుడు దేనితోనూ సంగభావం లేకుండా తనకు తానుగా వుంటే, ఆనందస్వరూపుడు. ఉపాధులతో అంటే, ప్రకృతితో తాదాత్మ్యం చెందితే జీవుడై, ఈ ప్రకృతికి చెందిన గుణాలను తనవిగా భావించి సుఖదుఃఖాలను అనుభవిస్తున్నాడు. ఇలా ప్రకృతితో తాదాత్మ్యం పెట్టుకున్న పురుషుడు ప్రకృతి వల్ల పుట్టిన గుణాలను భోగిస్తూ, కర్మలు చేస్తూ, ఆ కర్మల కారణంగా మంచి-చెడు జన్మలను ఎత్తుతున్నాడు. వీటి నుంచి బయటపడండి. ఎన్నో రకాలుగా మీకు చేయూతనిచ్చుటకు చిరంజీవినై, మీ చెంతనే వుండి, చింతలు తీరుస్తూ చెంతకు చేర్చుకొనుటకై ఎదురుచూస్తున్నాడు ఈ ఆంజనేయుడు కానీ...

***ఏదీ మీ ప్రయత్నం? ఎక్కడ మీ జీవిత పరమార్థం?***
***మంచిని కోరే ప్రతి చిన్నపని కూడా ఒక మహాయజ్ఞమే,***
***ఆ చిరు ప్రయత్నమే నీకు దారి చూపిస్తుంది***
***ఎన్నాళ్ళు నీకు ఇష్టంలేని, నీ నైపుణ్యం కనబర్చలేని, నీ సమయస్ఫూర్తిని వినియోగించుకోలేని,***
***నీ సృజనాత్మకతను బయటకు తీయలేని రంగంలో వుండిపోతావు?***
***నీ చుట్టూ వున్న గిరిని చెరిపేసి, నీకున్న పరిధిలో, నీకున్న శక్తితో పోరాడి ప్రయత్నించు***
***నీ పోరాటానికి విజయశంఖం పూరించు. నీ ప్రయత్నపటిమకు అడ్డుకట్టలు తొలగించు***
***అంతే కానీ,***
***నాకు అవకాశం రాలేదు, నాకు కాలం కలసిరాలేదు, నాకు అవరోధాలు ఎక్కువ,***
***నాకు పరిస్థితులు అనుకూలించలేదు, నాకు అదృష్టం వరించలేదు, నాకు శక్తి సరిపోవటం లేదు,***
***నన్ను చూచి అందరూ నవ్వుకుంటారు, నా చుట్టూ వున్న బంధాలను తెంచుకోలేను,***
***అని అనుకుంటూ కూర్చుంటే, నీవు చేయవలసిన పనులు మరుగున పడిపోయి,***
***నీ జీవితపరమార్థం వ్యర్థమైపోయి, నీ గురించి వ్రాయవలసిన చరిత్ర కాగితం***
***చెదలుపట్టడం తప్ప, ఏమీ జరగదు.***

***అంతా బూడిదలో పోసిన పన్నీరవుతుంది.***
***ఆకాశం క్రింద వున్నది అంతా మీదే***
***లే లే లేచి ప్రయత్నించు***
***వీలుంటే గెలుస్తావు, లేకపోతే గెలుపును ఎలా గెలవాలో నేర్చుకుంటావు.***
***ఇంత అండగా నిలుస్తున్న ఈ ఆంజనేయుని మాట విని,***
***ఆధ్యాత్మిక బిడ్డలుగా ఎదిగి, నా శ్రీరామచంద్రుని చరణశీలురు కండి***
***నా చిన్నారి ముద్దుబిడ్డలారా!***

ॐ

**09-07-2019** 08:05 AM

**174) క్షేత్రం మరియు క్షేత్రజ్ఞుడు అనగా ఏమి స్వామీ?**

*శరీరమే రథం. జీవుడే అందులో ప్రయాణించే రథికుడు. ఇంద్రియాలే గుర్రాలు. మనసే పగ్గం. బుద్ధియే సారథి. ఈ రథం సక్రమంగా, క్షేమంగా ప్రయాణించాలంటే, పగ్గాలు సారథికి అప్పగించాలి. అంటే, మనసును బుద్ధికి అప్పగించాలి. మనసు ఇంద్రియాల వెంటబడితే, రథం బోల్తా పడుతుంది. అలాకాక, మనసు బుద్ధిని అనుసరిస్తే, ఈ ప్రయాణం సాఫీగా భగవంతుని వద్దకు చేరుతుంది. ఇలా శరీరం, దేహం, దేవాలయం, గృహం, బండి, రథం ఎన్నో పేర్లు వున్నప్పటికీ, భగవానుడు మాత్రం ఈ శరీరాన్ని క్షేత్రం అన్నారు. కాశీ, రామేశ్వరం, తిరుపతి, శ్రీశైలం, బదరీ ఇవన్నీ పుణ్యక్షేత్రాలు. భగవంతుని విభూతి బాగా ఉన్నచోట, పవిత్రమైన నదులు ప్రవహించే చోట క్షేత్రాలు వెలుస్తాయి. సాక్షాత్తు భగవంతుడే హృదయస్థానంలో కూర్చున్నాడు గనుక, ఈ దేహం ఒక క్షేత్రం, పుణ్యక్షేత్రం. ఈ క్షేత్రాలలో పుణ్యం మాత్రం సంపాదించుకోవచ్చు. అదీ, సరిగ్గా ప్రవర్తిస్తే. కానీ, ఈ శరీరమనే క్షేత్రంలో పుణ్యాన్నే కాదు, జ్ఞానాన్ని, మోక్షాన్నీ కూడా సంపాదించుకోవచ్చు. క్షేత్రం అంటే అసలైన అర్థం పొలం అని. పొలం లాగా ఈ శరీరమనే క్షేత్రం కూడా జడమైనదే. ఆ పొలంలో పంటలు పండించుకోవచ్చు – ఈ పొలంలో సాధనను పండించుకోవచ్చు. ఆ పొలంలో ఏ విత్తులు వేస్తే ఆ పంట వస్తుంది – ఈ పొలంలో కూడా అంతే. ఏ కర్మలు చేస్తే, ఆ ఫలితాలే వస్తాయి. పుణ్యకర్మలనే విత్తనాలు చల్లి సుఖాన్ని పండించుకోవచ్చు, పాపకర్మలనే విత్తనాలను చల్లి దుఃఖాలను పండించుకోవచ్చు, జ్ఞానమనే విత్తనాలను చల్లి మోక్షమనే పంటను పండించుకోవచ్చు. అయితే, ఆ పొలంలో ఋతువులను బట్టి, వాతావరణాన్ని బట్టి విత్తనాలు చల్లి వ్యవసాయం చేయాలి. కానీ ఈ పొలంలో ఆ కాలం, ఈ కాలం అనేది లేదు. ఋతువులు, వాతావరణం చూడనక్కరలేదు. రాత్రి పగలు అనే తేడా లేదు. వారం వర్జ్యం అనే తేడా లేదు. ఎప్పుడైనాసరే, జ్ఞానమనే విత్తనాలు చల్లుతూ, మోక్షమనే పంటను పండించుకోవచ్చు. కనుక, ఆ పొలం కన్నా ఈ పొలం వ్యవసాయానికి యోగ్యమయినది. ఫ్రీగా భగవంతుడు సప్లై చేశాడు. ఆ పొలంలాగా డబ్బు పెట్టి కొనుక్కునే పనిలేదు. ఎంత అదృష్టవంతులు. ఇంత సారవంతమైన పొలాన్ని ఫ్రీగా ఇచ్చి సాగుచేసుకోమంటే, పట్టించుకోనివారు మూర్ఖులే కదా? ఇప్పుడు నేను చెప్పిన విషయం తెలిసిందా? అని ప్రశ్నించాను.*

మీరు తెలిసింది అన్నారు. ఎవరికి తెలిసింది? తెలిసినట్లుగా అనుభూతి పొందిందెవరు? ఆ, తెలిసింది అని సమాధానం చెప్పాలనుకున్నది ఎవరు? నీ శరీరమా? కాదు. అది తెలియబడేదే కానీ, తెలుసుకునేది కాదు. తెలియబడేదాని కన్నా తెలుసుకునేది వేరుగా వుంటుంది. చూడబడే దానికి చూచేవాడు వేరుగా వుంటాడు. కనుక, ఇక్కడ శరీరం కన్నా వేరుగా ఏదో వున్నది. అదే క్షేత్రజ్ఞుడు! క్షేత్రం జడం కాబట్టి, అది తనను తాను తెలుసుకోలేదు. వేరే దేనినీ తెలుసుకోలేదు. కనుక, దానిని (శరీరాన్ని, క్షేత్రాన్ని) తెలుసుకునేవాడు వేరే వున్నాడు. అతడే క్షేత్రజ్ఞుడు. అతడే తెలుసుకునేవాడు. చూచేవాడు ద్రష్ట. ద్రష్ట వేరు, దృశ్యం వేరు. ద్రష్ట ఎప్పుడూ దృశ్యం కాదు. కానీ, మీరు అజ్ఞానం చేత, క్షేత్ర (శరీర) ధర్మాలను క్షేత్రజ్ఞునిలోనూ, క్షేత్రజ్ఞుని ధర్మాలను క్షేత్రంలోనూ కలగాపులగం చేసి అన్యోన్య అధ్యాస చేసి, జనన-మరణ యాతనలకు గురైపోతున్నారు. అంటే, శరీరం చేసే పనులను నేను చేస్తున్నాను అని ఆత్మపై ఆరోపిస్తున్నారు. ఆత్మ ధర్మాలైన సత్ చిత్ ఆనందాలను ఈ శరీరంపై ఆరోపిస్తున్నారు. నేను తెలుసుకున్నాను, నేను ఆనందంగా వున్నాను అంటూ ఈ శరీరమే నేను అనే భావనలో వుంటారు. ఈ రెండింటినీ క్షేత్రాన్ని, క్షేత్రజ్ఞుడ్ని చక్కగా విడగొట్టి చూచే నేర్పు కావాలి. ఈ క్షేత్ర-క్షేత్రజ్ఞుల ధర్మాలను విభాగించి చూచి, ఆత్మ-అనాత్మ వివేకం కలిగితే, అదే సంసారబంధన విముక్తికి తారకమంత్రం. నీటిని వదిలి పాలను గ్రహించే హంసలాగా, క్షేత్ర-క్షేత్రజ్ఞులను విడగొట్టి, క్షేత్రాన్ని వదిలి క్షేత్రజ్ఞుడైన ఆత్మయే తన స్వరూపమని గ్రహించాలి. అలా గ్రహించగలిగినవాడే పరమహంస, పరమజ్ఞాని. అది తెలుసుకోలేనివాడు సామాన్యుడే!

***రూప రహితుడ్ని, రూపవంతుడ్ని, రూపహీనుడ్ని***
***శాంతిని, రౌద్రాన్ని, లౌకికాన్ని, అలౌకికాన్ని***
***అన్నింటి సమన్వయం నీవే నీవే***
***ఏకత్వం నేను - అనేకత్వం నీది***
***అజ్ఞానం వీడి, అవివేకం తొలగి మాయ సమసిపోయి, మనసే పండినట్లయితే***
***అదియే మోక్షం - మోక్షమే అఖండ బ్రహ్మజ్ఞానము!***
***జ్ఞానయోగమందు నిలుచుటయే అద్వైతం***
***భేదనివారిణి, మోదప్రదాయిని, ధర్మస్థాపనా ఉద్దీపనం***
***ఓంకారం - అది ప్రణవనాదం. అద్వైత ప్రాకారం.***
***జడ చేతనాల సృష్టికర్త ఒక్కరే.***
***అఖిల చరాచరం అతని ప్రతిబింబమే***
***మమతే సూక్ష్మం సమతే మోక్షం***
***సద్గుణైక మందిరమే అద్వైతం***
***ఈ సద్గురువు బోధలే అజరామరమయ్యేను***
***ఆధ్యాత్మిక పథాన నా ప్రబోధలే సర్వజన హస్తామలకం అయ్యేను***
***అని ఈ ఆంజనేయుడు అద్వైతాన్ని బోధిస్తూ బోధకులయిన***
***నాయీ బిడ్డల్ని త్వరితగతిన సూక్ష్మంబెరిగి, సున్నితంగా దరి చేరమని చెబుతున్నాడు***
***నా ఈ చిన్నారి బిడ్డలకు!***

ఓం

**10-07-2019** 08:10 AM

**175) అహింస యొక్క ప్రాధాన్యత ఏమిటి స్వామీ?**

*ఆధ్యాత్మిక రంగంలో అహింస యొక్క ప్రాధాన్యత ఎంతో వుంది. ఈ రంగంలో శారీరక హింస వుండదు కానీ, మానసిక హింస, వాచిక హింస వుంటుంది. దీనిలో బాగా పనిచేసేది నాలుక. ఈ నాలుక ఎంత మెత్తనిదో, అంత పదునైనది. మాటలతోనే అవతలవారి గుండెను పరపరా కోయవచ్చు. మాటలతో వ్యక్తుల మనస్సులను చెడగొట్టి, వారిని ఇక్కట్లపాలు చేయవచ్చు. నిందలు వేసి, నానారకాలుగా హింసించవచ్చు. ఆధ్యాత్మికంగా పురోగమించాలని భావించేవారు, ఈ హింసకు దూరంగా వుండాలి. అంటే, మాట్లాడే ప్రతిమాట ఎంతో మృదువుగా, నమ్రతగా, హితంగా వుండాలి. కర్ణకఠోరంగా కాక, కర్ణపేయంగా వుండాలి. తన మాటలవల్ల గానీ, చేతలవల్ల గానీ ఇతరుల మనస్సు గాయపడరాదు. అలా మృదువుగ మాట్లాడాలి. అదే అహింస.*

**176) పునర్జన్మకు కర్మలే ఏ విధంగా కారణం స్వామీ? జన్మచక్రం నుండి ఏ విధంగా విడిపడవచ్చు స్వామీ?**

*పరమాత్మ మానవజన్మను భూమి మీదకు పంపించేటప్పుడే సంచితకర్మల మూటను మనసులో పెట్టి పంపిస్తాడు. వాటిని మరచిపోయి, ప్రకృతి మాయలో పడి, ప్రారబ్ధకర్మలను పెంచుకుంటారు. పక్వానికి వచ్చిన కర్మలను ఆశించి చేయటం వలన ఆగామికర్మలు కూడా వచ్చిపడతాయి. ఈ విధంగా కోరికలతో, సంస్కారాలతో, సంకల్పాలతో ఆశిస్తూ జీవిస్తే, అసంతృప్తి పెరిగి, అవి నెరవేరక దుఃఖపడుతూ, బాధపడుతూ, జీవితాన్ని మధ్యలోనే ముగిస్తే, దేహవిముక్తి మాత్రమే లభిస్తుంది. జీవుడికి ముక్తి లభించదు. మిగిలిపోయిన కోరికలు, సంకల్పాలు నెరవేర్చుకోవడం కోసం కనిపించని ఆ సూక్ష్మశరీరం లేదా జీవుడు, లేదా మనసు, లేదా ప్రాణశక్తి దేహాలను మారుస్తూ వుంటుంది. అందుకే "పునరపి జననం పునరపి మరణం పునరపి జననీ జఠరే శయనం" అన్నారు. ఈ కర్మ, జన్మచక్రం నుండి విడిపడి, ముక్తిమార్గం పొందటానికి రెండు మార్గాలున్నాయి. మొదటిది మనసును అంతర్ముఖం చేసి, అస్థిరమైన, అసత్యమైన, అవాస్తవమైన, అనిత్యమైన శరీరంలో కలిగే సంవేదనలను గమనిస్తుంటే, ఎటువంటి నొప్పులుగానీ, తిమ్మిర్లుగానీ, దుఃఖమైనా, సంతోషమైనా ఆలోచనలు తటస్థంగా వుంటాయి. రాగద్వేషాలు కల్గినా, వాటితో ప్రతిచర్య చూపకుండా, ప్రతీదీ పుట్టినశించేదే. ఏదీ శాశ్వతం కాదు అనే సత్యాన్ని స్వయంగా అనుభుతి చెంది, ప్రజ్ఞను మేలుకొలుపుకుని సమత్వంతో, సమదృష్టితో అన్నింటికీ అతీతంగా వుండటం, అంతర్ముఖంతో ధ్యానం చేస్తూ, సంస్కారాలను కరిగించుకుని, సమాధిస్థితిని పొంది బాహ్యప్రపంచంలో ధర్మంగా వుంటూ, రాగద్వేషాలు చూపకుండా, సమర్ధవంతంగా వారివారి బాధ్యతలను నిర్వహించుకుంటూ, దేహత్యాగభావంతో జీవించగలిగినప్పుడే, మృత్యుంజయుడు కావచ్చును. అందుకే, "నకర్మణా, నప్రజయా, ధనేన, త్యాగేనైకే, అమృతత్వ మానసుః" అన్నారు. ఈ మార్గంలో ఎక్కువ సమయము కేటాయించి, ఎక్కువగా కష్టసాధన చేయవలసి వుంటుంది.*

రెండవది పరిపూర్ణ అద్వైత బ్రహ్మజ్ఞానము ద్వారా అనుభూతులు పొందిన అనుభవజ్ఞులైన, నైపుణ్యత పొందిన సద్గురువుల సందేశ, దర్శన, ఉపదేశం పొంది, వారు చూపిన మార్గంలో సాధన చేసుకుంటూపోతే, కర్మలను కరగించుకుని, ఈ జన్మలోనే ముక్తిమార్గం సులభతరం చేసుకోవచ్చు. అయితే, జ్ఞానపరంగా ఎదుగుతూ, అనుభవం పొందాలి. అందుకే "జ్ఞానాగ్ని దగ్ధ కర్మాణం" అన్నారు. ఇవ్వన్నీ చెప్పటం, వినటం, చదవటం, వ్రాయటం సులభంగా వుంటుంది. ఆచరించినప్పుడే సులభతరమవుతుంది. భక్తిమార్గం అయినా, ముక్తిమార్గం అయినా మీ చేతులలోనే వున్నది. యుక్తిని ఉపయోగించి, ముక్తిమార్గాన్ని ఎన్నుకుని, భక్తికి ఏ లోటూ లేకుండా, ఆత్మస్థితిని పొందవచ్చును. ఆధ్యాత్మిక మార్గానికి మూలప్రమాణం మరియు ప్రాణం ఈ సద్గురువు బోధించే బోధలు. చెప్పిన వాటిని గుర్తుంచుకోవటం వలన, అసంతృప్తి మరియు కక్షలు పెరిగిపోకుండా వుంటాయి. కాబట్టి, ఈ అనంతమైన కాలచక్రంలో, కర్మచక్రంలో, జన్మచక్రంలో ఇరుక్కోకుండా, జ్ఞానవైరాగ్యాలతో ధర్మచక్రం పట్టుకుని సాధన ద్వారా చిత్తవృత్తులను నిరోధించుకుని, పరమాత్మలో శివైక్యం పొందే అర్హతను సంపాదించుకోవాలని ఆశిస్తూ, ఆకాంక్షిస్తున్నాడు ఈ ఆంజనేయుడు.

***సకల జీవులయందు ఆత్మ సంచరించు***
***ఆత్మయే అన్ని జీవుల అంతరంగమందుండు***
***నన్నెరిగిన మానవుడు ఈర్ష్య చూపడు ప్రాణులపైన ఎన్నడూ***
***సత్యమైన జ్ఞానముతో ఆత్మ సర్వజీవులయందు గలదని ఎరుగునో,***
***అతనికి ఎప్పుడూ శోక మోహములుండవు.***
***లోకమెల్లా సచ్చిదానందరూపమే అవగతమగును.***
***సర్వదర్శి, సర్వవిదుడు, సర్వవ్యాపి, ఆ పరమాత్మ***
***అఖిల జగతిపాలన ప్రజాపతులకున్***
***పరిపరి విధముల పనులు నిర్ణయించెన్ భూతములకున్***
***మనిషి అజ్ఞానుడై మదిలో మలినమున్నచో, కర్మలయందు ఫలాపేక్ష కలిగియున్నచో,***
***అతడెంత ఉపాసించినా, ఆత్మజ్ఞానము పొందలేని అజ్ఞానుడగును.***
***కర్మలు, ఉపాసనలు ఏకకాలమున ఆచరించునెవరో వారు అంతమందు***
***జననమరణ చక్రము దాటు జ్ఞానము పొంది, అమృతత్వమును పొందును.***
***భౌతికజగమే నిజమను వారలకింక అంధకారమే శరణగు***
***ఆ భవుండునెవరు సేవింతురో, వారే ఇలను నింగి చీకటిని చీల్చి***
***ఈశుని చెంత చేరును తెలుసుకోండి***
***నా చిన్నారి ముద్దుబిడ్డలారా!***

ॐ

**11-07-2019** 07:25 PM

**177) భగవంతునకు మేము ఏ విధంగా ప్రీతిపాత్రులము కాగలము స్వామీ?**

*దైవానికి ప్రీతిపాత్రుడైన భక్తుడు ఎటువంటి లక్షణాలను కలిగి వుండాలో, అటువంటి ఉత్తమ లక్షణాలు పొందటానికి భక్తులంతా ప్రయత్నం చేయాలి. మిత్రత్వం, దయ, ఓర్పు, మనోనిగ్రహం, దృఢమైన నిశ్చయం కలిగి, నిత్యసంతుష్టులై, భగవంతునికి సంపూర్ణంగా సమర్పించే మనసు, బుద్ధి కలిగి వుంటారు. జ్ఞానం లేకుండానే, కేవలం భక్తి ద్వారా భక్తగణం సుఖపూర్వకంగా సంసారం నుండి ముక్తి పొందగలదు. భక్తులపట్ల దైవం తన వాత్సల్యాన్ని ప్రకటిస్తుంది కానీ, అజ్ఞానులపట్ల చూపదు. ఎందుకంటే, అజ్ఞాని తనకు సర్వం తెలుసునని గర్విస్తాడు. తమ జీవితకాలాన్ని వ్యర్థం చేసుకుంటాడు. కాబట్టి, మనిషి ఆయుర్దాయం నూరేళ్ళనుకుంటే, అందులో సగం నిద్రకు, కొంత విశ్రాంతికి, ఇంకొంత బాల్యానికి, మరికొంత వృద్ధాప్యానికి, కొంత కబుర్లకు, మరికొంత వినోద విహారయాత్రలకు, ఇంకొంత అనారోగ్యాలకు... ఇలా ఖర్చయిపోతుంటే, తన జీవితకాలంలో మనిషిగా పుట్టి ఏం సాధించనట్లు? మనసును నిత్యం నిర్మలంగా వుంచుకోవాలి. అది అందరినీ ఆరాధించగలిగేలా మార్చుకోవాలి. ఆధ్యాత్మికమనే పరిమళం మనసుకు అంటుకోవాలి. దానికి కులమతాలు, అధిక-అల్పత్వాల తేడా తెలియకుండా చేయాలి. ధర్మార్థకామమోక్షాలనే చతుర్విధ పురుషార్థాల్లో చివరిదైన మోక్షానికే గొప్ప విలువ వున్నది. జీవులు ధర్మార్థ కామాల మీద వ్యామోహాన్ని పెంచుకోవటం కన్నా, మోక్షం వైపు దృష్టి సారిస్తే, ఇక హాయిగా ఆ అంతర్యామి పాదాల చెంతనే వుండిపోవచ్చును అని విశ్వసిస్తారు. దాని కోసం ప్రయత్నం చేయనంత కాలం, జీవన నాటకరంగం మీద నిరంతరం విభిన్న పాత్రలను పోషిస్తూ, ఆ పాత్రపోషణలో అలసిసొలసి పోతూంటారు. ధర్మం ద్వారా సమాజానికి నీతి ప్రబోధితమవుతుంది. మనిషిలోని స్వార్థం నశిస్తుంది. ఒకవైపు సంపూర్ణంగా విషయాసక్తుడై వుండి, మరోవైపు పూర్తిగా శరీరాన్ని బాధించే కఠిన వ్రతాలు, ఉపవాసాలు లాంటివి చెయ్యడం వల్ల ప్రయోజనమేమీ వుండదు. మధ్యేమార్గమైన ఆధ్యాత్మిక మార్గాన్ని అవలంభించడం సర్వదా శ్రేయస్కరం. అంతర్లీనంగా గాలి ద్వారానో, మాట ద్వారానో, మరేదైనా ధాతువు ద్వారానో ఆధ్యాత్మిక సందేశం మనిషికి అందడం వెనుక అంతర్యామి సహకారం ఉండనే వుంటుంది. బుద్బుదప్రాయమైన ఈ మానవజీవితంలో అనుక్షణం మానవుడు సాగిస్తున్న బ్రతుకుతెరువు, ఆరాటం, పోరాటం ఈ జానెడు పొట్టను నింపుకునేందుకే కదా! ధర్మాన్ని మనిషి ప్రేమించాలి. అంతకు మించి అమితంగా పూజించాలి. జననం నుంచి మరణం దాకా మానవజీవితమే ధర్మంతో ముడిపడివుందని, బంధుమిత్రులతో వుండే బంధాలు, అనుబంధాల్లో సైతం ధర్మం ప్రధానపాత్ర వహిస్తుందని, ఎంత భక్తిప్రపత్తులతో కూడిన దైవపూజలైనా ధర్మం లేక సాధ్యం కాదన్నది మానవుల ప్రగాఢ విశ్వాసంగా వుండాలి. కనిపించే ఈ ప్రపంచానికి కారణం భగవంతుడి సృజనాత్మక శక్తి. దానికి మరోపేరు మాయ. దాన్ని అర్థం చేసుకోవాలని ప్రయత్నించి విజయం సాధించినవాళ్ళు మౌనం వహిస్తారు. విఫలమైనవాళ్ళు భగవంతుడే కారణం అంటూ బాధపడ్తూ వుంటారు. మీ మనసు చాలా చిత్రమైంది. మీరు వ్యక్తం చేసే అభిప్రాయాలు, మీ ప్రవర్తన, మీ అనుభూతులు ఇవన్నీ మీ మానసిక పరిణామాలకు ప్రతిస్పందనలు.*

వాస్తవాన్ని గ్రహించక, మీలోపలి అభిప్రాయాలకు అనుగుణంగా వాటిని మార్చుకుని, అవి నిజమైనవని నమ్ముతుంటారు. మహోన్నతమైన జన్మ కలిగిన మానవులకు ఆలోచన, వివేచన, భాష, జ్ఞానం ప్రకృతి ప్రసాదించిన వరాలు. యుక్త విచక్షణాజ్ఞానంతో, మానవులు సంఘశ్రేయం కోసం కూడా కృషి చేయాలి. ముళ్ళ మధ్యలో కూడా పుష్పం వికసిస్తుంది. ముళ్ళ బాధ భరిస్తూ కూడా, అందంగా వుండి ఆహ్లాదాన్ని కలిగిస్తుంది. అట్లాగే, మీరు కూడా కష్టసమయంలో ధైర్యంగా వుంటూ, దైవంపై భారం వేస్తూ, బహువిధాల కృషి చేస్తూ, మందహాసాన్ని ఎప్పుడూ విడువకూడదు. అప్పుడే దైవసన్నిధికి మార్గం సుగమమవుతుంది.

***తనువు రాలిపోతోందని దుఃఖించ తగదు***
***దుఃఖిస్తే, నోటిద్వారా త్రాగిన నీరు కళ్ళవెంట రాలును గదా!***
***అంటే నేల నుండి వచ్చిన నీరు నేలనే చేరుతోంది కదా!***
***అర్థం కాలేదా? ప్రకృతిన పుట్టిన తనువు ప్రకృతినే చేరుతోంది కదా!***
***ఇందులో ఆశ్చర్యమేమున్నది? అందు నుండి వచ్చింది అందులో చేరుతుంది.***
***అది తనువు సంగతి. ఐనా, అది జడపదార్థమే కదా.***
***అందుండి నిన్ను నడిపించిన ఆత్మ నిన్నొదిలి పోతోంది కదా.***
***ఎక్కడికి పోతోందని నీ వ్యధ? దాన్నుండి పుట్టిన మనసుకీ వ్యధ.***
***ఆత్మ దర్శించలేనిది. అలాగే మనసు కూడా దర్శించలేనిదే కదా.***
***అందుకై, మీరు పుట్టింది మొదలు గిట్టేంత వరకూ మీ ఆత్మ***
***సర్వదా, అన్ని విధాలా శాంతిని చేకూర్చేందుకు మీ మనసుకు***
***అన్ని విధాల సంతోషాన్ని, ఆనందాన్ని అందించి, ఆత్మకు అందించాలి.***
***అందుకై, మీరు సత్కార్యాలు చేయాలి. అందరూ నీవారే.***
***నీవు ఆత్మవు గనుక, ఆత్మానుభూతితో కోరుకో.***
***ఆనందాన్ని , సదా శాంతిని కల్గించే దిశగా జీవించు***
***నీ ఆలోచనలన్నీ ఇతరుల మనశ్శాంతికై వినియోగించు***
***ఆ పరమాత్మ నీ శాంతికై అన్నీ ఆయనే నీకు ఇస్తాడు***
***నీ కోసం నీవు ఏమీ చేయనక్కరలేకుండా, ఆ పరమాత్మే చేస్తాడు.***
***అపుడే నీ ఆత్మ పరమపవిత్రమైన శాంతిని పొందుతుందని***
***ఈ పవనకుమారుడు పలుసార్లు చెప్పతున్న వైనాన్ని అర్థం చేసుకోండి***
***నా చిన్నారి ముద్దుబిడ్డలారా!***

ॐ

**12-07-2019** 08:35 AM

**178) ఆధ్యాత్మికంగా ఎదగాలంటే భౌతిక జీవనాన్ని పరిత్యజించాలా స్వామీ?**

ఆధ్యాత్మిక జీవనం, భౌతిక జీవనం పరస్పర విరుద్ధములని మీరు భావిస్తారు. భౌతిక సంసారం

మాయ అని ఆత్మ పతనం కావటానికి కారణమని కొందరు భావిస్తారు. ఆ మాట నమ్మిన వ్యక్తులు సంసారాన్ని వదిలి ఏకాకులుగా జీవిస్తారు. ఈ దృక్పథం సముచితం కాదు. అలాంటి ఏకాకి జీవితం ఆధ్యాత్మిక జీవితం కాదు. ఇలాంటి బలవంతపు త్యాగం ఆత్మను ఉన్నతం చేయదు. పరీక్షా సమయం ఆసన్నమైన సందర్భంలో అది విఫలం కావచ్చు కూడా. కర్మయోగం ప్రకారం భౌతిక, ఆధ్యాత్మిక పక్షాల సముచిత సమన్వయమే నిజమైన ఆధ్యాత్మికత. అలాంటి జీవితంలో భౌతిక విషయాలవల్ల ఆటంకముండదు. దీనితోపాటు రోజువారి నిత్యజీవితములోని పనుల నుండి తప్పుకునే అవసరముండదు. మీ జీవితంలో ఆధ్యాత్మిక, భౌతిక విధానాలకు సమానమైన ప్రాముఖ్యం ఉండాలన్నది కాదు దీని అర్థం. మీరు ప్రధానమైన జీవనలక్ష్యాన్ని సాధించటంలో భౌతిక విషయాలకన్నా ఆత్మకు ఎక్కువ విలువ ఇవ్వటం తప్పనిసరి. భౌతిక వస్తువులను లక్ష్యాలుగా కాక, సాధనాలుగా మాత్రమే లెఖ్ఖలోకి తీసుకోవాలి. భౌతిక వస్తువులను ఆత్మ యొక్క ఉన్నతికి వినియోగించాలి. గాయకునికి సహకారిగా ఉన్నంత వరకే వాయిద్యం యొక్క ఉపయోగం. వాయిద్యం చెడిపోయి, గానానికి తోడ్పడని యెడల, అది బరువుగా మిగిలిపోతుంది. అలాగే, ఆధ్యాత్మిక జీవనానికి సహకారిగా ఉన్నంత వరకు భౌతిక పదార్థాలు పనికివస్తాయి. ఆధ్యాత్మిక ప్రవాహానికి అడ్డు తగిలితే, అవి సాధనకు ఇబ్బంది కలుగచేస్తాయి. సంసారి వాసనలతో, దాహాలలో చిక్కుకున్న వ్యక్తి కనుక, భౌతిక జగత్తుకే పెద్దపీట వేస్తాడు. త్రాగుబోతుకు మద్యమే సర్వస్వం. లోభికి వెండి బంగారాలే సర్వస్వం. భోగపరాయణునికి ఇంద్రియసుఖాలే సర్వస్వం. ఇలాంటి పరిస్థితులలో భౌతిక వస్తువులు, భౌతిక విషయాలు అతనిపై, ఆత్మపై అధికారం చెలాయిస్తాయి. లేనిపోని పెత్తనం చేస్తాయి. ఈ స్థితి మనిషిని పతనం చేస్తాయి. ఫలితంగా, అతడు కష్టాలు పడవలసి వస్తుంది. కానీ, ఈ కారణంగా భౌతిక జగత్తును వదిలివేయకూడదు. భౌతిక జీవనం ఆత్మ యొక్క అధికారాన్ని అంగీకరించాలి. ఆత్మను ప్రకటించాలి. జరగవలసింది ఇదే. ఆత్మకు – వస్తుజగత్తుకు మధ్య నిజమైన సానుకూలత ఏర్పడినప్పుడు, జీవితంలోని విభాగాలన్నీ ఆత్మ యొక్క దివ్యత్వాన్ని ప్రకటించటానికి వినియోగపడతాయి. అప్పుడు, రోజువారీ జీవితం నుండి, దాని ఒడిదుడుకుల నుండి పారిపోవాల్సిన అవసరముండదు. అప్పుడు భౌతిక విషయాలు ఆత్మ ఇచ్చే ఆజ్ఞలను పాటిస్తాయి. వాటికి తమదంటూ విలువ ఏదీ వుండదు. అవి వాటికవి మంచివీ కాదు, చెడ్డవీ కాదు. ఆత్మను ప్రకటించటంలో, వ్యక్తీకరించటంలో సహకరిస్తే, అవి మంచివి అవుతాయి. అడ్డుపడితే అవి చెడ్డవి అవుతాయి. యుద్ధంలో సైనికుడికి యుద్ధం చేయటానికి గుర్రం అవసరమవుతుంది. కానీ, గుర్రం అతడి సైగ ప్రకారం నడవక, తన ఇష్టం వచ్చినట్లు నడిస్తే, అది అతడికి ఆటంకమవుతుంది. అలాగే, ఈ వస్తుజగత్తును ఆత్మకు వాహనంగా వినియోగించాలి. అపుడు, దాని ద్వారా ఆత్మ యొక్క శక్తులు వ్యక్తమవుతాయి. ఆత్మకు లోబడి వుండటానికి ఒప్పుకొనకపోతే, ఈ జగత్తు ఆత్మోన్నతికి అడ్డుగోడ అవుతుంది. మానవశరీరం ఆధ్యాత్మిక లక్ష్యాన్ని సాధించటానికి సహాయకారి. అది ఈ భూగోళం మీద వున్న దేవాలయం అవుతుంది. మీరు మీ దృక్పథాన్ని మార్చుకుంటే, అన్నిటినీ పవిత్రతకు, ఆనందానికి, జ్ఞానానికి పుట్టినిళ్ళగా మార్చుకోవచ్చు. ఆధ్యాత్మిక సాధనను, జీవితాన్ని ఏకం చేయగలగాలి. మీ అందరిలో ఒక నమ్మకం వుంది. అదేమిటంటే, సాధన చేసే వ్యక్తి జీవితాన్ని వదులుకోవాలి, జీవితంపట్ల వ్యామోహం కల్గిన వ్యక్తికి సాధన యొక్క ప్రయోజనం అందదని. అయితే, సాధనావిధానాలపై, సాధకుల జీవితాలను చూచినట్లైతే, ఓ విలక్షణమైన ఏకత్వాన్ని దర్శించవచ్చు.

ఆధ్యాత్మికజ్ఞానం జీవితానికి నిండుదనాన్ని, పరిపూర్ణత్వాన్ని ఇస్తుంది. ఆధ్యాత్మికజ్ఞానం వేరు – ప్రపంచజ్ఞానం వేరు. ప్రపంచంలోని ఆచారవ్యవహారాలను గ్రుడ్డిగా అనుసరించటంలో ఆధ్యాత్మికత రాణించదు. ఎందుకంటే, పెక్కు సందర్భాలలో ప్రాపంచికమైన ఆచారాలు, నియమనిబంధనలు ప్రపంచంలో ఆసక్తి కలిగిన వ్యక్తుల పనుల ఫలితాలుగా వుంటాయి. కనుక, పూర్వాచారాలను గ్రుడ్డిగా అనుకరించడం విజ్ఞత కాదు. అది ఆధ్యాత్మికతను పెంచదు. వస్తువుల వాస్తవ స్వరూపాన్ని, విలువను సరిగ్గా తెలుసుకోవటం, వాటిని సరిగా ఉపయోగించటం సాధకుల ప్రధానలక్ష్యం. ఇదే ఆధ్యాత్మిక జీవనం.

***అపరాధాల మెట్టుపై అడుగేస్తున్నారు***
***సమాజ పొద్దుల్లో సంతోషాలను వెదుకుతున్నారు మీరు***
***సాటి మనిషిని గౌరవించలేని కుసంస్కారులు కాకండి***
***వికసించని మీ రాతిహృదయాలలో***
***అడుగంటిన మానవత్వపు చెమ్మ తగలాలి***
***ఇకనైనా, బ్రతుకు సరిహద్దు రేఖపై నిలచి జీవితపరమార్థం తెలుసుకోండి***
***మనసును పుటం పెట్టుకుని మళ్ళీ మనిషివై జీవితాన్ని చరితార్థం చేసుకోండి***
***తలపులతో వెలగాల్సింది జ్ఞానదీపం***
***తలాపున ఎప్పుడు వెలుగుతుందో అంతుపట్టదు.***
***సూదిమొన కూడా వెంట తీసుకుపోలేని వాడిని***
***ఈ లోకానికి చుట్టపుచూపుగా వచ్చిన వాడిని***
***జ్ఞానోదయపు శిఖరాలై, మరో రేపటి కోసం పునాదులు వేసుకుని***
***ఆత్మీయపు భావంతో అగ్రభాగాన కొలువుతీరి***
***ఆంజనేయుని మాటలతో మార్పును సాధించి***
***అందరికీ ఆదర్శవంతులుగా ఈ భువిపైన నిలవండి***
***ఆధ్యాత్మికపరులుగా మారండి***
***నా చిన్నారి ముద్దుబిడ్డలారా!***

ॐ

**13-07-2019** 08:40 AM

**179) సహనం అంటే ఏమిటి స్వామీ? క్షమాగుణం యొక్క విశిష్ఠత ఎట్టిది స్వామీ?**

సత్యాన్వేషణకై సలిపే ప్రతి ప్రయత్నమూ విలక్షణమైనదే. ఆ ప్రయత్నం ఎల్లప్పుడూ, ఒక ఖచ్చితమైన క్రమశిక్షణను నిర్దేశిస్తుంది. శారీరక బాధలు, మానసిక క్షోభలను సహించడం, ఈ క్రమశిక్షణలో ఒక భాగం. ఆకలి, నిద్రవంటి శారీరక అవసరాలు, వ్యాధి, ప్రమాదాలువంటి శారీరక క్లేశాలను సహించడం ఒక ఎత్తు. విధి ఆడే వింత క్రీడలో ఒక్కొక్కప్పుడు ప్రతిభాపాటవాలు, ప్రజ్ఞావిశేషాలు ఎందుకూ కొరగావు.

అటువంటి కఠిన పరీక్షలు ఎదురైనప్పుడు, సహనంతో ఎదుర్కొనే సామర్థ్యమే తపోతీవ్రతను తెలియచేస్తుంది. ఓరిమిశక్తి ఉన్నప్పుడే ముళ్ళబాట వంటి సాధనాపథం పూలబాటగా మారుతుంది. చర్యకు ప్రతిచర్య, ఆరోపణకు ప్రత్యారోపణ సామాన్యులకు సాధారణం. అందుకు విరుద్ధంగా, ఉదాసీనత చూపటం అసమర్ధతగా, తమోగుణంగా పరిగణించబడుతుంది. కానీ, ఎంతటి ఘోర పరాభవాన్నైనా సహించడం, ఎంతటి పతితులనైనా క్షమించడం శమనుల స్వభావం. వారు తలచుకుంటే ప్రతిఘటించగలరు, తీవ్రంగా శపించగలరు కూడా. కానీ, ఓర్పుతో వారు అన్నింటినీ భరిస్తారు. కోపాన్ని అదుపులో ఉంచుకోవడం, అసహనం వ్యక్తం చేయకపోవటం వారి సాధులక్షణాలు. ఆ సందర్భాలలో వారు పడే మానసిక ప్రయాసే తపస్సు. అంటే, ప్రతఘటించే శక్తి కొందరిలో గొప్పగా అభివ్యక్తమయితే, సహించే శక్తి మరికొందరిలో విశేషంగా అభివ్యక్తమవుతుంది. పరమపదం చేరుకోవాలనే సాధకులకు సహనశక్తి అపారంగా వుండాలి. అంతా సజావుగా సాగిపోతున్నప్పుడు, మీ మనస్సు మీకు అనుకూలంగా ఉంది కదా అనుకుంటారు. ఏదైనా ప్రతికూలత ఎదురైనప్పుడు, మనస్సుకు స్వాస్థ్యం తప్పిపోతుంది. అప్పుడే, మీ నిజస్వభావం బయటపడుతుంది. అందుకే దుఃఖాలను, కష్టాలను ఎలాంటి సణుగుడు, గొణుగుడు లేకుండా భరించాలి. ఏదో అపకారం జరిగినట్లుగా భావించకూడదు. బాధపడుతున్న భావం, ప్రతిఘటన గురించిన తలంపు, ప్రతీకార చింత, ప్రతిక్రియను గురించిన ఆలోచనను ఏమాత్రం లేకుండా భరించడమే యదార్ధమైన సహనం. ఇటువంటి క్షాంతగుణం ఉన్నప్పుడే, మనసు శాంతశీతలం అవుతుంది. తపోమయ జీవనానికి సిద్ధమవుతుంది. తపోసాధనలకు ముందుగానే మనఃశ్శరీరాలను సంసిద్ధం చేసుకోవడం ఎంతో అవసరం. అలా చేసినప్పుడే, అనుకోని ప్రమాదాలను ఎదుర్కోవటం, ప్రారబ్ధ కర్మఫలాలను ఎలాంటి ఆక్షేపణ లేకుండా అనుభవించడం సులభమవుతుంది. చేసే ప్రతి పనిలోనూ, ఇంకొంచెం ముందుకు వెళ్ళడం, ఆహారం నిద్ర శాతాలను క్రమేపీ తగ్గించడం, విశ్రాంతి సమయాన్ని కుదించడం కూడా సహనశక్తికి పరీక్షలే. ఎముకలు కొరికే చలిలో హిమాలయ గుహలలో నివసించడం, అగ్నికీలల వంటి మండుటెండలో జపధ్యానాలు ఆచరించడం సాహసంతో కూడినదే గానీ, సాటివారిపై ప్రేమ, భగవంతునిపై అనురాగం కలిగించకపోతే, ఇటువంటి వీరోచిత కార్యాలకు అర్ధమే లేదు, ఎంతమాత్రమూ అభిలషణీయం కాదు. తోటివారికి శ్రేయోదాయకమైతే, వేలసార్లు నరకానికి పోవటానికైనా సిద్ధంగా వుండాలి. సమున్నతమైన ఆదర్శాన్ని అందించటానికి ఈ రకమైన మానసిక సంసిద్ధత చాలా అవసరం. క్షమాగుణం బలహీనతకు సంకేతం కాదు, అది బలానికి గుర్తు. బలహీనమైన మనస్సు ఏదైనా ఒక చర్య జరిగినప్పుడు, దానికి ప్రతిగా స్పందించడం చేస్తుంది. కానీ, బలమైన మనస్సు మాత్రం ఒక నిర్ణయాన్ని తీసుకుని, దానిని అనుసరించి పనిచేస్తుంది. అంతేకానీ, ప్రతిక్రియను చేపట్టదు. ఓరిమి వహించడం అంటే, అన్ని పరిస్థితులలో, అన్నివేళలా మాట్లాడకుండా ఊరుకోవటం మాత్రమే అని అర్ధం కాదు. ఓరిమి అనేది గొప్ప నేర్పు. కాలం, ప్రదేశం, సమయం, సందర్భాలకు అనుగుణంగా తనకు తానుగా సర్దుబాటు చేసుకోగల కౌశల్యమే నేర్పు. క్షమ అంటే, శరీరాన్ని అన్ని రకాల శ్రమలకూ గురిచేస్తూ తపశ్చర్యలు సాగించడం అని అర్ధం కాదు. క్షమ అంటే, తలమీద మోయలేనంత భారాన్ని పెట్టుకోవడం కాదు. క్షమ అంటే, కేవలం శారీరక, మానసిక బాధలను సహించడం అని కూడా కాదు. ఇంద్రియాల తాకిడిని తట్టుకుని నిలువగల మానసిక ఆధ్యాత్మిక బలాన్ని పెంపొందించుకోవడమే క్షమ. మానసికబలాన్ని,

ధైర్యాన్ని, సాహసాన్ని పెంపొందించుకొని, తద్వారా జీవితంలో ఎదురయ్యే సవాళ్ళను, సమస్యలను, కష్టనష్టాలను, విపత్తులను, బాధలను ఎదుర్కోవడమే సహనం లేక క్షమ. బాగుపరచలేనిదాన్ని సహించి, ఓర్చుకోవలసిందే. కానీ, అది కూడా చిరునవ్వుతో. విధులనుండి, బాధ్యతలనుండి తప్పించుకుని పారిపోవడం, జీవితంలో ఎదురయ్యే కష్టనష్టాలను తట్టుకోలేక ఆత్మహత్యకు పాల్పడటం, సహనం లేకపోవడం వల్లనే. క్షమ అనేది ఒక దైవీగుణం. అది మిమ్మల్ని ఏకత్వం దిశగా నడిపిస్తుంది. ఒక్కొక్కసారి, అనుకోకుండా మీరు నాలుకను పళ్ళతో కొరుక్కోవడం జరుగుతుంది. అంతమాత్రం చేత మీరు మీ పళ్ళను ఊడగొట్టుకుంటున్నారా? అలాంటి పనిని మీరు ఎప్పుడూ చేయరు. ఎందుకంటే నాలుక, పళ్ళు రెండూ మీ శరీరభాగాలే. మీరు చేయవలసిందల్లా, ఒకింత ఆత్మావలోకనం. మానవస్వభావాన్ని అర్థం చేసుకోవడం. ఈ రెండూ చేయగలిగితే, మీ ఆలోచనలు మరింత స్పష్టంగా వుంటాయి. ఆత్మరూపంలో మీరంతా ఒక్కటే. అందువల్ల, ఇతరులను క్షమించడం అంటే, మిమ్మల్ని మీరు క్షమించుకోవడమే అవుతుంది. ఋషులు, సాధువులు ఈ విషయాన్ని చక్కగా అర్థం చేసుకున్నారు, అనుభవంలోకి తెచ్చుకున్నారు కనుక క్షమాగుణాన్ని అలవర్చుకుని తాపసులయ్యారు. మీరు ఎప్పుడవుతారని ఈ ఆంజనేయుని ప్రశ్న. సమాధానం 'మారి' చూపాలి. అది విజ్ఞత అనిపించుకుంటుంది.

***అచంచల ఆత్మవిశ్వాసంతో అన్నీ వున్నవారికన్నా మెరుగ్గా,***
***ధీటుగా ధరణిపై నిలచి***
***తనువంతా తన్మయత్వంతో ప్రవహించే స్పర్శ జ్ఞానమై, గుండె గూటిని మీటుతూ,***
***కొండంత గుండె నిబ్బరంతో విజయసోపానమధిరోహిస్తూ మేరు పర్వతంపై నిలచి,***
***ఆత్మీయ ఆలింగనాలతో ఆశలే ఆలంబనగా***
***కనువిప్పు కల్గించుకుని, మీరే కలల కౌముదిని సాకారం చేసుకుంటూ,***
***హృదయాలను ప్రవహించప చేసే దయ, క్షమ, ఓరిమి గుణాలతో***
***అసమాన ప్రతిభకు ఆలవాలమై***
***ఆంజనేయుని బోధల సారాంశం ఆలోచనల అంతర్నేత్రంతో***
***ఓ కమ్మని గానమై గూడుకట్టుకున్న అజ్ఞానాన్ని విడనాడి విజయులై***
***వీరహనుమాన్‌ను చేరి సదా సుఖించండి***
***నా చిన్నారి ముద్దుబిడ్డలారా!***

ॐ

**14-07-2019** 08:40 AM

# ఆంజనేయుని ప్రశ్నోత్తరములు

*1.* *గురుపూర్ణిమకు ఇంకొక పేరు కలదు అది ఏమిటి?*

*ఆ:* *ఆషాఢపూర్ణిమని గురుపూర్ణిమ లేక వ్యాసపూర్ణిమ అంటారు.*

2. వ్యాసులవారు వేదవ్యాసులు ఎలా అయ్యారు?

ఆ: అంతవరకు శబ్దరూపంలో వున్న అపౌరుషేయాలను వ్యాసుడు ఋగ్, యజుర్, సామ, అధర్వణ వేదాలుగా విభజించి శబ్దరూపానికి అక్షరరూపమిచ్చి వేదవ్యాసుడైనాడు.

3. గురుబ్రహ్మ శ్లోక అర్థం ఏమిటి?

ఆ: నాలుగు ముఖాల్లేని బ్రహ్మ (గురుబ్రహ్మ) – జ్ఞానచైతన్యదాత
నాలుగు భుజాలులేని విష్ణువు (గురుర్విష్ణుః)– రక్షకుడు అపమార్గం నుంచి తప్పించేవాడు
మూడు నేత్రాలు లేని శివుడు (గురుర్దేవో మహేశ్వరః) – అజ్ఞానాన్ని నశింపచేసేవాడు
అని ఆ శ్లోక అర్థం.

4. గురువును ప్రత్యక్షదైవంగా ఎందుకు భావిస్తారు?

ఆ: గురువను పదానికి సార్థకమైన అర్థం, "అజ్ఞానాంధకారాన్ని తొలగించేవాడు" అని. అందుకే, గురువును ప్రత్యక్షదైవంగా భావించి 'గురుదేవుడు' అన్నారు.

5. వేదవ్యాసునికి ఎందుకు నమస్కారాలర్పించాలి?

ఆ: దేశసంస్కృతి, సభ్యత, సంప్రదాయాలను, సదాచారాలను చాటిచెప్పే ఇతిహాస పురాణాది మతగ్రంథాలను, బ్రహ్మసూత్రాలను, భగవద్గీతను, వేదాలను విభజించి అక్షరరూపాన్నిచ్చిన జ్ఞానసముద్రుడు, విజ్ఞానభాస్కరుడు అయిన ఆ వేదవ్యాస మునీంద్రులకు ఆ పారాశర్యునికి, ఆ జగద్గురువుకు గురుపూర్ణిమ రోజున తప్పనిసరిగా నమస్కారాలు సమర్పించాలి.

6. గురువు పని ఏమిటి?

ఆ: అజ్ఞానాంధకారాన్ని తొలగించి, విజ్ఞానపు కాంతులు వెదజల్లి వెలుగుబాట చూపేవాడు, లక్ష్యసాధనకు నీడగా తోడైవుండి సాధకుని గమ్యం చేర్చేవాడు గురువు. సృష్టి–స్థితి–లయలకు అధీశ్వరులైన త్రిమూర్తుల అంశయే గురువు.

7. మీరు ఇచట గమనిస్తున్నదేమిటి?

ఆ: సాధారణంగా గురువు సాంగత్యం కోసం శిష్యులు తపిస్తారు. కానీ, ఇచట నేను పరితపిస్తున్నాను. మీలో ఎవరైనా ఒక్కరు కన్పించకపోతే, నా హృదయం తల్లడిల్లుతుంది. ఎందుకో తెలుసా? బాహ్యప్రపంచపు ముద్రలు ఎక్కడ పడతాయో అని సంరక్షకునిగా అహరహము కాపలా కాస్తున్నాను. రెండు చేతులు అడ్డుగా పెట్టి, జ్ఞానజ్యోతిని ఆరిపోనివ్వక కాపాడుతున్నాను. ఈ గురువు నుండి పొందే ప్రేమ, మీ తల్లిదండ్రుల వద్ద నుండి కూడా పొందివుండరు, గుర్తించినట్లైతే.

8. తల్లిదండ్రుల కన్నా గురువును ఎందుకు ఎక్కువ ప్రేమించాలి?

ఆ: మిమ్మల్ని మీ తల్లిదండ్రులు దివి నుండి, భువికి తీసుకువచ్చారు. అందువల్ల వారికి జీవితాంతం కృతజ్ఞుడవై వుండాలి. అంతకన్నా, నీ గురువు నిన్ను తిరిగి భువి నుండి దివికి పంపించగల మహిమాన్వితుడు. కావున, తల్లిదండ్రుల కన్నా, గురువును ఎక్కువగా ప్రేమించాలి, సేవించాలి.

9. గురుపూర్ణిమ దినమున ఏమి చెయ్యాలి?

ఆ: ఆషాఢపౌర్ణమిని గురుపూర్ణిమగా జరుపుకుని, వేదపండితులను, పౌరాణికులను, ఆధ్యాత్మిక విషయాలను బోధించే గురువులను వస్త్రభూషణాదులతో పాదపూజ చేసి, వారి అనుగ్రహాన్ని పొందాలి.

10. మీరు విష్ణుసహస్రంలో "వ్యాసాయ విష్ణురూపాయ వ్యాసరూపాయ విష్ణవే" శ్లోకం పఠిస్తుంటారు. దాని అర్థమేమిటి?

ఆ: "విష్ణుస్వరూపుడైన వ్యాసుడు, వ్యాసరూపుడైన విష్ణువు, వేదనిధియైన వశిష్ఠుని మునిమనుమనికి మీ నమస్కారాలను సమర్పించటం" అన్నమాట.

***విద్యకు ప్రతిరూపం వాగ్దేవి***
***తమస్సును తొలగించి, జీవితాన ఉషఃకాంతులను వెలిగించి, తేజస్సును అందించేది విద్య.***
***మనిషిని ఆవరించిన అజ్ఞాన, అవిద్యలను***
***తన జ్ఞానకాంతులతో పారద్రోలే దివ్యచైతన్యమూర్తి గురువు!***
***అజ్ఞానాంధకారాన్ని తొలగించి, శిష్యుల అంతఃకరణాన్ని శుద్ధి చేసే ఆధ్యాత్మికశక్తి***
***మహితాత్మ స్వరూపం గురుదేవులు.***
***జ్ఞానశక్తితో, ఉదాత్తమైన యుక్తితో, శిష్యుల సందేహాల్ని నివృత్తి చేస్తూ***
***వారి అభ్యున్నతిని ఆకాంక్షించే త్రిమూర్తుల ఆకృతి గురువు అంటే, దారి చూపేవాడు.***
***విద్య నేర్పువాడు, తప్పటడుగుల్ని చూపులతో, చేతలతో సరిదిద్ది రక్షించేవాడు,***
***మహోన్నతమైన గురుస్థానాన్ని అధిష్టించి జ్ఞానోపదేశం చేస్తూ,***
***సకల జనుల జీవితాలకు జీవితోన్నతిని అందించు ఈ ఆంజనేయుడు అందిస్తున్న***
***ఆశీస్సులు అందుకొని, అభివృద్ధి దిశగా అడుగులు వేసి, గురుని బాధ గుర్తెరిగి***
***గురుతు తెలిపిన గురువు అడుగుజాడలే మీ జీవనగమ్యంగా గుర్తించండి***
***నా చిన్నారి ముద్దుబిడ్డలారా!***

ॐ

**15-07-2019** 08:45 AM

**180) భౌతిక జగత్తులో ఏ విధంగా వ్యవహరించాలి స్వామీ?**

ఉపనిషత్తుల్లో అంతర్వాహినిగా వుండే ఆధ్యాత్మిక రాగానుభూతులు, ఆత్మను ఆనందపారవశ్యానికి అంకితం చేస్తాయి. భాష సరళం, భావం గంభీరం, శబ్దం నిరాడంబరం, మహిమ అనంతం. ఇలాంటి జ్ఞానమణులను అజ్ఞానం చేత అలక్ష్యం చేయటం ఎంతటి దురదృష్టమో మీకు మీరే అంచనా వేసుకోవాలి. మీ జీవితాలన్నీ ధనసంపద, సుఖసౌఖ్యాలపట్ల వ్యామోహంతోనే గడిచిపోతున్నాయి. ఇదే పరమార్థం, సర్వస్వం అనే భ్రమ మిమ్మల్ని వదలటం లేదు. ఏ జన్మకాజన్మే ఒక పరీక్షాపత్రం. అందులో మీకు లభించే మార్కులే ఉత్తమజన్మని నిర్ణయిస్తాయి. భగవంతునితో అనుబంధానికి నవవిధభక్తులున్నాయి.

ఉత్తమగతులనిచ్చే యజ్ఞయాగాది క్రతువులున్నాయి. పరస్పర ఆనందహేతువులైన పూజలు, వ్రతాలు వున్నాయి. అంతర్యామిని దర్శింపచేసే ఆత్మధ్యానం వున్నది. నామజపం వుంది. ఏదో బుద్ధి కుదురుగా వున్న కాసేపు, వీటిలో నిమగ్నమవుతారు. నిజానికి లోకవ్యవహారాలే ఒక మత్తులాంటి స్థితి. వాటి నుంచి బయటపడి, బ్రహ్మజ్ఞానం కోసం శీఘ్రమే కృషి చేయాలి. అలా చేసినప్పుడే మీ జన్మ సార్ధకమవుతుంది. ఇంతకీ నేను మీకు క్లుప్తంగా చెప్పదలుచుకున్నదేమిటంటే, ఈ జగత్తు అంతా ఈశ్వర చైతన్యంతో నిండి వున్నది. ఇది పవిత్రం. ఇది సత్యం. ప్రపంచంలోని వస్తుసంపద భోగార్థమే అయినా, త్యాగబుద్ధితో అనుభవించాలి. ఇతరులకు చెందిన దానికై వెంపర్లాడరాదు. ప్రపంచాన్ని మిథ్యగానూ, దుఃఖహేతువుగానూ చెబుతూ, వైరాగ్యాన్ని ఆశ్రయించి, ముక్తిమార్గాన్ని అన్వేషించు అంటూ బోధించుట లేదు. ఈశ్వరునికి ఆవాసమైన ప్రపంచం దుఃఖదాయకమూ కాదు, మిథ్య అంతకన్నా కాదు. అల్పబుద్ధితో, స్వార్ధంతో, ఇంద్రియలోలురై, ప్రపంచంలోని సంపదలను అనుభవించదలిస్తే, అది దుఃఖాన్ని, పాపాన్ని పుష్కలంగా ఆర్జించిపెడుతుంది. త్యాగబుద్ధితో ప్రపంచ సంపదలన్నీ దైవప్రసాదంగా భావిస్తూ, పవిత్రమైన మనస్సుతో అనుభవించమని చెబుతున్నాను. పిసినారిగా, లోభిగా ఇదంతా నాదే. ఇతరులకు చెందదు అనే కల్మషబుద్ధితో దేనినీ కాంక్షించకూడదు. భోగములో కూడా త్యాగముండాలి. కాబట్టి, సర్వసంగ పరిత్యాగాన్ని ప్రోత్సహించుట లేదు, పలాయనవాదమూ విన్పించుట లేదు. ఈశ్వరనివాసమైన ఈ ప్రపంచానికి ఆయనే యజమాని. మీరు కేవలం అతిథులు. కాబట్టి, ఈశ్వర సంపదకు నష్టం కలుగకుండా అనుభవించాలి. మనిషి ప్రపంచంలో దీర్ఘకాలం జీవించాలని ఆశపడతాడు. అయితే, ఆ జీవితం అర్ధవంతమై, లోకహితం కోసం వుండాలి. ఏ పని చేసినా, దానిని భగవదర్పణం చేయడానికి యోగ్యమై వుండాలి. నేను కర్తను అనుకోకూడదు. కర్మయోగియైనవాడు, అలా ఎన్నడూ భావించడు. తాను కేవలం ఉపకరణం అనే సత్యాన్ని గుర్తుంచుకుంటాడు. చేత్తో దానం చేస్తున్నప్పుడు, చేతికి పుణ్యం రాదు. ఎందుకంటే, చెయ్యి కేవలం ఉపకరణం. బుద్ధిలో ఉదయించిన దాని భావన చెయ్యి ద్వారా బహిర్గతమవుతుంది. ఇక ఆ బుద్ధికి ప్రేరణ ఎవరు? ఆత్మ. అంటే దైవమే. కాబట్టి, ఎవరు ఎలాంటి ఆధిక్యతాభావాలు కలిగి వున్నా, అది కేవలం వారి మూర్ఖత్వం తప్ప వేరుకాదు. ప్రపంచంలో కర్మ చేస్తూ నిరామయంగా నూరేళ్ళు జీవించాలి.

**181) మేము ఎట్టి కర్మలను ఆచరించవలెను స్వామీ?**

కర్మలు రెండు రకాలు. 1) జ్ఞానకర్మ 2) అజ్ఞానకర్మ. శాస్త్ర శాసనాలను పాటిస్తూ ఆచరించేవి జ్ఞానకర్మలు. మనసుకు తోచినట్లుగా చేసేవి అజ్ఞానకర్మలు. మొదటి వాటికి కర్మదోషాలుండవు. ఎందుకంటే, అవి దైవార్పణ బుద్ధితో చేస్తారు. రెండవది, మీ మనస్సును అనుసరించి చేస్తారు. మనస్సులో స్వచ్ఛత లేనప్పుడు చేసే కర్మలు దోషభూయిష్టంగా వుండగల అవకాశముంది. అపుడు కర్మఫలాలు అనుభవించక తప్పదు. కర్మను ధ్యానం లేక ఉపాసనకు జత చేసుకోవాలి. జ్ఞానంతో కాదు. జ్ఞానానికి కర్మలుండవు. అది వాటికి అతీతమైనది. జ్ఞానం అంతర్గత వైభవం. బయట ప్రదర్శించి చూపేది కాదు. "జ్ఞానానందమయం దేవం నిర్మల స్ఫటికాకృతిం ఆధారం సర్వవిద్యానాం హయగ్రీవముపాస్మహే" అంటారు. అంటే జ్ఞానం దివ్యానందం కల్గిస్తుంది. నిర్మలమైన, స్ఫటికంలా భాసిస్తుంది. స్వామిరూపం అలాగే వుంటుంది. భగవంతుడు ఒక్కడే అయినా, వేర్వేరు రూపాలలో వివిధ శక్తులను అనుగ్రహిస్తూంటాడు.

ఉపాసకుడు తన అభీష్టాన్ని అనుసరించి రూపం ఎంపిక చేసుకుంటాడు, దానికి సంబంధించిన ఆరాధనలు, ఉపాసనలు చేస్తాడు. పర్యవసానంగా వాటి ఫలితాలు లభిస్తాయి. ఏ దేవుడు, ఏ మతం, ఏ కులం అన్నది అర్థం లేని ప్రశ్న. ఆకాశం నుండి నేలజారే వర్షపు బిందువులు నదులై, సముద్రంవైపు ఎలా వెళ్తున్నాయో, ఏ దేవుడికి నమస్కరించినా అది పరమాత్మకే చెందుతుంది. భేదాలను మీరు మీ అజ్ఞానం చేత కల్పించుకుంటున్నారు. అది మీ దృష్టిభేదం, అవగాహనాలోపం. విద్య అంటే ఉపాసన. అవిద్య అంటే కర్మ. అలాగే అసంభూతి అంటే ప్రకృతి, సంభూతి అంటే హిరణ్యగర్భుడు. కర్మ, ప్రకృతి పరమాత్మ కాదని గ్రహించాలి. పరమాత్మ మనసు కంటే వేగము కలవాడు. అందరికంటే సనాతనుడు. అంటే, ఆయనకు ముందూ వెనుక ఎవరూ లేరు. ఆయనే మొదటివాడు. సంకల్పం చేత సమస్త విశ్వాన్ని చలింపచేస్తున్నాడు. మాయ చేత భ్రమింపచేస్తున్నాడు. అది ఆయన లీల. శరీరం పంచభూతాత్మకమై రూపొందింది. అమృతం, హాలాహలం కూడా మనోమథనం నుండి భావకలశాలుగా ఉద్భవిస్తాయి. మీలోని శివశక్తి, హాలాహలమనే దుష్టశక్తుల్ని వైరాగ్యపాత్రలోకి స్వీకరించి, కంఠసీమలో బంధించివేయాలి. అంతర్లోకాలలోనికి వెళ్ళనీయకూడదు. లోకహితం కల్గించే అమృతభావనలను శుద్ధమనస్సునకు పంచిపెట్టాలి. ఇదే జీవనయజ్ఞం.

***ఈ పది వరాలను నీ మది వనరులను పవిత్ర పది ఆజ్ఞలుగా భావించుకోండి***
***మీ జీవితంలో వల్లె వేసుకోండి***
***నేను అనే మాటను మరచిపోండి***
***మనము అనే బాటలో నడవండి***
***అహం అనే పదాన్ని అంతం చేసుకోండి***
***ప్రేమ అనే ఫలాన్ని అందరితో పంచుకోండి***
***నవ్వు అనే ఆభరణాన్ని ఎల్లప్పుడూ ధరించండి***
***తప్పు అనే నిప్పును దూరంగా వుంచండి***
***విజయం అనే గమ్యం కోసం నిరంతరం శ్రమించండి***
***ఈర్ష్య అనే శత్రువునూ ఎల్లప్పుడూ దూరంగా వుంచండి***
***విజ్ఞానం అనే మిత్రుడ్ని సంపాదించుకోవాలి***
***స్నేహం అనే వరంతో మనుష్యుల్ని అక్కున చేర్చుకోండి***
***మానవసేవే మాధవసేవయని, నీవే జీవుడవు, నీవే దేవుడవు అని***
***ఉన్నదాంతో సుఖంగా జీవించండి***
***మానవతతో సదా పరిమళించండి***
***ఇదే మనిషి సుఖజీవన సారాలుగా గ్రహించి***
***. ఆంజనేయుని ముద్దుబిడ్డలుగా, మహామనీషులుగా వెలుగొంది***
***విజయులై వీరాంజనేయుని చేరండి***
***నా చిన్నారి ముద్దుబిడ్డలారా!***

ॐ

**16-07-2019** 07:10 AM

**182) గురుసన్నిధిలో శిష్యుడు ఏ విధంగా ప్రవర్తించాలి స్వామీ?**

*గురువులు విద్య కోరి వచ్చిన శిష్యుల్లో భక్తివిశ్వాసాలు, వినయవిధేయతలు, నియమనిష్టలు ఎన్నో విధాల పరీక్షించేవారు. ఆ క్రమంలో మనస్సులు పరిశుద్ధమై, వారికి పరిపూర్ణత సిద్ధిస్తుంది. ఇది గురుశిష్య సాంప్రదాయం. గురుసేవ సామాన్యమైనది కాదు. అది ఒక అసిధారావ్రతం. కత్తిపైన సాము వంటిది. ఉత్తమ శిష్యుడు తన సేవను ఏ రకంగా చేస్తాడంటే, నిరంతరం గురుసాన్నిధ్యంలో వుండి, సదాచార సంపన్నుడై, తన సేవా నైపుణ్యంతో గురువు అభిప్రాయాలను తెలుసుకుంటూ, వాటికి విలువనిస్తూ, సమయానుకూలంగా సేవలు అందిస్తాడు. పతివ్రత ఎలా వుండునో ఉత్తమశిష్యుడు ఆ రీతినే వుండును. భావభేదమే కానీ, ఆచరణభేదం ఇసుమంతైనా లేక, తన సర్వస్వం గురువేనని భావిస్తాడు. ఇంకొకరకం శిష్యులలో ప్రతిపనీ గురువుగారు చెప్పినచో చేస్తాడు. లేనియెడల గురువుగారి హృదయాన్ని గుర్తించి ఆచరించు సూక్ష్మజ్ఞానం, బుద్ధికుశలత వుండదు. ఇట్టి శిష్యునికి గురువు అనుగ్రహము కొద్దికాలము మాత్రమే వుండును. ఇంకొక శిష్యుని పద్ధతి ఇలా వుండును. ఏదో ఒక స్వార్థబుద్ధితో ధనం లభించునని, ప్రతిష్ఠ లభించునని, ఏదో ఒక ప్రపంచ వాసనలతో గురువు వద్ద చేరుతాడు. ఇతనికి తన స్వార్థమునందే లక్ష్యము గానీ, గురుసేవయందు లక్ష్యముండదు. గురువుగారిని ఎదిరించి మాట్లాడును. ప్రతిపనియూ చెప్పినా గ్రహించడు, గ్రహించిననూ చెయ్యడు. గురువుగారియందు దోషములు వెదికి వాటిని ఇతరులతో చెబుతూ వుంటాడు. తాను తప్పు చేసి తప్పు చేయలేదని, అది గురువుపైన పెట్టి తప్పించుకొనును. ఇట్టివాడు గురుదేవుని ఆచరణ ప్రభావమును, జ్ఞానమహాత్మ్యమును ఎట్లు గుర్తిస్తాడు? గురువుకు మాత్రం పామరుడైనా, వివేకం కలిగి తరించాలన్న భావమే కల్గివుంటాడు. ఎంతవరకు అతనికి జ్ఞానోదయం కలుగదో, అంతవరకు అనుక్షణం శిక్షించుచునే యుండును. శిష్యుని ప్రయత్నం, సంస్కారము ఫలోన్ముఖమవునో, అప్పుడే జ్ఞానోదయమవుతుంది. అపుడు, తన పూర్వకర్మలను, గురుసేవలో చేసిన లోపాలను ఒకసారి వెనుకకు తిరిగి విచారించుకొనుచూ, తన మందమతిని గూర్చి, అజ్ఞానమును గురించి బహువిధాల చింతించి, పశ్చాత్తాపం పొందాలి. అట్లు కాకుండా, తన దుష్టసంస్కారాలను బహుప్రయత్నం చేత, సత్సంస్కారముల ద్వారా నశింపచేసుకొనక, దుష్టసంస్కారములనే వృద్ధి చేసుకొన్నచో, అతడు జన్మపర్యంతం గురుసాన్నిధ్యమునందుండి సేవ చేసిననూ, గురువు అనుగ్రహమునకు పాత్రుడు కాజాలడు. దుర్జనుడు, సజ్జనుడు కావాలి. సజ్జనుడు శాంతి పొందాలి. శాంతుడు బంధము నుండి విముక్తుడు కావాలి. ముక్తుడైనవాడు ఇతరులను గూడా ముక్తులను చేయుటకు సహకరించాలి. ఇదే ఈ గురుపూర్ణిమ సందేశం! ఆంజనేయుని గురుబోధన స్వీకరించి, స్వీయ పరివర్తనతో పరిపూర్ణ మానవులై, మానవీయతను చూపండి. ఇదే గురుదక్షిణ!*

***ఏయ్, ఎవరు నువ్వు? కాస్త వెనుకకు తిరుగు!***
***అంటూ నా వెంట పడ్తున్నావెందుకు?***
***కాలం విలువ తెలియదనుకుంటా, నా దారికి అడ్డురాకు.***

*క్షణం చేజారితే, లక్ష్యాన్ని చేరగలనా?*
*ఏమిటా లక్ష్యం అని ప్రశ్నించుకున్నట్లయితే*
*సంయమనం లేక సంశయాల నిచ్చెనపై*
*అభద్రతా గారడీలతో అపురూపమైన భవిష్యత్ అంధకారంలో*
*వారసత్వ వలయ మోహాన్వితుడవై, స్వరూప వర్తమాన వెలుగును ఆర్పుకోవడమా*
*లేకపోతే, నీలోని నన్నే గుర్తించటంలేదంటే, నిన్ను నీవు కోల్పోయి ఎంత కాలమైందో*
*లక్ష్యం వేరుగా ఉన్నప్పుడు, సుస్వరాల గమకాలకు ఇంక చోటెక్కడలే*
*ఇంటి దేహంలోనే అనుక్షణం రగులుతున్న ఉచ్ఛ్వాసనిశ్వాసలతో*
*ఏమి సాధించావు ఇప్పటివరకు? కాలం చేజారే వరకేగా?*
*ఎందాక సాగిస్తావు ఈ పయనం?*
*తర్వాత తప్పిపోయిన వాటిని వెతకటం*
*దూరమైన అనుభూతులకై ప్రాకులాట,*
*అపుడు అవి శూన్యంలో హాహాకారాలే*
*ఇప్పటకైనా నిన్ను నీవు తెలుసుకో, నిన్ను నీవు మలచుకో*
*అజ్ఞానపు పొరను చీల్చు, ఈ ఆంజనేయుని బోధలతో*
*జ్ఞానసూర్యుడివై వెలుగొందు*
*అపుడు నువ్వే నేనుగా మనుగడ సాగిస్తావు*
*ఆధ్యాత్మిక జీవనానికి కవచమై నిలుస్తావు*
*బలమైన దృక్పథంతో జీవించే వ్యక్తి జ్ఞాని*
*గమ్యం లక్ష్యాలతో జీవించే వ్యక్తి అజ్ఞాని*
*దృక్పథంతో లక్ష్యాన్ని గమ్యాన్ని గుర్తించి అడుగులేసేవారే ఈ ఆంజనేయుని ముద్దుబిడ్డలు.*
*గమ్యం లేని ప్రయాణం వద్దు. ధీరులై ధీరత్వంతో మీకు మీరే ధీటుగా నిలవండి*
*నా చిన్నారి ముద్దుబిడ్డలారా!*

ॐ

**17-07-2019** 08:55 AM

**183)** మానవ సంబంధాల పట్ల ఏ విధంగా వ్యవహరించాలి స్వామీ?

*భూమి మీద నివసించే సమస్త ప్రాణికోటిలోకెల్లా, మానవజన్మ ఎంతో విశిష్ఠమైనది. ఈ విషయంలో ఎటువంటి సందేహమూ లేదు. అయితే ప్రస్తుతం వున్న మానవజాతిని గమనించండి. జీవితం సమస్యల సుడిగుండంలో చిక్కుకుని ఆరోగ్యాన్నీ, ఆయువును పోగొట్టుకుంటూ, అన్ని విధాలా బలహీనులౌతున్నారు. ఎందువలన? మానవుని మేథస్సు అత్యంత సున్నితమైంది, సూక్ష్మమైనది. తనను గురించి సమాజం, ప్రపంచం, ప్రకృతిలను గురించి సమూలంగా తెలుసుకోగలుగుతుంది. అటువంటి సమాచారం సేకరించబడే*

కొలది, అంతరంగమంతా కలుషితమవుతుంది. బాహ్యప్రపంచపు వ్యక్తులకు, సంఘటనలకు సంబంధించిన ఎటువంటి సమాచారమైనా బంధమే. దానివలన శక్తి హరించుకుపోతుంది. వాస్తవానికి బంధాలే బాధలకు మూలం కదా! అందునా, బలీయమైన మానవ సంబంధాలు అతి ప్రమాదకరం. అరిషడ్వర్గాలలో కామము, క్రోధము, లోభము, మోహము, మదము, మాత్సర్యము వంటివి మనిషిలో మానవత్వాన్ని హరింపచేసి, దానవత్వాన్ని ప్రకోపింపచేస్తాయి. మోహము అనేది బంధాల ద్వారానే ఉత్పన్నమవుతుంది. అది స్వేచ్ఛను పొందటానికి, జీవితపరమార్థము నెరవేర్చుకోవటానికి అవరోధమవుతాయి. మీరు ఎవరిని గురించి అతిగా, అనవసరంగా ఆలోచించినా, మీ శక్తి హరించుకుపోతుంది. బానిసభావం పెరుగుతుంది. ప్రస్తుత మానవ జీవనవిధానాన్ని గమనించండి. ఒకరు లేకుండా మరొకరు జీవించే అవకాశమే లేకుండాపోయింది. ఎవరిని వ్యతిరేకించినా, ఎవరి వెంటబడినా వారికి ప్రమాదముండదు, నీకే ప్రమాదమవుతుంది. పరిమితంగా వుంటే ఏదైనా ఔషధమే. అతిగా వుంటే విషమవుతుంది. కాబట్టి, అతిగా పరిచయాల కోసం ఆరాటపడవద్దు. ఎవరినీ మోయవద్దు. వ్యక్తిగత పరిచయాలు, వ్యక్తిగత సంబంధాలు, విశ్వవ్యాపిత భావనకు అవరోధమవుతాయి. బంధాల వలన స్వశక్తిని విస్మరించే అవకాశముంది. మంచైనా, చెడైనా బంధాలను బలోపేతం చేస్తుంది. ఒకటి బంగారు సంకెళ్ళయితే, మరొకటి ఇనుప సంకెళ్ళు అవుతుంది. బంధాలను వదిలివేయగలిగితే, శక్తిని కోల్పోయే మార్గాలు మూసివేయబడతాయి. అపుడే సంపూర్ణ స్వేచ్ఛను పొందవచ్చు. స్వేచ్ఛ నుండి ఏమి చేసినా అది బంధం కానేకాదు. అందువలన, ఎవరితోనూ అతిగా పరిచయాలు పెంచుకోవద్దు, ఎవరికీ దూరంగా వుండవద్దు. ఒక వ్యక్తిపట్ల రాగాన్ని పెంచుకోవటం అంటే, మరొక వ్యక్తిపట్ల వ్యతిరేకతను ఏర్పర్చుకోవడమే కదా! రాగద్వేషాలు అతి ప్రమాదకరం. అవి జీవితాన్ని సమూలంగా బలహీనపరుస్తాయి. ఇక చివరగా చెప్పేది ఏమిటంటే, సమాచారం ఏదైనా, ఎటువంటిదైనా మాయకు ప్రతిరూపమే, వాస్తవం కానేకాదు. ఎందుకంటే, భౌతిక ప్రపంచమే మాయ కాబట్టి, దానికి సంబంధించిన ఎటువంటి సమాచారమైనా మాయను బలంగా చేస్తుంది. అందువలన, దానిపట్ల నీవు నిరంతరం అప్రమత్తంగా వుండాలి. ఆధ్యాత్మిక ఉన్నతికి సమాచారమనేది అన్నివిధాల అవరోధమే. సంబంధానికి, మోహానికి ఎంతో వ్యత్యాసముంటుంది. సంబంధమంటే పరిమితమైనది, మోహమంటే వదలలేనిది. సంబంధాలు తప్పక అవసరమే. అవి లేకుండా దైనందిక జీవితంలో అడుగు ముందుకు పడదు. అయితే, వారి మీదనే ఆధారపడి, వారు లేకపోతే ఏమైపోతానో అనే భావన చాలా ప్రమాదకరమైనది. మోహమనేది వదిలితేనే మోక్షము వస్తుంది. నేను మీకు ఇచ్చిన సందేశాలలో మోహం వద్దు అన్నాను కానీ, సంబంధాలను వదలమనలేదు.

***కనులు చెమర్చాయి ఎందుకని? కదిలాయి కళ్ళల్లో నీటి బిందువులు ఎందుకని?***
***ఏమిటనీ? ఎలా అనీ? ఎందుకనీ? ఎవరి కోసమనీ?***
***అగోచర సమాధానాల వలలో చిక్కిన హృదయాన్ని చూచి తల్లడిల్లలేక***
***అణువణువూ అసంతృప్తి అలుముకుంది***
***బాధ చెందే హృదయంలో భగ్గుమన్న అగోచరమంతా లోపల భస్మమయ్యే***
***ఆక్రందన కంఠాన్ని కదిలించి, కుదిపెను నీ అసంతృప్తిని***

***కన్నీరులా కారిందా? భీతి చెందకు***
***నీళ్ళు నిండిన కళ్ళను తోడనివ్వు***
***కారే ప్రతి కన్నీటిబొట్టులో బాధను పోనివ్వు***
***సవాళ్ళను ఎదిరించనివ్వు, సమస్యను ఛేదించనివ్వు***
***హృదయంలో శాంతిని నింపనివ్వు, వికసింపనివ్వు నీ హృదయాన్ని***
***నవ్వు నవ్వు నవ్వు నవ్వు నవ్వు***
***నీ హృదయాంతరాళాల్లో బంధాన్ని వదిలి, మోహాన్ని వదిలి***
***మన్మోహనుడైన మీ మోహనుడ్ని పట్టుకుని మోక్షతీరాన్ని చేరండి***
***ఈ మారుతి బోధలతో మోహ బంధ విముక్తులుకండి***
***నా చిన్నారి ముద్దుబిడ్డలారా!***

ఓం

**19-07-2019** 09:45 AM

**184) నేటి పరిస్థితులలో మమ్మల్ని మేము ఎలా సంస్కరించుకోవాలి స్వామీ?**

*ప్రాచీనమైన మహోన్నతమైన ఆదర్శాలకు తిలోదకాలిస్తున్నారు. తపోభూమిని, భోగభూమిగా చేసుకుంటున్నారు. మీకు సరిపడని అల్ప ఆదర్శాలను స్వీకరిస్తున్నారు. వేటినయితే లెఖ్ఖలోకి తీసుకుని ఉన్నతమైనవిగా కన్పిస్తున్నాయో, వేటిని అనుకరించటానికి ప్రయత్నిస్తున్నారో అవ్వన్నీ ఆధ్యాత్మిక గంధం లేశమాత్రం లేని కేవలం దేహపర భోగైకలక్ష్యంతో ముందుకు సాగుతున్నారు. రోజురోజుకూ, మానసిక రోగాల్ని పెంచుకుంటూ, మీకు మీరే మరణమృదంగాన్ని వాయించుకుంటున్నారు. దీనితో జీవితంలో శాంతి కరువవ్వటమే కాదు, అసలు జీవన-మరణాలు రెండింటి మధ్య ఉన్నామా? అని అన్పిస్తుంది ఇప్పటి పరిస్థితి మీకు. మరి ఎవరినో అనుకరించడం మీ అజ్ఞానానికి, అవివేకానికి పరాకాష్ట కాక మరేమవుతుంది? ధర్మార్థకామమోక్షాలలో అర్థకామాలు తప్ప ధర్మం, మోక్షంలాంటి పదాలు వినటానికి కూడా ఇష్టపడనివారు మీలో చాలామంది ఉన్నారు. ఏదో విధంగా ఈ దేహాన్ని సేవించాలన్న భావనలోనే నెలకొనియున్నారు. అంతర్జాలం ప్రపంచాన్ని ఏకీకృతం చేసే ప్రక్రియలో, పాశ్చాత్యుల ఇంద్రియసుఖైక లక్ష్యాన్ని, సంస్కృతిని విశ్వవ్యాప్తం చేస్తున్నది. సాంస్కృతిక దాస్యంలోకి నెట్టబడుతున్నారన్న విషయం మీకు కొంచెం కూడా అర్థం కావటం లేదు. పదిమందిలో ఉంటూ కూడా ఒంటరితనాన్ని అనుభవిస్తున్నారంటే, ప్రతివ్యక్తి ఒక ఏకాంత దీపమవుతున్నాడనే కదా అర్థం. నేనూ మిమ్మల్ని ఏకాంతాన్ని గడపమని చెబుతూ వుంటాను. కాని, అది ఈ రకమైన ఏకాంతం కాదు. నిశ్చలమనస్కులై, శాంతిసాగరులై, స్థిరచిత్తంతో, భగవన్నామస్మరణ చేస్తూ, అవసరమైన సేవను అందిస్తూ, మృదుసంభాషణాపరులై, మృదుభావాలతో కూడి, హృదయార్పణం కావించుకుంటూ, నీకు నీవుగా ఏకాంతంలో వుండగలిగే స్థితి అది. కానీ, అర్థంలేని ఏకాంతాన్ని అనుభవిస్తూ, మానసిక రోగులుగా మారి అనేక కారణాలు వున్నా, అతి ముఖ్యకారణం వైఫల్యభావన, జీవితంలో ఓడిపోయాం, నష్టపోయామన్న భావనతో మానసికంగా*

కృంగిపోతున్నారు. మరణం అందరినీ సమానం చేస్తుంది. వట్టి చేతులతో ఈ ప్రపంచంలోకి వస్తున్నారు, వట్టి చేతులతో తిరిగి వెళ్ళాలి అన్న విషయం సదా గుర్తుంచుకుంటే విజయం. వైఫల్యభావనల నుండి దూరంగా ఉండవచ్చు. ఇక్కడ విజయాలు లేవు, వైఫల్యాలు లేవు. రెండు విభిన్న అనుభవాలు. విభిన్న అనుభవాలతో ఎంత తొందరగా మీరు పాఠాలు నేర్చుకోగలుగుతారో చూసుకోవాలి మరి. మీరు ఉన్నదానితో సంతృప్తి చెందకపోవటానికి మూలకారణం ఆనందపుఖని మీ లోపలే వున్నదన్న సత్యాన్ని అర్థం చేసుకోకపోవటమే. ఈ ఆనందఖనిని త్రవ్వి వజ్రాలను పొందే ప్రక్రియలో మీకు బుద్ధి కన్నా, బాగా ఉపయోగపడేది హృదయం. హృదయవికాసం లేకుండా కేవలం బుద్ధి నిశితం చేయటానికే పాఠశాలజీవితాన్ని, కళాశాలజీవితాన్ని ఉపయోగించుకోవటానికి మీరు ప్రయత్నించుటలో తెలివైన స్వార్థపరులుగా తయారవుతున్నారు. విద్యతోపాటు సంస్కారాన్ని, ఆధ్యాత్మిక విలువలను, హృదయవికాసాన్ని పొంది, తనకు పరులెవరూ లేరని భావిస్తూ, అందరినీ తన భాగస్వాములుగా చేసుకోవటానికి ప్రయత్నిస్తే, భావోద్వేగాలు అదుపులో వుండుటయే గాక, అందరినీ సమంగా ప్రేమించగల సామర్థ్యాన్ని సాధిస్తావు. అందరిలోవున్న ఆ భగవంతుని ఉనికిని కాంచటం నేర్చుకుంటే, ఎవరిలోనూ దోషాలు ఎంచరు. దేవుడిలో దోషాలు ఎంచే సాహసం చేయలేరు కదా! ఎప్పుడైతే వ్యక్తుల మీద గౌరవభావం పెరుగుతుందో, అప్పుడు వారికి సేవ చేయగలుగుతారు. వారిని ప్రేమించగలుగుతారు. వీటి ద్వారా శాంతిని పొందుతారు. హృదయమే భగవంతుడి ఆవాసం. సర్వశక్తికి ఆలవాలం. ఈ ఆవాసం బలహీనమవకూడదు. సేవద్వారా, ప్రేమను అందించటం ద్వారా, హృదయవికాసాన్ని పొంది, జీవనసాఫల్యానికై ప్రయత్నించమని ఈ ఆంజనేయుని బోధల సారాంశం.

**ఇంపుగ - భావములకు క**
**ర్పింపుగా - కెంపుగను - సతతము ప్రేమను పెంపొం**
**దింపగ - వంపుగ - సొంపుగ - చంపూ కావ్యముగా -**
**ఆంజనేయుని భాష - సంతసమొసగెను వచనమ్ముగా - రుచిరమ్మగు - రచనముగా -**
**ఆంజనేయుని భాష - రసరమ్యముగా -**
**వచనమ్మగు గేయముగా - వచన కవిత్వముగా - నిలిచె -**
**ప్రజలు హాసింపన్ - నూతనమై -**
**ప్రతినిముషము - చేతనమై - కీర్తులనిడు -**
**చిన్మయ కవితా కేతనమై - సంగీత నికేతనమై -**
**కీర్తులనిడు - ఆధ్యాత్మిక నికేతనమై - వెలుగు నింపి -**
**ఆంజనేయుని మదిభావాలు - కీర్తిని బడయును**
**చేర్పులతో - ఓర్పులతో - మార్పులతో -**
**మారుతి బోధనలతో - సతతము మారి -**
**మననీయంబైన మార్పుతో - వెలుగొందుచూ-**
**నేర్పులతో నొసంగు - ఆంజనేయుని మదిలోని భావాలు - భావపరంపరలై -**

***తుదిశ్వాస - నిజసంతసమున - వీడి -***
***విసుగు విరామం లేక - మచ్చలేని బిడ్డలై నాదరి చేరండి***
***నా చిన్నారి ముద్దుబిడ్డలారా!***

ॐ

**21-07-2019** 08:55 AM

**185) తృప్తి ఎలా లభిస్తుంది స్వామీ?**

*తృప్తి అనేది ఆధ్యాత్మిక ప్రపంచంలోకి ప్రవేశద్వారం. చెప్పులు గుడి బయట విడిచిపెట్టినట్లుగా, కోరికలు, ఆశలు, అత్యాశలు అన్నీ వదిలిన తర్వాతనే తృప్తి ద్వారా ప్రవేశం చేయాలి. తృప్తి లేకపోవటానికి అనేక లోకసామాన్య ఉదాహరణలు ఇస్తున్నాను. ఒకటి, నిప్పు. దానికి మరోపేరు అగ్ని. అగ్నిదేవుడికి ఎదురులేని శక్తి వుంది. దేనినైనా దహించివేస్తాడు. అందుకే సర్వభక్షకుడనే పేరు వుంది. అగ్నికి పునీతుడనే పేరు కూడా వుంది. లోహాలన్నీ అగ్నితోనే పునీతమవుతాయి. దేవతలు అగ్ని ద్వారానే హవిస్సులు స్వీకరించి శక్తిమంతులవుతారు. శీలపరీక్ష నిరూపణ కోసం సీతమ్మతల్లి అగ్నిపునీత అవ్వాల్సి వచ్చింది. అగ్ని సాయం లేకుండా పర, అపరకర్మలు జరుగవు. ప్రకృతి శక్తులలో అగ్నికి ప్రత్యేకస్థానం. అగ్నిని సాక్షిగా చేసుకుని స్నేహం, వివాహాది క్రతువులు, ఉపనయనాలు చేసుకుంటారు. దాంపత్యం కూడా స్నేహమే. అయితే, నూరు శరత్తుల పవిత్రస్నేహం అది. "స్నేహం సాప్తపదీనాం" అంటే, కలసిన మనసులతో ఏడడుగులు నడచినా, అది స్నేహబంధమే అవుతుంది. వివాహ క్రతువులలో ఏడడుగుల నడక, అగ్ని ప్రదక్షిణాలు ఇవ్వన్నీ వధూవరుల బంధాన్ని పటిష్టమూ, శాశ్వతమూ చేయటానికే. ఇక వర్షధారలతో వెల్లువెత్తే నదులన్నీ సముద్రంలోనే కలుస్తాయి. మళ్ళీ సముద్రజలం ఆవిరిగా మారి, ఆకాశానికి హారతులిస్తుంది. మేఘాలు రూపుదాలుస్తాయి. సూర్యుడి అనుగ్రహంతో వేడి తగ్గి, చల్లదనంతో వానలు కురుస్తాయి. అడవులు పులకిస్తాయి. ఇది ఒక నిరంతర జలయజ్ఞం. ఇన్ని నదీనదాలు సముద్రంలో కలుస్తున్నా, ఇంకా ఇంకా నదుల కోసం నిరీక్షిస్తూనే వుంటుంది. దానికి తృప్తి లేదు. అలాగే కోటానుకోట్ల జీవుల ఆయువును ప్రతిక్షణం హరిస్తున్నా, తృప్తి చెందదు. అంటే, మరణాలు అలా జరుగుతూనే వుంటాయి. తృప్తిపడితే మరణాలు నిలచిపోతాయి. మరి అలాగే, కామానికి కూడా తృప్తి వుండదు. ఎప్పుడూ కొత్తగానే వుంటుంది. రుచి ప్రలోభం కూడా అలాగే వుంటుంది. తిన్నప్పుడు చాలు అని అనిపించినా, అటుతర్వాత మళ్ళీ కావాలని అన్పిస్తుంది. కాబట్టి, తృప్తి లేకపోవటమే లోకసహజం. అల్పసంతోషిగా ఉండటానికి మనిషి ప్రయత్నించాలి. ఇది మనసును నియంత్రించుకోవటం ద్వారా లభిస్తుంది. జిహ్వ, ఇంద్రియాల కోరికల్ని, తృప్తిని నియంత్రించేది మనసే. కాబట్టి, మనస్సుని మీ అధీనంలో వుంచుకోవాలి. నీరు ఇంకిపోయాక సరస్సు వుండదు. సిరిసంపదలు పోగానే బంధుపరివారమూ వుండదు. అట్లాగే, జ్ఞానం కలిగినాక, సంసారమెందుకుంటుంది? ధనం, జనం, యవ్వనం, కీర్తి, విద్య, సంపదలన్నీ ఒక కాలంలో వుండి, కాలంతో కరిగిపోయేవి. "మాయాసమా" లేనిది వున్నట్లుగా కన్పిస్తుంది. మార్పు చెందటం మాయ యొక్క గుణం. మాయారూపంగా సమస్తాన్నీ వదిలి, బ్రహ్మపదం పొంది,*

తరించమని గురువుగా ఉపదేశిస్తున్నాను. జీవితంలో అనుక్షణమూ భగవంతుడు జీవునికి గుర్తుచేస్తూనే వుంటాడు. తన గమ్యాన్ని మరచిపోకూడదన్న ఉద్దేశ్యంతో హెచ్చరిస్తుంటాడు. శరీరం సడలిపోయింది, తల నెరిసిపోయింది, దంతాలు ఊడిపోయాయి. వృద్ధుడై కర్రమీద ఆధారపడి నడుస్తున్నాడు. అప్పుడు కూడా అతడు కోరికల మూటను వదిలిపెట్టడు. ముందు చలిమంట, వెనుక సూర్యుని వేడి, రాత్రులు నిద్రరాక మోకాలికి గడ్డాన్ని ఆన్చి కూర్చుంటాడు. ఆహారం దోసిట్లో పెట్టించుకుని భిక్షుకునిలా తింటాడు. చెట్టు నీడలో తలదాచుకుంటాడు. ఇదంతా వైరాగ్యానికి భూమిక. అయినా, అంతటి దీనావస్థలో కూడా ఆశాపాశం మనిషిని వదలటం లేదు. మానవుడు గంగాతీరానికి వెళ్ళి ఎన్ని స్నానాలు చేసినా, వ్రతాలు దానాలు ఎన్ని చేసినా, జ్ఞానం పొందేవరకూ నూరు జన్మలెత్తినా ముక్తి లభించదని చెబుతున్నాను. మోక్షానికి భూమిక వివేకం. వివేకానికి వైరాగ్యం కావాలి. భోగాల అనిత్యాన్ని గుర్తించుట ఎరిగినవాడికి వైరాగ్యం తప్పక వుంటుంది. భగవదనుగ్రహం లేనిదే మోక్షం రాదు. విషయాసక్తిని వదిలించుకుని, ఒడ్డునపడమని మళ్ళీ మళ్ళీ హెచ్చరిస్తున్నాను. శుకుడు యోగంలో రమిస్తుంటాడు. జనకుడు చక్రవర్తిగా సకల భోగాలలో ఓలలాడుతుంటాడు. ధర్మరాజు సకల బంధుసంగంలో వున్నాడు. వేదవ్యాసుడు అందరినీ విడిచి సంగవిహీనుడై కాలం గడిపాడు. ఎవరేస్థితిలో వున్నా, ఎవరి మనస్సైతే త్యాగంతో కూడి, బ్రహ్మమందు రమిస్తూ వుంటుందో, అతడే ఆనందమయుడై వుంటాడు. అతడే ముక్తి పురుషుడవుతాడు.

***మనిషిగా ఆలోచించుకోండి***
***మనసుతో అవలోకించుకోండి***
***అన్ని జన్మలలోనూ అత్యున్నతమైన జన్మలోకి అడుగిడినావు నువ్వు***
***మానవజన్మ దొరకటమే దుర్లభం, అయినా నీకు దక్కింది.***
***వందేళ్ళు ఆయుష్షు వచ్చి చేరింది.***
***పాతికేళ్ళు నీవి కావు***
***సరే, మరి మిగిలిన ముప్పాతికేళ్ళూ నీవేగా?***
***ఎన్ని చేయాలి? ఎన్ని సాధించాలి?***
***కానీ, నువ్వేమి సాధిస్తున్నావు?***
***సాధించటం అంటే వేధించటం కాదు***
***నీ మనస్సులోనున్న నన్ను కనుగొనండి***
***ఎన్నో దూరతీరాల ప్రయాణాల తర్వాత***
***మిమ్మల్ని మీరు తెలుసుకున్నామంటే ప్రయోజనమేమిటి?***
***నీ మనసులో మనసుగా , వెలుగులో వెలుగుగా,***
***గానంలో రాగంగా, పదంలో అక్షరంలా,***
***పథంలో అడుగుగా, సుఖంలో జోడుగా, దుఃఖంలో తోడుగా వున్నా***
***ఇప్పటికీ అసలైన నువ్వు ఎవరు? నేనెవరు?***
***నీవు కనుగొన్న నువ్వేనా? కాదు!***

***ఏదో స్వార్ధంతో, అహంతో, ఏదో అర్ధంతో, ఏదో భావంతో, ఏదో అభావంతో***
***తుష్టి రాక, తృప్తి లేక, నమ్మలేక నిరంతరం దేన్నో వెదుకుతూ***
***అసలే కళ్ళులేని నీవు, అంధకారంలో అన్వేషణ చేస్తున్నావు.***
***ఇది ఎంతవరకు?***
***ఆంజనేయుని బోధలు బాగుపర్చుట లేదా?***
***లేవండి మరి ఈ ఆలోచనల నుండి***
***సరైన మార్గంలో నడిచి గమ్యం చేరండి***
***నా చిన్నారి ముద్దుబిడ్డలారా!***

ॐ

**22-07-2019** 09:10 AM

**186)** ఇంద్రియ నిగ్రహం ఎలా సాధ్యము స్వామీ?

*అజ్ఞానానికి మూలకారణాలు మోహం. మోహమునకు పునాది అజ్ఞానం. దుఃఖం, మోహం, అజ్ఞానం వీటన్నింటినీ అరికట్టాలంటే, ఇంద్రియనిగ్రహానికి ప్రయత్నం చేయాలి. ఇంద్రియాలనేవి గమ్యాన్ని చేర్చే గుర్రాల్లాంటివి. గుర్రాన్ని అదుపులో వుంచినపుడే, అందులో ప్రయాణించిన వారికి క్షేమం కలుగుతుంది. గుర్రాన్ని స్వేచ్ఛగా విడిచి, రథంలో ప్రయాణిస్తే ఆపద తప్పదు. భగవంతుడు మనిషికి కొన్ని అవసరమైన ఇంద్రియాలను ప్రసాదించాడు. భగవంతుడు ప్రతి అవయవమును ఏ విధంగా ఉపయోగించుటకు ప్రసాదించాడో, ఆ విధంగా వాటిని ఉపయోగిస్తూ సంచరించినప్పుడే మనిషికి సుఖశాంతులు లభిస్తాయి. భగవంతుడు మీకు ప్రసాదించిన అవయవములను చెడుమార్గంలో ఉపయోగిస్తే, తప్పక చెడు జరుగుతుంది. దీనికో చక్కని ఉదాహరణ చెబుతాను. ఒక మహారాజు వుండేవాడు. ఆయనకు ఐదుగురు భార్యలు వుండేవారు. కానీ, ఏ ఒక్కరూ భర్త చెప్పేమాటను వినేవారు కాదు. భార్యలకు వశమైపోయిన రాజు, చాలా కుమిలిపోయేవాడు. నా రాజ్యంలో భార్యకు వశము కానివారు ఎవరైనా వున్నారా? అని తలపోసి, ఒకరోజు ఓ సమావేశం ఏర్పాటు చెయ్యదలచాడు. ఆ సమావేశానికి పురప్రజలంతా రావాలని ఆహ్వానించాడు. రాజమహల్‌కు రెండువైపులా రెండు పందిళ్ళు ఏర్పాటు చేయించాడు. ఒక పందిరిలో భార్యకు వశమైపోయినవారు వుండాలి, రెండవ పందిరిలో భార్యను వశము చేసుకున్నవారు కూర్చోవాలన్నారు. ఇలా నిబంధన విధించారు. సభ ప్రారంభమైంది. ప్రతి ఒక్కరూ భార్యకు వశమైపోయినవారి కోసం ఏర్పాటు చేసిన పందిరిలోకే పోతున్నారు. ఆ సంగతి రాజు కనిపెట్టి నా రాజ్యంలో ఇంతమంది భార్యలకు వశమైనవారు ఉంటున్నారు. నేనొక్కడినే అట్లా వుంటే, తప్పేమిటి అనుకున్నాడు. చివరగా భార్యను వశం చేసుకోవడానికి అని నిర్ణయించిన పందిరిలో ఒక్కడు చేరాడు. ఒక్కడైనా ఇలాంటివాడు వున్నాడా అని రాజు ఆశ్చర్యపోయి, ఆయన దగ్గరకు చేరి, స్వాగతం పలుకుతూ, "నువ్వు మహానుభావుడివి. నీ భార్యను నువ్వు వశం చేసుకున్నావు. అది ఎలా సాధ్యం?" అంటూ అతన్ని అనేక రకాలుగా పొగిడి, "నీ భార్యను ఎలా వశం చేసుకోవటం జరిగింది?" అని ఆశ్చర్యంగా అడిగాడు.*

అప్పుడా వ్యక్తి, "ప్రభూ! నేను భార్యకు వశుడనే కానీ, భార్య నా వశం కాదు" అన్నాడు. "అయితే మరి నువ్వు ఈ పందిరిలోకి ఎందుకు వచ్చావు?" అని అడిగాడు రాజు. అప్పుడా వ్యక్తి చేతులు రెండూ జోడించి, "మహారాజా! పురజనులంతా ఎక్కడ చేరుతారో, అక్కడ నువ్వు వుండకు. నువ్వు ప్రత్యేకంగా పోయి ప్రక్కన ఖాళీగా వున్న పందిరిలో వుండు అని నా భార్య చెప్పింది. అందుకే ప్రక్కన వున్న ఖాళీ పందిరిలో వున్నాను" అన్నాడు. దానికి రాజు కోపించి, "వారందరూ వున్నచోటే నువ్వు కూడా ఉండాలి" అంటూ గట్టిగా చెప్పాడు. అప్పుడా మనిషి మహారాజుకి తిరిగి నమస్కరిస్తూ, "మీరు ఏ శిక్ష విధించినా, ఆఖరికి నా ప్రాణం తీసినా ఫర్వాలేదు. నా భార్య మాటను నేను జవదాటలేను" అన్నాడు. అప్పుడు రాజు అనుకున్నాడు, "లొంగిపోవటం వల్లనే, ఇన్ని అనర్థాలు" అని. ఇక్కడ మహారాజు అనేవాడు మనసు. ఐదు ఇంద్రియాలే అతని ఐదుగురు భార్యలు. ఇంద్రియాలకు లొంగినవాడు రాజైనప్పటికీ, అతనికి బాధలు తప్పవు. అందమైనది చూడాలి, ప్రపంచంలో అన్ని వింతలు దర్శించాలి అని కన్ను కోరుతుంది. రుచికరమైన, ప్రీతికరమైనవన్నీ తినాలని నాలుక కోరుతుంది. మధురమైన గానం ఆలకిమచాలని, తనకిష్టమైనవి వినాలని చెవి కోరుతుంది. మంచిమంచి వాసనలు, సుగంధాలు అనుభవించాలని ముక్కు కోరుతుంది. ఒకటి ఒకవైపు పోవాలంటే, మరొకటి మరోవైపు సాగిపోవాలంటుంది. ఒకదానికొకటి ఏమాత్రం ఒద్దిక లేక వుంటాయి. అన్నింటినీ తృప్తిపర్చడం ఎవరికి వీలవుతుంది? ఇలా ఇంద్రియాలకు లొంగిపోతే, అన్నీ మిమ్మల్ని అనేక విధాల బాధిస్తాయి. మొట్టమొదట వీటిన్నింటినీ అదుపులో వుంచుకునే మార్గం ఆలోచించాలి. మీ స్వాధీనంలో ఇంద్రియాలు వుండేటట్లు చూచుకోవాలి. అటువంటివాడే నిజమైన ధీరుడు. ఇంద్రియాలను అరికట్టి, ఇంద్రియాలు చెప్పినట్లుగా చేయకుండా, వాటిని మనసునకు అప్పచెప్పి, మనసు, బుద్ధితో విచారణ చేసినపుడు, ఇది మంచి, ఇది చెడు అనే నిర్ణయాలతో, మీ ఇంద్రియాలు పనిచేస్తాయి. బుద్ధినే ఆధారం చేసుకున్న మనిషి పురుషోత్తముడిగ మారిపోతాడు. బుద్ధి అనేది నిత్యానిత్యవస్తు పరిశీలన చేసే శక్తితో కూడుకున్నది. బుద్ధిని ఆధారంగా చేసుకుంటే, చివరి వరకూ ఇది సరియైన స్థితికి కొనిపోతుంది. అదే మనసుని ఆధారం చేసుకుంటే, ఏ క్షణాన, ఎప్పుడు, ఏ విధంగా మారిపోతుందో చెప్పటానికి వీలుకాదు. మనసును ఆధారం చేసుకుంటే, రాతి తెప్పను ఎక్కి నీటిని దాటే ప్రయత్నం వంటిది. ఎక్కడ మునుగుతుందో తెలీదు. ఇంద్రియనిగ్రహం కోసం జ్ఞానాన్ని ఆధారం చేసుకోవాలి. చలించే ఇంద్రియాలు మనిషికి స్థిరమైన ఆనందమును ఇవ్వలేవు. మార్పు చెందే వస్తువులు శాశ్వితమైన సుఖమును అందించలేవు. చలించేవి చలించే ఫలితాలనే ఇస్తాయి. నశ్వరమైన పదార్థాలు, నశ్వరమైన ఆనందాన్నే అందిస్తాయి. సత్యమైన, నిత్యమైన ఆత్మతత్వాన్ని అనుభవించమని, దాని కోసం కృషి చెయ్యమని ఈ ఆంజనేయుడు ఆదేశిస్తున్నాడు.

***ఎన్నో ప్రాణులను సృష్టించాడు దేవుడు***
***అన్నింటిలో మేధావిగా నిలిచాడు మానవుడు***
***భాష ద్వారా భావం వ్యక్తపరుస్తూ***
***నవ్వి, అందరినీ నవ్విస్తూ, ఆనందాన్నిస్తూ జీవించు, జీవించనివ్వు అని బోధిస్తూ***
***తోటి ప్రాణులను ప్రేమిస్తూ, మంచి-చెడు, పాప-పుణ్యాలను గుర్తెరిగి***

***ప్రగతికి, జగతికి మార్గదర్శకుడుగా పెరిగి,***
***సమాజంలో మంచిని ప్రచారం చేస్తూ***
***జీవితంలో అసమానమైన మీ ప్రతిభకు***
***ఈ ఆంజనేయునిచే గౌరవించబడి***
***కులమతాలకు అతీతుడైన దేవుని ధ్యానిస్తూ***
***వృద్ధాప్యంలో ప్రశాంత జీవనం ఆశిస్తూ,***
***పరోపకార, సత్కార్యాలు చేస్తూ తనువు చాలించాలని***
***జీవిత పరమార్థాన్ని గ్రహించటమే ఉత్తమ జీవన లక్ష్యంగా గ్రహించండి***
***నా చిన్నారి ముద్దుబిడ్డలారా!***

ॐ

**24-07-2019** 08:50 AM

*ఈ రోజు మీకు కొన్ని మంచి సలహాలను ఇవ్వాలనుకున్నాను. ఎన్నో విషయాలలో మీరు సందిగ్ధావస్థలో మునిగి వుంటారు. దానిలో నుండి బయటపడి, మీ లక్ష్యాన్ని, ధ్యేయాన్ని మరువకుండా గమ్యం చేరండి.*

*1. ఐశ్వర్యం ఒక ద్వారం గుండా ప్రవేశిస్తే, ప్రేమ అనే పదార్థం కిటికీలో నుండి బయటకు వెళ్తుంది. ఎందుకంటే, ధనం వల్ల మనిషికి గర్వం పెరిగి అందరినీ హీనంగా చూస్తాడు.*

*2. జీవిత సర్వస్వాన్ని ఒక మంచి లక్ష్యం కోసం అర్పించినవాడే నిజమైన క్లాస్ ప్యూపుల్ మీ భాషలో. అవును. జీవితంలో ఏ లక్ష్యం లేకుండా, బ్రతుకును ఈడుస్తున్నారు. పైగా, క్లాసుల గురించి మాట్లాడుతారు.*

*3. బలహీనుడు అదృష్టాన్ని, బలవంతుడు తమ శక్తిని నమ్ముతారు. ఇది అక్షరాలా నిజం. అదృష్టం పాలు మీ జీవితాలలో చాలా తక్కువ.*

*4. సగం నిజం చెప్పటం అంటే, పెద్ద అబద్ధం చెప్పినట్లే. అంటే దాని అర్థం, ఏదైనా స్పష్టంగా, పూర్తిగా చెప్పాలి. లేకుంటే, అవతలివారి మనసును మీరు కలవరపెట్టినట్లే గదా!*

*5. పుస్తకం లేని ఇల్లు, ఆత్మ లేని శరీరంవంటిది. అంటే దీని అర్థం, జ్ఞానం లేని జీవితం చావుతో సమానం.*

*6. ఎవరైనా సలహాలు ఇవ్వాలనుకుంటున్నారంటే, వారికే సలహాలు అవసరం. అంటే, అనవసర సలహాలకు విలువ వుండదు కదా!*

*7. మననం చేయకపోతే, విద్య నశిస్తుంది. అంటే మరచిపోతున్నాం అనే మాటను వాడకూడదు అంటే, మననం అత్యవసరం.*

*8. భయానికి విరుగుడు జ్ఞానం. అంటే భయానికి కారణం తెలుసుకుంటే, అది తగ్గుతుంది.*

9. చీకటిని నిందిస్తూ కూర్చొనక, చిరుదీపాన్ని వెలిగించుకోండి. అంటే, సమస్యను గురించి ఆలోచిస్తూ భయపడక, పరిష్కారాన్ని గురించి ఆలోచించాలి.

10. జీవితం పెరుగుతున్న కొద్దీ, మీ బలహీనతలు అర్థమవుతాయి. అంటే, మీరు ప్రయత్నిస్తే తెలుస్తుంది, విజయం ఎంత కష్టమో అర్థమవుతుంది.

11. కార్యాచరణకు దిగకుండా, లక్షసార్లు ఆలోచించకండి. అంటే, మీరు వాడే 'ఇంపాజిబుల్' అనే పదం జీవితంలో అసలు లేనేలేదు అన్నది అర్థం చేసుకోండి.

12. మీలో లేని లక్షణాలను, గొప్పదనాన్ని ఇతరుల ముందు ప్రదర్శించటానికి ప్రయత్నిస్తారు, చాలా సమయాన్ని వృధా చేస్తారు. నిజమే కదా! మీరు అనవసరంగా గొప్పదనాన్ని ఇతరుల ముందు ప్రదర్శించటానికి ప్రయత్నిస్తుంటారు.

13. వాస్తవాలు వాస్తవాలే. మీకు నచ్చనంత మాత్రాన అవి అసత్యాలు అయిపోవు. కానీ, ఈ విషయం తెలుసుకోలేక, కోపం తెచ్చుకుంటారు.

14. కీర్తి క్షణికం – అపకీర్తి శాశ్వితం. ఎందుకంటే కంసుడు, రావణాసురుడు ఇంకా గుర్తున్నారందుకే.

15. 'నేను' అనే వ్యాధివల్ల బాధపడేవాడు అహంకారి. దీనివల్ల గర్వం వస్తుంది. అది దుఃఖానికి మూలం.

16. గొప్పవారు ఎప్పుడూ 'నేను' అనరు, 'మనం' అంటారు. ఎందుకంటే, నాయకులకు వ్యక్తిగత జీవితం వుండదు మరి. పదిమంది మంచికోసమే వారు బ్రతుకుతారు.

17. నీ భయాన్ని నీలో దాచుకో – నీ ధైర్యాన్ని ఇతరులకు పంచండి. అంటే, మీరు ఇతరులకు భయం కంటే ధైర్యాన్ని పంచాలి గదా!

18. జీవితం తెలిసిన వ్యక్తి, బాధకు గురికాడు. ఎందుకంటే, ఈ ప్రపంచం గురించి ఎంత తెలిస్తే అంత బాధ తగ్గుతుంది.

19. మీకు ముగ్గురు డాక్టర్లున్నారు. వారు మితమైన ఆహారం, ప్రశాంతమైన మనస్సు, నిరంతరం ఉత్సాహం. దీనికే స్వామి చెప్పేవారు. వర్రీ, కర్రీ, హర్రీ

20. లోయలో నీరు నిశ్శబ్దంగా, లోతుగా ప్రవహిస్తుంది. అంటే, డాంబికాలు పోవద్దు అని అర్థం.

21. గొప్ప వ్యక్తిత్వం ఉన్నవారు ఎప్పుడూ ఇతరులకు కఠినంగా కన్పిస్తారు. ఎందుకంటే, అంత దృఢత్వం మీకు నచ్చదు కనుక.

22. పనిలో అత్యంత ముఖ్యభాగం 'ప్రారంభించుటయే'. అంటే, చాలా పనులు అసలు మీరు మొదలుపెట్టనే పెట్టరు. అందుకని చెప్పాను.

23. గొప్పవారికి లక్ష్యాలుంటాయి. మిగతా వారికి కోరికలుంటాయి. ఇదే లక్ష్యానికి, కోరికకు తేడా.

24. సంతోషంగా వుండే కళ చాలా మందికి తెలియదు. ఎందుకంటే, అన్నీ వున్నా బాధపడేవారు

చాలామంది వున్నారు కదా. అంటే సంతోషం తెలియదనే కదా!

25. మార్చలేని దానిని భరించక తప్పదు. ఎందుకంటే, కొన్నింటితో సర్దుకుపోవాలి.

26. చివరగా చెబుతున్నాను. నేను విద్యార్థులకు పాఠాలు చెప్పను, నేర్పను. వారిని నేర్చుకునేలా చేస్తాను. అందుకే గురువునయ్యాను.

***నేను చెప్పింది చేస్తున్నారా? మీ మనసుకు నచ్చినట్లు చేస్తున్నారా?***
***మనిషిగా పుట్టి, సాటి మనిషిని తొక్కేయాలని ఎందుకు పయనిస్తున్నారు?***
***మతం, కులం, ప్రాంతం, ఆడ, మగ, నావాళ్ళు, నీవాళ్ళు***
***ఇలా విభజిస్తూపోతూనే వుంటారా?***
***ఎవరి భజన చేయడానికిది?***
***నీవాళ్ళ కోసం ఎంత వంచన చేస్తారు? ఎంతెంత కూడబెడతారు?***
***నువ్వు పై లోకానికి వెళ్ళాక, నువ్వు కూడబెట్టింది నీతో వస్తుందా?***
***ఆలోచించుకోండి ఓసారి!***
***ఓ మనిషీ! తిరిగి చూడమని చెప్పండి!***
***అంతా ఒక్కటే అనే భావమే ఇందుకు మార్గం***
***అన్నీ తెలిసిన వేల్పు ఈ ఆంజనేయుడు.***
***మమతే సూక్ష్మం. సమతే మోక్షం.***
***సద్గుణైక మందిరమే అద్వైతం***
***ఆత్మలో సంలీనమే ఏకతాసూత్రం***
***జయజయవాదం జగతికి ఆధారం***
***జీవేశ్వరుల సంగమమే అద్వైతం***
***అది తెలుసుకోండి***
***ఆంజనేయుని భాషలో, భావంలో గుర్తించండి***
***నా చిన్నారి ముద్దుబిడ్డలారా!***

ॐ

**25-07-2019** 08:40 AM

**187) మనోభావనలలో పరివర్తన ఎలా సాధ్యం స్వామీ?**

నా చిన్నారి ముద్దుబిడ్డలారా! స్పందించండి. నిరుపేదలు, అట్టడుగు వర్గాలవారు, అజ్ఞానుల కోసం స్పందించండి. మీ గుండె లయ తప్పి, మెదడు స్థంభించిపోయి, పిచ్చిపడ్తుందేమోనని మీరు భయపడే వరకూ ఇలా స్పందిస్తూనే వుండండి. అప్పుడు, పరమాత్ముని పాదపద్మాల వద్ద ఆత్మనివేదనం చేసుకోండి. అప్పుడు మీలో ఒక గొప్పశక్తి ఆవిష్కృతమవుతుంది. స్పందనే జీవనసారం. భక్తి, దృఢత్వాలు

లోపించిన ఎడల, ఎంతటి మేథోపరమైన కార్యాచరణ గూడా, దైవసాన్నిధ్యాన్ని చేరలేదు. మీరేమి ఆలోచిస్తారు? ఎలా ఆలోచిస్తారు? ఏమి చేస్తారు? ఏమి చేయకుండా వుంటాము? అన్న దానికి మీ భావనలే కీలకమైనవి. కొన్ని భావనలను ఇష్టపడతారు, మరికొన్నింటిని విస్మరించ చూస్తారు. సంతోషభావన, భద్రతాభావన, ప్రేమభావన, శాంతిభావన, విజయభావన, సాహసభావన, విశ్వాసభావన, నిస్వార్థభావన, సౌకర్యభావన, ప్రాముఖ్యభావన, ఆమోదభావన వంటి మంచి భావాలను వాంఛిస్తారు. అభద్రతాభావన, దుఃఖభావన, ఉద్వేగభావన, ద్వేషభావన, ఉదాసీనభావన, వైఫల్యభావన, విసుగుభావన, నైరాశ్యభావన, విస్మరణభావన, అసౌకర్యభావన, ఆగ్రహభావన, స్వార్థభావన తదితరమైన భావాలను వద్దనుకుంటారు. ఏదైనా ఒక భావనను సాఫల్యం చేసుకునేందుకో లేక, అధిగమించడం కోసమో మానవుని ప్రతిచర్య నిర్దేశితమై వుంటుంది. కొన్ని విధాలైన అనుభూతుల కోసం కొన్ని విధాలుగా వ్యవహరిస్తారు, కొన్ని విధాలైన అనుభూతులు దూరంగా వుండేందుకు కొన్ని విధాలుగా వ్యవహరించడం. అయితే, కొన్ని సందర్భాలలో మాత్రం ఇతరుల భావనలను ఎలా ప్రభావితం చేస్తారన్న దానిపై మీ భావనలు ఆధారపడి వుంటాయి. కనుక, ఇతరులకు మీరు ఏమి చేస్తారు లేక, ఏమి చెయ్యరు అనేది, వారు ఎలా భావించాలని మీరు కోరుకుంటున్న దానిని బట్టి వుంటుంది. అయితే, అందరికి తమ భావనలపై అదుపు వుండదు. ఒకే ఒక నిర్ణయంలో భావనలు మార్చుకోగల శక్తి అందరికీ వుండదు. కొన్ని భావనలు రాకుండా నివారించలేరు. మీ భావనలను మీరు అదుపు చేయటానికి బదులు మీ భావనలే మిమ్మల్ని అదుపు చేస్తాయి. అటువంటప్పుడు భావపరివర్తనాన్ని ఎలా సాధించాలంటే, క్రియ–భావనల చక్రం ద్వారానే. మీ చర్యలు–భావనలు నిటారుగా వుండవు, చక్రాకారంగానే వుంటాయి. మీ క్రియలు కొన్ని భావనలకు దారితీస్తాయి – అదే విధముగా మీ భావనలను బట్టి కొన్ని క్రియలు వుంటాయి. మీరు ఉద్రిక్తంగా వున్నారు కాబట్టి ఉద్రేకపూరితంగానే మాట్లాడుతారు. అలా ఆవేశంగా మాట్లాడటం వల్ల మరింత ఆవేశపూరితులవుతారు. ఇది ఒక చక్రం. కనుక, ఉద్రిక్తతను అధిగమించాలంటే ఎంతో మనోనిబ్బరంతో మెలగవలసి వుంటుంది. అవతలవ్యక్తి కళ్ళల్లోకి సూటిగా చూడటం, భుజాలను విశాలంగా చేసుకోవటం, కొంచెం బిగ్గరగా మాట్లాడటం, మరికొంత వేగంగా నడవటం వంటి క్రియలవల్ల మీ ఆత్మవిశ్వాసం పెరుగుతుంది. తద్వారా ధీమంతులవుతారు. ఉన్నతమైన చైతన్యస్థాయిలతో జీవించడాన్ని మీరు ప్రారంభించేంత వరకూ మీ భావనలను నియంత్రించలేరు. అయితే, మీ క్రియలను నియంత్రించడం ద్వారా మీ భావనలను నియంత్రించగలుగుతారు. ఒకానొక స్వామీజీ ఒకసారి ఒక భక్తుడిని మద్యం తెచ్చిపెట్టమని కోరాడు. స్వామీజీగా వుండి మద్యపానం చేయటమేమని నివ్వెరపోయారు భక్తజనం. స్వామీజీ ఆదేశాన్ని ధిక్కరించలేని భక్తుడు ఆయన కోరినట్లుగానే మద్యం పట్టుకొచ్చాడు. స్వామి ఆ మద్యంసీసాను తన ఎదురుగా ఉంచుకుంటూ, "ప్రలోభ భావనలతో అతీతంగా వుండగల స్థాయికి నేనింకా చేరుకోలేదు. అయితే ఒక్కటి మాత్రం నాకు తెలుసు. నా చేతులు సహకరించకుండా ఈ మద్యం నా గొంతు దిగలేదు. నా ప్రలోభ భావనలను నేను అదుపు చేసుకోలేకపోయినా, నా చేతుల్ని అదుపులో పెట్టగలను. కనుక, నా చేతులు ఈ మద్యంసీసాను తాకవు" అన్నాడు. మీ భావనలపై ఆధిపత్యాన్ని సాధించేదాకా మీ క్రియలపై సాధికారతను సాధించాల్సి వుంటుంది. సామాజికంగానూ, ధార్మికంగానూ, మనిషి చేసే చర్యలలో మార్పు తీసుకురావటం ద్వారానే అతడి ఆలోచనా తీరును మార్చవచ్చు. ఉదాహరణకు

రాచరికపు రోజుల్లో యుద్ధంలో ఓడిపోయిన రాజు, తన కిరీటాన్ని గెలిచిన రాజు పాదాల దగ్గర వుంచుతాడు. తన ఓటమికి సంకేతంగా, "ఇప్పటిదాకా నా రాజ్యంలోని ప్రజల సంక్షేమానికి నేను బాధ్యత వహించాను. ఇప్పుడు నా రాజ్యం నీదైపోయింది. కనుక, నా ప్రజల సంక్షేమ బాధ్యతను కూడా నీకు అప్పగిస్తున్నాను. వాళ్ళను జాగ్రత్తగా చూడు!" అన్నదే ఆ చర్య సందేశం. ఇక్కడ లొంగిపోవటం అంటే, బాధ్యతల బదలాయింపు అన్నమాట. సామాన్యజనానికి కిరీట సమానమైనది వారి కేశసంపదే. దైవసన్నిధిలో కేశఖండన చేయించుకోవటం అంటే, మీలోని అహాన్ని దేవుని చరణకమలాల వద్ద వుంచి, ఆత్మసమర్పణ చేసుకుంటున్నారన్నమాట. ఇతరులతో ఆత్మీయతాభావన కలగటం కోసం వారితో కరచాలనం చేయడమో లేక, వారిని ఆలింగనం చేసుకోవటమో చేస్తారు. అంటే కేవలం భౌతికమైన చర్యగా ప్రారంభమైనా, అది అంతిమంగా మీలో ఆత్మీయతాభావాన్ని కలుగచేస్తుందన్నమాట. మీలోని ఆధ్యాత్మిక భావనలను రగుల్కొల్పడం కోసం వినయాన్ని చూపుతూ, విధేయతతో నమస్కారం చేస్తారు. మీలోని ఆత్మవిశ్వాసభావనతో సాధనకై నడుం బిగిస్తారు. మీలోని భక్తిభావనకు ప్రతీకగా దైవానికి సాష్టాంగ ప్రణామం చేయడమో లేక, మోకాళ్ళపై మోకరిల్లడమో చేస్తారు. ప్రార్థనలు కూడా చేస్తారు. ఇవ్వన్నీ భౌతికమైన చర్యలే. అయినా, వాటి లక్ష్యం వివిధమైన భావనలను మీలో కలిగించడమే కదా. "చెడు చూడొద్దు, చెడు అనొద్దు, చెడు వినొద్దు" అన్న అంతరార్థం కూడా క్రియాపరివర్తనం ద్వారానే భావపరివర్తనాన్ని సాధించాలన్నదే. మీరు ఎక్కడ నుండి ప్రారంభించగలరో అక్కడి నుండి ప్రారంభించండి. అప్పుడు మీ చర్యలను మీ భావనలు నీడలా వెంటాడుతాయి. అణువణువూ శోధించి, ఈ ఆంజనేయుడు అడుగులు వేయిస్తున్నాడు. వేయి విధాల బోధిస్తున్న ఈ అమృతగుళికలను సేవించి, ఆధ్యాత్మిక ఆరోగ్యవంతులుగా తయారుకండి.

***ప్రకృతి నుండి ఎన్నో పాఠాలను నేర్చుకోవచ్చు***
***ప్రతి ఆకు రాలుతూ ఏమి చెబుతుంది?***
***ఈ జీవితం శాశ్వతం కాదని.***
***ఒక పువ్వు వికసిస్తూ ఏమి చెబుతుంది?***
***జీవించే ఒక్క రోజైనా, గౌరవంగా జీవించమని.***
***ఒక మేఘం వర్షిస్తూ ఏమని చెబుతుంది?***
***తనలాగే స్వార్థం లేకుండా మంచినే చేయమని.***
***ఒక మెరుపు మెరుస్తూ ఏమి చెబుతుంది?***
***ఉండేది క్షణమైనా, ఉజ్వలంగా వుండమని.***
***ఒక కొవ్వొత్తి కరుగుతూ ఏమి చెబుతుంది?***
***తను కష్టాల్లో వున్నా, ఇతరులకు సుఖానివ్వమని.***
***ఒక ఏరు జలజలా పారుతూ ఏమి చెబుతుంది?***
***తనలాగే కష్టసుఖాల్లో చలించకుండా సాగమని.***
***ఒక జాబిల్లి వెలుగుతూ ఏమి చెబుతుంది?***
***తనలాగే జీవితాంతం ఎదుటివారిలో వెలుగును నింపమని.***

***ఒక వానరం ఏమి చెబుతుంది?***
***తనలాగే చంచల స్వభావాన్ని వీడి అచంచలమైన స్థితిని సాధించమని.***
***అట్టి స్థితిని నీవు పొందినచో, నిన్ను ఉన్నతునిగా తీర్చిదిద్దే బాధ్యత ఈ మారుతిది.***
***ఆనందనిలయం, సంతోషసాగరం, గర్వంలేని గౌరవం వున్న బిడ్డలు - ఇదే నా కుటుంబం!***
***నా చిన్నారిబిడ్డలతో కూడిన కుటుంబం!***

ఓం

**26-07-2019** 08:40 AM

**188) కర్మల ప్రభావం నుండి ఏ విధంగా బయటపడగలము స్వామీ?**

*వర్తమానంలో మనిషి తెలిసీ తెలియక చేసే తప్పులకు తక్కువగానో ఎక్కువగానో కష్టాలు అనుభవించక తప్పదు. పుణ్యకర్మల ఫలితంగా సౌఖ్యం, శాంతి లభించుతాయనేది నిజమైన మాటే. మీరు మాట్లాడే ప్రతిమాట మాధుర్యంతో కూడినదై వుంటే, పుణ్యకర్మల ఖాతాలోకి జమ అవుతుంది. మీరు వ్యవహరించే కర్మలు ఎదుటివారిలో దుఃఖం కలిగించితే, పాపకర్మల ఖాతాలోకి వస్తుంది. మీరు చేసే కర్మల ఫలితం ఈ జన్మలోనే పొందవచ్చు, లేదా రాబోయే జన్మలో కూడా అనుభవించక తప్పదు. ఇది కర్మల ఫిలాసఫీ. శ్రవణకుమారుడు నదిలో తన తల్లిదండ్రుల కోసం నీటి కడవను ముంచినప్పుడు నీటిధ్వనిని ఏదో జంతువు ధ్వనిగా భావించిన దశరథుడు బాణం విసిరిన ఫలితంగా, శ్రవణుని మరణం, అతని తల్లిదండ్రులు అనుభవించిన వేదన, శ్రవణుని తల్లిదండ్రుల శాపం, దీని ఫలితంగా దశరథుడు మరణించడం, ఇదంతా తాను చేసిన కర్మలఫలితం అని అనక తప్పదు కదా! కర్మల ప్రాబల్యం నుండి మనిషి బయటపడాలంటే, దైవగుణాలు అవలంభించడం అవసరం. క్షమాగుణం, ఆత్మైకప్రేమ, సేవాతత్పరత ఈ గుణాలు తాను చేసిన తప్పుడు కర్మల నుండి విముక్తులుగా చేస్తుంది. ఇది తప్పు, ఇది ఒప్పు అనే జ్ఞాన విచక్షణ కోల్పోయినప్పుడు, దైనందిన వ్యవహారాలలో పొరపాట్లు జరుగుతుంటాయి. భగవంతుని ప్రేమకు పాత్రులమవ్వాలనే తపన, సాధన హృదయం నుండి ఆవిర్భవించాలి. భక్తుని ప్రేమకు భగవంతుడు కూడా తలవంచుతాడు. భక్తిభావం పొంగిపొరలిన శబరి ఇచ్చిన ఎంగిలి ఫలాలు సైతం స్వీకరించాడు రాముడు. తల్లి, తండ్రి, శిక్షకుడు, రక్షకుడు, సద్గురువు, స్నేహితుడు, బంధువు ఇలా సకల సంబంధాల్లో పరమాత్ముని స్మరించాలి, ఆరాధించాలి. సకల చరాచర సృష్టికర్త అయిన ఆ పరాత్పరుని తన వానిగా అనుభూతి పొందగలిగితే, మనిషి ఏర్పర్చుకున్న బంధాల నుండి అతీతుడవుతాడు. శరీరాన్ని, కర్మేంద్రియాలను నడిపించే చైతన్యజ్యోతి ఆత్మగా అనుభవం పొందుతూ, పరమాత్మతో మమేకం కావాలి. అందరి కర్మలకు సూత్రధారి జగన్నాటక పాత్రధారి ఒక్క నిరాకార పరమాత్మ ఒక్కడే. లౌకిక ప్రపంచన్యాయ సూత్రాలను అనుసరించి, న్యాయాధికారి మరణశిక్షను విధించినప్పటికీ, రాజ్యాధినేత ఆ మరణశిక్షను సైతం తగ్గించగల అధికారం కలిగి వుంటాడు. అలాగే సర్వశక్తిమంతుడు, సర్వజ్ఞుడు అయిన ఆ పరమాత్ముడు మనిషి చేసిన దుష్కర్మల ప్రభావం నుండి తగ్గించగలడు. అందుకే కర్మలు చేయడం మీ కర్తవ్యం-కర్మలఫలాన్ని ఆ పరమాత్మునికి అర్పించడం జ్ఞానుల లక్షణం. కర్మల ఫిలాసఫీ మహాసముద్రం వంటిది. సాక్షి స్థితిలో*

వుండుటలోనే ఆనందం, బ్రహ్మానందం దాగి వుంది.

***కలలోనైనా అనుకోలేదే ఇంతటి మహద్భాగ్యము మీ జీవితంలో ఒకటుందని***
***ఎక్కడ నీవు, ఎక్కడ నేను. నీవూహించనిది జరిగినదీనాడు***
***నీవూహించినవి జరగలేదేనాడు***
***చీమంత మనసు చిత్రాలు చేసింది ఎన్నో***
***బంధాల బందిఖానా నుండి ఈ స్వేచ్ఛావిహారంలో***
***గగనాన ఎగిరే ఆ విహంగాలకు దీటుగా పోటీపడుతున్న నీ మనసు***
***ఎన్నో వేల కిలోమీటర్లు దాటి, ఈ అనంత విశ్వంలో ప్రయాణిస్తుంది***
***అందుకే మనిషికి హద్దులున్నాయి కానీ, మనసుకు హద్దులు లేవు కదా!***
***ఏమిటో! నీ మనస్సు అల్పసంతోషిలా వుండే ఇంతటి అద్భుతమైన ప్రకృతిలో***
***మమేకమైపోవాలని ఆనందడోలికలలో ఓలలాడుతూ ఉవ్విళ్ళూరుతుంది ఓ మనసా!***
***ఆగవే ఆగు! అప్పుడేనా... ఎందుకే తొందర?***
***ఇప్పుడేగా అద్భుత ఆనంద ఆధ్యాత్మికతకు నెలవైన ఈ ఆంజనేయుని కుటీర క్షేత్రంలోని***
***పచ్చని ప్రకృతి రమణీయతల ఒడిలో పరవసిస్తున్న ఈ చిన్నారి బిడ్డలము***
***సాధన అనే స్వర్గపు ద్వారంలో అడుగుపెట్టారు.***
***ముందు ముందు ఇంతకు మించిన ఆత్మానందపు సంతోషం మిమ్మల్ని వరించబోతున్నదని***
***గట్టిగా వారి మనస్సులకు నచ్చచెప్పుకుంటున్నారు***
***ఆధ్యాత్మికపరులుగా ఎదుగుతున్న నా చిన్నారి బిడ్డలు!***

ॐ

**27-07-2019** 08:40 AM

**189)** ప్రియం అనగా ఏమి స్వామీ?

ప్రియం అనే మాటకు విస్తృతమైన అర్ధముంది. మనసు ఇష్టపడేది ప్రియమైనది అవుతుంది. ఇష్టాన్ని పూర్తి మోతాదులో వ్యక్తీకరిస్తే అది ప్రియం అవుతుంది. అత్యంత ప్రీతికరమైనదిగా కూడా ప్రియాన్ని చెప్పవచ్చు. సంతోషం కలిగించేది కూడా ప్రియత్వమే. కొందరికి దానం ఇవ్వటం ద్వారా సంతోషం అంటే ప్రియత్వం కలిగించవచ్చు. ప్రియభాషణ వల్ల కొందరికి ఆనందం కలిగించవచ్చు. మంత్రబలం లేక, మూలబలం చేత కొందరిని ప్రియవశ్యులుగా చేసుకోవచ్చు. కానీ, ఇలాంటి వాటితో పనిలేకుండా కొందరు సహజ ప్రియభావన కలిగి వుంటారు. వారు అందరినీ అన్నివేళలా సంతోషపరుస్తారు. ఇందుకు ఉదాహరణగా స్వామిని చెప్పుకోవచ్చు. ఎప్పుడూ నవ్వుమొహంతో, స్నేహపూర్వక సంభాషణ చేసేవారు. ఆత్మీయంగా అందరితో వ్యవహరించేవారిని అందరూ ఇష్టపడ్తారు. మీరు నవ్వుతున్నప్పుడు మరింత ఆకర్షణగా వుంటారు. కాబట్టి ఎంత చికాకు, విసుగులో వున్నా నవ్వు ముఖంతో వుండటానికి ప్రయత్నించండి.

**190) ద్వేషం మరియు అసూయ గుణములను ఏ విధంగా అధిగమించాలి స్వామీ?**

ద్వేషం వల్ల ఎదుటివారి మంచితనాన్ని, తెలివిని, పాండిత్యాన్ని ఒప్పుకొనరు. ఇష్టమైనవారు ఏ పని చేసినా శుభాలే. కానివారు ఏమి చేసినా పాపాలే, తప్పులే. కారణాంతరాల వల్ల కొందరితో మీకు విభేదాలు ఏర్పడవచ్చు. అందుకు బాధ్యులు ఎవరైనా కావచ్చు. మీ మనసుకు కష్టం కలిగించినవారి పట్ల మీకు ద్వేషం కలుగవచ్చు. ఇక అప్పటినుండి వారు ఏమి చేసినా తప్పులే కన్పిస్తాయి. వారు ఎంత మంచివారైనా, మేధావులైనా, పండితులైనా మీ ధోరణి వారిపట్ల ద్వేషపూరితంగానే వుంటుంది. ద్వేషానికి అసూయ కూడా ఒక కారణం. మీకంటే అధికులపట్ల అసూయ కలుగుతుంది. వారు ఆధిక్యత ప్రదర్శిస్తున్నట్లు, మీతో అహంకారంతో మసలుతున్నట్లు ఊహించుకుంటారు. అపార్థాలు కూడా ద్వేషభావాన్ని కలుగచేస్తాయి. వాలి తన సోదరుడు సుగ్రీవునితో ఆ విధంగానే వ్యవహరించి, ప్రాణం మీదకు తెచ్చుకున్నాడు. అసూయ, ద్వేషం నిప్పులాంటివి. ఏ కర్రకు నిప్పు వుంటే ఆ కర్రే కాలినట్లు, ఎవరికి అసూయా ద్వేషాలుంటాయో అవి వారినే దహిస్తాయి. నిప్పే కాదు, వ్యధ కూడా మనిషి మనశ్శాంతిని దహించివేస్తుంది. అది అదృశ్యజ్వాల. అందుకే ఒత్తిడికి, వ్యధకి దూరంగా వుండాలి. లేకపోతే, అనేక రోగాలు మీమీద దాడి చేస్తాయి. మీకు ఇష్టమైనవారు ఎలాంటి తప్పులు చేసినా భరిస్తారు, ఇష్టంలేనివారు మంచి చేసినా మందలిస్తారు. లోపం మీదే కానీ ఎదుటివారిది మాత్రం కాదు. మిమ్మల్ని మీరు సంస్కరించుకోవాలి. మీరు ఆదర్శంగా వుంటే, ఎదుటివారు మీమాట వింటారు, గౌరవిస్తారు. లేకపోతే హేళన చేస్తారు, లేదా పట్టించుకోరు. ఈ విషయం మీరు గుర్తుంచుకోవాలి. ప్రేమ, గౌరవం మీరు ఇతరులకు ఇస్తేనే మీకు తిరిగి ఇస్తారు. కాబట్టి, మీలోని లోపాలను మీరే గుర్తించాలి. వాటిని సరిదిద్దుకోవటం చేతకానప్పుడు, సద్గురువును ఆశ్రయించాలి. విదురుడు, దుర్యోధనుడు పుట్టినప్పుడే ధృతరాష్ట్రునికి సలహా ఇచ్చాడు, “దుర్యోధనుడ్ని ఒక్కడినీ వదిలేస్తే మిగతా కొడుకులు అభివృద్ధి చెందుతారు, లేకపోతే నూరుగురు పుత్రులూ నాశనమవుతారు” అని. దేనిని పొందటం ద్వారా అధికనష్టం కలుగుతుందో, దానిని క్షయమంటారు. సంపద అంటే కేవలం ధనం అనుకోకూడదు. గుణసంపద, ధనసంపద కన్నా ఘనమైనది. అందరూ ధనవంతుని కన్నా గుణసంపద కలవారినే గౌరవిస్తారు. అందుకే ధర్మరాజు అడవిలో వున్నా, అతని గౌరవానికి ఎటువంటి భంగమూ కలుగలేదు. పరమాత్మ అనంతుడు, అవ్యయుడు అన్నది గ్రహించడమే మీకు అసాధ్యంగా వున్నది. మీరు భౌతిక దృష్టి పరిధుల్లో ఇరుక్కుపోయారు. ఆధ్యాత్మిక జగత్తు మీకు తెలియదు. తెలుసుకోగలవాడు సద్గురువు మాత్రమే. కానీ, మీరు గురువుల్ని కూడా పూర్తిగా నమ్మరు. మీ స్వార్థానికి పనికి వచ్చేంత వరకే నమ్ముతారు. ఒక్కటి గుర్తించండి. మానవీయ, ఆధ్యాత్మిక, ఆత్మశక్తుల సమిష్టిబలమే, జీవితాన్ని గమ్యంవైపు సులభంగా తీసుకువెళ్ళగలుగుతుంది.

***నీవు చేయగలిగినంత మంచిని***
***నీకుగల అన్నివిధాలగానూ, నీకుగల అన్ని మార్గాలలోనూ,***
***నీకు లభ్యమయ్యే అన్ని ప్రదేశాలలోనూ,***
***నీకు వీలైన అన్ని సమయాలలోనూ, నీకు సాధ్యమైన వారందరికీ,***
***నీకు ఎంతకాలం వీలైతే అంతకాలం చేస్తూనే వుండు.***
***ఏమి చేస్తావు?***

***దానమొసగుట ఇమ్ము, ఇమ్ము, ఇచ్చివేయుము***
***మక్కువగా అక్కున దాచింది***
***మారేను మున్ముందు పనికిరాని మన్నై***
***ప్రాణమే పోవునపుడు, ఈయలేవు తృణమైనా***
***గట్టిగా నొక్కిపట్టినా, జారేను వేళ్ళమధ్య నుండి***
***ఇస్తివేని దానంగా పారేను అమృతధారలై ఇలలో***
***హరిపదము ఎందుగలదు? సరి పదము ఎందుగలదు?***
***ధర్మమందు గలదు. అట్టి ధర్మమును సద్గురువు మాటగా స్వీకరించి***
***ఆంజనేయుని పదాలతో జగతిశాంతిని కోరు హృదయులై సదా అన్నార్తుల సేవ చేయుచూ,***
***అనుంగు ప్రియతముడైన ఈ పవనపుత్రుని చేరండి సదా***
***నా చిన్నారి ముద్దుబిడ్డలారా!***

ॐ

**28-07-2019** 08:40 AM

**:: పాత్రలో ఇరుక్కోకుండా దానిని పోషించగలగడమే పరిపూర్ణత్వం ::**

**191)** త్యాగం అంటే ఏమిటి స్వామీ?

*త్యాగం ద్వారా, సేవ ద్వారా అమృతత్వం సిద్ధిస్తుంది. అందుకు ప్రయత్నం చేస్తున్నారా? తెలివిగలవాడు చేయవలసిన పని ఏమిటి? తానెవరో, తానెందుకు వచ్చాడో, తానేం చేయాలో తెలుసుకోవడం అసలు పని. దానిని వదిలిపెట్టి ఎన్ని పనులు చేసి ఏమి ప్రయోజనం? నేను మీకు ఇస్తున్న ఘాటైన మందలింపు ఇది. అంతేకాదు, వాస్తవానికి త్యాగం అంటే ఏమిటో కూడా పదేపదే వివరించాను కూడా. త్యాగం అంటే ఏమిటి? కొంత డబ్బునో, సామాగ్రినో ఇతరులకు ఇవ్వడమా? కాదు కాదు. త్యాగము ఒక యోగము. త్యాగం అంటే ఆస్తిని, ఆలిని వదిలి అడవులకు పోవడం కాదు. మనసులోని చెడును వదిలివేయటం త్యాగం. మీలోని చెడును వదిలివేయగల మనోస్థైర్యం, ఇంద్రియనిగ్రహం ఏర్పడాలంటే, గట్టిగా గుర్తుంచుకోవలసిన జీవితసత్యం. ఏదీ నాది కాదు, ఏదీ నాతో రాదు. ఏది శాశ్వితం, ఆలోచించండి. ఈ రోజిక్కడ, రేపెక్కడో ఈ బిడారు? ఈ కాసేపు ఈ కరుణాక్షేత్రంలో నీవు సంతరించుకునే సంపదలన్నింటికీ నీవు ట్రస్టీవి. వాటిని సద్వినియోగం చేయి. అంతే. ఇలా తనను తాను ట్రస్టీ అనుకుంటే, త్యాగభావం పెంపొందగలదు. నాలుగురోజుల జీవితం అనుకుంటే, గుర్తుంచుకుంటే, దానిని సక్రమంగా గడపాలనే సద్బుద్ధి కలుగుతుంది. అప్పుడు నేను, నాది అనే రెండక్షరాలకే పరిమితమైన జీవనపరిధి విస్తరించగలదు. భక్తిమార్గాన ముందడుగు వేయాలంటే, 'నేను'ని తగ్గించుకోవాలి. చివరి సోపానం ఆత్మనివేదనం వరకూ చేరాలంటే, "నాది ఏదీ లేదు, అంతా నీదే" అని సమస్తం త్యజించవలసిందే. నేను అనే అహం అన్నిటా అడ్డు వస్తూనే వుంటుంది. అందుకనే, ముందుగా త్యజించవలసినది దానినే గదా! చెప్పినంత తేలిక కాదు సుమా!*

అయినా, మీకంత ఆనందాన్నిచ్చే 'నేను' అనే భావాన్ని ఎందుకు వదులుకోవాలి? అన్న ప్రశ్న ఉదయిస్తే, అలా అహంను కాపాడుకున్న వారంతా ఏమైనారో తెలిపే వందలాది గాథలలో కొన్నింటిని జ్ఞప్తికి తెచ్చుకోండి. సూది మొన పైన వచ్చే అంత భూమి కూడా... అంటే ఎంత? పాండవులకు ఇవ్వనని భీష్మించుకుని యుద్ధానికి సిద్ధపడ్డ దుర్యోధనుడు, అతని నూరుగురు అన్నదమ్ములు ఎంత భూమిని దక్కించుకున్నారు? ఎందరు మిగిలారు? నాకు ఏమీ వద్దు అంటూ ధనుర్బాణాలు వదిలివేసిన పార్ధునికి గీతోపదేశం వినే మహద్భాగ్యం కలిగింది కదా! అంత మహాసంగ్రామం జరిగినా, పంచపాండవులు క్షేమంగా ఉన్నారు గదా! అందువలన, నేను వివరించిన ఈ ప్రకృతి నియమం గమనించండి. త్యాగము చేయని వానికి, ప్రకృతి నిర్బంధముగా త్యాగము నేర్పుతుంది. అట్లుగాక మునుపే త్యాగమును నేర్చుకొనుట మంచిది. ముఖ్యముగా వాంఛలను త్యాగము చేయు తదుపరి సంపూర్ణ శరణాగతి తత్త్వముతో, అనన్యభక్తితో చిత్తమును భగవంతుడికర్పించితివా... ఆయనే నీ యోగక్షేమాలను చూచుకుంటాడు. మానవులలో వున్న బలహీనత ఇదే. ప్రకృతి నిర్బంధముగా నేర్పే వరకూ త్యాగము నేర్చుకోకపోవటడం. నోట్లు రద్దయిన తర్వాత దానధర్మాలు చేయడం, ఇతరుల ఖాతాలో జమచేయడం, అల్సర్, బీపీ, షుగర్ వచ్చిన తర్వాత ఘాటైన మసాలా వంటకాలు, తీపిపదార్థాలు త్యజించటం, ఇంద్రియనిగ్రహమా? వాంఛలను త్యాగము చేయకుండా అడ్డుపడే మీలోని అరిషడ్వర్గాలను షడ్‌రిపు అని శత్రువులుగా సంబోధిస్తాము కదా! వాటిని ఒక్కసారి పరిశీలించండి. ముందుగా కామం. కోరిక. భౌతిక విషయాల ఎడ అమితమైన ఆసక్తి. దానితో వాటిని పొందాలనే ఆకాంక్ష. దీనితో మంచి, చెడు అనే విచక్షణను, జ్ఞానాన్ని కోల్పోవటం. ఐహిక విషయాల ఎడ ఆసక్తి, ఎన్నో వాంఛలను జనింపచేస్తుంది. అంతం లేని కోరికల ఊబిలో మనిషి నిలువెల్లా మునిగిపోతాడు. ఆధ్యాత్మిక మార్గమున పయనించదలుచుకున్నవారు అవశ్యముగా ఆచరించి తీరవలసిన మార్గము, కోరికలను నియంత్రించడం. భగవంతునికి మీ హృదయంలో స్థానం ఇవ్వాలంటే, ముందుగా ప్రాపంచిక వాంఛలను త్యజించటం ప్రారంభిస్తేనే, చోటు ఏర్పడగలదు. దానగుణానికి, త్యాగానికి అడ్డుపడే పెద్ద ఆటంకం లోభం. ఏడుతరాలు కదలకుండా కూర్చుని తిన్నా సరిపోయేంత ఆస్తిపాస్తులు సంపాదించారు. నిజమే మరి. ఎనిమిదవ తరం మాటేమిటి? అని దిగులుపడే వారిని పట్టిపీడించేది లోభమే కదా! నాది నాదే, నీది కూడా నాదే అనే లోభం, త్యాగానికి ఏ మాత్రమూ తావివ్వని అన్యాయార్జితాన్ని పెంచి పోషిస్తుంది. ధర్మార్థ కామ మోక్షాలలో అర్థం కూడా ధర్మమార్గంలోనే ఆర్జించాలి, ఆపైన దానధర్మాలు చేసే త్యాగభావం వుండాలి. ఇక, క్రోధమోహాలు, మదమాత్సర్యాలు తప్పకుండా వదిలివేయవలసిన దుర్గుణాలు. వీటివల్ల ఇసుమంతైనా లాభం లేదు. పైగా, ఎనలేని నష్టం చేకూరుతుంది. చేతిలో వున్నది ప్రమాదకరమైన విషసర్పం అని తెలిసిన తర్వాత అలాగే పట్టుకుంటారా? లేక వెంటనే వదిలివేస్తారా? అలాగే, ఈ దుర్గుణాలు మీకు తీరని హాని చేస్తాయని తెలియగానే ఏం చెయ్యాలి? పామును మెల్లమెల్లగా వదులుతారా? వెంటనే చేయి విదిలిస్తారు కదా! అలానే, ఈ చెడుభావాలను వెంటనే వదిలివేయాలి. ఒక్కసారి మిమ్మల్ని మీరు ప్రశ్నించుకోండి. ఏ సద్గుణాన్నైనా మీరు అలవర్చుకోకుండా మీకు అడ్డుపడేదేమిటి? ధైర్యంగా ప్రశ్నించుకుని, నిజాయితీగా ఆత్మపరిశీలన చేసుకుని జవాబు వెతుక్కోండి. ఉదా:- మీరు రోజులో కొంతసేపు మౌనం పాటించాలి అని ఎవరైనా అంటే, మీ స్పందన ఇలా వుంటుంది. "అమ్మో! మాట్లాడకుండా కాసేపు కూడా వుండలేను" అని.

*ఎందువలన? "నేను చాలా బాగా మాట్లాడుతాను" అన్న అతినమ్మకం గొప్పగా వుంది. ఇతరులకు విసుగు కలుగుతుందని మీకసలు అన్పించదు. పరనింద, ఆత్మస్తుతితో చాలా ఆనందం (అంటే, చౌకబారు ఆనందం) కల్గుతుంది. ఈ కఠోరసత్యం మీ మనోఫలకంపై మెరవగానే ఏం చెయ్యాలి? జవాబు మీకందరికీ బాగా తెలిసినదే కదా! ఈ దుర్భావాలను త్యజించండి. చివరగా, చిన్న ప్రశ్న. మీరు ఏ వస్తువునైనా, ఎవరైనా, ఎవరికైనా ఇచ్చి త్యాగం చేశాము అంటారు. కానీ, ఇలా అనగలరా? "నా రాగద్వేషాలు మీకిస్తాను, కొంచెం తీసుకుంటారా?" అని అంటే, వాళ్ళు తీసుకునే పనేలేదు. కానీ, నాకివ్వండి, నేను తీసుకోవటానికి సిద్ధంగా వున్నాను. ఈ ఆంజనేయుడు దోసిలిపట్టి అర్థిస్తున్నాడు. అటువంటి దుష్టగుణాలను నాకు త్యాగం చేసి సద్గుణాలను మీరు మోయలేనంతగా నానుండి స్వీకరించండి నా చిన్నారి ముద్దుబిడ్డలారా!*

***రావటమెంత సహజమో, మరలటమూ అంతే సహజము.***
***రంగస్థలంపై అడుగులు వేశాక, విశ్రాంతి అనేది ఎండమావే.***
***రోజులు, మాసాలు, వత్సరాలు గమ్యంలేని సుదీర్ఘ గమనంలో, అనుక్షణం అంతరంగయుద్ధమే.***
***అందిన అవకాశాలను చేజిక్కించుకుని, అవసరానికి అడుగులు వేస్తూ,***
***ఒక ముడి విప్పే లోపు, మరొక ముడి***
***శోధనలో శోకమెంతో!***
***పథం లేని పయనాన పరుగులు తీస్తూ***
***ప్రలోభపెడుతూ, ప్రలోభపడుతూ***
***అప్పుడప్పుడూ మనసు తలుపు తెరుస్తూ***
***ఊర్ధ్వ చలనానికై ఉవ్విళ్ళూరుతూంటే,***
***కరుణామయుని కరకమలాలతో,***
***మృదుమధురమైన లాలిత్యంతో చేరదీస్తే,***
***తిరుగు చెప్పలేని పిచ్చితనం***
***సంతోషపు కౌముదిలో వెలుగుతూ,***
***ఆరాట పోరాటాలతో, అమాయకపు చూపులతో***
***కృతజ్ఞతలు అందిస్తూ, అంజలి ఘటిస్తూ***
***అంజనీకుమారుడైన ఈ ఆంజనేయుని చేరండి***
***నా చిన్నారి ముద్దుబిడ్డలారా!***

**28-07-2019** 02:15 PM

**వి: నమస్కారము స్వామి.**

స్వామి*:* *మంచిది.*

**వి: మీ ఆగమనం చాలా సంతోషంగా వున్నది.**

*స్వామి: ఇది నా బాధ్యత బంగారు.*

**వి: కృతజ్ఞురాలిని స్వామి.**

*స్వామి: ఎప్పుడూ ప్రశ్న వేయించుకునేటట్లు వుండకూడదు. రేపు నీ బిడ్డ నన్ను, "అమ్మను చూడలేదేమి స్వామీ? నేను లేను కదా?" అంటే నేను సమాధానం చెప్పాలా?*

**వి: వద్దు స్వామి. కానీ, మీలోనే వున్నాను. విడిగా లేను కదా స్వామి.**

*స్వామి: గుర్తింపు వున్నందుకు చాలా సంతోషం.*

**వి: మీరిచ్చిన జ్ఞానమే కదా స్వామి.**

*స్వామి: అంటే జ్ఞానమే అసలైన శక్తి అంటావా?*

**వి: అంతే అనుకుంటాను స్వామి.**

*స్వామి: కాదు, గుణమే నిజమైన శక్తి. ఎలా అని అంటావేమో? అంటే దయ, దాక్షిణ్యము, ప్రేమ, క్షమాపణ, నిజాయితీ, ఓర్పులనేవి నిర్దుష్ట గుణములు. అవి ఆత్మలో చేరినప్పుడు, యుగయుగాల వరకూ అంటే, భవిష్యత్తులో జీవి ఎత్తబోయే ఎన్నో జన్మల వరకూ ఈ గుణగంధం కొనసాగుతుంది. అందువల్ల, సద్గుణాలను వికసింపచేసుకోవాలి. ఇవే మానవునికి అసలైన యోగ్యతలు.*

**వి: అంటే స్వామీ, అటువంటి గుణాలను ఆచరించి, ఆదర్శప్రాయంగా వుండాలంటే, విద్యావంతులయినట్లైతే సంభవమవుతుందా?**

*స్వామి: కాదు. విద్యవల్ల లభించే జ్ఞానం కంటే ప్రవర్తనలో ప్రతిబింబించే సద్గుణములే ముఖ్యము. నీవు అనుకుంటున్నట్లు విద్య అంటే అర్థము తెలుసా?*

**వి: తెలియదు స్వామి.**

*స్వామి: "విద్యా అర్థయతే ఇతి విద్యార్థి". 'విద్' అనగా వెలుగు, 'య' అనగా ఏది? ఏది వెలుగును అందించునో, అదే నిజమైన విద్య. దీనిని ఎవరు అభ్యసించాలి? 'నరః'. ఇవి రెండక్షరములు. 'రః' అనగా నాశనము, 'న' అనగా లేదు. నాశనము చేయనివాడు నరుడు. నాశనము గావించనివాడు నరుడు. నాశనాన్ని కోరనటువంటివాడు నరుడు. అలాంటిది, నరుడని పేరు పెట్టుకుని సర్వనాశనమునకు మూలకారణమవుతున్నవాడు నరుడెట్లా అవుతాడు?*

**వి: అంటే, ఆత్మజ్ఞానమే వెలుగుకదా. అట్టి స్థితిని అనుభవించాలా?**

*స్వామి: "శర్వతా ఇతి శరీరం". శరీరము జీర్ణించుకుపోవునటువంటిది. అది ఏనాటికైనా కూలిపోయేదే. కానీ, తన యొక్క 'కాన్షన్స్' హృదయము ఎప్పుడూ కూడానూ పవిత్రంగా వుంటుంది. దానికి చావు-పుట్టుకలు వుండవు. ఆ కాన్షన్స్‌ను నువ్వు సదా అనుసరించాలి.*

వి: **దీనికి శాంతి అవసరమనుకుంటాను స్వామి.**

స్వామి: *అయితే దానిని ఎలా సాధిస్తావు?*

వి: **మీరు చెప్పిన గుణాలతో, జ్ఞానంతో దానిని సాధించాలనుకుంటాను స్వామి.**

స్వామి: *సత్యం ధర్మం, అహింస, ప్రేమ, కరుణ, సేవ, దానం లాంటి విషయాల వంక దృష్టిని సారించకుండా "దేవుడా! నాకు శాంతిని ప్రసాదించు" అంటే ఎలా?*

వి: **వీటిని ఆచరిస్తూ మిమ్మల్నే వేడుకుంటాము స్వామి శాంతి కావాలని.**

స్వామి: *దీనిని మాత్రమే అడుగుతారా? ఇంకా నా వద్ద ధర్మం, సత్యం, అహింస ఇటువంటి గుణాలన్నీ వున్నాయి. వాటిని అడుగరెందులకు?*

వి: **స్వామీ, దానితోటే ఇవ్వన్నీ ముడిపడి వున్నాయి కదా స్వామీ.**

స్వామి: *అవునులే కానీ, చిన్న మర్మమొకటుంది చెప్పనా? నీవు చెప్పినట్లు సత్య ధర్మ అహింస ప్రేమ దానం వంటివి మీరు ఆచరిస్తే దానికి ప్రసన్నుడై, భగవంతుడు మీ అంతరంగంలోనే వున్న శాంతి యొక్క అడ్రస్ మీకు తెలియచేస్తాడు.*

వి: **అంటే, మాలో వున్న దానినే మేము మర్చిపోతున్నాము స్వామి.**

స్వామి: *అవును. అందుకే రోజూ మీ కార్యక్రమాల అనంతరం శాంతి మంత్రాన్ని ముమ్మారు పఠిస్తారు కదా.*

వి: **అవును స్వామి.**

స్వామి: *ఎందుకు ముమ్మారు పఠిస్తారు? ఒక్కసారైతే మర్చిపోతారనా?*

వి: **సమస్తలోకాలు సుఖశాంతులతో వర్ధిల్లాలని భగవంతుని కోరుకుంటామనుకుంటాను స్వామి.**

స్వామి: *మొదటిది విశ్వశాంతి కొరకు, రెండవది పరిసరాలు ప్రకృతి శాంతి కొరకు, మూడవది మనశ్శాంతి కొరకు. ఇప్పుడు నీకు శాంతి దొరికిందా? సంతోషమా?*

వి: **అవును స్వామి.**

స్వామి: *శాంతికి ఇచ్చిన ప్రాముఖ్యతే కదా, నిదర్శనమే కదా భగవంతుడు నీతో సంభాషించుట. ఈ ఆగమనం గుర్తించావా?*

వి: **గుర్తించాను స్వామి. చాలా చాలా కృతజ్ఞతలు స్వామి.**

స్వామి: *అందించన దానిని అందుకుని ఆరగిస్తే సంతోషిస్తాను. వెళ్ళివస్తాను బంగారు!*

వి: **నమస్కారం స్వామి.**

ॐ

**29-07-2019** 08:40 AM

**192) సమయం విలువ ఎట్టిది స్వామీ?**

*లక్ష్యసాధనలో అతి కీలకమైనది సమయం. ఆశయసాధన కొరకు ప్రణాళిక ఎంత పటిష్టంగా తయారుచేసుకున్నా, సమయాన్ని సద్వినియోగం చేసుకోకపోతే, అనుకున్నది సాధించలేరు. మీ తెలివితేటలు, విజ్ఞానంతో ఒకవేళ విజయాన్ని సొంతం చేసుకున్నా, అధికశ్రమ, ఒత్తిడి అందులో ఇమిడి వుంటాయి. ఇవి శరీరానికి, మనసుకు మంచివి కావు. కాబట్టి సమయపాలన ఎంతో ముఖ్యం. పోగొట్టుకుంటే, పొందలేని వాటిల్లో ఒకటి సమయం. మీకు వున్న ప్రాధాన్యతలకు, బాధ్యతలకు కొంత సమయాన్ని కేటాయించి, మిగిలిన సమయాన్ని మీ లక్ష్యం కోసం ఉపయోగించుకోవాలి. ఈ విధంగా చేయటం క్లిష్టమైన పనే అయినప్పటికీ, ఆ విధంగా చేస్తేనే మీరు, మీతో వుండేవారు సంతోషంగా వుండగలుగుతారు. అంతేకాదు, ఆశయసాధనకు మీరు రూపొందించుకున్న ప్రణాళికను సమర్ధవంతంగా అమలు చేయగలుగుతారు. సమయపాలనకు శత్రువు బద్ధకం. ఆ బద్ధకానికి మిత్రుడు వాయిదా వేసే తత్త్వం. ఈ రెండింటినీ మీరు ఎప్పుడూ దరి చేరనివ్వకూడదు. ఏ పనిని ఎప్పుడు చెయ్యాలని నిర్ణయించుకున్నారో, ఆ సమాయనికే చేసేటట్లుగా చూసుకోవాలి. చేసిన పనిని సమీక్ష చేసుకుని, అడుగు ముందుకు వేయాలి. ఆ విధంగా చేస్తే, మీపై మీకు విశ్వాసం పెరగటమే కాక, మనస్సుకు తృప్తి కలుగుతుంది. ఉత్సాహం, ఉత్తేజం కలుగుతుంది. జీవితంలో ప్రతిక్షణం అమూల్యమైనది. ఏదైనా పోగొట్టుకోవటానికి క్షణం చాలు. తిరిగి సంపాదించాలంటే జీవితకాలం సరిపోకపోవచ్చు. ఈ సత్యాన్ని తెలుసుకున్నవారు సమయపాలనకు ప్రాధాన్యత ఇస్తారు, ఇవ్వాలి. అట్టివారు నియమబద్ధంగా వ్యవహరించాలి. వారిని మీరు ఆదర్శంగా తీసుకోవాలి, అనుసరించాలి. ఆ మార్గంలో పయనించటానికి మీరు ప్రయత్నించాలి. కొంతమంది సమయపాలనను నిర్లక్ష్యం చేస్తారు. చేయవలసిన పనిని పలు కారణాలతో వాయిదా వేస్తారు. చివరలో తెగ హడావుడి పడుతూ, చుట్టూ వున్న వారిని కూడా పరుగులు పెట్టిస్తారు. అదేమంటే, టైం లేదు అని, సరిపోలేదని, టైం వుంటే ఎంతో సాధించేవారమని చెబుతారు. నేరాన్ని కాలంపై నెట్టివేస్తారు. కాలానికి నిజాన్ని నిరూపించే శక్తి వుంటుంది. అప్పుడు మీరేమిటో, మీ మనస్తత్వం ఏమిటో, మీ పనితీరు ఎలాంటిదో, మీతో కలసి వున్నవారికి అర్థం అవుతుంది. జాగ్రత్త సుమా! సమయపాలన అంటే యంత్రంలాగా పనిని చేయటం కాదు. నిర్ణీతకాలవ్యవధిలో చేయవలసిన పని ముగించటం. అదే సమయంలో చేస్తున్న పనిపట్ల ఆసక్తిని పెంచుకుని, పనిలో సృజనాత్మకతను కనబరచడం, అందుకుగాను, నిరంతరం క్రొత్త విషయాలు తెలుసుకుంటూ, వచ్చిన ప్రతి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి, ప్రతిభను కనబర్చాలి. అప్పుడే సమయపాలన పాటించినట్లు అవుతుంది, తద్వారా మీరు కోరుకున్న లక్ష్యాన్ని సులభంగా చేరుకోగలుగుతారు. ప్రయత్నించి చూడండి. ఫలితం మీ చెంతకు చేరుతుంది. ఇది ఈ ఆంజనేయుని వాగ్దానపూరితమైన మాట. ఈ విషయాన్ని ఇప్పటి వరకూ పదేపదే చెబుతూ వస్తున్నాను.*

***నిన్న జరిగిన దానిని మీరు మార్చలేరు***
***రేపటి గురించి మీకు తెలియదు***
***ఏమి చెయ్యాలనుకున్నా ఈరోజే, ఇప్పుడే చెయ్యాలి.***
***గతం నీ చేతుల్లో లేదు కానీ, భవిష్యత్తు నీ గుప్పిట్లోనే వున్నది***
***కాలం వేసిన సవాళ్ళకు వెరవక,***
***ఎప్పుడైనా ఒంటరి పోరాటంతోనే ఏ రంగంలోనైనా అసమాన ప్రతిభతో***
***సుసంపన్న విలక్షణ వ్యక్తిత్వంతో, ఆచరణ నిచ్చెనలనెక్కుతూ***
***మనసు నిండా సుగంధాల ఆర్ద్రత నింపుకుని***
***శిరస్సు వంచి నీ మమతను, మానవతను పంచి,***
***ఎవ్వరికీ దక్కని భాగ్యం మీ సొంతం చేసుకుని***
***ఈ ఆంజనేయుని భావాలకు అనుగుణంగా స్పందిస్తూ***
***జీవితాలను తీర్చిదిద్దుకుని,***
***కీర్తి అజరామరం చేసుకుని***
***ఆంజనేయుని చేరి సదా సుఖించండి***
***నా చిన్నారి ముద్దుబిడ్డలారా!***

ॐ

**30-07-2019** 08:40 AM

**193) మాట యొక్క విశిష్ఠత ఎట్టిది స్వామీ?**

*మనిషి మాట్లాడే మాట కేవలం జనులను మెప్పించటమే కాదు, ఆ భగవంతుడ్ని కూడా మెప్పించాలి. మాట్లాడే తీరును బట్టి మీ సంస్కారం, సభ్యత బయటపడతాయి. అందుకే ఎవరిని గురించీ చెడుగా మాట్లాడకూడదు. మాటలతో వర్ణించటానికి, మనస్సుతో ధ్యానించటానికి, శరీరంతో పూజించటానికి ఒక ఆలంబన కావాలి. నిర్గుణతత్త్వాన్ని ఏమని వర్ణిస్తారు? నిరాకారాన్ని ధ్యానించడమెలా? సర్వవ్యాపిని ఎలా పూజిస్తారు? అసలే మనస్సు మహా చంచలమైంది కదా! అలాంటి మనసుకు ఒక ఆధారం కావాలి. అభ్యాస వైరాగ్యాలతో దానిని వశం చేసుకోవాలి. ప్రాపంచిక విషయాలపైకి, పరిపరి విధాలా పరుగులు పెట్టే మనస్సును నిగ్రహించి దైవంపై నిలపాలి. నీరు, అన్నం మనిషికి ఎలా ప్రాణశక్తిని ఇస్తాయో, మంచి మాట కూడా అంత విలువైనది. ఇతరులకు శాంతి కలుగుతుందని నమ్మకం ఏర్పడితే మీ అభిప్రాయం చెప్పాలి. నీతివాక్యం అంత సులభంగా దొరకదు, దొరికినా మనిషి అహంకారం వినడానికి ఇష్టపడదు. ఒకవేళ విన్నా, ఆచరించాలంటే, ఎంతో కష్టమనిపిస్తుంది. ఈ కారణాల వల్ల మనిషి తన జీవితకాలంలో ఎక్కువశాతం నీతివిద్యకు ప్రాధాన్యమివ్వడు. భౌతిక ప్రపంచంలో అన్నీ వైవిధ్యంగానే వుంటాయి. మానవులు వైవిధ్యంగా వుంటారు. వారి వదనాలు రకరకాలుగా వుంటాయి, మాటలు వేరువేరుగా వుంటాయి. రంగు, రుచుల్లో తేడా వుంటుంది. కానీ, భక్తిలో వైరుధ్యం లేదు. ఏ*

భక్తుడికైనా దైవమే లక్ష్యం. ఆ సన్నిధే భక్తుడికి ఆది-అంతాలు లేని పెన్నిధి. ఇతరులతో మాట్లాడుతున్నప్పుడు, ముందు అడ్డుపడకుండా ఆసక్తిగా వినడమనేది, ప్రతి ఒక్కరి కనీస ధర్మం. ఎదుటివాళ్ళు చెప్పడం పూర్తి అయ్యాకే మీ సందేహాలను వ్యక్తం చేయాలి. తర్వాతే మీరు మాట్లాడాలి. అంతే తప్ప, మధ్యలో మాట్లాడితే, ఎదుటి వ్యక్తి మిమ్మల్ని అపార్థం చేసుకొనే ప్రమాదముంది. మెదడు అనేది ఆలోచనల ప్రవాహమే. అది నిరంతరం ఆలోచనల స్రవంతిగా సాగుతుంది. మెదడులో ఒక భాగం మాత్రమే మీకు తెలుసు. మరో భాగం గురించి మీకెవరికీ తెలియదు. ఈ ఆలోచనలు ఎలా పుడ్తాయో, ఆ ఆలోచనలు మాటలుగా ఎలా సాగుతున్నాయో, ఆలోచనలు అక్షరాకృతి దాల్చి మాటల రూపంలో ఎలా ప్రభావితమై, ప్రఖ్యాతమవుతాయో అంతుపట్టని రహస్యం. మాటలే ఎన్నో సమస్యలకు మూలకారణమవుతాయి. ఆప్తమిత్రులు హఠాత్తుగా బద్ధశత్రువులవుతారు. మనసులో ఒకటి వుంచుకుని, బయటికి మరొకటి చెప్పేవారు, తాము లౌక్యులం అనుకుంటారు. కాని, రాబోయే ప్రమాదాలను పసిగట్టలేరు. నిక్కచ్చితనం, నిర్మొహమాటం దీర్ఘకాలంలో సత్ఫలితాలను ఇస్తాయనేది అందరికీ తెలిసిన సత్యం. జ్ఞానబోధలు, నిత్యపాఠాలు కావు. ఒకసారి విన్నాక, మీరే వాటిని నిత్యమూ మననం చేసుకుంటూ, స్మృతి పేటికలో భద్రం చేసుకోవాలి. అప్పుడు జ్ఞానమనే అద్భుతం మీలో స్థిరంగా నివాసముంటుంది. మనిషి క్రమంగా వికసించి, మేధస్సుతో జాగరూకుడై, తానూ పశువులలో ఒక్కడైనా, వివేకాన్ని, ప్రజ్ఞనూ సంపాదించుకుని, సకల జీవకోటిలో తానే అధికుడయ్యాడు. ఇప్పటికీ మానవుడే అత్యున్నత జీవి. అతని మేధస్సు అంతకంతకూ మాట ద్వారానే వికసిస్తుంది. అందరూ మనుషులే అయినా, వారివారి శక్తిసామర్థ్యాలు, తెలివితేటల్లో, వాక్చాతుర్యంలో ఎంతో వ్యత్యాసముంటుంది. కొందరికి జన్మతః వాక్చాతుర్యం పుణికి పుచ్చుకుంటారు. మరికొందరికి సాధన వల్ల సౌమ్య వచనాలు అబ్బుతాయి. ఓ పరిపూర్ణుడైన వ్యక్తి విధివశాత్తు అధోగతి చెందినప్పటికీ, అతడి పూర్వవైభవ వాక్పాండిత్యం సమసిపోదు. మాట వల్లనే, సంబంధబాంధవ్యాలు ఏర్పడతాయి. మాట మధురంగా, సత్యవంతంగా వుంటే ఎదుటివారు ఎంతో గౌరవిస్తారు. చల్లనిమాట ఎల్లకాలం నిలుస్తుంది. ఒక హితమైన మాట వ్యక్తి జీవనవిధానాన్నే మార్చి, బాధాతప్త హృదయానికి శాంతిని ప్రసాదిస్తుంది. మీరు నలుగురితో కూడి వుంటున్నారు. మరి ఆ నలుగురితో మంచి మాటలు మాట్లాడాలి. శాంతితో, ప్రేమతో మాట్లాడగలగాలి. పరుషంగా, కఠినంగా మాట్లాడకూడదు. శాంతియుత సహజీవనానికి దోహదం చేసే ప్రవర్తనాత్మక భావన. అది ఆలోచనాత్మక ధోరణి కలిగి వుంటుంది. ఈ ఆంజనేయుడు మీకు విధించిన నిషేధాల పట్ల గౌరవం, శ్రద్ధ కలిగి, మంచిగా ప్రవర్తించటానికి మాటే గొప్ప సాధన. అలా కాకుండా, ఇతర సభ్యులతో శాంతియుత సహజీవనానికి విఘాతం కలిగించే భావనలు, ఆలోచనాసరళి, వాక్ రూపంలో వెలువడితే, అవి చెడ్డమాటలు. స్వామి విధించిన నిషిద్ధ నియమావళిని ఉల్లంఘించి, యథేచ్ఛ వర్తనాన్ని స్వామి చెడుమాటలుగానే పరిగణిస్తారు. మాటల్లో, మంత్రశక్తి కూడా వుంది. ఆ శబ్దశక్తి రహస్యాలను గ్రహించి తద్వారా మంత్రాలను పఠించి, ఋషులు పునీతులయ్యారు. అందుకే, అ మాటలకు అంత శక్తి వుంటుంది. ఎవరైనా సరే, మధురంగా మాట్లాడాలి. మీ మాట ఎదుటివ్యక్తికి ధైర్యాన్ని, ఓదార్పును, స్ఫూర్తిని కలిగించాలి.

***విద్యనేర్చిన వాడనని విర్రవీగవద్దు***
***భగవంతుడనని పలుకవద్దు***
***ధనవంతుడనని తరచూ గర్వించవద్దు***
***పుత్రవంతుడనని పొగడుకోవద్దు***
***దాతనని పలుమార్లు చెప్పుకోవద్దు***
***సౌర్యవంతుడనని సంతోషపడవద్దు***
***కార్యశూరుడనని భావించవద్దు***
***స్వామి భృత్యుండనని పొంగవద్దు***
***నలుగురికీ మెప్పుగా నడచుకున్నచో నళినదళేత్రుడు నిన్ను ఆశీర్వదించి***
***దీవించునని ఈ ఆంజనేయుడు***
***అతిజాగ్రత్తగా వాడవలసిన మాటను వాక్చాతుర్యంతో వాడి***
***వాడియైన మీ పదజాలాన్ని మృదుమధురంగా మలచుకుని***
***మారుతి మాటను నిలిపి, విలువనిచ్చి వీరాంజనేయుని బిడ్డలుగా***
***భువిపై కీర్తిని సాధించి ముందుకు సాగండి***
***నా చిన్నారి ముద్దుబిడ్డలారా!***

ॐ

**31-07-2019** 08:40 AM

*ఒక గురువు, సద్గురువు తన శిష్యులకేమి ఇస్తాడు అనే దానిని చెప్పదల్చుకున్నాను. ఒక శిష్యుడికి తన గురువు అమృతభాండం అనే ఒక కుండనిచ్చాడు. నెత్తిపై కుండ వుంచి, "నువ్వు నడుస్తూ వుండు. నేను వెనకాలే వస్తాను" అన్నాడు. వెళ్ళేటప్పుడు ఒక విషయం చెప్పాడు. "ఆ కుండలో వున్నది అందరికీ సమానంగా పంచుతూ, ఎక్కడా ఆగకుండా వెళ్ళు" అన్నాడు. "ఐతే, నువ్వు నిస్వార్థంగా, పక్షపాతం లేకుండా పంచాలి. ఎంత పంచితే అంత పెరుగుతుంది. ఎప్పుడూ తరగదు. కానీ, నీకు మాత్రం భారం పెరగదు" అన్నాడు గురువు.*

*శి: గురూజీ! ఈ కుండలో ఏముంది?*
*గు: నేను నీకు ఏది ఇచ్చానో అదే వుంది.*
*శి: ఎవరికి పంచాలి?*
*గు: అవసరమైన వారందరికీ సమానంగా పంచు.*
*శి: ఎవరికి అవసరమో నాకెలా తెలుస్తుంది?*
*గు: నీపని నువ్వు చేస్తూ వెళ్ళు. అవసరమైనవారు నీ దగ్గరకే వస్తారు.*
*శి: పంచితే పెరుగుతుందంటున్నారు, అదెలా సాధ్యం స్వామీ?*

గు: అదంతే. ముందు ముందు నీకే తెలుస్తుంది.

శి: పెరిగితే నేను ఎక్కువసేపు మోయలేనేమో స్వామి.

గు: నీ శక్తి నీకు తెలియదు – నాకు తెలుసు. నీవు చేయగలవు.

శి: మధ్యలో ఏదైనా సమస్య వస్తే ఏం చేయాలి?

గు: నేను నీ వెనకాలే వస్తున్నా కదా!

శి: ఎంతవరకు వెళ్ళాలి?

గు: పద, నేను వెనకాలే వస్తున్నా కదా!

శి: గురూజీ! నా కుటుంబం, ఆహారం, అవసరాలు?

గు: అదంతా నేను చూచుకుంటాను, వెళ్ళు.

శి: గురూజీ! మధ్యలో ఎవరైనా ఏమైనా ఇస్తే తీసుకోవాలా?

గు: ఆహారం తప్ప ఏమీ స్వీకరించకు. ఇంకేమీ అడగకు, బయల్దేరు

అన్నారు. శిష్యుడు కొంత సందేహంగానే గురువు మీద నమ్మకంతో బయలుదేరాడు. కొంత దూరం వెళ్ళిన తర్వాత, శిష్యుడికి ఆసక్తి కలిగింది. అసలు కుండలో ఏముందో తెలుసుకోవాలని. అప్పుడు ఆగి, కుండలోకి చూశాడు. ఆశ్చర్యం కుండలో ఏమీ లేదు. ఆలోచనలో పడ్డాడు. గురువుగారు చెప్పిన విషయాలు గుర్తు చేసుకున్నాడు. "నేను నీకు ఏమి ఇచ్చానో అదే వుంది అన్నారు. అంటే, గురువుగారు నాకు ఏమి ఇచ్చారు?" అలోచించసాగాడు. అడగటానికి గురువుగారు లేరు. వెనకాల చూస్తే, గురువుగారు కనిపించటం లేదు. గురువుగారి ఆజ్ఞ ఏమిటంటే, ఎక్కడా ఆగకూడదు. అందువల్ల ఆలోచిస్తూ ముందుకు నడుస్తున్నాడు. కొంతసేపటికి అర్థమైంది. గురువుగారు తనకు జ్ఞానం ఇచ్చారు కాబట్టి, అదే వుంది. అదే పంచాలని నిశ్చయించుకున్నాడు. గురువుగారు చెప్పినట్లు చేస్తూ ముందుకు వెళ్తున్నాడు. దారిలో ఎవరు కలిసినా, వారిని గురించి తెలుసుకోకుండా అందరికీ సమానంగా పంచుతున్నాడు. దారిలో ప్రతి ఊరినీ దర్శిస్తున్నాడు. అందరికీ జ్ఞానాన్ని పంచుతున్నాడు. ఎంత పంచితే అంత తనకు జ్ఞానం విస్తరిస్తున్నట్లు అనిపించింది. కొద్దిరోజుల్లోనే ఎక్కువమంది వస్తున్నారు. అయినా, ఎక్కువ ఉత్సాహంతో జ్ఞానబోధ చేస్తున్నాడు. అలసట లేదు, విశ్రాంతి ఆలోచన రావడం లేదు. పైగా, ఏదో క్రొత్త శక్తి వచ్చినట్లుగా వుంది. గురువుగారు అప్పచెప్పిన పనిలో పూర్తిగా నిమగ్నమయ్యాడు. మధ్యలో అక్కడక్కడా ప్రజలు ఇచ్చిందేదో తింటూ, ఎలాంటి కోరికలు లేక, మరో ఆలోచన లేక, తన బాధ్యతను నిర్వహిస్తున్నాడు. శిష్యుడికి ఇదంతా విచిత్రంగా అన్పిస్తుంది. అయినా, గురువుగారు వస్తారేమోనని ఎదురుచూస్తున్నాడు. వస్తే, గురువుగారికి అప్పచెప్పి తాను తప్పుకోవచ్చునేమో అని. కానీ, గురువుగారు రావడం లేదు. అలా జరుగుతూనే వుంది. కానీ ఎక్కడా ఆగకుండా తన పని తాను చేసుకుంటూ వెళ్తున్నాడు. మధ్యమధ్య వచ్చే సందేహాలకు సమాధానాలు దొరికేవి. కానీ, ప్రతిసారీ "అలాగే ముందుకు వెళ్ళు" అనే సమాధానం వచ్చేది. ఎవరి నుండీ ఏమీ ఆశించకుండా, గురువుగారి ఆజ్ఞ మేరకు ఆహారం తప్ప, ఏమీ స్వీకరించక, జ్ఞానబోధ జరుగుతూనే వుంది. ఎందరో వస్తున్నారు, తన కార్యాన్ని ప్రశంసిస్తున్నారు. కానీ, శిష్యుడికి మాత్రం గురువుగారు వస్తారని ఆశగా వుంది. కానీ, గురువుగారు రావటంలేదు. ఇదిలా వుండగా, వారి

సేవలకు ప్రసన్నులైన కొందరు ఉత్సాహవంతులైన యువకులు వచ్చి, "స్వామీ! మీరు చాలా కష్టపడుతున్నారు. మాకు మీ సేవచేసే భాగ్యం ఇవ్వమని" అడిగారు. "నాకు ఎలాంటి సేవలు అవసరం లేదు. ఇది గురువుగారి కార్యం. దానిని ముందుకు తీసుకువెళ్ళడమే నా పని. ఇష్టమైతే, మీరూ ఈ పనిని స్వీకరించి దీనిని ముందుకు తీసుకువెళ్ళవచ్చు. మీ వద్ద వున్న నైపుణ్యాన్ని నలుగురికీ పంచండి. అదే మీరు చేయవలసింది. అయితే, అందులో ఎలాంటి భేదభావం గానీ, స్వార్థం గానీ వుండకూడదు" అన్నాడు. అలా ఎందరో తన దారిలోకి మళ్ళారు. నిస్వార్థసేవ పెరిగింది. నెలలు, ఏళ్ళు గడిచాయి. ఊళ్ళు, పట్టణాలు, పల్లెలు, జిల్లాలు, దేశాలు పర్యటిస్తున్నారు. పనిలో ఎలాంటి ఆటంకాలూ లేవు. నిర్విఘ్నంగా సాగిపోతోంది. గురువుగారు మాత్రం రాలేదు. కొన్నాళ్ళకు గురువుగారిని మర్చిపోయి పనిలో పడిపోయారు. కొన్ని సమస్యలు మొదలయ్యాయి. తాను నిస్వార్థంగా వున్నప్పటికీ, కొందరు వ్యక్తులు స్వార్థంతో పనిచేయడం ప్రారంభించారు. అప్పుడు శిష్యుడికి గురువుగారు జ్ఞాపకమొచ్చారు. అప్పుడు కూడా, "అలాగే ముందుకు వెళ్ళు. సమస్యల్ని పట్టించుకోకు" అనే సమాధానం వచ్చింది. శిష్యుడు అలాగే సమస్యలకు స్పందించక, ముందుకు సాగాడు. అలా కొందరు తనతో ముందుకు సాగుతూ, కొందరు వస్తూ, కొందరు పోతూ వున్నారు. కొందరు మాత్రం తనని వదిలి వెళ్ళడం లేదు. తన ప్రతిపనిలో సహకరిస్తూ నిస్వార్థంగా భాగస్వామ్యం పొందుతున్నారు. కొన్నాళ్ళకు శిష్యుడికి తెలుస్తూ వుంది. ఆయన జ్ఞానం పెరుగుతూ వుంది. ఎందరినో దర్శిస్తూ, లోకజ్ఞానం పెంపొందింది. విశ్వజ్ఞానం, బ్రహ్మజ్ఞానం, ఆత్మజ్ఞానం తనంతట తానే గురువుగారి నుండి పొందుతున్నట్లు అనిపించేది. ప్రతి సందేహానికి సమాధానాలు దొరికేవి. తానే అందరి మనుషుల్లో గురువుగా రూపొందారు. ప్రతిచోటా ఆదరణ, ఆప్యాయతలు దొరుకుతున్నాయి. దేనికీ కొదవలేకుండా, ఇబ్బందులు లేకుండా జీవితం, కార్యాలు కొనసాగుతున్నాయి. ఆయన వెళ్ళిన ప్రతిచోటా తన గతం – అనుభవాలు, తన గురువుగారు – ఆయన గొప్పదనం గూర్చి, తన ప్రయాణం గూర్చి చెప్పేవాడు. ప్రతి ఒక్కరూ తనను గూర్చి తాను తెలుసుకుని ఎలాంటి చింతలు లేక జీవించాలని బోధిస్తున్నాడు. అలా జరుగుతుండగా, ఒక రోజు బోధిస్తుండగా ఇలా జరిగింది:

శిష్యుడు భక్తులతో: "అందరూ మీలో ఏముందో, మీరు ఏమి చేయగలరో చెప్పండి. ఏమి పంచగల సమర్థులో చెప్పండి" అన్నాడు. ఒక్కొక్కడు ఒకటి చెప్పారు. ఒకరు విద్య, ఒకరు కళలు, సంగీతం, సాహిత్యం, నాట్యం, యోగ, ఆస్తి, ఐశ్వర్యం, జ్ఞానం... ఇలా ఒక్కొక్కరు ఒకటి చెప్పారు.

శి: "సంతోషం. అలాగే మీరు మీ వద్ద వున్నది నిస్వార్థంగా పంచండి. సత్యవంతంగా వుండండి. మీరు ఎంత పంచితే అంత పెరుగుతుంది" అని చెప్పాడు. అందరికీ పైవాడు ఏదో ఒకటి ఇచ్చాడు. అది తెలుసుకొని, దానిని సద్వినియోగం చేసుకొని, జీవితంలో ముందుకు వెడుతూ సమాజానికి ఉపయోగపడేలా వుండటమే జీవితాశయం కావాలి.

వ్యక్తి: "గురూజీ! నాలో ఏమీ లేదు. నేను ఏమీ పంచలేను" అన్నాడు.

శి: "ఏమీ లేకపోవడమేమిటి? ఏమీ లేకుండా ఏదీ లేదు. అందరికీ అవసరమైంది తప్పక వుంటుంది. సరిగ్గా చూడు" అన్నారు.

వ్యక్తి: "నిజంగా నాలో ఏమీ లేదు. నేను ఏమీ పంచలేను. దేనికీ పనికిరాను" అన్నాడు.

శి: "ప్రకృతిలో ఏమీ లేకుండా పనికిరానిదంటూ ఏదీ లేదు. అందరిలోనూ ఏదో ఒకటి తప్పక వుంటుంది. కాకపోతే, అదేమిటో తెలుసుకోలేకపోవటమే" అన్నాడు.

వ్యక్తి: "నాలో ఏమీ లేదు అని నాకు తెలుసు. ఉందని మీరు ఎలా చెబుతున్నారు? అసలు నాలో ఏముందో చెప్పగలరా?" అన్నాడు.

శి: చెప్పగలను. ఒక ఖాళీ కుండలో ఏమీ లేదనుకుంటాం. కానీ, అందులో గాలి వుంటుంది. అలాగే ప్రతి మనిషిలోనూ ప్రేమ వుంటుంది. ఏమీ లేదనుకున్న చోట, ప్రేమ తప్పక వుంటుంది. అది అందరికీ అవసరమైంది. అందరూ ఇవ్వగలిగింది ప్రేమ. ఎంత పంచినా తగ్గదు, ఇంకా ఇంకా పెరుగుతూనే వుంటుంది. ఎంత పంచితే అంత ఆనందం, ప్రశాంతత, మనశ్శాంతి దొరుకుతాయి. నీవు పంచిన ప్రేమ, నీకు తప్పక తిరిగి వస్తుంది. అదే ప్రేమ మహాత్మ్యం.

ఒక భక్తుడు: స్వామీ! మీరు ఏమీ లేకుండా ఎంతకాలం ఇలా చేస్తారు? ఇంత పెద్ద బాధ్యతలు ఎలా నిర్వహిస్తున్నారు? ఏమైనా సమస్యలొస్తే?

శి: జీవితాంతం ఇలాగే మొదలుపెట్టిన పని నిజాయితీతో కూడుకున్నదైతే, మన శక్తి పెరిగి, ఆసక్తి వస్తుంది. అలాగే, సమస్యల్ని ఎదుర్కొనే నేర్పు వస్తుంది.

భ: స్వామీ! మరి మీ అవసరాలు, కోరికలు ఎలా? మీకంటూ ఏదీ లేదు కదా?

శి: ఉన్నది పంచడమే నా పని అయినప్పుడు, ఇక కోరికలు, అవసరాలు, సంపాదించాల్సిన అవసరంగానీ లేదు. బ్రతకటానికి సరిపడినంత ప్రతి జీవికీ దొరుకుతుంది. ఈ విశ్వమే నాది, అందరూ నావారు.

భ: మనిషి జీవితలక్ష్యం ఏమిటి స్వామీ?

శి: స్వార్థం లేకుండా, సత్యవంతంగా విశ్వం కొరకు జీవించడమే.

అలా జరుగుతుండగా, కొందరు వ్యక్తులు నిస్వార్థంగా, మరికొందరు స్వార్థంతో ఆశించి పనిచేయడం జరిగింది. ప్రతీదీ ధనంతో పోల్చడం, సమానంగా కాక, అసమానతలు, పక్షపాతం వహిస్తూ, లాభాపేక్షతో సామాన్యులకు అందకుండా చేశారు. అలా నిస్వార్థంగా పంచవలసింది కాస్తా, వారి ఆస్థులు, అంతస్థులు అంతులేకుండా పెంచుకోవటానికి ఉపయోగించారు. అలా వ్యాపారంలో సంపాదిస్తూ, వాటి బరువుల్ని పెంచుకున్నారు. జ్ఞానం తగ్గుతూ వచ్చింది. కొన్నాళ్ళకు శాంతి, సంతోషం లేని డబ్బును ప్రేమించే వ్యక్తులుగా పరిణమించారు. వారే విద్యను, కళల్ని, యోగాన్ని, సంగీతాన్ని వ్యాపారంగా మార్చినవారు. అంతిమంగా వీరు మనశ్శాంతి కరువైన మరమనుషులుగా మారి, సహజత్వాన్ని కోల్పోయారు. ఆ శిష్యుడు మాత్రం తన ప్రేమ, జ్ఞానం పంచుతూ, అందరికీ ఆప్తుడుగా, మహానుభావుడుగా పేరుగాంచాడు. తనతో ప్రయాణించిన వ్యక్తులతోపాటు గురువుగారు ఇచ్చిన మహాకార్యాన్ని మనసా, వాచా, కర్మణా కొనసాగిస్తున్నాడు. జీవితంలో చివరి అంశానికి చేరినప్పుడు, తన సహచరులతో అన్నాడు, "ఇది నాతో అంతం కాదు, మీతో ముందుకు సాగుతుంది" అని. ఆయన జీవితం చాలించే వరకూ త్యాగశీలిగా

సేవకే అంకితమై గడిపాడు. కోరినట్లే తన తర్వాత కూడా ఆ కార్యాలు కొనసాగుతూనే వున్నాయి. ఎవరు వున్నా లేకున్నా దైవకార్యం ఆగదు, నిర్విఘ్నంగా కొనసాగుతుంది. శిష్యుడు మరణానంతరం గురువును చూశాడు. చూడగానే, "గురువుగారూ! మీ కుండ" అన్నాడు.

గు: కుండ ఏమిటి? నీవేమిటి? నేనేమిటి?

శి: ఏమీ అర్థం కాలేదు.

గు: కుండే నీవు. నీవే నేను.

శి: అదెలా స్వామీ?

గు: కుండ నీ సమర్థత, ప్రావీణ్యతలు. వాటిని సత్యంతో, నిస్వార్థంగా ఉపయోగిస్తూ, నలుగురికీ పంచుతూ జీవించమని చెప్పాను. అది నీ లక్ష్యం. జీవితాంతం అలాగే వుండమన్నాను.

శి: మరి మీరు?

గు: నేనసలు లేనేలేను. నేను నీ అంతరాత్మను. నీలోనే వున్నాను. నీవు నన్ను నమ్మి సత్యవంతంగా వున్నావు.

సత్యం మనిషిని స్వతంత్రుడ్ని చేస్తుంది. ఏ ఆందోళన వుండదు. ఆత్మవిశ్వాసంతో వుంటారు. ఏ సంపదలు లేకపోయినా, లోకం వారికి దాసోహం అవుతుంది. ఈ ఆంజనేయుని సత్‌వాక్యాలు, అమృతతుల్యమైన సలహాలు, మిమ్మల్ని తీర్చిదిద్దే విధానం గుర్తెరిగి, మీరు కూడా నడిచినట్లైతే, జీవిత పరిపూర్ణత్వాన్ని సాధించి తీరుతారు. మీ నిండా అమృతమే కానీ, దానిని చివరి వరకూ కాపాడుకోవటమే మీ పని, మీ బాధ్యత. ఆ బాధ్యతతోనే కృతజ్ఞతలు సమర్పించండి, నా చిన్నారి బిడ్డలారా!

నీ ప్రతిభ, సమర్థతలకంటే
దృక్పథం, ఆశయాలు అత్యంత ముఖ్యమైనవి

ॐ

**01-08-2019** 09:10 AM

## 194) సత్యాన్వేషణకు మేము ఆచరించవలసినవి ఏవి స్వామీ?

మీకు సందేహాలు కలగాలి, తర్కబద్ధంగా వాటిని గూర్చి ఆలోచించాలి. విషయపరిశీన విషయంలో, విచక్షణతో ప్రవర్తించాలి. వివేచన లేని పరిశోధన నీడలేని ఎడారి నడక లాంటిది. సంపూర్ణ విషయాన్వేషణ ఒంటరిగా చేయడం సాధ్యం కాదు. అలా చేయాలంటే, ఎంతో అధ్యయనబలం కావాలి. మనిషికి భగవంతుడు జీవితకాలంలో ప్రసాదించిన ఎన్నో పగళ్ళు, మరెన్నో రాత్రులు కదా! వీటిని సుఖాన్వేషణతో వ్యర్థం చేసుకుంటున్నారు. సత్యాన్వేషణలో జీవితాన్ని అర్థం చేసుకునే ప్రయత్నం చెయ్యడంలేదు. అద్వైతంలో ప్రధానంగా మూడు విషయాలు ప్రస్ఫుటంగా కన్పిస్తాయి. ఒకటి బ్రహ్మసత్యం, రెండవది జగన్మిథ్య,

మూడు జీవుడే బ్రహ్మ. ఇక్కడ బ్రహ్మ అనేది దేవుడికి పర్యాయపదంగ గ్రహించండి. ఈ ముఖ్యమైన మూడింటిని గూర్చి, ప్రకృతిలో జీవుడు నిరంతరం అనేకానేక సందేహాలతో అన్వేషిస్తూనే వుంటాడు. పుట్టుకతో భోగి అయినవారు, తర్వాత వ్యక్తంకాని అనేక రోగాలపాలవుతారు. పుట్టుక కష్టాలకోర్చి, భగవత్ ధ్యానంతో, ప్రశాంత చిత్తముతో జీవించువారు, తర్వాత భోగాలను అనుభవించవచ్చు. సుఖాలు ఎవరో ఒక్కరి సొంతం కాదు. అలాగని దుఃఖం ఎవరినో ఒకర్ని పట్టుకుని జీవితాంతం పీడించదు. ఏమీ తెలుసుకోకుండా జీవిస్తూంటారు, ఎక్కువమంది. ఏదో కొంత తెలుసుకుని జీవిస్తూంటారు ఇంకొందరు. పూర్తిగా తెలుసుకుని జీవించేవారు అతి కొద్దిమంది కూడా వుండరు. ఒకవేళ వున్నా, అరుదుగా వుంటారు. వాళ్ళు మాటలతో కాలక్షేపం చెయ్యరు. ఈ జీవనసూత్రం అర్థమైన వారికి దుఃఖ నివారణామార్గం తెలిసే వుంటుంది. సత్యం అంటే నిజం చెప్పడమని అర్థం మాత్రమే కాదు. సత్యంలోని విశాలార్థాన్ని గ్రహించాలి. మనో వాక్కాయ కర్మలతో సత్యాన్ని అనుసంధానించి, బాహ్యజీవితాన్ని ఆంతరంగిక జీవితంతో సమ్మేళనం చేయాలి. ఆసన్నమైన కష్టాలను లక్ష్యపెట్టకుండా, ఏకాగ్రచిత్తంతో ప్రవర్తించాలి. దైవానికి, గురువుకు, ధర్మానికి, నీతికి, సమాజానికి, చట్టానికి భయపడటం అవసరమే. అది మితమై, ఆదరణ, విశ్వాసం, శ్రద్ధతో కూడివుండాలి. అదే భయ సందేహాలతో, నిరాశా నిస్పృహలు సృష్టించుకుని, బెంబేలెత్తి కృంగిపోకూడదు. శ్రవణం, కీర్తనం, స్మరణం, పాదసేవనం, అర్చనం, వందనం, దాస్యం, సఖ్యం, ఆత్మనివేదనం అనేవి నవవిధ భక్తిమార్గాలు కదా! వైష్ణవభక్తి, భావపరంపరలో భాగంగా, భక్తులు భగవంతుని తమ కొడుకుగా భావించారు. లౌకిక ప్రపంచంలో మానవసేవ చేసి, సంతృప్తి పొందాలన్నా, అలౌకిక తత్త్వంతో మాధవసేవ చేసి కైవల్యం సాధించాలన్నా అడుగులు ముందుకే వేయాలి. సత్కార్యాలకు విపత్తులు ఎదురౌతూనే వుంటాయి. నిరాశతో అడుగులు వెనక్కి వేయడం వల్ల విపత్తులను తప్పించుకోలేరు. బుద్ధి చాలా చంచలమైనది కూడా. కోరికను నియంత్రించటానికి శరీరాన్ని, ఇంద్రియాల్ని, మనస్సును అదుపులో పెట్టుకోవటానికి, సమాలోచన చేసి సమన్వయించుకునే బుద్ధి మనిషికి భగవంతుడు ప్రసాదించిన ఒక వరంగా భావించాలి. క్రొత్త ధనం కోసం మనసు ఉవ్విళ్ళూరుతూ వుంటుంది. కానీ, లోలోపల సాధనేచ్ఛ మాత్రం వుండదు. దీనిని కోల్పోవడం అంటే, జీవితం పట్ల ఆసక్తిని కోల్పోవడమే. అంతేకాక, ఆసక్తులు ఏమిటో స్పష్టంగా తెలియకపోవటం మరో కారణం. కాబట్టి, ఎవరికి వారు, తమ విలువైన, నిజమైన ఆసక్తులేమిటో తెలుసుకుని, అందుకు అనుగుణంగా పనిచేయాలి. ఇదే మనిషికి ఆనందమైన ఆధ్యాత్మిక జీవితాన్ని ప్రసాదిస్తుంది. హృదయ సౌందర్యాన్ని అర్థం చేసుకోవాలంటే, సంస్కారం వుండాలి. అందం తక్కువ వున్నవాళ్ళు కూడా ఆభరణాలు, వస్త్రాలు, అలంకరణల చేత ఆకర్షణీయంగా కనబడవచ్చు. ఇవ్వన్నీ భౌతిక సౌందర్య సాధనాలు. అవ్వన్నీ తాత్కాలికమైనవి. బాహ్య సౌందర్యానికైతే పరిమితులుంటాయి. హృదయసౌందర్యమో? అపరిమితమే! హృదయసౌందర్యంలో కరుణ, ప్రేమ, సానుభూతి వుంటాయి. ఇవి దైవాంశాలు. ఏదైనా మంచిపని చేయాలనే భావన మనసులో కల్గటమే గొప్ప. ఇతరులకు మేలు చేయాలని అనుకోవడం ఇంకా గొప్ప అదృష్టం. ఆ భావాన్ని ఆచరణలోకి తేవటానికి సంకల్పబలం అధికంగా వుండాలి. అహింస, దానం, ధర్మం, సహనం అనేవి ఉత్తమధర్మాలు. సహనం కలవాడిని విజయం వరిస్తుంది. సహనం కల్గి, ధర్మం మీద ఆదరం కలవాడికి లోకం తలవంచి నమస్కరిస్తుంది. అనుభవరీత్యా మీకు అర్థమయ్యే విషయం ఏమిటంటే, రుచి లేక, అభిరుచి ద్వారా లభించే ఆనందం తాత్కాలికమే. ఆహారం తీసుకుంటే, ఆకలి

*తీరుతుంది. కొంత సమయం గడిచాక మళ్ళీ ఆకలి, దాహము వేస్తాయి. తాత్కాలిక ఆనందం పరిస్థితి కూడా అంతే.*

***క్షణం చేజారితే, లక్ష్యాన్ని చేరగలవా?***
***ఏమిటా లక్ష్యం అంటావా?***
***బాహ్యబంధాల మధ్య బందీవై, గమ్యం లేని ప్రయాణంలో,***
***కానరాని దిశలలో ప్రయాణించటమేనా?***
***సంయమనం లేక, సంశయాల నిచ్చెనపై, అభద్రతా గారడీలు చేయడమేనా?***
***వారసత్వ వలయ మోహాన్వితుడవై, నీలోని నన్నే గుర్తించుట లేదు.***
***నన్నే ఎవరని అడుగుతున్నావు?***
***రసాస్వాదన లేని జీవితాలతో ఏమి సాధించావు ఇప్పటివరకు?***
***ఇకనైనా నిన్ను నీవు మలచుకో.***
***మట్టిని చీల్చి మొలకెత్తే విత్తులా, అజ్ఞానపు పొరల్ని చీల్చుకుని***
***ఆంజనేయుని బోధలతో జ్ఞానవంతులై నా దరి చేరండి***
***నా చిన్నారి ముద్దుబిడ్డలారా!***

ॐ

**02-08-2019** 08:40 AM

**195) ఆధ్యాత్మిక ఎదుగుదల తపస్సు ద్వారా ఎలా సాధ్యము స్వామీ?**

*ఆధ్యాత్మిక జీవితం ఒక సమరం. కామ, క్రోధ, లోభ, మోహ, మద, మాత్సర్యాలనబడే అంతర్గత శత్రువులపై జరిపే మహాసంగ్రామం. బాహ్యశత్రువులను ఎదుర్కొనటం కంటే, ఈ అంతఃశత్రువులను ఎదుర్కోవటం ఎంతో క్లిష్టతరమైన విషయంగా జగతి అంతా భావిస్తుంది. ఇది జగమెరిగిన సత్యమే. అందుకే ఈ అంతరంగ శత్రువులను జయించి, అంతఃప్రకృతిని లోబర్చుకున్నవారు మహావీరులు, నిజమైన ధీరులుగా లెక్కించబడతారు. అయితే, బాహ్యయుద్ధంలో ఉన్నట్లుగానే ఈ అంతరంగ పోరాటానికి కూడా నియమనిబంధనలు, వ్యూహ-ప్రతివ్యూహాలు వుంటాయి. దీనికి కూడా చక్కని ప్రణాళిక, సంసిద్ధత అవసరం. ఈ అంతరంగ పోరాటానికి సంబంధించిన సరియైన అవగాహన, అప్రమత్తత, సన్నాహాలు లేకుండా పోరాటపరిధిలోకి దిగటం వినాశనాన్ని కొనితెచ్చుకోవడమే. వేలకొలది సాధకయోధులలో ఏ కొద్దిమందో ఈ ఆధ్యాత్మిక సమరంలో విజేతలుగా నిలుస్తారు. అయినప్పటికీ, ఈ పరమోన్నత పారమార్థిక పోరాటంలో పాల్గొనటానికి నిరాశ పడనవసరం లేదు. ఈ ప్రయత్నంలో ఎదుర్కొనే అడ్డంకులు, అవరోధాలు, అనుభవజ్ఞానం మీరు మరింత అంకితభావంతో పోరాడటానికి దోహదపడాలి. మీ ఆధ్యాత్మిక బలాలు, బలహీనతల పట్ల అంచనా కూడా అంతే ముఖ్యం. మీరు ఈ సుదీర్ఘ పోరాటానికి సమర్థులా కాదా? ఆధ్యాత్మిక జీవితం కావాలనే మీ తపన, కోరిక తాత్కాలిక ఆకర్షణా, కేవలం కుతూహలమా, క్షణికోద్రేకమా లేక, మనస్ఫూర్తిగా మీరు ఈ జీవితాన్ని కోరుకుంటున్నారా? మీ నిజమైన శత్రువులు ఎవరు? వారితో*

ముఖాముఖీ తలడినపుడు మీరు వారిని ఎదుర్కొనగలరా? ఆ శత్రువుల బలాన్ని ఎలా అంచనా వేయగలరు? కాస్త ముందో వెనకో ఏదో ఒక రూపంలో ప్రతీ ఆధ్యాత్మిక సాధకుడు ఈ ప్రశ్నలకు సమాధానం తప్పక వెదుక్కోవలసిన సమయం వుంటుంది. ఆధ్యాత్మిక సాధనలకు సంబంధించిన అనేక పద్ధతులు సాధకులకు నిర్దిష్ట ప్రారంభ సన్నాహాలను సూచిస్తాయి. ఇవి వారిని ఆధ్యాత్మిక పోరాటానికి సన్నద్ధులను చేస్తాయి. తపస్సు అనేది అందరూ ఆమోదించబడిన సాధనాపద్ధతి. ఇది సాధకునికి తనను తాను అంచనా వేసుకోవటానికి దోహదపడుతుంది. అంతేకాక, ముమ్ముందు పారమార్థిక పోరుకు సమాయత్తమయ్యేలా చేస్తుంది. తపస్సు సాధకుని శారీరక, మానసిక శక్తులను వృద్ధి చేస్తుంది. సమత్వాన్ని, స్థిరత్వాన్ని కలిగిస్తుంది. నిలకడలేని మొండి గుర్రానికి కళ్ళేలు బిగిస్తే, సుదీర్ఘ ప్రయాణానికి చక్కని వాహనంగా ఉపయోగపడినట్లు, శృతి చేయబడిన తంత్రీవాయిద్యం మధుర సంగీతాన్ని విన్పించినట్లు, చక్కని ఆధ్యాత్మిక జీవనానికి తపస్సు మనశ్శరీరాలను సిద్ధం చేస్తుంది. మానవులు సాధారణంగా సుఖమైన, సౌకర్యవంతమైన జీవితం వైపు మొగ్గు చూపుతారు. సుఖసౌకర్యాలను అందించే అనేక రకాల వస్తువులు ఇబ్బడిముబ్బడిగా పెరుగుతున్న ఈ ఆధునికకాలంలో, ఈ ధోరణి మరింత ప్రబలంగా తయారయింది. కానీ విద్య, వైద్య, క్రీడ, సంగీత, సాహిత్య, వాణిజ్య ఇలా ఏ జీవనరంగంలోనైనా మహత్కార్యాల సాధనకు తపోమయస్ఫూర్తి తప్పనిసరి. ఆధ్యాత్మిక జీవితంలో ఇది తప్పనిసరి. సాధారణంగా జనులు తపస్సు అంటే దుఃఖకారకమైన, స్వయంకల్పిత (ప్రేరణ) శారీరకయాతన అని భావిస్తారు. ఉపవాసం, జాగరణ, శరీరాన్ని శుష్కింపచేయటం మొదలైనవన్నీ అసహజమే కాక, తీవ్ర పరిణామాలను కలిగించేవని అనుకుంటారు. అందుకే ఆధునిక చింతనాపరులు విపరీతంగా కన్పించే ఈ పద్ధతులను నిరసిస్తారు. కానీ, వాస్తవానికి తపస్సు వీటన్నింటి కంటే భిన్నమైంది. 'తప' అనే సంస్కృత ధాతువు నుండి 'తపస్సు' ఉత్పన్నమైంది. తపస్సు అనే మాటకు అనేక అర్థాలున్నాయి. కష్టాన్ని వెలువరించేది, వెచ్చనిది, ప్రకాశించేది, బాధపడు, నొప్పించు, పశ్చాత్తాపపడు, శుష్కింపచేసుకొను, నియమనిష్ఠలతో పవిత్రీకరించుకొనుట వంటి అర్థములు కలవు. బంగారానికి పుటం పెడితే అందులోని మాలిన్యం తొలగిపోయి, అది సర్వశోభాయమానంగా ప్రకాశిస్తుంది. అలాగే, తపస్సు చేత మానసిక అపవిత్రతలన్నీ తొలగిపోతాయి. ఇంద్రియ సుఖలోలత్వం, ప్రబలమైన దేహధ్యాస, గతజీవితంలో చేసిన చెడుకర్మల వలన ఏర్పడిన తప్పుడు ధోరణులు ఇవ్వన్నీ తపస్సు చేయనిదే తొలగిపోవు. అందుకే, తపస్సు అనేది గతజీవితపు దుష్కర్మల ప్రభావాన్ని పరిహరించేదిగా పరిగణించబడుతుంది. లేదంటే ఆ దుష్కర్మల ఫలమైన వేదనను, బాధను అనుభవించాల్సి వుంటుంది. అన్ని రకాల శారీరక, మానసిక దుఃఖాలను అంగీకరించి, ఓర్చుకుంటూ, వాటి వలన కలిగే కష్టాలకు ఏమాత్రం కలత చెందకుండా తగిన నేర్పు, శారీరక దారుఢ్యం వుండి కూడా వాటిని తొలగించుకోవటానికి ఏమాత్రం ప్రయత్నించకుండా వుండటాన్నే తితీక్ష అంటారు. ఆకలిదప్పులు, శీతోష్ణాలు అనే శరీర దుఃఖాలను ఎప్పుడైతే స్వచ్ఛందంగా సమ్మతించి సహిస్తారో, అది తపస్సు అనబడుతుంది. తపస్సు అనే పదానికి అర్థం మానసిక తాపాన్ని, లేదా మనోబలాన్ని ఉత్పన్నం చేసేది. జలప్రవాహాన్ని సరియైన దిశలో మళ్ళించి, ఆ జలశక్తితో ఉత్పన్నమయ్యే విద్యుచ్ఛక్తిని ఉత్పన్నం చేసినట్లు, చెదిరిపోయిన మానసిక శక్తిసామర్థ్యాలను నియంత్రించి, ఏకం చేసినప్పుడు మనోబలం పెంపొందుతుంది. మానసిక తాపాన్ని ఉత్పన్నం చేసే మరో ప్రక్రియ, సంఘర్షణ. అగ్గిపుల్లను కరకు ప్రదేశంపై రాపిడి చేసినప్పుడు, రెండు రాళ్ళను ఒకదానితో మరొకటి రాపిడి చేసినప్పుడు అగ్ని

జనిస్తుంది. అదే విధంగా, రెండు పరస్పర విరుద్ధ ఆలోచనా ప్రవాహాల మధ్య సంఘర్షణ మనోతాపాన్ని కలుగచేస్తుంది. సాధారణంగా తపస్సులన్నీ ఈ రకమైన ఆత్మనిగ్రహం లేదా మనోనియంత్రణ అనే కోవకు చెందుతాయి. తపస్సు అంటే మేథోమధనం లేదా మానసిక సంఘర్షణ అని చెబుతాను. విచారణ చేయడం ద్వారా జరిగే ఈ తపస్సును జ్ఞానమయ తపస్సు అంటారు.

***అచంచల ఆత్మవిశ్వాసంతో, కనిపించని లోకాన్ని, కానరాని మానవత్వాన్ని***
***తనువంతా తన్మయత్వంతో ప్రవహించే స్పర్శజ్ఞానమై***
***ఆలోచనల అంతర్నేత్రంతో, విజయసోపానమధిరోహించాలంటే,***
***తపస్సు అనే శిఖరాన్ని అధిరోహించి***
***ఆంజనేయుని ప్రోత్సాహపు పలుకులతో***
***పాడిబారిన గుండెల నిండా, ప్రోత్సాహపు గాలి పీల్చి, ఆత్మస్థైర్యంతో అడుగులేస్తూ***
***ఆశలే ఆలంబనగా కనువిప్పు కలిగించుకుని***
***వెలుగుజిలుగుల రారాజులుగా ధరణిలో నిల్వండి***
***నా చిన్నారి ముద్దుబిడ్డలారా!***

ॐ

**03-08-2019** 08:40 AM

**196) నేను క్షేత్రము కాదు, క్షేత్రజ్ఞుడను అను సత్యాన్ని ఏ విధముగా అర్థం చేసుకోవాలి స్వామీ?**

సూర్యుడు ఒక్కడే. అతడి వెలుగులో అనేక పుణ్యకార్యాలు, పాపకార్యాలు జరిగిపోతూ వుంటాయి. వాటితో సూర్యునికి ఎట్టి సంబంధమూ లేదు. అవన్నీ చేసినవారికే. అలాగే, ఆత్మ ఒక్కటే. దాని సాన్నిధ్యంలోనే క్షేత్రాలు, అనేక పుణ్యకార్యాలు, పాపకార్యాలు చేస్తుంటాయి. వాటితో ఆత్మకు ఎలాంటి సంబంధమూ లేదు. అవన్నీ కూడా కర్మలు చేసిన క్షేత్రాలకే. ఆత్మ శుద్ధచైతన్యం, సచ్చిదానంద స్వరూపం. అది అని దేహమనోబుద్ధులనూ చైతన్యవంతం చేస్తుంది. ప్రకాశింపచేస్తుంది. ఆ చైతన్యం వల్ల ఈ దేహమనోబుద్ధులు అనేక వ్యవహారాలలో, కర్మలలో మునిగిపోతూంటాయి. అయితే వాటి గుణదోషాలతో ఆత్మకు ఏ సంబంధమూ లేదు. అది ఎప్పటిలాగా స్వచ్ఛంగా నిర్మలంగా వుంటుంది. ఈ సత్యాన్ని గ్రహించిన సాధకుడు ఏమి చెయ్యాలి? ఆత్మ అన్ని క్షేత్రాలను ప్రకాశింపచేస్తుందని, అది దాని ధర్మమని, అన్ని కర్మలకు అది కేవలం సాక్షియని, దానికి ఏ మలినాలు అంటవని, ఏ గుణదోషాలు అంటవని, నిరంతరం మననం చేసుకుంటూ, తాను యదార్థంగా అట్టి అసంగుడైన, నిర్మల ఆత్మనే గాని, దేహేంద్రియ ప్రాణ మనోబుద్ధులతో కూడిన క్షేత్రాన్ని కాదని, ఈ క్షేత్రం జడమని, తాను చైతన్యస్వరూప ఆత్మనని, జడమైన క్షేత్రం కన్నా తాను వేరైన వాడినని స్థిరచిత్తంతో నిరంతరం దృఢంగా భావన చేయాలి. ఇలా చేయుటే జ్ఞానం, అలా చేయగలిగేవాడే జ్ఞాని అని తెలుసుకుని, అలా వుండేందుకు ప్రయత్నం చేయువాడే ఆత్మానుభూతికి, మోక్షానికి అర్హుడు. 'అది నేనే', 'సోహం', 'అహం బ్రహ్మాస్మి' అనే అనుభూతినే

చివరకు పొందవలసి వుంటుంది. అదే వేదాంత విద్యకు పరాకాష్ఠ. ఈ ప్రకారంగా క్షేత్ర–క్షేత్రజ్ఞుల మధ్యగల భేదాన్ని ఈ భూతప్రకృతి నుండి విముక్తి చెందే ఉపాయాన్ని జ్ఞానదృష్టితో ఎవరు తెలుసుకుంటారో, వారు పరమాత్మను, మోక్షాన్ని పొందుతారు. క్షేత్ర–క్షేత్రజ్ఞుల మధ్య గొప్ప అంతరం, భేదము వున్నది. ఏమిటా భేదం అంటారా?

1. క్షేత్రము జడం – క్షేత్రజ్ఞుడు చైతన్యం
2. క్షేత్రం అంటే స్థూల సూక్ష్మ కారణ శరీరాలు. దీనినే ప్రకృతి అంటారు. క్షేత్రజ్ఞుడు అంటే నిరాకారుడు, సర్వవ్యాపి, సూక్ష్మాతిసూక్ష్మం అయిన చైతన్యశక్తి.
3. క్షేత్రం నశించిపోయేది – క్షేత్రజ్ఞుడు శాశ్వితంగా వుండేవాడు.
4. క్షేత్రం ఇంద్రియగోచరం – క్షేత్రజ్ఞుడు ఇంద్రియ అగోచరుడు.
5. క్షేత్రాలు అనేకం వుంటాయి – క్షేత్రజ్ఞుడు మాత్రం ఒక్కడే.
6. క్షేత్రాలు విభక్తం – క్షేత్రజ్ఞుడు అవిభక్తం, అఖండం.
7. క్షేత్రం సమస్త కార్యాలకు కర్త, భోక్త – క్షేత్రజ్ఞుడు అకర్త, అభోక్త.
8. క్షేత్రం వికారాలతో, గుణాలతో కూడినది – క్షేత్రజ్ఞుడు అవికారి, గుణరహితుడు, ప్రభావశీలి.
9. క్షేత్రం పరిచ్ఛిన్నం అంటే ఒకచోట వుంటే, మరొకచోట వుండదు. పరిమితం – క్షేత్రజ్ఞుడు అపరిచ్ఛిన్నం, సర్వవ్యాపి.
10. క్షేత్రం చూడబడేది, తెలుసుకోబడేది. క్షేత్రజ్ఞుడు చూచేవాడు, తెలసుకొనేవాడు.

ఇలా క్షేత్ర–క్షేత్రజ్ఞుల మధ్య ఎన్నో విభేదాలున్నాయి. అయితే, ఇలా ఎన్ని విభేదాలున్నా, సామాన్యులు ఈ రెండింటినీ విడగొట్టి చూడలేరు. అసలు క్షేత్రం – క్షేత్రజ్ఞుడనేవి రెండు వున్నట్లు గ్రహించలేరు. కేవలం జ్ఞానవంతులే, ఆత్మజ్ఞానం తెలిసినవారే విడగొట్టగలరు.

**ఆత్మవిశ్వాసాన్ని ఆయుధంగా చేసుకోండి**
**ఆనందపుటంచులు తాకాలి**
**జ్ఞాన సముపార్జనకై ముంగిట చేరే అమూల్యమైన పెన్నిధి అది**
**అవసరం కోసం ముళ్ళను ఏరుతూ, పూలను పరుస్తూ ఆత్మశోధనతో అనునిత్యం వర్షిస్తూంటే**
**సమస్యలతో సవాళ్ళతో పెను ఉత్సాహంతో ఉరకలేస్తూ**
**ముదముపై ఆంజనేయుని భావాల మరువమై**
**విజయప్రధాన వినమ్రులై, మణిమయ మకుటాయమానమై**
**కీర్తి శిఖరాన కొలువవుతూ, అంతులేని ఆనందాల నడుమ**
**బోధనలతో సాధనలతో**
**ఈ మొక్కలను మహావృక్షంగా తీర్చిదిద్దటానికి సిద్ధమయ్యాను**
**లేవండి నా చిన్నారి ముద్దుబిడ్డలారా!**

ఓం

**04-08-2019** 08:45 AM

## 197) క్షేత్రము మరియు క్షేత్రజ్ఞుడి మధ్య భేదము ఏమిటి స్వామీ?

*కొయ్యతో తయారుచేసిన గుర్రంతో చిన్నపిల్లలు ఆడుకుంటూ వుంటారు. వారికి అక్కడ గుర్రం మాత్రమే కనబడుతుంది. కానీ, పెద్దవారికి మాత్రం కొయ్య, గుర్రం అనే రెండూ కన్పిస్తాయి. బంగారు గాజుల్లో స్త్రీలు గాజులనే చూస్తారు. షరాబు మాత్రం అందులో బంగారాన్ని చూస్తాడు. గాజులను కూడా చూస్తాడు. అలాగే సామాన్యులకు క్షేత్ర-క్షేత్రజ్ఞులిద్దరూ ఒక్కటిగా కనిపిస్తారు. ఒకటి బాహ్యదృష్టికి కన్పించేది. మరొకటి అంతర్దృష్టికి కనిపించేది. క్షేత్రం మిథ్య - క్షేత్రజ్ఞుడు సత్యం. నేను దేహాన్ని, నేను ఉద్యోగిని, నేను వ్యాపారిని, నేను గృహస్థును, నేను గృహిణిని, నేను గొప్పవాడ్ని, నేను అల్పుడ్ని అని ఈ క్షేత్రంతో కలిసిపోతున్నారు. ఈ పేరు, ఆకారం, శరీరం, మనోబుద్ధులు, గొప్పతనం, అల్పత్వం ఇవ్వన్నీ క్షేత్రధర్మాలు. నేను మాత్రం క్షేత్రం కన్నా వేరుగా ఆ క్షేత్రాన్ని తెలుసుకునేవాడిగా వున్నాను అనే భావన చేయాలి. క్షేత్రంతో ఐక్యం చెందినపుడు క్షేత్రం చేసే పనులను నేను చేస్తున్నానని, వచ్చిన సుఖదుఃఖాలను నేను అనుభవిస్తున్నానని అనుకుంటూ చలించిపోతున్నారు. క్షేత్రం నుండి విడిపోయి, క్షేత్రజ్ఞుడిగా వుంటే ఆ కర్మలతో గాని, వాటివల్ల వచ్చే సుఖదుఃఖాలతో గాని, మీకు సంబంధం వుండదు. వాటికి చలించవలసిన అవసరం వుండదు. కనుక, క్షేత్రం నుండి క్షేత్రజ్ఞుడ్ని వేరు చేయాలంటే విడగొట్టాలంటే, ముందు ఆ రెండింటి మధ్యగల భేదాలను అధ్యయనం చేయాలి. బాగా వంటపట్టించుకోవాలి. ఇలా రెండింటి మధ్య అంతరాన్ని తెలుసుకుని ఏం చెయ్యాలి? అన్నట్లయితే, భూత ప్రకృతి అంటే క్షేత్రమే. క్షేత్రమంటే స్థూల సూక్ష్మ కారణ శరీరాలే. అయితే, ఇప్పుడా మూడు శరీరాల క్షేత్రంతో కూడి క్షేత్రజ్ఞుడున్నాడు. క్షేత్రజ్ఞుడు ఆ మూడు శరీరాలతో కప్పబడి వున్నాడు. ఆ మూడు శరీరాలతో కూడిన క్షేత్రం నుండి విముక్తి చెందితే క్షేత్రజ్ఞుడు ఆత్మగా, పరమాత్మగా, ఆనందస్వరూపంగా వుండిపోతాడు. కనుక క్షేత్రం నుండి క్షేత్రజ్ఞుడు విడిపోవాలి. విడుదల చెందాలి. విముక్తి చెందాలి. అందమైన శ్రీకృష్ణుని పాలరాతి విగ్రహం వుంది. దాన్ని చాలా దూరప్రాంతం నుండి పార్సిల్ సర్వీస్ ద్వారా తెప్పించుకున్నారు. పార్సిల్ ఆఫీస్ నుండి ఒక చెక్కపెట్టె వచ్చింది. మీరు ముందుగా చెక్కపెట్టెను తెరిచారు. ఆ పెట్టెలో గడ్డి వుంది. ఇప్పుడా గడ్డిని తొలగించారు. ఆ లోపల గట్టి పోలితిన్ పేపరులో చుట్టి ఒక వస్తువుంది. ఇప్పుడా పోలితిన్ పేపర్లను తొలగించారు. అంతే! అందమైన శ్రీకృష్ణుని పాలరాతి విగ్రహం దర్శనమిచ్చింది. అంటే, ఆ చక్కని విగ్రహం కన్పించాలంటే చెక్కపెట్టె మూతను తొలగించారు. ఆ తర్వాత గడ్డిని తొలగించారు. ఆ తర్వాత పోలితిన్ పేపర్లను తొలగించారు. అన్నింటినీ తొలగించిన తర్వాత అందమైన విగ్రహం కన్పించింది. అదే విధంగా, మీరు శుద్ధమైన చైతన్యస్వరూప పరమాత్మస్వరూపులే. కాకపోతే, కారణశరీరమనే పోలితిన్ పేపర్‌లో చుట్టి వున్నారు. దాని చుట్టూ గడ్డి అనే సూక్ష్మశరీరంతో కప్పబడ్డారు. ఈ మొత్తము స్థూలశరీరమనే చెక్కపెట్టెలో బంధించివేయబడ్డాయి. అందువల్లనే మిమ్ములను మీరు తెలుసుకోలేక, నీవే ఆత్మవు అని తెలుసుకోలేక శరీరమనే చెక్కపెట్టెను మీరే అని అనుకుంటున్నారు. కనుకనే సుఖదుఃఖాలనే సుత్తిదెబ్బలు, తన్నులు పడుతున్నాయి, అల్పులుగా అవమానింపబడుతున్నారు. ఎవరన్నా*

కూర్చోవాలనుకున్నప్పుడు, చెక్కపెట్టేగదా అని దాని మీద కూర్చుంటున్నారు. ఇందులో ఏమి వున్నది? అని కాలితో తన్ని అడుగుతారు. ఆ అవమానాలు, తన్నులు తప్పాలంటే, చెక్కపెట్టెను తెరిచి, అందులోని చెత్తను తొలగించి, పోలితిన్ పేపర్లను తొలగించి, శ్రీకృష్ణుని విగ్రహాన్ని బయటకు తీసినట్లు, మీ స్థూలశరీరాన్ని తొలగించి, సూక్ష్మశరీరాన్ని విడిచి, కారణశరీరంతో తాదాత్మ్యాన్ని విడిచి, ఆత్మస్వరూపంగా, ఆనందస్వరూపంగా, అందమైన శ్రీకృష్ణుని విగ్రహంలా వుండిపోవాలి. అప్పుడే గౌరవం, ఆనందం అన్నీ లభిస్తాయి.

***భగవంతుడు తన ప్రేమను పంచభూతాల ద్వారా ప్రసరింపచేస్తున్నాడు***
***భూమిపై భరించి, గాలితో ప్రాణం పోసి, నీరులా దాహం తీర్చి, నిప్పులా నిన్ను వెలిగించి,***
***ఆకాశంలో అన్ని వైపుల నుండి నిన్ను వేల చేతులతో ఆదరించే ఆ దైవాన్ని, కేవలం ధ్యానంతో***
***ఆ నిశ్శబ్దప్రేమ ప్రవాహాన్ని తెలుసుకోండి***
***ఆయనే తల్లి, తండ్రి, గురువు, హితుడు, సర్వం అని తెలుసుకొనటానికే ధ్యానం చేయండి***
***నేను, నువ్వు, మనం, సర్వం ఆయనే అని తెలుసుకోవటానికి ధ్యానం చేయండి***
***సర్వమానవజాతికి దైవాన్ని చేరే మార్గం ధ్యానం అని మరువకండి మాటలతో ప్రొద్దుపుచ్చక***
***సోమరితనం ముద్దు అనుకుంటే, అడుగు కూడా ముందుకు వేయలేరు.***
***వేయివిధాల బోధిస్తున్న ఈ వీరాంజనేయుని వీరోచిత వాక్యాలు***
***ఉత్తేజపరిచి, ఉత్తమగతిని అందిస్తుంది***
***నా చిన్నారి బిడ్డలారా!***

ॐ

**10-08-2019** 09:30 AM

**198) అయితే, పైన చెప్పిన విధంగా చెక్కపెట్టెను తెరవటం, చెత్తను తొలగించటం, పోలితిన్ పేపర్లను తొలగించడం చేతనవుతుంది గాని, ఈ స్థూల సూక్ష్మ కారణ శరీరాలతో కూడిన క్షేత్రాన్ని తొలగించడం, క్షేత్రంతో పెట్టుకున్న తాదాత్మ్యాన్ని తొలగించడం, అజ్ఞానం కారణంగా కల్పించబడిన తాదాత్మ్యాన్ని తొలగించడం, కల్పిత తాదాత్మ్యాన్ని తొలగించడం ఎలా స్వామీ?**

క్షేత్రం – క్షేత్రజ్ఞుని కలయిక, కారణశరీరస్థాయిలో జరిగింది. అదే సూక్ష్మశరీరస్థాయిలోకి వచ్చి చివరకు స్థూలశరీరస్థాయిలో కూడా రెండూ విలీనమైపోయాయి. నిజంగా ఈ కలయిక, సంయోగం తాదాత్మ్యభ్రాంతి వల్ల, అజ్ఞానం వల్ల వచ్చిందే. మరి భ్రాంతి ఎలా తొలగుతుంది? జ్ఞానంతో తొలగిపోతుంది. అందుకే, ఇక్కడ భూతప్రకృతి నుండి విడిపడాలంటే, జ్ఞాననేత్రం కావాలి అని అంటున్నాను. అదే జ్ఞానచక్షువు. మామూలు నేత్రంతో ఈ చర్మచక్షువుతో చూస్తే, స్థూలవస్తువులు మాత్రమే కన్పిస్తాయి. జ్ఞాననేత్రంతో చూస్తేనే సూక్ష్మ విషయం, ఆత్మ విషయం అర్థమవుతుంది. మామూలు ఫోటోకెమెరా పైపై రూపాన్ని, వస్త్రాన్ని, అందచందాలను, ఆభరణాలను, కన్ను ముక్కు తీరును ఫోటో తీస్తుంది. అదే ఎక్స్-రే కెమెరా అయితే, శరీరం లోపల వున్న ఎముకలను, ఇతర భాగాలను ఫోటో తీస్తుంది. దీనిది

లోదృష్టి ఫోటో – మామూలు కెమెరాది బాహ్యదృష్టి. అలాగే, మీలో లోదృష్టి కలగాలి. ఆ లోదృష్టియే జ్ఞానదృష్టి. 1) అమానిత్వాది గుణసంపద వల్ల 2) గురువుపై, శాస్త్రాలపై విశ్వాసం వల్ల 3) భగవంతుని యందు అనన్యభక్తి వల్ల 4) శాస్త్ర శ్రవణ, మనన, నిధిధ్యాసల వల్ల 5) సాధన వల్ల 6) ఆత్మతో అనుసంధానం వల్ల ఈ జ్ఞానదృష్టి కలుగుతుంది. ఈ దృష్టి వల్లనే మాయాప్రకృతి నుండి విముక్తి లభిస్తుంది. జ్ఞాననేత్రం పొందిన మహాత్మునికి విలక్షణమైన అనుభవం కలుగుతుంది. ఈ జగత్తు అంతా మిథ్యయని, పరమాత్మ ఒక్కడే సత్యపదార్థమని, ఉన్నది ఒక్కటేనని, అది తానేనని అనుభవమవుతుంది. అజ్ఞాని ఎలా దేహాత్మభావనలో, అంటే దేహమే నేను అనే భావనలో వుంటాడో, అలాగే జ్ఞాని బ్రహ్మాత్మభావనలో అంటే, బ్రహ్మమే నేను అనే భావనలో వుంటాడు. అట్టి స్థితిలో వున్నవారికి లభించే ఫలితమేమిటి? ఎవరు ఇలా జ్ఞాననేత్రంతో తెలుసుకుంటారో వారే పరమాత్మను చేరుకుంటారు, జీవన్ముక్తిని పొందుతారు. గొప్ప పాండిత్యం గానీ, గొప్ప వాగ్ధాటి గానీ, గొప్పగొప్ప పనులు చేసే సమర్థత గానీ, గొప్ప సంపదలు గానీ, గొప్ప పదవులు గానీ, గొప్ప కీర్తిప్రతిష్ఠలు గానీ ఇవేవీ పరమాత్మను పొందటానికి ఉపయోగపడవు. పరమాత్మను పొందాలంటే, జ్ఞాననేత్రం తెరుచుకోవాలి. అలా జ్ఞాననేత్రం తెరుచుకోవాలంటే సద్గురుకృప, సద్బోధలు, శాస్త్రజ్ఞానం, అందుకు తగిన సూక్ష్మబుద్ధి, అమానిత్వాది గుణాలు ఇవి అవసరం. కర్మ, భక్తి, జ్ఞాన, ధ్యాన యోగాల ద్వారా ఏ కులంలో, ఏ మతంలో, ఏ దేశంలో జన్మించిన వారైనా, చతుర్వర్ణాశ్రమాలలో దేనికి చెందినవారైనా, ఏ ధర్మంలో వున్నవారైనా సరే, అట్టివాడు పరమాత్మ సాక్షాత్కారాన్ని, మోక్షాన్ని, జీవన్ముక్తిని పొందవచ్చును.

" అజ్ఞానం వల్ల ప్రకృతితో తాదాత్మ్యం కలిగింది. క్షేత్రం ఏర్పడింది.

" జ్ఞానంతో ఆ తాదాత్మ్యం వదిలిపోయింది. క్షేత్రం మాయమయింది.

" దానితో, మిగిలేది క్షేత్రజ్ఞుడే. క్షేత్రాన్ని వదిలించుకున్నాడు.
కనుకనే శుద్ధచైతన్య ఆత్మస్వరూపుడిగా మిగిలిపోతాడు.

" అదే స్వస్థితి – ఆత్మస్థితి –ఆత్మసాక్షాత్కారం.

మీలో వుండే అవ్యయము, శాశ్వతము, ఆనందస్వరూపము అయిన ఆత్మతత్త్వాన్ని సూటిగా ధ్యానించుటకు తగిన మార్గాన్ని చూపే భగవద్గీతలోని అధ్యాయాలలో 13వ అధ్యాయం ఉత్తమోత్తమమైన అధ్యాయం. స్వప్నంలోని దుఃఖాలు తొలగాలంటే, స్వప్నం నుండి మేల్కొనాలి. జాగ్రత్తులోని దుఃఖాలు తొలగాలంటే, జాగ్రత్తు నుండి మేల్కొనాలి. స్వప్నం నుండి మేలుకోవటం అంటే, జాగ్రత్తు లోనికి ప్రవేశించాలి. జాగ్రత్తు నుండి మేలుకోవటం జ్ఞానంలోకి ప్రవేశించాలి. రాత్రి వచ్చిన స్వప్నం చిన్నకల – ఇప్పటి ఈ జాగ్రత్తులోని జగత్తు అంతా పెద్దకల. స్వప్నం నుండి అప్రయత్నంగానే మేలుకోగలుగుతారు. ఇది ప్రకృతి నియమించిన ధర్మం. జగత్తు నుండి ప్రయత్నం ద్వారానే మేలుకోగలరు. అందుకే, ఈ శాస్త్రాలు, గురువులు. అలా ప్రయత్నించి జ్ఞానంలోకి మేలుకోవాలి. ఈ జగత్తులోని దుఃఖాలు కూడా స్వప్నంలోని దుఃఖాల వంటివేనని గ్రహించి, వీటి నుండి విముక్తి కావాలంటే, జాగ్రదావస్థ నుండి జ్ఞానావస్థ లోనికి మేలుకోవాలి. స్వస్థితిలో నిలచిపోవాలి. వాస్తవానికి సూటిగా ఆత్మను గురించి తెలియచేయబడిన అధ్యాయం ఇదొక్కటే.

***ఊపరి విడిచిన మనిషి ఊరుబయట***
***కోట్లు వున్నా, చచ్చిన శవం ఇంటిబయట***
***చావు పేదైనా, రాజైనా సమానము గదా***
***అహము ఎందుకు? ఇహములో ఏమున్నది?***
***మేను సుందరమైనను, మిత్తికేమిటి?***
***కంపుగొట్టు శవము ఏదీ కంటికింపు గాదు***
***ఊపిరి ఉన్ననాడే మీ ఉలుకు, పలుకు***
***తెలియదా మీకు ఈ జన్మ తీరు?***
***దాచుకున్నది నిల్వదు, దోచుకున్నదీ ఇలలో దక్కదు***
***సిరులతో ఏమి చేస్తావు? చిల్లిగవ్వ కూడా రాదు చివరన నీతో,***
***ఊపిరి వున్నపుడే సాయము చేయండి ఇతరులకు సాధ్యమైనంత.***
***ఆలస్యము చేయక అందుకున్న అమృత గుళికలను అందంగా సేవించి***
***ఆంజనేయుని ఆనతిని, అభ్యున్నతిని స్వీకరించి నన్ను చేరండి***
***నా చిన్నారి ముద్దుబిడ్డలారా!***

ఓం

**12-08-2019** 09:15 AM

**199) అహంకారాన్ని ఎలా జయించాలి స్వామీ?**

*మీకు కల ఎప్పుడు మొదలైందో తెలుసుకోలేరు. అదే విధంగా, ఈ అహం భావన ఎప్పుడు ఉత్పన్నమైందో తెలుసుకోలేరు. 'నేను' అనే మూలాన్ని సమూలంగా పీకిపారవేయాలి. నిజానికి దీనికి ఒక యదార్ధ ఉనికి లేదు. ఉల్లిపాయను పొరలుపొరలుగా ఒలిస్తే, చివరకు ఏమీ మిగలదు. అలానే, ఈ అహంకారం దేనితో తాదాత్మ్యం చెందివుందో వెతికి, వాటినన్నింటినీ తొలగించుకుంటూ పోతే, చివరకు ఏ ఆసరా దొరకక, అహం అంతర్ధానమవుతుంది. అది అంతర్ధానమైన మరుక్షణమే, మీరు మీ నిజస్వరూపాన్ని తెలుసుకుంటారు. అయితే, దీనికి సత్వగుణం కావాలి. చంచల మనస్కులు, తమను తాము అధ్యయనం చేయటానికి కొద్ది సమయం కూడా తీసుకోలేనివాళ్ళు, ఈ అహంకార పిశాచ మూలాన్ని తెలుసుకోలేరు. అది వాళ్ళను ఇష్టమొచ్చినట్లుగా ఆడిస్తుంది. మీ దుఃఖాలకు నిజంగా భగవంతుడు కారణం కాదు, మీ ప్రారబ్ధమూ కాదు. ఈ అహం ఒక భూతం అని తెలియక, గట్టిగా పట్టుకునికూర్చున్నారు. పిశాచాన్ని గట్టిగా పట్టుకుని శాంతి కావాలంటే, ఎలా వస్తుంది? పట్టుకోవటమే కాదు, చాలామంది వారికి తెలియకుండానే ఈ పిశాచానికి చాలా చక్కటి ఆహారం పెట్టి, దానిని బాగా మేపుతుంటారు. అపుడు, అది సామాన్యపిశాచంగా వుండదు, మహాశక్తివంతమైన పిశాచమై కూర్చుంటుంది. మరి మీకు లొంగమంటే ఎందుకు లొంగుతుంది? చాలామంది ఈ పిశాచమే తమ ఉనికి అని అనుకుంటారు. ఈ 'నేను' లేకపోతే, బ్రతకటం ఎలా? అని అనుకుంటారు. ఇలా భావిస్తూ ఈ పిశాచాన్ని ఇంకా శక్తివంతంగా*

*చేస్తూంటారు కానీ, దానిని వదిలించుకోవాలని అనుకోరు. తమకు సమస్య అంతా ఈ 'నేను' అనే భేతాళుడి నుంచే అని వాళ్ళు అర్ధం చేసుకుని, ఈ భేతాళుడిని వదిలించుకోవటానికి ప్రయత్నించాలి. అపుడు, మీ అనంత, అప్రమేయ ఉనికి మీకు అనుభూతమవుతుంది. అది తెలియక, మనిషి సదా ఈ మిథ్యా అహాన్ని పట్టుకుని, ఊగుతుంటాడు. పిశాచమని తెలిసినా, వదులుకోవటానికి అంత త్వరగా సిద్ధపడడు. ఈ అహంకార పిశాచక్రీడ బహువిచిత్రం. ఇది చదువురానివారిని పట్టుకోదు. ఇది తెలివైనవాడిని, జ్ఞానిని అనుకున్న వాళ్ళని పట్టుకుని తనకు ఇష్టమొచ్చినట్లు ఆడిస్తుంది. నా క్రింద ఇంతమంది పని చేస్తున్నారు. నేను ఇది చేసాను, అది చేసాను. నాకింత సామర్థ్యం వుంది, నాకింత ఆస్తి వుంది, నేను ఇంత గొప్ప విద్యాధికుడిని, నేను గొప్ప పండితుడను, నేను గొప్ప ఆధ్యాత్మిక సాధకుడను, నేను సమర్ధమైన నాయకుడను, నాలాగా ఇంత తక్కువ సమయంలో ఇలాంటి పని చేయలేరు, నేను చేయగలిగాను... ఇలా రోజూ మీరు మాట్లాడే మాటలలో మీకు తెలియకుండగానే కొన్ని వందలసార్లు ఇలాంటి మాటాలు దొర్లుతూనే వుంటాయి. ఒక కప్ప, రూపాయి నాణెం దొరకగానే, తన కలుగు మీద నుంచి పోతున్న ఏనుగును చూచి, "ఏయ్! ఎంత ధైర్యం నీకు, నా కలుగు వైపుకు రావటానికి?" అని ఏనుగును తన్నటానికి ముందటి కాలును ఎత్తిందట. మీరందరూ కూడా ఈ వ్యావహారిక జగత్తులో మీరు సృష్టించుకున్న కృత్రిమ వస్తువులతో మమేకమై, భగవంతుడనే ఏనుగునే తిరస్కరిస్తున్న కప్పలేమో, ఆలోచించుకోండి! నేను ఒక ప్రశ్న వేస్తాను. మిమ్మల్ని మీ తల్లిదండ్రులు ఏదో ఒక పేరుపెట్టి పిలుస్తారు. రకరకాలుగా పిలుస్తారు. నిజానికి విశాలాక్షి ఎవరూ లేరు. అది కేవలం వ్యావహారిక ప్రపంచంలో పనులు నిర్వహించుకోవటానికి పనికివచ్చే ఒక ఉపాధి మాత్రమే. ఈ సమాధానానికి ఆశ్చర్యపడి మీరు ఈ విశాలాక్షి అనే వ్యక్తి లేకపోతే, ఈ వ్రాత వ్రాస్తున్నదెవరు? అని అనవచ్చు. అయితే, ఇప్పుడు వున్న ఈ శరీరంలో ఏ అవయవమో విశాలాక్షి తెలపండి? ఈ ఎముకలా? లేక ఈ మాంసమా? లేదా ఈ రక్తమా? లేదా ఈ వెంట్రుకలా? చెప్పండి! అవేవీ విశాలాక్షి కాదు. పోనీ ఈ భాగాలన్నీ కలిస్తే విశాలాక్షా? కాదు గదా? మరి దేనిని విశాలాక్షి అంటారు? మీకు సమాధానం తెలియకపోవచ్చు. దీనికి ఒక ఉదాహరణ చెబుతాను. మీరు కారులో వచ్చారు. కారు అంటే ఏమిటి? ఈ చక్రం వుంది. దీనిని ఏమంటారు? కారు అంటారా? అనరు అని అంటారు. పోనీ ఈ స్టీరింగ్, దీనిని కారు అంటారా? అనరు. మరి ఇన్ని భాగాలు కలిసి కారు అంటారా? అంటే కాదు అంటారు. మరి కారు ఏది? మీకు శరీరం వుంది గానీ, మీరు శరీరం కాదు. అలాంటప్పుడు ఈ 'నేను' ఎక్కడి నుండి వచ్చింది? ఇది దేనికి సంబంధించింది అని విచారిస్తే, ఈ 'నేను' మిథ్య అని, అనాత్మ అని తేలుతుంది. మిథ్యను పట్టుకుని వ్రేలాడుతున్నారెందుకు? మిథ్యను వదిలివేయండి. మీకు సత్యం ద్యోతకమవుతుందని జ్ఞానబోధ చేస్తున్నాను. జీవితమస్థిరం. ఇవ్వాళ వుండి, రేపు పోయే దేహం. అయినా, మీకు ఎన్ని కోర్కెలు, ఎన్ని సంకల్పాలు, ఎన్ని ప్రణాళికలు. అన్నీ దేహం వున్నంత వరకే కదా. నిముషభంగుర ప్రాణులే కదా మీరంతా. అయితే, ఈ అహం నిర్మితదేహంతో మీరు ఏమి చేయాలి? అని మీకు సందేహం రావచ్చు. సఖ్యం, శ్రవణం, దాస్యం, వందనం, అర్చనం, సేవనం, ఆత్మనివేదనం, కీర్తనం, చింతనం అనే తొమ్మిది భక్తిమార్గాలు వున్నాయి. సర్వాత్ముడైన భగవంతుని నమ్మి, ఈ తొమ్మిది మార్గాల ద్వారా కాయా వాచా మనసా ఉపాసిస్తూ, ఉత్తమ మానవుడిగా వుండటానికి మించి, మానవజన్మకు వేరే*

*ప్రయోజనం లేదు. నేను, మీరు ఇది అజ్ఞానం. ఉన్నదంతా ఆయనే. ఈ శరీరం ఒక పరికరం. ఆ శరీరం ఒక పరికరం. ఇదొక రకం ఆటవస్తువు. క్రీడిస్తున్నది ఆయన. భగవానుడి చిద్విలాసమే జగత్తంతా. ఈ దేహాన్ని దేవాలయంతో పోల్చుకోండి. అందులో ఆత్మరూపంలో దేవుడు కొలువుతీరి వున్నాడు. అహంకారమే పూజారి. పూజారి నిరంతరం దేవుడ్ని కొలవాలి. కానీ, దానికి బదులుగా ఈ అహంకారరూపి పూజారి, నిరంతరం తన దృష్టి అంతా వచ్చే భక్తులపైన, వారు తెచ్చే, ఇచ్చే కానుకలపైన పెడితే ఎలా వుంటుంది? అక్కడ దేవుడిని సరిగ్గా ఉపాసించడం లేదని కదా! అలాగే, మీకున్న ఈ అహంకారి పూజారి హృదయరూప గర్భగుడిలో నెలకొన్న దైవాన్ని ఉపాసించకుండా, సదా ఇంద్రియాలనే భక్తులు, ఇంద్రియార్థాలనే వారు తెచ్చిన కానుకలపై నిరంతరం దృష్టి పెడుతున్నారు. ఆ కానుకల వలన వచ్చే క్షణమాత్ర సుఖంపై దృష్టి వుంచుతున్నారు. ఇది బాధ్యతారాహిత్యం కదూ? కాబట్టి, ఈ అహం అనే పూజారిని సక్రమమార్గంలో పెట్టండి. నేను అనే భూతాన్ని వదిలించుకోవటానికి ప్రయత్నించండి.*

***కోపమనే కోరలొద్దు, ద్వేషమనే కొమ్ములొద్దు,***
***స్వార్థమనే బుసలు వద్దు, హింస అనే క్రూరత్వం వద్దు,***
***అవినీతి అనే రాక్షసత్వం వద్దు, మతం అనే మధువు వద్దు, కులం అనే కుళ్ళు వద్దు.***
***కోర్కెలు తీరాలనుకోవడం తప్పుకాదు, అవి ఇతరులకు కష్టాలకు కారణం కాకూడదు.***
***ఆశలు పెంచుకోవటం ముప్పు కాదు, అవి ఎవరినీ మోసాలకు గురి చెయ్యకూడదు.***
***అధికారం అందుకోవటం నేర్పు కాదు, అది సేవా సహకారాలకు సాధనగా మారాలి.***
***అందంగా మాట్లాడటం కూర్పు కాదు, అది ఆదర్శపు చేతలకు దారితీసి చూపాలి.***
***జ్ఞానం సాధించటం గొప్ప కాదు, అది సమాజ మనుగడకు సోపానంగా నిలవాలి.***
***అపజయాలు ఎన్నైనా విజయం కోసం నిలవాలి***
***అశాంతిని దూరం చేసి, ఇరు హృదయాలలో శాంతిని నింపి***
***ఆంజనేయుని అభినందన సంజీవిని చెంతకు చేరి***
***సదా అప్రమత్తులై సుఖించండి***
***నా చిన్నారి ముద్దుబిడ్డలారా!***

ॐ

**13-08-2019** 09:00 AM

**200)** ‌బ్రహ్మచర్యం యొక్క విశిష్ఠత ఎట్టిది స్వామీ? దానిని ఏ విధంగా ఆచరించాలి స్వామీ?

*మీరు ముఖ్యంగా గమనించవలసిన విషయము చెబుతున్నాను. తెలియకుండా చేసే మంచిపనిని తెలుసుకుని, మిక్కిలి శ్రద్ధతో ఆచరించడం, అజ్ఞానంతో తెలియక చేసే చెడ్డపనిని తెలుసుకుని దానికి దూరంగా ఉండటం. ఇది ఒక ఆధ్యాత్మిక లక్షణం. వ్యక్తికి చేసే షోడశసంస్కారాలలో ఉపనయన సంస్కారము ఈ విషయాన్ని ప్రస్ఫుటంగా తెలియచేస్తుంది. బ్రహ్మచర్యమనే పదానికి శబ్దార్థం మనస్సు*

బ్రహ్మము, లేదా భగవంతుని యందు చరించడం. అంటే, బ్రహ్మానుభూతికి, భగవంతుడ్ని ప్రత్యక్షం చేసుకోవడానికి దారితీసే జీవనవిధానమని అర్థం. అయితే, ఇందుకు మనసుకు ఒక ఆలంబన కావాలి. అదే, భగవంతుని నామం. ఇష్టదైవం పేరుతోకూడిన మంత్రం. ఉపనయనం, ఉపదేశం, మంత్రదీక్ష మొదలైన తంతులతో ఇవ్వబడేది ఇదే. కానీ, మొక్కుబడిగా చేసే ఏ సంస్కార విధి కూడా మనిషిని ఉన్నతంగా లేవనెత్తదు. బ్రహ్మచర్య పాలనకు ఆధ్యాత్మిక జీవనం గడుపుతున్న గురువు నుండి మంత్రదీక్ష స్వీకరించడం ఉత్తమం. ఇదే మిక్కిలి ప్రభావవంతమైన సంస్కారం. అత్యున్నత ఫలితాలను సాధించాలంటే, అనుష్టించవలసిన అత్యంత శ్రేష్ఠమైన తపస్సు ఏమిటి? అనే ప్రశ్నకు బ్రహ్మచర్యపాలన అని ఆలోచించకుండా చెప్పవచ్చు. వాస్తవానికి బ్రహ్మచర్యపాలన సుదీర్ఘమైన జీవితం. తేజస్సు, శారీరక-మానసిక బలాలు, ఆరోగ్యం, మేథాశక్తి, ప్రతిభాపాటవాలను అందిస్తుంది. బ్రహ్మచర్యపాలన చేత సాధకుడి జీవనరీతి, ఆలోచనా దృక్పథం సమూలంగా మారిపోతాయి. పరిపూర్ణంగా తనను తాను స్వాధీనంలో ఉంచుకున్న మానవుడు దైవసమానుడే కానీ, సాధారణ వ్యక్తి కాదు. అందువల్లే బ్రహ్మచర్యం అత్యుత్తమమైన తపస్సు, ఆచరణకు అతి కష్టంగా తోచే అనుష్టానమే గొప్పదని చాలామంది అభిప్రాయము. కానీ, గమ్యమేమిటో తెలియనివారు, గంపెడు కోర్కెలతో తపమాచరించేవారు, ఈ కోవకు చెందుతారు. కానీ, గమ్యము, గమనమూ రెండూ భగవంతుడే అని బ్రహ్మచర్య ఆదర్శం తెలుపుతుంది.

బ్రహ్మచర్యమే పరమజ్ఞానం. బ్రహ్మచర్యమే పరమశక్తి. భగవంతుడి ప్రతిరూపమే బ్రహ్మచర్యం. భగవంతుడే బ్రహ్మచర్యంలో ఉన్నాడని తెలియచేస్తుంది. అందుకే బ్రహ్మచర్యపాలన ఉత్తమ తపస్సు అని చెబుతున్నాను. ప్రారంభంలో మిమ్ములను ఆకర్షణకు లోను చేసే వస్తువులు, విషయాలు, వ్యక్తుల పట్ల అయిష్టాన్ని, వ్యతిరేకతను పెంపొందించుకోవటం, కాస్త అసహజంగా అనిపించవచ్చు. అయితే, అది చిట్టచివరి పరిష్కారం కాదు. అది మీ భావాలకు, కోరికలకు భవిష్యత్తులో ఉన్నత దిశలను చూపేందుకు ఎక్కవలసిన మొట్టమొదటి మెట్టుగా పనిచేస్తుంది. నేను మీకు, "స్త్రీలతో ఎప్పుడూ పొత్తు పెట్టుకోవద్దు, ఎల్లప్పుడూ జాగ్రత్తగా వుండండి. మీ శీలంలో ఎటువంటి మచ్చా లేకుండా చూసుకోండి. స్త్రీల వైపు కన్నెత్తి చూడకండి ఆమె బంగారంతో చేయబడినదైనా సరే" అని సలహా ఇచ్చాను. నేను ఇచ్చిన ఆదేశాన్ని మీరు పాటించారు. మంచి మార్కులతో పరీక్షలు పాసయ్యి, ఆ ప్రతిభతో పదిమంది మెప్పునూ పొందగలిగారు. ఆధ్యాత్మికంగా ఎదిగి, సత్యసాయి బిడ్డలుగా మంచిపేరు సాధించుకుని, ఆంజనేయుని బోధతో బ్రహ్మజ్ఞానులుగా భాసిల్లుతారు. మీరు ఎదుర్కొంటున్న సమస్యలకు మూలకారణం కామసంబంధమైన ఆలోచనల ప్రభావమే, బ్రహ్మచర్యాన్ని అనుసరించటంపై సరియైన అవగాహన లేకపోవటమే. స్వామీ! మనిషి కామాన్ని ఎలా పూర్తిగా వదిలించుకోగలడు? అని మీరడిగినట్లయితే, అది పోవాలని ఎందుకు అనుకోవడం? దాని దిశను మార్చుకోండి. కామం అంటే ఏమిటి? కోరికే గదా. కాబట్టి, భగవంతుడ్ని పొందాలని కోరుకోండి. ఈ కోరికను గొప్పగా పెంపొందించుకోండి.

ఇంతటి సులభమైన, సహజమైన, ప్రభావకరమైన బోధలు మీకు ఎంతో ఉపయుక్తాలు అని చెబుతాను. తూర్పు వెళ్ళే కొద్దీ పడమరకు దూరమవుతారు. భగవంతునపై ప్రేమ పెరిగే కొద్దీ, కామక్రోధాలు, అసూయ అహంకారాలు సహజంగానే దూరమవుతాయి. మీ సాధనకు అడ్డుపడే ఆలోచనలను

అరికట్టాలంటే, వాటికి వ్యతిరేకమైన ఆలోచనలను మనస్సులోకి రానివ్వాలి. నిరంతరం మంచి ఆలోచనలను చేయటం ద్వారా, మీ మనస్సులోని ఆలోచనల నిర్మాణాన్నే పూర్తిగా మార్చివేయవచ్చు. అంతేగాని, ఏవో ఆలోచనలు తొలగిపోవాలని వ్యతిరేకించడం ద్వారా అవే ఆలోచనలను మీరు మరల మరలా తలపోస్తున్నారని మరచిపోకూడదు. మీరు హృదయపూర్వకంగా, ప్రయత్నపూర్వకంగా సద్భావాలు పెంపొందించుకునేందుకు కృషిచేయడం చాలా ముఖ్యం. అదే సమయంలో భగవన్నామ జపాన్ని, ధ్యానాన్ని, ప్రార్ధనలను చెయ్యాలి. మనస్సును ఉన్నతస్థితికి లేవనెత్తే ఈ ఆంజనేయుని బోధలు మరల మరలా చదవాలి. మనస్సు పరిపరి విధాలుగా పోతూవున్నా, అలజడికి లోనైనా, ఏదో ఒక విధంగా సానుకూల ఆలోచనలతో కూడిన బలమైన వ్యతిరేక ప్రవాహాన్ని పారించాలి. బ్రహ్మచర్యపాలన అంటే, ఏదో మడికట్టుకుని కూర్చోవడమని, చురుకైన జీవితాలు గడపలేమని పొరబడవద్దు. స్త్రీలపట్ల వ్యతిరేకభావాలను చూపడం అనుకుంటున్నారా? మీరు ఒక మూర్ఖుడిలా ఆలోచిస్తున్నారు, మాట్లాడుతున్నారు. స్త్రీలను అగౌరవంగా చూడవద్దు. అలాగే స్త్రీలు, పురుషుల విషయంలో అగౌరవంగా మాట్లాడవద్దు. వారందరూ జగన్మాత స్వరూపులే, జగన్నాథుడి స్వరూపాలే. గౌరవంతో ఒకరికి ఒకరు నమస్కరించుకోండి. ఆధ్యాత్మిక జీవనంలో తప్పనిసరిగా చేయవలసిన సాధన బ్రహ్మచర్యపాలన. ఇందుకు సంబంధించిన జ్ఞానాన్ని, ఆ ప్రయత్నంలో తలెత్తే సందేహాలను, సమస్యలను ఎదుర్కొనే విధానాలను నేను ఇచ్చే సందేశాలలో వివరించాను. మీరు శరణుజొచ్చినట్లయితే, జీవితాలు సార్ధకం చేసుకున్న వారవుతారు, ఆంజనేయుని ఆశీస్సులను అందుకుంటారు.

***అనంతమైన శూన్యం మనసునావరించి అచేతనమైనప్పుడు***
***ఓ చిన్న ప్రోత్సాహం, ప్రశంస ఆవరించిన దిగులును అంతం చేసి***
***మనిషిని నిటారుగా నిల్పోబెడుతుంది.***
***శ్రమకోర్చి చేసే చిన్నపనైనా, ఓ ప్రశంస గుప్పెడు గుండెను తడితే, కష్టమంతా ఇట్టే మరచిపోతారు.***
***చిన్న అభినందన జల్లులతో, టన్నుల భారం దిగినట్లు, మనసు దూదిపింజ అవుతుంది.***
***చితికిన మనసుల వెతలను బాపే ప్రశంస,***
***పెదవులపై నాట్యమాడే లాస్యం ఎంతమాత్రమూ కాకూడదు.***
***పరివర్తన చెందిన మీ అంతరంగం నుండి వచ్చే అభినందన***
***అది అంత మామూలు విషయమేమీ కాదు, కార్యోన్ముఖులను చేస్తుంది***
***అపజయాలెన్నైనా విజయం కోసం,***
***అశాంతిని దూరం చేసి, ఆనందసాగరంలో విహరింపచేస్తుంది.***
***అందరినీ ఒకటిగా నిలిపే అమూల్యమైన అభినందన, ఎడారి కళ్ళలో వానచినుకైనట్లు,***
***ఆంజనేయుని భావాలు పన్నీటి పరిమళాలు వెదజల్లితే***
***ఈ పవనకుమారుడు పరవశించి, అందరిలోనూ నిత్య వసంతాన్ని నింపి***
***నిండుకుండవలే మిమ్ములను మలచి, మారుతున్న మిమ్మల్ని అక్కున చేర్చుకొనును ఈ మారుతి అని***
***నా చిన్నారి బిడ్డలకు ముద్దుగా, మురిపెంగా అందిస్తున్న అమూల్యమైన వజ్రఖనిని***
***అందుకోండి నా చిన్నారి ముద్దుబిడ్డలారా!***

ఓం

**14-08-2019** 08:50 AM

**201) నేను ఎవరు అన్నది ఏ విధంగా తెలుసుకొనవచ్చును స్వామీ? అట్టి స్థితిలో నిలకడగా ఎలా ఉండవచ్చు స్వామీ?**

*నా చిన్నారి బిడ్డలారా! ఈ సృష్టిలో ఏదీ శూన్యం నుండి పుట్టదు. మట్టి నుండి కుండ తయారవ్వాలంటే, అలా తయారయ్యే స్వభావం స్వతహాగా మట్టికి వుండితీరాలి. అలాగే కొమ్మల రాపిడితో అగ్ని పుట్టిందంటే అంతర్లీనంగా ఆ కొమ్మలలో అగ్ని వున్నట్లే కదా. అయితే కొమ్మ-అగ్ని ఒకటి కానట్లే, నీవు-నీ దేహం కూడా ఒకటి కాదు. నేను అనేది స్వతంత్రంగా ఆలోచించగల చైతన్యపదార్థం. దేహానికి చైతన్యం లేకపోతే శవం. అంటే అది జడం. శవంలో ఇంద్రియాలన్నీ ఉన్నా అవి జడంగా వుంటాయి. అసలైన ఇంద్రియం మాత్రం మనసు. అది శవానికి లేదు. కాబట్టి జడత్వం కల్గింది. మీలో మనసు చైతన్యవంతంగా వున్నా, ఒక్కొక్కసారి మీలో నుండి అది ఎటో వెళ్ళిపోతుంది. అపుడు మీరు స్థబ్దంగా వుండిపోతారు. దానినే 'పరధ్యానం' అంటారు. తిరిగి మనసు మీలోనికి రాగానే వాస్తవం లోనికి వస్తారు. ఈ రెండూ మీ గమనికలోనే వుంటాయి. వాస్తవానికి మనసుకు చైతన్యం కలిగించేది ప్రాణం. కానీ, అది కూడా స్వతంత్రము కాదు. అది శుద్ధచైతన్యంలో ఒక భాగం. సూక్ష్మశరీరమనేది శుద్ధచైతన్యం నుండి ఏర్పడుతుంది. అది ఒక దేహం నుండి మరొక దేహానికి మారుతూ వుంటుంది. కాబట్టి, మీ దేహంలో వున్న సూక్ష్మశరీరం స్థిరంగా వుండదు. పాపపుణ్యాలను బట్టి, స్థూలదేహాలలోకి ప్రవేశిస్తూ, నిష్క్రమిస్తూ వుంటుంది. దీని వలన మీకు శాశ్వతానందం లభించదు. అటువంటి శాశ్వతానందం లభించాలంటే, మీరు ఆత్మతత్త్వాన్ని గురించి తెలుసుకోవాలి. అదే శుద్ధచైతన్యం. ఆత్మజ్ఞానమే జ్ఞానామృతం. ఆత్మజ్ఞానంలోని మూలసూత్రాన్ని పట్టుకోవాలంటే, వేదశాసనాన్ని అర్థం చేసుకోవాలి. అంటే, కనిపించే భౌతిక ప్రపంచం అంతా ఆ శుద్ధచైతన్యంలో నుండి ఆవిర్భవించి, అందులోనే వుండి, అందులోనే లయిస్తుంది. అటువంటి శుద్ధచైతన్యమే నీవు. అంటే, నీవు శుద్ధమైన ఆత్మరూపం. దానిని గుర్తించి దేహభ్రాంతిలో నుండి బయటపడాలి. మానవుడు తన సంకల్పం వల్లనే బద్ధుడౌతున్నాడు. సంకల్పాలు లేకపోతే, ముక్తుడవుతాడు. అట్టి స్థితిలో రాగద్వేషాలుండవు. అతి సులభంగా బ్రహ్మసమాధి కలుగుతుంది. ఇదే పరమరహస్యమైన ముముక్షుమంత్రం. పరమాత్మ స్థిరంగా ఈ స్థితిలోనే వుంటాడు. కాబట్టి, ఎవరు ఆ స్థితిని పొందుతారో, వారికి సులభంగా పరమాత్మలో లయం చెందే సదవకాశం లభిస్తుంది. అదే మోక్షమవుతుంది. భోగవాసనలు బంధాన్ని కల్గిస్తాయి. అవి తగ్గిన కొద్దీ మనిషి మోక్షానికి చేరువౌతాడు. అయితే, రెండు రకాల తత్త్వజ్ఞానాన్ని గురించి మీకు తెలియాలి. 1) అపాతజ్ఞానం – అంటే ఆత్మతత్త్వాన్ని గురించిన సాధారణ అవగాహన. ఇది వున్నవారు చక్కగా జ్ఞానబోధ చేస్తారు కానీ, వాసనాబంధం తెగదు. అందువలన ఏమాత్రం వైరాగ్యం కలగదు. 2) యదార్థజ్ఞానం – అంటే వైరాగ్యపూర్వకంగా ఆత్మజ్ఞానం కలిగితేనే అది యదార్థజ్ఞానమవుతుంది. అయితే, దానిని ఎలా నిర్ణయించగలరు? అందుకు నాలుగు పరీక్షలున్నాయి.*

*1) ఎంత బలవంతపెట్టినా భోగాల మీద ఆసక్తి కలగకపోవటం*

*2) వస్తువులు, పుణ్యాల వల్ల ఆసక్తి, లాభాపేక్ష ఉండకపోవటం*

*3) తనను గురించి ఇతరులు మహాత్ముడని, విరక్తుడని గొప్పగా అనుకోవాలని కోరిక లేకపోవడం.*

*4) ఏ రూపంలోనూ కీర్తికాంక్ష, గుర్తింపు కాంక్ష వుండకపోవటం.*

*ఎవరైతే ఈ పరీక్షలలో నెగ్గుతారో, వారికే యదార్ధజ్ఞానముంటుంది. లేకపోతే, అది లేనట్లే. ఇది మనస్సులోనుండి మోక్షం మీద కోరికతో, ఈ నాలుగింటినీ సాధన చేస్తే, ఉపయోగముండదు. అవి సహజలక్షణాలుగా వుండాలి. పులివేషంతో ఎవరూ పులిగా మారిపోలేరు కదా. ఇది కూడా అంతే. ప్రలోభాలన్నీ అనేక ఆశాభంగాలతో పటాపంచలైనప్పుడు సహజవైరాగ్యానికి అవకాశం కలుగుతుంది. దీనినే 'అభావే విరక్తి' అంటారు. ఎంత ప్రయత్నించినా దొరకని దానిని గురించి వైరాగ్యం ఎందుకు కలగదు? కాబట్టి, ఆశాభంగాలు కల్గినంత మాత్రాన కృంగిపోకూడదు. చేదు అనుభవాలన్నీ ఆత్మబలానికి ఔషధాలుగా పనిచేస్తాయి. ప్రాపంచిక వైఫల్యాలను వైరాగ్యానికి మెట్లుగా మలచుకోవాలి. అపుడు ఆశాభంగాలు కూడా ఆహ్లాదమనిపిస్తాయి.*

***పుట్టుక తెలియదు మరణం తెలియదు ఎప్పుడేమవుతుందో అసలే తెలియదు***
***బాల్యం, యవ్వనం, కౌమార్యం, వృద్ధాప్యం***
***అనే నాలుగు అంకాల నాటకం***
***రేపు - నేడు - నిన్నల మధ్య జరిగే జీవనపోరాటం***
***భవిష్యత్తు ఆశ, వర్తమానం కోరిక, గతం తపనలతో కాలచక్రమాగుతుందా?***
***నీవు లేక నిముషమైన సాగదు ఈ లోకమంటావా?***
***నీవు లేక కాదు, నీలో గుర్తింపు లేక!***
***ఆలోచనలు వక్రమార్గాన వెడితే, పండంటి జీవితాన్ని నేలపాలు చేసుకుంటూ***
***సమస్యల వలయాన్ని సృష్టించుకుని బాధపడక,***
***దానిని ఛేదించి మీ బ్రతుకులను పండించుకొనుటకు***
***పవనకుమారుని పవిత్రభావాలు పరిపరి విధాల మార్చునొసంగు***
***నా చిన్నారి ముద్దుబిడ్డలారా!***

ॐ

**31-08-2019** 11:50 AM

**202) ఏకాంతముగా ఉంటూ సాధన చేయుట ఎట్టిది స్వామీ? మేము ఏమి ఆచరించుటచే విజయవంతులము కాగలము స్వామీ?**

*ఒంటరిగా భుజించుట, నిద్రించుట, వనములలో నివసించుట మొదలైన చర్యలేవియు మీకు ఆత్మ స్వాతంత్ర్యమునీయలేదు అన్న విషయము యదార్ధమని చెబుతాను. అడవులలో ఏకాంతవాసము చేయువారు, అచటి పశుపక్ష్యాదులతో స్నేహము చేయుట మీరు గమనించేవుంటారు. మీకు ఒంటరిగా*

*ఏకాకియై యుండునంత మాత్రమున మీ అంతరంగములోనికి పోయి, ధ్యానముచేయుచూ, పరమసత్యముతో అనుసంధానము కల్గియుండు శక్తిని పొందలేరు. మీరు అక్కడ చేయుటకు వేరే పనిలేక, భగవధ్యానము చేయుట తేలికయని భావించవచ్చును. కానీ, నేనా విషయమును నమ్మను. మానవుడు సర్వదా ఏదో పని కల్పించుకుని చేయుచునేయుండవలెను. సాధకుడు, తన స్వభావమును పెక్కు ఇక్కట్ల మధ్య, తన వశములోకి తెచ్చుకుని, తన అంతరంగములో అనంతుని సన్నిధిలో తన అంతరాత్మతో ఏకాంతంగా వుంటూ, భగవంతుడు ప్రసాదించిన పరిసరములను, పరిస్థితులను నిలబెట్టుకొనుచు, సాక్షాత్కారమును సాధించగలిగినచో, అదియే పరమసత్యము. అతి గంభీరము, మిక్కిలి స్థిరము, శాశ్వతమైనది అని అనుభవపూర్వకముగా గ్రహించాలి. కష్టములను జయించుటకు, వాటి బారి నుండి పారిపోవుట ఒక పరిష్కారపద్ధతి కాదు. ఆధ్యాత్మిక జీవితము అనుసరించాలి అని అనుకునేవారిలో ఈ పలాయన పద్ధతి మిక్కిలి ఆసక్తిదాయకముగా కన్పించును. "ఒక చెట్టు క్రింద కూర్చుని ఒంటరిగా కార్యాచరణకు గానీ, మాటలాడుటకు గానీ, ఎట్టి వ్యామోహము లేకుండుట, ధ్యానములో గడుపుట గానీ ఎంత బాగుండునో!" అని భావించునట్టి ప్రవృత్తి వారిలో నాటుకుని యుండును. ఈ దృష్టిగల ఒక యోచనాధార ఒకటి, వారిలో స్థిరడియుండును. అది వట్టి మిథ్య. ప్రశస్తమైన ధ్యానము హఠాత్తుగా వచ్చును. ఎలా? అని అడిగినట్లైతే, అది మీపై దాడి చేసి మిమ్మల్ని వశపరచుకొనుటకై అవసరమైన ఒక పరిస్థితిగా భావించబడుతుంది. అపుడు మీరు ఏకాగ్రతతో ధ్యానము చేయుట, దృశ్యమానమగు వస్తువులకు ఆవలనున్న దానికై దృష్టిని సారించుట తప్ప, వేరు గతి లేదని భావిస్తారు. ఇట్టి దాడి మీరు అరణ్యములో ముక్కుమూసుకుని వున్నప్పుడే రావలెనని నియమము లేదు. మీలో ఒక పరిస్థితి సిద్ధమై, దానికి అవసరమైన సమయము వచ్చినంతనే అంటే, దైవానుగ్రహం మీపై ప్రసరించినంతనే అది సంభవించును. వాస్తవమైన విజయం మానవజాతిలోనే స్థాపించబడగలదు. మీరు ఏ పరిస్థితులలో బంధించబడిననూ, శాశ్వితుడగు అనంతునితో ఏకాంతములో జీవించగలుగుట నేర్చుకోవాలి. మీ సర్వవ్యాపారముల ఒత్తిడుల మధ్య, మీ ప్రియమిత్రుడైన పరమాత్మునితో స్వేచ్ఛగా జీవించగలిగి వుండాలి. అదియే నిజమైన విజయం.*

## 203) ఖాళీ సమయములలో మేము ఏమి చేయవలెను స్వామీ?

*జీవితంలో తరచు, శూన్య క్షణములు అంటే, పనిలేని సమయములు కొన్ని నిమిషములు గానీ, దీర్ఘకాలము గానీ వుండుట సహజమే కదా. అపుడు మీరేమి చేయుదురు? మీ మనసును మళ్ళించుటకు వెంటనే ఏదో చేయుదురు. కాలక్షేపానికి ఏదో ఒక తెలివితక్కువ పని ప్రారంభింతురు. ఇది ప్రతివారునూ సర్వసాధారణముగా చేయునదే. పిన్నలు గాని, పెద్దలు గాని సర్వదా తమకు విసుగు తెప్పించని పనులు చేయుటకు పూనుకొందురు. వారు అతి జాగ్రత్తగా ముద్దుగా పెంచుకొను భావము, జీవితములో విసుగు కొట్టకుండునట్లు చేసికొనుటయే గానీ, అందుకై వారు అనాలోచితముగా, తెలివితక్కువ పనులు చేయుట ప్రారంభింతురు. కానీ, దానికంటే, చక్కని మార్గము మరియొకటి కలదు. అది స్మృతి అంటే జ్ఞాపకము చేసికొనుట. మీకు కొంచెము విరామ సమయము చిక్కినపుడు అది ఒక గంటో, లేక కొద్ది నిముషములు మాత్రమే కావచ్చు, మీరీ విధంగా భావించండి. చివరకు ఏకాగ్రతకు అంటే భావ కేంద్రీకరణకు మిమ్మల్ని మీరు సమీకరించుకొనుటకు మీ జీవితధ్యేయమును జ్ఞాపకము చేసికొని భావించి బలపరచుకొనుటకు,*

శాశ్వితుడైన పరమాత్మకు, మీ సర్వస్వము సమర్పించుకొనుటకు అవకాశము చిక్కినదని, మీకు విశ్రాంతి సమయము దొరికిన ప్రతి సమయము నందు ఈ విధముగా భావన చేయుటకు శ్రద్ధ వహింతురో, బాహ్యాపరిస్థితులు మిమ్ములను బాధించలేవు. అంతేకాదు, మీరు చురుకుగా అభివృద్ధి గావించుచున్నట్లు, మార్గమధ్యములో వృథా ప్రసంగములతో కాలక్షేపము చేయుటలేదనియు, నిష్ప్రయోజనమైన పనులు చేయుటలేదనియు, మీ మానసిక అంతస్థును కించపరిచేటట్లుగా లేదనియు గ్రహించగలరు.

***భగవంతుడు ఒక చిరునవ్వు నవ్వెనా,***
***అష్టకష్టాలెల్లా అంతరించు నా చిన్నారి బిడ్డలారా!***
***కరుణాస్వభావుడు కన్నెత్తి చూచెనా,***
***వ్యాధిబాధలు వేగమే పరుగులెత్తు నా చిన్నారి బిడ్డలారా!***
***ఆంజనేయుడు సుంత పన్నెత్తి పల్కిన***
***సుకృతమ్ము అరుదెంచి సుఖములనిచ్చు నా చిన్నారి ముద్దుబిడ్డలారా!***
***ఆప్తబాంధవుడు ఈ ఆంజనేయుడు శుభాశీస్సులిచ్చెనా,***
***పెరటిలోపల కల్పతరువు మొలచినట్లే నా చిన్నారి ముద్దుబిడ్డలారా!***
***ఇన్ని ఆశీస్సులనందించిన ఈ ముద్దుబిడ్డలు***
***ముద్దుగా సాధనాపరులై సాధించదలచిన దానిపై దృష్టి నిలిపి***
***అతి త్వరలో చిరంజీవిని చేరి చిన్మయులై సుఖించండి***
***నా చిన్నారి ముద్దుబిడ్డలారా!***

ఓం

**03-09-2019** 11:25 AM

**204) అంతరాత్మను ఏ విధంగా తెలుసుకొనగలము స్వామీ?**

అంతరాత్మను తెలుసుకోవటానికి ఒకేఒక మార్గముంది. అది అంతరాత్మ విషయంలో నిరంతరం జిజ్ఞాస కలిగివుండటం. ఈ విషయంలో ఎంత శ్రద్ధ కలిగి వుంటారో, అంతగా దాని లోతులను తెలుసుకుంటారు. మీరు ఆత్మ విషయంలో నిరంతరం జిజ్ఞాస కలిగి వుండండి. ధ్యానం ద్వారా మీ ఆత్మను పరిచయం చేసుకుంటే, దాని మాటలు వినగలిగితే, అది చేసే మార్గనిర్దేశాన్ని అనుసరిస్తే, మీరు అజ్ఞానం నుంచి విముక్తులవుతారు. సామాన్యముగా, బాహ్యములను మాత్రమే చూస్తూ, వింటూ, అర్థము చేసుకుంటూ వుండే మనిషి, జ్ఞాని కాజాలడు. కానీ, అతడు నిజమైన జ్ఞాని అని భావించడం జరుగుతుంది. అందుకు కారణం భ్రమ. నిజమైన జ్ఞానం కానిదానిని జ్ఞానమని తలుస్తూ, దానిననుసరించి కార్యాలను ఆచరిస్తూపోవటం వల్లనే మనిషి తన అసలు లక్ష్యమైన సుఖశాంతులవైపు కాక, వాటికి వ్యతిరేకమైన వాటివైపు నడుస్తాడు. నిజమైన జ్ఞాన అనుభవం కలిగినది మనిషి అంతరాత్మకి. అది శుద్ధము, బుద్ధమునైన స్వయం చేతన. కనుక, దానికి అజ్ఞానమన్న చీకటి అంటుకోదు. అది పరమాత్మ యొక్క అంశ కనుక

పరమాత్మ వలెనే సదానందమయము. పరమాత్మ సన్నిధిలో అసత్యముండటం అసంభవం. అదే విధముగా పరమాత్మ అంశయైన ఆత్మలో అసత్యం ప్రవేశించడమన్నది కుదరదు. మనిషి అంతరాత్మ దేనిని చూస్తుందో, దేనిని వింటుందో, అర్థం చేసుకుంటుందో అదే సత్యం, అదే నిజమైన జ్ఞానం. అంతరాత్మ చెప్పుచేతలకు బద్ధుడైనవాడే సత్యాన్ని చూడగలుగుతాడు. నిజమైన జ్ఞానాన్ని పొందగలుగుతాడు. అటువంటి మనిషికి సుఖదుఃఖాలు వంటి ద్వంద్వాలు సహజంగా సమసిపోయి, సమస్థితి కలుగుతుంది. వెలుతురున్న చోట చీకటి, జ్ఞానమున్న చోట దుఃఖం ఉండవు. వెలుతురు లేని చీకటి, జ్ఞానరాహిత్యమే దుఃఖం. దుఃఖానికి తనదంటూ ఒక మూలభూతమైన ఉనికి లేదు. అంతరాత్మ మాటను వినటం పాటించడమే అనుశాసనం.

**205) అంతరాత్మ యొక్క సూచనలను ఏ విధంగా వినగలము స్వామీ?**

మనిషి అంతరాత్మ మాట్లాడుతుంది. కానీ, దాని మాట మీ మాటలవలే స్థూలంగా వుండదు. శబ్దంతో కూడివుండదు. అది సూక్ష్మాతిసూక్ష్మంగా వుంటుంది. బాహ్యములు, స్థూలములు అయిన చెవులతో దానిని వినటం కుదరదు. మనిషి అంతరాత్మ మాట్లాడుతుంది. కానీ, మౌనమైన ఆలోచనల స్ఫురణకు చెందిన భాషలో మాట్లాడుతుంది. కోలాహలంతో నిండిన తన మానసిక స్థితిలో మనిషి దాన్ని వినలేడు. అంతరాత్మ వాణిని వినాలంటే, మనిషిలోని మానసిక కోలాహలం ఆగిపోవాలి. అంతరాత్మ సాన్నిధ్యం మనిషిని దాని మాటలు వినగలిగేటట్లు చేస్తుంది. నిజానికి మనుష్యులలో అంతరాత్మ సర్వకాలాల్లోనూ ఉండనే వుంటుంది. కానీ, ఆ విషయాన్ని తెలుసుకోవటానికి మనిషికి దానితో సన్నిహిత పరిచయం ఏర్పడాలి. దానికి సంబంధించిన జ్ఞానం కలగాలి. నిజానికి మనిషి తన అంతరాత్మ వాణిని మనసు చేసే కోలాహలంలో వినలేకపోతాడు. మనసు స్వభావం గంతులు, అరుపులతో నిండి వుంటుంది. మనిషి అంతరాత్మ శాంతంగా, నిశ్చలంగా వుంటుంది. అది మనసువలే కోలాహలం చేయదు, ఎగుర్లాటలు చేయదు. ఈ చపలత్వం వల్లనే మనిషి మనసు అతని అంతరాత్మను వెనుకకు తొక్కి మనిషికి పనికిరాని ప్రేరణలిస్తూ వుంటుంది. తీవ్రస్వరంతోనూ, తీవ్ర ఆవేశాలతోనూ, తీవ్ర ఆదేశాలతోనూ మనసు మనిషిని తనకు లోబర్చుకుని తనకు దాసుడిని చేసుకుంటుంది. కానీ శుద్ధము, బుద్ధము, శాంతము అయిన ఆత్మ మాత్రం, మనిషిని ఆ విధంగా తయారుచేయదు. మనసు చేసే కోలాహలానికి చెవులు మూసుకునే గుణముండాలి. అంతరాత్మ జిజ్ఞాసువునకు ఆ పద్ధతిని అభ్యాసం చేయాలి. అంతరాత్మ ఆదేశాలను విని పాటించడం ప్రారంభించిన రోజు నుండి మనిషి నిజమైన సుఖాన్ని శాంతిని పొందటానికి అర్హుడవుతాడు, అధికారి అవుతాడు. తీవ్రమైన జిజ్ఞాసగల మనిషి చెవి, తన ఆ తన్మయత్వాన్ని అతి తేలికగా పొందగలుగుతుంది. అంతరాత్మ ఆదేశాన్ని తేలికగా వినటానికి సహాయపడుతుంది.

***కాలం కాలసర్పమై బుసకొట్టినా, పరిస్థితులు పగబట్టి చెరబట్ట చూచినా,***
***అయినవాళ్ళే ఏమీ కానట్టు ముఖం చాటుచేసినా,***
***నిమ్మకు నీరె త్తినట్లే వుండాలి.***
***ప్రతికూల పవనాలు ప్రచండవేగంతో వీస్తుంటే, చిరుమొక్కలా తల వంచాలి.***
***మహిషి తత్త్వం ఎల్లెడలా విజృంభించినా***
***మనిషి, మనిషితత్త్వాన్ని ఎన్నడూ వదులుకోరాదు.***

***మనిషి మనిషిలాగే ఉండాలి, మనిషిలాగే బ్రతకాలి, మనిషి తత్త్వాన్ని మహిలో చాటాలి.***
***మారుతి మాటలు మనసున దాచుకొని, అడుగడుగునా అంతరాత్మ ప్రబోధాలను వింటూ***
***ఆంజనేయుని ఆనతులను పాటిస్తూ, మానస సరోవరాన్ని సంకల్పాల రహితం చేసి,***
***చేరువలోనే యున్న ఆత్మ సామ్రాజ్యాధినేతలు కండి***
***నా చిన్నారి ముద్దుబిడ్డలారా!***

*ఇంట్లో నుండి బయటకు వెళ్ళేటప్పుడు, మెదడును తీసుకువెళ్ళండి.*
*ఎందుకంటే, లోకం మీకు అడుగడుగునా పరీక్ష పెడుతుంది.*
*బయటనుండి ఇంటికి వచ్చేటప్పుడు హృదయాన్ని తీసుకురండి.*
*ఎందుకంటే, మీ కుటుంబం మీ ప్రేమ కోసం ఎదురుచూస్తుంది.*
*రూములోకి వచ్చేటప్పుడు మనసును వదిలి రండి.*
*ఎందుకంటే, ఆంజనేయుడు ఖాళీ మనసును కోరుకుంటాడు!*

ॐ

**08-09-2019** 06:50 PM

**206) కర్మఫలత్యాగం యొక్క విశిష్ఠత ఏమిటి స్వామీ?**

*కొందరికి మనసు కుదురుగా వుండదు. పూర్తిగా దైవకార్యాలలో మునిగిపోతే, బ్రతుకుతెరువు ఎట్లా? అని సందేహం. వాళ్ళు సొంతపనులు మానుకోలేరు. అయితే, కర్తృత్వాన్ని వదిలిపెట్టి ఎట్టి పనులు చేసినా సరిపోతుంది. అప్పుడవి భగవత్ కర్మలే అవుతాయి గదా అని తెలిసినా, అలా కర్తృత్వాన్ని వదిలి వుండలేరు. కర్తృత్వంతో కర్మలు చేయడం అలవాటు. ఎంత కాదనుకున్నా, "నేను కర్తను" అనే అహంకారం వదిలిపోదు. మరి అలాంటి వారి గతి ఏమిటి? అని మీరు అడిగేటట్లయితే, నేనొక ఉపాయం చెబుతాను. మీరు పనులు చేస్తున్నప్పుడు, ఏదో ఒక ఫలితం వచ్చి తీరుతుంది. ఆ ఫలితం మీదనే దృష్టిపెట్టి, వస్తుందా? రాదా? అనుకున్నంతగా వస్తుందా? తక్కువ వస్తుందా? అని ఆలోచిస్తూ వుంటే, చేసే పని మీద శ్రద్ధ వుండదు. అందువల్ల, నైపుణ్యంగా పనులు చేయలేరు. అలా కాకుండా, వచ్చే ఫలితాన్ని గురించి పట్టించుకోకుండా, దాని మీద ఏ ఆసక్తి లేకుండా, శ్రద్ధగా కర్తవ్యభావంతో, తన విధ్యుక్తధర్మంగా కర్మలు చేస్తుంటే, ఆ కర్మలు సక్రమంగా జరుగుతాయి. పనిలో నైపుణ్యం కూడా వుంటుంది. కనుక కర్మఫలాలను భగవంతునికి అర్పించాలి. అలా చేస్తే, లోపల పేరుకున్న రజోగుణం అణిగిపోతుంది. సర్వ కర్మఫలత్యాగం అంటారు గదా. అంటే, పాపకర్మల ఫలాన్ని కూడా అర్పించాలా? అని మీరు అడిగేటట్లయితే, చెడుకర్మలను, పాపకర్మలను వదిలివేయాలి అని ముందుగానే చెప్పాను. శాస్త్రవిహిత కర్మలనే చేయాలి. వాటి ఫలాన్ని వదిలివేయాలి. పాపకర్మలు అసలు చేయకూడదు. సర్వ కర్మఫలత్యాగం అనేది దాదాపుగా అందరికీ అనుకూలమైనదే. కొద్ది ప్రయత్నంతో, ఎవ్వరైనా అనుసరించవచ్చు. అందుకే గీతలో "యతాత్మవాన్" అన్నారు. ప్రయత్నించి సాధించుకోవాలి. కర్మలు చేయుటయందే నీకు అధికారం.*

ఫలితాన్ని ఎప్పుడూ కోరవద్దు. ఫలాలు కోరేవారు పసినిగొట్టులు. "కృపణా ఫలహేతవః" అని గీతసారము, భగవంతుని జీవితసారం కూడా ఇదే.

1. దేవకీ వసుదేవులకు జన్మించినా, తల్లిదండ్రుల వాత్సల్యాన్ని కోరలేదు.
2. నంద గోకులంలో వెన్న దొంగిలించినా తన కోసం కాదు, స్నేహితులకు, కోతులకు పెట్టేవాడు.
3. కంసుని చంపినా, రాజ్యాధికారం కోరలేదు. ఉగ్రసేనునికే కట్టబెట్టాడు.
4. జరాసంధుని చంపినా రాజ్యాన్ని అతని కుమారుడు సహదేవుడినే పట్టాభిషిక్తుడుగా చేశాడు.
5. శిశుపాలుని వధించినా, అతని కుమారుడు దృష్టకేతువుకే రాజ్యాన్ని అప్పగించాడు. నరకుని చంపి, అతని కుమారుడు భగదత్తుని రాజుగా చేశాడు.
6. దంతవక్త్రుని చంపి, అతని రాజ్యాన్ని అతని కుమారునే రాజ్యాభిషిక్తుడ్ని చేశాడు.
7. పౌండ్రక వాసుదేవుని చంపి, అతని కుమారుడినే రాజ్యాభిషిక్తుడ్ని చేశాడు.
8. దుర్మార్గుడైన దుర్యోధనుడు సాయం కోరితే, తన సైన్యం మొత్తాన్ని త్యాగం చేశాడు. నాకేం ఇస్తావు? అని అడగలేదు.
9. పాండవులకు ఎంత మేలు చేసినా, యుద్ధంలో ఎంత సాయం చేసినా, తానేమీ ఫలితాన్ని కోరలేదు. రాజ్యంలో వాటా కోరలేదు.
10. రథాన్ని తోలే పని అప్పగించినా, అప్పగించిన పనిని శ్రద్ధగా, సక్రమంగా నిర్వర్తించాడే గాని, ఏ ఫలితాన్ని ఆశించలేదు. ఇంత చిన్నపనియా? అని అనలేదు. ఆయన ఏ పనిచేసినా, ఆ పనిని సక్రమంగా నిర్వర్తించడమే గాని, కర్మఫలంపై ఏ మాత్రం ఆసక్తి లేదు, దేనినీ కోరలేదు. మరి మీరు మాత్రం ఏ ఫలితం లేకుండా ఎందుకు కర్మలు చేయాలి అని అంటారు? సూర్యుడు వెలుగునిచ్చి, మీ వద్ద నుండి ఏమి కోరుతున్నాడు? వాయుదేవుడు గాలినిచ్చి నీ ప్రాణాలను నిలబెడుతున్నాడు. దానికి ప్రతిగా ఏమి కోరుతున్నాడు? నదులనిచ్చి దప్పిక తీర్చి మీ నుండి ఏమి కోరుతున్నాడు. భూమి మీకు ఆధారంగా వుండి, పంటలనిచ్చి ఏమి కోరుతుంది? చెట్లు ఫలాలను, పుష్పాలను, నీడను ఇచ్చి ఏమి కోరుతున్నాయి? చంద్రుడు చల్లదనాన్ని ఇచ్చి ఏమి కోరుతున్నాడు? ఈ ఆంజనేయుడు మీ కొరకై సమస్త ఆధ్యాత్మికతను బోధిస్తూ, మీ నుండి ఏమి కోరుతున్నాడు? కర్మఫలాలను కోరుకున్నట్లయితే, బంధమే గాని, మోక్షం లేదు. కర్మఫలం కోరుకున్నందువలన, మళ్ళీమళ్ళీ జన్మలను తెచ్చిపెడ్తుంది. జన్మలు మళ్ళీమళ్ళీ కర్మలకు, కర్మఫలాలకు కారణమవుతాయి. ఇలా కర్మ–కర్మఫలం, జన్మ–కర్మ–కర్మఫలం–జన్మ అనే కర్మ–జన్మ వలయంలో, జనన–మరణ చక్రంలో, కర్మల సుడిగుండంలో చిక్కుకుపోతారు. కనుక, కర్మలు చేస్తూ, కర్మఫలత్యాగం చేయాలి.

**శ్రీరాముని జీవితం ఆదర్శం, శ్రీకృష్ణునిది సందేశం**
**ఏసుక్రీస్తుది త్యాగం, పతంజలిది యోగం**
**ఆంజనేయునిది శరణాగతి**

*మీది ఏగతి?*
*గురువు చెప్పేది వివేకం - శిష్యుడు కోరేది కనకం*
*దేహం భ్రాంతి రూపం - ఆత్మ కాంతి రూపం*
*అంతరాన జీవుడు నిన్ను నడిపే దేవుడు*
*గురువులు చెప్పుమాట పరమునకు రాచబాట*
*మరణం ముగింపు కాదు, మరోజన్మకు శ్రీకారం*
*సత్యం జీవించే సూత్రం - వేదం బోధించే మంత్రం*
*ఓంకారం ప్రణవనాదం - శిలువ జీవనవేదం*
*నూనె లేని వత్తి వెలగదు - మారని మతి గ్రహించదు*
*గీత చెబుతుంది సత్యం - మనిషి ఆచరించాలి నిత్యం*
*సత్యవాక్కులో వుంది శక్తి - ప్రేమభావంలో వుంది ముక్తి*
*అహింస పరమధర్మం - ఆనందం పరబ్రహ్మం*
*సత్యం శ్రీరామరక్ష - ధర్మం లక్ష్మణరేఖ*
*అనుభవించకున్న లోభి - అవసరం లేకుంటే యోగి*
*అందరికీ మంచి తలపెట్టండి - మానవతకు హారతి పట్టండి*
*మారుతి మాటలు లెఖ్ఖ పెట్టండి!*
*లేఖిని నుండి వెలువడిన సూక్తులను సూక్ష్మంగా ఆచరించి,*
*అందమైన జీవితాన్ని ఆంజనేయుని ప్రసాదంగా స్వీకరించి, ప్రాకారాన్ని దాటండి*
*నా చిన్నారి ముద్దుబిడ్డలారా!*

ॐ

**13-09-2019** 10:00 AM

**207)** భగవంతుడు ఎట్టివాడు స్వామీ? మేము ఎటువంటి భక్తి కలిగియుండాలి స్వామీ?

అన్ని అవతారాల్లోనూ, భగవంతుడు అందరినీ ప్రేమిస్తాడు, సహాయం చేస్తాడు. ఎవరికీ అపకారం చేయడు, ద్వేషించడు. ఈ గుణాలు భగవంతుని తత్త్వానికి ప్రతీక. అది సహజ లక్షణం. కానీ, కొందరు వారి స్వార్థం విఫలమైతే భగవంతుడినే దూషిస్తుంటారు. అలా దూషించేవారు మూడు రకాలు. మొదటి రకంవారు దేవుడంటేనే విశ్వాసం లేనివారు. అట్టి వారికి సహజంగానే భగవంతునిపట్ల భక్తి కలగదు, పైగా విమర్శిస్తుంటారు. రెండవవారు వారి అభీష్టాలు నెరవేరక, కోర్కెలు విఫలమైనప్పుడు, వారి సొమ్ము ఏదో భగవంతునికి పెట్టినట్లు విమర్శిస్తుంటారు. ఇలాంటి అల్పబుద్ధులవారు కోర్కెలు నెరవేరలేదని దూషిస్తుంటారు. కొనేది వంకాయ, కొసరేది గుమ్మడికాయ. అలాంటివారు చేసే సాధన అల్పం, కోర్కెలు మాత్రం అనంతం. ఇక మూడవ రకంవారు ఆధ్యాత్మిక రంగంలో వుంటున్నా, ఎదుటివారుపట్ల వ్యక్తిగతమైన ద్వేషం, ఎదుటివారికి కీర్తిప్రతిష్ఠలొస్తూ వుంటే సహించుకోలేరు. అసూయతో

ద్వేషిస్తుంటారు. భగవత్ భక్తులైనా, క్రోధం, ద్వేషం, అసూయ వంటి దుర్గుణాలు మనస్సును విషమయం చేస్తాయి. దానితో చేసే కర్మలు కూడా విషమయంగానే రూపొందుతాయి. అన్ని రూపాలను భగవత్స్వరూపులుగా విశ్వసించాలి. ఎవరు ఎన్ని విధాలుగా విమర్శించినా భగవంతుని దివ్య తేజస్సు, ప్రభావం, దివ్యత్వం, వాటి విలువ ఏనాటికీ మారదు. పెద్ద వజ్రమొకటి మట్టిలో దొరికినా, దాని విలువ మారదు, దాని మెరుగు పోదు. మంచి గుమ్మడికాయ కంచెలో కాసినా రుచి మారదు, దాని రుచి పోదు. గొప్ప నెమలిగ్రుడ్డు కోడి పొదిగినా, దాని వన్నె మారదు, రూపు మారదు. అలాగే దూషణభూషణాలకు భగవంతుడు అతీతుడు. పేపరు మీద ఒక పూలతీగ బొమ్మ గీస్తే, బయట గాలి ఎంత వీచినా ఆ తాకిడికి పేపరు కదుల్తుందే గానీ, పూలతీగ కదలదు. అదే విధంగా భక్తులైనవారు హృదయంలో పాతుకుపోయిన భగవద్భావం బయటగాలికి ఏ మాత్రమూ చలించరు. ప్రపంచ పరిస్థితులపట్ల, కష్టాలపట్ల మీ నమ్మకం చలిస్తున్నది అని ఎవరైనా అంటే, అది సరియైన నమ్మకం కాదు. ఏది ఏమైనా, దైవాన్ని నమ్మక చెడినవారు వున్నారు కానీ, నమ్మి చెడినవారు ఈ లోకాన లేరు. లేరు. లేరు. లేరు. లేరు!

## 208) స్వామీ! నామం యొక్క గొప్పదనము ఎట్టిది స్వామీ?

ఇది రామాయణ కాలంలో జరిగిన ఒక సంఘటన. శ్రీరాముడు సభ జరుపుతున్న సమయం. ఆ సమయంలో నారద మహర్షి సభలోనికి ప్రవేశించాడు. అచట వసిష్ట విశ్వామిత్రులు, ఇంకా ఎందరో మహానుభావులు కొలువుతీరి వున్న ఆ సభలో ఒక సందేహం వ్యక్తపరిచాడు. "నామం గొప్పా? నామి గొప్పా? ఈ సందేహం తీర్చండి" అన్నాడు. కొందరు రూపం గొప్పదని, మరికొందరు నామం గొప్పదని తెలియచేస్తూ వచ్చారు. చివరకు నన్ను ప్రశ్నించగా, "నారదా! ఈ విషయం ఇంతమంది మహాపురుషుల మధ్య బహిరంగంగా చెప్పటానికి నా మనసు ఇష్టపడటం లేదు. కనుక, తమకు మాత్రమే చెబుతున్నానని, ఆయన సమీపానికి వెళ్ళి, చెవిలో ఏదో చెప్పాను. అందరూ ఏదో రహస్యం చెబుతున్నానని భావించారు. కానీ, నారదుడు నాకు చెప్పాడు. ఏమనీ? "నీవు ఈ సభలో ప్రతి ఒక్కరికీ నమస్కారం చేయి. కానీ, విశ్వామిత్రునికి మాత్రం చేయవద్దు" అని చెప్పాడు. విశ్వామిత్రుడు తనకు నమస్కరించకుండా ఉపేక్షించి, నేను అందరికీ నమస్కరించినా, మొదట ఏ మాత్రమూ పట్టించుకోలేదు. కానీ, నారదుడు విశ్వామిత్రుని ప్రక్కన చేరి, "స్వామీ! ఇంత మందికి నమస్కరించి, హనుమంతుడు తమకు మాత్రమే నమస్కరించకుండా మిమ్ములను అవమానించాడు" అని చెప్పాడు. విశ్వామిత్రునికి కోపం వచ్చి, నేరుగా రామునితో "నీ దాసుడు హనుమంతుడు ఈ మహాసభలో నన్ను అవమానపరిచాడు. అతనికి కఠిన శిక్ష విధించాల్సిందే. విధించుట మాటేమిటీ, వధించాల్సిందే" అన్నాడు. రాముడు సరేనని, రేపటి దినమే హనుమను వధిస్తానని సభలో చెప్పాడు. ఇది నారదుడు కల్పించిన ఘట్టమే. ముందు ఏమి జరుగబోతుందో కూడా రామునికి తెలుసు. తర్వాత నారదుడు "నీవు రేపటి దినము సరయూ నదిలో స్నానమాచరించి రామనామాన్ని స్మరిస్తూ కూర్చో" అని నాతో అన్నాడు. ప్రజలందరూ ఏమి జరుగనున్నదో అని నది వద్దకు చేరారు. రాముడు నాపై బాణాలు ప్రయోగించడం ప్రారంభించాడు. ఒక్కొక్క బాణం అగ్నిని క్రక్కుతూ వచ్చి నాదగ్గరకు చేరగానే, చల్లబడిపోయి పాదాల ముందు పవళిస్తున్నాయి. రాముడు అలసిపోయి, లక్ష్మణుని ప్రేరేపించాడు. కానీ, తనవల్ల కూడా కాలేదు. అపుడు నారదుడు, "రామా! ఇది నీకు చేతకాదు.

ఎందుకంటే, హనుమ నీ నామస్మరణ చేయుటచే, బాణాలు విఫలమైనాయి. అందుకే నీ నామమే గొప్పది. నీవు కేవలం ఒక రూపాన్ని ధరించి సముద్రాన్ని దాటగలిగావు. లంకను జయించావు. రావణుని మాత్రం హతమార్చావు. కానీ, నీ నామం అనేకమంది చేత సంసారములనే సముద్రాలను దాటిస్తుంది. నీ నామమే భక్తుల జీవితాలకు ఒక నావగా రూపొందింది. కనుక, నీ కంటే, నీ నామమే గొప్పది" అని దివ్య సందేశాన్ని అందించాడు. ఆధ్యాత్మిక మార్గంలో ప్రధానమైనది నామస్మరణ. నామము చేత నామిని పొందవచ్చు. భక్తి కోసం తప్ప, మరి దేని కోసమూ ప్రార్ధించకుండా సహనాన్ని పెంచుకున్న వారికి భగవంతుని అనుగ్రహం తప్పక లభిస్తుంది.

***ఆశ పేరాశలు మృగతృష్ణలై మనిషిని మృగంగా మార్చి, వాటి వెంట పరిగెత్తిస్తాయి***
***స్వార్థం తోటి మనుషుల నుండి మనిషిని వేరుచేసి, నిస్సహాయునిగా చేస్తుంది***
***అహంకారం మనిషిని పశువుగా మార్చి, తన వారినే తాను కోల్పోయేలా చేస్తుంది***
***ఈర్ష్య, అసూయ తోటివారిపై పగ పూనేట్లు చేసి, మృగతుల్యుడ్ని చేస్తుంది***
***ప్రేమ పరిమళంగా అందరినీ తన వారిగా మార్చేస్తుంది***
***అనురాగం ఆత్మీయతలు ఫలించి, అందరినీ మీ వైపు ఆకర్షింపచేస్తాయి***
***భక్తిగౌరవాలు మీరు ఎదుటివారిపై చూపితే, వారి శుభాశీస్సులు మీకు లభిస్తాయి***
***వినయవిధేయతలు మీకు రక్షక కవచాలై, మిమ్మల్ని రక్షించి జయాన్ని చేకూరుస్తాయి***
***మనిషికి మనసు ఒక దైవవరం***
***దాని ఉనికి మీకు శరీరంలో ఎక్కడో తెలియదు***
***అది మీ మస్తిష్కంపై హీన ప్రభావం చూపి, మనిషిని తన ఇష్టప్రకారం నడుపుతుంది***
***మనసే మనిషికి మోక్షాన్ని, బంధాన్ని కూర్చి, సుఖదుఃఖాలకు దోహదకారి అవుతుంది***
***మనిషి మనసును తన స్వాధీనం చేసుకుంటే సుఖసంతోషాలు కలుగుతాయి***
***మారుతి మాటలు వింటే,***
***మారేను మనసు, కలిగేను హాయి, దొరికేను హనుమ సన్నిధి***
***నా చిన్నారి ముద్దుబిడ్డలారా!***

ॐ

**03-10-2019** 08:45 AM

**209) శిష్యుడు, గురువు పట్ల ఎట్టి వినయ విధేయతలు కలిగియుండాలి స్వామీ?**

మనిషి మనిషిగా మారే క్రమంలో పవిత్రత, నిరాడంబరత, విధేయత అత్యంత ప్రాధాన్యం వహిస్తాయి. పరమపద మార్గాన్ని సుగమం చేస్తాయి. ముముక్షువులైన ఆధ్యాత్మిక సాధకులు, సద్గురువును ఆశ్రయించే క్రమంలో విధేయత కలిగి వుండటమే విశిష్ఠ తపస్సుగా చెబుతాను. ఎవరినైనా పరీక్షించి అంగీకరించడం దృఢమైన నమ్మికను కలుగచేస్తుంది. కానీ, ఎవరి మహోన్నత వ్యక్తిత్వమైనా ప్రబలంగా

*ఆకర్షించినపుడు, ఎంతగా వారి నిరాదరణకు గురైనా, వారినే అనుసరించేలా చేస్తుంది, ఆశ్రయించేలా చేస్తుంది. 'అంధ విశ్వాసం' అన్న పదాన్ని చాలామంది వినియోగిస్తారు. అంటే ఏమిటి? విశ్వాసంలో కళ్ళు ఉన్నవి, లేనివి అని రెండు రకాలు వుంటాయా? వుండవు. విశ్వాసం అంటే, ఎలాంటి షరతులూ లేకుండా, అంగీకరించటమేనని తెలుసుకోండి. మహాత్ములను కూడా మీరు ఎన్నో విధాలుగా పరీక్షిస్తుంటారు. వారు అంత సులభంగా, పట్టుబడటానికి ఇష్టపడరు. శిష్యుల వినయవిధేయతలను, భక్తివిశ్వాసాలను స్పష్టంగా ప్రకటితమయ్యేలా పరీక్షిస్తుంటారు. ఆ పరీక్షాకాలంలో జరిగే అంతర్మథనం ఒక తపస్సుగా పరిణమిస్తుంది. గురువు ప్రశ్నల ద్వారా, పరిశీలన ద్వారా విధేయతకు పరీక్షపెడితే, శిష్యుడు మౌనం ద్వారా సమాధానాలు ఇచ్చే విధం కదురమ్యంగా వుంటుంది. ఇది గురువు చూపే విధానం. ఇక్కడ మౌనం బాహ్యవిషయాలయందు ప్రవర్తిల్లకుండా మనస్సు పరమాత్మయందే వర్తించడాన్ని తెలుపుతుందిగానీ, అవిధేయతను, తృణీకారభావాన్ని కాదు. అలా విధేయతా పరీక్షల్లో నెగ్గిన శిష్యునిపై గురుకృప ప్రసరిస్తుంది. అలా నెగ్గటం శిష్యుని మహత్వాన్ని కూడా చాటుతుంది. మిమ్ములను నేను ఒక ప్రశ్న అడుగుతాను. దానికి మీ సమాధానం కావాలి. నాకన్నా గొప్పవారు మీకు తారసపడితే మీరు నన్ను వదిలివేస్తారా? అని అడుగుతున్నాను. మీరు "స్వామీ! మిమ్మల్ని వదిలి వెళ్ళము" అని చెబుతారు. కానీ, అది సరియైన సమాధానము కాదు అని నేనంటాను. ఆ ప్రశ్నకు సరియైన సమాధానం, "మీకంటే మరొక గొప్పవ్యక్తి ఉన్నారన్న ఊహయే మిమ్మల్ని విడిచిపెట్టడం" అని చెప్పటమే, గురువుపైన వున్న తన అచంచల విశ్వాసాన్ని ప్రకటించి, తన విధేయతను చాటుకోవడం అని అంటాను. అహంకార శూన్యులు, మమకారపూర్ణులైన సాధకులు ఆదర్శాలకు అనుగుణంగా తమను తాము మలచుకుంటారు. 'నేను' అనే అహంకారాన్ని తొలగించుకోవడం, కర్తవ్యనిర్వహణలో మమేకమవ్వటం ఈ రెండూ విధేయతతో పాటించటమే తపస్సు. సాధకుని మనసును తపింపచేసి, భగవన్మార్గంలో ముందుకు తీసుకునిపోయే ప్రతి సద్గుణపాలనమూ ఒక తపస్సే. ఆ సద్గుణాన్ని పెంచిపోషించే క్రమమే సాధనను తీవ్రతరం చేస్తుంది. వినయవిధేయతలు కలిగివుండటం కేవలం అలంకారప్రాయం కాదు. వాటిని ఎవరిపట్ల చూపుతారో, వారి ఆదర్శాలకు అనుగుణంగా పని చేస్తామని తెలిపే విశిష్ఠ సంకేతాలు. విశాల ప్రపంచానికి సంబంధించిన సమాచారం అరచేతిలో లభ్యమయ్యే ఈ రోజులలో పెద్దల ఆజ్ఞలను పాలించి, అణకువతో వారి అడుగుజాడల్లో నడుచుకోవటమే తపస్సు. విధేయత ద్వారానే శక్తి వస్తుంది. అది పెద్దల ఆశీస్సులను పుష్కలంగా పొందేలా చేస్తుంది. పురోగతికి దోహదపడుతుంది. సంఘటితంగా జీవించడంలోనూ, ఆధ్యాత్మికపథంలో పురోగమించడంలోనూ, విశేషపాత్రను పోషించే విశిష్ఠ విలక్షణ సుగుణభూషణం 'విధేయత'. అందుకే విధేయతా తపం పరమపథానికి సుపథం!*

**కోర్కెలు తీరాలనుకోవటం తప్పు కాదు**
**అవి ఇతరుల కష్టాలకు కారణం కారాదు**
**ఆశలు పెంచుకొనటం ముప్పు కాదు**
**అవి ఎవరినీ మోసాలకు గురి చేయకూడదు**
**అధికారం అందుకోవటం నేర్పు కాదు**

***అది సేవాసహకారాలకు సాధనంగా మారాలి***
***అందంగా మాట్లాడటం కూర్పు కాదు***
***అది ఆదర్శపు చేతలకు దారితీసి చూపాలి***
***జ్ఞానం సాధించడం గొప్ప కాదు***
***అది సమాజ మనుగడకు సోపానంగా మారాలి***
***ఆంజనేయుని మాటలు వినటం కాదు***
***అఖండ జ్ఞానవంతులై వెలగాలి***
***వినయవిధేయతలను పాటించడమే మీ విధి***
***విన్నపాలను వీనులవిందుగా విని, వంగి సమస్కరించడం ఆచరించాలి***
***అప్పుడే అభ్యున్నతి కన్పించి,***
***కడకు చేరు మార్గం కడు రమ్యంగా, రసవత్తరంగా మారి, రఘురాముని చేరి***
***రంజిల్లుతారు అని చెబుతున్నాను***
***నా యీ చిన్నారి ముద్దుబిడ్డలతో.***

ॐ

**04-10-2019** 08:45 AM

### 210) కన్నీరు ఎట్టిదై వుండాలి స్వామీ?

అప్పుడప్పుడు మీ కంటి నుండి జాలువారే కన్నీటి చుక్కలు మీలోని కాఠిన్యాన్ని, కరుకుదనాన్ని కడిగివేస్తాయి. ప్రేమ, స్పందన, సహానుభూతి కొరవడిన బ్రతుకులు బండరాళ్ళతో సమానం. ఓ దుర్ఘటన సంభవించినప్పుడో, ఓ వ్యక్తికి అనుకోని కష్టం వచ్చినప్పుడో సాటి మనిషిగా మీ మనస్సు చలించకపోతే, గుండె ద్రవించకపోతే, అర్ధమే లేదు. ఒకరి కోసం తపించకుండా, కేవలం మీకోసమే స్పందించడం హృదయానికి అలవాటు చేస్తే, కొన్నేళ్ళకు దానికీ విసుగు వస్తుంది. ఎంతకాలం నాకోసమే నేను స్పందించాలంటూ తన పనికి స్వస్తి పలుకుతుంది. ఒకరి కష్టాన్ని మీరు పంచుకుంటున్నారంటే, మీ ఆత్మను మరో ఆత్మతో అనుసంధానం చేస్తున్నారని అర్ధం. అలా ఆత్మబంధువులైన మీరు, విశ్వాత్మతో ఏకమైపోతారు. అందుకే, వ్యక్తిగతమైన దుఃఖాన్ని భరించే మహానుభావులు పరులకు కించిత్తు కష్టమొచ్చినా, కకావికలురైపోతారు. దీనికి నా రామచంద్రుడే సాక్షి. మీలో చాలామంది గుండెకరిగి కన్నీరుగా ఉప్పొంగడం బలహీనత అని భ్రమపడతారు. కానీ, ఆ కన్నీళ్ళల్లో మనిషి జీవలక్షణం దాగి వుంటుంది. పైగా, ఆ కన్నీటిని చిత్రికపడితే, అది చెప్పే భావాలెన్నో, అది విప్పే భాషలెన్నో! ఎప్పటి నుంచో భారమై బాధిస్తున్న గుండె బరువు, ఒక్క అశ్రుబిందువుతో దూదిపింజ అయిపోతుంది. కష్టసమయాల్లో కావలసిన వాళ్ళ ముందు కురిసే మీ కన్నీటికి ఫలితం ఎంత వుంటుందో చెప్పలేరు కానీ, దుఃఖవేళల్లో ఆ దేవదేవుడ్ని ప్రార్థిస్తూ ఆర్తితో ప్రార్థించినప్పుడు జాలువారే కన్నీటికి మాత్రం వేయింతల ఫలితముంటుంది. ఎంతటి వేదననైనా, భగవంతునికి విన్నవించుకోమని ప్రోత్సాహాన్నిస్తున్నాను. లోకమంతా చేతులెత్తేసినా, ఆపదవేళల్లో

ఆయన తన చేయినందిస్తాడు. అలా మీ కన్నీరు ఎవరిని కరిగించినా కరిగించకపోయినా, కరుణాంతరంగుడైన ఆ పరమాత్మను మాత్రం కదిలిస్తుంది. కపటంతో కూడిన కన్నీళ్ళు మొసలి కన్నీళ్ళు అవుతాయి. అవి మీలోని కపటత్వాన్నే తప్ప, సహజత్వాన్ని వెల్లడి చేయవు. నలుగురి సానుభూతిని పొందటం కోసమో, సాత్త్వికులమన్న ముద్రను వేయించుకోవటం కోసమో రప్పించే అశ్రువులు కాగితం పూలలా కృత్రిమంగా కన్పిస్తాయి, తెచ్చిపెట్టుకున్నట్లుగానే కన్పిస్తాయి. కన్నీరు గుండెనుంచి ఉబికిందో, గ్లిజరిన్ పెట్టుకుంటే వచ్చిందో చూసేవాళ్ళకు ఇట్టే అర్థమైపోతుంది. నిజానికి మనసులో రగిలే బాధకు చిహ్నంగా ఒక కన్నీటిబొట్టు చాలు, అది అనంత ప్రభావాన్ని చూపడానికి. అందుకే లంక దహనమైంది నేను నిప్పంటించడం వల్ల కాదు, సీతమ్మ కన్నీటి జ్వాల వల్లే అని చెప్పగలను. అందువల్ల అశేషమైన ఆవేదన ఆవిష్కృతం కావాలంటే, కంటికీమింటికీ ఏకథాటిగా రోదించనక్కరలేదు. అగాధమంత సంవేదనా సాంద్రత ఒక్క అశ్రుబిందువుతో అభివ్యక్తమవుతుంది. నేను చెబుతాను ఒక మాట, "జానకి కన్నుల జలధితరంగం, రాముని మదిలో విరహసముద్రం" అని. నిజమేనంటారా? కాదా? వైదేహీ కళ్ళల్లోని కన్నీటితరంగం, ఆ రాఘవుడి బాధ సాగరమంత విరహబాధతో సమానం. ఇలా కన్నీళ్ళు కేవలం కంటి నుంచి జారి ఆవిరైపోయేవి మాత్రమే కాదు. సహృదయతకు, స్పందనకు సంకేతాలు. పన్నీటి సుగంధం కంటే, కన్నీటి సుగంధం గొప్పది. పన్నీటి సుగంధం రసాయనిక నిర్మాణం – కన్నీటి సుగంధం ప్రాణమయ నిర్మాణం. పన్నీరు దుర్గంధాన్ని పోగొడుతుంది – కన్నీరు దుఃఖాన్ని తొలగిస్తుంది!

***అందరినీ ఒకటిగా నిలిపే అమూల్యమైన అభినందన***
***ఎడారి కళ్ళల్లో వానచినుకై పన్నీటి పరిమళాలు వెదజల్లితే,***
***అది అందరిలోనూ నిత్య వసంతమే!***
***పసివాడికైనా, పండు ముసలికైనా***
***మాటలతోనే కాదు, కళ్ళతో ప్రశంసించవచ్చు!***
***కారు చీకటిలో కాంతిపుంజంలా, కళ్ళలోని వెలుగు***
***మీ గుండెగూటిలో వేల దీపాలను వెలిగిస్తుంది.***
***నలుగురికీ మేలు జరిగే పని ఎప్పుడూ మెప్పు పొందుతూనే వుంటుంది***
***చితికిన మనసుల వెతలను బాపుటకై***
***పరివర్తన చెందినవాడి అంతరంగం నుండి వచ్చే అభినందన***
***మండుటెండలో మలయమారుతం వీచినంత హాయిగా, స్వచ్ఛంగా వుంటుంది***
***ఈ ఆంజనేయుని పదములు రెట్టింపు ఆత్మవిశ్వాసంతో***
***చిరు ఆశలను కల్పించి, కార్యోన్ముఖులను చేస్తుంది***
***అపజయాలెన్నైనా, విజయం కోసం పోరాటం చేస్తూనే***
***పవనకుమారుని చేరి, నిరంతరం సుఖసంతోషాలను బడయుచూ***
***నిరంజనునితో నిత్యసంతోషులై సుఖించండి***
***నా చిన్నారి ముద్దుబిడ్డలారా!***

దేవుని పటాన్ని కొనడం అతి సులభం
కానీ, అనుగ్రహాన్ని పొందటం బహు కష్టతరం

ఓం

**05-10-2019** 09:00 AM

**211) అన్నింటికన్నా సూక్ష్మమైనది ఏది స్వామీ?**

*ఆంజనేయుడు అందిస్తున్న ఈ జ్ఞానామృతాన్ని బిందుమాత్రం సేవించినా చాలు, జీవితం ధన్యమైపోతుంది. అసలు ఆత్మకు అత్యంత ప్రీతికరమైన ఆహారం ఆత్మజ్ఞానమే. దీనిని విస్తారంగా తెలుసుకోవాలంటే, ఇప్పటివరకూ నేనందించినవి చదివితీరవలసిందే. అది సాధ్యం కాకపోయినట్లైతే, విషయపరంగా కఠినమైన దీనిని కషాయం చేసుకొని అందులో తగినంత అతిమధురాన్ని కలుపుకుని, కాస్తంత నీళ్ళతో ఘాటుగా వున్నదానిని తగ్గించుకుని చేసే ప్రయత్నమే ఇదంతా. జ్ఞానపరంగా అమృతమే గనుక, మానవుడు తన జీవితకాలంలో కనీసం ఒక్కసారైనా ఈ జ్ఞానామృతాన్ని సేవించి తీరాలి. దానివలన, ఆత్మ మీద ఉన్న అన్నిరకాల కాలుష్యాలు సమూలంగా తొలగిపోతాయి. స్థూల సూక్ష్మాలను గురించి ఎన్నో చెప్పాను. భూమి కన్నా గాలి సూక్ష్మం. ఆకాశాన్ని సూక్ష్మతమం అంటారు. శబ్దం ఆకాశగుణం. వస్తువు సూక్ష్మమైన కొద్దీ ఇతర వస్తువుల చుట్టూ వ్యాపించగలుగుతుంది. గాలి సూక్ష్మం కాబట్టి, భూమి చూట్టూ, ఆకాశం సూక్ష్మతమం కాబట్టి బ్రహ్మాండకోటిని ఆవహించగలిగి వుంటుంది. అయితే, మనసు ఇంకా సూక్ష్మాతిసూక్ష్మం. అందుకే, దీనిని మానసాకాశం అంటారు. దీంట్లో సమస్తమూ ఇమిడిపోతాయి. ఆత్మచైతన్యాన్ని చిదాకాశం అంటారు. దీంట్లోనే మానసాకాశం, ఐహికాకాశం, అందులోనే బ్రహ్మాండాలు వున్నాయి.*

**212) మరణానంతరం జీవుడి స్థితి ఏమిటి స్వామీ?**

*ప్రాణి ఇంద్రియాలు మనసులో, మనసు వెళ్ళి ప్రాణంలో, ప్రాణం తేజస్సులో, తేజస్సు ఆకాశంలో, ఆకాశం పరమాత్మలో లీనమవుతాయి. మనిషి మానవాకాశంలో పూర్వజన్మ వాసనలు మిగిలి వుంటే జన్మ ఎత్తుతాడు. అలాగాక, నేనే పరమాత్మను అనే సంపూర్ణజ్ఞానం కలిగితే మళ్ళీ జన్మ వుండదు. జీవులు మనసులోని వాసనల కారణంగానే జన్మిస్తూ స్వంత ప్రపంచాన్ని సృష్టించుకుంటున్నారు. అందుకే ప్రపంచానికి మరోపేరు మనోరాజ్యం. జీవుడు మరణకాలంలో పరమాత్మ చైతన్యంలో ఏకీభావం పొంది, ఏకకాలంలో ముల్లోకాలను చూస్తాడు. ఆ సమయంలో ఏ లోకం మీద ఎక్కువ అభిమానం చూపుతాడో, అదే సూక్ష్మరూపమై, అతడి జన్మకు ఆధారమవుతుంది. ఈ అభిమానం జన్మజన్మకూ మారుతూ వుండటం చేత, జీవులు పైలోకాలకు, క్రింది లోకాలకు అంతు లేని ప్రయాణాలు చేస్తూంటారు. ఈ కాలప్రవాహమే యుగాలు, కల్పాలుగా లెక్కించబడుతుంది. కల్పం అంటే, బ్రహ్మకు ఒకరోజు. దానిలో 72 త్రేతాయుగాలుంటాయి. కాస్త తేడాలతో అన్నీ ఒకే రకంగా వుంటాయి.*

**213) జీవన్ముక్తి అనగా ఏమిటి స్వామీ? అది ఎలా సాధించాలి స్వామీ?**

సంసారబంధాల వల్ల భయదుఃఖాలు, అహంకార మమకారాలు ఎంత మాత్రమూ లేకపోవడమే జీవన్ముక్తి. జీవించి వుండగానే ముక్తిని పొందటమనేది కఠోరతపస్సుతోనే సాధ్యమవుతుంది. తపస్సు అంటే మీలోనికి మీరు నిరాటంకంగా ప్రయాణించడం. మీలోపలికి మీరు ప్రయాణిస్తూ, ఎవరికి ఎటువంటి కష్టం వచ్చినా, ఆపద వచ్చినా దానిని వెంటనే తీర్చే ప్రయత్నం చేయాలి. కానీ దానిని కర్మకు అంటకట్టేసి చేతులు దులిపేసుకుంటారు కానీ, పురుష ప్రయత్నం చేయరు (కర్తవ్యం). దేవుడనేవాడు ఒకడున్నాడుగదా, నారు పోసినవాడు నీరు పోయడా అంటూ, ఆయన నెత్తిమీద పడవేయటం సోమరితనం అంటాను. ఇది బాధ్యతారాహిత్యం అంటాను. ఏ నిజమైన భక్తుడు ఇలా దేవుడి నెత్తిమీద తట్టపెట్టి తన కష్టాలను అందులో పడవేయడు. మనిషి ముముక్షువు కావాలంటే, బండెడు ఆధ్యాత్మిక గ్రంథాలు చదవటం కాదు, ప్రవచనాలు వినటం కాదు. శాంతిని కలిగించే శమము అనే గుణం, ఆత్మతత్త్వాన్ని మననం చేసుకునే ఆత్మవిచారణ, ఐహికమైన కష్టసుఖాలను సమబుద్ధితో స్వీకరించే సంతోషం, సద్గురువులను సత్పురుషులను ఆశ్రయించి సత్సంగం చేయాలి అని చెబుతాను. ఈ చర్చ కేవలం మీకు-నాకు మధ్య జరిగింది అనుకుంటే, మీరు పప్పులో కాలు వేసినట్లే. వేదవేదాంగాలు, శాస్త్రాలు, ఉపదేశాలు, చివరకు యోగవాసిష్టం కూడా సమస్త మానవాళి సంక్షేమం కోసమే ఉద్దేశింపబడినవి. తల్లి చేసే వంట తాను ఒక్కత్తే తినదు, అందరికీ పెట్టి ఆఖరున తాను తింటుంది. శాస్త్రం కూడా తల్లివంటిదే. పరమాత్మ అటువంటి శాస్త్రాలకు తండ్రి వంటివాడు. వీటి ప్రయోజనం పొందకపోతే, మీ జన్మ వ్యర్థం. అందుకే ప్రయత్నించి జ్ఞానాన్ని పొందాలి అని చెబుతున్నాను. ధనం కోసం, సుఖసౌకర్యాల కోసం పడే తహతహలో, జ్ఞానం కోసం కొంత సమయాన్నైనా కేటాయించగలగాలి. అప్పుడే జీవితం ధన్యమవుతుంది.

***కాలుష్యం పెరిగిందని కాలచక్రమాగుతుందా?***
***భూభారం మోయలేక భూభ్రమణం ఆగుతుందా?***
***కడలిపై కోపించి కెరటమాగిపోదు***
***రవి వేడి తాళలేక పగలు రేయి కాదు***
***కరువు వచ్చిందని కడుపు చంపుకుంటారా?***
***బాధ వచ్చిందని బ్రతుకు మానుకుంటారా?***
***పండువంటి జీవితాన్ని అంగడిపాలు చేస్తారా?***
***సమస్యల వలయాన్ని ఛేదించి సాధించాలి***
***ఆంజనేయుని అతిప్రేమ ప్రవచనాలు***
***అలసిపోయిన మిమ్ము నిద్రలేపు సుప్రభాతం సుమా!***
***నిదురపోతున్న మిమ్ము నిద్రలేపుటకు కొలనులోని కలువలు కళ్ళు తెరచినట్లు***
***కనులు తెరచి కాలాన్ని లెక్కించి***
***జన్మ సార్థకతను సాధించుటకై***
***ఆత్మసామ్రాజ్యాధినేతలుగా మారండి***
***నా చిన్నారి ముద్దుబిడ్డలారా!***

పుట్టిన తేదీని గుర్తించేవాడు సామాన్యుడు
పుట్టింది ఎందుకో తెలుసుకునేవాడు అసమాన్యుడు

## UNO ఆట గూర్చి స్వామి ఇచ్చిన వివరణ

*ఎల్లో అంటే ఎవడురా వీడు?*

*గ్రీన్ అంటే గ్రీకువీరుడా? లేక క్రాకువీరుడా?*

*రెడ్ అంటే ఎరుపులోవున్న క్రోధాన్ని కోరుతున్నావా?*

*బ్లూ అంటే డబ్ల్యూ (డబల్ U) అయిపోతావా? అంటే మంచి-చెడులను రెండిటినీ సమంగా స్వీకరిస్తావా?*

*+2 అంటే, ఇంకొక రెండు గుణాలు స్వీకరిస్తావా?*

*+4 అంటే ఇంకొక నాల్గు గుణాలు కలుపుకుంటావా?*
*ఆరు మీకు చేరినట్లే కదా?*

*ఈ ఆరు గుణాలు యూనో అంటే నీకు ఇప్పుడే అని చెబుతున్నాయి కదా?*

*ఇంకొకరకంగా ఇప్పుడే నీవు ఆరింటినీ వదులుకోవచ్చు అని కూడా అర్థము చేసుకోవచ్చు ఆధ్యాత్మికంగా.*

*తీసుకుంటే పసుపు మంగళప్రదమైనది, ఆకుపచ్చ కళ్యాణకారకమైంది, రెడ్ కుంకుమ శోభాయమానమైంది, బ్లూ అంటే నీలిరంగు, శాశ్వితమైన శాంతిని ప్రసాదించేది. అంతే కాదు, +2 దైవానుగ్రహం + జీవానుగ్రహం రెండూ ఏకమయ్యేది. +4 అంటే దీనితో ఇంకొక రెండు మీకు అనుగ్రహించబడతాయి. అదే జీవన్ముక్తి, మోక్షం. ఇదే U N O, U N O , అని అనుకోవచ్చు, ఆడుకోవచ్చు. ఇదే,*

*శాంతిః శాంతిః శాంతిః*

ఓం

**06-10-2019** 08:55 AM

### 214) అంతర్యామిగా ఉన్న భగవంతుని ఏ విధంగా అభివ్యక్తీకరించుకొనవచ్చును స్వామీ?

*జీవులన్నింటిలోకి చాలా సంక్లిష్టము, అద్భుతము అయిన జీవితం మనిషిది. చదువు, సంస్కారం, సంస్కృతి, తపస్సు, యోగం ద్వారా ప్రకృతి నిర్దేశాన్ని దాటి, ఎదిగే అవకాశం ఈ జీవికి వుంది. అన్ని పరిమితులను దాటి అప్రమేయుడుగా నిలిచే అవకాశం ఈ రెండు కాళ్ళ జీవికి వుంది. ప్రారబ్ధవశాత్తు, మీకు ఒక స్వభావం వచ్చినా, ఆ స్వభావాన్ని మార్చుకుని, మీలోని దైవత్వ ప్రకటనను మీరు నిర్ధారించుకోవచ్చు. కేవలం మీకు పూర్వజన్మ కర్మల వలన వచ్చిన స్వభావాన్ని అనుసరిస్తూపోతే, పరిణామక్రమంలో మళ్ళీ వెనక్కు వెళ్ళవలసి రావచ్చు. అందుకే మీ స్వభావాన్ని మీరు నమ్ముకోవటం*

కాకుండా ఆదర్శాన్ని పట్టుకోవాలి. ఆ ఆదర్శాన్ని చేరుకోవటానికి మీ శాయశక్తులా ప్రయత్నం చేయాలి. ఆదర్శాలు మనుషులకే అవసరమవుతాయి, జంతువులకు కాదు. ఆదర్శం అనేది ఎంత గొప్పదైతే, మీలోని దైవత్వాన్ని అంత ఎక్కువగా ప్రకటించడానికి వీలుంటుంది. అందుకే మీముందు ఎంతోమంది మహాఋషులు ముక్తి అనే మహోన్నత ఆదర్శాన్ని నిలిపారు. నేను నా జీవితం యొక్క కార్యాన్ని రెండే రెండు మాటలలో చెబుతాను. అదేమిటంటే, "నాలోని దైవత్వం గురించి బోధించి ఆ దైవత్వాన్ని జీవితంలోని ప్రతి చర్య ద్వారా ఎలా అభివ్యక్తీకరించుకోవాలో తెలపడం" అని చెబుతాను. ఈ దైవత్వాన్ని ప్రకటించటానికే వ్యక్తిత్వం అవసరమై వున్నది. మనిషిలో సౌశీల్యం ద్వారానే దైవత్వం ప్రకటితమవుతుంది. అందుకనే నేను చెబుతాను, వెయ్యి అవరోధాలెదురైనా అధైర్యపడకుండా వ్యక్తిత్వాన్ని నిర్మించుకోవాలంటాను. అయితే, ఇది కొంత శ్రమతో కూడుకున్న ప్రక్రియ. శ్రమతో కూడుకున్నంత మాత్రాన మీ ప్రయత్నాన్ని మానుకోకూడదు. ఈ దైవత్వ ప్రకటనలోని వ్యత్యాసమే మనిషికి – మనిషికీ వున్న వ్యత్యాసాన్ని నిర్ధారిస్తుంది. ఈ వ్యత్యాసం ఎంతగా వుంటుందంటే, మనుషుల్లో కొందరు మానవరూప దైవాలుగా శోభించవచ్చు, ఇంకొందరు మానవరూప దానవులుగా మిగలవచ్చు. మనుష్యుల్లోని ఈ తారతమ్యం మీ అందరికీ అనుభవేకవేద్యమే. భగవదభివ్యక్తీకరణలో వున్న వ్యత్యాసం వలననే ప్రపంచ క్రీడ నడుస్తున్నది. వ్యత్యాసాలే లేకుండా అంతా సమానమైతే విశ్వక్రీడ వుండదు, ప్రకృతికీ ప్రత్యేక ఉనికి వుండదు. ఒకసారి ఒక సాధకుడు నన్ను ప్రశ్నించాడు, "భగవంతుడు మనుషుల్లో కొందరికి ఎక్కువ శక్తిని, మరికొందరికి తక్కువ శక్తిని ఇచ్చాడా?" అని. అప్పుడు నేను చెప్పాను, "అవును. లేకపోతే, అందరూ మిమ్మల్ని ఎందుకు గౌరవిస్తారు? మీకేమన్నా రెండు కొమ్ములున్నాయా? మీలో దయ, జ్ఞానం ఎక్కువగా వున్నాయి. ఉన్నత వ్యక్తిత్వం ప్రకటితమవుతుంది. అందువలననే లోకులు మిమ్మల్ని గౌరవంగా చూస్తున్నారు" అని చెప్పాను. దైవత్వ ప్రకటనలో తేడా వున్నందునే తమను తాము ఉద్ధరించుకోవాలనుకునేవారు, దుష్టజనులతో స్నేహం చేయరాదని చెబుతాను. పులిలో దేవుడున్నాడు. అంతమాత్రం చేత, ఓ పులిదైవమా! అంటూ వెళ్ళి కౌగలించుకోరు కదా! దీనికి ఒక చిన్న ఉపమానం చెబుతాను. ఒక శిష్యుడు గురువుగారు చెప్పిన అద్వైత వేదాంతాన్ని విని, అందరిలో దైవమున్నప్పుడు, నేను దేనికీ భయపడనవసరం లేదని నిశ్చయించుకున్నాడు. ఒకరోజు అతడు గ్రామంలో వెళుతుండగా, "ఇది అదుపు తప్పిన ఏనుగు. దూరంగా పారిపోండి" అంటూ అరుస్తున్న మావటివాడిని, తన ఇష్టం వచ్చినట్లు పరిగెడుతున్న ఏనుగును చూశాడు. అందరూ మావటివాడి మాట విని పారిపోయి, ఏనుగు బారి నుండి తమను తాము రక్షించుకుంటారు. కానీ, ఈ శిష్యుడు మాత్రం తాను చదివిన అద్వైత శ్లోకాలను స్మరిస్తూ, మావటివాడు దూరంగా పారిపొమ్మని చెప్పినప్పటికీ, అన్ని జీవుల్లో దైవమున్నదని శాస్త్రం చెబుతున్నది. అలాంటప్పుడు నేను ఎందుకు ప్రక్కకు జరగాలి? అని భావించి, అలానే నిల్చున్నాడు. ఏనుగు వచ్చి తన తొండంతో ఆ వేదాంతిని దూరంగా విసిరివేస్తుంది. ఎముకలు విరగ్గా, అతికష్టం మీద ఆ శిష్యుడు లేచి నిలబడి ప్రక్కన వున్న గురువును చూస్తాడు. ఆ గురువు, శిష్యుడ్ని, "అవును, అందరిలో భగవంతుడున్నాడు. మావటివాడిలో నీకు భగవంతుడు కనబడ్డాడా? మావటి రూపంలో వున్న భగవంతుడి మాటను నువ్వు ప్రక్కన పెట్టి ఇలాంటి పరిస్థితిని కొనితెచ్చుకున్నావు. ఇంకెప్పుడూ, ఇలా చేయకు" అని మందలించి, అతడికి వైద్య సహాయం

చేస్తాడు. మీరు ఒక్కొక్కసారి వేదాంత తత్త్వాన్ని సరిగ్గా అర్థం చేసుకోకుండా ఇలా మిమ్మల్ని మీరు ఇబ్బందులపాలు చేసుకుంటుంటారు. వ్యావహారిక ప్రపంచంలో ఉన్నంత వరకూ భగవదభివ్యక్తీకరణలో వున్న వ్యత్యాసాన్ని గుర్తించాల్సిందే. కుజనుల సాంగత్యానికి దూరంగా వుండాల్సిందే. లేకపోతే, ప్రమాదంలో పడతారు. కుల రూప విద్యా వయో ధనజనిత దంభము, దర్పము, అభిమానం, క్రోధం, పరుషవాక్కులతో ఇతరులను దూషించడం ఇవ్వన్నీ అసుర స్వభావాన్ని సూచిస్తాయి. ఇలాంటి లక్షణాలు మీలో వున్న దైవత్వదీపాన్ని ప్రకాశింపనివ్వవు. ఘటములోని దీపశిఖలాగా ఆ కాంతి బయటకు ప్రకటితమవదు. రకరకాల చింతలతో, కోరికలతో ఇప్పటికి ఇది సాధించాను. భవిష్యత్తులో ఇంకా సాధిస్తాను, సంపాదిస్తాను. నాలాగా జీవితంలో పైకి వచ్చినవారు చాలా తక్కువ. నాకు నేనే సాటి. ఇప్పటికి ఇవి అనుభవించాను, భవిష్యత్తులో ఇంకా అనుభవిస్తాను... ఇలాంటి ఆలోచనలతో నిరంతర తాపత్రయంతో జీవించేవారు నరకంలో పడతారు. ఈ విధమైన ఉపశమించని రజోగుణం వలన మనుషులు ఇతరులలో వున్న దైవత్వాన్ని చూడలేరు. ఇలాంటి వ్యక్తులు తమలో కూడా దైవత్వం ఉందని తెలుసుకోలేరు. అహింస, సత్యసంధత, దయ, ఇతరుల ధనాన్ని ఆశించకుండా వుండటం, ఇంద్రియ నిగ్రహం, వినయం, క్షమాగుణం, దృఢ సంకల్పం మొదలైన లక్షణాలు పెంపొందించుకుని, అంతర్గతంగా దివ్యత్వాన్ని వ్యక్తపరుస్తూ, నిర్వాణరూప చిరశాంతిని అమృతత్త్వాన్ని పొందటానికి అవకాశమున్నదని వారికి అర్థం కాదు. ఈ రజోగుణ మాలిన్యం వలన ఆ పరమాత్మ ప్రకాశం వారిలో చాలా మందంగా వుంటుంది. ఇది దట్టమైన అజ్ఞానపు పొర. కానీ, ఈ లక్షణాలతో వున్న వ్యక్తికి అది అవిద్య అని తెలియక, స్వభావంలో మార్పు కోసం ప్రయత్నించడు. రజోగుణ ప్రభావ ప్రేరితుడై రకరకాల దుష్కర్మలు ఆచరించి, ఇంకా బంధాన్ని పెంచుకుంటాడు. ఒక శిష్యుడు తన గురువుగారితో ఇలా అంటాడు, "పరమాత్మ మనలోనే వున్నప్పుడు, మనం ఆయనను ఎందుకు చూడలేము?" అని. "ఒక తాగుబోతుకు తన ఇల్లు ఎందుకు కనబడదు?" తిరిగి ప్రశ్నిస్తాడు గురువు. ఇలా రాజసిక అహంకారాలతో ఉన్నవాళ్ళకు అంతర్గత ప్రపంచం కనబడదు. వారి విజయాలన్నీ బయట ప్రపంచానికి సంబంధించనవే. ప్రేమ, దయ, శాంతి, దానం, తపస్సు, సద్గ్రంథ పఠనములాంటి గుణాలు వారికి బలహీనుల లక్షణాలుగా కనబడతాయి. వారికవి రుచించవు. అవి క్రమేణా లోపలున్న పరమాత్ముని ఉనికిని మీకు అనుభవంలోకి వచ్చేటట్లు చేయడానికి సోపానాలు అంటే నమ్మరు. తమకు తెలియకుండానే, పాపకర్మను ప్రోగు చేసుకుని, పరిణామక్రమంలో ఏ జంతుజన్మలను దాటి ముందుకు వచ్చారో, అవే జన్మలలోనికి మళ్ళీ వెళతారు. అందుకే మనుష్యజన్మలో ఎరుకతో జీవించడం అవసరం. ఆత్మ ప్రకాశానికి ఉపయోగపడే సాధనలను ఆశ్రయించి, జన్మని సార్ధకం చేసుకోవటానికి శాయశక్తులా ప్రయత్నించాలి. శీఘ్రమేవ కైవల్య ప్రాప్తిరస్తు!

**నిజాన్ని నిలువు లోతున పాతేసి, అబద్ధాన్ని అందలమెక్కిస్తే,**
**ఏమి కల్తీ... ఏమి కల్తీ!**
**స్నేహంలో కల్తీ, రక్తంలో కల్తీ,**
**ప్రేమలో కల్తీ, తల్లిపాలల్లో కల్తీ,**
**కారంలో కల్తీ, మమకారంలో కల్తీ,**

***కాసుల్లో కల్తీ, సత్యంలో కల్తీ,***
***మాటల్లో కల్తీ, చూపుల్లో కల్తీ,***
***భక్తిలో కల్తీ, ఈ జగమే కల్తీ!***
***పుట్టుక తెలియదు, మరణం తెలియదు,***
***ఎప్పుడేమవుతుందో అసలే తెలియదు.***
***బాల్యం, యవ్వనం, కౌమార్యం, వృద్ధాప్యం***
***అనే నాలుగు అంకాల నాటకం***
***రేపు - నేడు - నిన్నల మధ్య జరిగే జీవనపోరాటం***
***భవిష్యత్ ఆశ, వర్తమానం కోరిక, గతం తపన***
***ఆంజనేయుని పదములు వర్తమానమైతే, ఆచరణే భవిష్యత్తు***
***గతాన్ని వదిలి, గతుకుల దారిని విడచి***
***వీరాంజనేయుని పథమ్మును ఎంచుకుని***
***ఎన్నడూ వీడని ఆత్మపుత్రులై***
***అంజనీతనయుని మార్గంలో నడవండి***
***నా చిన్నారి ముద్దుబిడ్డలారా!***

ఓం

**10-10-2019** 08:40 AM

**215) సమత్వంతో కూడిన జీవితాన్ని ఏ విధంగా అనుభవించవచ్చు స్వామీ?**

*నేను ఒకసారి లోకసంచారం చేస్తూ, కావేరి నదీతీరాన్ని చేరాను. అచట ఒక ముని కన్పించాడు (అతని కోసమే వెళ్ళాను). అతను దుమ్ముకొట్టుకుపోయిన దేహంతో నేలపై శయనించి వున్నాడు. అయితే, అతని శరీరం ధూళితో నిండివున్నా అద్భుత తేజస్సుతో అలరారుతుంది. ఏ మాత్రం పోషణ లేకపోయినా, పసిడికాంతుల్ని వెదజల్లుతుంది. అలా కొండచిలువలా నిర్వికారంగా నేలపై పడుకొనివున్న ఆ మునిని సమీపించి భక్తి ప్రపత్తులతో నమస్కరించాను. ఆ తర్వాత "మునీశ్వరా! నీవు అసామాన్య అద్భుతమూర్తివి. ఏ ప్రయత్నమూ, ధనభోగాలు లేకుండానే, కటికరాతినేలపై పడుకుని నిద్రించే నీకు ఇంతటి సుందరదేహం ఎలా వచ్చింది? పైగా ఎవరినీ దూషించవు, ఎవరినీ భూషించవు. సమదృష్టిని అలవరచుకున్న స్థితప్రజ్ఞుడవు. ఇటువంటి నీవు ఇలా రోజూ నిద్రలోనే ఎందుకు గడుపుతున్నావు?" అని ప్రశ్నించాను. మధురమైన నా మాటలకు ఆ ముని ఆనందపరవశుడయ్యాడు. ఆ తర్వాత సమాధానమిస్తూ, "పుణ్యాత్మా! నేను కూడా గతంలో భౌతికసుఖాల కోసం పరుగులు పెట్టినవాడినే, కర్మబంధాల్లో చిక్కుకుని సంసారచక్రంలో పరిభ్రమించినవాడినే. ఆ ప్రయాసలో నానా జన్మలెత్తి అలసిపోయాను. కోరికలవల్ల మనిషికి కష్టాలు, కన్నీళ్ళే తప్ప శాశ్విత ఆనందమెప్పటికీ లభించదని అర్థం చేసుకున్నాను. ప్రాణం మీద, ధనం మీద ప్రీతి వున్నవాళ్ళను భయం వెంటాడుతుందని తెలుసుకున్నాను. శోకం, మోహం, భయం, క్రోధం, రాగం,*

శ్రమ తదితరమైనవన్నీ కోరికల వల్లనేనని నిర్ధారించుకున్నాను. అంతేకాదు, ఈ లోకం పోకడ ఇంకొంచెం చెబుతున్నాను, వినండి." అంటూ ఇలా వివరించాడు. "తేనెటీగలు కూడబెట్టిన తేనె ఇతరుల పాలైనట్లు, లోభులు సంపాదించిన ధనం కూడా పరులకు ప్రాప్తిస్తుందే తప్ప సంపాదించిన వారికి ఉపయోగపడదు. లభించినదే తిని, కదలకుండా పడి వుంటే, పెనుబాము కూడా చాలాకాలం బ్రతుకుతుంది. నేను చిరకాలం ఒక కొండచిలువను పరిశీలించి, ఈ నీతిని నేర్చుకున్నాను. అందుకని, నేను ఇలా ఏకాంతవాసం చేస్తున్నాను" అన్నాడు. అలా ఆఖరుకు తన జీవనసుత్రాన్ని చెబుతూ, "కొండచిలువ, తేనెటీగ నాకు గురువులు. వాటి దగ్గర నేను పాఠాలు నేర్చుకుని, నిశ్చింతగా ఈ నిర్జన ప్రదేశంలో కర్మబంధాల గందరగోళం లేకుండా మునివృత్తిలో ఇలా జీవిస్తున్నాను" అని స్పష్టం చేశాడు. ఇలా ప్రియాప్రియాలకు అతీతంగా జీవించేవారు సర్వత్రా పూజలు అందుకుంటారు. వ్యక్తి హుందాతనం అతనికి ప్రాప్తించిన కష్టసుఖాల్లోనే అని తెలుసుకోవచ్చు. ఆ పరీక్షల్లో నెగ్గినవారే స్థితప్రజ్ఞులు. ప్రియమైంది ప్రాప్తించినప్పుడు దుఃఖం కలగదు. అప్రియం ఎదురైనప్పుడు మిక్కిలి భయం కలుగుతుంది. ఇది సామాన్యుల లక్షణం. ఈ ద్వంద్వాలకు అతీతులైనవారు మహాత్ములు. అలాంటి వారికి నా నమస్కారం అంటాను. ఈ ప్రపంచంలో అత్యధికులు ఆ తేనెటీగల్లాగే బ్రతుకుబండిని నెట్టుకొస్తున్నారు. ఎందుకు పరుగులు పెడ్తున్నారో, ఎవరికోసం ప్రోగుచేస్తున్నారో కూడా ఆలోచించలేనంత ప్రయాసపడుతున్నారు. చెట్టుపై పెట్టిన తేనెతెట్టెలోంచి ఆ జుంటీగ తన జీవితకాలంలో ఒక్క బిందువు కూడా ఆస్వాదించదు. అయినా బ్రతికినన్నాళ్ళూ క్షణం తీరిక లేకుండా ఆ కొమ్మ, ఈ కొమ్మ తిరిగి పూలలోని మకరందాన్ని తెచ్చి తెట్టె కడుతుంది. ఆనక ఏదో ఒకరోజు కన్నుమూస్తుంది. చివరకు ఆ మకరందం మరెవరిపాలో అవుతుంది. సంపదలపై వ్యామోహంతో పరుగు పెట్టే సామాన్య మానవుని పరిస్థితి కూడా ఆ జుంటీగ లాంటిదే. ఇక కొండచిలువ వనమంతా ఏమీ తిరగదు. ఎక్కువ ఆరాటపడకుండా తనకు లభించిన దానితోనే బ్రతికేస్తుంది. అందుకే ఆ ముని తేనెటీగను చూచి 'ఎలా వుండకూడదో' నేర్చుకున్నాడు, కొండచిలువను చూచి 'ఎలా వుండాలో' నేర్చుకున్నాడు. అంతే కాకుండా, నేను వేసిన ప్రశ్నకు మరింత వివరంగా సమాధానమిచ్చాడు. "లేదని నేను ఎవరినీ యాచించను. లభించలేదని చింతించను. పరులు ఏదైనా పంపితే, దానిని కాదనను, ఏదీ మానను, ఏదీ కోరను. ద్వేషం లేదు, ప్రేమ లేదు, సుఖం లేదు, దుఃఖం లేదు. ఇలా జీవితాన్ని లీలావినోదంగా గడుపుతున్నాను" అన్నాడు. ఆ ముని మాటలు కేవలం పురాణ పలుకులుగా కొట్టిపారేసేవి కావు. నేటి కాలానికి ఆ వాక్కులు అమృతగుళికలు. జీవితాన్ని సరళం చేసుకోవటానికి, ఎలాంటి ఒత్తిళ్ళు లేకుండా ఈ జీవనం నుంచి నిష్క్రమించటానికి ముని చెప్పిన సూత్రం శిరోధార్యం. ప్రతి జీవి ప్రశాంతంగా మనుగడ సాగించటానికి పరమాత్మ ప్రకృతి రూపంలో మీకు అన్నీ సిద్ధంగానే వుంచాడు. కానీ మీరే, వికృతమైన కాంక్షలతో బ్రతుకును భారం చేసుకుంటున్నారు. ప్రత్యేకంగా మీకు ఏ కాంక్షలు లేనప్పుడు, ఎవరి నుండి ఏమీ ఆశించనప్పుడు, రాగద్వేషాలు కూడా వుండవు. అందుకే చెబుతాను, ఈ లోకంలో మీరు ఎలాంటి నిరాశకూ లోనుకాకుండా నిశ్చింతగా వుండాలంటే, ఎవరి నుంచి ఏమీ ఆశించకండి. అప్పుడే ఎలాంటి తేడాలు లేకుండా అందరినీ ప్రేమించగలరు. మీరు పరులను ఎవరినీ నిందించకండి, ఎవరినీ స్తుతించకండి. ఎన్ని కష్టాలు వచ్చినా బాధపడకండి, ఎన్ని సంపదలు వచ్చినా ఆనందపడకండి. ఎప్పుడూ నిశ్చింతగా, సంతృప్తిగా వుండటం అభ్యాసం చేసుకోండి. ఈ విధంగా ఏ

కోరికా లేకుండా వుండాలి. ఆ ముని కొండచిలువలాగా కళ్ళు మూసుకుని భావం భగవంతుని మీద అంటే, పాదపద్మములపై కేంద్రీకరించి అలా వుండిపోయాడు. ఆత్మానందంలో ఓలలాడాడు. అందుకే తనంత తానుగా ఈ శరీరాన్ని పోషించలేకపోయినా, ఆ సర్వేశ్వరుడు అన్నీ ఆయనకు సమకూర్చాడు. ఆ కారణంగానే ఈ దేహంలో అంత తేజస్సు. అంటే సోమరితనాన్ని పెంచుకొమ్మని కాదు, నీ నిజతత్త్వాన్ని తెలుసుకోమని చెబుతున్నాను.

***తప్పు, అడుగుల్ని చూపులతో, చేతలతో సరిదిద్దేవాడు గురువు, సద్గురువు.***
***మహోన్నతమైన గురుస్థానాన్ని అధిష్టించి జ్ఞానదానం, విద్యాదానం చేస్తూ,***
***సకలజనుల జీవితాలకు విద్యావికాసాలను అందిస్తున్న***
***ఈ ఆంజనేయుని వైనం గుర్తించి,***
***కృతజ్ఞతాభావంతో కూడిన ప్రణామాలు ఈ పవనకుమారునకు అందించి,***
***మహితాత్మ స్వరూపమైన ఈ గురుని చేరి జన్మకర్మలను నివృత్తి చేసుకుంటూ,***
***అవిజ్ఞాన, అవిద్యలను దూరం చేసికొని,***
***త్రిమూర్తిస్వరూపమైన గురుని చేరి సుఖశాంతులను బడయండి***
***నా చిన్నారి ముద్దుబిడ్డలారా!***

*సంకల్పాన్ని వదిలితే, కోరికలయందు ఆసక్తి పోతుంది.*
*కోరికలను వదిలితే, క్రోధం అదృశ్యమవుతుంది.*
*అర్థం అనర్థమని భావిస్తే, లోభం పోతుంది.*
*వివేకం కలిగితే, శోకమోహాలు నశిస్తాయి.*
*--- ఆంజనేయుడు*

**ॐ**

## ఊటీ

**13-10-2019** 10:10 AM

మీరు కూర్చునే ఈ గదినే ఆధ్యాత్మికంగా ఆలోచించండి. ఇటుక నామస్మరణ. దానిని ప్రేమ అనే జలంతో తడపండి. స్మరణ అనే ఇసుక, నమ్మకం అనే సిమెంటు రెండూ కలిపి, మధ్యనపెట్టి, ఇటుకపై ఇటుక పేర్చి గోడ నిర్మించాలి. దానిపైన దైవప్రేమ, నమ్మకం అనే ప్లాస్టరింగ్ చేయాలి. ఆపైన దైవవిశ్వాసం అనే రూఫ్ మీర నివసించడానికి అనుకూలత ఏర్పడుతుంది. ఆ నాలుగు గోడల మధ్య, లోపల అంతా చల్లదనము ఏర్పడుతుంది. ఆ చల్లదనమే శాంతి. అంతర్శాంతి అనే ఆలయంలో శాంతి దొరుకుతుంది. అంతర్యామిగా అంతర్వాహిని అంతర్శంతిలో లీనమై, ఆత్మానందాన్ని అనుభవిస్తాడు జీవుడు. జీవి-జీవేశ్వరుల సంగమం సంయుక్తంగా జరిగి, సాధనాసంతృప్తితో పరమపదమైన శాంతి లభ్యమవుతుంది.

ఓం

**18-10-2019** 08:50 AM

**216) ఆంతరంగిక ప్రయాణం మరియు తీర్థయాత్రలకు ఉన్న వ్యత్యాసము ఎట్టిది స్వామీ?**

*మీకు కస్తూరీ మృగం గురించి తెలిసే వుంటుంది. కస్తూరీ మృగం అంటే ఒక రకమైన జింక. తరుణం అంటే సమయం వచ్చినప్పుడు దాని బొడ్డు నుంచి ఒక రకమైన ద్రవం ఊరుతూ వుంటుంది. అది మంచి మదపు వాసనగా వుంటుంది. అప్పుడు ఆ వాసన ఎక్కడ్నుంచి వస్తున్నదా అని ఆ జింక వెదకటం మొదలుపెడ్తుంది. ఆ వాసన తన వద్ద నుండే వస్తున్నదని అది గ్రహించలేదు. ఆ అన్వేషణలో అలా అడవి అంతా తిరిగి తిరిగి చివరకు ఏదో ఒక పులి నోట్లో అది పడిపోతుంది, ప్రాణాలు కోల్పోతుంది. ఇది మీ అందరికీ తెలిసిందే. అలాగే, మనిషి కూడా తనలోనే వున్న ఆత్మను తెలుసుకోలేక, లోకమంతా వ్యర్థంగా ఇలాగే తిరుగుతూ వుంటారు. కానీ, ఆ తిరిగే సమయంలో తన్ను తాను మరువక, దానిని జ్ఞప్తి యందుంచుకున్నచో, ఫలితం తప్పక దక్కుతుంది. లేనిచో పుణ్యక్షేత్రాలకు, తీర్థయాత్రలకు వెళ్ళి అనవసరంగా తిరిగి డబ్బును, కాలాన్ని వృధా చేసుకుంటూ వుంటారు. అటుల జరిగినట్లైతే, వాటివల్ల పెద్ద ఆధ్యాత్మిక ఉపయోగం ఏమీ వుండదు. ఒక చిన్న విషయం చెబుతాను. పాండవులు తీర్థయాత్రలకు వెడుతూ, శ్రీకృష్ణుడ్ని తమకు తోడుగా రమ్మని పిలుస్తారు. సాక్షాత్తు భగవంతుడైన శ్రీకృష్ణునికి తీర్థయాత్రల అవసరం ఏముంది చెప్పండి. ఆ సంగతి మాయామోహితులైన పాండవులకు తెలియదు. కనుక, కృష్ణుని కూడా తమలాగే మామూలు మానవుడిగా భావించి తీర్థయాత్రలకు రమ్మని ఆహ్వానిస్తారు. ఆయన ఒక చిరునవ్వు నవ్వి, వారికొక దోసకాయ ఇచ్చి, "నా ప్రతినిధిగా దీనిని తీసుకువెళ్ళి, మీరు మునిగిన ప్రతి గంగలోనూ దీనిని ముంచండి" అని చెబుతాడు. వారు అలాగే చేసి, తీర్థయాత్రలు ముగించి తిరిగి వస్తారు. మీకులాగే ఒకరు వారం రోజులు, ఒకరు రెండు మాసాలు ముగించుకుని వచ్చారు. దీని వలన మీలో ఏమైనా మార్పు వచ్చినదా? ఎవరికి వారే ఆలోచించుకోండి. మీరు చేరదలచిన గమ్యానికి చేరువ కావటానికి కొంచెమైనా సహజసిద్ధమైన మార్పు వచ్చినదా? నేనైతే, లేదనే స్పష్టంగా చెబుతాను. అలా తిరిగి వచ్చిన పాండవుల కోసం ఏర్పాటుచేసిన విందులో అదే దోసకాయతో వంటకం చేయించి వారికి వడ్డింపచేస్తాడు కృష్ణుడు. ఆ వంటకం పరమచేదుగా వుంటుంది. "అదేంటి బావా? ఇది చేదు దోసకాయ. కటిక విషంలా వుంది. ఇలాంటి వంటకం చేయించావేమిటి?" అని అడుగుతారు. దానికి కృష్ణుడు నవ్వి, "బావా! ఎన్ని గంగలలో మునిగినా, ఆ దోసకాయ చేదు పోలేదు చూచావా?" అని అంటాడు. అలాగే, మిమ్మల్ని తీసుకువచ్చి క్షేత్రాలను మార్చినా, క్షేత్రజ్ఞుడ్ని తెలుసుకునే ప్రయత్నమే జరుగుటలేదు. ఈ క్షేత్రాన్ని ఎన్ని క్షేత్రాలకు తిప్పినా, అది దాని రుచిని మార్చుకోలేదు. అందుకే క్షేత్రాలకు వెళ్ళినప్పుడు మనిషి ప్రయాణం బయటకు కాదు, లోపలకు జరగాలి. యాత్ర అనేది బయటకు కాదు, అంతరికయాత్రను మనిషి చేయాలి. మనిషి ప్రపంచమంతా తిరిగినా, చివరకు ఆధ్యాత్మికంగా ఏమీ సాధించలేడు. అదే తన లోనికి తాను ప్రయాణం చేస్తే, ఉన్న గదిలో నుంచి కదలకుండా, జ్ఞానాన్ని పొందవచ్చు. అయితే, వెళ్ళిన చోట ఆధ్యాత్మికమైన ఆలోచనలు సలిపి, అంతరంగ ప్రయాణం సల్పినట్లైతే, వెళ్ళిన ప్రయాణానికి పరమార్థం ఏర్పడుతుంది. రెండు నెలలు వెళ్ళినా స్థలమార్పిడి, వారం వెళ్ళినా స్థలమార్పిడి. స్థలమార్పిడితో*

అవస్థ మార్పు చెందాలి. ఒకచోట కూర్చుని నిశ్చలంగా నామాన్ని జపిస్తూ, జ్ఞానసిద్ధిని పొందాలి అని చెబుతాను. అయితే, మీకు ఒక అనుమానం రావచ్చు. తీర్థయాత్రల వల్ల నిజంగా ఉపయోగం లేకుంటే, అసలు వీటిని ఎందుకు పెట్టారు? అని అనుకున్నట్లైతే, సరియైన భావంతో ఒక తపస్సులాగా యాత్ర చేస్తేనే, ఆ ప్రయోజనం సిద్ధిస్తుంది. అంతేగానీ, ఒక గుంపుతో కలిసి పిక్నిక్ వెళ్ళినట్లు వెళ్ళి ఫోజులిచ్చి ఫోటోలు తీసుకుంటూ, ఎకసెక్కపు మాటలు మాట్లాడుకుంటూ, షాపింగ్‌లు చేస్తూ, ఎక్కడబడితే అక్కడ ఏ తిండిపడితే ఆ తిండి తింటూ, సరదాగా జల్సా చేసేవాళ్ళకు తీర్థయాత్రల వల్ల ఏ ఫలితం రాకపోగా, ఘోరమైన పాపం చుట్టుకుంటుంది. పదిమందీ గుంపుగా కలసివెళ్ళినా, ఎవరికివారు ఒంటరిగా తమవంతు సాధనను కొనసాగించగలిగి వుండాలి. అందుకే ఒకరిని ఒంటరిగా, ఒకరిని పదిమందితో కలిపి పంపాను. ఇద్దరిదీ ఒకే రకంగా వుంది. ఒక్కరున్నా ప్రాకృతమైన విషయాలోచనే, పదిమంది అయినా ప్రాకృతమైన విషయాలోచనే. దీనిని మార్చుకోండి. ప్రాకృతమైన పరిధి నుండి అప్రాప్యమైన ప్రాకారాన్ని ఛేదించండి. అంతరంగంలో వున్న దైవత్వాన్ని గుర్తించి జీవిత పరమార్థం నెరవేర్చుకోవడానికి ప్రయత్నం చేయండి. దానికి నీ గురించి నీవు తెలుసుకునే ప్రయత్నం చేస్తే చాలు.

మీకు మీరు చాలా ఆధ్యాత్మికపరులమని అనుకుంటారు. ఎందుకంటే, దినపత్రికను దినమంతా, వారపత్రికను వారమంతా, మాసపత్రికను మాసమంతా, ఆంజనేయుని బోధలను అనుదినం చదువుతూనే వుంటారు గదా... అందుకని!

***కోర్కెలు తీరాలనుకోవటం తప్పు కాదు,***
***అవి ఇతరుల కష్టాలకు కారణం కారాదు.***
***ఓ బాంధవా! ఆశలు పెంచుకోవటం ముప్పు కాదు,***
***అవి ఎవరినీ మోసాలకు గురి చేయకూడదు.***
***ఓ నేస్తమా! అధికారం అందుకోవడం నేర్పు కాదు,***
***అది సేవా సహకారాలకు సాధనంగా మారాలి.***
***ఓ మిత్రమా! అందంగా మాట్లాడటం కూర్పు కాదు,***
***అది ఆదర్శపు చేతలకు దారి తీసి చూపాలి.***
***ఓ సోదరా! జ్ఞానం సాధించడం గొప్ప కాదు,***
***అది సమాజ మనుగడకు సోపానంగా నిలవాలి.***
***ఓ భక్తా! విధేయత పొందాలి, అహంకారం చావాలి.***
***అది వీరాంజనేయుని చేరు మార్గం కావాలి.***
***ఓ సాధకా! సాధించదలచుకున్నది అంతరంగమని గుర్తించాలి,***
***ఆంజనేయుని పథమ్మున నడవాలి.***
***నడచిన దారిన అలుపు రానివ్వక,***
***ఆగక, నిలువక, నిస్తేజమైన జీవనాన్ని వదిలి,***
***ఆనందమయమైన అంతరంగవాసుడ్ని గుర్తించి,***

***ఆంజనేయుని బిడ్డలుగా అంతరంగవాసులై,***
***ఆత్మారాముని స్తుతిస్తూ సర్వజన సమ్మోహులై,***
***సర్వజన రంజకంగా, స్ఫూర్తిదాయులై,***
***శ్రీరామ రాజ్యదాయులై చిరకాలం వర్ధిల్లండి***
***నా చిన్నారి ముద్దుబిడ్డలారా!***

ఓం

**19-10-2019** 08:40 AM

**217) సునాయాస మరణం పొందాలంటే ఏమి చేయాలి స్వామీ?**

*జీవించడం ఒక కళ అని మీరందరూ భావిస్తారు. నిజానికి మరణించడం కూడా ఒక కళే. అనాయస మరణం, సునాయాసంగా రాదు. అంటే, మీరందరూ అనాయాస మరణాన్ని కోరుకోవాలి. అలా కోరుకున్నప్పుడు, మీరు అందుకు ఏం చేయాలో ఆలోచిస్తారు. ఏ విధంగా మీరు జీవితాన్ని తీర్చిదిద్దుకుంటే మీకు అనాయాస మరణం ప్రాప్తించే అవకాశం వుందో చూస్తారు. మీ చావు-పుట్టుకలకు మీ కర్మలే కారణం. మీ కర్మలలో కొంత మంచి వుంది, కొంత చెడు వుంది. కేవలం మంచి కర్మయే వుంటే మనిషిగా పుట్టడు, దేవతగా దేవలోకంలో వుంటాడు. మంచి కర్మను కూడా దాటితే, శాశ్వితపదాన్ని పొందుతాడు. మీరు ఇక్కడ మానవరూపంలో ఉన్నారంటేనే కొంత మంచిచెడులతో వున్నారనే. భగవంతుడు మీకు ప్రసాదించిన వివేకబుద్ధిని ఉపయోగిస్తూ, ప్రారబ్ధవశాత్తు ఒనగూడిన సంస్కారాల సంచిలో మీకు బంధకారక కర్మను ఇంకా పెంచటానికి కారణభూతమయ్యే సంస్కారాలేవో చూచుకోవాలి. వాటి వ్యక్తీకరణను నిగ్రహించాలి. నిజానికి వాటిని నిగ్రహించడానికి మీ శక్తి చాలదు. ఈ శక్తిని పెంచుకోవటానికి ఉపయోగపడే ప్రక్రియనే తపస్సు అంటారు. కోరికలను నిగ్రహించటం ద్వారా మీ సంస్కారాలు కొంత మీ అదుపులోకి వస్తాయి. అందుకు ముందు మిమ్మల్ని మీరు విశ్లేషించుకొని, మీ బలహీనతలను గ్రహించాలి. కానీ, మీలో చాలామంది మీకు సంక్రమించిన సంస్కారాలన్నీ మంచివే అనుకుని స్వభావానికి అనుగుణంగానే వెళ్తుంటారు. కానీ, అది సరియైన అవగహన కాదు. మీ కర్మలకు మీరు బాధ్యులు. తెలిసి చేసినా, తెలియక చేసినా కర్మఫలాన్ని అనుభవించక తప్పదు. వాల్మీకిగా పరివర్తన చెందిన రత్నాకరుడి కథ మీ అందరికీ తెలిసిందే. జాగ్రత్తగా పరిశీలిస్తే, ఆ కథ మీకు గొప్ప పాఠాన్ని నేర్పుతుంది. ప్రారబ్ధకర్మవశాత్తు రత్నాకరుడు ఒక దొంగగా మారాల్సి వచ్చింది. అడవిమార్గం గుండా వెళ్ళేవాళ్ళపై దాడి చేసి, వాళ్ళను కొట్టి, హింసించి కొన్నిసార్లు చంపి, కుటుంబాన్ని పోషిస్తూ వుండేవాడు. ఒకరోజు అటుగా వెళ్తున్న నారదాది మునులను కూడా అదే విధంగా కొట్టి, చెట్టుకు కట్టేసి, వాళ్ళ దగ్గర వున్నది దోచుకోవాలనుకున్నాడు. ఆ తంతు చూసిన మునులు రత్నాకరుడ్ని చూసి చాలా జాలిపడుతూ, "ఓయీ కిరాతకుడా! నీకు హృదయం వుందా? ఇంత మందిని హింసించి నిరాశ్రయులను చేసి బ్రతకాలనుకుంటున్నావు. చాలా పాపాన్ని మూటగట్టుకుంటున్నావు. ఇలాంటి కర్మకు పర్యవసానం చాలా భీకరంగా వుంటుంది. నీవు ఎవరి కోసం ఇదంతా చేస్తున్నావు?" అని ప్రశ్నించారు. తన*

కుటుంబాన్ని పోషించటానికి చేస్తున్నానంటాడు. అప్పుడు, "మరి నీ పాపంలో వారు పాలుపంచుకుంటారా?" అని అడుగుతారు మునులు. రత్నాకరుడు ఒక నిముషం ఆలోచించి, తాను ఇదంతా వాళ్ళ కోసం చేస్తున్నప్పుడు, వాళ్ళు తప్పక కొంత పాపాన్ని స్వీకరిస్తారనుకుంటాడు. ఐనా, అడిగి వస్తానని తన ఇంటికి వెళ్ళి భార్యాపిల్లలను అడుగుతాడు. "నేను పాపవృత్తిలో వుండి, మిమ్మల్ని పోషిస్తున్నాను. మీరు నా పాపంలో కొంతభాగం స్వీకరిస్తారా?" అని అడగ్గా, అప్పుడు వారందరూ, నీ పాపంతో మాకేమి పని? తండ్రిగా, భర్తగా నీ బాధ్యతను నెరవేరుస్తున్నావంటారు. అప్పుడు రత్నాకరుడికి వైరాగ్యం సంప్రాప్తించి, ఆ మునులను జీవన సాఫల్యానికి మార్గాన్ని చూపించమంటాడు. తర్వాత జరిగింది మీ అందరికీ తెలిసిందే. అయితే, తమను హింసించినా ఎలాంటి ప్రతీకార వాంఛ లేకుండా ఆ స్థితిలోనూ కిరాతకుడిని చూచి జాలిపడటం ఆ మహామునుల ఔదార్యానికి నిదర్శనం. అలాంటి సాధుసాంగత్యం ఎలా వుంటుందో రత్నాకరుడు చూడగలిగాడు. అలాగే పాషాణ హృదయుడైన రత్నాకరుడు కూడా చేసిన పాపకర్మకు ఫలితం అనుభవించాల్సి వస్తుందన్నప్పుడు, ఆ వాదనను తిరస్కరించలేదు. అంటే, ఆ సంగతి తనకూ తెలుసునన్నట్లు ప్రవర్తించాడు. ఘోరమైన వృత్తిలో వున్నప్పటికీ, పూర్తిగా వివేకాన్ని కోల్పోలేదు. అంతమాత్రం విచక్షణ వుంది. ఇది వుంటే, ఏదో రోజు మనిషి ఇంకో వ్యక్తి ద్వారానో, సంఘటన ద్వారానో మారటానికి అవకాశముంది. లేకపోతే కేవలం తన సంస్కారాల ప్రాబల్యానికి పూర్తిగా లోనై, దుష్ట సంకల్పాలను త్రుంచటానికి పూనుకోకుండా జీవితాన్ని సాగించినట్లైతే, నేడో రేపో ఫలాన్ని అనుభవించక తప్పదు. మనుషులు విస్మరిస్తున్న విషయమేమంటే, మరణం కూడా తమ చేతుల్లో లేనిదని. మీరు చేసిన కర్మల ఫలాలను అనుభవింపచేయటానికి ప్రకృతి దగ్గర అనేకానేక పద్ధతులు వున్నాయి. దుష్కర్మఫలం మీకు రోగం, ఆప్తుల వియోగం, బాంధవ్యాలు చెడిపోవటం, సంతానం అప్రయోజకులుగా మిగలటం, క్రుంగుబాటు, నిరంతర ఆందోళన ఇలా ఎన్నో రకాలుగా ప్రకృతి మీచేత కర్మఫలాన్ని అనుభవంపచేస్తుంది. ఇదంతా మిమ్మల్ని భయపెట్టుటకు చెప్పటం లేదు, మీరు బాధ్యతాయుతంగా ప్రవర్తించటానికి చెప్పాను. మీకు మానవజీవిత లక్ష్యమైన మోక్షానికి మార్గం సుగమం చేయటానికి మహాతత్త్వవేత్తలైన ఋషులు కనుక్కున్న మహానియమం. మీ చట్టాల నుండి తప్పించుకోవచ్చునేమో గానీ, భగవంతుడు చేసిన చట్టమైన ఈ కార్యక్రమం నుండి ఎవరూ తప్పించుకోజాలరు. అందుకని, బాధ్యత లేకుండా ప్రవర్తిస్తూ, నిరంతరం అవినీతితో దోచుకుంటున్న వ్యక్తులపట్ల జాలిపడాలి. వారు అలా సంపాదించిన సంపాదనను అనుభవించలేరు. ప్రకృతి వారిని అనుభవించనీయదు. మరణం కూడా తమ చేతుల్లో లేదని తెలుసుకున్నప్పుడు మనిషి విచక్షణతో వ్యవహరిస్తాడు. చేసిన పనికి ఈ జన్మలో ఎంత ప్రతిఫలం అనుభవించాలో అది అనుభవించే వరకు శరీరం నుండి ప్రాణం పోదు. అందుకనే, సునాయాస మరణానికి ప్రయత్నం చేయాలి. అది రావాలంటే, ధర్మానురక్తి కావాలి. నరకయాతనతో శరీరం నుండి ప్రాణం పోకూడదు. చివరి శ్వాస వరకు సంతోషంగా వుండి, ఎలాంటి బాధనూ అనుభవించకుండా ఈ దేహయాత్ర చాలించాలని కోరుకుంటేనే, మీకు సత్కర్మాసక్తి పెరుగుతుంది. ధర్మబద్ధమైన జీవితం రుచిస్తుంది. శక్తి కొలది పుణ్యకార్యాలు చేయాలనిపిస్తుంది. ధ్యానం, భగవన్నామస్మరణ, పరోపకారం లాంటి సాధనలు మీకు ప్రీతికరమవుతాయి. జీవితకాలంలో అందరితో పుణ్యాత్ములని అనిపించుకోవాలన్న కోరిక కలుగుతుంది. అంటే, అలా అనిపించుకోవటానికి పుణ్యకార్యములు చేయమని కాదు, ఏ కోరికా లేకుండా

లోకకళ్యాణానికి ప్రయత్నించగలిగితే మంచిదే. అలా చేయలేనప్పుడు, కనీసం ఇలాంటి ఉత్తమకోర్కెను పెట్టుకొనైనా పుణ్యకార్యాలు ఆచరించాలి. బ్రతికుండగనే సాధ్యమైనంత పుణ్యం మూటగట్టుకోవాలి. వ్యక్తి చనిపోయిన తర్వాత బంధువులు తన పేరు మీద దానధర్మాలు చేసి తనకు పుణ్యాన్ని పెంచడం కాకుండా, జీవితకాలంలోనే ఎవరికి వారు తమ శక్తికొలది సత్కార్యాలను ఆచరించటానికి ప్రయత్నించాలి. అందుకనే, మరణించడమూ ఒక కళే. ఈ కళలో నిష్ణాతులైతే, జీవితం సాఫీగా సాగుతుంది. ఎందుకంటే, ధర్మాచరణ అప్పుడు మీ స్వభావమవుతుంది. మీ ఆనందం అంతా అందులోనే వుంటుంది. ఈ కళను మీరు విస్మరిస్తే, జీవితం బహు సంక్లిష్టమవుతుంది. ఏ విధంగా దూడ వెయ్యి ఆవుల మధ్య కూడా తన తల్లిని కనుక్కుంటుందో, అలానే వ్యక్తి చేసిన కర్మఫలం అతడినే అనుసరిస్తుంది. అందుకనే, కర్మలను ఎరుకతో చేయడం నేర్చుకోవాలి. పర్యవసానం వుంటుందని గ్రహించి, ఇతరులను బాధపెట్టే దుష్కర్మలకు దూరంగా వుండాలి. స్వ-పర భేదాన్ని తగ్గించుకోవాలి. సర్వసమభావం, విశ్వమానవప్రేమను పెంచుకోవాలి. నిరాడంబర జీవితానికి పెద్దపీట వేయాలి. భీష్మపితామహుడు తాను అంపశయ్యపై పరుండి, కృష్ణానుగ్రహం వలన ఆ బాధావిముక్తుడయ్యాడు. కానీ, తాను పూర్వ శరీరాలతో చేసిన ఏ పాపకర్మ వలన తనకు ఈ దుస్థితి కలిగిందో తెలుసుకోవాలనుకుంటాడు. ఒక వందజన్మలు వెనక్కి చూచి, ఏ జన్మలోనూ ఏ పాపం చేసినట్లు కనిపించకపోయేసరికి, కృష్ణుడ్ని అడుగుతాడు. అప్పుడు జనార్దనుడు భీష్ముడితో, "ఇంకో జన్మ వెనక్కు చూడు భీష్మా! ఇంతకు ముందు నూటొక్క జన్మల క్రితం ధరించిన శరీరంతో, నీవు ఒక సర్పాన్ని కేవలం క్రీడా వినోదంతో తోకను పట్టుకుని, ఒక ముళ్ళచెట్టుపై వేశావు. అది ఆ ముళ్ళ చెట్టు నుండి బయటకు రాలేక కదిలినప్పుడల్లా శరీరాన్ని ముళ్ళు చీరగా, నరకయాతన అనుభవించి మరణించింది. ఆ కర్మ పర్యవసానమే నీకు ఈ అంపశయ్యావాసం" అంటాడు. కర్మసిద్ధాంతం భగవంతుడి చట్టం. ఎవరి దుఃఖానికి, సుఖానికి వారే బాధ్యులు. దీని అర్థం, ఎవరన్నా దుఃఖంలో వుంటే, ఎలాంటి సహాయహస్తం అందించకుండా మీరు మిన్నకుండటం కాదు. మీరు స్పందించి వాళ్ళను ఆదుకోవాలి. ఆదుకోవటానికి ప్రయత్నించాలి. మీరు రేపటి రోజున ఏమి అనుభవించబోతున్నారో మీకు ఏమి తెలియును? అందుకని, కర్మసిద్ధాంతాన్ని ఎప్పుడూ అర్థం చేసుకుంటూ, కష్టంలో వున్నవారికి సదా సహాయాన్ని అందిస్తూ, భగవత్ ప్రేమకు పాత్రులవ్వాలి.

**భానుని భగభగలతో వడలిన నేల కడలి నడిగింది**
**ఆకసానికి ఆవిరి సందేశమివ్వమని**
**ఆదిత్యుని తాపానికి అంబుధి సరేనంది**
**ఆవిరి కరిమబ్బై అవనిపై చిందులేయ**
**కురిసే ప్రతి చినుకు మెరిసే పసిడయ్యింది**
**బొట్టు బొట్టు సిరిముత్యై చెట్టు చేమలకు**
**తలంటు పోసి, బీడు పొలాలను తడిపింది**
**మరి ఈ ఆంజనేయుని బోధలు**
**నిర్వికల్ప సమాధియైన మీ సహస్రారాన్ని చీల్చి చెండాడి జారిన ధార అంతరంగాన్ని నింపి,**

***కలత చెందిన మీ మదిని కళకళలాడేలా చేసి,***
***కాంతులీనుతూ కపటము మాని, కర్కశము వీడి,***
***మర్కటము మాటలు చెవిన పెట్టి, మారుతిని చేరండి***
***నా చిన్నారి ముద్దుబిడ్డలరా!***

ॐ

**20-10-2019** 08:40 AM

**218) పరమాత్మ ప్రాప్తికి ఎటువంటి కర్మాచరణ ఆవశ్యకము స్వామీ?**

*సర్వశక్తిమంతుడైన సర్వేశ్వరుడు తన సంకల్పమాత్రాన సౌందర్యభరితమైన ఈ సృష్టిని సృష్టించిన తొలిరోజులలోనే "మానవజీవిత లక్ష్యమేమిటి?" అన్న ప్రశ్నను ఇచ్చారు. దానికి సమాధానంగా ఋషులు "పరమాత్మ ప్రాప్తి" అని సమాధానం ఇచ్చారు. దానితోపాటు ఆ పరమాత్మ ప్రాప్తికి అనుసరణీయమైన మార్గాలను కూడా సూచించారు. అయితే, ఈ సూచనలు మహర్షుల గంభీరమైన గళాల్లో దేవభాషలో ధ్వనించడం వల్ల, కాలగమనంలో ఆ సుస్వరాలు, ప్రాపంచికమైన రణగొణధ్వనులకు అలవాటుపడిపోయిన మీ శ్రోత్రేంద్రియములకు చేరకుండా వుండిపోయాయి. ఈ స్థితిని గమనించే, మీకు బోధించుటకు ఈ ఆంజనేయుడు కదలివచ్చి చెప్పుట ప్రారంభించాడు. మీకు అర్థమయ్యేలా చెప్పాలంటే, ఊరక ప్రాపంచిక వ్యామోహములకు, క్షణికమైన ప్రకృతి సంతోష సదుపాయములకు భ్రమచెందక, శాశ్విత సంతోష సదుపాయములను పొందగోరు మార్గమును వదులుకొనక, పారమార్థికమైన కర్మలను సంపూర్ణమైన ప్రేమతో చేయండి. శ్రద్ధ, పట్టుదల లేని కర్మలు ఎన్నియైననూ పరమార్థ జ్ఞానమును కలుగచేయవు. ప్రేమ వలననే శ్రద్ధ, శ్రద్ధ వల్లనే జ్ఞానము, జ్ఞానము వల్లనే పరమభక్తి, అట్టి పరమభక్తి కలవారికే పరమాత్మప్రాప్తి కలుగుతుందని చెబుతాను. పరమాత్మప్రాప్తికి కర్మాచరణ తప్పనిసరి. పరమాత్మప్రాప్తికి పారమార్థిక కర్మలు అనివార్యమని స్వయంగా నేనే చెబుతున్నా. కర్మాచరణ విషయంలో మానవుడు మాత్రం తనను తాను కొన్ని కొలమానాల చట్రంలో బిగించేసుకుని, అదే సరియైనదన్న భ్రాంతిలో కాలం గడుపుతున్నాడు. అంతేకాదు, ప్రాపంచికమైన సమస్త కర్మలనూ తనకు నచ్చిన విధంగా వర్గీకరించుకుంటూ, తాను ఆచరిస్తున్న కర్మలను తన వర్గీకరణకు అనుగుణంగా శ్రేష్ఠమైనవిగా నిరూపించుకునే ప్రయత్నం కూడా చేస్తున్నాడు. ఈ ప్రయత్నంలో కర్మల ఫలితాలను ముందుగానే అంచనా కూడా వేస్తూ, అత్యంత ఫలవంతమనిపించే కర్మలను దైవకర్మలుగా నిర్ధారణ చేసేసి, తనకు సంప్రాప్తించబోయే పుణ్యపరిణామానికి చాలా మురిసిపోతున్నాడు. ఈ మనస్తత్వమే మీ ఆలోచనల్లో పాపభీతి లేకపోవటానికి ముఖ్యకారణమని అర్థం చేసుకోండి. మానవుడు కర్మల వర్గీకరణ మానేసి, తాను చేస్తున్న సత్కర్మలను దైవప్రేరణగా భావించి కర్తృత్వాన్ని దైవార్పితం చేస్తే, అనంత కరుణాసముద్రుడైన దైవం భోక్తృత్వభావాన్ని మానవుడికి, అపరిమితానందానుభూతిగా అందిస్తాడు. లేకపోతే, నైరాశ్యం మాత్రం తథ్యం!*

*అయితే, దీనికి ఒక చిన్నకథ చెబుతాను. ధనశేఖర్, గృహనిర్మాణం చేయించే ఒక కాంట్రాక్టర్. అతని వద్ద ఎంతో మంది పనివారుండేవారు. వాళ్ళల్లో ధర్మయ్య అనే వడ్రంగి కూడా వున్నాడు. అతడు మంచి పనితనం వున్నవాడు. చక్కని నగిషీలతో ద్వారబంధాలు, తలుపులు, కిటికీలు చేస్తూ వుండేవాడు. చాలాకాలం పనిచేసిన తరువాత ఒకనాడు ఈ ధర్మయ్య యజమాని ధనశేఖర్ వద్దకు వెళ్ళి తాను ఇక పని చేయలేనని, అందువల్ల తనకు సెలవు ఇప్పించమని కోరాడు. అయితే, ధనశేఖర్ చిట్టచివరగా ఒక్క ఇంటికి అవసరమైన పని పూర్తిచెయమని ఎంతగానో కోరాడు. చేసేది లేక, ధర్మయ్య అలాగేనని ఒప్పుకున్నాడు. ఇష్టం లేకుండా పనిచేస్తే, అందులో నైపుణ్యంపాలు లోపిస్తుందని వేరే చెప్పనవసరం లేదు కదా! ధర్మయ్య మొక్కుబడి కోసం చేసినట్లుగా ఆ ఇంటి పనిని త్వరత్వరగా ముగించేసి, ధనశేఖర్ వద్దకు వెళ్ళి ఆ విషయం చెప్పాడు. ధనశేఖర్ వచ్చి, ఇంటిని ఒకసారి పరిశీలించి ఇంటికి తాళం వేసి ఆ తాళంచెవిని ధర్మయ్య చేతిలో పెడుతూ, "ధర్మయ్యా! ఇంతకాలం నువ్వు నా దగ్గర ఎంతో శ్రద్ధగా పనిచేసినందుకు ఈ ఇల్లు నీకు నా బహుమతిగా ఇస్తున్నాను" అన్నాడు. ధర్మయ్య మనసులోనే, "అయ్యో!" అనుకున్నాడు. ముందుగానే తెలిసివుంటే, తాను ఈ ఇంటిని చాలా అందంగా తయారుచేసి వుండేవాడు. ధర్మయ్య చేసిన 'పనివర్గీకరణ' పొరపాటే, చాలామంది చేస్తూ వుంటారు. మానవ మనస్తత్వంలోని ఈ బలహీనతను గమనించే, మానవులు నైరాశ్యానికి లోను కాకూడదనే భావంతోనే సర్వకర్మ భగవత్ ప్రీత్యర్థం అని చెప్పటం జరిగింది. భగవంతుడు ప్రీతి చెందేలా కర్మలనాచరించడం మాత్రం కష్టం కాదని ఎంతోమంది భక్తులు నిరూపించారు. బలిచక్రవర్తి ఇచ్చిన మూడడుగుల నేల, శబరి అందించిన ఫలాలు, గోపికల చేతి నవనీతం లాంటి వాటికే దైవం అపారమైన సంతృప్తి చెందాడు. భావప్రియుడైన దైవానికి ప్రీతి కలిగేలా కర్మలనాచరించడాన్ని కూడా అసిధారావ్రతంగా భావించడం అజ్ఞానానికే కాదు, అలసత్వానికి కూడా సంకేతమే. కర్మాచరణను తపస్సుగా భావిస్తే, అది ప్రేమతో ప్రారంభమై, చివరకు పరమాత్మప్రాప్తికి అవసరమైన పరమభక్తిగా పరిణమిస్తుంది. ఈ పరమభక్తి కలిగిన వారి ప్రవర్తన, చాలా విశిష్ఠంగా వుంటుంది. వీరు తమ కర్మలను దైవం నిరంతరం గమనిస్తూనే వున్నాడన్న ఎరుకతో చాలా జాగరూకతగా వ్యవహరిస్తూ వుంటారు. ఒక్కమాటలో చెప్పాలంటే, వీరు మూర్తీభవించిన సత్వగుణంగా భాసిస్తారు. అయితే, వీరికి భిన్నమైన ప్రవృత్తి కలిగినవారి సంఖ్యే ఎక్కువగా వుంటుంది. వీరిలో కూడా భక్తి వుంటుంది. కానీ, భగవంతుడు సర్వాంతర్యామియై సర్వకర్మలకు సాక్షిగా ఉన్నాడనే విషయం వీరికి సదా స్ఫురణలో వుండదు. అందువల్ల, వీరి వర్తనలో జాగరూకత కంటే నిర్లక్ష్యంపాలు ఎక్కువగా వుంటుంది. భక్తులలోని ఈ వైవిధ్యాలను సులభగ్రాహ్యంగా బోధిస్తే, భక్తిమార్గానువర్తనాభిలాషులైన వారికి మార్గదర్శకం కరతలామలకమౌతుందన్న భావంతో చెబుతున్నాను. మీరు నా సమక్షంలో ఒక రకంగా ప్రవర్తిస్తారు, పరోక్షంలో మరొకలా ప్రవర్తిస్తారు. వీళ్ళను మూడు విధాలుగా చెప్పవచ్చు. మొదటిరకం వాళ్ళు మెలకువగా అంటే, ఎరుకలో వుంటారు. వీరితో మీకు సంబంధం లేదు. రెండవవారు గాఢనిద్రలో అంటే, తమస్సులో వుంటారు. వీరిని మేల్కొల్పటం మొదటి తరహావారి కర్తవ్యం. ఇక మూడవతరహా రకం గాఢనిద్రలో వుంటారు. కానీ, మెలకువగా వున్నట్లు నటిస్తూ, అన్నీ తనకు తెలుసునంటారు. ఇలాంటి వాళ్ళను పట్టించుకోనవసరం లేదు. వీరు తమకు అన్నీ తెలుసునంటారు. కానీ, వీరికి భగవంతుడి గురించి*

*ఏమీ తెలియదు. వీరిని, ఆయన కూడా మార్చలేడు. ఎందుకంటే, వీరిది ఒక రకమైన ఆధ్యాత్మిక అహంకారం. ఇందుకు వివేకము లేని దౌర్బల్యమే కారణం. అట్టివారి యోచనలకు చోటివ్వక, వారితో వాదనలకు దిగక, అట్టి వారుండు స్థానమును వదిలి దూరముగా పోయి, వారి సాంగత్యము మాని, నీ మనసును పరమాత్మయందు సంపూర్ణానందము చిక్కునంత వరకు అందుకు తోడుగా వుండే భగవద్భక్తుల సంఘములో చేరి సదా సుఖించండి.*

***అరవై నాలుగు విద్యలూ నేర్చినా, అసంతృప్తియే మిగులుతుంది***
***ఆత్మవిద్య ఒక్కటి అభ్యసించిన చాలు, అఖండ శాంతి లభించును***
***అన్నీ తెలుసునన్న అజ్ఞానముతో అహంకారులై వుండకండి***
***మిమ్ములను మీరు గుర్తెరిగి నడిచినట్లైతే, మీ జన్మము సుకృతమగును***
***అందచందములను ఆకర్షించినట్లైతే, బందిఖానా జీవితమవుతుంది***
***అందాలొలికించే ఆత్మజ్ఞానమే, మీలోని సుందరమైన దేవుణ్ణి చూపుతుంది***
***ఆంజనేయుని మాటలు అతిశయోక్తి కాదు***
***అందలమెక్కిన జీవుణ్ణి అతి త్వరితముగా క్రిందకు దింపి***
***అహంకారాన్ని బాపి, అద్వైతమూర్తిగా మలచి***
***అభ్యున్నతిని సాధించు మార్గమును బోధించు***
***నా చిన్నారి బిడ్డలకు!***

*ర: వాహ్! క్యాబాత్ హై!*
*ఆ: కుఛ్ బాత్ హై!*

ॐ

**21-10-2019** 08:45 AM

## ఆంజనేయుని పరీక్షాకపత్రం

1. *ఆధ్యాత్మికత అంటే ఏమిటి?*

**జ: అధ్యయనం చేసి, ఆత్మ గురించిన కథ తెలుసుకుని, ఆచరణలో పెట్టి, తగు ఫలితాన్ని పొంది, ఆత్మానుభవాన్ని పొంది, అంతరంగశుద్ధితో జీవించడమే ఆధ్యాత్మికత. కృతజ్ఞతలు స్వామీ!**

2. *మీరు జీవించే జీవనవిధానాన్ని ఎలా మలచుకోవాలనుకుంటున్నారు?*

**జ: సడలని పట్టుదల, చెదరని విశ్వాసంతో, సాధించవచ్చన్న నిర్ణయంతో లక్ష్యాన్ని చేరుకోవచ్చు. అయితే, ప్రతిభకు మెరుగులు దిద్దుకున్నప్పుడు, నైపుణ్యాలను పెంపొందించుకున్నప్పుడే, అది సాధ్యమవుతుంది. అందుకు బలసేకరణ కూడా ముఖ్యం. అప్పుడే విజయకేతనం ఎగురవేయగలుగుతారు. ఈ విధంగా జీవనవిధానాన్ని మలచుకుంటున్నాము స్వామీ!**

3. *ఆంజనేయుని బోధల సారాంశము ఎలా గ్రహిస్తున్నారు? ఏమి గ్రహిస్తున్నారు?*

**జ: బలహీనతలను దూరం చేసుకుంటూ, విజయాన్ని అందించే వాటిని మేము స్వంతం చేసుకోవాలి. ముందుగా ఆలోచనలకు పదును పెట్టాలి. ఏ విషయాన్నైనా తార్కికంగా ఆలోచించటం అలవాటు చేసుకోవాలి. అనుభవజ్ఞులు, పెద్దల సలహాలను స్వీకరించాలి. నిత్యం ప్రేరణతో పనిచేస్తూ, ఉత్సాహంగా వుండాలి. సమస్యలు ఎదురైనప్పుడు ధైర్యంగా ఎదుర్కొనే సామర్ధ్యం కలిగి వుండాలి. వీటిని గుర్తిస్తూ పెంచుకుంటూ, నిరంతర సాధన చేయటం ద్వారా అనుకున్నది సాధించగలము అని, మీ బోధల ద్వారా గ్రహిస్తున్నాము స్వామి.**

4. *స్వామి బిడ్డలుగా స్వామి సూత్రాలను జీవితానికి ఎలా అన్వయించుకుంటున్నారు?*

**జ: స్వామి చెప్పేదాని నుండి నేర్చుకోవలసినది 1) ఆధ్యాత్మిక పరిణామము 2) సామాజిక పరిణామము 3) వ్యక్తిగత పరిణామము. ఈ మూడింటి వల్ల మార్పు తెచ్చుకోవాలి. పుట్టడం-చావటం, పుట్టడం-చావటం. దేని కోసం పుట్టాము? దేని కోసం మరణిస్తున్నాము? ఈ రెండూ అర్ధం చేసుకోవాలి. తల్లి మోసింది కనుక పుట్టాము, ఆయువు తీరింది కనుక కన్ను మూశాము. ఈ రెండింటినీ తెలుసుకుని, నా జీవితగమ్యం ఏమిటి? జీవితలక్ష్యమేమిటి? అన్న ప్రశ్నను వేసుకుంటూ, ఉన్నదాన్ని త్యాగము చేస్తూ, ఆ త్యాగము ద్వారా అమృతత్వాన్ని పొందాలి. "త్యాగమే యోగము, భోగమే రోగము" అని స్వామి ఆచరించి చూపిన జీవితసత్యాన్ని తెలుసుకుని, స్వామి బాటలో పయనించాలనుకుంటున్నాము స్వామి.**

5. *మీరు ఇచటికి వచ్చి ఏమి నేర్చుకోవాలనుకున్నారు? ఏమి పొందాలనుకున్నారు?*

**జ: నిజంగా, మేమీనాడు చేస్తున్న పొరపాటు, దైవాన్ని వెదికే బుద్ధితో ధనాన్ని వెదుకుతున్నాము. ఆత్మను వెదుకవలసిన బుద్ధితో అన్నాన్ని వెదుకుతున్నాము. ఆత్మ వుంటే సర్వమూ వుంటుంది. ఆత్మాన్వేషణ చేయకుండా అన్నాన్వేషణ చేస్తున్నాము. మా తప్పులను మేము తెలుసుకుంటూ, పరుల యందు మంచిని చూడటం నేర్చుకోవాలని తెలుసుకున్నాము స్వామి.**

6. *సమయాన్ని దైవస్వరూపముగా భావిస్తున్నారా? దానిని ఎలా ఉపయోగించుకున్నారు?*

**జ: కాలమును వ్యర్థం చేయరాదు. కాలము ఎవ్వరి కోసమూ ఆగదు. మేమే కాలాన్ని అనుసరించాలి. కాలానికి అతీతమైనవాడు దైవం.**

7. *దివ్యత్వాన్ని పొందటానికి ఎటువంటి ప్రయత్నం చేయాలి?*

**జ: జీవితనౌక మునగక ముందే, ఈ పడవ చిల్లులుపడి శిథిలం కాకముందే, దివ్యత్వం కోసం ప్రయత్నం చేయాలి. మీరు చెప్పినవి అన్నీ పాటించి, దివ్యత్వాన్ని పొందాలి స్వామి.**

8. *బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులను ఏ విధంగా గ్రహిస్తారు?*

**జ: బ్రహ్మ సృష్టికర్త, విష్ణువు పాలకుడు, ఈశ్వరుడు లయకర్త. భగవంతుడు సృష్టిలోని ఆలోచనాతరంగాలను మంచి-చెడు విచక్షణలను అందించే స్థానాన్ని బ్రహ్మస్థానంగాను, జీవించే జీవుడి**

పోషణాభారాన్ని విష్ణువుగాను, తనకు పనికిరాని దానిని విసర్జించుటను లయస్థానముగా ఈశ్వరస్థానముగానూ అందించాడు. ఇంకొక రకంగా తీసుకుంటే, లయస్థానమే జన్మస్థానము. హృదయస్థానమే పోషణస్థానము. ఆలోచనలను అరికట్టి, సదాలోచనలను అందించే సహస్రారమే లయస్థానము. అంటే, భగవంతునితో కలపగల స్థానం బ్రహ్మస్థానం. **Thank you Swamy!**

*9. మనసు పవిత్రమైనదా? అపవిత్రమైనదా?*

జ: మనసు పవిత్రమైనది స్వామి. మోక్షానికి కూడా అర్హతగలది. దానిని ఆవరించిన మాలిన్యాన్ని కప్పిపెట్టడం చేత, అది పెడమార్గం పడుతుంది. మనసును పరిశుద్ధం చేసుకుంటే, అంతకంటే పవిత్రసాధన మరొకటి లేదనే అనుకుంటాను. తన దోషం పెద్దదైనా కప్పిపెట్టి, పరుల దోషం చిన్నదైనా పెద్దదిగా భావిస్తూ వుంటాము. ఇటువంటి దుర్గుణాలతో మనసు మలినమై కప్పబడి వుంటుంది. సాధనలన్నీ మనస్సును పరిశుద్ధం చేసుకునే ప్రయత్నాలే. మనసును పరిశుద్ధం చేసుకున్నప్పుడు, మాకు మేమే దైవాన్ని అనుభవించగలుగుతాము. దైవం మాకంటే వేరుగా లేదని, ఆ దైవం లోపలా బయటా అంతా వున్నాడన్న నిజాన్ని తెలుసుకోగలుగుతాము. **Thank you Swamy!**

*10. హృదయమంటే ఏమిటి?*

జ: హృదయము ఈశ్వరతత్త్వము. హృదయమే ఆత్మతత్త్వము. హృదయమే దివ్యత్వము. హృదయమే ప్రేమతత్త్వం. హృదయము అంటే భౌతిక హృదయము కాదు, ఆధ్యాత్మిక హృదయము. ఈ ఆధ్యాత్మిక హృదయము అపరిమితమైనది. దాని ప్రేమకు హద్దులు లేవు స్వామి. **Thank you Swamy!**

*11. సేవ అంటే ఏమిటి? దానిని ఏ విధంగా చేయాలి?*

జ: కర్మలకు మారు పేరే సేవ అని మీరు చెప్పారు. సేవ అనగా పని. సేవ చేయని జీవితం చీకటి మందిరం లాంటిది. కేవలం స్వార్థపూరితమైన మా పనులే కాకుండా, ఇతరులకు వారికి కావలసినది ఏదో ఒక సహాయాన్ని అందించడమే సేవ అంటారు. సేవ దివ్యమైన భావాలను అందిస్తుంది. మానవత్వాన్ని దివ్యత్వంగా మారుస్తుంది. అందుకే భగవాన్ సత్కర్మలను చేయమంటారు. దీనితో మొట్టమొదట, అహంకారం సమసిపోతుంది. **Thank you Swamy!**

*12. సంస్కృతి అంటే అర్థమేమిటి? వివరించండి.*

జ: సంస్కృతి అంటే, సంస్కరించబడటం. అంటే చెడ్డను దూరం చేసి, మంచిని పోషించటమే సంస్కారము. బంగారాన్ని అగ్నిలో వేసి కాల్చినప్పుడే అది సంస్కరించబడుతుంది. అలాగే, ప్రత్తిని దారముగా చేసి నూలు చేసి, దానిని వస్త్రముగా చేసినప్పుడే సంస్కరించబడుతుంది. అలాగే, మానవుడి అరిషడ్వర్గములను బయటకు తీసి, వాటిని సుత్తితో కొట్టినప్పుడే, అనగా సాధనతో సంస్కరించబడినప్పుడే, వాడు సంస్కారి అవుతాడు. **Thank you Swamy!**

*13. మానవసృష్టిని దైవాశ్రితార్థం నిర్మించబడిన దేవళంగా ఎలా భావించవచ్చు?*

జ: భగవంతుని అద్వితీయమైన, అనిర్వచనీయమైన కళాత్మక సృష్టికి మానవదేహం ఒక మహోన్నతమైన

ఉదాహరణగా చెప్పవచ్చు. ఎందుకంటే, తానుండే ఈ దేహాన్ని అత్యద్భుతంగా సృష్టించాలనుకోవడం సహజమే కదా! మొట్టమొదట, అన్నమయకోశంగా భావించే ఈ దేహాన్ని తుదకు ఆనందమయకోశంగా తీర్చిదిద్దటానికి అవసరమైన అన్ని ఏర్పాట్లూ చేశాడు. ఆధ్యాత్మిక లక్ష్యాన్ని తదేక దృష్టితో వీక్షించటానికి కన్నులను, నామాన్ని పలుకుటకు నాలుకను, శ్రవణం చేయుటకు చెవులను, సేవ చేయుటకు చేతులు ఇలా సర్వఇంద్రియాలను అమర్చాడు. ఇటువంటి సృష్టిని దైవాశ్రితంగా నిర్మించబడిన దేవాలయంగా అర్థము చేసుకున్నాము స్వామి. **Thank you Swamy!**

*14. ఆధ్యాత్మిక విజ్ఞానమంటే ఏమిటి?*

**జ: ఆత్మకు ఏ గుణములూ లేవు, రూపమూ లేదు, ఆలోచనలూ లేవు. అట్టి ఆత్మ సర్వుల యందు ఒక్కటే. దానిని తెలుసుకోవటమే విజ్ఞానము. దానినే ఆధ్యాత్మిక విజ్ఞానము అంటారు స్వామి. Thank you Swamy!**

*15. విద్యలు ఎన్ని రకములు? అవి ఏవి?*

**జ: విద్యలు 2 రకములు. పర, అపర. అపరవిద్య అనగా భౌతికావసరముల కొరకు నేర్చెడిది. పర, పరమాత్మ కొరకు చదువు విద్య, పరావిద్య. కృతజ్ఞతలు స్వామీ!**

*16. ఆత్మదర్శనం ఎప్పుడు అవుతుంది?*

**జ: డంబాలకు, ఆడంబరాలకు, అహంకారాలకు భగవంతుడు చిక్కడు. అహంకారమున్నంత వరకు, ఆత్మతత్త్వాన్ని అర్థం చేసుకోలేము. ఆత్మానందాన్ని అనుభవించాలంటే, మనిషి మేథస్సుపై దట్టంగా వున్న అహంకారాన్ని తొలగించుకున్నప్పుడే, దివ్యత్వం అనుభవంలోకి వస్తుంది. అప్పుడే ఆత్మానందాన్ని అనుభవిస్తూ, ఆత్మతత్త్వాన్ని అర్థం చేసుకోగలము. Thank you Swamy!**

# ఆంజనేయుని ప్రశ్నోత్తరములు

*1. మీరు భోగాల్ని అనుభవించటానికి ఎటువంటి అర్హత కలిగి వుండాలి?*

**జ: త్యాగము ఈనాడు చేస్తే, రేపు భోగము అనుభవించటానికి అర్హులవుతారు. పరిపూర్ణమైన హృదయముతో త్యాగము చేసినప్పుడే, పరిపూర్ణమైన భోగము యోగముగా లభ్యమవుతుంది.**

*2. మీరు మనస్సును కలిగి వున్నారా? లేక మనస్సే మిమ్మల్ని కలిగి వుందా?*

**జ: మీరే మనసును కలిగివున్నారన్న విషయం అవాస్తవం. ఎందుకంటే మనసు కోతివంటిది. దానిని నీకు అప్పగిస్తున్నాను. క్రమశిక్షణ అనే త్రాడు కట్టి, దానిని ఆడించమని భగవంతుడ్ని వేడుకున్నారు కదా! మీరే మనసును కలిగివుంటే, మీట నొక్కి, యంత్రాన్ని పనిచేయించినట్లు, అవసరం లేనప్పుడు దాన్ని ఆపివేసినట్లు, మీరు మనసును పని చేయించడం అంటే ఆధ్యాత్మిక సాధనల్లో నిమగ్నం చేయడం సత్కర్మలను ఆచరించడం, అవసరం లేనప్పుడు స్తంభింపచేయడం కలిగి వుండాలి. అలా జరగటం**

లేదే? ఏ ఆలోచనలు రాకూడదని భావిస్తారో, పదేపదే అవే ఆలోచనలు తిరుగాడుతూ మీకు శాంతి లేకుండా చేస్తాయి. అలాంటప్పుడు మనసు వికటాట్టహాసం చేస్తూ, తానే మనసై, అజమాయిషీ చేస్తున్నానని నిరూపిస్తుంది. అలాంటప్పుడు శరీరమే నేను అనే భావం కలగకుండా ఎలా వుంటుంది?

3. *ఎటువంటి గుణాలు కల్గినవారు సర్వజీవులకు ప్రీతిపాత్రులవుతారు?*

జ: **దానం చేసే గుణము కలవారు, అందరికీ పంచి ఇచ్చేవారు, అందరికీ పూజ్యులైనవారు, శాస్త్రజ్ఞానమే ధనంగా గలవారు, తపస్వులు, సమస్త ప్రాణులపై దయగలవారు, ఉత్తములు, సర్వులకూ ప్రీతిపాత్రులవుతారు.**

4. *ఆశ్రమజీవనం అంటే ఏమిటి? దానిని ఎలా అనుభవించాలి?*

జ: **ఇలా వుండాలి. ఇదే సమాధానము. (అంటే ఖాళీగా వుండాలి – అందరికీ ఉపయోగపడాలి)**

5. *ఆశ్రమ ఆహార నియమములేమిటి?*

జ: **పదార్థము రుచిగా చేసుకొని, దానిని అతి తక్కువగా తీసుకుంటూ, తామసిక–రాజసిక గుణాలను అరికట్టే ప్రయత్నంలో పులుపు, కారం, ఉప్పు తగ్గించుకుని, వున్నదానిని సంతృప్తిగా భుజిస్తూ, సమయానికి వచ్చిన వారికి దానినే అందించి, ఆకలి తీర్చటమే ఆశ్రమ ఆహారనియమం.**

6. *శరీరమే నేను అనే భావం కలగకుండా ఏ విధంగా జాగ్రత్త తీసుకోవాలి?*

జ: **అహర్నిశలు దేహమును గూర్చి ఆలోచించక, పరమార్థమును పొందుటకు త్రికరణశుద్ధిగా సర్వజీవుల కొరకు పాటుపడుటకు ఈ కాయమును కాపాడుకొనవలెనే గాని, నీవు ఈ దేహము కావు, ఆత్మవు అన్నది సదా గుర్తించాలి.**

7. *అసలు ఆత్మతత్త్వము అంటే ఏమిటి?*

జ: **ఆత్మ అంటే ఏమిటి? విశాలతత్త్వమే ఆత్మతత్త్వము. అందరూ నావారే. అందరూ దైవం బిడ్డలే. అందరినీ కాపాడే ప్రభువు ఒక్కడే. దీనిని గుర్తించాలంటే, ప్రేమయే సరియైన మార్గం. ఆనందం ఆత్మరూపం.**

ॐ

**24-10-2019** 08:45 AM

**219) సంస్కారాల మోతాదును ఏ విధంగా తగ్గించుకొనవచ్చును స్వామీ?**

*జ్ఞానసాధకుల హృదయాలలో వెలువడే పలు ఆధ్యాత్మిక సందేహాలకు సశాస్త్రీయంగా సమాధానాలు విలువగల వాటిని అందిస్తున్న ఈ ఆంజనేయుని విన్నపాలను శ్రద్ధగా ఆలోచించి, అవలోకించి, విన్నపాలుగా గుర్తించండి. మిమ్మల్ని బాధపెట్టుట నా ఉద్దేశ్యం కాదు. పునరపి జననం పునరపి మరణం అనే గుంటలో పడిపోకుండా రెండు చేతులను అడ్డుపెట్టి, ఆదుకోవాలనుకున్నాను. మాకు కష్టంగా వుంది,*

మీరు సలహాలను ఇవ్వవద్దు, సందేశాలను ఇవ్వవద్దు అంటే ఇవ్వను. మీ ఇష్టప్రకారమే జీవితాన్ని గడపండి. నాకు స్వామి అప్పగించిన పనిని నేను చేయటమే నా పని. నా పనిని నేను మానను. మానవదేహంలో, జీవనవిధానంలో కీలకపాత్ర పోషించేవి దశేంద్రియాలే. వీనిలో కళ్ళు, చెవులు, ముక్కు, చర్మం, నాలుక అనేవి పంచజ్ఞానేంద్రియాలు. రెండు కాళ్ళు, రెండు చేతులు, నోరు, మలనాంగం, జననాంగం వంటివి పంచ కర్మేంద్రియాలు. జ్ఞానేంద్రియాలు సమాచార సేకరణలో, కర్మేంద్రియాలు శారీరక విధులను నిర్వహించటంలో ప్రముఖపాత్ర పోషిస్తాయి. అయితే, జ్ఞానేంద్రియాలు ప్రాపంచిక సమాచారాన్ని సేకరించడమనేది అంతకు ముందు గడచిన జీవితం మీద ఆధారపడి వుంటుంది. అంతరంగంలోని సంస్కారాల స్వభావాన్ని బట్టే, జ్ఞానేంద్రియాలకు ప్రేరణ కల్గుతుంది. ఏ ఇద్దరి సంస్కారాలు ఒకే రకంగా వుండవు. అందువలన, వారి వారి సంస్కారాల స్వభావాన్ని బట్టి పరిసరాలలోని సమాచార సేకరణ జరుగుతుంది. మానవులంతా ప్రకృతి ప్రపంచాల మీద నిరంతరం ప్రయోగాలు చేస్తూ, సమాచార సేకరణలో నిమగ్నమవుతున్నారు. కాబట్టి, పుట్టినప్పటి నుండి, మరణించే వరకూ సంస్కారాల మోతాదు పెరుగుతూనే వున్నది. పాత సంస్కారాలు కరిగిపోకుండా, నూతన సంస్కారాలు అదనంగా చేరుతున్నట్లయితే, మనిషి కర్మబంధంలో చిక్కుకుంటాడు. మానసిక ఒత్తిడి పెరుగుతుంది. జీవితం సమస్యాత్మకమవుతుంది. అందువలన, పాత సంస్కారాలు కరిగిపోతూ, నూతన సంస్కారాలు ఏర్పడకుండా వుండాలంటే, బాహ్యా ప్రపంచానికి బహిర్మార్గాలైన పంచ జ్ఞానేంద్రియాలను సమూలంగా ఉపసంహరించుకోవాలి. దానినే వేదాంతపరంగా ప్రత్యాహారమంటారు. ఆ తదుపరి ధారణ, ధ్యాన, సమాధి వంటి సూక్ష్మమైన ప్రక్రియలను సాధన చేయవలసి వుంటుంది. అందువలన, ఈ అంశాలు లెఖ్ఖలోకి తీసుకుని, అనేక ప్రశ్నలను మీముందుంచటం జరిగింది. ఈ విషయాన్ని ఇంత విపులంగా బోధించాల్సివస్తుంది.

**220) ఆనందకరమైన జీవితం ఎలా అనుభవించవచ్చు స్వామీ?**

మానవులు ఎన్నో జన్మల కర్మఫలాలను వెంట తెచ్చుకుని, దైవకృపతో అవి తొలగిపోతున్నా, ఇంకా నిరాశా నిస్పృహలతో కృంగిపోవటం మానవుని బలహీనత. గత జీవితపు కర్మఫలాలను ఎరుగక, ప్రస్తుతం నిలకడలేని ఆశాసౌధాలు నిర్మిస్తూ, అసంతృప్తితో కుమిలిపోతున్నారు. సంతోషానికి తాళంచెవి తృప్తి మాత్రమే. ధనధాన్యాలు, ఆస్తిపాస్తులు కావు. పట్టినదంతా బంగారం కావాలని వరమివ్వబడిన మైదాస్‌కు తినే తిండి కూడా బంగారంగా మారడంతో తన చిన్నారి కూతురిని అక్కున చేర్చుకుంటే, ఉలుకూ పలుకూ లేని బంగారుముద్ద అయిపోయి, చలనరహితంగా మారటంతో ఆ వరం వద్దని భగవంతుని వద్ద విలపించవలసి వచ్చింది. కార్యాచరణ మంచిదే గాని, దానికి మూలం ఆలోచన కాబట్టి, బుద్ధిని ఉన్నత విషయాలతో, అద్వితీయమైన ఆదర్శాలతో నింపుకోండి. రేయింబవళ్ళు వాటినే స్మరించండి. అప్పుడే అద్భుతమైన జీవితాన్ని సాధించగలరు. బాహ్యప్రపంచాన్ని జయించడం ఘనకార్యమే. కానీ, అంతః ప్రపంచాన్ని వశం చేసుకోవడం వీరోచితమైన పని. మీరు పొందే ఆనందం ఎంత ఎక్కువగా మీలో నుండి కలిగితే, అంత ఎక్కువ ఆధ్యాత్మికతను మీరు కలిగినట్లు. కాబట్టి, సుఖాల కోసం ఈ ప్రపంచం మీద ఆధారపడకుండా వుండాలి. అఖండమైన ఉత్సాహం, అపరిమితమైన ధైర్యం, అప్రతిహతమైన శక్తి అన్నింటినీ మించి పరిపూర్ణ విధేయత – ఈ లక్షణాలే ఒక వ్యక్తిని గానీ, దేశాన్ని గానీ పునరుజ్జీవింప

చేయగలవు.

***కనులు చమర్చాయి ఎందుకని?***
***కదిలాయి కళ్ళల్లో బిందువులు ఎందుకని?***
***ఏమిటనీ? ఎలాగని? ఎందుకని? ఎవరి కోసమని?***
***అగోచర సమాధానాల వలలో చిక్కిన హృదయాన్ని చూచి తల్లడిల్లలేక,***
***అణువణువూ అసంతృప్తి అలుముకుంది***
***బాధ చెందే హృదయంలో భగ్గుమన్న అగోచరమంతా లోపల భస్మమయ్యేను***
***ఆక్రందన కంఠాన్ని కదిలించివేసె, కుదిపెను నీ అసంతృప్తిని***
***కన్నీరులా కారిందా? భీతి చెందకండి***
***నీళ్ళు నిండిన కళ్ళను నీళ్ళు తోడనివ్వండి.***
***కారే ప్రతి కన్నీటిబొట్టులో బాధను పోనివ్వండి***
***సమస్యను ఛేదించనివ్వండి***
***సవాళ్ళను ఎదిరించనివ్వండి***
***హృదయంలో శాంతిని నింపనివ్వండి***
***వికసింపనివ్వు, నవ్వు నవ్వు నవ్వు***
***దీని కోసమే ఈ ఆంజనేయుడు***
***మిమ్ములను బాధపెట్టుటకై కాదు***
***భాగ్యాలనందించుటకు, భాగ్యదేవతగా మీ ముందుకు వచ్చాడు***
***అర్థం చేసుకోండి, నా చిన్నారి ముద్దుబిడ్డలారా!***

ఓం

**26-10-2019** 08:45 AM

**221) మా లోపాలను మేము ఏ విధముగా తెలుసుకొనవచ్చును స్వామీ? వాటిని ఎలా అధిగమించాలి స్వామీ?**

మానవ సంబంధాలలో అతి ముఖ్యమైనది, మీతో మీకు వున్న సంబంధం. ఈ విషయాన్ని చాలామంది నిర్లక్ష్యం చేస్తారు. పైపెచ్చు మాతో మాకు సంబంధం ఏమిటీ? అని ఎదురు ప్రశ్న వేస్తారు. అట్టి వారికి ప్రతివ్యక్తిలో మరో మనిషి వుంటాడని, ఏకాంతంలో అతనితో సంభాషిస్తే, మీ మంచిచెడ్డలు మీకే తెలుస్తాయని తెలియదు. కొందరికి తెలిసినా పెద్దగా పట్టించుకోరు. మార్పు కోరుకునేవారు, అభివృద్ధిని కాంక్షించే కొందరు మాత్రమే ఆ విషయాన్ని గుర్తిస్తారు. రోజు మొత్తం మీద ఒకసారైనా తమని తాము పరిశీలించి చూసుకుంటారు. తప్పులను సరిదిద్దుకుంటారు, పరివర్తన చెందుతారు. మీ ఆలోచనా విధానం ఎప్పుడూ మీకు గొప్పగానే తోస్తుంది. దాన్ని సమర్థించుకోవడానికి మీ చుట్టూ

బలమైన గోడను కూడా నిర్మించుకుంటారు. పటిష్టమైన వాదనని కూడా సిద్ధం చేసుకుంటారు. మీ నుంచి మీరు విడిపోయి, సమీక్షించుకుంటే, మీ తప్పులు మీకు తెలుస్తాయి. మీయొక్క బలాలు, బలహీనతలపై ఓ అవగాహనకు రాగలుగుతారు. సంతృప్తి అనే మాయ నుండి బయటపడి, బలాన్ని పెంచుకోవటానికి ప్రయత్నించగలుగుతారు. అభివృద్ధిపథం వైపు అడుగులు వేయగలుగుతారు. అవతలివారిని సర్దిచెప్పటానికి, మీ గొప్పదనాన్ని ప్రదర్శించటానికి అప్పుడప్పుడు రకరకాల భేషజాలు ప్రదర్శిస్తూ వుంటారు. నలుగురిలో గుర్తింపు పొందాలని, ఇతరుల దృష్టిని ఆకర్షించటానికి ప్రయత్నం చేస్తూ వుంటారు. ఆ ప్రయత్నంలో కొన్ని ఆత్మవంచనలు, మరికొన్ని అబద్ధాలు చోటుచేసుకుంటాయి. మీరు చెప్పిందే రైటు అంటూ, తల ఊపుతూ నమ్మిన సత్యాలను కూడా ప్రక్కనపెడుతూ వుంటారు. ఎదుటివారి ఆలోచనలతో, అభిప్రాయాలతో ఏకీభవిస్తున్నట్లు నటిస్తారు. పాత్రలు, సన్నివేశాలు మారగానే, మీ ఆలోచనలు మళ్ళీ మొదటికే! ఈ విధానం తప్పు అని చెప్పే ఏకైక వ్యక్తి మీ లోపలి వ్యక్తి. లక్ష్యాన్ని సాధించాలని తపన పడేవారు ఈ పద్ధతిని విడనాడాలి. నమ్మినదాన్ని విడువకూడదు. వివిధరకాల ఆలోచనలు, భయాలు మీ ఆనందాన్ని హరిస్తాయి. తప్పటడుగులు వేసేలా చేసి, మీ గమ్యాన్ని మార్చుతాయి. కాబట్టి, హాని చేయనంతవరకూ ఆలోచనలు భిన్నంగా వుండటం తప్పుకాదు. మారుతున్న కాలంతోపాటు, ఆలోచనా విధానంలో పెనుమార్పులు చోటు చేసుకుంటున్నాయి. క్రొత్తక్రొత్త ఆలోచనలతో ఎందరో విజయసాధకులుగా మారుతున్నారు, మరెందరికో మార్గదర్శకులు అవుతున్నారు. మిమ్మల్ని మీరే పరిశీలించుకుంటూ, మిమ్మల్ని మీరు ఇంప్రెస్ చేసుకోవాలి. అప్పుడు ఏ బాధలు, భయాలు వుండవు. ఏ కాంప్లెక్సులూ మిమ్మల్ని దరిచేరవు. నేను తప్పు చేశాను అని పదేపదే అనుకుంటే కలిగేది ఆత్మన్యూనత. జరిగిన తప్పును గుర్తించి సరిదిద్దుకునే మార్గాల కోసం అన్వేషించడం ఆత్మవిమర్శ. ఆత్మన్యూనతకు, ఆత్మవిమర్శకు గల తేడా ఒక వెంట్రుక వాసియే. దూరం కూడా అంతే. ఆత్మవిమర్శ ద్వారా జరిగినదాన్ని, జరగబోయేదాన్ని, ప్రస్తుత పరిస్థితిని సమీక్షించవచ్చు. సరియైన నిర్ణయాలు తీసుకోవచ్చు. మంచి ప్రయోజనాన్ని పొందవచ్చు. చేయవలసింది ఒక్కటే. అహంకారాన్ని, సమర్థింపు ధోరణిని ప్రక్కన పెట్టాలి. విజయం సాధిస్తే ఆనందించటానికి, అనుసరించటానికి ఎందరో ఎప్పుడూ సిద్ధంగా వుంటారు. ఇతరుల కోసం మీరు మీ ధోరణిని మార్చుకోవలసిన పని లేదు. మీరు ఎలా ఉండాలనుకుంటున్నారో అలాగే వుండవచ్చు. అయితే మీ ప్రవర్తన గురించి అవతలి వారికి అర్ధమయ్యేలాగా చెప్పగలిగే కమ్యూనికేషన్ పద్ధతి కలిగి వుండాలి. లేకపోతే, అహంకారిగా ఎదుటివారు గుర్తిస్తారు. జాగ్రత్త! దేనికైనా ఆత్మవిమర్శ ముఖ్యం!

**విద్యకు ప్రతిరూపం గురువు**

***తమస్సును తొలగించి జీవితాన ఉషఃకాంతులను వెలిగించి,***

**తేజస్సును అందించేది విద్య**

***మనిషినావరించిన అజ్ఞాన, అవిద్యలను తన జ్ఞానకాంతులతో పారద్రోలే***

**చైతన్యస్ఫూర్తి గురువు**

***అజ్ఞాన అంధకారాలు తొలగించి, శిష్యుల అంతఃకరణాన్ని శుద్ధి చేసే***

**ఆధ్యాత్మిక శక్తి, మహితాత్మ స్వరూపము**

***జ్ఞానశక్తితో, ఉదాత్తమైన యుక్తితో, శిష్యుల అభ్యున్నతిని ఆకాంక్షించే***
***త్రిమూర్తుల ఆకృతి గురువు***
***అటువంటి గురుస్థానాన్ని అధిష్టించి, జ్ఞానదానం చేస్తూ***
***మీ జీవితాలను ఆదర్శంగా దిద్దుతున్న ఈ ఆంజనేయుని పలుకులు విని,***
***పరంధామమైన పరమాత్ముని చేరండి***
***నా చిన్నారి ముద్దుబిడ్డలారా!***

ॐ

**27-10-2019** 08:45 AM

**222) మానసిక ఆందోళనను ఏ విధంగా అధిగమించవచ్చు స్వామీ?**

*గెలుపుగుర్రంపై స్వారీ చేయాలని తపనపడే ప్రతి ఒక్కరూ, నిరంతరం కృషి చేస్తూ వుండాలి. లక్ష్యసాధనలో ఎదురయ్యే సమస్యలను అధిగమించాలి. బలాన్ని పెంచుకోవాలి. బలహీనతలను దూరం చేసుకుంటూ, భవిష్యత్తువైపు అడుగులు వెయ్యాలి. మనుష్యులందరిలో సహజమే అని భావించే బలహీనత, ఆందోళన. ఇది విజయానికి ప్రతిబంధకం. సాధ్యమైనంత త్వరగా విజయసాధకులు, ఈ ఆందోళనను వదిలించుకోవాలి. సమస్య ఎదురైనప్పుడు, ధైర్యంగా ఎదుర్కోవాలి, పరిష్కరించుకోవాలి. కొన్ని సందర్భాలలో పరిష్కారం ఏమిటో తెలియదు. ఒకవేళ తెలిసినా, విజయం సాధించగలమా లేదా అన్న సందేహం మనస్సును తొలచివేస్తూ వుంటే, మనస్సులో వున్న ఆందోళన రెట్టింపవుతుంది. ఒత్తిడిని పెంచుతూ, ఏకాగ్రతను దూరం చేస్తుంది. ప్రశాంతతకు భంగం కల్గిస్తూ, ఆత్మవిశ్వాసాన్ని సన్నగిల్లేలా చేస్తుంది. సమస్య పరిష్కరించబడగానే, ఇంత చిన్న విషయానికా, అంతగా ఆందోళన చెందినది అని అన్పిస్తుంది. ఒత్తిడి, టెన్షన్ వల్ల పుట్టే పరిణామం ఆందోళన. కొన్నిసార్లు ఆందోళనకు కారణమే వుండదు. అటువంటప్పుడు "ఏదో జరగబోతున్నది, నా సిక్స్త్ సెన్స్ చెబుతున్నది" అంటూ కవర్ చేస్తూ వుంటారు. పైపెచ్చు, పాత విషయాలు తలచుకుని, మరింత ఆందోళన చెందుతారు. ఒకవేళ ఏ చిన్న సంఘటన జరిగినా, మీ ఆలోచనలకు ఆ సంఘటనను ముడిపెట్టి, "నేను అప్పుడే అనుకున్నా, అప్పుడే చెప్పా" అంటూ కాలజ్ఞానం తెలిసినవారిలా కలరింగ్ ఇస్తారు. వాస్తవానికి ఏ రకమైన ఆందోళన అయినా, శరీరానికి, మనస్సుకు మంచిది కాదు. ఆందోళనకు గురియైన వ్యక్తులు, తమ చర్యల ద్వారా ఇతరులకు చెప్పకనే చెబుతారు. అట్టివారు అరచేతులు నులుముకుంటూ, చేతివ్రేళ్ళను విరుస్తూ వుంటారు. కాలి బొటనవ్రేలు నేలకు రాస్తూ, అవసరం లేకపోయినా నుదురు, మొహం కర్చీఫ్‌తో తుడుచుకుంటూ వుంటారు. కోపాన్ని ప్రదర్శిస్తూ, ఒకచోట కుదురుగా కూర్చోరు, నిల్చోరు. కొందరైతే, క్రొత్తక్రొత్త అలవాట్లకు స్వాగతం పలుకుతారు. వాటివల్ల తాత్కాలిక ఉపశమనం కలిగినా, ఆరోగ్యంపై దుష్ప్రభావాన్ని చూపుతాయి. ఆందోళన కారణంగా నిద్రలేమి, రక్తపోటు వంటి సమస్యలు ఉత్పన్నమవుతాయి. వ్యక్తుల ఆందోళన వెనుక నక్కి వుండేది అభద్రతాభావం, ఆత్మవిశ్వాసం లోపించటం, ఏమైపోతానన్న భయం, వానికి తోడు వ్యక్తిగత నియంత్రణ లోపించడం. వీటన్నింటినీ అధిగమిస్తే, ఆందోళన దూరమవుతుంది. ఒకటి పోతే,*

అంతకంటే మంచిది మరొకటి మీ కోసం ఎదురుచూస్తూ వుంటుంది అనే భావన మీలో వుంటే, ఆందోళన తగ్గుతుంది. ఏ సమస్యనైనా, సంఘటననైనా అనుకూల దృక్పథంతో చూడటం అలవాటు చేసుకోవాలి. అంతర్ముఖ ఆలోచన ద్వారా సమస్యలను పరిశీలించి చూస్తే, ఏ సమస్యా పెద్దదిగా కన్పించదు. తప్పులను ఒప్పుకోవటానికి, నేర్చుకోవటానికి సిద్ధంగా వుంటే, పరిష్కారం వెంటనే దొరుకుతుంది. అవసరమైన, అనవసరమైన ఆందోళన ఓ నిరర్థకమైన చర్య. ఈ మానసికస్థితి నుంచి ఎంత త్వరగా బయటపడితే అంత మంచిది. వ్యక్తులపై వుండే ప్రేమ, వారితో వుండే అనుబంధాల వల్ల సమస్యలు ఎదురైనప్పుడు ఉండవలసింది దిగులు, బాధ, ఆందోళన కాదు. మీరు చూస్తున్న కోణం నుంచి కాక, వేరొక కోణం నుంచి చూస్తే, దిగులు వుండదు, ఆందోళన వుండదు. మీ నుంచి మీరు విడిపోయి, మిమ్మల్ని మీరు పరిశీలించుకుంటే ఏ సమస్య కనబడదు, ఏ రకమైన ఆందోళన వుండదు.

సమస్య వెనుక సమాధానం, దుఃఖం వెనుక సుఖం
కష్టం వెనుక ఒక అవకాశం ఎప్పుడూ వుంటుంది

***ధర్మం ఒక విశిష్ట ప్రకృతి లక్షణం***
***అది సర్వత్రా అన్నిటా వుండే విశేషణం***
***ఉప్పునకు ఉప్పదనం, దాని లక్షణం***
***పంచదారకు తియ్యదనం దాని లక్షణం***
***మనిషికి వుండవలసిన లక్షణం మానవత్వం***
***అది లేని మానవుడు కలిగి వున్నది పశుత్వం***
***మానవత్వంగల వ్యక్తికి తోటివారిపై వుండేది***
***ప్రేమ, ఆదరణ, అనురాగం, దయ మొదలైనవి***
***ఇవన్నీ తోటివానిలో లేకుంటే, నీ మానవత్వం వానిని మేల్కొల్పుతుంది***
***ఆ వ్యక్తిలో మానవత్వాన్ని సంపూర్ణంగా ప్రసాదిస్తుంది***
***ఆంజనేయుని ఆదర్శాలను అనుభవిస్తూ***
***అధర్మాన్ని విడిచిపెట్టి, ధర్మబుద్ధితో జీవనాన్ని సాగిస్తూ జీవితధ్యేయాన్ని గుర్తించి,***
***ధర్మవర్తనులై దారిని సుగమం చేసుకుంటూ గమ్యం చేరండి***
***నా చిన్నారి ముద్దుబిడ్డలారా!***

ఓం

**28-10-2019** 08:45 AM

**223) లక్ష్యం ఎటువంటిదై ఉండాలి స్వామీ? దాన్ని ఏ విధంగా సాధించాలి స్వామీ?**

విజయం కోరుకునే ప్రతి వ్యక్తి చేరుకోవాలని తపనపడే ఉన్నత శిఖరం ఒకటి వుంటుంది. అదే లక్ష్యం. వ్యక్తుల యొక్క దశను, దిశను నిర్దేశిస్తూ, ప్రగతివైపు పయనించేలా చేసేది లక్ష్యం. వ్యక్తుల

యొక్క మేధస్సును విజయాన్ని బహిర్గతం చేస్తూ, వ్యక్తిత్వవికాసంకు ఎంతగానో సహకరించేదే లక్ష్యం. అందుకనే ప్రతివ్యక్తి ఒక లక్ష్యం కలిగివుండాలి. లక్ష్యాలను నిర్ధారించుకునేటప్పుడు అవగాహన, అంచనాలు సరిగా లేకపోవటం ఒక కారణమైతే, కృషిలోపం రెండవది. ఎందుకంటే, మీరు నిర్ణయించుకున్న లక్ష్యం ఎప్పుడూ స్పష్టంగా వుండాలి. నిర్దిష్టమైన పనితీరు కలిగి వుండాలి. కాలపరిమితి కలిగి వుండి, ప్రగతిని కొలవదగినదై వుండాలి. అటువంటి లక్ష్యాన్ని ఎంపిక చేసుకోవాలి. అదే సమయంలో మీ అర్హతలను లెఖ్ఖలోకి తీసుకోవాలి. కొన్ని లక్ష్యాలను చేరుకోవాలంటే, విజ్ఞానం ఒక్కటే సరిపోదు. దేహదారుఢ్యం, వారసత్వం కూడా అర్హతలుగా వుంటాయి. సమయం వృధా చేసుకోకూడదు. ఒత్తిడిలేని ఉద్యోగం, నష్టం లేని వ్యాపారం, కష్టం లేని పని, పాటించని ఆధ్యాత్మికత ఎప్పుడూ వుండవు. లక్ష్యసాధనలో అడ్డంకులను, అవరోధాలను ఎదుర్కోవడం కూడా సహజమే. సమస్య ఎదురైనప్పుడు నిరాశ నిస్పృహలకు గురి కాకూడదు. ధైర్యంగా ఎదుర్కోవాలి. తెలివిగా సమస్యను పరిష్కరించుకుని, అడుగు ముందుకు వేయాలి. అపుడే, మీ తెలివితేటలు బహిర్గతం అవుతాయి. పరిపూర్ణజ్ఞానంతో నిర్ణయించుకున్న లక్ష్యాన్ని చేరుకోవటానికి అవకాశాలు ఎప్పుడూ వుంటాయి. వాటిని అందిపుచ్చుకుని, సమయస్ఫూర్తితో సద్వినియోగం చేసుకోవటంలోనే మీ ప్రతిభ వుంటుంది. పెద్దల సూచనలను, అనుభవజ్ఞుల సలహాలను స్వీకరించాలి, ఆచరణలో పెట్టాలి. లక్ష్యం – సాధనకు మధ్యమధ్య గమ్యస్థానాలను ఏర్పాటు చేసుకొని, వాటిని చేరుకుంటున్నారో లేదో వ్యక్తిగత సమీక్ష చేసుకోవాలి. అనుకున్నది సాధించాలంటే, ఎటువంటి ప్రతిబంధకాలు, అడ్డుగోడలు, అసమానతలు లేవు. ఎటువంటి వివక్షతలూ లేవు. అందరికీ సమానమైన అవకాశం, అర్హత వుంది. దీనిని సద్వినియోగం చేసుకోవటంలోనే మీ యొక్క సమయస్ఫూర్తి, సృజనాత్మకత వుంటుంది. అంతేగానీ, లక్ష్యాలను చేరుకోలేనప్పుడు చెప్పే కారణాలను ఎవ్వరూ అంగీకరించరు. పరిస్థితులపై నేరాన్ని నెట్టడానికి ఎంతమాత్రం అవకాశం వుండదు. ఎందుకంటే, ప్రతికూల పరిస్థితులలో సైతం ఎందరో ఉన్నత లక్ష్యాలను సాధించి, మరెందరికో స్ఫూర్తిని, ఉత్సాహాన్ని అందించిన విజేతలు మీ చుట్టూ వున్నారు. అట్టివారి నుంచి ప్రేరణ పొందాలి. మీ లక్ష్యాన్ని మీరు సాధించాలి. ఏమంటారు? ప్రతి ఒక్కరూ మీ లక్ష్యం ఏమిటని ఆలోచించాలి, సాధన కోసం కృషి చేయాలి.

ఉన్నత లక్ష్యాలను సాధించే క్రమంలో,
తాత్కాలిక ఆనందాలను త్యాగం చేయాల్సిందే.
సరైన లక్ష్యం దిశగా ధైర్యంతో దూసుకుపోవాలే గాని,
మీ కలలు విజయాలుగా మారడానికి ఎంతో సమయం పట్టదు.

**కాలం మీ కోసం ఆగదు - మీరు కాలం కోసం ఆగలేరు**
**ఏ నిముషానికి ఏమి జరుగుతుందో ఎవరూహిస్తారు?**
**పుట్టినవారు గిట్టక మానరు - గిట్టిన పిమ్మట పుట్టకపోరు**
**పుట్టుట, గిట్టుట మధ్య కాలంలో భగవన్నామ స్మరణ ఒక్కటే నీకు ఎరుకలో వుండాలి**
**బ్రతికినంత కాలం మనిషిగా బ్రతుకు**
**మరణించిన పిదప సమాజం మిమ్మల్ని స్మరించేలా.**

***బ్రతికినంత కాలం తోటి వారికి సేవలందించండి***
***ఈశ్వరుని సేవలో పరమపదించండి***
***ఇదే లక్ష్యం, ఇదే మోక్షం, ఇదే గమ్యం, ఇదే తీరం***
***ఇదే హనుమద్ వాక్యం!***
***భాషకందని భావమై, మీ మదిలో నిలచి***
***అక్షరాన్ని లయబద్ధం చేసేది ఆర్ద్రతే***
***ఏ బంధానికైనా ఆర్ద్రతే మూలం***
***ఆర్ద్రతే అన్నింటికీ జీవం***
***ఆంజనేయుని మాటలే వేదం***
***అటువంటి ఆర్ద్రతే ఉప్పొంగితే, మీ మనసులు లక్ష్యం వైపు పరుగులెత్తుతూ***
***పసిడి కాంతులు చిందుతూ చిరంజీవిని చేరి సుఖించండి***
***నా చిన్నారి ముద్దుబిడ్డలారా!***

ఓం

**30-10-2019** 08:45 AM

**224)** దేహం ఎట్టిది స్వామీ?

*నేను చెప్పబోయే జ్ఞానాన్ని బాగా అర్థం చేసుకోగలిగి వుండాలి. సూక్ష్మమైన బుద్ధితో శ్రద్ధగా ఆలకించాలి. తన్మయత్వంతో సూక్ష్మమైన బుద్ధితో శ్రద్ధగా విషయాన్ని విని ఆకళింపు చేసుకోవాలి. ఈ శరీరం క్షేత్రం అని చెప్పటం జరిగింది. కానీ, దీనికి అనేక పేర్లు వున్నాయి. శరీరం, దేహం, దేవాలయం, గృహం, బండి, రథం, క్షేత్రం... ఇన్ని పేర్లతో దీనిని పిలుస్తుంటారు. వీటికి అర్థం తెలుపుతాను.*

*శరీరం: శరీరం అని ఎందుకంటున్నారు? శీర్యతే ఇతి శరీరః. అంటే, శీర్యమైపోయేది అనగా జీర్ణమైపోయేది, శిథిలమైపోయేది అని అర్థం. జీర్ణించిపోవటం, శిథిలమైపోవటం దీని లక్షణం. ముసలితనం కావాలని మీరు మందులు, మాకులు మింగనక్కరలేదు. అమృతభాండంలో పెట్టినా సరే, ఈ శరీరం శిథిలమైపోయేదే, నశించిపోయేదే. అందుకే శరీరం అన్నారు. దేహం: దేహమని ఎందుకన్నారు? దహ్యతే ఇతి దేహ అంటే, దహించబడేది గనుక దీనిని దేహం అన్నారు. చచ్చిన తర్వాత కట్టెలతో కాలుస్తారు గనుక దహింపబడేది అన్నారు. మరి, కొందరి దేహాలను కట్టెలతో కాల్చరు గదా? అవి దహింపబడవు గదా? మరి వాటిని దేహాలు అని అనరా? చనిపోయిన తర్వాత దహించబడటం కాదు, జీవించి వున్నప్పుడే తాపత్రయాలనే అగ్ని చేత నిరంతరం దహించబడుతూ ఉండేదే ఈ దేహం. ఆదిదైవిక, ఆదిభౌతిక, ఆధ్యాత్మిక తాపాలే తాపత్రయం. దేవాలయం: దేహాన్ని దేవాలయం అంటారు గదా. ఈ దేహం ఎలాంటి దేవాలయం? ఇది ఒకచోట స్థిరంగా వుండే దేవాలయం కాదు. ఇది చరదేవాలయం. కదులుతూ వుండేది. బయటకు కన్పించే దేవాలయాన్ని మానవులే కట్టిస్తారు. అందులో దేవుడ్ని కూడా*

*మానవులే ప్రతిష్ఠిస్తారు. కానీ, ఈ శరీరమనే దేవాలయాన్ని భగవంతుడే నిర్మించి హృదయమనే గర్భగుడిలో తనకు తానే ప్రతిష్ఠితుడై కూర్చున్నాడు. బయట గుడికి – ఈ గుడికి అదే తేడా. ఇక్కడ భగవంతుడు స్వయంభూః అన్నమాట. మరి ఏ దేవాలయం ముఖ్యమైనది? ఏ దేవుని పూజ గొప్పది? ఆలోచించుకోవాలి! గృహం: ఈ దేహాన్ని గృహం అంటారు గదా. అంటే ఇల్లు అని గదా అర్థం. ఈ ఇల్లు జీవుడు నివసించే ఇల్లు. అయితే, ఇది జీవుడికి స్వంత ఇల్లు కాదు, అద్దె ఇల్లు. ఈ రోజు (ఈ జన్మలో) ఈ ఇంటిలో వుంటారు, రేపటి రోజు (మరు జన్మలో) మరొక ఇంటిలో వుంటారు. ఈ ఇంటి స్వంతదారుడెవ్వరు? ఇంకెవరూ, భగవంతుడే! ఆయనకు అద్దె చెల్లించి ఈ ఇంట్లో వుండాలి జీవుడు. మామూలుగా ఇక్కడి ఇళ్ళకు నెలకొకసారి అద్దె చెల్లించాలి. కానీ, ఈ ఇంటికి మాత్రం అలా కుదరదు. ప్రతి రోజూ, ప్రతి పూటా చెల్లించాలి. రోజుకు 3 సార్లు, 4 సార్లు, 5 సార్లు కూడా చెల్లించాలి. మనుష్యుల మీద ఆయనకు నమ్మకం లేదు. అందుకే ఇలాంటి నియమం పెట్టాడు. అంతేకాదు, ఈ ఇంటిని ఖాళీ చేయించడంలో కూడా నిక్కచ్చిగా ఒక్క నిముషం అటూ ఇటూ కాకుండా ఖాళీ చేయిస్తాడు. అయితే, ముందు జాగ్రత్తగా మూడు నోటీసులు ఇస్తాడు. ముందుగా జుట్టు తెల్లబడుతుంది. ఇది ఫస్ట్ నోటీసు. అయితే, మీరు జుట్టుకు రంగు వేసుకుని ఆ నోటీసును ఖాతరు చెయ్యరు. సరేలే అని రెండవ నోటీసు పంపడం జరుగుతుంది. అంటే పళ్ళూడిపోతాయి. మీరు డెంటిస్ట్ దగ్గరకు వెళ్ళి పళ్ళు కట్టించుకుంటారు. ఈ నోటీసును కూడా ఖాతరు చెయ్యరు. ఇక మూడవ నోటీసు చూపు కన్పించక, శరీరం పటుత్వం తగ్గి, చేతికి కర్ర వస్తుంది. అయినా, దానినీ గుర్తించరు. అంతే, ఆయనకు కోపం వస్తుంది. దానితో ఆయన ఈ ఇల్లు ఖాళీ చేయించటానికి పోలీసులను పంపిస్తాడు. ఈ పోలీసులు ఎవరి మాట వినరు. దున్నపోతునెక్కి పాశం చేతబట్టి, భయంకర రూపంతో వుండే ఆ యమ ఇన్‌స్పెక్టర్‌ను చూడటంతోనే అన్ని సామానులు, సంపదలు, ఆత్మీయులు అందరినీ వదిలి ఒకటే పరుగు. అలాంటిది ఈ అద్దె ఇల్లు. ఒక్కొక్క జన్మకు ఒక్కొక్క ఇల్లు (దేహం) స్వంత ఇంటికి (పరమాత్మ స్థానానికి) వెళ్ళేదాకా ఈ అద్దెఇళ్ళ బాధ తప్పదు. బండి: బండి అని ఎవరన్నారు? ఎందుకన్నారు? అంటే, ఒక విషయం చెప్పాలనుకుంటున్నాను. రమణ మహర్షి ఆశ్రమంలో ఆయన అన్నారు. ఎందుకంటే, ఈ శరీరం అనేది జీవుడ్ని జన్మస్థానం నుండి మరణస్థానం వరకూ మోసుకుపోతుంది. కనుక, ఇది జీవుడికి బండిలాంటిదే అని. ఒకసారి ఒక శిష్యుడు రమణ మహర్షిని తన ఇంటికి రమ్మని బయట ఒక బండిని తెచ్చిపెట్టాడు. "స్వామీ! తమరు మా ఇంటికి వచ్చి మా ఇంటిని పావనం చేయండి. మీ కోసం ఒక బండిని తెచ్చాను" అన్నాడు. దానికాయన, "ఈ బండికి మరొక బండియా?" అన్నారు. అంటే, దేహమే జీవుని మోసుకునిపోయే బండి కదా, గుర్తించండి! రథం: శరీరమే రథం, జీవుడే అందులో ప్రయాణించే రథికుడు, ఇంద్రియాలే గుర్రాలు, మనసే పగ్గం, బుద్ధియే సారథి. ఈ రథం సక్రమంగా, క్షేమంగా ప్రయాణించాలంటే, పగ్గాలు సారథికి అప్పగించాలి. మనసు ఇంద్రియాల వెంట పరుగిడితే, రథం బోల్తాపడుతుంది. అలాగే మనసు బుద్ధిని అనుసరిస్తే, ఈ ప్రయాణం సాఫీగా భగవంతుని వద్దకు చేరుతుంది. ఇలా శరీరం, దేహం, దేవాలయం, గృహం, బండి, రథం, అని ఎన్నో పేర్లు ఉన్నప్పటికీ, భగవంతుడు మాత్రం ఈ శరీరాన్ని క్షేత్రం అన్నాడు.*

*అంతరాత్మ ప్రబోధం ఆచరణకు ఆమోదం*
*అంతరంగశక్తి అనుభవించేది ముక్తి*
*అంతరంగ బోధ గ్రహించాలి మేథ*
*అంతరంగ శుద్ధి ప్రకాశించు బుద్ధి*
*ఆంజనేయుడు అవతార పురుషుడు*
*అతనే అవనికి మార్గదర్శకుడు*
*వైరాగ్యం జ్ఞానంలో భాగం*
*త్యాగం యోగంలో భాగం*
*మానవత్వం లేక దైవత్వం రాదు*
*దానవత్వం వదలనిదే మానవత్వం రాదు*
*సర్వాంతర్యామి దేవుడు*
*సత్యం తెలియని నరుడు*
*దేహమనిత్యమని ఆత్మ నిత్యమని*
*దేహం జడమని ఆత్మ జీవమని*
*ధ్యానం ఆధ్యాత్మిక జగత్తని*
*ధనం అహంకారపు మత్తని*
*సర్వమూ నెరింగిన సాక్షాత్తు ఈ ఆంజనేయుడు సాకారియై*
*సాక్షాత్తు మీ ముంగిట నిలచి,*
*మానవత్వాన్ని బోధించి, అమృతమయమైన జీవనాన్ని సాగించి*
*జీవనరథాన్ని గమ్యం వైపు పరుగులెట్టించి*
*లక్ష్యాన్ని చేరువకమ్మని ప్రేమతో*
*చుబుకాన్ని పట్టి చెబుతున్నాడు చిరంజీవి*
*నా ఈ చిన్నారి బిడ్డలకు!*

ॐ

**31-10-2019** 08:45 AM

**225)** శరీరాన్ని క్షేత్రం అనటంలో అంతరార్థం ఏమిటి స్వామీ?

*కాశీ, రామేశ్వరం, తిరుపతి, శ్రీశైలం, బదరీ... ఇవ్వన్నీ పుణ్యక్షేత్రాలు. భగవంతుని విభూతి బాగా వున్నచోట, పవిత్రమైన నదులు ప్రవహించే చోట క్షేత్రాలు వెలుస్తాయి. సాక్షాత్తు భగవంతుడే స్వయంగా హృదయస్థానంలో కూర్చున్నాడు గనుక, ఈ దేహం ఒక క్షేత్రం. పుణ్యక్షేత్రం! ఈ క్షేత్రాలలో పుణ్యం మాత్రం సంపాదించుకోవచ్చు. అదీ, సరిగా ప్రవర్తిస్తే. కానీ, ఈ శరీరమనే క్షేత్రంలో పుణ్యాన్నే కాదు, జ్ఞానాన్ని, మోక్షాన్ని కూడా సంపాదించుకోవచ్చు. క్షేత్రం అంటే అసలైన అర్థం పొలం అని.*

పొలంలాగా ఈ శరీరమనే క్షేత్రం కూడా జడమైనదే. ఆ పొలంలో పంటలు పండించుకోవచ్చు, ఈ పొలంలో సాధనను పండించుకోవచ్చు. ఆ పొలంలో ఏ విత్తనాలు వేస్తే ఆ పంట వస్తుంది, ఈ పొలంలో కూడా అంతే, ఏ కర్మలు చేస్తే ఆ ఫలితాలే వస్తాయి. పుణ్యకర్మలు అనే విత్తనాలను చల్లి సుఖాన్ని పండించుకోవచ్చు, పాపకర్మలు అనే విత్తనాలు చల్లి దుఃఖాలను పండించుకోవచ్చు, జ్ఞానమనే విత్తనాలను చల్లి మోక్షమనే పంటను పండించుకోవచ్చు. అయితే, ఆ పొలంలో ఋతువులను బట్టి, వాతావరణాన్ని బట్టి విత్తనాలు చల్లి వ్యవసాయం చెయ్యాలి. కానీ, ఈ పొలంలో ఆ కాలం, ఈ కాలం అని లేదు. ఋతువులు, వాతావరణం చూడనక్కరలేదు. రాత్రి, పగలు అనే తేడా లేదు. వారం, వర్జ్యం అనే తేడాలు లేవు. ఎప్పుడైనా సరే, జ్ఞానమనే విత్తనాలు చల్లుతూ మోక్షమనే పంటను పండించుకోవచ్చు. కనుక, ఆ పొలం కన్నా, ఈ పొలం వ్యవసాయానికి యోగ్యమైనది. ఫ్రీగా భగవంతుడు సప్లై చేశాడు. ఆ పొలంలాగా డబ్బు పెట్టి కొనుక్కునే పనిలేదు. ఎంత అదృష్టవంతులు మీరు! ఇంత సారవంతమైన పొలాన్ని ఫ్రీగా ఇచ్చి, సాగుచేసుకోమంటే, పట్టించుకోనివారు మూర్ఖులే కదా!

***నీవు ఎవరు?***

***అనుకున్నవన్నీ చేశావా?***

***నీవు ఎవరైనా చెప్పింది చేశావా? నీవు ఎవరైనా చేయించింది చేశావా?***

***నీవు ఎవరైనా అడిగింది చేశావా? నీవు ఎవరైనా చూపించింది చేశావా?***

***నీవు ఎవరైనా చేయాలనుకున్నది చేశావా? నీవు ఎవరైనా చేయకూడనిది చేశావా?***

***నీవు ఎవరైనా నేర్పినది చేశావా?***

***నీవు ఎవరైనా సహాయం కావాలంటే చేశావా? నీకోసం ఎవరైనా సహాయం కావాలంటే చేశారా?***

***నాకోసం చేశారు, చేశారు, చేశారు, చేశారు, చేశారు, చేశారు చిరంజీవి!***


***చిన్న సహాయం కాదు, చాలా పెద్ద సహాయం అన్న పదము మీ పెదవుల నుండి జాలువ్రాలి,***

***మీ జాతకాలను తిరుగవ్రాస్తున్న ఈ అంజనీసుతుని అత్యున్నత మార్గం గుర్తించి,***

***అహంకార రాహిత్యులై, మనస్ఫూర్తిగా అంజలి ఘటించి,***

***ఘనచరిత్రులై, ఘనశ్యాముని చేరి సదా సుఖించండి***

***నా చిన్నారి ముద్దుబిడ్డలారా!***



సశేషం........

